
# కథ కౌముది

## 2021 - part -1





శ్రీ కౌముది

మీ మనోగతాల్లో సాహితీ వెన్నెల

www.koumudi.net



ప్రచురణ సంఖ్య: 245

## కౌముది మాసపత్రికలో

## 2021 జనవరి నుంచి జూలై 2021 వరకూ వచ్చిన కథలు



| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | నవ్వొచ్చే కథ | మత్తిభానుమూర్తి | 4 |
| 2 | మదిలో సూరీడు | డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి | 10 |
| 3 | మావిద్విషావహై | దాసరి శివరాణి | 15 |
| 4 | ఇసుకలో పడవ | కె. విరాజ్ | 23 |
| 5 | చింతల్లికి పండగ వచ్చింది | సువర్ణ మారెళ్ళ | 30 |
| 6 | అభిషేకం | గుడిపూడి శ్రీనివాస రావు | 37 |
| 7 | రక్షాబంధనము | కుంతి | 39 |
| 8 | నాన్న నేను | సత్యప్రకాష్ మిత్తింటి | 43 |
| 9 | నా దేశం నాకేమిచ్చింది | సోమ సుధేష్ణ | 47 |
| 10 | ఇల్లు | దీప్తి వల్మీకం | 58 |
| 11 | అనురాగ్ | డా.పేరం ఇందిరా దేవి | 62 |
| 12 | కృష్ణా యమున సంగమం | మల్లవరపు సీతారాం కుమార్ | 66 |
| 13 | అద్దె ప్రేమ | శేష చంద్ర | 72 |
| 14 | కొండ మీద నక్షత్రాలు | యండమూరి వీరేంద్రనాథ్ | 81 |
| 15 | పగుళ్ళు | ఎస్.శ్రీదేవి | 91 |
| 16 | ప్రేమతో..! | రామ్ పెరుమాండ్ల | 97 |
| 17 | తారుమారు | బి.రాజ్యలక్ష్మి | 103 |
| 18 | శ్రీమతి ప్రేమలేఖ | డా.కనుపూరు శ్రీనివాసులు రెడ్డి | 109 |
| 19 | నిర్ణయం | శాంతిశ్రీ బెనర్జీ | 118 |
| 20 | ధీమా ! | వేణు నక్షత్రం | 125 |
| 21 | ఒన్స్ ఇన్ ఎ లైఫ్ టైమ్ జర్నీ | జోగేశ్వర్ చల్లపల్లి | 142 |
| 22 | సితార | సోమ సుధేష్ణ | 148 |

| | | | |
|---|---|---|---|
| 23 | వెలుగుబాట | ఓట్ర ప్రకాష్ రావు | 157 |
| 24 | సంకల్పం | అంజన కొడాలి | 162 |
| 25 | అంత్య ఘట్టం | సింగీతం శ్రీనివాసరావు | 168 |
| 26 | పూలపల్లి విత్తనాలు | వారణాసి నాగలక్ష్మి | 180 |
| 27 | రక్తపుదివిటీ | నిర్మల్ ప్రవీణ్ లింగిశెట్టి | 195 |
| 28 | విద్యాదానం | పాణిని జన్నాభట్ల | 205 |
| 29 | పుత్రోత్సాహము | జయంతి ప్రకాశశర్మ | 213 |
| 30 | వాళ్ళిద్దరికీ మధ్య | సూర్యకుమారి ఉపాధ్యాయుల | 219 |
| 31 | కిటికీ అవతల | కె.విరాజ్ | 228 |
| 32 | కర్మయోగి | శ్రీధర్ రెడ్డి బిల్లా (Cupertino, CA) | 237 |
| 33 | "మిలియన్ డాలర్ బేరం" | శర్మ దంతుర్తి (Elizabethtown, KY) | 240 |
| 34 | "శ్రీలక్ష్మి" | శ్యామలాదేవి దశిక (Monmouth Junction, New Jersey) | 246 |
| 35 | "**మరోమారు**" | రాధిక నోరి,( Tallahassee, FL) | 251 |
| 36 | "ఇంత సౌఖ్యమని నే చెప్పజాల" | రవి మంత్రిప్రగడ (Dublin, Ireland) | 261 |
| 37 | "హృదయ స్పందన" | కల్యాణి నల్లాన్ చక్రవర్తుల (Sunnyvale, CA) | 272 |
| 38 | "మత్స్య గంధి" | రామ్ నాథ్ బొద్దపాటి (Danbury CT) | 278 |
| 39 | "పరిచితులు" | శ్రీనాథ్ వాడపల్లి (New Jersey, USA) | 284 |
| 40 | గురుదేవో మహేశ్వరః....అట | కృపాకర్ పోతుల | 288 |
| 41 | నందివర్ధనాలు | జయంతి సత్య శీల యాజి | 295 |
| 42 | బిడియస్తుడు | బోడపాటి రమేష్ | 303 |
| 43 | అమ్మకి ఏమయ్యింది? | ఆర్.సి.కృష్ణ స్వామి రాజు | 306 |
| 44 | ఆరుపదుల్లో అలజడులు | గోవిందరాజు మాధురి | 311 |
| 45 | సమయం | రవి కొప్పరపు | 319 |
| 46 | నింబం | పల్లా నరేంద్ర | 330 |
| 47 | నీలికళ్ళు | సుమలత దేశ్ పాండే | 339 |
| 48 | నాకు నువ్వూ – నీకు నేనూ | లక్ష్మీ గాయత్రి బొంతా | 351 |
| 49 | యాత్ర | జి.వి.రమణ | 357 |

# నవ్వొచ్చే కథ మత్తి భానుమూర్తి

మనకు నవ్వొస్తుంటుంది.. ఎప్పుడు?? .. ఏడవలేనప్పుడు.

అలాగే ఏడుపొచ్చే సన్నివేశాలూ ఒస్తుంటయ్. కొన్ని సన్నివేశాలు మనల్ని చుట్టేస్తయ్. కొన్ని కట్టేస్తయ్. కొన్ని నిలువున ముంచేస్తయ్. తెలిసికూడా తప్పించుకోలేని సన్నివేశాలు కూడా ఉంటయ్. ఆలాంటి సన్నివేశం ఆ మధ్య ఒకటి జరిగింది. జరిగి చాలా రోజులయ్యింది.

ఆ రోజు బ్యాంక్ కౌంటర్ డ్యూటిలో ఉన్నాను. తల ఎత్తిచూస్తే .. కృష్ణారావు.

ముఖమంతా అదోలా ముసురులో కీకారణ్యంలా.. నీళ్ళు, బురద, పేడ, పక్షుల పెంట, కుళ్ళిన ఎండుటాకుల వాసన, గట్టుతెగినకాలవ గుళగుళ, దూరంగా జలపాతంహోరు అన్ని కలగలిసి ఆ ముఖంలో ప్రవహిస్తున్నాయి. బ్యాంకులో కౌంటర్ ఇవతల నేను, అవతల పదిమంది కష్టమర్ల మీదుగా కీకారణ్యం.

మళ్ళీ చూశాను కాస్త పరిశీలనగా. అబ్బో.. ఏదో స్పెషల్ ఎపిసోడే.

చెయ్యి ఊపాను. అంటే వెళ్లి కాంటీన్ లో కూర్చోమని. గురుడుకి తెలుసు. నేను పని తెమిలాక వెళతాను. వెళుతున్నాడు. వెళ్ళడంలో కూడా ఎక్ష్ ప్రెషన్.. భారంగా.. ట్రాజెడి కొంచం ఎక్కువుందే..

ఆయన అలా ట్రాజెడిగా ఉంటె మీకు నవ్వొస్తుందా అనొచ్చు. అదికూడా ఈయన వల్లే. మంచి జర్నలిస్ట్. అక్షరం అక్షరం సెంటిమెంటులో ముంచి పాఠకుడి కళ్ళలోంచి మనసుకు గుచ్చగలడు. చదివిన వాడు కదలిపోతాడు. మామూలు మనిషి కావడానికి చాలా టైం తీసుకుంటాడు. కానీ రాసిన ఈయన మాత్రం ఎప్పుడూ మామూలు మనిషే. అన్ని దుర్గుణాలు ఉన్నాయి. తాగుడు, పేకాట, వాచాలత్వం, ఆడవాళ్ళతో వెకిలి ప్రవర్తన, జీతం డబ్బులు విచ్చలవిడిగా ఖర్చుపెట్టడం, భార్యపిల్లలను హీనంగా చూడటం గురువుగారికున్న ఆభరణాలు. అయన రాసేది, చెప్పేది వేరు. ఆయన జీవనదైనందినం వేరు. మిష్టర్ హైడ్ అండ్ జేకేల్. ఇది నేను ఆయనతొ శిష్యరికం మొదలైన కొద్దిరోజులకే తేలింది. తన ప్రొఫెషన్ లో మాత్రం చాలా గట్టివాడు. మంచిమంచి రచయితల బుక్స్ ఇచ్చి చదవమంటాడు. అవి వెంటాడతాయి. వేటాడతాయి.

ఆ మధ్య ఓ బుక్ ఇచ్చాడు. "మంచి రైటరు. భలే రాస్తాడు. ముగింపు సూపరు. చదువు." చదివాను. లోలోపల ఏదో మంత్రకవాటం తెరుచుకుంది. అసలు లోపల కవాటాలుంటాయని తెలీదు. ఇందులోని కథలే చెప్పాయి. మచ్చుకి ఓ కథ.

అనగనగా ఇద్దరు ఫ్రెండ్స్ అన్నమాట. కలిసి గోలీలాడతారు. కలిసి గోడుంబిళ్ళ ఆడతారు. స్కూలు ఎగ్గొట్టి గేట్లు దూకి మాట్నీలకెళతారు. పెద్దయ్యాక వొకడు బాగా చదూకుని స్కూలుమాష్టరయితే మరొకడు చదువు ఆపేసి స్కూళ్ళుపెట్టి విద్యాదాత అయ్యి, ఆనక పొలిటీషియన్ అయ్యి, రావిశాస్త్రి గారు చెప్పినట్లు "డాబు, డబ్బు, దబాయింపు సెక్షన్స్" బాగా వంటబట్టించుకుని ఇప్పుడు నిత్యం టి.వి.ల్లో వార్తల్లో చర్చల్లో వ్యక్తి అయిపోయాడు. అట్లాంటి ఫ్రెండ్స్ అనుకోకుండా ఎదురవుతారు.(ఇదిమరీ సినిమా సీను.. వీళ్ళిద్దరూ ఎలా

ఎదురవుతారండి..) సరే సరే. కథప్రకారం ఎదురయ్యారు. మాష్టారు అప్పటిలా నవ్వాడు. విద్యాదాత ఇప్పటిలా నవ్వాడు. మాటలు అంతే. కబుర్లు అనబడేవి అంతే. ఫినిషింగ్ లో "ఓసారి ఇంటికి రారా.." అన్నాడు విద్యాదాత హీరో కృష్ణంరాజులా. మాష్టారు కంగారై పోయాడు. హెడ్ మాష్టారు పిలిస్తేనే గ్రేట్. ఇక బడి వోనరుగారు ఆహ్వానిస్తే??

పెళ్ళాంతొ పూసలన్నిగుచ్చి కన్నీళోత్తుకున్నాడు. "ఆయన కృష్ణుడు.. నేను కుచేలుడ్ని" అన్నాడు ముక్తాయింపుగా. ఏకీభవించింది సహధర్మచారిణి. ఏవైనా సహాయంచెయ్యగల సమర్థుడు. ఇద్దరూ చాలా డ్రీమ్స్ కన్నారు.. విడివిడిగా జమిలిగా. కాష్ గా ఇస్తే ఉన్నఅప్పులు తీర్చుకుని ఓ ఇల్లో స్థలమో కొనుక్కుంటే? పాపం పసుపుతాడు కట్టుకు తిరుగుతున్న ఈ వెర్రిదానికి కనీసం మంగళసూత్రాలన్నా బంగారంతో చేయించాలి. అది కృష్ణుడికి చెబితే సంతోషిస్తాడు కూడా. మంచి మంచి ఐడియాలతొ మురిసిపోయారు శ్రీమతి & శ్రీ కుచేల.

ఓరోజు తయారై శ్రీకృష్ణుడు ఇంటికి కుచేలుడు బయల్దేరాడు. ఎదురొచ్చి హెచ్చరించింది శ్రీమతి కుచేల. "ఆయన్ను నోరుతెరిచి అడక్కండి..నొచ్చుకుంటారు..ఇచ్చినదానికి థాంక్స్ చెప్పడం మర్చేపోకండి. వర్షం వచ్చేలా ఉంది.. వారి ఇంట్లో తడిసినచొక్కా విప్పకండి. తడిస్తే తడిసింది వెధవచొక్కా. లోపలబన్నీను చిరుగులన్నీ కనిపిస్తయ్. వారు బాధపడగలరు." అన్నట్లుగానే వర్షంవచ్చింది. చొక్కా తడవనే తడిసింది. అది ఇల్లు కాదు. బోల్డు అంతస్తులున్న తాజ్ మహల్. (పాలరాతితో కట్టారని కవిహృదయం) వాచ్ మాన్ మాష్టార్నిచూసి రోతగా ముఖంపెట్టాడు. "అయ్యగారు లోపల మీటింగులో ఉన్నారు. ఇక్కడకూర్చో." కూర్చున్నాడు తడిసినచొక్కా విప్పకుండానే. అయ్యగారు రాలేదు వాచమేన్ పైకెళ్ళి చెప్పివస్తూనేఉన్నాడు. చెప్పిచెప్పి తిని నిద్రపోయాడు వాడు. మాష్టారు అలా కూర్చునే ఉన్నాడు, తడిచొక్కాతో వణుకుతూ. తెల్లారింది. మధ్యాహ్నమైంది. అప్పుడే ఆవులిస్తూ ఉదయించాడు అయ్యగారు అనబడే విద్యాదాత.

"ఏంటి కబుర్లు..?" అన్నాడు ఎటో చూస్తూ. ఏదో చెప్పాననుకున్నాడు మాష్టారు. ఇద్దరికి లంకె ఎలా కుదురుతుంది. ఏవొ మాటల్లాంటివి. కబుర్లాంటివి..కూసిని.. కాసేపు. లేచి "సరే.. అప్పుడప్పుడూ కనిపిస్తూఉండు."

నిష్క్రమించారు. ఇచ్చిందేవీ లేకపోవడంతో థాంక్స్ చెప్పేఅవకాశం మాష్టారుకు రాలేదు. ఇంటికిచేరిన మాష్టారు చలిజ్వరం నిమోనియాతో హాస్పటల్ బిల్లు లక్ష రూపాయలు అయ్యాక చనిపోయాడు. జబ్బువలనే కాదు హాస్పటల్ బిల్లులు చూసినా చనిపోవుదురు.

విద్యాదాత ఎలెక్ట్రానిక్ మీడియాలో సంతాప సందేశం ఇచ్చాడు..

ఇది కథ. చదివాక అల్లకల్లోలం అయిపోయాను. ఆ మాష్టారు, ఆ విద్యాదాత, ఆ పెళ్ళాం, అ వాచ్ మాన్.. వొకరే మిటి.. క్రిష్ణారావుతో సహా అందరూ నన్ను చితక్కొట్టేశారు. అప్పట్నుంచే ఏవేవో సన్నివేశాలు. ఏడుస్తుంటే నవ్వురావడం నవ్వుతుంటే ఏడుపురావడం. విషాదాలేవో జీర్ణంకావడం కావచ్చు బహుశా. లోకం తెల్సిపోయినట్లు భావన. విద్యాదాత అలాకాక మరోలా ఉంటె నేనే ఆత్మహత్య చేసుకునేవాడినేమో.. బంగోరె లా.

రష్ తగ్గాక ప్రక్కకౌంటర్ లో ఉన్న ఉషకు చెప్పి కౌంటర్ కు తాళంవేసి వెళ్లాను. ఓమూలగా దీనంగా.. నన్ను చూడగానే ఉరికె వాంతిని ఆపినట్లు పెద్ద గుటకవేశాడు. రెండు టీలు తీసుకుని ఒకటి ఆయన ముందుకు తోసి "ఊ" అన్నాను చెప్పమన్నట్లు. "పందుగాడు..," ఎక్కెక్కి **"నన్ను..,"** బెక్కి **"లంజాకొడకా..,"** టేబుల్ మీద తల పెట్టి నీళ్ళు, ముఖం కనిపించకుండా వొళ్ళంతా కుదిపి కదిపి ఏడుస్తున్నాడు. అబ్బో.. ఎప్పుడో నాగయ్యగారి చిత్రాల్లో సీను. **"అని.. తిట్టాడు ప్రకాష్!!"** పూర్తి చేశాడు.

"ఆపండి సార్.." తలెత్తి కళ్ళు తుడుచుకున్నాడు ముక్కు వదిలేశాడు. అటుచూడలేక ఎటోచూస్తూ "ఎందుకు?" అన్నాను. ముక్కు, నోరుఎగబీల్చి "నీకు తెలీదాప్రకాష్ ?!" అన్నాడు. తెలుసుకాని ఆ సందర్భంలో అదే డైలాగ్. వర్ధమాన సినిరచయిత ఆయన, ప్రవర్ధమాన మినికథల రచయిత నేను. ఇదే సూటబుల్ డైలాగ్. "వాడి కోసం.. వొక్కగానొక్క కొడుకని.. వాడి కోసం.. ఎంత

కష్టపడ్డానో..ప్చ్..ఎంతకష్టపడ్డానో..వాడికోసం" దాసరి నారాయణరావు మార్క్ డైలాగ్. చెప్పిందే మళ్ళీమళ్ళీ తిరగేసి మరగేసి.. ఏడుపు ఆపమన్నట్లుగా ముఖం పెట్టి "ఏంటి??" అన్నాను. మళ్ళీ చెప్పు అన్నది నా కవిహృదయం. కనిపెట్టి "వాడికోసం ఎంత.." ఆపమన్నట్లు చిరాగ్గా ముఖంపెట్టాను. చెబుతోంది తప్పు. "వాడు పాపం ట్యూషన్లుచెప్పుకుని చదువుకుంటున్నాడు" అని నాడబ్బులతో మూడో పెగ్గు తాగాక ముప్పైసార్లు చెప్పిన కఠినవాస్తవం. గుర్తుంది ఇంకా.

అసలు వాళ్ళఇంట్లో మండుతున్న రావణకాష్టం తెలుసు. గురువుగారు మరోచురుకైన యువరచయిత్రిని వొళ్ళో కూర్చోబెట్టుకుని రచనలో అ ఆ లు దిద్దిస్తున్న కోరోన లాంటివార్త ఇంట్లో వ్యాపించింది. ఆయన్ను హోం క్వారైంటైన్ లో ఉంచారు. ఈయనకున్న ఉన్నతస్థానం ఇంట్లో ఓ గదికే పరిమితంఅయ్యింది. పండుగాడు అని ముద్దుగాపిలుచుకునే కొడుకు.. ఎక్ నిరంజన్.. ఒక్కడే నలుసు. గురువుగారు జర్నలిస్టు. జీతంగా వచ్చింది కేవలం నాలుగు బార్లవాళ్ళకు ౩౦ సాయంత్రాళ్ళ చొప్పున సమానంగా సమర్పిస్తుంటాడు. దాంతో తల్లి కొడుకు ఒక గ్రూపు అయ్యారు. వాట్సఅప్ కూడా ఓపెన్ చేసుకున్నారు. దాంతో గురువుగారు సింగిలైపోయాడు. అప్పుడే సినిమాలకు రైటర్ గా అవకాశాలొస్తున్నాయి. దాంతో జీతం బార్లవాళ్లకు సర్దలేక నాబోటి శిష్యులను రిక్రూట్ చేసుకోవడం మొదలెట్టాడు. జంట్స్ వరకూ ఇంట్లో సరిపుచ్చుకున్నారుగాని లేడీస్ ను రిక్రూట్ చేసుకునే సరికి పిండం పిల్లెత్తుకెళ్ళింది. ఈ సమస్యకు వాక్సిన్ కోసం ట్రై చేస్తున్నాడు. ఇప్పుడే పండుగాడు అనే శ్రీనివాస్ కు అమెరిక యూనివర్సిటీలో సీటొచ్చింది. అక్కడ ఫీజులు, హాస్టల్ ఖర్చులకోసం బాంక్ లోను కావాలి. విమానం ఎక్కేవరకూ అయ్యేఖర్చులకోసం దాదాపు రెండు లక్షలు కాష్ కావాలి. కొడుకు వాతావరణ హెచ్చరిక చేశాడు. "జీవితంలో నిన్నేమీ అడగలేదు హైస్కూల్ నుంచి నా ఫీజులు నేనే కట్టుకుంటున్నాను. నా బట్టలు నేనే కొను క్కుంటున్నాను. నీ ప్రవర్తన నాకు నచ్చదు కాని నన్ను కన్నతండ్రివి. పెంచి పెద్దచేశావ్. ఇది మనకొక గొప్ప అవకాశం. నేను అమెరిక వెళ్ళడానికి నీ మీద ఆధార పడకతప్పదు నాన్నా. తర్వాత నిన్ను,అమ్మను చూడాల్సిన బాధ్యత నాదే అని నాకు తెలుసు. ఇది నాకూ నీకూ డు ఆర్ డై సందర్భం.. "

కృష్ణారావు కదిలిపోయాడు. కొడుకును అమెరిక పంపకపోతే నా బ్రతుకు కరోనశవం కంటే హీనం. ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. ఎప్పుడు ఎంత అవసరమో అంత.. ఎలాగోలా ఏర్పాటు చేస్తూనే ఉన్నాడు. నావంతుగా నా గ్యారెంటితో ఎడ్యుకేషన్ లోను ఇప్పించాను. తెలిసినవాళ్ళ దగ్గరల్లా చేయిచాపాడు. ఏడ్చాడు. కాళ్ళా వేళ్ళా పడ్డాడు. ఎలాగోలా కొడుక్కి మూటాముల్లే సర్దిపెట్టాడు. రేపోమాపో విమానం ఎక్కడమే మిగిలింది.

ఈ టైం లో ఈ దిక్కుమాలి సీన్ ఏవిటి? బండబూతులు కొడుకు ఎందుకు తిట్టాడు? ఈయన గారు ఎందుకు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు?

"అరె..ఎందుకు అంతమాట అన్నాడు..ప్చ్..చెప్పండి సర్..ఏంటి ప్రాబ్లెం..అవతల నేను కౌంటర్ లో ఉన్నాను.."

ఎప్పుడూ చూడనంతగా జారిపోయాడు. దీనంగా మనసుతో అన్నాడు "ప్రకాష్.. తండ్రిగా నా బాధ్యతగా నానా గడ్డికరిచాను. నీకు తెలుసు. దేవుడిలా నువ్వు ఆదుకున్నావ్. నా ప్రయత్నాలన్నీ అయిపోయాయి. ముష్టెత్తడం దొంగతనంతొ సహా. అన్ని ఏర్పాటైనయ్. చివరగా వొక్కటి మిగిలిపోయింది. వాడి ఫ్లైట్ టికెట్. అదొక్కటే మిగిలి పోయింది. రెండురోజులుగా అడగనివాడు లేడు, ఎక్కని గుమ్మం లేదు. ఎక్కడా పుట్టలేదు. టెన్షన్ తొ ఇవ్వాళ వాడు బరష్ట్ అయిపోయాడు. నన్ను బండబూతులు తిట్టాడు. ఎందుకు కన్నావ్. నీ బ్రతుకు వేష్ట్ ఎక్కడైనా పడి చావు.." అన్నాడు నాకొడుకు. నేనుకన్న నా కొడుకు. నామనస్సు ఏవిటో నీకే తెలుసు నువ్వే ఈ చిట్టచివరి కష్టాన్ని ఆదుకోవాలి. ఏదో చెయ్యి ప్రకాష్. ప్లీజ్ ప్రకాష్.." కాళ్ళపై పడిపోయాడు. పెద్దగా బిగ్గరగా గుండెలు పగిలేలా ఏడ్చాడు.

నా మైండ్ బ్లాంక్ అయిపోయింది. ఎంతసేపు క్రమశిక్షణ లేని ప్రతిభావంతుడైన వ్యక్తిగా చూస్తోన్న కృష్ణారావ్ నిజమైన తండ్రిలా.. తన బాధ్యత నిర్వహించలేక జాలిజాలిగా జారిపోయి ఏడుస్తోన్న తండ్రిలా..

ఏమిచెయ్యాలో తోచలేదు. ఏదో చెయ్యాలి. సన్నివేశం డిమాండ్ చేస్తోంది. తప్పదు. “ఎంత కావాలి..?”

“లక్ష.. ఒక్క లక్ష కావాలి. అంతే. అక్కడ యూనివర్సిటీకి చేరిపోతాడు..”

“సరే.. మీరు వెళ్ళండి సర్. ఒకగంట టైం ఇవ్వండి. మీరు ఇంటికి వెళ్ళండి. ప్లీజ్” కౌంటర్ వైపు పరుగు. చేతులు పనిచేస్తున్నా బుర్రతీవ్రంగా గిరుగిర్రున తిరుగుతోంది పోలీస్ వ్యాన్ పై లైట్ లా. రెండు మూడుగంటలకో ఐడియా. ఇప్పుడు మనకు కావాల్సింది ముళ్ళపూడివారు చెప్పిన పాతపేపర్లులాంటి బంగారునగలు. మన ఏడుపుకు కరిగిపోయి తన బంగారునగలు ఇవ్వగలది ఆడది మాత్రమే. కావేరి ఉంటె పుస్తెలతాడు ఇవ్వమంటే హేపీగా ఇస్తుంది. ఊళ్ళోలేదు. పాపపుట్టి రెండునెలలయ్యింది. ఇక అడగగలిగే ఆడది ఇక్కడ ఒక్కటే ఉంది.

నిద్రముఖంతో తలుపుతీసింది సుమతి అక్క. పెదనాన్న కూతురు. ముఖం రోతగా పెట్టింది. నవ్వు లాంటిది వదిలాను. లెట్రిన్ తలుపుతీసినట్లు ముక్కు మూడువంకరలుతిప్పింది.

అక్క కోపతాపాలకు కారణం ఉంది. ఎన్నిసార్లు పిలిచినా, “బిజీగా ఉన్నానే.. తర్వాతొస్తాలేవే..” స్టాండర్డ్ ఆన్సర్. పిలిచి పిలిచి విసుగెత్తిపోయింది.

“వొచ్చావా.. ఏదో పనిఉండి వొచ్చి ఉంటావ్. మంచినిద్ర చెడగొట్టావ్ రా ప్రకాశి.. ఎంటాపని? త్వరగాచెప్పు” అంది.

ఒపెనింగే చండాలంగా మొదలెట్టింది. ఎలా డీల్ చెయ్యడం. “సుమక్కా.. కాస్త టీ ఇస్తావని వచ్చానే. ప్చ్.. పడుకో వెళతాలే ” ఎలాఅడగాలి.. అందునా బంగారునగలు. “సరే ఉండు. నేనూ తాగుతా..” లోనకెళుతూ టీ కాస్తూ, “కావేరి ఓకేనా?.. పాపాయ్ ఎలా ఉంది? ఫోటోలో జుత్తుబావుందిరా. బాబాయ్ పిన్ని చూశారా? మా ఆయన ఒకటే ఇదై పోతున్నాడు. వెళ్లి పాపాయ్ ను చూద్దామంటే ఈ కరోనావొకటి అంటున్నాడు.” టీకప్పు చేతిలో పెట్టబోయింది.

పట్టుకోకుండా బావురుమని చేతులట్టుకున్నాను. కంగారైపోయింది. కృష్ణారావులా జారి కాళ్ళమీద పడ్డాను. “అక్కా నువ్వే కాపాడాలే..” అక్క చాలా మూవ్ అయిపోయింది. పెద్దగా ఏడ్చాను. గజగజ వణికి పోయింది.

“బ్యాంకులో కాష్ తక్కువొచ్చింది. ఎవడికో చూసుకోకుండా లక్ష ఎక్కువిచ్చాను. ఇప్పుడు వెంటనే కట్టకపోతే నేను జైల్లో కూర్చోవాలి. ఉద్యోగం సస్పెండ్ చేస్తారు.”

“అయ్యో అయ్యో.. అట్లా ఎలా ఇచ్చావ్ రా వెధవా..”

“చూసుకోలేదే.. కావేరి ఉన్నా దాని నగలుపెట్టి ఈ గండం దాటుదును. ఇప్పుడేం చెయ్యాలో..?” డైలాగ్ మింగి పెద్దగాఏడుపు. సక్సెస్ ఫుల్.

మరో ఐదునిముషాల్లో సీన్ ముగించి అక్క నగలతో పరుగొ పరుగు. హెడ్ కాషియర్ కు ఇచ్చి “ఎలా తూకం వేస్తావో తెలీదు. లక్ష మాత్రంకావాలి.”

మరో అరగంట తర్వాత చిక్కడపల్లిలో ఉన్న కృష్ణారావుగారి కాలింగ్ బెల్. కర్చీఫ్ లో చుట్టిఉన్న రెండు 500 కట్టలు. ముగ్గురూ ముందు వెర్రిచూపులు. ఆనక బోరుబోరు. “నీ ఋణం ఎలాతీర్చుకోవాలి ప్రకాష్..?”

ఎయిర్ పోర్టుకి వెళ్లి సెండాఫ్. విమానం కదిలేలోపు ఈ డైలాగ్ వందసార్లు అన్నాడు కృష్ణారావ్. ఈల వేసు కుంటూ ఇంటికివెళ్లాను. సన్నివేశం డిమాడ్ చెయ్యడంతో తప్పించుకోడానికి వీలులేక పోయింది. చేశాను మరి. ఇక కృష్ణారావ్ మాష్టారులానా లేక విద్యాదాతలానా ఎలా ప్రవర్తిస్తాడో.. తలుచుకుంటే నవ్వొస్తోంది.

ఆ సన్నివేశం రావాలి. చూడాలి.

ఇది జరిగి చాలాకాలం అయ్యింది. దాదాపు పదేళ్ళు పైనే.

శ్రీనివాస్ అమెరిక వెళ్ళాక క్షేమంగా చేరాడని చెప్పాడు. రోజూ కలిసి తాగి, తాగకుండానూ కృతజ్ఞత ప్రకటించే వాడు. కొద్దిరోజులకే సాయంత్రం కనపడడం లేదు. సినిమా చర్చలట. సిట్టింగులు అన్నీ అక్కడే. వాళ్ళతోనే.

మరికొద్ది రోజుల్లోనే సినిమా రచయిత ఐపోయాడు. ఆయన రాసిన సినిమా హిట్. చాలు ఒక్క సినిమా హిట్ట యినా ఈరోజుల్లో పట్టుకోలేం. కృష్ణారావు కూడా అంతే కదా. ఆ గోల్డ్ లోను రికవరీ నా జీతంలోనుంచే. పాప ఇంటికివచ్చాక జీతం అస్తుబిస్తుగా ఉండేది. ఓసారి సుమతక్క అడిగింది, అదీ కావేరిముందు. దొరికిపోయాను కావేరి కళ్ళవెంట నీళ్ళు. ఆమెనగలు పెట్టి అక్క నగలుతీసి ఇచ్చేశాను.

బ్రాంచ్ ట్రాన్స్ ఫర్. కావేరి నగలు పెట్టింది కొత్త బ్రాంచ్ లో.

ఇవన్నీ మీరు ఊహించే సీన్లే. భలే నవ్వొచ్చేవే. మరికొన్ని సీన్లు చెప్తాను. ఆఫ్ కోర్స్ అవీకూడా మీరు ఊహించేవే. బాగా నవ్వొచ్చేవే.

కృష్ణారావు తన అసిస్టెంట్ ను లోను క్లోజ్ చెయ్యడానికి డబ్బు ఇచ్చి బ్యాంకుకు పంపించాడట. అక్కడ నేను లేను కదా. నాపేరుతొ లోనుఖాతా లేదు. వాడు కట్టలేదు. అప్పుడు గుర్తొచ్చింది. ఎడ్యుకేషన్ లోను కడుతున్నాడా లేదా?? వెన్నులో వణుకు. పాతబ్రాంచికి ఫోను. హమ్మయ్య! నెలనెలా రికవరీ వస్తోంది. ఎవరో లేడి ఎక్కౌంట్ నుంచి. ఎవరైతే మనకేం.. కట్టకపోతే ఆయన్ను నేనేం పీకలేను. నా పీక తెగ్గోసుకోవడం తప్ప.

నాలుగైదుసార్లు ఫోన్ చేశాను. బిజీ. మరోసారి " స్టోరీచర్చల్లోఉన్నారు. మీపేరు చెబితే రాసుకుని సార్ కు చెబు తాను" అసిస్టెంట్. మర్నాడుఫోన్లో ఇంతెత్తుఎగిరాడు కృష్ణారావ్, " బ్రాంచిలో లోను అకౌంటులేదట. ఆ భాడకావ్ గాడు డబ్బుజేబులోవేసుకుని పారిపోయాడు." తప్పునాదే. చెప్పకుండా ఖాతా మారిస్తే అది ఆయన తప్పు ఎలా అవుతుంది.?. పైగా మొత్తం సొమ్ము అసిస్టెంట్ పట్టుకుపోయాడు. అంటే ఇక వీడు కట్టడు. నవ్వొచ్చింది.

రవీంద్రభారతిలో కనిపించాడు ఆ వర్ధమానరచయిత్రితో. "ప్రకాష్.. హౌ ఆర్యూ.. ఎలాఉన్నావ్..?" పెర్ఫ్యూమ్ లో ముంచిన ఉంగరాలచెయ్యి కలిపాడు అచ్చుమసలిరజనీకాంత్ లా. "చూస్తున్నావ్ గా. లాస్ట్ వీక్ విడుదలయి న ఫిలింకూడా సూపర్ డూపర్ హిట్. రోజూ ఐదారు స్టోరిడిస్కషన్స్. ఎప్పుడన్నా ఆఫీసుకు రావోచ్చుగా.. హహహ.."

"సంతోషం గురువుగారు. అమెరికా వెళ్ళాడే శ్రీనివాస్. మీ అబ్బాయి.."

"ఓహ్.. మావాడా.. యస్. స్టేట్స్ లో పెద్ద సాఫ్ట్ వేర్ టైకూన్ ఇప్పుడు. బిలియనీర్ల అమ్మాయిమొగుడు.."

మనస్సంతా హెపి హెపి. ఎగిరి గంతేద్దాం అనిపించింది. ఆయనలో విద్యాదాత కనిపించాడు. సన్నివేశం ఫర్ఫెక్ట్ గా కుదిరింది. చాలా ఆనందంగా ఉంది. బోల్డు నవ్వొచ్చేస్తోంది. కౌంటర్ లో కూనిరాగాలు ఎక్కువయ్యాయని లేడి కొలీగ్స్ కామెంట్లు.

ఇవ్వాళోసారి కూనిరాగం తీస్తూ కాష్ ఇస్తోంటే.. కష్టమర్ కదలకుండా కళ్ళలోకి కళ్ళు పెట్టి చూస్తుంటే.. ఓహ్.. శ్రీనివాస్ కదూ.. నవ్వేచ్చేసింది."హాయ్ సర్. ఎలాఉన్నారు. ఊ..మీ పేరు?!! ఆ..ప్రకాష్ కదూ..ఆ..అహ్హహ్హా.. మహా.. ఈయన ప్రకాష్ గారని.. దేడి ఫ్రెండ్. అదే.. స్టూడెంట్.. ప్చ్.. టెలుగు సరిగారాదు. శిష్యుడు. ఊ.. ఇంకా క్లర్కుగానే ఉన్నారా.. ఏవైనా రాస్తున్నారా.. దేడిని పట్టుకోబోయారా.. ఏవైనా ఛాన్సులు ఇప్పించేవారు.."

ముద్దొచ్చాడు. పూర్తిగా తండ్రిపోలిక. "సర్..ఇది కౌంటర్. తమరు కాస్తజరిగితే.."

"ఓహ్..సారి.." తప్పుకున్నాడు.

తలవొంచుకుని మరోకష్టమర్ తొ బిజీ. ముభావంగా ఉంటె ఏమిచేస్తాడు?! వెళ్ళిపోతాడు. వెళ్ళిపోతుంటే క్రీగంటచూడటం తప్ప ఏంచెయ్యగలం. ప్రక్కన అమ్మాయి?? పెళ్ళాంఅనుకుంటా! వెనక్కివెనక్కి చూస్తూ వెళుతోంది.

భలే నవ్వొచ్చింది. సన్నివేశం కరెక్ట్. ఎవరైనా ఇంతే. కృష్ణారావూ ఇంతే. వాడి కొడుకు శ్రీనివాసూ ఇంతే. అప్పుడు అలా ఏడుస్తూ అడగడం.. పని కానిచ్చుకోవడం. నాపని అయ్యిందా లేదా.. అయ్యింది. వాడు చేశాడు కాదు. నేను చేయించుకున్నాను. సో.. నేనే గ్రేట్! రచయితగా బిజీ అయ్యాక, పాతికో పరకో సంపాదించాక, అలా ఎలా ఉంటారమ్మా?? ఇక్కడ ప్రవేట్లు చెప్పుకుని, తండ్రి చెయ్యలేనిది సాధించినకొడుకు అమెరికా వెళ్ళాక తెలుగు ఎలా గుర్తుపెట్టుకుంటాడమ్మా.. నీవెర్రి గాని. బ్యాంక్ కొలీగ్ శంకర్ అయినా ఇంతే. రాంబాబు, రాజిరెడ్డి, కృష్ణ కుమార్, గోవర్ధన్, సుమలత, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కామేశ్వరి, పద్మావతి.. ఎవ్వరైనా ఇంతే.

అబ్బో.. బోల్డు నవ్వోచేస్తుంది. బాగానే ఆలోచిస్తున్నానన్నమాట!! నేనుచేసిన అప్పులు నేనేతీర్చుకోవాలి గాని వాళ్ళు తీర్చాలని ఆశించడం ఏవిటి.. ఎంత దుర్మార్గుడ్ని?!! వాళ్ళే తీరుస్తున్నారు పో.. వాళ్ళది ఎంత గొప్ప మనసు?! నేను దాన్ని గుర్తించి ముకుళితహస్తాలతో మోకాళ్ళపైకూర్చుని గద్గదస్వరంతో వాళ్లకు తెలుగులో "మీదెంత మంచి మనసండి!!" అని, ఇంగ్లిషులో "ఐ యాం వెరీ మచ్ గ్రేట్ ఫుల్ టు యు సర్" అని చెప్పుకోవాలి కదా.. చెప్పలేదే.. హా.. హతవిధీ .. నేనెంత దుర్మార్గుడ్ని!??

మర్నాడు దాదాపు అదే వేళ అంతే బిజీ. మరో గొంతు.. "హాయ్ అంకుల్.. నేను మహా .. మహాలక్ష్మి.."

మైగాడ్.. శ్రీనివాస్ పెళ్ళాం. నిన్న క్రీగంట కనిపించిన అమ్మాయి.

నవ్వాక అంది. "కొంచం..ప్లీజ్.. బయటకు వస్తారా?"

వోరిబాబో.. అమ్మో.. ఇదేం సన్నివేశం దేవుడో.. పదేళ్ళతర్వాత కూడా అదే సన్నివేశమా.. మళ్ళీనా..

"ఇక్కడే.. హాలులో కూర్చుంటాను.. ఫ్రీ అయ్యాక మాట్లాడదాం. ఏం.."

ఏంచెప్తుంది? వాడు రోజూ తాగి తెగకొడుతున్నాడా.. ప్చ్.. టెన్షన్.. ఏ కష్టమర్ కైనా కాష్ ఎక్కువ ఇచ్చేసే ప్రమాదం. యవ్వారం తొందరగా తేల్చేస్తే బెటరు.

వెళ్లి, "చెప్పండి.."

జరిగి, "కూర్చోండి. కౌంటర్లో ఉన్నారు. ఎక్కువ టైం తీసుకొను. నేను, శ్రీనివాస్ ఇక్కడే ముందే ఫ్రెండ్స్. అతనికి లోను మీరు ఇప్పించారని నాకుతెలుసు. నేనే ప్రతినెల లోన్ కడుతున్నాను. అలాగే ఆరోజు ఫ్లైట్ కు టిక్కెట్ కోసం మీరే మీ అక్కనగలు బాంక్ లో పెట్టి ఇచ్చారు. అదీతెలుసు. శ్రీనే చెప్పాడప్పుడు. అది సహాయం కాదు. రొమ్ముచీల్చి ప్రాణం అనేది తీసి చేతిలో పెట్టడం. ఇదిగో ఇవిచెక్కులు రెండు. ఒకటి మీరిచ్చిన లక్షకువడ్డీ లక్ష కలిపి రాశాను. మరొకటి బ్లాంక్. ప్లీజ్.. మీ అక్కకో లేక మా అక్క కావేరిగారికొ ఇవ్వండి. మహాలక్ష్మి ఇచ్చిందని చెప్పండి. మీరు అప్పులు తెచ్చి ఇచ్చారు. మేం సంపాదించి ఇస్తున్నాం. జస్ట్.. నాతృప్తికోసం.. నమస్తే."

వెళ్ళిపోయింది. నవ్వొచ్చింది. భలే.. ఇదేంసన్నివేశం. నవ్వొస్తూనేఉంది.

నవ్వుకుంటూ కౌంటర్ డోర్ తీసి కూర్చున్నాను. ప్రక్కకౌంటర్ లో పద్మజ అంది, "ఏమైంది ప్రకాష్.. కర్చీఫ్ ఉందా.. ఇవ్వనా.. కళ్ళు తుడుచుకోండి.."

" భలే నవ్వోచ్చిందిలే.. తెగ నవ్విచ్చిందా అమ్మాయి.."

# మదిలో సూరీడు

డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి

"ఎవీటి వెతుకుతున్నావు .?"

"అదే తెలియడం లేదు.ఏం పోగొట్టుకున్నానా అని ?"

"దొరకదు. పోగొట్టుకోనుంటేకదా దొరకడానికి ?"

"కాదు!! ఏదో పోగొట్టుకున్నాను. ? మనశ్శాంతి !!"

"లేదు.నీలోనే ఉంది.ఆత్మావలోకనం చేసుకో!"

"అదెందుకు?'"

"తిన్నది అరక్క!!నిన్నునువ్వుచూసుకో... !!!"

"చూసుకోవచ్చా?"

"నువ్వే ఆత్మవు."

"అదెట్లా ! ఆత్మకు ఎం తెలియవుగా!"

"తెలుస్తుంది. అది లేక పోతే నువ్వులేవు.కఠోపనిషత్తులో, ఆత్మా నగం రధనం విద్ధినం శరీరగం రధమేవంతు బుద్ధింతు సారధిం విద్ధి మన ప్రగాహ మేవచ!! అనిగ్రహింపుము అని ఉంది కదా?"

"అంటే?"

"ఆత్మ రధపు యజమానిగా, దేహాన్ని రధముగా, బుద్ధిని సారధిగా, మనసును పగ్గాలుగా కోరికలను గుర్రాలుగా గ్రహించ వలెను. వీటన్నింటిని నువ్వు సమర్ధవంతంగా నేర వేర్చగలిగితే జీవితం సుఖమయం అవుతుంది."

"అదెట్లా మన చేతిలో ఎం లేదు , అంతా ముందే రాసి పెట్టేసి ఉంటుందట కదా!"

మళ్ళీమాట వినిపించలేదు.

అటు ఇటు చూసాను. లోకాన్ని మరిచిపోయి కోడి, పంది, కుక్క, నక్క, చేపలు, రొయ్యలు, బిర్యానీలు అన్ని లాగించి వేస్తున్నాడు.

"ఎందుకురా ముక్కలు దాకా మెక్కడం, పాయిఖాన కోసం పరుగెత్తడం.!!"

"మావా,నాకు తెలయక అడుగుతా!! మనం పంచ భక్ష పరమాన్నాలు తినేటప్పుడు ఆవురావుమంటా తింటాము కదా మరి తినేదంతా పెంటగా వస్తుంది కదా, అదంటే ఎందుకు అసహ్యం? "

"మాటలు సభ్యతగా మాటలాడటం నేర్చుకో !"

"ఓహో హో !! సిన్మాల్లో టీవిలో ఇంతకంటే ఘోరంగా కదా? బూతులే కదా వాళ్ళ కొచ్చేది. అందుకే కదా మన పిలకాయలు, నీ అమ్మ..నీ బొక్క..నీ బొంద అని తల్లినే పట్టుకొని మాట్లాడుతుండేది. మాటల్లోనే అంత పెంట ఉంటే , దాన్ని తినే వాళ్ళు ఎవ్వరూలేరా మావా ?"

"ఎందుకు లేరు; ఉన్నారుగా! స్వార్థం,మోసం, దగా, పంతం,కుల తత్వం , వీటి కంటే మహా దుర్గం ధాలు అవి తినే వాళ్ళు . పూర్వం ఆరుబయట కూర్చునే వాళ్ళ .కుక్కలు పందులు తినేటివి,మిగిలితే భూమికి సత్తువ పట్టేది. ఇప్పుడు అన్నీ లోపలేకదా, లెట్రిన్ బావులు.అందుకని అంతా సీక్రెట్!! అందరూ గురువులే. మహా నీతిమంతులే——అందుకే ఇవన్నీ తప్పు కాదు. లంచగొండ్లు, బ్యాంకులకు డబ్బు ఎగరగొట్టేవాళ్లు. వైట్కాలరు అంటే ప్రభుత్వాన్ని నడపించే వాళ్ళు, పెద్ద పెద్ద ఆసుపత్రులు ,రాజకీయ నాయకులు జవురుకోని తింటున్నారు. తేనోచ్చు అని ప్రజా ఆమోదం పొందారు."

"వాళ్ళకెందుకు మావా అంత ఇష్టం ?"

""ఆలోచించు.ఇప్పుడే వస్తా!!"

"ఏవండి.ఎక్కడ తగలడ్డారు?ఈ స్టవ్వు వెలగడం లేదు."

"అరవకు!! మీ మావున్నాడు.!!"

"ఎవడబ్బ ఉంటే నాకేం , ఇంకొక బడుద్దాయి ఉంటే నాకేం భయమా?"

"మర్యాద..మర్యాద.కాస్త పెద్ద చిన్న గౌరవం ....?"

"ఇవన్ని పెండ్లి చేసుకునేటప్పటి అగ్రిమెంటులో లేవు. ఐ డోంట్ కేర్ !"

"'ఉండవు!!. చదువుకున్నాం, సభ్యసమాజంలో బ్రతుకుతున్నాం. భార్యా భర్తలు..!!?".

"మీరు చెప్పినట్లు నేను వినాల్నా?నా వ్యక్తిత్వం స్వతంత్రం మీకు కుదవ పెట్టాలా?ఇజ్జత్ ముఖ్యం"

చెమటలు పట్టిపోయాయి.సిగ్గుతో కృంగిపోయాను. తల ఎత్తలేకపోయాను. గుండె కుంచించుకు పోయింది.

"ప్రేమ, పెండ్లికి ,వయసుకాదురా అంటే విన్నావా?నీకాళ్ళ మీద నువ్వు నిలబడిన తరువాత, ఆలోచించరా,ఆర్ధిక స్తోమత ఉండాలిరా అంటే విన్నావా?,నువ్వు తీసుకున్న తప్పుడు నిర్ణయాలకు దరిద్రపు పనులకు శిక్ష నువ్వేఅనుభవించు."

తిరిగి చూసాను .ఎవ్వరూ కనిపించలేదు.పైకి చూసాను. నా మెదడులో కూర్చొని ఉన్నాడు. ఎట్లా..?

"సన్నజాజి తీగ.!!?"

"ఛీ !! బానిసత్వం!!"

"ఎందుకండి అంత బాధగా చూస్తారు".

"చస్తాను !!"

"అవేం మాటలండి హాయిగా విడిపోతాంమంటేను!! కలవనప్పుడు అంతేకదా ?"

"కలిసి యుగయుగాలు ఉంటానన్నావు.".

" అదేదో తెలిసీ తెలియని వయస్సు. ఇప్పుడు మెచ్యూరిటీ వచ్చిందిగా!"

"తెగ తెంపులు మెచ్యూరిటీ! అర్థం చేసుకుని కలిసి కాపురం చెయ్యడం ఇమ్మెచ్యూరిటి, తెంచుకోవాల్సిన అవసరం లేదు.పెండ్లయి వారం రోజులు కూడా కాలేదు...?"

" అన్నం ఉడికిందో లేదని ఒక్క మెతుకు పట్టుకుంటే చాలండి.!! నాకో యుగంగా ఉంది. ఈ యుగానికి ఇది చాలనుకున్నాను.."

"అదెట్లా పుప్పొడి.కిరణజన్య సంయోగక్రియ.పిండోత్పతి!"!

"ఇంకో గోట్టాంగాడిని చూసుకుందేమో?"

" మధ్యలో నువ్వెందుకు?వాడు కంపుగొట్టడా!"

"పాత సామాన్లు, కొంటాం పాత చీరలు కొంటాం, .పాత పెండ్లాళ్ళను కొంటాం, పాత రోళ్ళు రోకట్లు కొంటాం".

"ఇదిగో అబ్బాయి పాత మోగుళ్లు ...?"

"వ్యాల్యూ లేదమ్మా ! డిమాండు తగ్గిపోయింది. వీళ్ళకయితే రిసేల్ వ్యాల్యూ ఉంటుంది."

"అదేవిటి మొగుళ్ళు ఎందుకూ పనికిరారా?"

"పక్కింటి ఆవిడను చూడ్డానికి.వీదుల్లో చింపిరి గుడ్డలు వేసుకుని హైలీ లిబరేటెడ్ గర్ల్స్ ను చూసి జొళ్ళు కార్చుకోవడానికి. వాల్ పోస్టేర్సులో , గుడ్డలిప్పేసిన సినిమా....!"

" నువ్వు ఇంగ్లిషు బలే మాట్లాడుతున్నావే?"

"మాజీ మొగుడ్ని కదా! ఎం బి.ఎ , హైటెక్. "

!! చూడు. అదీ పరిస్థితి.!!

"ప్రేమతోనే కదా ?"

"చింతకాయలు. పర్వర్షన్..కక్కుర్తి!! వ్యామోహం తరువాతనే కదా ప్రేమ దోమ అన్నీ ...!?"

"అంతా తటస్థం క్షణికమై పోయాయి.శాశ్వత అనుబంధాలు, పులకరింప చేసే స్పందనలు అంతరించిపోయాయి.?"

" ఎందుకేడుస్తావు. సినిమాకుపో ; చూపిస్తారు.తార్పుడు పనులు. పూజల కొద్ది పురుషుడు పుణ్యం కొద్దీ పిల్లలు అన్నారు .ఇంకా నీకు పిల్లలు లేరు కాబట్టి ఆవిడే చాలా పూజలు చేసింది!! మహాపతివ్రత; అందుకే నోరులేని మొగుడు వచ్చాడు ఎగిరిఎగిరి వెంటపడ్డావుగా!!"

"అది వయస్సు."

"ఆ వయస్సులోనే నాయనా! జీవితంలో భవిష్యత్తును ముసలితనాన్ని నిర్ణయించేది."

"యవ్వనం పోతే మళ్ళీ తిరిగి వస్తుందా?"

"చెప్పు దెబ్బలు, చీపుర కట్టలు, అడుక్కు తినడాలు ముందు ఉంటాయి. మండుతున్న అగ్ని గోళాల్లా!"

ఆమె నవ్వింది ఆ నవ్వు తోనే పరుగులు తీస్తున్నాను. అలిసి పోతున్నా నిలిచి పోలేదు. మైదానులు దాటి, లోయలు అగడ్తలు, ఎగిరి దూకి, కొండలూ కీకారణ్యాలు ఛేదించుకుని, ఆమెతో నేను... నావెంట నందన వనాలు,మయురాలు, రాజహంసలు,

రామచిలుకలు, ఈ ఆకాశం, ఈ భూమాత, ఆమె నవ్వు తోనే పరవశించి నాట్యం చేస్తూ సునిశిత రాగాలు ఆలాపన చేస్తూ ఈ సృష్టిని మైమరిపిస్తున్నాయి.ఆనందంతో తల మునకలు అవుతున్నాయి. పెను తుపానులొచ్చినా, అగ్నిపర్వతాలు లావాను ఎగ చిమ్ముతున్నా, ఆమెతో నడుస్తుంటే పన్నీటి జల్లులే,మలయ మారుతాలే. నడుస్తూనే ఉన్నాను .

ఆమె తిరిగి ఓరచూపు చూసి నవ్వింది. మత్తు చల్లింది.మయగమ్మి పోయింది. లేచి చూస్తే ... నేనొక్కడినే ఉన్నా! ఆమెకోసం చూసాను..ఆమేలేదు.."ఎక్కడ ?" అని దిక్కులు పిక్కటిల్లేటట్లు అరిచాను."చెప్పవా ఒక్క మాట నేనున్నానని ".నా మాట నా చెవుల్లోనే మారు మ్రోగింది.కుప్పలా కూలి పోయాను. అబ్బ. ..ఛీమలు,తేళ్ళు రాబందులు.?

"ఇంకెవరొస్తారు? నయం; రతీ దేవి రాలేదని అడగలేదు. చూడు, శరీరమంతా చీల్చుకుపోయి, ఎలా రక్తంకారుతుందో ? ఆడదాని వెంట పడకురా ముంచుతారు, చంపుతారు. భవిష్యత్తు సర్వనాశనం అవుతుంది అంటే విన్నావా ?"

"నేనొప్పుకోను.నువ్వు భగవద్గీత చదివావా?"

"అదెందుకు? ఇప్పటికి నువ్వు చదివిన, చవి చూసిన అవమానాలు ఓటములు చాలవా ?"

"నీకు జీవనసత్యం తెలియదు. ప్రేమ ఎంత మధురం!!.దేన్నీ వదిలేసినా దీన్ని వదలలేము. ఓడిపోయినా మళ్లి మళ్ళీ ప్రేమిస్తూనే ఉంటాము .అది ఆత్మకు సంబధించింది .పూర్వ జన్మసుకృతం అయిఉంటుంది."

"కాదు. బుద్ది రాలేదు.ప్రారబ్ధం ఖర్మ . మందు సీసాలకు, మత్తు మందులకు ప్రారంభం. ఆత్మాహుతి కూడా అంతర్భాగమే! అనుభవించు.నేను వెళుతున్నా!!"

"ఏవండి పిలిచారా ?"

"ఎవరు నేనా?మాట, కాళ్ళూ చేతులు పడిపోయాయిగా !"

" అంతే లెండి, నేనేమన్నా అడిగితే నోరు కాలు !! ఇంకేవరి కోసమైనా అయితే ఊరూ వాడ; రాత్రిపగల్లు. పొరుగింటి పుల్లకూర. కాచుకోనున్నారా? మిమ్మల్ని నమ్ముకొని నా బ్రతుకును తగల పెట్టుకున్నాను. చస్తాను!!."

"తగలపెట్టుకున్నావు కదా !! మళ్లీ చావడం బాగోదు.?నాప్రాణం నీ తాళిలోఉంది."

"మిమ్మల్ని చంపి, తీసి పారేసి, నేను చావాలో లేదో ఆలోచిస్తాను.?"

"ఆడమగ కలయిక పవిత్ర మైంది .ఆత్మజ్ఞానాన్ని అవమానిస్తున్నావు. ఇంటలెక్చువల్ థిన్కింగ్ ఉండాలి.!"

" ఛీ పాడు.రెండు నిముషాలకు ఎందుకండి అంత దరిద్రపు మాటలు..పిచ్చి పట్టించుకోకండి.కర్తవ్వం ముఖ్యం.!! భార్యను తృప్తి పరచడం ప్రధమం!! మానసిక వ్యభిచారం చేసే వాళ్ళు, ఆత్మజ్ఞానులు ఎలా ఆవుతారు.? బంగారం కొని ఇవ్వండి, షాపింగ్ తీసుకెళ్ళండి, వంట ఇంట్లో వద్దు, నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకోండి. అప్పుడే ఆత్మ, ఆత్మతో రమించేది!! యస్త్వాత్మ రతీ రేవ ......కార్యం న విద్యతే!! కర్మయోగం పదిహేడవ శ్లోకం.భగవద్గీత".

"బుద్దితక్కువ .మట్టి బుర్రని అనుకున్నా? మెటీరియలిస్టిక్ తృప్తులు ఆత్మజ్ఞానమా! అదేనా పెండ్లికి అర్ధం? అదేనా మొగుడి బాధ్యత?"

" బుర్ర పగల కొట్టుకోకు!! వాళ్ళు చాలా తెలివి గల వాళ్ళు..ఏది ఎప్పుడు ఎవరికీ చెప్పాలో,ఎలా వాడుకోవాలో ఎక్సపర్ట్స్ , బాగా తెలిసి ఉంటుంది.అప్పుడే దానికి విలువ!!."

మరి ఆ క్వస్చన్ మార్కు ఎందుకు.?

ఆవిడే ఇస్త్రీ ..ఛీ..ఛీ.. స్త్రీ !!

"పారిపోతాను, సన్యాసుల్లో కలుస్తాను!!! స్థితప్రజ్ఞున్ని అవుతాను. బంధాలన్ని తెంచుకుంటాను!!!

" పిచ్చివాడా ! ఇంకోమాట కూడా చెప్పి ఉన్నారు ,సాంఖ్యయోగంలో మూడవ శ్లోకం,!! క్లైబ్యం.....త్వక్త్వో త్తిష్ఠ పరంతప!!." బాధ్యతను మరిచి పోవడం నపుంసకత్వంతో సమానం. .మానసిక బలహీనత నీచ మైనది!!

"ఇంక్వి లాబ్ జిందాబాద్"

"అది ఎదురు నిలిచే వీరులు అనాల్సిన మాట. బానిసలుకాదు."

"బానిసను కాదు. ఆరాధనకు నాయకుడను."

"పిచ్చికి కూడా పెరుందా ? నిన్ను నువ్వు తర్కించుకో విశ్లేషించుకో !! ఆడదాని వెనుక పడటం తుచ్ఛమైన హృదయ దౌర్బల్యం ,కాబట్టి...?బానిస బ్రతుకే! ప్రేమించడం ఎప్పుడు? భవిష్యత్తును నిర్మించుకున్న తరువాత? తిండి పెట్టగలం అని నమ్మకం కుదిరిన తరువాత. ఆలోచిస్తున్నావా?"

"ఒక్కడికీ పండ్లి కాదు. సృష్టి అంతం. గోవిందో..గోవింద."

"పోనీ పీడా వదులు తుంది. బంగారు అంగళ్ళు , గుడ్డల షాపులు అరుపులు జుట్లు జుట్టు పట్టుకోవడాలు, గుండె పగుళ్ళు ఉండవు. ప్రశాంతమైన... ?? వింటున్నావా"

"లేదు?ఆలోచించాలని అనుకుంటున్నాను ! చాలా దిగులుగా ఉంది.విరక్తిగా ఉంది.అంతా చీకటి మయం!. నా బ్రతుకు ...?"

" చాలా లేటు. ఒక జీవితకాలం గోవింద.! ఆలోచించు!.ఈ విశ్వ శక్తి ఎవ్వరి ఆధీనంలో ఉండదు. నిజమే! అందుకే మన చేతిలో ఏవీలేదనేది. ప్రయత్నించి..ప్రయత్నించి రాళ్ళనో రప్పల్నో వెతుక్కుంటూ, లెక్క పెట్టుకుంటూ పిచ్చి పట్టి తిరిగేది. కానీ స్వామీ వివేకానందుడు; యు ఆర్ ది మాస్టర్ ఆఫ్ యువర్ ఓన్ డెస్టినీ!!.అంటే నీ తల రాతను నువ్వే మార్చుకోవచ్చు.నీ గ్రహపాటుకు నువ్వే యజమానివి అని.

"ఏది నమ్మ మంటావు?"

"ఏదీ నమ్మకు.నీ అనుభవాన్ని నమ్ముకో,తర్కించుకో, విశ్లేషించుకో ! కానీ వాళ్ళు చెప్పినవి ప్రామాణికంగా తీసుకో!! నాకు తెలిసి మహా మేధావి సర్ రాబర్టు ఐయాన్ స్టీన్, యాటం అంటే అణువులోని గుణ గణాలను కనుక్కోగానే, నిజాలు గ్రహించి, పిచ్చిగా నవ్వుతూ ,"తత్ త్వం అసి." సంస్కృత పదం,అన్నాడట.అంటే ఇంగ్లీషులో,"దౌ ఆర్ట్ దౌ !!"

ఒక విదేశీయ మహా జ్ఞాని. తను పని చేసే ప్రయోగశాలకు "తత్ " అనే పేరు పెట్టుకున్నాడట. .మన వేదాల్లో చెప్పిన మాట!! ఆయన విదేశీయుడు .మన సంస్కృతిని. గౌరవించి పాదాభి వందనం చేసాడు. ఆత్మకు రూపం కల్పించాడు. ఆయన సూత్రాలకు మన వేదాలలోని. భగవద్గీతలోని విశ్లేషణలు కలిపి చూస్తే, విశ్వ సృష్టి అర్థం అవుతుంది.

మరుజన్మ పూర్వజన్మ నిజం అని నమ్మకం కుదురుతుందేమో.!!! ఆ సూత్రాలను,సంస్కృతాన్ని, వేదాలను మనం చులకనగా చూస్తున్నాం, ఇతిహాసాలను అవమానిస్తున్నాం. బ్రతుకు సవ్యంగా సాగాలంటే వాటిలో సూక్ష్మాలను అర్థం చేసుకోవాలి, అన్వయించుకోవాలి."

"పాత పుస్తకాల అంగడిలో, చెత్త కుప్పల్లో దొరుకుతున్నాయి. టీ వీ నే విజ్ఞానం, సేల్ఫోనే నీతివాచకం, మాకు తేయంది ఏవిటి? వాటికంటే గొప్పవా? పాత చింత కాయ పచ్చడి. నువ్వు చెప్పేదేంది నాకు.'

"మరెందుకా ఏడుపు.?"

'ఒక్కద్నే ఏడవలేక."

నిర్ఘాంతపోయి మూగధయ్యింది మనసాక్షి.

నిట్టూర్పు వదిలి చెప్పాల్సిన బాధ్యత తన మీద ఉందని," జరిగేది ఎలాగు జరుగుతుంది అని వదిలెయ్యక మనిషి సాధించ లేనిదీ ఏది లేదు అనే ఆత్మవిశ్వాసంతో ప్రయత్నించు .ఒక విధంగా పోరాడి గెలిస్తేనే మనిషవుతావు, మగాడి వనిపించుకొంటావు." చెప్పింది.

"అదెట్లా మనం కర్తలం కాదుగా ?"

"అదే ఆయన చెప్పింది.' తత్ త్వం అసి.' అంటే నీకు నువ్వేసాటి అని !! దొ ఆర్టు దొ.!!! దాని అర్ధం అనూహ్యం .ఆలోచనకు అందనిది.!!!.మదిలో సూరీడు దారి చూపుతాడు .ఆచి తూచి అడుగు లెయ్యి !! నిన్ను నువ్వు నమ్ము.!!! ఆత్మవిశ్వాసంలోనే ఉంది, జీవన మలుపులకు పరిష్కారం. .!!

# మావిద్విషావహై దాసరి శివరాణి

"పేపరు చూస్తారా" ? అంటూ తన చేతిలోని న్యూస్ పేపరులోని కొంతభాగాన్ని తన పక్కనే కూర్చున్న వెంకటరత్నం గారికి అందించాడు హనుమంతరావు. ముఖ్యమైన వార్తలన్నీ చదివేసిన తర్వాత ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

"రైలు ఓ అరగంట లేటని చెప్తున్నారు" అంటూ వెంకటరత్నం గారు తన మోకాలి మీదున్న పంచెను కొంచెం పక్కకు జరిపి నెమ్మదిగా సవరించుకోసాగారు. హనుమంతరావు దృష్టి అటుపడింది. మోకాలి దిగువగా పావలా అంత వెడల్పుగా నల్లని మచ్చ కనపడింది.

"ఎప్పటి నుంచి వున్నది ఇది? ఎర్రగా కందినట్లు వుంటున్నదా? నొప్పి గాని, మంటగాని వున్నదా? దురద ఏమైనా వున్నదా? "

"ఈ మధ్యనే మొదలైనది. నొప్పి లేదు. దురదగా మాత్రం ఉన్నది."

"నే నొక మందు ఇస్తాను. దాన్ని ఈ మచ్చ మీద రోజుకు రెండుసార్లు దూదితో వ్రాయండి. తగ్గుతుంది"

"మీకు వైద్యం తెలుసా? మందు ఇస్తానంటున్నారు"

"తెలుసు. నేను విజయవాడలోని ఆయుర్వేద వైద్య కళాశాలలో విద్యార్థులకు బోధిస్తూ వుంటాను. అవసరం వచ్చినపుడు వైద్యమూ చేస్తాను. తెనాలిలో వుండి రోజూ విజయవాడ కాలేజికి వెళ్తూ వుంటాను."

"మాది పెదలంక. రేపల్లె ట్రెయిన్ కోసం చూస్తున్నాను. భట్టిప్రోలులో దిగి మా ఊరు వెళ్తాను" ఆ తర్వాత మరల ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

"మీ మాటలు నాకు బాగా నచ్చాయి హనుమంతరావుగారు. ఆయుర్వేద వైద్యం పట్ల, రోగుల పట్ల ఎంతో శ్రద్ధ మాకుందని నాకర్థమయింది. ఇంకొంచెం శ్రమపడగలరా? నేను కూడా నా చుట్టు పక్కల వారికి కనీసం నా ఊరివారికి మేలు చేయాలని ఎప్పుడూ ఆలోచిస్తూ వుంటాను. కృష్ణానది ఒడ్డునుండే అందమైన లంక గ్రామాలలో నాదీ ఒకటి. ఏటికి వరదలొచ్చినప్పుడు మా ఊరంతా జలమయ అవుతుంది. పంటలూ దెబ్బతింటాయి. మిగతా అప్పుడు ప్రశాంతంగా, పాడీ పంటలతో సుఖంగా వుంటాము. ఈ మధ్య మా భూగర్భజలాలు ఉప్పగా మారిపోయాయి. ఆ ఉప్పునీటిని శుద్ధి చేసి, ఊరి జనానికి తాగునీటిని అందించే ప్లాంట్లును మా స్థలాలలోనే కట్టించాను. అక్కణ్ణుంచి అందరూ తమ తమ ఇళ్లకు పైపులైన్లు వేయించుకున్నారు. అప్పుడప్పుడు కనీసం నెలకొకసారి డాక్టర్లతో మాట్లాడి మెడికల్ క్యాంపులు పెట్టిస్తూ వుంటాను. నా పిల్లలు కాదనరు. ఒకరిద్దరు ఆర్.యమ్.పి.లను తీసుకొచ్చి మా ఊళ్ళో ఇల్లూ అదీ ఇచ్చి ఏర్పాటు చేశాను. కాని ఎవరూ స్థిరంగా ఉండలేకపోయారు. నాకు ఆయుర్వేదంపై పూర్తి నమ్మకమున్నది. మీకు పరిస్థితులు అనుకూలించి మా ఊళ్ళో మీరు ఉండగలిగితే మా ఊరివాళ్లకు కొంతైనా మేలు జరుగుతుంది. మీరు ఉండటానికి కావలసిన వసతులు ఏర్పాటు చేసాను. మీరు భట్టిప్రోలు వరకు రావటానికి నా కారున్నది. అక్కడి నుండి తెనాలి ట్రెయిన్లో వచ్చి విజయవాడ కనెక్షన్ పాసింజరును పట్టుకొని కాలేజీకి వెళ్ళొచ్చు. విజయవాడ స్టేషన్లో మీరు స్కూటర్ లాంటిది పెట్టకుంటే మరీ వీలు. మీరు యువకులు. వైద్యం పట్ల ఉత్సాహం ఉన్న మనిషిగా కనపడుతున్నారు. కొంత శ్రమపడితే కొన్ని లంక గ్రామాల ప్రజలకైనా మేలు జరుగుతుందని ఇంతగా చెప్తున్నాను. ఆలోచించండి".

"మీరు ఊరి వాళ్లకు సేవచేస్తూ ఆనందపడుతున్నారు. మీలాంటి వాళ్లు ఎక్కడో కాని వుండరు. ఇవ్వాళ అనుకోకుండా నా మిత్రుణ్ణి కలవాలని ఈ రెండో నెంబరు ఫ్లాట్ ఫామ్ చూచి వచ్చాను. అతను రాలేదు. కాని మీలాంటి పెద్దవారు సహృదయంతో పరిచయం కావటం నాకు చాలా సంతోషంగా ఉన్నది. మీరు చెప్పిన దాన్ని గురించి తప్పకుండా ఆలోచిస్తాను. వచ్చే ఆదివారం మీ ఊరొస్తాను. మీతో వివరంగా మాట్లాడతాను" అంటూ తన ట్రైన్ వస్తున్నట్లుగా ఎనౌన్సుమెంట్ వినిపించిందని వెంకటరత్నం గారి దగ్గర శెలవు తీసుకుని వెళ్లాడు.

"ఏంటో ? నా ఆదుర్దా కొద్దీ చెప్పాను కాని, కుర్రాళ్ళకు పల్లెటూళ్లో వుండటం నచ్చుతుందా? పైగా ప్రజలకు అంతో ఇంతో సేవ చేయాలనే ఉద్దేశ్యం ఎంతమంది కుంటుంది? అలా సేవచేస్తూ తాము ఇబ్బంది పడటానికి ఇష్టపడతారా?" అనుకున్నారు వెంకటరత్నం.

కాని వెంకటరత్నం గారి ఆలోచనలను బెదరగొడుతూ హనుమంతరావు ఆ ఆదివారం పెదలంక వచ్చాడు. వెంకటరత్నం గారి తమ వాకిట్లో వున్న సపోటా చెట్టు కింద పేముతో అల్లిన వాలు కుర్చీలో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు. తనకు ఈ ఇల్లు చూపించటానికి వచ్చినతను చనువుగా ఇంట్లోకి వెళ్లి మరో రెండు కుర్చీలు తెచ్చి సపోటా చెట్టు కింద వేశాడు. ఆ తర్వాత లోపలి కెళ్ళి గాజు గ్లాసులో మంచినీళ్ళు తెచ్చాడు. సపోటా చెట్టు కింద అలా కుర్చీ వేసుకుని కూర్చుంటే ప్రాణానికి ఎంతో హాయిగా వున్నది. ఒక వైపు నుండి మామిడి పూత కమ్మని వాసన, మరో వైపు నుండి సపోటాలు పండిన మధురమైన తీపిదనం గాలిలో కలిసి ముక్కుకు హాయిగా వస్తున్నది. వీటికి పోటీగా విచ్చిన దొంతరమల్లె పూల గుబాళింపు ఒక వైపు. కొమ్మకు భారమై పోయేటట్లుగా విచ్చిన ఎర్రగులాబీలు మనసుకు ఒకరకమైన మత్తును కలిగిస్తున్నాయి. వచ్చేటప్పుడు చూశాడు. వీళ్లింట్లోనే కాదు. చుట్టుపక్కలున్న అన్ని ఇళ్ళలోనూ ఇలాగే పూలమొక్కలు, పళ్ల చెట్లు, కాయగూరల పాదులూ కన్పిస్తూ కనువిందు చేస్తున్నాయి. ఆ వాతావరణం హనుమంతరావుకు ఎంతో పరవశం కల్గిస్తున్నది. ఈ చెట్ల కింద ఇలా వాలు కుర్చీలో పడుకుని నచ్చిన పుస్తకం చదువుకుంటుంటే అంత కన్న సౌఖ్యమేమున్నదనిపించింది.

"మీరు వచ్చినందుకు చాలా సంతోషం హనుమంతరావుగారూ. సాయంకాలం దాకా వుండండి. ఊరంతా తిరిగి చూద్దాం. మీకూ కొంత పరిస్థితి అర్థమవుతుంది. మీరెలాంటి నిర్ణయం తీసుకున్న సరే. నేనే వత్తిడి పెట్టను" అనే లోగా గాజు పళ్లేలలో పండిన సపోటాలు, గ్లాసుల్లో నిమ్మరసం తీసుకుని వెంకటరత్నం గారి భార్యలోపలి నుంచి వచ్చింది.

"వీరు ఆయుర్వేద డాక్టరు హనుమంతరావు గారు. మన ఊరు చూడాలని వచ్చారు."

"అలాగా నాయనా! వస్తూ వస్తూ మీ ఆడబిడ్డను కూడా తీసుకొస్తే బాగుండేదిగా!" అన్నదావిడ ఆప్యాయంగా. "మీ పిల్లలు బాగా చిన్నవాళ్ళా?" అన్నదావిడ మరలా.

"ఇంకా పిల్లల్లేరు. ఈ ఊరి వాతావరణం చాలా బాగుందమ్మా. ఇలాంటి వాతావరణంలో వుండే మీరు చాలా అదృష్టవంతులు."

"అంతా బాగానే వుంటుంది. నదికి వరదొచ్చినా భయపడం. ఇక్కడి వాళ్లకు ఏ జబ్బో వస్తేనే. మాకు కాలూ, చెయ్యి ఆడదు. కంగారుపడతాం. గుంటూరో, విజయవాడో పరుగెత్తుకు వెళ్లాలి. మాకుదగ్గర్లో పెద్దడాక్టర్లను పెట్టి ఏ.పి.హెచ్.సీ. అన్నా గవర్నమెంటు ఏర్పాటు చేస్తే మాకు ధైర్యంగా వుంటుంది. సరేలే డాక్టరుగారూ! మా లంక ఇళ్ళల్లో భోజనం కూడా రుచిగా వుంటుంది. మా పెరట్లో కాసిన గుమ్మడి కాయ పులుసు, చిక్కని గేదె పాల పాయసం, వెలగపండు పెరుగుపచ్చడీ మీకు బస్తీల్లో దొరకదు. తిని చూసి వెళ్లండి" అంటూ ఆమె లోపలికెళ్లింది. "నీ కోసమో ఊరిపంచాయితికో,ఎవరో, ఏదో పనులమీదో ఎప్పుడూ ఎవరో ఒకరు ఇక్కడకు వస్తూనే వుంటారు. ఎవరొచ్చినా భోజనాలు మా ఇంట్లోనే. విసుక్కోకుండా మాకు భద్ర వండిపెడుతుంది" భార్యాభర్తలిద్దరూ అరవైకి దగ్గర పడ్డారు. అయినా ఎంత ఓర్పు అనుకున్నాడు.

"ఇలా రండి" అంటూ తమ ఇంటి ఆవరణలోనే వున్న మరో పెంకుటింటికి తీసుకెళ్ళారు. వాకిట్లోనే నారింజ చెట్టు. దాన్నిండా పండిన కాయలు. ఇంటి చుట్టూ కొంత భాగం గచ్చు. మిగతాదంతా నేల. నేల మీద రకరకాల చిన్నా, పెద్ద చెట్లు. తలుపు తాళం తీసి లోపలి కెళ్లారు. ముందు వరండాలోనే ఒక గది కట్టి వున్నది. లోపలి ఇంటి మధ్య దూలానికి ఊయల గొలుసులు వేలాడుతూ వాటికి టేకుతో చేసిన ఊయెల బల్ల అమర్చి ఉన్నది. పడమటి గదుల్లో ఒక దాంట్లో పసుపు కొమ్ములు మరో దాంట్లో ధాన్యపు బస్తాలున్నాయి.

"మీ లాంటి వారికెవరికైనా అవసరమైతే ఇదంతా ఖాళీ చేయిస్తాను వీటి వెనకాల చిన్నవంటిల్లు ఉన్నది. ఆ దగ్గర్లోనే బాత్రూమ్ వున్నది. కావలసినంత పెరదున్నది."

"నిజంగానే లంకంత ఇల్లు" అనుకుంటూ హనుమంతరావు తలపైకెత్తి కప్పువంక చూశాడు. పెంకుల నుండి దుమ్మురాలకుండా ఇంటి కప్పంతా బిళ్ల కూర్పు అతికి వున్నది. చల్లగా కూడా వుంటుంది అనుకున్నాడు హనుమంతరావు.

"ఆ పక్కనున్నది మాబంధువుల ఇల్లే. అందుకని ప్రహరీ గోడకు తలుపు పెట్టుకొని ఈ మూడిళ్లలో తిరుగుతుంటాం రండి. అక్కడకూ వెళ్లొద్దాం" అంటూ పొందిగ్గా, ముచ్చటగా వున్న పక్కింట్లోకి దారితీశారు వెంకటరత్నం గారు.

ఆ ఇంటివాళ్ళు ఇంచుమించు తన వయసు వాళ్లే అనుకున్నాడు హనుమంతరావు ఎదురుగా కనపడ్డ వ్యక్తిని చూసి. చిన్నపిల్లల గొంతులు లోపలి నుంచి విన్పిస్తున్నాయి.

"రామమూర్తీ ఈయన పేరు హనుమంతరావుగారు. ఆయుర్వేద వైద్యులు. విజయవాడలో పని చేస్తున్నారు"

రామ్మూర్తి వాళ్లను కూర్చోబెట్టి కొబ్బరిబొండాలు కొట్టి నీళ్లు గాజు గ్లాసుల్లో పోసి తెచ్చాడు. వాళ్లబ్బాయి మూడు నాలుగేళ్ల మధ్యవాడు వీళ్ల దగ్గరి కొచ్చాడు. ముద్దుగా, బొద్దుగా వున్నాడు. ముక్కు వెంబడి జలుబు కారుతున్నది.

"మీ కందుబాటులో వుంటే చిన్న చిటికెడు కరక్కాయ పొడి తేనెలో కలిపి నాకిస్తే ఆ జలుబు పోతుంది"

“కరక్కాయ పొడి మా ఇంట్లో వుంది. తేనె వీళ్ళింట్లోనే వుంటుంది” అన్నారు వెంకటరత్నం గారు. అక్కడ కాస్సేపు కూర్చుని లేచొచ్చారు.

సుభద్రగారు వర్ణించిన దాని కన్నా వంటలు రుచిగా వున్నాయి. చివర్లో పెరుగన్నం తినటానికి పొట్టలో ఖాలీ లేకుండా పోయింది. కమ్మని మీగడ పెరుగు కలుపుతుంటే కంచమూ, చెయ్యీ అంతా చమురే తగిలింది. ఆ నేల తీరా? నీటితీరా? సుభద్రగారి చేతి తీరా? ఏమి తేల్చుకోలేకపోయాడు. మధ్యాహ్నం కాస్త చల్లపడగానే వాటరుప్లాంట్ దగ్గర కెళ్లారు. ఊరందరి దాహార్తిని తీర్చటానికి తనే స్థలమిచ్చి ఖర్చు పెట్టుకుని నీటిని శుద్ధిచేయిస్తూ, ఒక గుమాస్తాను పెట్టి సకాలంలో మోటారుర వేయించి, తీయించి శ్రమ పడుతున్నారు. ఆ గర్వం ఆ దంపతుల్లో లేనే లేదు.

ఊరి కానుకునే మామిడి తోటలు, జామతోటలు కనపడుతున్నాయి. అటువైపు నడిచారు. “లంక మామిడిపండ్లకు ప్రసిద్ధి. బంగినపల్లి పండ్లకన్నా ఇవి రుచి ఎక్కువ. మార్కెట్లో బంగినపల్లి అయిపోయే సమయంలో ఇవి పండటం మొదలు పెడతాయి. పండిన కాయంతా పైన సన్నని వత్తైన చుక్క ఏర్పడుతుంది. లోపలి గుజ్జంతా మధురాతి మధురంగా వుంటుంది.”

“ఈ తోటల్లో ఇంకా తిరగాలని వుంది. కాని ఆరుగంటల ట్రెయిన్ అందుకోవాలి.”

“అలాగే ఇంటి కెళ్లి టీ తాగుదాం. మిమ్మల్ని భట్టిప్రోలు స్టేషన్ వరకూ పంపే ఏర్పాటు చేస్తాను.” పొద్దున ఇల్లు చూపించటానికి వచ్చినతనికే కబురు చేశారు.

“వీరిని తీసుకెళ్లి భట్టిప్రోలు స్టేషన్ లో దింపి వచ్చేటప్పుడు కారులో పెట్రోలు కొట్టించుకురా” అని చెప్పారు. పెదలంకకు భట్టిప్రోలు ఓ ఏడెనిమిది కిలోమీటర్లు వుంటుంది.

“వెంకటరత్నం గారూ ! నేనూ మాతో పాటు ఇక్కడే వుందామనుకుంటున్నాను. నా వలన ఇక్కడి వాళ్లకు ఏ కొంచెమైనా మేలు జరుగుతుందని మీరనుకుంటే అలాగే కానిద్దాం. వీలుచూచుకుని కాపురం ఇక్కడకు మార్చేస్తాను.”

“చాలా సంతోషం హనుమంతరావుగారూ. మీలాంటి యువకులు ఇలా స్పందిస్తుంటే పల్లెటూళ్ళ మా మంచి రోజులు వస్తాయి. వివేకానందుడు కూడా యువతరం మీదే ఎన్నో ఆశలు పెట్టుకునే వాడు. వాళ్లను ఉత్తేజపరుస్తూ మాట్లాడేవాడు. ఇల్లంతా సర్దించి వుంచుతాను. మీరెప్పుడైనా రావచ్చు.”

సుభద్రగారు ఒక కవరులో సపోటాలు, మరు చిన్నకవరులో బొండుమల్లె మొగ్గలు నింపి ఇచ్చింది. భార్యాభర్తలిద్దరూ ఎంతో ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

★★★★★

“అక్కడి వాతావరణం ఎంత బాగుందో చెప్పలేను వసుంధరా. ఇల్లు పెంకుటిల్లే కాని అన్ని వసతులూ వున్నాయి. నీ కిష్టమైన గోరింటాకు మొక్కతో సహా ఎన్నో పూలమొక్కలు పెంచుకోవచ్చు. ఇంకా ఆరోగ్యాన్నిచ్చే తులసి, బిళ్లగన్నేరు, కలబంద మడులు మడులుగా పెంచొచ్చు. నేను చెప్పటం కాదు. నువ్వు నీ కళ్లతో చూస్తే నీకే అర్థమవుతుంది. ఓ గంటో, రెండు గంటలో వుండి వద్దామని వెళ్ళినవాడిని ఆ పగలంతా అక్కడే వుండిపోయాను. ముఖ్యంగా వెంకటరత్నం గారు, సుభద్రగారు ఇద్దరూ చాలా మంచి మనుషులు. తోటివారికి సాయపడాలనే మంచిమనసు, ఆ దయాగుణం నాకు బాగా నచ్చాయి. నేనంటూ అక్కడ వుంటే ఊరి వారికి కొంతైనా ఉపయోగముంటుందని వాళ్లు గట్టిగా నమ్ముతున్నారు. నేనూ నా ప్రయత్నం చేసి చూద్దామని గట్టిగా అన్పిస్తున్నది. మరో సంగతేంటంటే ఆ ఊళ్లో అరుగుల మీద కూర్చుని నాకు చాలా మంది వృద్ధులు కనుపించారు. దాదాపు తొంభై ఏళ్లు, ఆపైన వున్నవాళ్లు ఆరోగ్యంగా కనిపించారు. మంచి

వాతావరణంలో వున్నందువలన అంతకాలం జీవిస్తున్నారని నాకర్థమయింది. అలాంటి వారికి కొద్దీ, గొప్పా అనారోగ్యపు లక్షణాలు వస్తే నా వైద్యంతో నయం చేయగలనన్న నమ్మకం నాకు బాగా కలుగుతున్నది."

"ఆ ఊరి గురించి చాలా గొప్పగా చెప్పేస్తున్నారు. మనుషులకు కాకుండా మానులకు వస్తాయా జబ్బులు ? మనుషులున్న చోట రోగాలూ కాచుకునే వుంటాయి. ముందు మీరోజు వారీ ప్రయాణం సంగతి ఆలోచించండి. రెండు రైళ్లు మారి మీ కాలేజీకి వెళ్లాలి. చాలా ఇబ్బంది పడతారు. అది నాకు ఇష్టం లేదు"

"ఫర్వాలేదు. కాస్త ప్రొద్దున్నే లేచి తయారవుతాను. నువ్వే కాస్త ఇబ్బందిపడి టిఫినూ, భోజనం కారియర్ తయారు చేసి ఇవ్వాలి. అయినా చాలామంది ఇలా ట్రయిన్లో మారి చాలా దూరం ప్రయాణం చేస్తూనే ఉంటారు. ఉద్యోగాలకు వెళుతూనే వుంటారు. ట్రెయిన్ ప్రయాణం కాబట్టి మరీ ఇబ్బంది వుండదు. మనకు అంతగా కుదరకపోతే వాళ్లతో చెప్పేసి తిరిగి వచ్చేద్దాం" అంటూ వసుంధర నొప్పించాడు.

అనుకున్న ప్రకారం సామాను సర్దుకుని పెదలంక వచ్చేశారు. వెంకటరత్నం, సుభద్ర దంపతులు తమ మనుషుల్ని సాయం పంపారు. రెండు రోజుల పాటు భోజనాలు మా ఇంట్లోనే అనీ చెప్పారు.

ఇద్దరు మనుషులకు ఇంత పెద్ద ఇల్లా అనిపించింది వసుంధరకు. వరండాలో గది కూడా విశాలంగానే ఉన్నది. దాంట్లో వున్న అల్మారా నిండా, తన మందుల్ని లోపలిగదిలోని అల్మారాలో తన పుస్తకాలను హనుమంతరావు పొందిగ్గా అమర్చుకున్నాడు. ఊర్లో అందరూ డాక్టరుగారూ! అంటూ పలకరించసాగారు. తన కాలేజీవరకు తను ప్రొఫెసర్ను. ఇక్కడందరికీ డాక్టరనే అనుకున్నాడు.

వెంకటరత్నం గారి కాలిమీది మచ్చ, దాని తాలూకు దురద పూర్తిగా మానిపోయాయి. దాంతో ఆయన నమ్మకం మరింత పెరిగింది. అందరికీ ఆయుర్వేద వైద్యం గొప్పతనమూ, తన కాలిమచ్చ ఎలా మాయమయిందో వివరించి చెప్పసాగారు. సుభద్రగారు వసుంధరను కన్న కూతురిలాగే చూచుకోసాగారు.

"ఎంత డాక్టర్ గారి పెళ్లానివయితే మాత్రం పిల్లలేకుండా ఎన్నాళ్లు జాగ్రత్త పడతావు? త్వరగా ఇద్దర్ని కనేయ్. మల్లెమొగ్గల్ని కోసి నీళ్లు చల్లి వుంచాను. దండకట్టి రాత్రికి పెట్టుకో. ఇంకొంచెం మిగిలితే పక్కమీద చల్లుకో. చక్కగా కాపురం చెయ్యండి. వెంటనే నెల తప్పాలి" అన్నది ప్రేమగా.

"జాగ్రత్త లేమీ లేవు పిన్నీ. ఎందుకనో పుట్టలేదు" అన్నది దిగులుగా.

"అలాగా? ఇంతలోకే దిగులెందుకులే కొంతమందికి ఆలస్యంగా పుడతారు" అంటూండగానే హనుమంతరావు వచ్చినట్లుగా స్కూటర్ చప్పుడు వినిపించి వసుంధర లేచి వెళ్లింది.

కలబంద మొక్కల్ని తను తెనాలి నుండి వస్తూ కొన్ని తెచ్చాడు. వాటినే పల్చగా పాతాడు. పెదలంకలోని వాళ్లు కొన్ని తెచ్చి ఇచ్చారు అవి బాగా బలంగా వుండి పెద్దగా వున్నాయి.

"ఇవి నారకు పనికి వస్తాయి. మందు తయారీకి ఇవిగో ఈ తెల్లచుక్కలున్నవి, లేత కుంకుమరంగులో వున్నవి బాగా పనికి వస్తాయి. రోజూ పరగడపున కొద్దిగా నీటి గుజ్జు, పటికబెల్లం పొడి, జీలకర్ర పొడి కలిపి తీసుకుంటే రుచిగానూ వుంటుంది. బాగా ఆరోగ్యంగానూ వుంటుంది"అన్నాడు.

అలా పాతిన మొక్కల్లో వాకిట్లో ముందు వైపునంతా కలబంద దట్టంగా పరుచుకున్నది. ఓ వైపున, కాటుబిళ్ల గన్నేరు, తులసి, గలిజేరు ఇలా ఔషధంగా పనికొచ్చే మొక్కలన్నింటినీ పెంచసాగాడు. శెలవురోజుల్లో హనుమంతరావు దగ్గరకు వైద్యం కోసం ఊరివాళ్లు వచ్చేవాళ్లు. కడుపునొప్పీ, జ్వరం, విరేచనాల లాంటి వాటికి రాత్రిపూటో, మరీ పొద్దున్నేనో, వచ్చేవాళ్లు. కడుపునొప్పీ, జ్వరం, విరేచనాల లాంటి వాటికి

రాత్రి పూటో, మరీ పొద్దున్నేనో, వచ్చేవాళ్లు. తను కలిపే మందులతో పాటు, వైద్యనాధ్, డాబర్ కంపెనీల ఆయుర్వేద మందులు తెప్పించి వుంచేవాడు. బి.పి. చూడటం, జలుబుకూ, జ్వరానికీ మాత్రలివ్వటం వసుంధర కూడా చేసేది. వాకిట్లో ఎప్పుడూ ఏవో ఆకులూ, వేళ్లూ కాయలు ఎండబెడుతూ వుండేది. వాటిని పొడి కొట్టి వస్త్రంకాయం పట్టి వుంచేది. ప్రాణశక్తి అనే టానిక్కు తాను ఇంట్లో వున్నప్పుడు వసుంధర సాయంతో తానే తయారు చేసి సీసాల్లోనింపాడు.

వసుంధర మందుల కోసం పొడులు, దంపేవి దంపుతూ, మిక్సీలో వేసేవి మిక్సీలో వేస్తూ వుండేది. మేము సాయం చేస్తామని కొంతమంది ఇరుగుపొరుగు ఆడవాళ్లు ముందు కొచ్చేవాళ్లు. "ప్రాణశక్తి" టానిక్ వెంకటరత్నంగారు, సుభద్రగారు పాలల్లో కలుపుకుని రోజూ ఉదయాన్నే తాగసాగారు. బాగా ఉత్సాహంగా, బలవర్ధకంగా అన్పిస్తున్నదని పదిమందికీ చెప్పారు. దాంతో చుట్టు పక్కల లంక గ్రామాల వాళ్లు కూడా ఆ టానిక్ కోసమూ, క్రమేపీ మందుల కోసమూ రాసాగారు. వైద్యమంతా ఉచితమే. మందుల ఖర్చైనా తీసుకోమని బలవంతంగా పదో, పాతికో ఇచ్చి వెళ్లేవాళ్లు.

ఆ రోజు పసిపిల్లవాణ్ణి చంక నేసుకుని, పెద్దపిల్లవాణ్ణి చేతిలో పట్టుకుని సుభద్రగారి చుట్టా లామె ప్రహరీ గోడ కున్నవాకిలి తలుపు తీసుకుని వచ్చింది. పెద్ద పిల్లవాడి పేరు కిషోర్. వాడంటే సుభద్రగారికి బాగా ముద్దు.

"ఏమే, రమాదేవీ, కిషోర్ను బళ్లోవేశారుగా. ఇంట్లో వున్నప్పుడు తమ్ముడిని కొట్టకుండా ఆడిస్తున్నాడా?"

"అదేం లేదు పిన్నీ. వాడికి తమ్ముడంటే చాలా ఇష్టం." తనూ ఎత్తుకుంటానని ఒకటే పేచీ. నీ దగ్గర కాసేపు కిషోర్ ను వదిలి వెడదామని వచ్చా. నాకు పసుపు దుంపల్ని ముక్కలు కొట్టే పని వున్నది. వసుంధర గారి దగ్గరకు ఎప్పుడన్నా వద్దామన్నా కుదరటం లేదు అంటూ హడావుడిగా వెళ్లింది.

"మా రమాదేవి కెప్పుడూ హడావుడే" అంటూ కిషోర్ బుగ్గలు పట్టుకుని సవరిస్తూ వాడికేదైనా చిరుతిండి పెట్టే ప్రయత్నంలో పడింది, సుభద్ర.

నిజంగా కిషోర్ బాగా ముద్దుగా వున్నాడు. మాటలు బాగా చెప్తున్నాడు. కిషోర్ వంక తదేకంగా చూస్తూ "నాకు ఇలాంటి కొడుకుంటే ఎంతబాగుండేది" అనుకుని నిట్టూర్చింది, వసుంధర. వసుంధరకు హార్మోన్ల సమతుల్యత సరిగా వుండదు. వైద్యం చేయించిన తర్వాతే మొదటగా రజస్వల అయింది. ఆ తర్వాత కూడా మాత్రలు వాడితేనే నెలసరి వస్తుంది. పెళ్లయిన దగ్గరి నుంచీ హనుమంతరావు కూడా వైద్యం చేస్తున్నాడు. గర్భోత్పత్తికి అనువుగా ఆమె గర్భాశయం లేదని హనుమంతరావు కర్థమయింది. అదేమీ బయటకు కనపడనీయకుండా హనుమంతరావు కాలేజీలో పిల్లల మధ్య, ఇటురోగుల మధ్య గడిపేస్తున్నాడు. వసుంధరకు మాత్రం ఇలా ఏ చిన్నపిల్లవాడిని చూసినా మనస్సు కలుక్కు మంటున్నది.

క్రమేపీ సుభద్రతో పాటు వసుంధరకూ కిషోర్ బాగా చేరికయ్యాడు. "ఇవాళ కిషోర్ ఏం చేశాడనుకున్నారు? తన చిన్ని చేతుల్తో ఎండపెట్టిన ఆకులన్నింటినీ గుప్పెళ్లతో ఎత్తి గిన్నెలో పోశాడనో, లోటాతో మొక్కలకు నీళ్లు" పోస్తూ తన వెనకాలే తిరిగాడనీ ఇలా ఏదో ఒక కబురు కిషోర్ను గురించి వసుధర తరచూ హనుమంతరావుతో చెప్పేది. కిషోర్ ఒక్కోరోజు ఇక్కడే స్నానం చేసి అన్నం తినేవాడు.

"పాపం వసుంధర పిల్లల కోసం మొఖం వాచిపోతుంది" అని సుభద్రగారు అనుకునేవాళ్లు. వసుంధరను అమ్మా అనటం ఆమే నేర్పించింది. కిషోర్ అలాగే అలవాటు పడ్డాడు.

"అమ్మా! మీ స్కూల్లో ఏదైనా శ్లోకం చెప్పాలట. నేర్పు" అన్నాడు.

ఏం చెప్పాలి ? "గురుబ్రహ్మ" "శుక్లాంబర ధరం" అని ఆలోచించింది. కాదు ఏదైనా కొత్తగా నేర్పాలనుకున్నది. తాను చదువుకున్న శ్లోకాలను గుర్తుకు తెచ్చుకుంటుంటే ఒక మంత్రం, గుర్తు కొచ్చింది. "ఓం సహనావవంతు, సహనేభునక్, సహవీర్యం కరవావహై, తేజస్వినా వధీతమస్తు, మా విద్విషావహై, ఓం శాంతి శాంతి శాంతి." ఇది ప్రాచీన కాలంలో గురుకులాల్లో, శిష్యులు, గురువులు పఠించేవారనీ గుర్తుచేసుకున్నది. ఆ మంత్రాన్నే కిషోరుకు శ్రద్ధగా నేర్పింది. వాడూ, పట్టుదలగా, ఉత్సాహంగా నేర్చుకున్నాడు. ఆ తర్వాత స్కూల్లో చెప్పమన్నప్పుడు చేతులు కట్టుకుని తప్పుల్లేకుండా చెప్పాడు. టీచరుగారు బాగా మెచ్చుకుని ఎవరు నేర్పారని అడిగితే వసుంధరమ్మ నేర్పిందని చెప్పాడు. ఆ తర్వాత కిషోర్ చదువు పట్ల వసుంధర బాగా శ్రద్ధ పెట్టింది. మంచి మంచి శ్లోకాలూ, చిన్న చిన్న లెక్కలూ అన్నీ మొదలు పెట్టి చెప్పింది. ఆనాటి జిజియాబాయి తన కొడుకు శివాజీకి ఎలా కథలు చెప్పి ధైర్యసాహసాలు నూరిపోసిందో తానూ అలాగే చేస్తున్నది. కిషోర్ ఐదు చదవటం పూర్తి చేశాడు. పెదలంక నుంచి వెనక్కు వెళ్లిపోదామన్న ఆలోచన హనుమంతరావు, వసుంధరలలో ఏ ఒక్కరికీ కలగలేదు. ఇక్కడి ప్రజలకు వైద్యం చేయటంలో, తన శ్రమను హనుమంతరావు మర్చిపోతే, హనుమంతరావుకు చేదోడు వాదోడుగావుంటూ, రోగులకు తనకు చాతైనది చేస్తూ అన్నిటికీ మించి కిషోర్ తో అనుబంధం పెంచుకుంటూ వసుంధర తన దిగులు మర్చిపోయి ఆనందంగా వుండ సాగింది. వెంకటరత్నం గారు వీళ్లను మెచ్చుకొని రోజు, సుభద్ర, అభిమానించని రోజు లేదు. ఊరి వారందరూ "డాక్టరుగారూ" మీరిక్కడ వుంటుంటే మాకెంతో ధైర్యంగా వున్నది. మీక్కానీ, వసుంధరమ్మగారి క్కానీ ఏ సాయం కావాలన్నా మేం చేస్తాం. మీరిక్కడి నుండి మాత్రం వెళ్లకండి" అంటున్నారు.

రమాదేవికీ, రామ్మూర్తికీ కిషోర్ బాధ్యత చాలా వరకు వసుంధర తీసుకోవటంలో వాళ్లకూ సంతోషంగా వుంటున్నది. కిషోర్ అక్కడే ఎక్కువ సమయం గడుపుతున్నా వాళ్ళేం బెంగపడటం లేదు.

పెదలంకలో వున్నది ప్రాథమిక పాఠశాల. ఐదుతరగతుల వరకే వున్నది. హైస్కూల్ చదువు కావాలంటే పొరుగూరు వెళ్లాల్సిందే. పిల్లల్ని బాగా చదివించాలని కిషోర్ తల్లిదండ్రులకూ, మరికొందరికీ కోరిక కలిగింది. ఆ కోరికను తీర్చుకోవటం కోసం విజయవాడలోని రెసిడెన్షియల్ స్కూల్ నెన్నుకున్నారు. కిషోర్ మరికొంతమంది పిల్లలూ కలిసి హాస్టల్లో వుండి చదువుకుంటూ బిక్కు బిక్కు మంటూ వుంటున్నారు. శెలవుల కొచ్చినప్పుడల్లా కిషోర్ గొడవ పెట్టుకునేవాడు. అందరి కన్నా ఎక్కువగా వసుంధరే కళ్లనీళ్లు పెట్టుకునేది. వళ్లంతా నలుగుపెట్టి నీళ్లు పోసేది. వాడికిష్టమైన వన్నీ చేసి కొసరి కొసరి తినిపించేది. మరలా వెళ్లటానికి ఏడ్చే కిషోరును సముదాయించేది. నాలుగైదు రకాల తీపి, కారం పిండివంటలూ, నేతి డబ్బాతో సహా ఇచ్చి పంపేది. ఇలా కిషోర్ టెన్త్ క్లాస్ పూర్తిచేశాడు.

"వెంకటరత్నం తాతయ్యా! నేనింకా చదవను. మా నాన్నతో చెప్పు. నువ్వో, మా నాన్నో ఒక ట్రాక్టరు కొనండి. నేను వ్యవసాయం చేస్తా"నంటూ మొండిపట్టు పట్టాడు.

మళ్లీ వసుంధరే ఎక్కువగా నచ్చచెప్పి కాలేజీకి పంపింది.

ఓ రోజున హనుమంతరావు గారి పేర రిజిస్ట్రేషన్ చేయించిన ఇంటి కాగితాలను చేతిలో పెట్టారు వెంకటరత్నం గారు.

"రేపు నా కొడుకుల మనసు మారి ఇంట్లో ఇలాగే వుండటానికి పేచీ పెట్టొచ్చు. నేను పెద్దవాడినయి పోతున్నాను. నా కొడుకులిద్దరి చేత సంతకాలు పెట్టించి మీ పేర ఇల్లు వ్రాయించాను. వాళ్లిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ బాగానే సెటిలయ్యారు. మరేం ఫర్వాలేదు. నా మాట మీద మీర ఊరొచ్చి వైద్యం చేస్తున్నారు. అంతేకాకుండా మీరిద్దరూ ఊళ్లో అందరికీ తలలో నాలుకలా వుంటున్నారు. మీకేం కావాలన్నా చెప్తాను. ఈ ఇంటికి రేటు లాంటిది కట్టి ఇచ్చే ఆలోచన చెయ్యవద్దు. వసుంధర మాకు బిడ్డలాంటిది. తనకు పసుపుకుంకుమగా ఇచ్చామనుకుంటాం."

ఆ మాటలు విన్న వసుంధర కళ్లు చెమర్చాయి. హనుమంతరావు ఆప్యాయంగా వెంకటరత్నం గారి చేతులు పట్టుకున్నారు. ఆ తర్వాత వెంకటరత్నంగారు, మరో రెండేళ్లకు సుభద్ర కాలం చేశారు. కిషోర్ బి.ఫార్మశీ చదువుతున్నాడు. హనుమంతరావు తప్పనిసరి బదిలీపై ఖమ్మం వెళ్లాల్సి వచ్చింది. మనసు నెంతో సమాధానపరచుకుని పెదలంకను వదల్లేక వదిలివెళ్లారు. ఆ తర్వాత కిషోర్ తన చదువులో పడిపోయ్యాడు. పెదలంకలో ముఖ్యమైన ఫంక్షన్లు వుంటే హనుమంతరావు వాళ్లు వచ్చి వెళ్ళే వాళ్లు. ఆ తర్వాత కిషోర్ యమ్.ఫార్మశీ చదవటానికి మణిపాల్ వెళ్లాడు. చదువు పూర్తి కాగానే బెంగళూర్లో ఉద్యోగం వచ్చింది. చదువుకునేటప్పుడు రెండుసార్లు మాత్రం వెళ్లి వసుంధర వాళ్లను చూసి వచ్చాడు. వసుంధర ఆప్యాయత, బుజ్జగింపు, ఆమె చెప్పిన ధైర్యం మొదట్లో కిషోర్ కు, బాగా గుర్తుకొచ్చేవి. ఆ తర్వాత అప్పడప్పుడు ఫోనులో పలకరింపులు. క్రమేణా ఉద్యోగం, పెళ్లీ, పిల్లలు అంటూ బాధ్యతల్లో పడిపోయాడు. తన పెళ్ళప్పుడు మాత్రం వచ్చి వెళ్లారు. వాళ్ల స్మృతులు మెదలినప్పుడల్లా మనస్సుకు హాయిగా అన్పిస్తుంది కిషోరుకు ఇప్పటికీ. చాలా రోజుల తర్వాత వారంతపు సెలవులతో పాటు మరో నాలుగు రోజుల శెలవు పెట్టుకుని కిషోర్ తన కుటుంబంతో పెదలంక వచ్చాడు. ఇంటి వెనుక వసారా వైపుకు వెళ్లాడు. తమకూ, హనుమంతరావుగారికీ మధ్య నుండే వాకిలి తలుపు తీసి వున్నది. ఎవరో మనుషులున్న అలికిడి అయింది "ఇప్పుడెవరుంటున్నారు" అనుకుంటూ నాలుగడుగులు ఇవతలికి వేశాడు.

హనుమంతరావుగారే. లుంగీపైకి కట్టుకుని ఏదో పని చేస్తున్నారు. గబగబా ముందుకు నడిచాడు.

"ఎప్పుడొచ్చారు ఇక్కడికి ? మీరెలా వున్నారు ? అమ్మెలా వున్నది?" అన్నాడు ఆతృతగా.

"నువ్వా కిషోర్! మేం ఈ మధ్యనే వచ్చాం. నువ్వెప్పుడొచ్చావు? పిల్లలు కూడా వచ్చారా? అంతా బాగున్నారా? రా, వసుంధరను చూద్దువుగాని" అంటూ లోపలికి దారితీశారు.

"వసుంధరా! చూడు, ఎవరొచ్చారో?"

"ఎవరూ?" అంటూ పడుకున్న మనిషి లేచి కూర్చున్నది.

"నేనమ్మా, కిషోర్ను" అంటూ పక్కన కూర్చున్నాడు.

"ఎప్పుడొచ్చావు?" అన్నది పొడిపొడిగా. "నీకిద్దరు పిల్లలు కదూ? బాగున్నారా?" అన్నది కాసేపాగి.

"అమ్మేంటి? ఇంత నిరుత్సాహంగా వున్నది? ఆనాటి చలాకీతనం, ఆప్యాయత ఏమైనవి? మామూలుగా అయితే "కిషోర్, నువ్వా?" అంటూ హత్తుకుపోయేది" ఏం తింటావురా? ఏం వండేది అటూ హడావుడి పడేది. వయసు ప్రభావమా? కాదు ఇంకేదో తేడా వున్నది. అనుకునే లోగానే వసుంధర మరలా పడుకున్నది.

కిషోర్, హనుమంతరావులు వరండాలో కొచ్చారు.

"అమ్మకేమైనా అనారోగ్యమా?"

"శారీరకంగా ఏ అనారోగ్యం లేదు. మానసికంగా కుంగుబాటుకు గురయింది. మన కబ్బాయి వున్నాడా ? లేడుగా? రేపు మనల్నెవరు చూస్తారు? చివరకు మనం చచ్చిపోతే ఊళ్లో వాళ్లో, చుట్టాలో ఏదో జంతువును తీసుకెళ్లినట్టుగా లాక్కెళ్ళతారు. మనకు ఆట్టే దగ్గర చుట్టాలు లేరు. అయ్యో! దేముడా! అంటూ కళ్ల నీళ్లు పెట్టుకుంటుంది. తినమంటే తింటుంది. అందరికీ అందరూ వున్నారు. మనకే ఎవరూ లేరని ఒకటే బాధపడుతుంది. ఇదివరకే ఆ ఆలోచన వుంటే ఎవరో ఒకర్ని పెంపకానికి తీసుకునే వాళ్లం. నాకు కాలేజీతో తను నాకు తోడుగా వుండటం సరిపోయేది. ప్రజలందరూ మనవాళ్లే అనిపించేది. వసుంధర మరీ ఇంతలా ఆలోచిస్తుందనుకోలేదు. నేను రిటైరయ్యాను. రిటైరవ్వగానే, మన

ఊరు వచ్చేయాలని ముందు నుంచీ అనుకున్నదే. ఈ ఊరన్నా నాకూ, మీ అమ్మకు ఎంతో ప్రేమ. ఈ వాతావరణంలో, ఈ మనుషుల మధ్య నైనా తను మామూలు మనిషవుతుందన్న నమ్మకంతో వున్నాను. చాకలి సాంబమ్మ నాకు ఇంటి పనుల్లో సాయంగా వుంటున్నది.”

“తప్పకుండా అమ్మ కోలుకుంటుంది. నాకా నమ్మకం ఉన్నది. నేను మళ్లీ వస్తానని” బయల్దేరాడు. ఎంతో ఉత్సాహంగా వుండే వసుంధరమ్మ అలా గాలి తీసిన బంతిలాగా అయిపోవటం చూసి కిషోర్ మనసు తల్లడిల్లింది. తనను చేసిన గారాబం, ఆ మురిపెం అంతా గుర్తుకొచ్చి గుండె బరువెక్కింది.

“ఇప్పుడు మన ఊళ్లో సౌకర్యాలు పెరిగాయి. చదువుకునే పిల్లలకు హైస్కూల్ కూడా వున్నది.”

“అవును కిషోర్. మా చిన్నప్పుడు మీరే హాస్టల్లో వుండి చదువుకోవాల్సి వచ్చింది.”

“అవును నాన్నా. ఇప్పుడు నా పెద్ద కూతురు మధురను మీ దగ్గరే వదిలి వెడదామను కుంటున్నాను. మీ కోడల్ని కూడ ఒప్పించాను.”

“బెంగుళూర్లు వుండే పిల్ల ఇక్కడ వుండగలదా? నేను దానికి అన్నీ చేయగలనా?”

“నువ్వూ, నాన్నా, వున్నారమ్మా. పక్కనే హనుమంతరావుగారూ, వసుంధరమ్మ వున్నది. తను తప్పకుండా పట్టించుకుంటుంది. ముఖ్యంగా వాళ్ల కోసమే మధురను ఇక్కడ వదులుతున్నాను. తను మంచి పెంపకంలో పెరుగుతుంది. వసుంధరమ్మ కూడా మధుర పెంపకంలో మళ్లీ మామూలు మనిషవుతుంది. వెంకటరత్నం తాతయ్యగానీ, హనుమంతరావు దంపతులు కానీ మన ఊరికెంతో చేశారు. వాళ్లిప్పుడు మనూరిని, ఇక్కడి మనుషుల్నీ నమ్ముకుని వచ్చారు. వాళ్లను మనమే కనిపెట్టుకుని వుండాలి.”

కిషోర్ భార్యకు లోపల్లోపల చాలా భయంగా వున్నది. రామ్మూర్తి ఇంట్లో చాలా తర్జన భర్జన లయ్యాయి. కాని కిషోర్ మధురను తీసుకుని వెళ్లి వసుంధర దగ్గరే ఎక్కువ వుండసాగాడు. శెలవు పూర్తవగానే మధురను వదిలేసి బెంగళూరు భార్యతోనూ, చిన్నకూతురితోనూ వెళ్లి పోయాడు.

కొన్ని రోజులు గడిచాయి. మధుర కిలకిలలు వసుంధర గొంతూ హనుమంతరావింట్లో వినపడుతున్నాయి.

“సాంబమ్మా! గోరింటాకు మెత్తగా రుబ్బు, మధుర తల్లి కాళ్లకూ, చేతులకూ పెట్టాలి. ఏమండీ, అలా బయట కెళ్ళినపుడు ద్రోణాచారి మువ్వల పట్టీలు తెచ్చాడో లేదో కనుక్కోండి. మధురా! ఇలా రా తల్లీ. నా దగ్గర కూర్చో. ఈ మంత్రం నేర్చుకో, అంటో “మావిద్విషావహై” అంటూ ఓసారి అట్లతద్దోయ్ ఆరట్లూ, ముద్దపప్పోయ్ మూడట్లూ” అంటూ మరోసారి “ఒప్పుల కుప్పా వయ్యారి భామా” అంటూ మరోసారి సంతోషంగా నేర్పటం విన్పిస్తున్నది. “ఊయల ఎక్కి అంత పెద్ద ఊపులు ఊగకు. కళ్లు తిరుగుతాయి” అంటూ ఉత్సాహంగా అటూ ఇటూ తిరుగుతూ మల్లె చెట్ల ఆకులు దూయించి పోస్తున్నది. “కొత్త చిగుళ్లు వెంటనే మొగ్గా వస్తాయి మధుర తల్లికి మల్లె మొగ్గలు చెండు కట్టి పెట్టాలి” అనుకోసాగింది వసుంధర.

# ఇసుకలో పడవ

కె. విరాజ్

. ఒక్కొక్కటిగా దీపాలు వెలిగి బయట ఆవరణంతా కాంతివంతం కావడం చూస్తూ వంశీ మాటలు వింటున్నాడు హరి. పోర్టికోలో ఆగిన ఆటోలోంచి ఇద్దరు అమ్మాయిలు దిగారు. రెస్టారెంట్ కిటికీ అద్దంలోంచి వాళ్లని చూసిన వంశీ వెంటనే లేచి బయటకువెళ్లాడు.

కూర్చున్న మూలటేబుల్ దగ్గర్నుంచి చుట్టూచూశాడు హరి. ఊరికి బయటగా ఉన్న విశాలమైన రెస్టారెంట్లో పెద్దగా జనం లేరు. ప్రేమికుల్లాంటివాళ్లు రెండు చోట్ల, అయిదారుమందితో ఒక కుటుంబం ఒకచోట ఉన్నారంతే. ఒకవైపు గోడకు తగిలించిన ఫ్యూచరిస్టిక్ పెయింటింగ్ వర్తమానంకోసం విసుగ్గా ఎదురుచూస్తున్నట్టుంది. మరోగోడకున్న రాజస్థాని క్లాసికల్ చిత్రంలోని గడ్డిమోపులు మోస్తున్నదంపతులు హాల్లోని ప్రేమజంటలవైపు జాలిగా చూస్తున్నారు.

'ఏమీ చెప్పకుండా ఇంతదూరం పట్టుకొచ్చాడు వంశీ. ఏదో వుంది. కాస్సేపట్లో సస్పెన్స్ విడుతుంది. ఆ విడగొట్టే వాళ్లెవరో ఇప్పుడే వచ్చినట్టున్నారు' అనుకున్నాడు.

వంశీ వాళ్లను టేబుల్ దగ్గరికి తీసుకొచ్చాడు. "ఈమె హెలీనా, తను సువర్చల. మన కాలేజీనే ఫోర్తియర్ యీసీయీ" అని పరిచయం చేశాడు. హెలీనామీదినుంచి కష్టపడి చూపులు తిప్పుకుని సువర్చల వైపు తిరిగాడు హరి. ఇద్దరూ చేతులుకలిపారు, హెలీనా చెయ్యి మృదువుగా చల్లగా వుంది.

హరి లేచి, సస్పెన్స్ తాలూకూ ఒత్తిడిని చలనంగామార్చి, జపనీస్ స్టైల్ లో ముందుకువొంగి "హాయ్, అయామ్ హరి, ఫైనల్ ఎంటెక్ మెకానికల్, వంశీ క్లాస్ మేట్ కమ్ రూమ్మేట్. వంశీ బయట చెప్పేవుంటాడు" అన్నాడు. అందరూ నవ్వుతూ కూర్చున్నారు. వాళ్లు ముగ్గరూ మెనుకార్డు'ను చూస్తూ చర్చించుకుంటున్నారు. వంశీ అటెన్షన్ అంతా హెలీనా మీదేవుంది.

'విషయమేమిటో రూముకెళ్లాకగానీ చెప్పడు వంశీ' అనుకుంటూ ఇద్దర్నీ పరిశీలనగా చూశాడు హరి. హెలీనా సన్నగా, పొడవుగా, లేతఎరుపు తెలుపూ కలసినరంగులో నాజూగ్గా ఉంది. ముంగురులతోసహా తీర్చిదిద్దిన గాంధారబుద్ధుడి మొహంలాగా ప్రశాంతంగాఉంది మొహం. పెయింటర్ కంటే లైన్ డ్రాయింగ్ వేసేవాడి డిలైట్. లేత నీలంరంగు దుపట్టా గుండ్రటిమడతలు రోమన్ అప్పర్ గార్మెంటులాగా కాంసెంట్రిక్ వలయాలుగా తిరిగి మెడనుంచి కిందికి వ్యాపించాయి. భృకుటి పైన సిమ్మెట్రికల్ గా అమరిన చిన్న నీలపుబొట్టు. మేకప్ బొత్తిగా లేకపోయినా చూసేకొద్దీ ఇంకా చూడాలనిపించే మొహం.

'ప్లేటో 'విశ్వలయ'ను మనిషికాపాదించి, కొలతలు నిర్ణయించి, మనిషి అందానికి మనిషే ప్రమాణాలేర్పరచుకున్నా, ఆ అందానికి అదే మనిషిని అచేతనుణ్ణి చేసే శక్తివుండడం వింతే. ఆదిమమానవుల్లో అందానికి గుర్తింపు ఉండేదా లేదా అన్నది ఏ శాస్త్రవేత్తా చెప్పినట్టులేదు' అనుకున్నాడు హరి. ఇదివరకే ఎక్కడో చూసినట్టుంది. చలనచిత్రపు నిశ్చల ఫ్రేముల్లాగా ఇప్పటికిప్పుడే అనేకసార్లు చూసినందువల్ల ఏర్పడిన 'డి–జావు' కాదుగదా' అనుకున్నాడు.

సువర్చలది పెద్ద యెర్రని ఫ్యాషన్ బొట్టుతో వెడల్పాటి మొహం. అందాన్ని మెరుగుపెట్టేవిధంగా కొద్దిపాటి అలంకారంతో స్టైలిష్ గా ఉంది. 'ఇప్పటి యుత్ దృష్టి పరంగా 'బాగున్నట్టే' లెక్క' అనుకున్నాడు.

మెనూ తేలి ఆర్డర్ వెళ్లింది. క్యాంపస్ విషయాలు, చదువులు, సాహిత్యం, భవిష్యత్తు కెరీర్ లాంటివన్నీ ఇష్టాగోష్టిగా మాట్లాడుకుంటూ డిన్నర్ పూర్తిచేశారు. తరువాత వాళ్లని ఆటో ఎక్కించి బై చెప్పి వంశీ, హరి రూముకి చేరారు.

రాత్రి పడుకున్న తరువాత సంభాషణ మొదలెట్టాడు హరి.

"యేంటి కథ, అందానికి పడిపోయావా. మనకాలేజీలోనే మీవాళ్లలోకూడా అందమైన వాళ్లున్నారుగా. అందంకంటే యెక్కువేదో వున్నట్టుంది ఆమెలో. అదేంటో తెలీటం లేదు. అయినా 'హెలీనా' అంటే మనమతంకాదుగా. అందులోనూ నువ్వు" అన్నాడు నవ్వుతూ.

"అందుకే నిర్ణయం తీసుకోవడానికి చాలా కాలం పట్టింది" సాలోచనగా అన్నాడు వంశీ

"నిర్ణయం తీసుకున్నట్టేగా, కాకపోతే యివాళ నాకు చూపించవు. లవ్ అట్ ఫస్ట్ సైటా, ఎన్నాళ్లకిందట? ఆర్నెల్లయుంటుందా? మర్చిపోయావుగాని సువర్చల మీచుట్టాలమ్మాయని యిదివరకోసారి పరిచయంచేశావు. తన హెల్ప్ తీసుకున్నావా?" అడిగాడు హరి

అన్నిటికీ తలవూపాక "అందమొకటే కాదు, మరొకటికూడా వుంది" అన్నాడు వంశీ.

"యింకేవీ అఖ్ఖర్లేదు, ఆ గ్రేస్ చాలు, చూస్తూ బతికెయ్యచ్చు. ఆర్నెల్లనుంచి నీలో మార్పు గమనిస్తున్నానుగానీ 'ప్రేమ'నుకోలేదు. అసలే నీ సామాజిక బ్యాక్ గ్రౌండ్ చాలా స్ట్రాంగ్. అంతే కాదు, ఈమెకు బొత్తిగా వ్యతిరేకం. గందరగోళమైపోతుంది. ఆలోచించావా?"

"నిజమే, చాలెంజ్ చాలా పెద్దది. అందుకే మొదటగా యిక్కడి ఎంకరెంబెన్సెస్ చాలావరకూ తగ్గించుకున్నాను. అసలుకథ యింకా ముందుంది"

"అందంకాకమరొకటుందన్నావు, యేంటది?" అడిగాడు హరి

వంశీనుంచి సమాధానంలేదు. ఏదో అలోచిస్తూ కళ్లుమూసుకునివున్నాడు.

బదులుగా కిటికీలోంచి చల్లనిగాలి వీచింది. ఇంటిముందున్న పున్నాగచెట్టు కొమ్మకదిలి వడలిన పూలపరిమళం గాలితోపాటు వచ్చి గదంతా నిండిపోయింది.

తెల్లవారుఝామున మెలుకువ వచ్చింది హరికి. రాత్రి నిద్రలో బ్రైన్ లో సెర్చ్ ఇంజన్ పనిచేసినట్టుగా, హఠాత్తుగా వాళ్లు హెలీనాని మొదటిసారి ఎప్పుడుచూశారో గుర్తొచ్చింది.

అది పోయినేడాది చివర్లో 'కాలేజీ డే' ఉత్సవాలు జరుతున్న సమయం. ఆసాయంత్రం ఆడిటోరియమంతా ఒకటే గోలగావుంది. ప్రేక్షకుల్లో జీవితంపట్ల ఆశావహులు ఎక్కువుండడంవల్ల అంతకుముందు వేసిన ట్రాజెడిడ్రామా నచ్చలేదు. బిటెక్ ఫైనలియర్ స్టూడెంట్స్ కొందరు వెనకచేరి అదేపనిగా అరిచి, ఈలలువేసి దాన్ని చివరిభాగం చేరకుండానే తెరదింపించేశారు. తరువాతి ప్రోగ్రామ్ ఇంకా మొదలవలేదు. స్టాప్ గ్యాప్ లో తెరవెనుక ఎవరో కొత్తగాయకుడు భయంభయంగా పాటపాడుతున్నాడు. రాత్రిభోజనాల సమయం కావడంతో అక్కడక్కడా కొంతమంది లేచి వెళ్లిపోతున్నారు.

లెక్చరర్లు, ఎంటెక్ వాళ్లుండే ముందువరసల్లో అంత అల్లరిగాలేదు. అక్కడ కూర్చున్న హరి గంటనుంచి వంశీ కోసం చూస్తున్నాడు. వంశీ మెకానికల్ బ్లాక్ వెనక తోటలో తన ఒక సంఘానికి చెందిన స్టూడెంట్స్ అనధికారిక మీటింగ్ కి వెళ్లాడు. ఇలాంటప్పుడే వివిధ సంఘాలకు చెందిన లీడర్లంతా క్యాంపస్ లో నిర్దేశిత స్థలాల్లో తమ సభ్యులతో మీటింగులు పెట్టుకుంటారు.

కాలేజీనిండా సంఘాలే. కులం, మతం, ప్రాంతం, భాష, అభిరుచులు, ఇంజనీరింగ్ బ్రాంచి, సీనియారిటి వీటినిబట్టి సంఘాలేర్పడి ఉంటాయి. సంఘాలమధ్య పూర్తి అడ్డుగోడలేమీ ఉండవు. మీటింగు దేనిగురించి అనేదాన్నిబట్టి సభ్యులు కలుస్తూంటారు, విడిపోతూంటారు. ఎవరి అజెండా వాళ్లదే. క్యాంపస్ విషయాల్లో పెత్తనంకోసం సంఘాలమధ్య నిరంతరపోరాటం జరుగుతూంటుంది. వీలైనంతవరకూ గొడవలురాకుండా చూసుకుంటారు. గొడవలొచ్చినప్పుడు గొడవనుబట్టి చీలిపోతూంటారు. ఒకవిధమైన ఆటవికన్యాయం నడుస్తూంటుంది. 'నాగరికత పెరిగేకొద్దీ మనిషి తన ఉనికిని అనేకరంగుల్లో పెంచుకుంటున్నాడా' అని ఆశ్చర్యపోయేవాడు హరి.

హ్యాండ్సంగావుండే వంశీ కాలేజీలో ఒక సంప్రదాయవర్గానికి ముఖ్యమైన నాయకుడు. క్యాంపస్లో చాలావరకు అతనివర్గందే పెత్తనం. అతనికి నాయకత్వం వారసత్వంగా వచ్చింది. అతని తండ్రి వందమైళ్ల దూరంలోవున్నవాళ్లవూర్లో స్థానిక నాయకుడు. ఆ చుట్టుపక్కల మోతుబరులంతా వాళ్లచుట్టాలే. అన్న హైదరాబాదులో, బావగారు బెంగుళూర్లోనూ వ్యాపారాలు నడిపిస్తున్నారు. వాళ్లంతా గొప్ప

సంప్రదాయవాదులు, గుళ్లూ గోపురాలకు ధర్మకర్తలు, సాంస్కృతిక సంఘాలకు పోషకులు. 'ధర్మాన్ని రక్షించు అది నిన్ను రక్షిస్తుంది' అని నమ్మేవాళ్లు. అభిజాత్యపు అహంకంటే నమ్మినదానిపట్ల నిబద్ధతవల్లే నాయకత్వపు బాధ్యతలు మోసేవాడు వంశీ. అతని వర్గం కాకపోయినా, ఒకే వూరివాడై చిన్నప్పట్నుంచి క్లాస్ మేట్ కావడంవల్ల హరి ఒక్కడే వంశీకి ఆత్మీయస్నేహితుడు, రూమ్మేట్. కుటుంబనేపథ్యం, అభిరుచి వేరవడంవల్ల హరి ఈ సంఘాల విషయాల్లో తలదూర్చడు.

హరి ఆలోచనల్లో మునిగివుండగానే వంశీ వచ్చాడు. కొంచెం అసహనంగా ఉన్నాడు. 'ఈసారి వంశీకి అతని వర్గంవాళ్లు క్లిష్టమైన బాధ్యతలే అప్పగించినట్టున్నారు' అనుకున్నాడు హరి.

స్టేజిమీద తెరలేచి తదుపరి కార్యక్రమం మొదలైంది. వెనకనుంచి వస్తున్న లలితగీతానికి అనుగుణంగా నలుగురమ్మాయిల బృందం సెమిక్లాసికల్ డ్యాన్సు చేస్తోంది. మధ్యలో ఒక పెద్ద దీపపుసెమ్మె వెలుగుతోంది. నలుగురూ జరీఅంచు తెల్లచీరలు కట్టుకుని నాట్యంచేస్తూ నిదానంగా సెమ్మెచుట్టూ తిరుగుతున్నారు. సంప్రదాయనృత్యం కాబట్టి గౌరవ సూచకంగా ప్రేక్షకులు గోలచెయ్యకుండా మాటల్లో మునిగిపోయారు. ఏదో అడుగుతూన్న హరికి వంశీ నుంచి సమాధానం లేకపోయేసరికి పక్కకి తిరిగి అతనివైపు చూశాడు. వంశీ దీక్షగా డ్యాన్స్ నే చూస్తున్నాడు. అతని దృష్టి ఆ నలుగురిలో ఒకరి మీదే ఉంది. ఆ అమ్మాయి తెల్లగా నాజూగ్గా ఉంది, నాట్యంలో భాగంగా అప్పుడప్పుడూ చిన్నగా అందంగా నవ్వుతోంది.

“ఆ కుడివైపు అమ్మాయిని చూడు, మిగతా ముగ్గర్తో పోలుస్తే ఆమె భంగిమల్లో చక్కగా వొదిగిపోతోంది” అన్నాడు వంశీ ఆమెనే చూస్తూ.

“అంతేకాదు, ఆ అమ్మాయి మిగతావాళ్లకంటే అందంగా ఉంది” అన్నాడు హరి నవ్వుతూ.

డ్యాన్స్ అయిన వెంటనే వంశీ లేచి వేగంగానడుస్తూ స్టేజి వెనకతలుపువైపు వెళ్లిపోయాడు. ఓ పావుగంట చూసి హరికూడా లేచి బయటికినడిచాడు. అప్పుడే వంశీ కాలేజి కల్చరల్ సెక్రటరి ప్రొఫెసర్ నాగేశ్వర్రావుతో మాట్లాడుతూ గ్రీన్ రూమ్ లోంచి బయటికొస్తున్నాడు. వెనక డ్యాన్స్ చేసిన నలుగురమ్మాయిలు డ్రెస్సులు మార్చుకుని వస్తున్నారు. కానీ వాళ్లతో 'ప్రభు' కూడా ఉన్నాడు. అతనికి వంశీకి బద్ధవైరం.

ఆరోజు వంశీ చూసింది హెలీనానే అని హరికి హఠాత్తుగా అర్థమయ్యింది. ఆర్నెల్ల తర్వాత ఇప్పుడు వంశీ, హెలీనాలలు ప్రేమలో వున్నారని తెలుస్తోంది. క్యాంపస్ లో, బయటా ఇలాంటి సంఘధిక్కారచర్యలను తీవ్రంగా వ్యతిరేకించే వంశీ తన స్వంతవిషయంలో ఈ నిర్ణయం తీసుకోవడం హరికి ఆశ్చర్యంగా అనిపించింది. అందుకే అంత రహస్యంగా ఉంచాడు కాబోలనుకున్నాడు. 'పైమెరుగులకు ఆకర్షింపబడే బలహీనుడు కాదు వంశీ, సంప్రదాయనమ్మకాల పట్ల గట్టి నిబద్ధతవున్నవాడు. ఐనా ఆమె అందానిది పైచేయి అయ్యిందా? లోపల్లోపల అతను చాలా ఘర్షణపడివుండాలి' అనుకున్నాడు హరి.

ఇలాంటిది ఊహించలేక పోయినా ఈ ఆర్నెల్లలో వంశీలో చాలా మార్పురావడం హరి గమనిస్తూనే ఉన్నాడు. క్యాంపస్ లో తన వర్గ, మతసంబంధమైన కార్యకలాపాలను బాగా తగ్గించుకున్నాడు. నాయకత్వ బాధ్యతలనుంచీ తప్పించుకున్నాడు. ఒక్కడే ఎక్కడెక్కడికో వెళ్లొస్తున్నాడు. చివరికి నెలకిందట హాస్టల్ వదిలేసి ఊళ్లో రూము తీసుకుని హరినికూడా లాక్కొచ్చాడు. అప్పటివరకూ చదువుతున్న అన్నిమతాల వేదాంతగ్రంథాలన్నీ ఒక అట్టపెట్టెలో పెట్టి అటకమీదకి ఎక్కించాడు. చదువుమీద, ఉద్యోగప్రయత్నాలమీద శ్రద్ధ పెంచాడు. క్యాంపస్ సెలెక్షన్స్ లో ఒకటి, చెన్నైలో రెండు ఇంటర్వ్యూలు అటెండయ్యాడు. నిజానికి వంశీకి ఉద్యోగం చేయాల్సిన అవసరమే లేదు. వీటన్నిటికీ ఏవో కారణాలు అందరికీ చెప్పాడు.

హెలీనా అసలు కారణమని హరికి ఇప్పుడు తెలుస్తోంది. 'క్రిస్టఫర్ మార్లో వర్ణించిన వెయ్యి నౌకలను యుద్ధానికి దించిన 'హెలెన్ ఆఫ్ ట్రాయ్' వదనారవిందం ఆమెది. ఐనా వంశీలాంటి యుద్ధపిపాసిని శాంతచిత్తుడిగా మార్చిందంటే, ఆమె చిత్తం యుద్ధనౌకలకు అనుమతివ్వని శాంతసముద్రమయ్యుండాలి' అనుకున్నాడు.

★ ★ ★

పరీక్షలు మూడునెల్లున్నాయనగా అనుకోకుండా వంశీ చెల్లెలు లత పెళ్లి కుదిరింది. ఎన్నారై డాక్టరు సంబంధం. పెళ్లి రెండువారాలుండనగా వంశీ వాళ్లవూరు బయల్దేరాడు. సెండాఫ్ ఇవ్వడానికి హరి రైల్వేస్టేషన్ కెళ్లాడు. రైలుకోసం ఎదురుచూస్తూ ఒక మూల బెంచిమీద కూర్చున్నారు.

"లత పెళ్లైపోతే ఇక నువ్వే మిగుల్తావు. ఆరకంగా నీకు కొంత వెసలుబాటే. యిప్పుడు మీ అమ్మకేమైనా హెలీనా విషయం చెబుతావా" అనడిగాడు హరి

"పెళ్లైపోయాక చూడాలి" అని బదులిచ్చాడు వంశీ

"నీకు వుద్యోగమొచ్చాక మీపెళ్లనుకుంటున్నారా, యింతకూ హెలీనాకు యెప్పుడు ప్రొపోస్ చేశావు?"

"ఆమధ్యనొకసారి రెండ్రోజులు 'రిషివ్యాలి' వెళ్లొచ్చాను గుర్తుందా. తనక్కడే చదివింది, యేదో సర్టిఫికెట్ తెచ్చుకోవడానికి వెళ్తుంటే నేనూ వెళ్లాను. అక్కడే, పచ్చటి ఆ పరిసరాల్లో నా ప్రేమసంగతి చెప్పాను"

"మీ డాడీవాళ్లు కాంప్రమైజయ్యేది యిప్పట్లో జరగదేమో. మీ అమ్మకూ కష్టమే, వాళ్లకు మీకూ అన్నిట్లోనూ తేడాయే. అసలే అమ్మకుపూజలెక్కువ"

"హెలీనా వాళ్లమ్మ బుద్దిస్ట్, నాన్న చాలాకాలం రిషివ్యాలిలో ఉన్నారు. వాళ్లది మతాంతర వివాహం, అదికాదు అసలు విషయం" అని ఇంకా ఏదో చెప్పబోయేంతలో ప్లాట్ ఫాం చివర ప్రవేశిస్తున్న రైలు కనబడింది. వంశీ లేచి నిలబడ్డాడు. "తరువాత మాట్లాడదాం. నువ్వు నాల్రోజులు ముందుగా రా, అమ్మ గట్టిగా చెప్పమంది. నాక్కూడా నీతోడవసరం" అన్నాడు రైలువైపు కదులుతూ.

వారం తర్వాత హరికి పోస్టులో లత పెళ్లి శుభలేఖలు రెండు వచ్చాయి. ఒకటి హెలీనా వాళ్లకి. 'వాళ్లు రారనుకో, అయినా పర్సనల్ గా ఇంటికెళ్లి యివ్వు' అని ఫోన్లో హరికి చెప్పాడు వంశీ. మొదటిసారిగా వాళ్లింటికి వెళ్తున్నానని ఏదైనా గిఫ్ట్ తీసుకెళ్తే బావుంటుందని బాగా అలోచించి ప్రేయర్ రూములో కొవ్వొత్తులు వెలిగించే కంచు స్టాండు కొని పట్టుకెళ్లాడు హరి.

హరి ముందుగానే ఫోన్ చేసి వెళ్లడంతో హెలీనా కుటుంబసభ్యులంతా అతన్ని ఆదరంగా అహ్వానించి డిన్నర్ కి ఉండిపోవడానికి అతన్ని ఒప్పించారు. అందరూ కాస్సేపు హల్లో కూర్చొని మాట్లాడుకున్నారు. తను తెచ్చిన క్యాండిల్ స్టాండ్ ని ప్యాకింగ్ తెరిచి వాళ్లనాన్న చేతిలో ఉంచి "మీరు ప్రేయర్ చేసుకునేప్పుడు వెలిగించుకోవడానికి బావుంటుందని" అన్నాడు హరి. వాళ్లంతా చిరునవ్వుతో ఒకసారి ఒకరివైపు ఒకరు చూసుకున్నారు.

అతను గిఫ్ట్ ఇవ్వడంపట్ల నొచ్చుకుంటూనే "చక్కటి పూలడిజైనుతో చాలా అందంగా ఉంది, దీన్ని యెక్కడుంచాలో చూద్దాం" అని వాళ్ల నాన్న దాన్ని హాల్లో టేబుల్ మీద పెట్టాడు.

వాళ్లింట్లో అందరూ స్నేహితుల్లాగా సరదాగా ఉండడం కనిపించింది. చిన్న మధ్యతరగతి మండువాఇల్లు. మండువాలో పూలకుండీలు అందంగా అమర్చివున్నాయి. హెలీనా, ఆమె తమ్ముడు అతనికి ఇల్లూ, చుట్టూవున్న పూలతోట చూపించారు. గోడలకు మానవ మూలాల్ని సూచించే ఎత్నిక్ పెయింటింగులు, మూలల్లో మట్టిబొమ్మలూ ఉన్నాయి. ఒకరూమంతా పుస్తకాల బీరువాలతో నిండివుంది.

వాళ్లింట్లో ఎక్కడా పూజగది, దేవుని బొమ్మలు, విగ్రహాలు, మతసంబంధమైన చిహ్నాలుగాని లేకపోవడం హరి ఆలస్యంగా గమనించి ఆశ్చర్యపోయాడు. అలాగని వీటిని వ్యతిరేకించేవికూడా ఏవీ లేవు. అతనికనేక సందేహాలు కలిగాయి. 'తరువాత వంశీనడగా'లనుకున్నాడు.

భోజనంచేసాక సెలవుతీసుకుని రూముకువెళ్లాడు. వాళ్లిల్లు, ఇంట్లో మనుషులు తను అప్పటివరకూ చూసిన కుటుంబాలకంటే ఏదో భిన్నంగా ఉన్నట్టు అనిపించింది. తనని వంశీ స్నేహితుడిగా కాక 'హరి'గానే వాళ్లు గౌరవించడం గమనించాడు. తనలో ఎప్పుడూ ఉండే అభద్రత, అలజడుల సవ్వడి తనకు తెలియకుండానే మాయమై చాలాసేపు మనసంతా తేలికైన అనుభూతి కలిగింది హరికి.

★ ★ ★

అనుకున్నట్టుగానే లత పెళ్లికి నాలుగురోజులు ముందే వెళ్లాడు హరి. పెళ్లి గ్రాండ్ గా, హడావుడిగా జరిగింది. వంశీ వీలైనంతవరకూ వాళ్ల చుట్టాల్తో ఎవరితోనూ కలవకుండా మౌనంగా పనుల్లో నిమగ్నంకావడం హరి గమనించాడు. 'పాపం కుర్రాడికి వొకపక్క దగ్గర్లో పరీక్షలు' అని వాళ్లమ్మ నాలుగైదుసార్లు ఎవరితోనో చెప్పడం హరికి వినిపించింది.

పెళ్లికార్యక్రమాలన్నీముగిసి లత వెళ్లిపోయాక ఒక సాయంత్రం వంశీ, హరి వాళ్లవూరికి దగ్గర్లో ఉన్న నదివొడ్డుకు వెళ్లి గట్టుమీద కూర్చున్నారు. అది వాళ్లకు చిన్నప్పట్నుంచీవున్న అలవాటు. నదిలో నీళ్లు బాగావున్నప్పుడు వాళ్లు నౌకవిహారానికి కూడా వెళ్తూండేవాళ్లు. నది వెడల్పు తక్కువ, ఎత్తైన గట్లు. నీళ్లు సన్నటిపాయగా పారుతున్నాయి. గట్టుదగ్గరగా ఒక పడవ ఇసుకలో కూరుకుని నిలబడివుంది.

"ముందుచూపుతో బంధాలు కొన్ని బాగానే తెగ్గొట్టుకున్నట్టున్నావు, చుట్టాల్తో సరిగ్గా మాట్లాడలేదని నీమీద ఫిర్యాదులు చాలా వచ్చాయి... హెలీనా విషయం యింకా అమ్మతో చెప్పినట్టులేదుగా" అన్నాడు హరి.

"అమ్మ అలసిపోయివుంది. చెల్లిని మిస్సవుతోంది. నాక్కూడా మూడ్ బాగాలేదు. వో పదిరోజుల తర్వాత మళ్లీవస్తాను" అన్నాడు వంశీ నిదానంగా

"అంత చక్కగావున్న అమ్మాయి దొరికితే మతాంతర వివాహం యెవరైనా చేసుకుంటారు. అందులో నీగొప్పేదో వుందని మురిసిపోకు. మరి అటువైపు కూడా హెలీనాను తయారుచేస్తున్నావా. ఆమె కొంత అడ్జస్ట్ అయినా మీయింట్లో ట్రోజన్ ఘర్షణ తగ్గుతుంది కదా"

"ఆమెనేమీ తయారుచెయ్యక్కర్లేదు. నీకు చెప్పలేదు, అసలు మా పరిచయమే చేదుగా జరిగింది. నేను మొదటగా ఆడిటోరియుమ్ వెనక ఆమెను కలిసి అభినందించినప్పుడు అక్కడ ప్రభు వున్నాడు. సహజంగానే నేను అతనివర్గానికి చెందిన అమ్మాయితో మట్లాడ్డం అతనికి నచ్చలేదు. అది మన క్యాంపస్ సంప్రదాయం కదా. అతను నన్ను నెగెటివ్ గా ఆమెకు పరిచయం చేసాడు. యిక ఆమెతో మాట్లాడ్డం అదే ఆఖరనుకున్నాను"

"యింటెరెస్టింగ్. ఆ తరువాత నువ్వు చాలాకష్టపడి ఆమెను ప్రసన్నం చేసుకునుండాలే?

"కొంచెం అదృష్టంకూడా కలిసొచ్చింది. వొకరోజు నేను మా కజిన్ కూతుర్ని రిషివ్యాలి స్కూల్లో చేర్చడానికి వెళ్లాను. అదేరోజు తనూ అక్కడ చదువుతున్న తమ్ముణ్ణి చూడ్డానికొచ్చి కనపడింది. నేనామెను చూసికూడా చూడనట్టుంటే ఆమే పలకరించింది. నాకాశ్చర్యమైంది. తిరిగి వచ్చేప్పుడు అనుకోకుండా తిరుపతివరకు వొకే రైల్లో మాట్లాడుకుంటూ వచ్చాం. నాకింకా అనుమానం తీరక ప్రభుగురించి అడిగాను. ప్రభు నాగురించి వ్యతిరేకంగా చెప్పడం నిజమేనని, యింకా కొంతమందికూడా అలాగే చెప్పారని చెప్పింది.

"తను నమ్మలేదని చెప్పిందా?" అడిగాడు హరి.

"లేదు, అదే చిత్రం. నా వర్గనాయకత్వం, వాళ్లపట్ల నా వ్యతిరేకత అన్నీ తెలుసని, ఐతే అవన్నీ నాసమస్యలని, ఆ సమాచారాన్ని తను నిరంతరం మోసే అవసరం లేదనీ చెప్పింది. అలాగే ప్రవర్తించింది కూడా" చెప్పాడు వంశీ.

"ఆ క్షణంలోనే నీకు జ్ఞానోదయం, ప్రేమ రెండూ కలిగుండాలి"

"మొదట లజ్జ, ఆపైన ఆ రెండూ కలిగాయి. ఆతరువాత వాళ్లగురించి తెలుసుకున్నాను. హెలీనావాళ్లేమతమూ పాటించరు. ఆచారాలసలే వుండవు. పద్దతులుకూడా స్వచ్ఛందంగా వుంటాయి. నువ్వు గమనించేవుంటావు"

"నిజమే. వాళ్లంటే వింతమనుషులనుకుందాం. మరి యీ నమ్మకాలు, ఆచారాలు, సిద్ధాంతాలు యివేవీ లేకుండా మనిషి బతగ్గలడంటావా?"

"అసలు మనిషి బతకడానికి అవన్నీ అవసరమా?' అంటారు వాళ్లు. మొదటిసారి వాళ్లింటికెళ్లినప్పుడు అసలలావుండొచ్చా అని నాక్కూడా ఆశ్చర్యమైంది. రోజువారి పనులు మినహాయిస్తే మిగతా టైమంతా చాలా సింపుల్ గా తమకు నచ్చినట్టుగా వుంటారు. యేపనైనా యిష్టంగా, శాంతంగా చేసుకుంటారు. యెప్పటికప్పుడు సహజవిచక్షణ తప్ప, తలలో యేబరువూ మోస్తున్నట్టు కనబడరు"

"పవిత్రమనబడే జ్ఞానాన్ని మనుషులమీద రకరకాలుగా రుద్దకముందు, ప్రాచీనప్రపంచంలో మనుషులు యిలా సహజంగా వుండేవారని యెక్కడో చదివాను. అప్పుడది నమ్మశక్యంగా అనిపించలేదు. యిప్పుడు ప్రత్యక్షంగా చూసినా నమ్మలేకపోతున్నా"

"హెలీనా అందం మొదట్లో నన్ను ఆకట్టుకున్నమాట నిజమే. నేను తనతో ప్రేమలో పడడానికి తన చక్కదనం వొక్కటే కారణం కాదు. ఆమెను మొదట స్టేజిమీద చూసినప్పుడు యింత స్వచ్ఛంగా యెవరైనా నవ్వగలరా అని ఆశ్చర్యపోయాను. కానీ తనతో పరిచయం పెరిగినకొద్దీ తన వ్యక్తిత్వంలోని సరళత నన్ను పునాదులతోసహా పూర్తిగా కదిలించింది"

"కదలిపోతిని, కరిగిపోతిని, కానరాకే కలసిపోతిని అన్నాడు శ్రీశ్రీ" అని నవ్వాడు హరి

"హెలీనా మానసికస్వేచ్ఛ దగ్గర్నుంచీ చూసినకొద్దీ నాచుట్టువున్న ఊబిలో నేనెంత లోతుగా కూరుకుపోయానో, అనవసరమైన బరువు యెంతమోస్తున్నానో అర్థమైంది. ఆర్నెల్లనుంచీ ప్రయత్నిస్తూంటే సగం బయటికొచ్చానేమో. అసలు మనుషులంతా అలావుంటే యీ ప్రపంచం యెంతబావుంటుందా అనిపిస్తుంది" అన్నాడు వంశీ.

"ఆ చైతన్యం మనిషియొక్క సుదూరస్వప్నం. ఐనా నీలో మార్పు యిలాంటిదని అస్సలు వూహించలేకపోయాను" అన్నాడు హరి.

వంశీ గడ్డంకింద చేతులు పెట్టుకుని ఇసుకలో కూరుకునిపోయిన పడవనే చూస్తున్నాడు. "యీ పడవమీద మనకొక అడ్వెంచర్ అయ్యింది గుర్తుందా?" అని అడిగాడు.

"యెందుకు గుర్తులేదూ... ఆరోజు వెన్నెలరాత్రి యిలా ఇసుకలోకూరుకున్న పడవమీదే చెరోవైపు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ అలాగే నిద్రపోయాం. అర్ధరాత్రి మెలుకువొచ్చి చూస్తే పడవ నదిలో దిగువనెక్కడో నీళ్లపై తేలుతూవుంది. రాత్రెప్పుడో వరదనీరొచ్చి పడవను యిసుకలోంచి నీళ్లల్లోకిలాగేసింది. యెలాగో వొడ్డుకి చేర్చి గట్టెక్కి చాలాదూరం నడుచుకుంటూ వచ్చాం. కానీ గొప్ప అనుభవం" అన్నాడు హరి నవ్వుతూ.

"పడవకు ఎప్పుడూ నీళ్లలోనే తేలుతూవుండడమే సహజం లక్షణం, ఇసుకలో కూరుకుపోయివుండడం కాదు. గతంలో కూరుకుపోకుండా వర్తమానంలో తేలుతూ హాయిగా గడపడం మనిషి లక్షణం. అప్పుడప్పుడూ వరదలు మన కళ్లు తెరిపిస్తూంటాయి" అన్నాడు వంశీ చిన్నగా నవ్వి

"అయితే హెలీనా సౌందర్యపువరద నీ కళ్లు తెరిపించిందంటావు" అన్నాడు హరి లేచి నిలబడి పెద్దగా నవ్వుతూ.

“ఈ వరదనీరు స్వచ్ఛమైందికూడా” అని నవ్వి వంశీ కూడా లేచాడు.

చంద్రుడు పైకొచ్చాడు. వెన్నెలపెరిగి దారి బాగాకనబడ్డం మొదలైంది.

"పద, ఆలస్యమైంది, మనకోసం చూస్తూంటారు" అని గట్టు దిగాడు హరి.

# చింతల్లికి పండగ వచ్చింది     సువర్ణ మారెళ్ళ

సావిత్రి అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటోంది. తల దువ్వుకుంటూ ఉందనే పేరేగాని ఆలోచన ఎక్కడో ఉన్నట్టుగా ఉంది ఆమె ముఖం.

ఈ మధ్యే మనవలతో మాట్లాడటం కోసం, వారి ఫోటోలు, వీడియోలు చూడటం కోసం ఫేస్బుక్, ఇతర సోషల్ మీడియాలు ఉపయోగించటం నేర్చుకుంది. అలా ఈ రోజు ఫేస్బుక్ లో ఒక పోస్ట్ ఆమెను ఇలా ఆలోచనలో పడేసింది.

అరవై ఏళ్ళు దగ్గర పడుతున్నా కూడా అక్కడక్కడ వచ్చిన రెండు, మూడు తెల్ల వెంట్రుకలు మినహా మిగతా జుత్తు అంతా నిగనిగలాడుతూ నల్లగా ఉంటుంది. జుత్తు ముడి వేసుకుంటే చాగంటి కోటేశ్వరరావు గారు అమ్మవారి 'కబరీబంధని' వర్ణించినట్టే భుజాలకి అటూ ఇటూ తగిలేటంత పెద్దదిగా ఉంటుంది. జుట్టుని జడలా వేసుకుంటే పిరుదులు దాటి వచ్చి, నల్ల త్రాచు పాము వీపుమీద పాకుతున్నట్టు ఉంటుంది.

ఆమె కోడలు, కూతురుతో సహా వయసులో ఉన్న ప్రతీ ఆడపిల్ల ఆ జుత్తు చూసి, అయ్యో అలాంటి జుత్తు నాకులేదే అని బాధపడకుండా ఉండరు అంటే అతిశయోక్తి కాదు. ఉండదూ మరీ, కెమికల్స్ ఉన్న షాంపూ కాకుండా చిన్నప్పటి నుంచి మందార నూనె, కుంకుడు కాయలు , షీకాయ ఉపయోగించి సంరక్షించుకున్న జుట్టాయే.

జుట్టు విషయం ఎప్పుడు గుర్తుకు వచ్చినా ఆమె చిన్నతనంలో వాళ్ళ పనిమనిషి చింతల్లి గుర్తుకు రావడం మానదు తనకి.

★★★★★★ ★★★★★★ ★★★★★

అప్పుడు సావిత్రికి ఆరేళ్ళు ఉంటాయి. అప్పుడప్పుడే ఊహ వస్తూ ఉండటంతో చుట్టూ కనిపించే కొత్తయిన, వింతైన విషయాల గురించి ప్రశ్నలు వేస్తూ దొరికిన జవాబుల ద్వారా వచ్చిన జ్ఞానాన్ని బుర్రలో నిక్షిప్తం చేస్తోంది.

తాతల నాటి ఆస్తి, వంశపారంపర్యంగా వస్తున్న కరణీకం. డబ్బు వల్ల, అంతకు మించి మాట మంచితనం వల్ల, ఆ కుటుంబం అంటే ఆ ఊరి వారికి గౌరవం. దానితో పెద్ద మండువా ఇల్లు, పాడి, పంట ఇలా అన్ని పనులు చూసుకోవడానికి నిరంతరం పని వాళ్ళు ఉండేవారు. ఆరురుగురి మగ పిల్లల తరవాత సావిత్రి ఏకైక ఆడ సంతానం. ఇంకేముంది, ఆమెను ఆ ఇంటి మహాలక్ష్మి అని చాలా గారాబంగా చూసుకునేవారు. ఆమె నిరంతరం చక్కటి పట్టు పావడా వేసుకుని, కంఠానికి 'కంటి' నుంచి పాదాలకు 'పట్టి ' వరకు అన్ని ఆభరణాలు ధరించి సర్వాభరణ భూషితవలే ఉండాల్సిందే. ప్రతీ వారం సావిత్రికి చక్కగా నలుగు పెట్టీ, తలంటు పోయడానికి చింతల్లి రావడం రివాజు.

ఆ మాటకొస్తే ఒక సావిత్రికే కాదు ఆ ఊరిలో కాస్తో కూస్తో డబ్బు ఉన్నోళ్ళ ఆడపిల్లల సౌందర్య పోషణకు చింతల్లిదే బాధ్యత. చక్కగా ఒంటికి నలుగు పెట్టి, జుట్టుకు నూనె పెట్టీ స్నానం చేయించడంలో చింతల్లితో పోటీ పడేవారు ఆ చుట్టు ప్రక్కల ఊర్లలోనే లేరని పేరు.

ఇప్పటివారికి అర్ధమయ్యేలా చెప్పాలంటే ఇప్పుడు బ్యూటీ పార్లర్ లో హైర్ స్పా, బాడీ మసాజ్ అని అంటుంటారు కదా అలాగన్నమాట. వారానికో, పది రోజులకో వారి వారి వీలుని బట్టీ ఆమెను పురమాయిన్చేవారు. పుష్పవతి అయిన పిల్లకి స్నానం అయినా, పెళ్లి కూతురి మంగళ స్నానానికి అయినా, బాలింతకు పురిటి స్నానం అయినా చింతల్లి చేయించాల్సిందే.

రివాజుగా ఆరోజు చింతల్లి రావలసిన రోజు. సావిత్రి కడుపు నిండా చల్దన్నం తిని, ఆమె కోసం ఎదురు చూస్తోంది. పండగ దగ్గర పడటంతో ఇంటికి సున్నాలు దగ్గరుండి వేయిస్తున్నాడు సావిత్రి పెద్దన్నయ్య.

ఉగాది ముందు వచ్చే కొత్త అమావాస్య పండుగ అంటే ఆ ఊరికి పెద్ద పండుగే. ఆ రోజు తిరునాళ్ళు చాలా వైభవంగా జరుపుకుంటారు. రాత్రి వీధిలో తెరలు కట్టి సినిమాలు, హరికథలు, కచేరీలు ఒకటే హడావిడి. అమావాస్య తో మొదలైన ఈ హడావిడి, శ్రీరామనవమినాడు సీతారాముల కళ్యాణంతో పూర్తవుతుంది.

కొత్త అల్లుళ్ళు సంక్రాంతి పండక్కి అయినా రావడం మానేస్తారేమోగానీ ఈ పండక్కి ఖచ్చితంగా వస్తారు. ఊరులో పండగ ముందు గుమ్మానికి పసుపు, గోడకు సున్నంలేని ఇల్లు ఉండదంటే నమ్మాలి. ఎవరికి ఉన్నంతలో వారి కుటుంబాలకి కొత్త బట్టలు కొనుక్కుని, పిండి వంటలు వండుకునే రోజులు కూడా అవే.

చింతల్లి రావడం అల్లంత దూరంలో నుంచి చూసిన సావిత్రి పెద్ద అన్నయ్య, గుండుతో ఉన్న చింతల్లిని పలరించినట్టుగా..

" ఏం చింతల్లి నీకు అప్పుడే పండగ వచ్చేసినట్టు ఉంది, గుండు కొట్టించేసావు" అని పరిహాసమాడి, సున్నం వేసే పని వాళ్ళవైపు చురుగ్గా చూసి

" చూడండయ్యా అప్పుడే చింతల్లి గుండు కొట్టించుకుంది. పండగ ఎన్నో రోజులు లేదని తెలియట్లేదా? ఇంకా బయటి గోడలకు సున్నం వేయడమే అవలేదు. ఇంకా ఇంటి లోపల గోడలకి, గొడ్ల సావడికి వెయ్యాలి . ఊ.. ఊ.. కానీయండి త్వరగా" అని వారిని తొందరబెట్టాడు.

చింతల్లి అతని మాటలకి తన నున్నటి గుండు ఒకసారి తడుముకుని, మొహమాటంగా ఒక నవ్వు నవ్వి,

" బుల్లమ్మాయిగారు పెరడులో ఉన్నారా బాబు?"

అని అడిగి సమాధానం కోసం ఎదురు చూడకుండా సరాసరి పెరడులో వేడి నీళ్ళు కాగుతున్న గాడి పొయ్యదగ్గరకు వెళ్ళిపోయింది.

అక్కడే ఓ మూల, జామ చెట్టుకింద ఏదో ఆడుకుంటోంది సావిత్రి. వచ్చింది చింతల్లి అని గుర్తు పట్టడానికి సావిత్రికి ఒక నిమిషం పాటు పట్టింది. కాదు మరీ!! నిన్నటి వరకు ఉన్న జానెడు మందంతో, భూమికి మూరెడు తక్కువ పొడవుతో నిగనిగ లాడుతూ కొండ చిలువంత జడ పోయి నున్నటి గుండు కనిపించేసరికి గుర్తుపట్టడం కష్టమే మరి.

" అమ్మాయిగోరు, అమ్మ కి నేను వచ్చానని చెప్పండమ్మా!! " అని చెప్పి కొంగులో పోసి తెచ్చిన ఎండబెట్టిన ఉసిరికాయలు, మందారాలు, ఇంకా ఏవేవో తీసి ప్రక్కన గిన్నిలో వేసి కుంపట్లో బొగ్గులు రాజేసింది.

ఈ లోపల సావిత్రి, వాళ్ళమ్మ, వాళ్ళ అత్త నూనె, నలుగు పెట్టడానికి సరిపడా సామానులుతో అక్కడకి వచ్చారు.

సావిత్రి వాళ్ళమ్మ చింతల్లినీ చూసి పలకరింపుగా

" అదేమిటే చింతల్లి అప్పుడే పండగొచ్చేసిందా ఏమిటే? గుండు చేయించేసుకున్నావు? ఈ సారి ఎవరికి ఇచ్చావే నీ జుత్తు సవరానికి. ఈసారి మా సావిత్రికి అడుగుదాం అనుకున్నాను " అని అడిగింది.

" అయ్యో అమ్మా!! మన బుల్లెమ్మగోరి కి ఎందుకమ్మా సవరాలు. బారెడు జుట్టు నిక్షేపంగా పెరుగుతుంది. నేను సెప్పినట్టుగా మొదటి ముద్దలో కరివేపాకు పొడేసి ఎట్టండి. ఇదుగో చక్కగా నేను కాస్తున్న ఉసిరి, మందారం కలిపిన ఈ తైలం రోజూ పట్టించడి సాలు ఏడాది తిరక్కుండానే పిల్లకన్నా జడ పొడుగవ్వకపోతే సూడండి" అని ఒక ప్రక్క సమాధానం చెబుతూనే రాజేసిన కుంపటి మీద మట్టి పాత్ర పెట్టీ, కొబ్బరి నూనె పోసి, తెచ్చిన సంబారాలన్ని అందులో వేసింది.

ముక్కాల పీట మీద కూర్చున్న సావిత్రి దగ్గరకు వచ్చి ఆమె వంటికి నూనె రాసే పనిలో పడింది. బాగా మర్ధనా చేస్తూ, మళ్ళీ చెప్పటం మొదలు పెట్టింది.

" అది మన శెట్టి గారి సిన్నమ్మాయి కి ఆరునెలల క్రిందట టైఫాయిడ్ వచ్చినాది కదమ్మా, ఆ పలాన జుట్టంతా ఊడిపోయి గొఱ్ఱె తోక మాదిరి అయ్యి కూర్చుంది. అసలే పెళ్ళికావలసిన పిల్ల, అమ్మగోరు చానా బెంగెట్టేసుకున్నారు. ఈ పాలి నీ జుట్టు మా చిన్నమాయికి సవరానికీ ఇయ్యవే చింతల్లి అని పోయిన నెలలోనే అడిగారమ్మా. అందుకే ఈపాలి ఆరికే ఇచ్చేశాను. "

అని చెప్పి సున్నిపిండి సావిత్రి ఒంటికి పట్టించి గట్టిగా రాస్తూ ఒళ్ళు నలవడం మొదలు పెట్టింది.

"అయినా అదేమీ చొద్యమే ఎప్పటినుంచో ఎరువులేసి పెంచినట్టు ఆ నూని, ఈ నూని పోసి పెంచి ఇలా ఒక్కసారిగా సవరానికి ఇచ్చేయ్యడం" అని బుగ్గలు నొక్కుకుంటూ అంది సావిత్రి వాళ్ళ అమ్మ.

" నాకాడ ఒకటే మాట అమ్మా!! ఇనుకోండి. మీ ఉన్నోల్లకి కష్టకాలం వస్తే, ఉన్నపళంగా ఒంటి మీద బంగారం కుదవ పెట్టి పబ్బం గడుపు కుంటారు. కానీ మాబోటాల్లకు సింగారం అయినా, బంగారం అయినా ఈ ఎంట్రుకలే కదమ్మా. ప్రతీ రోజూ పచ్చడి మెతుకులు తిన్నా, ఈ పండగ పూటయిన పరమాన్నం వండుకుని, కుర్రోళ్ళకి కొత్త గుడ్డ కొనివ్వలేకపోతే ఇక నాది అమ్మతనం ఎట్టా అవుతాది. ఒకలో ఇద్దరో కాదు కదమ్మా ఐదుగురు సంతానం ఆయే నాకు. గుడిసె ప్రక్కన ఉన్న స్థలంలో కూర గాయాలు, పాదులు ఏసి వారం వారం సంతలో అమ్ముకొస్తే ఏటికేడాది కూటికి జరిగిపోద్ది. మీలాంటి మారాజులు ఇచ్చే సొమ్ముతో ఇల్లు గడిచి పొద్ది. ఏడాదికి ఒకపాలి వచ్చే పడక్కి ఖర్చులుకి ఏడ నుండి వత్తాయి తల్లీ, ఏదో దేవుడు కరుణించి గమ్మున పెరిగే ఈ ఎంట్రుకులు ఇచ్చాడు, వాటంగా నలుగు పెట్టే విద్దె ఇచ్చాడు. అవే ఇలా అక్కరకొస్తున్నయి" అని తన గుండుకు అసలు కథ చెప్పింది చింతల్లి.

ఒళ్ళు నలవడం పూర్తి అయిపోవడంతో, గాడి పొయ్యిమీద కాగుతున్న వేడినీటిని బకెట్లో పోసి సమంగా చన్నీళ్ళు కలిపింది. ముందుగా కొట్టి, వేడి నీళ్ళు పోసి నానపెట్టి ఉంచుకున్న కుంకుడు కాయలపులుసు సిద్ధం చేసుకుంది చింతల్లి .

సావిత్రికి కళ్ళలో పడకుండా తల రుద్దడం మొదలు పెట్టింది. ఆమెకు సాయంగా సావిత్రి వాళ్ళ అత్త కుంకుడి పులుసు పోస్తోంది.

అలా ఓ రెండు నిముషాలు మౌనంగా ఉన్నారో, లేదో, సావిత్రి వాళ్ళ అత్త మొదలెట్టింది.

" అవునే చింతల్లి, ఆడాళ్ళకి జుట్టు అయిదోతనం కదా? మరి నువ్వు ఇలా పెరిగిన ప్రతీసారీ గుండు కొట్టించేస్తావు. నీకు ఏమి తప్పు చేస్తున్నట్టు అనిపించదా?" అంది.

ఊపిరి బిగబట్టి జుట్టుని నురుగు వచ్చే వరకు రుద్ది, తల మీద వేడినీళ్లు దిమ్మరించి ఊపిరి పీల్చుకుంది.

ఆ తరువాత మళ్ళీ రెండోసారి తల రుద్దడం మొదలు పెడుతూ చెప్పడం మొదలు పెట్టింది.

"అమ్మా!! నేనేమి కానిపని సెయ్యట్లేదు. పది రూపాయలు ఎక్కువిస్తారన్నా కూడా సరదాల కోసం అడిగితే, నా జుత్తు ఎవరికీ ఇయ్యబోను నేను. ఒంటికి వచ్చిన జబ్బు మందులు, మాకులతో పోద్ది గాని, మనోవ్యాధికి మందు ఉండదమ్మా!!

ముందు ముక్కెంగా ఎంట్రుకులు నిండుగా ఉంటేనే ఆడాల్లకి ఆత్మ గౌరవం కదమ్మా!! ఏదో జబ్బు చేసో , మరేదో కారణం చేతో వాటిని కోల్పోతే ఆ బాధ యమ యాతన. మునుపు పక్కూరి కాంతమ్మగోరు మంచి ఒడ్డు, పొడుగు ఉండి మనిషి దిట్టంగా ఉంటాదా, పాపం ఆమె జుట్టు మరీ పల్చబడిపోనాది. జడకి, ముడికీ అందక చాలా చీకాకు పడిపోనాది. ఏమి చేత్తాది పాపం ఆరు, ఈరు, ఏదైనా మాట అంటారని ఆ యమ్మ ఎక్కడికి పోయేది కాదు. ఇంట్లోనే గుంభనంగా ఉండి పోయేది. ఎంతమంది ధైర్యం చెప్పినా వినుకొలే, నేను కూడా తైలం చేసి ఇచ్చినాను. కానీ ఆ దిగులు మనసున పెట్టేసుకుని సుబ్బరంగా బువ్వకూడ తినేది కాదు. ఎంట్రుకలు ఎలా పెరుగుతాయి సెప్పండమ్మా, సుబ్బరమైన తిండి తింటేనే కదా బలం వత్తాది. పై పై రాసే నూనె ఎంత గొప్పదైన ఏమి లాభం. ఇంక లాభం లేదనుకుని నా జుట్టు సవరం కట్టిచ్చాను.

ఐదోతనం అంటారా ఐదుగురుని కన్నాక దేశాలు పట్టుకు పోయాడమ్మ నా మామ. ఏడున్నాడో , ఎలా ఉన్నడో ఆ దేవుడికే తెలియాల. వత్తాడో, రాడో తెలియని ఆడికోసం కన్న పేగుని కష్టపెట్టలేను కదమ్మా? అయినా నేను గుండు చేయించుకున్న ప్రతీసారి ఎవరో ఒకరు ముఖంలో నవ్వు వస్తాది కదమ్మా, అందుకే నేను నా ఎంట్రుకలు ఆ తిరుపతి ఎంకన్న బాబుకు ఇచ్చినట్టే అనుకుంటాను. నా మామ ఏడున్నా ఆ దేవుడు చల్లగానే చూస్తాడు లేమ్మా!! " అంది భర్త వదిలేశాడు అనే బాధ గొంతులో పలికేలా..

మొత్తానికి తల రుద్దడం పూర్తి చేసి, సావిత్రి వెళ్లి పొడి బట్టలు వేసుకుని వచ్చే లోపల కుంపటి మీద కాగిన నూనె పల్చటి గుడ్డతో వడకట్టి ప్రక్కన పెట్టింది. ఆ కుంపటిలో బొగ్గులు చిన్న పిడతలో వేసి సావిత్రి జుట్టుకు సాంబ్రాణి ధూపం వేస్తోంది.

సావిత్రి వాళ్ళమ్మ " భోంచేసి వెళుదూగాని చింతల్లి. నీ కోసం పిడికెడు బియ్యం ఎక్కువ పడేసాను. ఇదిగో నీ పిల్లలకు ఈ అప్పచ్చులు పట్టికెళ్ళు, సావిత్రికి పొట్టైన బట్టలు మీ చినదానికి సరిపోతాయి కావోసు ఒకసారి తొడిగి చూడు" అంటూ అభిమానంగా అన్నీ మూటలు కట్టింది.

"అలాగేనమ్మ, నా మాటకేముంది కానీ, బుల్లెమ్మ గారికి వేరం  బువ్వ యెట్టేయండమ్మా, హాయిగా తానం చేశారు కదా నిద్దర బాగా వత్తాది" అంది.

ఆరేళ్ల సావిత్రికి వాళ్ళ సంభాషణ లో ఏమి అర్థం చేసుకుందో తెలియదు కానీ, ఆమె బాల్యం నుండి పెళ్ళయ్యే వరకు  చాలా సార్లు ఈ తంతు జరిగేది. పండగ రావడం, చింతల్లి గుండు కొట్టించుకోవడం ఊరంతా పరాచికాలు ఆడటం, దానికి కించెత్తు కూడా బాధ పడకుండా ఉండేది. పైగా అలా గుండు చేయించుకున్న ఆ ముఖంలో ఏదో తెలియని సంతృప్తి తొణికిసలాడుతూ ఉండేది. కొంత వయసు వచ్చేటప్పటికి సావిత్రి  అది మాత్రం గ్రహించగలిగింది.

★★★★★★. ★★★★★★ ★★★★★

సావిత్రి  అలా ఎంత సేపు నుంచి అద్దం ముందు తన జుట్టు చూసుకుంటూ ఉందో తెలీదు కానీ, ఆ ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చిన  దానిలా, గబగబా ఫేస్ బుక్ తీసి, తన ఆలోచనల్లో గింగిరాలు తిరుగుతున్న ఆ విషయానికి సంబంధించిన పోస్ట్ మళ్లీ ఓపెన్ చేసి, పూర్తి వివరాలకోసం వాళ్ళ ఇచ్చిన వెబ్సైట్ లింక్ నొక్కింది. వారికి ఫోన్ నంబర్, ఇతర వివరాలు ఇస్తేగాని పూర్తి వివరాలు తెలుసుకునే వీలు లేదు.

అందులో కూలంకుషంగా ఉన్న వాటి వివరాలు ఒక్కొకటిగా చదువుతోంది.

చాలా మంది  క్యాన్సర్ పేషెంట్స్ రేడియేషన్ కారణంగా వెంట్రుకలను కోల్పోతారని, అందులో చిన్న వయసు వాళ్ళ నుంచి ముసలి వాళ్ళ వరకు అన్ని వయసుల వాళ్ళు ఉన్నారని . అందులో కొందరు శారీరకంగా ఆ వైద్యంతో మృత్యుంజయులు అయినప్పటికీ, తమ శరీరం మీద ఒక వెంట్రుక లేకపోవడం వలన వాళ్ళ రూపాలును చూసుకుని మానసికంగా కృగిపోతున్నారని, మానసికంగా దృఢంగాలేని కారణంగా ఆ వైద్యం కూడా ఒంటబట్టదని అందులో రాసి ఉంది. అవి నిజమని తెలియజేసే కథనాలు, వారి ఫోటోలు, అలాంటి వారితో చేసిన ఇంటర్వ్యూ వీడియోలు చాలానే ఉన్నాయి అందులో.

చాలా వరకు అన్ని వివరాలు ఒక్కొక్కటిగా చదివింది. ఆ ఫోటోలు, విడియోలు చూసి సావిత్రి హృదయం ద్రవించి పోయింది.ఆ ప్రకటన ముఖ్య కారణం ఏమిటంటే వృధాగా, మన సరదాల కోసం వేలరూపాయలు వెచ్చించి బ్యూటీపార్లర్ లో కట్ చేయించుకుంటున్న జుట్టును వారికి అందించగలిగితే విగ్గులు చేసి వారి మనోధైర్యాన్ని పెంచగలము అని భావము.

ఆ ప్రకటన చూసిన దగ్గర నుంచి  ఎందుకో సావిత్రికి చింతల్లి ఎక్కువగా గుర్తు వస్తోంది. తన చిన్నతనం అంతా చింతల్లి గుండు గురించి కథలు కథలుగా వింటూ పెరిగినా కూడా ఆమె అవసరం కోసం మాత్రమే అలా తన జుత్తు

సవారానికి ఇస్తోంది అనే కోణం లోనే తన ఆలోచన ఉండేది , కానీ ఆమె ఇచ్చిన జుత్తు ఎంతమంది మనో వేదనను పోగట్టి వారి మనస్సులో ఎంతటి ధైర్యాన్ని నింపిందో అనిపించింది. తన అవసరం కోసం చేసే పనైనా అందులో ఆత్మ తృప్తి పొందేలా చేసుకునేది. ఆ పాతకాలంలో ఏమి చదువులేక పోయినా కూడా మానసిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో చింతల్లి గ్రహించగలిగింది అంటే ఆమె మీద తెలియకుండానే ఒక రకమైన గౌరవ భావం వచ్చింది.

ఆ ప్రకటనలో వివరాలు, వీడియోలు చూసిన దగ్గర నుంచి సావిత్రి ఆలోచనా ధోరణి మారడం మొదలు పెట్టింది. ఆ భాదితుల వేదనను తలుచుకుని మనసంతా కకలావికలం అయిపోయింది. వారికి కావలసినది ఏమిటి? ఆస్తులు, అంతస్తులు ,డబ్బులు కాదు కదా, పోనీ నొప్పి, బాధ, కలగకుండా, మన ఆరోగ్యంను పణంగా పెట్టే అవసరం లేని, మన ప్రమేయం ఏమి లేకుండానే పెరిగిపోయే జుత్తు.

చనిపోయాక మాత్రమే ఇచ్చే అవయవదానం వలన వచ్చే తృప్తి బతికి ఉండగా పొందలేము. రక్తదానం చేసే వయసు కాదాయే తనది. అరవై ఏళ్ళ వయసులో మునుకులు దాటిన ఈ జుట్టు భగవంతుడు తనకు ఇవ్వడంలో పరమార్థం ఇదే అయ్యుంటుందేమో అనిపించింది సావిత్రికి. అంతే అనుకున్నదే తడవుగా ఆ ప్రకటనలో ఇచ్చిన నెంబర్లుకు ఫోన్ చేయడానికి పూనుకుంది.

★★★★★★. ★★★★★★★ ★★★★★★

అద్దం ముందు భుజాల పై వరకు ఉన్న ఆ కాస్త జుట్టును తదేకంగా చూసుకుంటోంది సావిత్రి. ముఖంలో ఏదో అనిరచనీయమైన తృప్తి, ఈ భుజాల వరకు ఉన్న జుత్తుని చూసి ఈ వయసులో ఈ సోకులు అవసరమా? అంటూ తన వెనక గుసగుసలు, మన సాంప్రదాయాలును తుంగలో తొక్కి జుట్టులు కత్తిరించుకునే పిల్లలకు బుద్ధి చెప్పేది. పెద్దరికం పోయి ఏమిటో ఈ విడ్డూరం అని బుగ్గలు నొక్కుకుని చేసే వేటకారాలు , బాబ్డ్ హెయిర్ బామ్మా అంటూ వినిపించే వెక్కిరింతలు ఆమె చెవుల లోకి వెళ్తున్నాయి గాని అవి అక్కడ నుంచి ఆమె మనసు పొరల గోడల వరకూ కూడా చేరట్లేదు. ఎందుకంటే తను చేసిన పని ఎంత ఉన్నతమయిదో ఆమెకు అవగతం అయ్యింది కాబట్టి. ఆమె చేసే ఈ పని ఆమెకు కలిగిస్తున్న ఆత్మ తృప్తి ముందు ఈ విమర్శలు, వెటకారాలు, నమ్మకాలు పిపీలకాలవలే అనిపిస్తున్నాయి.

స్వహస్తాలతో శ్రద్ధగా తయారు చేసుకున్న చిన్నప్పుడు చింతల్లి దగ్గర నేర్చుకున్న స్పెషల్ నూనె సుతారంగా ఆ మూరెడు జుట్టుకు రాసుకుంటూ, మళ్ళీ ఇచ్చే ఇంకొకరి ముఖంలో చిరునవ్వుకు కారణం అయ్యే ఆ జుట్టుని మురుపంగా చూసుకుంటూ తృప్తిగా ఊపిరి పీల్చుకుంది సావిత్రి.

# అభిషేకం

గుడిపూడి శ్రీనివాస రావు

రేడియోలో 'పుష్పాంజలి భక్తి గీతాలు ' అని వినపడగానే స్కూల్ కి టైం అవుతోందని పుస్తకాల సంచి తీసుకొని చెప్పుల్లో కాళ్ళు సగం దూర్చి గబగబా బయల్దేరేను. స్కూల్ కి వెళ్ళేసరికి ప్రార్ధన మొదలవుతోంది . ఫణిగాడు వెనక చోటుందన్నట్టుగా సైగ చేసేడు. పరిగెత్తి వాడి వెనకాల లైన్లో దూరేను. ప్రార్ధన అయ్యాక అందరం క్లాస్ కి వెళ్ళేసరికి లెక్కల మాస్టారు కృష్ణమోహన్ గారు వస్తున్నారు. ఆయనంటే అందరికి హడల్. అంతా నిశ్శబ్దంగా కూర్చున్నాం. అటెండెన్స్ తీసుకున్నాక క్లాస్ మొదలయ్యింది. మాస్టారు గారు బోర్డ్ మీద రాస్తుంటే అందరం శ్రద్ధగా చూస్తూన్నాం. ఇంతలొ అటెండరు రాములు 'సార్' అని పిల్చాడు. రాయడం పూర్తి చేసి తలతిప్పిన మాస్టారితో , జి.శ్రీనివాసు ని హెడ్మాష్టారు గారు రమ్మంటున్నారు సార్ అని చెప్పాడు. ఆశ్చర్యంగా లేచి నిలబడ్డాను నేను. 'పుస్తకాల సంచి కూడా తీసుకో' అన్నాడు రాములు. వెళ్ళమన్నట్టుగా సైగ చేసారు లెక్కల మాస్టారుగారు.

హెడ్మాస్టరు గారి గదికి వెళ్ళే సరికి ఆయనతో అమ్మమ్మ ఏదో మాట్లాడుతోంది. నన్ను చూసి పదరా నాన్నా బండికి టైమవుతోంది అంది . హెడ్మాస్టరు గారి కి నమస్కారం పెట్టి, స్కూల్ బయటకి వచ్చి, అటుగా పోతున్న రిక్షాని ఆపి, అందులో కూర్చున్నాక, రైల్వే స్టేషన్ కి పోనివ్వమంది అమ్మమ్మ. ఎందుకు నన్ను స్కూల్ నుంచి తీసుకెళుతున్నాదో అర్ధం కాని నాతో, 'రేపు మీ నాన్న అభిషేకం చేస్తున్నాడట , కార్తీక మాసం కదా,నిన్ను తీసుకొని రమ్మన్నారు' అని చెప్పింది అమ్మమ్మ. ఇంత ఉదయాన్నే మా నాన్న కబురు ఎలా పంపించారని అడిగాను అమ్మమ్మని. మీ పక్కింటి విమల వాళ్ళ అమ్మ ఇక్కడ జగన్నాధపురంలొ ఉంటుంది కదా, ఆవిడ కి వొంట్లో బావులేదట, చూడడానికని విమల నిన్న రాత్రి పాసింజరులో వచ్చిందట. వాళ్ళ తమ్ముడితొ కబురుపెట్టింది. నువ్వు ఇలా స్కూల్ కి వెళ్ళావు, ఆ అబ్బాయి అలా వచ్చాడు అంది.

స్టేషన్ దగ్గర రిక్షా దిగి టిక్కట్లు కొనుక్కుని మూడో నంబరు ప్లాట్ఫాం మీద ఉన్న కిరండూల్ పాసింజరు ఎక్కాం. కిటికీ పక్క సీట్లో నేను, నాపక్కన అమమ్మా కూర్చున్నాం. రైలు నెమ్మదిగా బయలుదేరింది. కిటికీకి అతుక్కుపోయి బయటకి చూస్తున్నాను. రైలు వేగం పుంజుకుంది. అమ్మ దగ్గరికి వెళుతున్నామన్న సంతోషంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను. కిరండూల్ పాసింజరు కొత్తవలస స్టేషన్ దాటాక ఎడమ పక్క కెకె లైను వైపు తిరిగింది. మా ఊరు కరకవలస చేరాలంటె ఇంకా ఏడు స్టేషన్లు దాటాలి. కిటికీ లోంచి బయటకి చూస్తూ 'అమ్మమ్మా బొడ్డవర తర్వాత గుహలొస్తాయ్' అని అరిచాను. అలాగే, చేతులు బయట పెట్టద్దు అంది అమ్మమ్మ. అప్పుడే ఎదుటి బెర్త్ మీద కూర్చున్న కుటుంబం తో మాటలు కలిపినట్టుంది. మా ప్రయాణానికి గల కారణాన్ని వాళ్ళకి వివరంగా చెబుతోంది.

"వీడు మా పెద్దమ్మాయి కొడుకు. మా అల్లుడు స్టేషన్ మాస్టర్ గా పనిచేస్తాడు. దీనికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు మగ పిల్లలు, మధ్యలొ ఆడపిల్ల, వీడు ఆఖరివాడు. అతను పనిచేసే ఊళ్ళలో బడులు గట్రా పెద్దగా ఉండవు, అందుకని చదువు కోసం మగ పిల్లలిద్దరిని నా

దగ్గర వదిలింది. కూతుర్ని అత్తవారింట్లో ఉంచి చదివిస్తోంది. వీడికి నాదగ్గర అలవాటైనా అప్పుడప్పుడు అమ్మకోసం బెంగపెట్టుకుంటాడు. అందుకే హెడ్మాష్టరు ని బతిమాలి తీసుకెళ్తున్నాను."

రైలు ఎస్.కోట స్టేషన్లో ఆగింది. ఇక్కడ అరటిపళ్ళు బాగా దొరుకుతాయి. పళ్ళు కొందామని అమ్మమ్మ కిటికీ దగ్గరగా జరిగింది. బుట్టలో అరటిపళ్ళతో పరిగెడుతున్న ఒకతన్ని ఆపి 'బాబు డజను ఎంతకిస్తున్నావ్' అని అడిగింది. 'ఐదు రూపాయలు, త్వరగా తీసుకోండమ్మా, బండి మూడు నిముషాలే ఆగుతుందిక్కడ' అరిచాడు వాడు. అర డజను ఇవ్వు అంటూ మూడు రూపాయలు ఇచ్చింది. ఇంతలో రైలు కదిలింది. పరిగెడుతూనే పళ్ళు, చిల్లర అర్ధ రూపాయి కిటికీలోంచి లోపలికి దాదాపు విసిరినంత పనిచేసాడతను. అమ్మమ్మ నా కోసం తెచ్చిన పెరుగన్నం లొ అరటిపండు వేసి ఇచ్చింది. ఎదురుగా కూర్చున్న వాళ్ళ అమ్మాయికి కూడా ఒక అరటిపండు ఇచ్చింది. నేను అన్నం తినేసి, మంచినీళ్ళు తాగేను. "తిరిగి ఎప్పుడొస్తాం?" అని అడిగాను అమ్మమ్మని. రెండు రోజులే, అభిషేకం అయిన మర్నాడు బయల్దేరిపోవాలని చెప్పింది. ఇంకో రెండు రోజులు ఉందాం అమ్మమ్మా అన్నాను. వొద్దునాన్నా , బడి పోతుంది. ఐనా రెండు నెలల్లో సంక్రాంతి శెలవలు వస్తున్నాయిగా అంది అమ్మమ్మ. కొంచెం నిరాశ గా మొహం తిప్పేను నేను.

రైలు బొడ్డవర స్టేషన్ దాటింది. దట్టమైన అడవిలో కొండల మధ్య నెమ్మదిగా వెళుతోంది. పెద్దగా శబ్దం చేస్తూ గుహలోంచి వెళుతున్నప్పుడు నేను గట్టిగా అరుస్తున్నాను. శివలింగపురం స్టేషన్ లో ఆగినప్పుడు , స్టేషన్ పక్కనే ఉన్న శివలింగానికి దండం పెట్టుకున్నాను. ఇక్కడ పనిచేసే మూర్తి గారు నాన్నకి మంచి ఫ్రెండ్. నన్నుచూసి నవ్వి ' రేపు వస్తానని నాన్నకి చెప్పు' అన్నారు. అలాగే అని తల ఊపాను. రైలు కదిలింది.

కిటికీలోంచి చూస్తూ ఆలోచనల్లోకి జారుకున్నాను. నాన్నకి పెద్ద ఊరు ఎప్పుడు బదిలీ అవుతుందో. అప్పుడింక అమ్మదగ్గరే ఉండి పోవచ్చు . అన్న ఎప్పుడూ అమ్మకోసం ఏడవడు. వాడికెప్పుడూ ఆటధ్యాసే. సెలవల్లో అమ్మదగ్గరికి వచ్చినా ఎంత త్వరగా వైజాగ్ వెళ్ళిపోదామా అని ఎదురు చూస్తుంటాడు. ఆలోచనల్లో మునిగిపోయిన నాకు బొర్రాగుహలు స్టేషన్ రావడంతో స్పృహ వచ్చింది. తార్వాతి స్టేషనే మా ఊరు కరకవలస. ఇంకో పావుగంటలొ ఇంటికెళతాం. కాన్నార్పకుండా మమ్మల్ని దాటి వెళుతున్న చెట్ల వైపు చూస్తున్నాను. రైలు మలుపు తిరిగి ఔటర్ సిగ్నల్ దాటింది. 'అమ్మమ్మా మా ఊరు వచ్చేసింది' అని గట్టిగా కేక పెట్టేను. రైలు మెల్లగా స్టేషన్ని సమీపించింది. నా కళ్ళు నాన్న కోసం వెతికాయి. ఎదురుగా ప్లాట్ఫాం మీద నాన్న కనపడగానే చేతులు ఊపాను.

రైలు ఆగగానే దిగి నాన్న దగ్గరికి వెళ్ళాను. 'ఏరా నాన్నా' అంటూ పలకరించారు నాన్న. 'ఇంద బాబు' అంటూ రెండు జాంకాయలు నా చేతిలో పెట్టేడు పోర్టర్ పైడితల్లి. అవి తీసుకొని ఇంటికి పరిగెత్తేను. 'ఉండు నాన్నా' అంటూ వెనకనించి అమ్మమ్మ అరుస్తోంది. కరకవలసలో స్టేషన్ కొండమీద , క్వార్టర్స్ కింద ఉంటాయి. స్టేషన్ బయటకి వచ్చి చూసాను. కింద మెట్ల కెదురుగా ఉన్న ఇంటి గుమ్మం ముందు నుంచొని ఎదురుచూస్తోంది అమ్మ. పరుగెడుతూ మెట్లు దిగుతున్నాను నేను. జాగ్రత్త అన్నట్టుగా అమ్మ చెయ్యి ఊపుతోంది. గబగబా వచ్చి అమ్మని చుట్టేసాను. నా తల నిమిరి ముద్దు పెట్టుకుంది అమ్మ.

మార్నాడు అభిషేకం అయ్యాక, భోజనాల దగ్గర నాన్న మూర్తి గారితో అంటున్నారు, 'పార్వతీ పురం లో డిగ్రీ కాలేజి కుడా వుందట, పెద్దవాడి చదువుకి ఇబ్బంది లేదు'. పరిగెత్తి వంటిట్లో కెళ్ళి అమ్మని అడిగాను 'నాన్న పార్వతీపురం అంటున్నారేమిటీ?' అమ్మ నా తల నిమిరి, 'అవున్రా , నాన్న అక్కడికి బదిలి అయ్యారు , వచ్చే ఏడాది స్కూళ్ళు తెరిచాక అందరం ఒక

చోటే ఉండచ్చు, అమ్మవారు నా గోడు విన్నాది' అంటూ కళ్ళు తుడుచుకుంది. నేను ఒక్క ఉదుటున వీధిలోకెళ్ళి జామచెట్టు ఎక్కి అంతేవేగంగా దూకేసాను. పక్కింటి పిళ్ళె మేష్టారు ఆశ్చర్యం గా చూసేరు నా వైపు ఏవైందన్నట్టు.

# రక్షాబంధనము

## కుంతి

**8వ నంబర్** బస్సు మధ్య తరగతి కుటింబికుడిలా, తన శక్తి కన్నా ఎక్కువ బరువును మోస్తూ, ఉసురుమంటూ ఆబిడ్స్ బస్‌స్టాప్‌లో ఆగింది. ఆకలితో ఆబగొన్న దరిద్రులు నిండు కంచం కనబడితే ఎగబడినట్లుగా ప్రయాణికులు ఒక్కసారిగా బస్సు పైకి ఎగబడ్డారు.

శేషు తన చేతిలోనున్న సంచులను పొదివి పట్టుకుని, జేబుదొంగలనుండి జాగ్రత్త పడుతూ, ఒక్క ఉదుటున బస్సు దిగే ప్రయత్నం చేస్తుండగా, "ఇక నీ పాపాలు అయిపోయాయి పో" అని నరకంలో నుండి యమభటులచే తోసివేయడినట్లుగా బస్సులోనుండి తోసివేయబడ్డాడు. అతడికి ఒక్కసారిగా కొత్తలోకంలోకి వచ్చినట్లయింది. ఫుట్‌పాత్‌పై నిలబడి కాస్త ఊపిరి పీల్చుకున్నాడు.

చేతిలోనున్నటువంటి అకౌంటెంట్ సుజాత మేడమ్‌కు సూపర్ మార్కెట్‌లో కొన్న సరుకులు, యూడీసి వర్ధినికి కొన్న మందులు, ఎల్డీసీ పార్వతి బాబుకు కొన్న పాలడబ్బాలు, టైపిస్ట్ కాంతం కొరకై కట్టిన ఎలక్ట్రిక్, ఫోన్ బిల్లులు... గంట పర్మిషన్ అడిగినందుకు గంట క్లాస్ పీకి ఆ పై తన పిల్లల స్కూల్ ఫీజ్ కట్టమంటూ ఇచ్చిన సెక్షన్ ఆఫీసర్ ముత్యాలరావు పిల్లవాడి స్కూల్ రసీదులు, పక్కసీటు తులసీరాము కట్టమంటూ ఇచ్చిన ఇన్సూరెన్స్ బిల్లులు అన్నీ సక్రమంగా ఉన్నాయో లేవో చూసుకుని, అన్నీ ఉండడంతో తృప్తిగా ఊపిరి పీలుస్తూ ముందుకు కదిలాడు.

అతడు తొమ్మిది గంటలకు ఆఫీసు విడిచాడు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కూడా చేయలేదు. గడియారం చూసుకున్నాడు. మధ్యాహ్నం రెండు గంటలయింది. "ఈ రోజు సగం దినం లీవు పెట్టాల్సిందే ఈ నెలలో ప్రజాసేవలో లీవు పెట్టడం ఇది మూడవసారి. పోనీలే లేడీస్ స్టాఫ్ నన్ను తమ్ముడూ అని చూపే అభిమానం ముందు ఇది ఎంత?" అనుకున్నాడు. '

శేషు పోస్ట్ గ్రాడ్యుయేట్. కంప్యూటర్ ఆపరేటర్. ఈ మధ్యే ప్రభుత్వోద్యోగి అయ్యాడు. ఇంకా పెళ్ళికాలేదు. చురుకైనవాడు. చలాకీగా ఉంటూ అందరిని ఇట్టే ఆకట్టుకుంటాడు. ఆఫీసులో చేరిన కొద్దిరోజులకే అందరికీ దగ్గరయ్యాడు. ముఖ్యంగా లేడీస్టాఫ్‌కు. పనిలో చురుకుదనము, కలుపుగోలు తనము, చమత్కార గుణములన్నింటికీ మించి నలుగురికి సహాయపడే తత్వము అందరికీ దగ్గరయ్యేలా చేసింది.

ఆఫీసులో చేరిన కొన్ని దినాలలోనే అందరూ తమతమ పనులు ఇతడికి అప్పగించసాగారు. విసుక్కోకుండా నవ్వుతూ చేసేవాడు. తాను బ్యాచ్‌లర్. సత్రం భోజనం. మఠం నిద్ర.

సాయంత్రం ఆఫీసు అయిన తరువాత అతడికి వేరే పనిలేదు. సమయాన్ని సద్వినియోగం చేయగలిగే ఉత్తమ కళాభినివేశములుగాని, దుర్వినియోగం చేయగలిగే పాడు వ్యసనములు కానీ లేవు. అందరితో కలిసిపోయి తలలో నాలుకలా వ్యవహరిస్తూ జీవితాన్ని ప్రశాంతంగా గడపడం అతడికి ఇష్టం.

ఈ విషయం గ్రహించిన కొలీగ్స్ క్రమంగా తమ పనులను చాకచక్యంగా అతడిపై తోసేసేవారు. ఆనందంగా ఆ బరువును మోసేవాడు. అయితే ఎంత సహాయం సదుద్దేశముతో చేసినా అతడి వెనకాల జెంట్స్ స్టాఫ్ మాత్రం "అతడికేవో పనులుంటాయి కాబట్టి మన పనుల పేరుతో బయటికి వెళతాడు" అని తక్కువ చేసి మాట్లాడేవారు.

దీనితోపాటుగా అతనికి సంబరాల రాంబాబు అని నిక్‌నేమ్ తగిలించి వ్యంగ్యోక్తులు విసిరేవారు. అయినా శేషు దానిని సరదాగా తీసుకునేవాడు.

ఇక లేడీస్ స్టాఫ్ అతడితో ప్రేమగా చనువుగా ఉండేవారు. తమ్ముడూ అని ఆప్యాయంగా సంబోధించే వారు.

శేషును వర్ధిని మేడమ్ "తమ్ముడూ" అని పిలిచేది. కాంతం "అన్నయ్యా" అని పిలిచేది. శేషూ తమ్ముడు వచ్చిన తరువాత వర్ధిని అక్కయ్యకు పని మరీ సులువయింది. అంతకు మునుపు క్రష్‌లో పెట్టిన సంవత్సరం పిల్లవాడిని ఇపుడు తనతోపాటు ఆఫీసుకు తెచ్చుకోసాగింది. ఇక కాంతము అందమైన అమ్మాయి ఇంకా పెళ్ళికాలేదు. ఆమె అన్ని పనులు తప్పులు తడకగా చేసేది. ఆమె చేసే అన్ని తప్పులనుండి ఆఫీసర్ నుండి చీవాట్లు రాకుండా శేషు తప్పించేవాడు. శేషుకు కూడా వర్ధినీ అక్కయ్య అన్నా, కాంతం అన్నా అభిమానం.

వర్ధినీ అక్కయ్య శేషుతో "తమ్ముడూ ఈ నెల చివరిలో తిరుపతికి వెళ్ళాలి. అప్పుడే నాకు పీరియడ్స్. మా ఆయనకు అప్పుడే కుదిరింది. కాస్త మాత్రలు తెచ్చిపెట్టవూ" అన్న మాటలు గుర్తుకు రావడంతో రైట్ పాకెట్‌లో పెట్టిన మాత్రల పాకెట్ కై తడుముకున్నాడు. అవి భద్రంగా ఉన్నాయి.

❦❦❦

శేషు ఆఫీసు వైపు నడిచాడు. బహుళ అంతస్థుల భవనంలో ఆరవ అంతస్థులో ఆఫీసు. లిఫ్ట్ కేసి నడిచాడు. లిఫ్ట్ చెడిపోయింది. "బాగుపడడానికి టైం పడుతుంది" అన్న లిఫ్ట్ బాయి మాటలకు నీరసపడిపోతూ, ఆకలిగా ఉన్న కడుపుకు ఆలోచనల మేత వేస్తూ, చేతిలోనున్న బరువైన సంచిలను మోస్తూ ఆఫీసుకు చేరుకున్నాడు. లంచ్ అవర్. ఎప్పటిలాగే ఆఫీసులో ఉన్న జెంట్స్ స్టాఫ్ క్యాంటిన్ వైపు వెళ్ళారు. సీట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. ఆఫీసు బాయ్ శ్రీశైలం శేషును చూస్తూ, వింతగా నవ్వుతూ క్యాంటిన్ వైపు వెళ్ళాడు. కంప్యూటర్ సెక్షన్‌లో వున్న తన క్యాబిన్ వైపుకు కాకుండా రెస్ట్ రూమ్ వైపు దారితీసాడు. రెస్ట్‌రూమ్ పెద్దహాలు, మధ్యలో చిన్న పార్టిషన్, పార్టిషన్‌కు అటువైపు లేడీస్ రూమ్. ఇటువైపు జెంట్స్ రూమ్. రెస్ట్ రూమ్‌లోకి జారగిలాబడ్డాడు. ఎండలో వచ్చినందుకు, కడుపులో ఆకలిగా ఉన్నందుకు, ప్రొద్దున్నుండి రకరకాల పనులతో తిరిగినందుకు ఒక్కసారిగా అతడిని నీరసం ఆవరించింది. క్యాంటిన్ వైపు వెళ్ళబుద్ధి కాలేదు. లేడీస్ రూమ్ వైపు నుండి టిఫిన్ డబ్బాల చప్పుడు వినిపిస్తుంది. ఎందుకో లోపలికి వెళ్ళాలి అనిపించలేదు. వెళితే తమతమ బాక్స్‌ల్లో నుండి తీసి మరీ మరీ పెడతారు. అది ఎందుకో శేషుకి నచ్చదు.

ఒక్కసారిగా ఫ్యాన్ గాలికి, నీడకు ప్రాణము కుదుటపడడంతో కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. పక్కగదిలోనుండి మాటలు స్పష్టంగా వినబడసాగాయి.

❦❦❦

"ఏం వర్ధినీ శేషుతో ఏమేమి తెప్పిస్తున్నావు" అడిగింది కాత్యాయని.

"ఆ ఏముంది? పీరియడ్స్ ఆగడానికి మందులు, కొన్ని ఇంట్లోకి సరుకులు"

"తప్పుకదే వర్ధినీ మరీ ఆ మందులు తెప్పించుకోవడమేమిటి?" అన్నది కాత్యాయని.

"ఏమి చేస్తాను? మా ఆయన మగమహరాజు. మేమిద్దరం ఉద్యోగాలు చేస్తున్నామా? ఆయన ఇంటిపనులు ముట్టనే ముట్టడు. ఇంటికి రాగానే న్యూస్ పేపర్, టీవీతో కాలక్షేపం. కరెంట్, టెలిఫోన్ బిల్లులు కూడా కట్టడు. నాకంటే ముందు ఇంటికి చేరుకున్నా ఇంట్లో పనులకు ఇంత సహాయం రాడు" అన్నది వర్ధిని.

"'మా ఆయన అయితే చేసే ప్రతి పనికి వంకలు. రాత్రికి యే పదింటికో ఇంటి చేరుకోవడం పైగా తాను చేసే పని చాలా ప్రధానమైనది. తాను చాలా బిజీ అనుకుంటాడు" అన్నది పార్వతి.

"కాస్త శేషు వచ్చిన తరువాత పనులు చేసి పెడుతున్నాడు. కొంచెం వెసులుగా ఉంది" అంది పర్వీన్. వంత పాడింది కాంతం.

"ఔనులెండి మీ అందరికీ సహాయకారిగా ఉంటాడు. పైగా మీరు "తమ్ముడూ అన్నయ్యా" అంటుంటారు కదా" అన్నది కాత్యాయని.

"తమ్ముడా.. తలుపు చెక్కలా.. ఒకచోట పనిచేస్తున్నాము. మనకా అటు ఇంటి పనులు, ఇటు ఆఫీస్ పనులు, పిల్లల పెంపకం వీటన్నిటితో ఊపిరాడదు. వచ్చిన ఉద్యోగాన్ని వదులుకోలేము. ఏదో కాస్త ప్రేమగా తమ్ముడు, అన్నయ్యా అని అంటుంటే తోటి మగ ఉద్యోగస్తులు కాస్త మన పట్ల సుహృద్భావాన్ని చూపుతారు. మన పనులు జరిగిపోతాయి" అన్నది వర్ధిని.

"అంతే" అన్నట్లుగా తలుపారు కాంతం, పార్వతీ, పర్వీన్, నవమణి మొదలైనవారు.

"అంటే మన పనులు చేయించుకోవడం కొరకు ఈ సోదర బంధాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉన్నదా?" అన్నది కాత్యాయని స్థిరంగా.

కాత్యాయని అందరిలోకి కొంచెం విశాల భావాలు కలది, పాజిటివ్ అవుట్ లుక్, వర్క్ కల్చర్, డీసెన్సీ తెలిసిన మనిషి.

"తప్పదు మనం ఒకచోట కలిసి పనిచేస్తున్నప్పుడు, ఏదో ఒక సందర్భంలో క్లోజ్‌గా మూవ్ కాక తప్పదు. అదే అదనుగా చూసుకుని ఎవరైనా వెధవ వేషాలు వేయవచ్చు కదా అందుకే ముందుగా తమ్ముడూ, అన్నయ్యా అంటే సరిపోతుంది. ఎమోషనల్‌గా కట్టడి చేసినట్టవుతుంది" అన్నది కాంతం.

"అంటే మనలో ఉన్న సోషల్ ఇన్‌సెక్యూరిటీ ఫీలింగ్ కవర్ చేసుకోవడానికి ఈ విధంగా సోదర బంధం ప్రదర్శించాలన్నమాట. ఇలాగైతే "మత్‌లబీ" అవుతాము కదా" అన్నది కాత్యాయని.

"యస్! మత్‌లబీ కాకుంటే మరేమిటి? మనమెక్కడి వాళ్ళమో, ఇలా కలిసాం. కొంతకాలం కలిసి పనిచేస్తాం. ఇలా ఉన్నంతకాలం మృదువుగా, సాఫీగా జరిగిపోవాలి. అంతే. ఆ మాత్రం లౌక్యం తప్పదు. నిజానికి మనమెవరము ఎవరికి ఏమీ కాము. శేషును చూస్తే నాకు మా తమ్ముడు గుర్తుకురాడు. కానీ నేతనితో 'నిన్ను చూడగానే మా తమ్ముడు గుర్తుకు వస్తాడు' అన్నాను. కరిగిపోయాడు. చెప్పిన పనులన్నీ చేస్తాడు" అన్నది వర్ధిని.

"శేషు రాక మునుపు అతని స్థానంలో శ్రీకాంత్ పనిచేసేవాడు నేనొకటి రెండు సార్లు ఆఫీస్ పనిలో సాయం తీసుకున్నాను. దానితో అతడు చొరవతీసుకుని నన్ను సినిమాకు రమ్మన్నాడు. అందుకే శేషు చేరిన మొదటిరోజే అతడిని అన్నయ్యా అని పిలిచాను. దాంతో అతడు నన్ను చెల్లీ అంటాడు" అన్నది కాంతం.

"అంటే అభద్రతా భావం నుండి సోదరభావం వచ్చిందే తప్ప ఆప్యాయత నిండీ, పండీ కాదన్నమాట" అన్నది కాత్యాయని.

"చూడు కాత్యా! నీవు చాలా ఎఫిషియంట్. మీ ఆయన చాలా మంచివాడు. నీ పనులు నీవు చూసుకోగలవు. పైగా నీలా మేము ప్రతి విషయాన్నీ సిద్ధాంత, రాద్ధాంతాలతో బేరీజు వేస్తూ నడుచుకోలేము. నిజానికి నీ అంత ఆర్గనైజ్డ్‌గా ఆలోచించలేము. మధ్యతరగతి జీవితాలు, మధ్య తరగతి మనస్తత్వాలు" అన్నది వర్ధిని.

"ఎందుకో మీ అభిప్రాయాలతో ఏకీభవించలేకపోతున్నాను. మనము ఒక పక్క స్త్రీల హక్కుల కోసం పోరాడుతున్నాం. అన్ని విషయాలలో సమగ్రంగా ఆలోచిస్తున్నాం. మగవారితో సమానంగా ఒక్కొక్కసారి అంతకంటే ఎక్కువగా పని చేయగలుగుతున్నాం. కానీ ఎక్కడో మనలో అభద్రతాభావం కప్పిపుచ్చుకోవడానికి, పనుల్లో జరిగే తప్పులనుండి బయట పడడానికి తోటి వారితో సోదర భావం నటించాల్సిన అవసరంలేదు. నిజంగా అది మనసు అట్టడుగు పొరల్లోంచి వస్తే మంచిదే. అన్నయ్యో, తమ్ముడో అని అన్నంత మాత్రాన మగవాళ్ళు వచ్చి మనమీద పడిపోతారా? అక్కా, చెల్లీ అంటూనే తోడేలులా చూసే మగ గాడిదల గురించి మనకు తెలియదా? అన్నట్లు మీకో విషయం చెప్పాలి. ఒకరోజు ఆడిటింగ్ సెక్షన్‌లో పనిచేసే వెంకటేశం నా దగ్గరకి వచ్చి "సిస్టర్ మీ వారికి కొంచెం చెప్పి హెడ్ ఆఫీసులో ప్రమోషన్ ఫైల్ కాస్త త్వరగా మూవ్ అయ్యేట్టు చూడండి" అన్నాడు. అతడెలాంటి వాడో మీ అందరికీ తెలుసు. నేను వెంటనే సిస్టర్ అని పిలవకున్నా చూస్తాను. మీరు నిజంగా ప్రమోషన్‌కు అర్హులయి ఉంటే?" అన్నాను.

దానితో అతడేమనుకున్నాడో ఏమో "థాంక్స్" అని చెప్పి వెళ్ళిపోయాడు. తప్పకుండా 'ఫీల్' అయివుంటాడు. అయినా నేను బాధపడను. ఎందుకంటే "సరే బ్రదర్" అంటే, ఇలాంటి క్యారెక్టర్‌లెస్ మనిషిని బ్రదర్ అని సంబోధించినందుకు నేను ఫీల్ అయ్యేదానిని. అయినా నేను ఫీల్ కానిది నానోటినుండీ అనలేను. ఒక్క విషయం చెబుతాను. హిపోక్రసీ లేకుండా జీవించడంలో ఆనందం, తృప్తి ఉంది" అన్నది కాత్యాయని.

"ఏమోతల్లీ నీలాగా మేము ఆలోచించలేము. మమ్మల్నిలా వదిలేయి. మాకు ఇందులో సుఖం ఉంది. అలా అని మేము చెడ్డవాళ్ళమేమీ కాదు. ఇది "మిస్ యుటిలైజేషన్ ఆఫ్ ఎమోషన్స్ అండ్ హ్యూమన్ రిలేషన్స్ అయితే కావచ్చు కానీ మా స్కీమ్ మాకుంది. ఇది మేము ఏర్పరుచుకున్న రక్షాబంధనం" అన్నది వర్ధిని.

"ఔను" అన్నది కాంతం, పర్వీన్, నవమణీలు వర్ధిని మాటే నిజమన్నట్లుగా తలూపారు.

కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకుందామనుకున్న శేషుకు ఆ మాటలు వినిపించసాగాయి. కాసేపు అలాగే కూర్చుండిపోయాడు. గుండె మెలిపెట్టిన ఫీలింగ్. అక్కడినుండి నిశ్శబ్దంగా బయటికి వచ్చాడు. శ్రీశైలం కనిపించాడు. ఎవరెవరికి ఏమేమి ఇవ్వాలో వివరంగా చెప్పి, తన చేతిలోని సంచిలను అతనికి అప్పగించి ముందు నడిచాడు.

లిఫ్ట్ బాగయింది. క్రిందకి వచ్చాడు. ఆపై రోడ్డువైపుకు నడిచాడు. తలలో సన్నని పోటు సలుపుతుంది. బస్‌స్టాండ్ కావడంతో బాగా రద్దీగా ఉంది.

"తమ్ముడూ? కొంచెం గీ బ్యాగ్ తలపై పెడితే నెమ్మదిగా బస్సు ఎక్కుతాను" మధ్యవయస్కురాలైన స్త్రీ సరుకులు, కూరగాయల సంచులతో సతమతమవుతూ దీనంగా అడుగుతుంది.

శేషు మాట్లాడలేదు. ఆమె మాటలు అతడికి అనీజీగా అనిపించాయి. ఇంతలో బస్సు వచ్చింది. ఆమె పడే హడావిడి, బాధను చూసి, శేషు సంచులను అందించాడు. ఆమె ఆశీర్వచనంతో కూడిన నవ్వుతో థాంక్స్ చెప్పింది. బస్సు వెళ్ళిపోయింది.

మైండ్ బ్లాంక్ అయింది. జేబులోనుండీ సిగరెట్ పెట్టె తీసాడు. సిగరెట్ నోట్లో పెట్టుకుని, అగ్గిపెట్టెకై మరొక జేబులో చేయిపెట్టాడు. అగ్గిపెట్టెతోపాటుగ మెత్తగా, మృదువుగా తగిలాయి. అవి బయటికి తీసాడు. రంగురంగుల మృదువైన దారాలతో,

బొమ్మలతో, కుచ్చులతో ఆకర్షణీయంగా ఉన్నా రాఖీలు. రేపు రక్షాబంధన్ దినం. అందుకే వస్తూ వస్తూ మార్కెట్‌లో తీసుకున్నాడు. తమ్ముడూ...అన్నయ్యా అనిపిలిచే వర్షిణీ కాంతంలతో కట్టించుకుందామని.

సిగరెట్ పీలుస్తూ వాటికేసి తదేకంగా చూసాడు. కొంత ఫిలసాఫికల్‌గా, కొంత అయోమయంగా, కొంత అసహ్యంగా అనిపించింది. వెంటనే సిగరెట్‌తో పాటు వాటినీ చెత్తకుండీలోకి విసిరివేసాడు.

సెల్‌ఫోన్ తీసాడు. ఊళ్ళో ఉన్న స్వంత చెల్లెలికి ఫోన్ చేసాడు. శేషు చెల్లెలు రమ్య ఫోన్ రిసీవ్ చేసుకుంది. "హ్యాపీ రక్షాబంధన్ చెల్లాయ్" అన్నాడు శేషు ఆప్యాయంగా.

"థాంక్యూ అన్నయ్యా అయినా ఫోన్‌లో విషెస్ ఏమిటి? నువ్వు వస్తావని నీకిష్టమైన మైసూర్ పాక్ చేసాను. నీకోసం ఎదురు చూస్తున్నాను" అన్నది.

"వస్తానమ్మా అదే చెపుదామని ఫోన్ చేసాను. రేపు ఉదయానికి ఇంట్లో ఉంటాను" అంటూ ఫోన్ పెట్టేసాడు. రక్తం పంచుకుని పుట్టిన చెల్లెలికి నిఖార్సైన సహోదర బంధానికి నిలువెత్తు సాక్ష్యమైన అనుంగు సోదరితో కట్టించుకోవడానికి రాఖీలను, ఏదైనా మంచి గిఫ్ట్‌ను కొనాలని మార్కెట్ వైపు నడిచాడు.

# నాన్న నేను — సత్యప్రకాష్ మిత్తింటి

"అక్క, నువ్వు వీధి చివర రిక్షా ఎక్కి అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళండి. జాగ్రత్త!" అని నాన్న అన్నాడు.

అవి నా ఇంటర్మీడియట్ సెలవులు అనుకుంటా. అక్క ఇంజనీరింగ్ 3rd ఇయర్ చేసి సమ్మర్ హాలిడేస్ కు వచ్చింది. నేనేమో ఎంసెట్ ర్యాంక్ కోసం ఎదురుచూపులు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్దామని ఇద్దరం బయలుదేరాం. చెప్పాలంటే ఇంకా చిన్న పిల్లలు ఏం కాదు కానీ నాన్న అంతే. చెప్పాడు కదా ఊరుకోవచ్చు కదా... ఊహూ...!! గేటు దాకా వచ్చి మేమిద్దరం వీధి చివర రిక్షా ఎక్కేదాకా చూస్తూనే ఉంటాడు. నేనేమో "ఆ మాత్రం మాకు తెలియదా?" అని సణుగుడు. కానీ అది ప్రేమ! ఆ విషయం తెలిసి తెలియని వయసు అది– నాది.

తన కుటుంబం కోసం పెళ్లయిన కొన్నాళ్ళకే మా గ్రామాన్ని వదిలి గుంటూరులో కాపురం పెట్టిన నాన్న, ఈరోజు మేము సంతోషంగా ఉండగలుగుతున్నామంటే అది ఆ రోజు అమ్మ నాన్న తీసుకున్న నిర్ణయమే. పిల్లల చదువు విషయంలో రాజీపడే ఆ కాలానికి, రాజీ పడని ఈ కాలానికి మధ్య ఎదిగిన మా కోసం అప్పట్లోనే మానాన్న ఈ నిర్ణయం

తీసుకున్నాడు. నాన్న మా కోసం తీసుకునే జాగ్రత్తలు ఆ వయసులో వారికి తట్టనే తట్టవు. ఒకసారి నా చిన్న వయసులో నాకు రాత్రికి రాత్రి ఆయాసం వస్తే నన్ను భుజాన వేసుకుని హోమియో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు. అది కూడా మన హీరో సైకిల్ పైన. ఎక్కడ అల్లోపతి కి అలవాటు పడితే నేను తర్వాత బాధ పడతానని, టాబ్లెట్స్ అంటే చిరాకు పడతానని ఆయన నాకు ఎనిమిది సంవత్సరాల వయసులోనే ఈ ఆలోచన చేశారు. ఇది మచ్చుతునక.

ఇంత ఆలోచించి ఇంత ప్రేమించే నాన్న అంటే నాకు భయం కూడా. అక్కని అరుస్తున్నాను అని, పక్కింటి గోడ దూకే నని ఇలా ఒకటి రెండు సార్లు బాగానే దెబ్బలు పడ్డాయి. అంతే అదే చివరిసారి. నేను ఏడవ తరగతి కి వచ్చేసరికి ఫామ్ లో ఉన్న ధోని డకౌట్ అయినట్టు నా చదువు కొంచెం డల్ అయింది. అప్పుడు కూడా నాన్న సున్నితంగా మందలించాడు తప్ప చేయి చేసుకోలేదు. ఒకటే మాట నా ఆన్సర్ షీట్ చూసి తప్పులు ఎందుకు వచ్చాయో డిస్కస్ చేశారు. "ఇంకా చిన్న పిల్లవాడివి కాదు నువ్వు." అని అన్నారు. ఇది చాలదా నాకు ఆ వయసులో!?!

పిల్లల్ని గారాబంగా పెంచి పెద్దయ్యాక "వీడు అసలు మాట వినట్లేదు అండి" అని అనే తల్లిదండ్రుల్ని చూస్తాం. అసలు తండ్రి అంటేనే "టైగర్, బాబు రావు" అని ఫోన్ లో నెంబర్ సేవ్ చేసు కుంటారు కొందరు. కానీ మా నాన్న అన్ని సమపాళ్ళలో ఇచ్చాడు. నాన్న దగ్గర ఎంత చనువో నాకు అంత భయం, అదే మరోలా చెప్పాలంటే గౌరవం. గౌరవం అంటే "నాన్న గారు" అనే అంత కాదు. నాన్నను ఎప్పుడు డాడీ అనే మా పలకరింపు.

నాన్నకు కోపం ఎక్కువే అని అందరూ అనుకుంటారు కానీ మా నాన్న కోపం ఎప్పుడూ ఉండేది కాదు. ఎదుటివారు తప్పు చేస్తే మందలించే కోపం, ఎదుటివాడు నిర్లక్ష్యంగా కామన్ సెన్స్ లేకపోతే వచ్చే కోపం. అది క్షణికం. నాన్న ఎంత సున్నితం అంటే నేను బాధపడితే ఆయన కన్నీళ్లు పెట్టిన అంతా. కానీ నాన్న కన్నీళ్లు చూడలేను అసలు ఊహించుకోలేను.

నాన్న ప్రతి మాట ప్రతి అడుగు ప్రతి ఆలోచన మా కోసమే. నాన్నకు శత్రువులు లేరు. ఆయనను ఇష్టపడని వారు ఉండరు. కారణం ఆయన మెయింటేన్ చేసే సత్సంబంధాలు. "నేను, నా భార్య చేసే ప్రతి పని నా పిల్లల మీద, వారి భవిష్యత్తు మీద ప్రభావం ఉంటుంది" అని నిబద్ధత ఎప్పుడూ ఆయనలో ఉండేది.

నాన్న– 'ఆయన ఏం చెప్పినా కాదంటారు' అనే భావన అతి కొన్నిసార్లు మాత్రమే నాలో కలిగింది. కారణం ఆయన ఇచ్చిన జ్ఞానం. ఎదుటి మనిషిని అర్థం చేసుకోవడం, మంచి చేయడం నాన్న ఇచ్చిన గుణాలే. ఎంత ముందు జాగ్రత్తగా ఉండేవారంటే ప్రైవేట్ స్కూల్, చదువుకు మాత్రమే అని ఉన్న రోజుల్లోనే నన్ను, అక్కను డ్రాయింగ్, ఎలక్యూషన్, వ్యాస రచన లాంటి వాటికి ఎంతగానో ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహం నాకు జీవితాంతం తోడ్పడుతుంది నా ప్రతి మాటలోనూ, నా నడతలోనూ... ఎవరీ థింగ్ మేటర్స్ ఎలాట్

కనిపించే ప్రతి వస్తువు మా ఇంట్లో మా నాన్న స్వార్జిత మే... ఆయన కష్టార్జితమే. ఆయన ప్రతి కష్టంలోనూ అమ్మ భాగమే. డబ్బు విషయంలో ఎలా పడితే అలా ఉండకుండా ఆర్థిక స్వాతంత్ర్యం అలవాటు చేశాడు మా నాన్న. ప్రతి రోజు కొంచెం పాకెట్ మనీ ఇచ్చేవారు. చిన్న విషయంలో అయినా జాగ్రత్తగా ఉండాలి ఎవరికి ఇబ్బంది కలిగించే విధంగా మన ఆలోచన ఉండకూడదు అనేవాళ్ళు. ఖర్చుకి కాలిక్యులేట్ చేసుకొనే అవసరం లేదు కానీ అన్ ప్లాన్డ్ గా ఉండకూడదు అనేది ఆయన చెప్పే మాట.

నాకు బాగా గుర్తు నేను పది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. కానీ అప్పట్లో నే మా నానమ్మ, తాతయ్య తో కాశీయాత్ర ప్లాన్ చేశారు. పది పన్నెండు రోజుల యాత్రలో డబ్బులు బాగానే ఖర్చయ్యాయి. చనువు ఉన్న నేను "డాడీ డబ్బు బాగా ఖర్చు అవుతుంది కదా" అని అన్నాను. అప్పుడు నాన్న అన్నాడు..."అవసరమైన చోట రూపాయికి పది రూపాయలు ఖర్చు పెట్టడంలో తప్పులేదు కానీ అనవసరమైన చోట ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకూడదు" అని. నాకు ఇప్పటికీ అదే గుర్తు. మధ్యతరగతి కావటంవలన పొదుపుగా ఉండటం నేర్పారు కానీ పిసినారితనం గా కాదు. రెండింటికీ తేడా ఉంది.

అవసరానికి తగినంత వాడుకోవడం పొదుపు, అవసరమైన వాడకపోవడం పిసినారితనం.

ఇంగ్లీష్ మీడియం లో ఉన్నప్పటికీ ఇద్దరిని తెలుగులోనూ, హిందీ లోనూ అదే ప్రోగ్రెస్ ఉండాలనేది మా అమ్మానాన్నల ఆలోచన. ఇంగ్లీషులో పాఠాలు ఎంత ఫాస్ట్ గా చదువుతానో తెలుగు పేపర్ అయినా అంతే. **"మాతృభాష రానివాడు మాట్లాడుకునే భాష రాని వాడు ఎందుకురా! ఎంత పరువు తక్కువ!!"** అని మా అమ్మ చెప్పేది. నిజమే. నాకు భాషాభిమానం కొంచెం ఎక్కువే. కానీ నా భాషే గొప్పది అని కాదు. ఎవరిది వారికే గొప్ప. అంతే కదా...

ఎంత కీలకమైన నిర్ణయం అయినా అమ్మనాన్నలు లేకుండా తీసుకోము. అలాంటి నా నిర్ణయంలో మార్పులు చేర్పులు చేసినప్పుడు "నాన్న ఎందుకు ఇలా చేస్తున్నాడు" అని అనిపించినా, "నాన్న చేసింది నూటికి నూరుపాళ్లు కరెక్ట్"! కొన్ని సందర్భాలు, సంఘటనలు మనం బేరీజు వేసుకోలేం. అనుభవాలు నేర్పిన పాఠాలు మా నాన్న మాకు ఇచ్చిన జీవితం.

"ఇలా ఉండు, ఇలా చెయ్యి, ఇలా మాట్లాడు, వాళ్ళతో ఉండకు, వీళ్లలా ఉండు, ఎందుకంత ఖర్చయింది, సినిమాకి ఎందుకెళ్లావ్?" వగైరాలు లేని జీవితం. ఏది ఇలా అని చెప్పకనే మాకు అన్ని చెప్పిన నాన్న అంటే అందుకే నాకు చాలా ఇష్టం. "నాకోసం ఇది చెయ్యి, నాకు అది కావాలి అని ఉంది రా, మీ అమ్మకి ఇది చేయించు" లాంటివి ఏనాడు అడగని నాన్నకి నేను ఏమీ ఇవ్వలేదు ఇప్పటి దాకా. నాన్నే నాకు అన్నీ ఇచ్చాడు. **జీవితం.** వినటానికి మూడు అక్షరాలే కానీ ఆలోచిస్తే బయటకు రావడం కష్టం. కన్నీళ్లు వస్తున్నప్పటికీ అవి ఆనందం తోనే. అంతగా ప్రేమించిన తల్లిదండ్రులను ఎలా చూసుకుంటానో అనేది నా మదిలో అనునిత్యం ఉండే ఆలోచన.

కోపంగా కనబడే సన్నివేశాల్లో నాన్న ఎందుకు అలా ఉంటాడో నేను ఎప్పుడైతే అలా ఉన్నానో అప్పుడు అర్థమైంది. **"మనం ఏదైతే ఎదుటివారికి ఇస్తామో, అది మనకు ఎదురవుతుంది. మనం ఎలా ట్రీట్ చేస్తామో, అలాగే మనల్ని ట్రీట్ చేస్తారు"** అని నాన్న చెప్పకనే నాకు, అక్కకు చెప్పారు.

ఒక్క సారిగా "*బర్ర్*" మన్న శబ్దం తో ఉలిక్కిపడి లేచాను.

"హ్యాడ్ డిన్నర్? పెరుగు నిమ్మకాయ వేసింది అమ్మ. స్పూన్ కవర్ లో వేశాను" అని నాన్న నుండి మెసేజ్.

"సార్, బస్సు ఒంగోలు వచ్చింది. డిన్నర్ కి ఆపుతున్నాం" అని రాజేష్ ట్రావెల్స్ క్లీనర్ కేక కి ఈ లోకం లోకి వచ్చాను.

ఎప్పుడూ ఇంతే ఇంటి నుండి వెళ్లి పోతున్న ప్రతిసారి మనసు అదోలా బరువెక్కి పోతుంది. కానీ బెంగళూరు చేరిన తర్వాత కూడా ఒకటే ఆలోచన.... నాన్న నన్ను అక్క ను చూసుకున్నంత బాగా నేను నా పిల్లలను చూసుకోగలనా? నో వే. నేను నాన్నంత వాడిని కాదు, నాన్నలాంటి వాళ్ళుండరు.

# నా దేశం నాకేమిచ్చింది సోమ సుధేష్ణ

వాషింగ్టన్ సబర్బన్ లోని పి.జి. కౌంటీలో ఒక పెద్ద ఇల్లు. అరవై ఏళ్ల క్రింద ఇటుకలతో కట్టిన ఇల్లు. పైకి కాస్త ఓల్డ్ పేషన్ గా కనిపించినా లోపల అంతా మాడరన్ గా ఉంది. పాత ఇల్లు తక్కువ ధరలో కొంటే ప్రాపర్టీ టాక్స్ కట్టక్కరలేదని కొనుక్కున్నాడు రాజేష్. కష్టపడి ఇల్లంతా పునఃనిర్మాణం చేసాడు. ఇంటి లోపల అంతా నూతన పరికరాలతో అందంగా అమర్చి కుటుంబంతో హాయిగా జీవిస్తున్నాడు.

ఈ మధ్య రియల్ ఎస్టేట్ వాళ్ళు రాజేష్ ఇంటి చుట్టు పక్కల ఉన్న చాలాకాలం నాటి పెద్ద ఇళ్ళను కొని వాటిని పడగొట్టి ఆ స్థలం లోనే చిన్నచిన్న ఇళ్ళు, టౌన్ హౌసెస్ కట్టడం మొదలు పెట్టారు. ఇప్పుడు రాజేష్ ఇల్లులాంటి పెద్ద ఇళ్ళు అక్కడక్కడా కొన్ని మాత్రమే కనిపిస్తాయి. కొత్త ఇళ్లన్నీ ఒక ఇంటి కిటికిలోంచి పక్కింటి వాళ్ళకు కాఫీ కప్పు అందించు కునేటంత దగ్గరగా ఉన్నాయి.

రాజేష్కు ఆ రాత్రంతా నిద్ర రాలేదు ఎలా వస్తుంది! ఎదురుగా ఉన్న టౌన్ హౌస్ కిటికీ లోంచి లైట్ల కాంతి సరిగ్గా వీళ్ళ పడక గదిలోకి దూసుకు వచ్చి కిటికీ తెర మధ్య సందుల్లోంచి మంచం నిండా ముగ్గుల్లాగ కాంతి గీతలు గీసింది. అక్కడ కొత్తగా కట్టిన ఇళ్లన్నీ అంతే. వంటల వాసనలతో బాటు ఇంటివారి అరుపులు, సంబరాలు కూడా వినిపిస్తాయి. వసుధైక కుటుంబం అంటే ఇదేనేమో. ఎదురింటి వాళ్ళ కిటికీకి పల్చటి తెరలు, షీర్స్ మాత్రమే ఉండటం మూలాన ఆ ఇంట్లోని లైటు వెలుతురు వీధిలోకే కాకుండా ఎదురుగుండా ఉన్న ఇళ్ళల్లోకి కూడా పరుచుకుంది. ఎదురింట్లో కాస్త నిశ్శబ్దంగా ఉంటె బావుండునని ఎన్నోసార్లు అనుకున్నాడు. అవతలి నుండి పెద్దగా కేరింతలు, పాటలు విన పడ్తూనే ఉన్నాయి. అరుపులు వినిపించి రాజేష్ లేచి కిటికీ లోంచి చూసాడు. ఎదురింటి అబ్బాయిలు ఇంటి ముందు ఉన్నగడ్డిలో నిలబడి మాట్లాడు కుంటున్నారు. చేతులు ఉపుతూ వెఱ్ఱి వాళ్ళలా కేరింతాలు కొడ్తున్నారు. అందరూ టీనేజర్స్ లా ఉన్నారు. వారి తీరు చూస్తుంటే ఆల్కహాల్ తాగడమే కాదు మారువానానో మరేదో కూడా తీసు కున్నారు అనిపిస్తోంది. వారిలో ఒకరిద్దరు కాస్త చిన్న వాళ్ళు కూడా ఉన్నట్టున్నారు. అందరూ కలిసి ఇంట్లోకి వెళ్ళారు అయినా చప్పుడు తగ్గలేదు. పాటలు, అరుపులు అంతా గందరగోళంగా ఉంది. రాజేష్ పక్క గదుల్లోకి వెళ్లి ముగ్గురి కూతుర్లను ఒక సారి చూసుకున్నాడు.

"ఇలాంటి వాతావరణంలో మన పిల్లలని ఎలా పెంచగలం? అందునా ఆడపిల్లలు. ఇల్లైనా మారాలి లేదా దేశం అయినా మారాలి" నిద్రలో ఉన్న భార్య జయ పక్కన కూర్చుంటూ గొణిగాడు.

ఆ శనివారం రాత్రంతా ఎదురింటి హంగామాతో నిద్ర ఎలాగు లేదు కనీసం ఆదివారం మధ్యహ్నం అయినా హాయిగా నిద్ర పోవచ్చు అనుకున్నాడు కానీ ఆదివారం ఫెమిలీతొ కలిసి మ్యూజియం వెళ్లి అటునుండి మాండరిన్ లో డిన్నరుకు వెళ్లాలని ప్లాను వేసుకున్నారు.

ఎదురింటి పిల్లల తల్లి, తండ్రి ప్రేమించుకుని కొంతకాలం కలిసి జీవించారట. అతను ఎనిమిదేళ్ళు మెడిసిన్ చదువుతోంటే ఈవిడ సెక్రెటరి జాబు చేసిందిట. పెళ్లి చేసుకోకుండా అన్నేళ్ళు అతనితో గడిపింది. అతనికి డాక్టరు డిగ్రీ చేతికంది చికాగోలో ఉద్యోగం రాగానే భార్యకాని భార్యను ముగ్గురు పిల్లల్ని వదిలి తుర్రు పిట్ట లాగా ఎగిరి పోయాడు. ఆ పిల్లల మీద మనసు లాగ లేదేమో! మహాదేవుడు శివుడంతటి వాడికే కార్తికేయుడు దూరంగా వెళ్లి పొతే మనసు వ్యాకుల పడిందిట. ఇక్కడి వాళ్ళు జీవితాలలోని విలువలను గుర్తించరు గాబోలు. 'మన జీవితం తీరే వేరు. మన సంస్కారమే వేరు.' తన దేశం గుర్తు చేసుకుని గర్వంగా ఛాతి విరుచు కున్నాడు రాజేష్ .

ఈ మధ్య ఎదురైన కొన్ని చిన్న పెద్ద సమ్ఘటనలు రాజేశ్లో తీవ్రమైన అలోచనలను కలిగిస్తున్నాయి. అంతో ఇంతో డబ్బు కూడ బెట్టాడు. ఇండియా కెళ్ళిపోయి చక్కగా అమ్మాయిలను పద్ధతిగా పెంచుకుని, చదువులు చెప్పించి, పెళ్ళిళ్ళు చేస్తే తాను జయ తృప్తిగా, హాయిగా వాళ్ళను చూస్తూ జీవితం గడిపెయ్యొచ్చు అను కున్నాడు. కొన్నేళ్ళుగా అతని మనసులో ఆ ఆలోచన 'ఇంతై ఇంతింతై' అన్నట్టుగా పెరుగుతోంది. ఇండియాలో ప్రస్తుత జీవితంలో వచ్చే మార్పుపై అతనికి అవగాహన లేదు..

"మనం ఇండియాకు పర్మనెంట్గా వెళ్లిపోదాం" ఒకరోజు డిన్నరు టేబులు దగ్గర కూర్చున్నపుడు భార్య పిల్లలకు తన మనసు లోని మాట చెప్పాడు రాజేష్. అందరూ నోళ్ళు తెరిచి విన్నారు. ముగ్గురమ్మాయిలు గొణిగారు. ఈ మధ్య కాలంలో తరుచుగా 'ఇండియా వెళ్ళిపోతే' అనే ఆలోచనతో పాటు మంచి, చెడు అంటూ నాలుగు రకాల ఆలోచనలను రాజేష్ చెప్తూంటే వింటున్న జయ ఆశ్చర్య పోలేదు. ఇండియాకు వెళ్ళాలనే భర్త ఆలోచన జయకు కూడా నచ్చింది. ముగ్గురి కాలేజి చదువంటే మామూలా! ముగ్గురాడ పిల్లలు అందునా పెరిగిన కొలది వాళ్ళల్లో మొలిచే స్వతంత్ర భావాలతో తట్టుకోవడం కష్టమే. వార్త విన్నప్పటి నుండి తీన్ కన్యలు నసుగుతూనే ఉన్నారు. రాజేషు అన్నింటినీ పెడచెవిని పెట్టాడు. అతని తీరు చూస్తుంటే ఆయన నిర్ణయానికి తిరుగుండదేమో అనిపిస్తోంది.

★★★★★★★★★★★

ఏడేళ్ళ వయస్సు వరకు రాజేష్ జీవితం సుఖంగా గడిచింది. ఒకరోజు అన్నీ తలకిందులై రాజేష్ జీవితం అగాధంలోకి తోసేసి నట్టుగా అయిపొయింది. తల్లి తండ్రి మొక్కు తీర్చడానికి తిరుపతి వెళ్ళారు. స్కూల్ ఎగ్గొట్టడం

ఎందుకని రాజేష్ ను పినతండ్రి దగ్గర ఉంచి మూడేళ్ళ చిన్న కొడుకును తీసుకుని వెళ్ళారు. నాలుగు రోజుల తర్వాత బస్సు ప్రమాదంలో చని పోయిన ఇరవై మందిలో రాజేష్ కుటుంబం ముగ్గురూ ఉన్నారు. కుటుంబాన్ని పోగొట్టుకున్న రాజెస్ కు చిన్నాన్న ఉండటం అదృష్టమే అనుకోవాలి. రోడ్డుమీద పడకుండా నీడపట్టున ఉండ నిచ్చాడు. రాజేష్ పేరెంట్సుకు ఉన్న ఇల్లు, కొద్ది భూమి చిన్నాన్న తీసుకున్నా అందరితో మాత్రం తన డబ్బు పెట్టి ఇద్దరి కొడుకులతో బాటు సమానంగా రాజేష్ ను చదివిస్తున్నాను అని చెప్పడం విన్నా నిలవ నీడ ఇచ్చిన చిన్నాన్న మీద గౌరవం గుండె నిండా నింపుకున్నాడు రాజేష్. కష్టపడి చదివి టీచర్ల ప్రశంసలను అందుకొనే రాజేష్కు తెలిసిన ప్రపంచం – తెలివి ఉంటె ప్రపంచంలో అవకాశాల తలుపులు తెరుచుకుంటాయి. తనకున్న తెలివి నిచ్చెన అయితే తనలోని మంచి తనం అవకాశాలను కల్గిస్తుందని, తనకున్న శక్తితో ముందుకు వెళ్ళ వచ్చని గట్టి నమ్మకం అతని మనసులో నాటుకు పోయింది.

★★★★★★★★★★

1998 లో అమెరికా వచ్చినపుడు రాజేష్ పద్దెనిమిదేళ్ళవాడు. ఇండియాలో స్కాలర్ షిప్ తో కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతూ ఉన్నప్పుడే అమెరికా మోజులో పడ్డాడు. ఒక తెలుగు మూవీ గ్రూపు అమెరికా పర్యటన చేస్తోందని మేన మామ ద్వారా విన్నాడు. డాక్టరు కావాలనే కోరికను పక్కన పెట్టి అమెరికా కలను నిజం చేసు కోవాలనుకున్నాడు. మేనమామ ఎప్పుడూ మూవీ ప్రొడ్యూసర్ల తో, డైరెక్టర్లతో సాన్నిహిత్యం ఉంది. పలుకుబడి, డబ్బు చాలానే సంపాదించాడని రాజేష్ విన్నాడు. మామ అమెరికా వెళ్తున్నాడని తెలిసిన నాటినుండి ఆయన వెంటపడి ఆయనకు నీడలా ఉండి, కంటికి చూపై, నోటికి మాటై ఆయన్ని మెప్పించాడు. మూవీ గ్రూప్ ఎప్పుడు ఏదేశం వెళ్ళినా గుంపులుగానే వెళతారు కాబట్టి రాజేష్ కు 'గుంపులో గోవింద' లాగా అందరితో బాటు వీసా వస్తుందనే ఆశ ఉంది. చివరికి మేనమామ రాజేష్ మీద మమకారంతో వీసా ఇప్పించాడు. వాళ్ళందరికీ హెల్పర్గా ఉన్న కొందరిలో రాజేష్ ఒకడు. అలా వై–టు–కే కంటే ముందుగానే అమెరికాలో దిగాడు. అలా అమెరికా వచ్చిన రాజేష్ కు కళాత్మకమైన టాలెంటు ఏమీ లేకపోవడంతో మూవీ గ్రూపుకు హెల్పర్ లాగ ఉంటూ అమెరికాలో తన కలను ఎలా నిజం చేసుకోవాలా! అని మనిషి మనిషిని తట్టి చూసాడు. అవకాశం కోసం ఆవురావురంటూ అన్ని వైపులా చేతులు చాచాడు.

మూవీ గ్రూపుకు భోజన సదుపాయాలు సమ కూర్చిన హోటల్ మానేజరుకు మూవీ వాళ్ళ మీద మమకారం ఎక్కువ. అందరితో చాలా చనువుగా మాట్లాడేవాడు. మామ సరదా మాటలు చూసి మేనేజరు ఇట్టే స్నేహితుడయి పోయాడు. రాజేష్ ఒకరోజు మామను వెంట సిటీలో ఉన్న హోటల్ మేనేజరును కలవడానికి వెళ్ళాడు. అతని పేరు రాకేశ్ అయినా తన పేరు రాఖీ అని చెప్తాడు.. అలా ఆ హోటల్లో సర్వర్ గా చేరి త్వరలోనే హెడ్ వెయిటర్ గా ప్రమోషన్ తెచ్చుకున్నాడు. గ్రీన్ కార్డు సులభంగానే దొరికింది. వీసా రావడానికి రాఖీ చాల సహాయం చేసాడు. కాలం ముందుకు జరుగుతూండగా హోటల్ ఫ్రంట్ డెస్క్ కు ప్రమోషన్ వచ్చింది. రాజేష్ జీవితం అనుకున్నట్టు గానే ముందుకు

సాగుతోంది. రాత్రి కాలేజి కెళ్ళి కంప్యూటర్ నేర్చుకున్నాడు. కళ్ళల్లో కోటి ఆశలు, మనసు నిండా కోరికలు, వంటి నిండా శక్తి నింపుకుని జీవించాడు. మూడేళ్ళల్లో కంప్యూటర్ ప్రోగ్రాం పూర్తి చేసాడు. తన కంప్యూటర్ డిగ్రీ చూపించి తన కేదైనా కంపెనీలో ఉద్యోగం ఇప్పించమని హోటల్ స్వంతదారి అఖిల్ రాజ్వానిని అడిగాడు. మంచి మనసుతో పాటు కష్టపడి నిజాయితీగా పనిచేసే రాజేష్ కు మంచి అవకాశం ఇవ్వాలని రాజ్వాని తనకు తెలిసిన 'కలోరాస్' సాఫ్ట్వేర్ కంపెని మేనేజర్ రిచర్డ్ థామ్సన్ కు రాజేశును పరిచయం చేసాడు. నిజాయితీ పరుడని తెలిసిన రాజేష్ కు కంపెనీలో మంచి ఉద్యోగం ఇచ్చాడు థామ్సన్. ఆ తరువాత రాజేష్ జీవితం  పూర్తిగా మారి పోయింది.

ఆ రోజుల్లోనే రాజేష్ జయను కలిసాడు. ఇద్దరి మనసులు, ఆలోచనలు కలిసాయి. రాజేష్ మొదటిసారి తన పూర్తి జీవిత కథను జయతో చెప్పుకున్నాడు. ఇండియాకు ఫోను చేసి జయను పెళ్ళి చేసుకోవాలను కుంటున్నాను అని చిన్నాన్నకు చెప్పినపుడు 'నన్ను కాదని పోయిన వాడివి నువ్వేలా తగలడితే నాకేం! న కన్నా కొడుకుల్ కంటే నిన్ను ఎక్కువగా చూసుకున్నానురా, వద్దన్నా వెళ్లావు.   నని వెళ్లావు' నువ్వు. భేయిమాన్.' అని చీదరించుకున్నాడు. చిన్నాన్న తనకు నీడనిచ్చినవాడు గాబట్టి అతని తిట్లనే దీవనలను కున్నాడు రాజేష్. కొద్దిమంది స్నేహితుల సాన్నిధ్యంలో జయ, రాజేష్ పెళ్లి చేసుకున్నారు. మొదటి సారిగా 'నేను ఒంటరి వాడిని కాను' అనే భావన రాజేష్ కు కొండంత ధైర్యం ఇచ్చింది. పెళ్ళయాక రాజేష్ చిన్నాన్నకు ఫోను చేసి జయను పరిచయం చేసినప్పుడు 'పెళ్లి చేసుకుంటే నాకేం, అడుక్కు తింటే నాకేం. ఈజన్మలో నాకు నీ మోహం చూపించకు' అక్కసుతో అరిచాడు.

జయకు డేకేర్ లో అనుభవం ఉండడంతో డేకేర్ ఓపెన్ చేసింది. 'మేరీకే' కాస్మెటిక్ బిజినెస్ కూడా మొదలు పెట్టింది. రెండేళ్ళ తర్వాత అందాల 'గంగ' పుట్టి అదృష్టం ఆ కుటుంబాన్ని మరింత వరించింది. అప్పుడే ఒక ఇల్లు కొనుక్కుని తన కలను నిజం చేసుకున్నాడు.

ఉదయం ఎనిమిది గంటలనుండి సాయంత్రం నాలుగు గంటల వరకు 'కలోరాస్' కంపెనీ లో ఉద్యోగం చేస్తాడు. సాయంత్రం ఐదునుండి రాత్రి పదకొండు-పన్నెండు వరకు హోటల్ లో మేనేజరుగా ఉద్యోగం చేస్తాడు. తర్వాత కావేరి పుట్టింది. చిన్న ఇల్లు అద్దె కిచ్చి పెద్ద ఇల్లు, పాతది కొనుక్కున్నాడు. ఈ రెండు ఉద్యోగాలు చేస్తూ ఫెమిలితో ఎక్కువ సమయం గడపలేక పోతున్నాడు. 'అమెరికా జీవితం ఒక అందమైన కల' నిజమే  కానీ రేసు గుర్రంలా ఎప్పుడు పరుగులు తీస్తున్నట్టే ఉంటుంది. ఎంతో సహాయం చేసిన అఖిల్ రాజ్వానిని కాదనలేక రాజేష్ శనివారం కూడా రెస్టా రెంటులో పని చేయలసి వచ్చేది. ఒక్క ఆదివారం రోజు మాత్రమే  కుటుంబంతో సరదాగ గడుపదానికి వీలయేది. అతనిలోని పిత్రుత్వపు ప్రేమకు అది చాలదు. కుటుంబంతో గడపడం అతనికి ఆనందం. కుటుంబంతో కలిసి తినాలి, కలిసి తిరగాలనే అతని కోరిక ఊరుతూనే ఉంది కాని తీరలేదు.

★★★★★★★★★★

పెద్దమ్మాయి గంగకు పద్నాలుగేళ్ళు. రెండేళ్ళు చిన్నది కావేరి. ఎనిమిది నిండిన యమున. వీళ్ళు హైస్కూలుకు వచ్చారంటే కథే వేరు. రాజేష్ స్నేహితుడు అశోక్ – కూతురు హైస్కూలులో ఉంది, చెప్పిన మాట వినదు, పైగా ఈ మధ్య ఒక నల్లబ్బాయిని డేట్ చేస్తోందని అశోక్ అతని భార్య మానసిక వ్యధకు లోను కావడం రాజేష్ను చాల బాధ పెట్టింది. పిల్లలు పేరెంట్సును అంతగా కష్ట పెట్టడం రాజేష్కు అస్సలు నచ్చలేదు. కుటుంబం అంతా సభ్యతగా, ఉమ్మడిగా ఉండాలని అతని తపన. రోజుకు 12–13 గంటలు పని చేస్తూ ఈ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలను కునే రాజేష్కు జీవితం బాలేన్స్డ్ గా లేదని పించింది. ఒకసారి గంగ తన క్లాసుమేట్  పుట్టిన రోజు పార్టీకి వెళ్ళింది. తన స్నేహితులు అబ్బాయిలతో కలిసి మూవీకి వెళ్తున్నారని తను కూడా వెళ్తానని లేకపోతే తన స్నేహితులు తనతో దూరంగా ఉంటారని  గంగ తల్లితో వాదిస్తోంటే  రాజెస్  విన్నాడు. ఇప్పటి వరకు వద్దన్న పనులేవి చేయలేదు. రాజేష్ పైకి ఏమీ అనలేదు కానీ చాల ఆలోచించాడు. ఆలోచనల ఒరవడిలో ఇండియా వెళ్ళాలనే కోరిక అతనిలో మరింత దృఢ పడింది.

రాజేష్ కు ఇండియా వెళ్ళే ఆలోచన ఉందని చెప్పగానే బాస్ మిస్టర్ థాంప్సన్ ఇండియాలో కొత్తగా తెరిచిన కంపెని బ్రాంచ్ ప్లాన్ అంతా రాజేష్ కు వివరించి సదుపాయాలతో పాటు మంచి జీతం ఆఫర్ చేస్తూ హైదరాబాదులో ఉన్న క్రిస్ కు అసిస్టెంటుగా ఉండ మన్నాడు. రాజేష్ అదంతా తన పిల్లల అదృష్టమని మురిసి పోయాడు. కాలం వృధా చేయకుండా ప్రయాణ ప్రణాళిక మొదలు పెట్టాడు. అన్ని ఆస్తులు అమ్మేయడానికి ఎక్కువ టైము పట్టలేదు. ఇండియా వెళ్ళడం ఇష్టం లేక గంగ, కావేరి ఎప్పుడు చూసినా మొహాలు వేల్లాడేసుకుని తిరుగుతున్నారు.

"ఇండియాలో కరాటి నేర్పె వాళ్ళుంటారా?" అక్కలా తన కెప్పుడు బ్లాక్ బెల్టు వస్తుందా అని ఎదురు చూసే కావేరికి అసంతృప్తిగా ఉంది. యమున మాత్రం ఇండియాకు పోతున్నానని మురిసి పోతోంది. అమెరికాలో పుట్టి పెరుగుతున్న వాళ్ళను ఇప్పుడు వేళ్ళతో సహా పెకిలించి తీసు కెళ్తున్నాడు. పిల్లలకు ఆమాత్రం బాధ ఉండదా మరి! నా బిడ్డలు ఎక్కడ కెళ్ళినా అదృష్ట దేవతలు వాళ్ళతోనే ఉంటారు అని జయకు పదే పదే చెప్పి మురిసి పోయాడు. రాజేష్ కు చిన్నప్పటినుండి స్నేహితుడైన వినోద్ హైదరాబాదులోని ఫర్మాకుటికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరు రెండు దేశాల్లో ఉన్నా అడపా దడపా ఫోనులో పలకరించుకుని మంచి చెడ్డలు చెప్పుకుంటూనే ఉంటారు. రాజేష్ హైదరాబాదులో సెటిల్ అవడానికి వస్తున్నాడంటే వినోద్ కు చాల సంతోషంగా ఉంది. వినోద్ ఇంటికి నాలుగిళ్ళ అవతలే ఉన్నఇల్లు అమ్మకానికి ఉందని మంచి ధరకు వస్తోందని రాజేష్ కు వివరాలు పంపాడు. జయ, రాజేష్ ఇంకా తీన్ దేవియాలు చాల ఇష్ట పడి ఒకే కొట్టారు.

రాజేష్ కు ఇండియా అంటే ప్రాణం, అమెరికా అంటే ఇష్టం. 'ఇండియా నాకు ప్రాణం ఇచ్చింది. అనుభంధాలు నేర్పింది. అమెరికా నాకు ఒక గుర్తింపును తెచ్చింది. అమెరికా నాకు అనుభవం, సంపద ఇచ్చింది. అయినా కుటుంబం విషయానికి వస్తే ఏది ముఖ్యమో అది తప్పక చేయాలి. ఇండియా వెల్లిపోవాలి.' రాజేష్ ఉవాచ.

★★★★★★★★★★★

ఒక శుభ ముహూర్తాన రాజేష్ కుటుంబం ఇండియా చేరింది. ఎయిర్ పోర్టు అవతల అడుగు పెట్టగానే వేడిగాల్పులు, కారు హారన్మోతలతో అందరికి తల నెప్పి వచ్చింది. ఎప్పుడు వెళ్ళినా రోడ్డు పక్క దుకాణాలు, రకరకాల వాహనాలు, రోడ్డు మీద గజిబిజిగా పందెం వేసుకున్నట్టు పక్క వాళ్ళను రాసుకుంటూ, గీసుకుంటూ పోవడం చూస్తుంటే తల దిమ్మెక్కి పోయింది అందరికి. 'ట్రాఫిక్ లైట్సు ఉన్నా, స్పీడ్ లిమిట్ ఉన్నా వాటిని అధిగమించి వెళ్ళడంలో మనవాళ్ళను మించిన వాళ్ళు లేరనే చెప్పాలి' వినోద్ ఉవాచ.

కాస్త ఓర్చుకుంటే నెమ్మదిగా అన్ని అలవాటవుతాయి అని ముందుగానే పిల్లల బుర్రలో నింపారు గాబట్టి సరిపోయింది. ఎలాగైతేనేమి ప్రకాశ్ నగర్ లో ఉన్నఇల్లు చేరారు. ఇల్లు పెద్దగా, చుట్టూ ఆవరణ, ఆవరణలో పూల చెట్లు అందంగా ఉండి అందరికీ నచ్చింది. బంధు, మిత్రులకు ఇండియా ఎందుకు వచ్చామో అర్థం కాక "అందరూ అమెరికా వెళ్తుంటే నువ్వు ఇండియా వచ్చావేమిటి?" ప్రశ్నించారు. "ఐ మిస్ మై ఇండియా." అన్నాడు.

అమ్మాయిలను స్కూల్లో చేర్చడం, తదితర పనుల్లో వినోద్ అతని బార్య కరుణ చాల సహాయం చేసారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. వినోద్ పెద్ద కూతురు రుక్మి, గంగ ఒకే వయస్సు వాళ్ళవడంతో గంగ స్కూల్లో త్వరగానే అడ్జస్టు అయ్యింది. కానీ ఇండియన్ ఫుడ్ చూస్తె గంగ, కావేరి ఏమాత్రం ఇష్ట పడటం లేదు. 'ఫుడ్ కంటే ఎక్కువ స్పైసేస్ ఉంటాయి' అని గోణుగుతారు. యమున అన్నీ తింటుంది కానీ ఆబిడ్డ కడుపు మసాలాలకు అలవాటు పడలేక ఎప్పుడూ కడుపు నొప్పి అని తల్లి వెనకాల తిరుగుతుంది. ఇండియా జీవితంలో ఇమడటానికి, అమ్మాయిలను మార్చడానికి జయ ప్రతి నిమిషం అప్రమత్తతతో వారికి నీడలా ఉండి కావలసినవి అమరుస్తూనే ఉంది. కరుణతో కలిసి షాపింగులు, స్నేహితులను కలవడంతో జయ కూడా బిజీగా అయి పొయింది. రాజేష్ కంపెని పనిలో మునిగి పోయాడు. థాంప్సన్ కంపెని బరువు అంతా క్రిస్, రాజేష్ భుజ స్కంధాల మీద పెట్టాడు. బాధ్యత మోయడం రాజేషు కు కొత్తేమీ కాదు. కొంతకాలంలోనే బందువులు, స్నేహితులు తమకు రాజేష్ పని చేసే కంపెనీలో ఉద్యోగం కోసం అప్రోచ్ అవుతున్నారు. రాజేష్ కు అలా సన్నిహితుల లిస్టు పెరగ సాగింది. కాల చక్రం ఆగదు కదా!

కావేరి స్కూల్లో చాల కష్ట పడుతోంది. తెలుగులో బొటా బొటిగా మార్కులు వచ్చాయి. తెలుగు తన వల్ల కాదని సంస్కృతంలోకి మారింది. జయ అప్పుడప్పుడు అమెరికా ఇల్లును తలుచుకుని దిగులు పడేది. అమెరికాలో వంటిల్లునే భార్యకు స్వర్గంలా మార్చాడు రాజెష్. పిల్లలకు ఇక్కడ టివి షోస్ నచ్చడం లేదు. రాజేష్ త్వరగా ఇంటికి వచ్చి పిల్లలతో గడుపుతూ, వాళ్ళు చెప్పేవి (అన్ని ఫిర్యాదులే) విని సంతోషంగా సాల్వ్ చేసేవాడు. వీలు చేసుకుని గంగతో కలిసి కరాటే చేసేవాడు. కావేరి, యమున, రుక్మి కూడా వచ్చే సరికి అదొక కరాటే క్లాసులా ఉంది. 'అమ్మాయిలకు స్వంత రక్షణ చేస్కునే శక్తి ఉండాలి' అమ్మాయిల బుర్రల్లోకి ఎక్కిన్చేవాడు.

తన కుటుంబాన్ని చుట్టు పక్కల ఉన్న చరిత్రాత్మకమైన స్థలానికి తీసుకెళ్ళేవాడు. కొన్నిసార్లు వినోద్ ఫెమిలీ, ఇతర స్నేహితులు కూడా వెళ్ళే వాళ్ళు. రాజేష్ పెరిగిన నాటి హైదరాబాదు వేరు ఇప్పటి హైదరాబాదు వేరు. పెద్ద, చిన్న అందరూ వస్త్రధారణ నుండి తిండి, పద్ధతులు చాల వరకు మారాయి. యువత మద్యపానం తీసుకోవడం మామూలైపోయింది. పేరెంట్సుకు తెలీదా లేక తెలిసినా పేషన్ అనో లేక స్టేటస్ సింబల్ అనో సీతకన్ను వేస్తున్నారా తెలీదు. ఇంగ్లీషు మాట్లాడుతూ కొన్ని తెలుగు పదాలను ఇరికిస్తున్నారు. క్లబ్బుకు వెళ్ళడం, బ్రాండునేం బట్టలు వేసుకోవడం వారి గుర్తింపుగా భావిస్తున్నారు. డబ్బు విలువ బొత్తిగా తెలీదు. ఇంత మారిందా! అని వాపోయాడు. అధునాతనంలో అత్యంత విలువైన జీవిత సత్యాలు ఆవిరై పోతున్నాయా! అనుకున్నాడు.

కాలం గిర్రున తిరుగుతోంది.

గంగ హైస్కూల్ మొదటి శ్రేణిలో ఫాసయ్యింది.

“సైన్సులో మంచి మార్కులు వచ్చాయి కద తల్లి మెడిసిన్ చేయొచ్చుగా, ప్రజా సేవ చేయోచ్చు, నీకు ఇష్టమైన పని.” “డాక్తరే కాదు ఏది చదివినా దేశ సేవ చేయొచ్చు నాన్నా. గాంధీ, మార్టిన్ లూతర్కింగ్, మదర్ థెరీసా డాక్టర్లు కారు అయినా దేశ సేవ చేసారు. నేను అలాగే చేస్తాను డాడ్.”

“నీ ఇష్టం.”

హైదరాబాదులోనే ఇంజనీరింగ్ చేస్తానంటే జయ, రాజేష్ ఒప్పుకున్నారు. గంగ ఏది చదివినా అభివృద్ధి లోకి రావడం ఖాయం అని వాళ్ళకు తెలుసు. గంగలో మానసికంగా వయస్సుకు మించిన ఎదుగుదల ఉంది. ‘నా అదృష్ట దేవతలు’ అంటూ తన కూతుళ్ళ గురించి స్నేహితులతో చెప్తున్నపుడు రాజేష్ గుండె గర్వంతో పొంగుతుంది. అందరూ భారత దేశ జీవితంలో ఒదిగి పోయారు.

ఒక శనివారం రోజు—

“గంగ ఫ్రెండు పుట్టిన రోజు పార్టి కదా ఇవ్వాళ, వెళ్ళిందా? నందిక డ్రైవ్ చేస్తున్దనుకుంటా, సేఫేలే.” జయ వైపు చూస్తూ అన్నాడు రాజేష్.

“అవును నందిక డ్రైవ్ చేస్తానంది. రుక్మికి వంట్లో బాగాలేదని వెళ్ళడం లేదు. ఈ రోజు మీరు గంగను చూస్తె ‘నా తల్లి ఎంత అందంగా ఉంది’ అని ఎన్ని ఫోటోలు తీసేవారో! నా దిష్టే తగులుతుందనిపించింది. చాల సార్లు ముద్దు పెట్టుకున్నాను.”

యమున పొడుగాటి వెంట్రుకలు దువ్వుతున్న జయ అంది.

“నువ్వు ఫోటో తీయాల్సింది. పిల్లలు అలా చక్కగా డ్రెస్ చేసుకున్నపుడు వీలు చేసుకొని ఫోటో తీసేయ్యాలి. రాగానే తీస్తానులే. ఎప్పుడోస్తానని చెప్పింది?”

"డిన్నర్ అవగానే వస్తానంది. బయల్దేరే ముందు ఎలాగు ఫోను చేస్తుంది."

డిన్నరు తిన్నాక రాజేష్ తో బాటు అందరూ మూవీ చూస్తూ స్క్రీన్ ముందు కూర్చున్నారు. అది పూర్తయ్యేసరికి రాత్రి పదకొండు దాటింది. కావేరి, యమున బెడ్ రూముల్లోకి వెళ్ళగానే రాజేష్ లేచి అసహనంగా 'గంగ ఇంకా రాలేదేమిటి!' నసుగుతూ గంగ సెల్ కు ఫోన్ చేసాడు. గంగ ఫోన్ ఆఫ్ చేసుంది.

"గంగ నీకేమైన ఫోన్ చేసిందా జయా?"

"ఇంతవరకు చేయలేదు. నేను చేస్తే ఫోన్ ఆఫ్ లో ఉంది."

అప్పటికే జయ అరడజను సార్లైనా గంగ సెల్కు ఫోన్ చేసుంటుంది. మనసులో కాస్త అలజడిగానే ఉన్నా పైకి ఎమీ అనలేదు. రాజేష్ వెంటనే జయరామ్కు ఫోన్ చేసి, "నందికతో మాట్లాడావా? గంగ ఫోన్ ఆఫ్లో ఉంది. గంగ ఎక్కడికెల్లినా ఫోన్ ఆఫ్లో పెట్టదు." గాబరాగా అడిగాడు.

"ఇంతకు ముందే నందికకు ఫోన్ చెసాను. తన ఫోన్ కూడా ఆఫ్లో ఉంది. సమ్థింగ్ ఈజ్ రాంగ్? నేను హోస్టుకు ఫోన్ చేసి నీకు మళ్ళీ ఫోన్ చేస్తాను." ఫోన్ పెట్టేసాడు జయరాం.

కాసేపట్లోనే మళ్ళీ ఫోన్ రింగయింది. జయరాం గాబరాగ ఫోనందు కున్నాడు.

"గెస్ట్ అందరూ వెళ్ళిపోయారట. బర్త్ డే గర్ల్ కూడా కజిన్స్ తో బయల్దేరి ఇంటికి వెళ్ళిపోయిందట. ఐశుతో మాట్లాడితే 'గంగ, నందిక వెళ్ళిపోయి చాల సేపయింది, ఇంకా రాలేదా!' అంటోంది. నేను పోలీసు స్టేషనుకు వెళ్తున్నాను, నువ్వు అక్కడికే రా రాజేష్." ఎడ్రస్ ఇచ్చి ఫోన్ పెట్టేసాడు.

రాజేష్ దడదడ లాడే గుండెతో కారు కీస్ తీసుకుని పెద్ద పెద్ద అంగలు వేస్తూ వెళ్లి పోయాడు. జయకు ముచ్చెమటలు పట్టాయి. 'ఎప్పుడు ఫోన్ ఆఫ్ చేయని గంగ ఈ రోజు ఫోన్ ఎందుకు ఆఫ్ చేసింది!' జయకు కంగారుగా ఉంది. మొద్దుబారిన మనసుతో సోఫాలో అలాగే కూర్చింది. సోఫాలో జోగుతూ ఉన్న జయ ఉలిక్కి పడి లేచి చూస్తే టైం నాలుగయింది. కంగారుగా రాజేష్ కు ఫోన్ చేసింది.

"కేసు ఫయిల్ చేసాము. ఇరవై నాలుగు గంటల వరకు ఆగాలి, ఆ తర్వాతే సర్చింగ్ టీమ్ను పంపుతారట. ఇప్పుడు ఎమీ చేయలేము అంటున్నారు. ఇంటికి వస్తు..." రాజేష్ గొంతు దుఖంతో పూడుకు పోయి మాట పైకి రాలేదు. అది విని జయకు కళ్ళు తిరిగాయి.

"గంగా! ఎక్కడున్నావు తల్లి , ఒకసారి ఫోన్ చెయ్యి, మా మనసులు కుదుట పడతాయి. కారేమైనా ట్రబుల్ ఇస్తోందేమో .ఎవరైనా ఫ్రెండ్ ను డ్రాప్ చేయడానికి వెళ్ళారేమో!!" జయ మనసులో ఆలోచనలు రేసు గుర్రంలా పరుగెడుతున్నాయి.

వినోద్ చిన్నాన్నకు హైదరాబాదులో చాల పలుకుబడి ఉందని రాజేషుకు గుర్తు రాగానే పోలీస్ స్టేషన్ నుండే వినోద్కు ఫోన్ చేసి జరిగిందంతా వివరంగా చెప్పాడు. వినోద్ బెడ్ లోంచి ఎగిరివెంటనే తను చేయాల్సిన పనిలో మునిగి పోయాడు.

రాజేష్ ఇంటి ముందు కారు ఆపుతూ అప్పుడే కారులోంచి దిగుతున్న వినోద్ ను చూసాడు.

"పోలీస్ స్టేషనుకు వెళ్ళాక ఈ పోలీస్ స్టేషన్ కాదు ఆరు మైళ్ళ దూరంలో ఉన్న మరో పోలీసు స్టేషన్ అడ్రస్ ఇచ్చి అక్కడ మీరు కేస్ ఫైల్చేయండి అన్నారు. ఆ పోలీసు స్టేషనుకు వెళ్ళాము. జయరాంకు తెలిసిన యస్ ఐ కి ఫోన్ చేసాడు. కొన్ని గంటలు కనబడక పోతే మిస్సింగ్ కాదు, ఇరవై నాలుగు గంటలు అయితే మిస్సింగ్ కేసవుతుందిట. అమ్మాయిలకు ఏదైనా సహాయం కావలసి వస్తే ఎలా! ఎంత గాబరా పడుతున్నారో, ఎక్కడ ఉన్నారో! నేను జయరాం కలిసి పార్టీ జరిగిన హోటల్ కు వెళ్లి ఆ చుట్టు పక్కల డ్రైవ్ చేసాము. కానీ వాళ్ళ కారు ఎక్కడా కనబడలేదు. ఎవరింటికైన వెళితే గంగ తప్పకుండా ఫోన్ చేస్తుంది." రాజేష్ వణుకుతున్న చేతులతో మొహాన్ని తుడుచుకుంటూ వినోద్కు, జయకు చెప్పాడు. జయ సుషుప్తా వస్థలో వింది.

ఉదయం ఎనిమిదవుతోంది. అధికారుల నుండి ఫోన్ కాల్సు వచ్చేసరికి పోలీసులు ఉరుకులు పరుగులతో జీపు లేసుకుని నాలుగు వైపులా వెతకడానికి వెళ్ళారు. ఫోన్లు పట్టుకుని కూర్చున్నారు జయ, రాజేష్, వినోద్.

"పోలీసులు సర్చ్ మొదలు పెట్టారు. త్వరలోనే తెలుస్తుంది. ఇంకో గంటలో గంగ తిరిగొస్తుంది జయా.' దేవుడి గదిలోనే కూర్చుని ఏడుస్తున్నజయకు ధైర్యం చెప్పాలని కరుణ ప్రయత్నించింది.

"ఈ హడావుడికి పిల్లలు దడుచుకుంటారు. వీళ్ళను మాఇంట్లో వదిలి వస్తాను. అమ్మ వీళ్ళను చూసు కుంటుంది." అంటూ అమ్మాయిలను కరుణ తనతో వాళ్ళింటికి తీసుకెళ్ళింది. పోలీసు స్టేషన్ నుండి ఫోన్ చేసారు– కారు ఒక చోట, రెండు శవాలు మరో రెండు చోట్ల దొరికాయని ఐడెంటిఫై చేయడానికి రాజేష్, జయరాంను రమ్మన్నారు.

అక్కడ రక్తం మరకలతో, మొహం, వళ్ళు గాయాలతో చూడటానికి హృదయ విదారకంగా ఉంది.

"నా బంగారు తల్లీ! అయ్యో నా తల్లిని ఎంత హింసించారు! ఆ రక్తపు ధారలు చూడండి. మొహం మీద అంతా రక్తమే! ఆ కమిలి పోయిన మచ్చలు చూడండి!! నా బిడ్డను చంపేసారు." అస్తవ్యస్తంగా, మతి చలించిన వాడిలా మాట్లాడుతూ గజ గజ వణికి పోతున్న రాజేష్ ను బయటికి తీసుకొచ్చారు పోలీసులు. జయరాం కట్టెలా బిగుసుకు పోయాడు.

★★★★★★★★★★★

రాజేష్, జయ తమ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసు కునే స్థితిలో లేరు. వినోద్, కరుణ దగ్గరుండి అన్ని వాళ్ళే చూసుకుంటున్నారు. బంధువులు, మిత్రులు అందరూ తోడై వారికి ధైర్యాన్ని ఇస్తున్నారు. కడుపు కోత చిన్నదా!

ఇంతలో రింగవుతున్న ఫోన్ ఆదుర్దాగా అందుకుని "హలో" అన్నాడు రాజేష్ వణికే గొంతుతో.

జయ గదిలో దేవుడి పటం ముందు కూచుని చీరకొంగు రెండు చివరలను జోలె లాగ పట్టుకొని 'నా గంగను క్షేమంగా నాకివ్వు తండ్రి.' ఆ పటాన్ని వేడుకుంటోంది. పటంలో లాగ చలనం లేని మనుషులు కూడా చాలా మంది ఉన్నారు.

"గ్యాంగు రేప్, ఇద్దరు యువతుల మరణం" అంటూ వార్తల మీద వార్తలు రంగులు దిద్ది, రకరకాల వీడియోలు చూపిస్తూ నిర్దాక్షిణ్యంగా ప్రజలపై కుమ్మరిస్తున్నారు జీతాల మీద బతికే చోటా గాండ్లు.

"ఆ రాక్షసులు దొరికారట. వాళ్ళను అక్కడికక్కడే కాల్చేయండి." టివి చూస్తున్న జయ కజిన్ కసిగా అంటున్నాడు.

"ఇద్దరిలో కరాటే తెలిసిన ఒకమ్మాయి ఆ దుండగులలో ఒకడి కాలు విరిచేసింది. మరొకడి చెయ్యి విరిచింది. వాళ్ళను దెబ్బ తీస్తూ చివరి వరకు పోరాడిందట. ఆమె వాళ్ళ బారి నుండి తప్పించుకుని పారిపోతుంటే ఆ దుండగులు  ఆమెను పట్టుకుని తల నేలకేసి కొట్టడం మూలాన చని పోయింది. దొరికిన ఇద్దరు దుండగుల ద్వారా తెలిసిన విషయం..."

"మన బిడ్డ జీవాత్మ ఎంత తల్లడిల్లిందో కదా!!" అంటూ రాజేష్, జయ ఒకరినొకరు పట్టుకుని గుండెలు పగిలేలా ఏడ్చారు. టివి లో "నలుగురు యువకులు ఇద్దరు యువతులను..." ఎవరో వెళ్లి టివిని టక్కున ఆపేసారు.

"జెండా మీదికి ఎగిరేసి సతంత్రం ఒచ్చిందని ఓ..మురుస్తరు. జెండా కాదు ఎగిరేశేది నీతిని అంత మీదకు ఎగిరేసి మురిసేటోడు ఒక్కడుంటే సూపియ్యి థూ! ఏం మనుసులే ఈల్లు. బంగారంలాంటి బిడ్డను పొట్ట వెట్టు కున్నరు." మొఖం చిట్లించాడు వార్త విని పరుగు పరుగున వచ్చిన తోటమాలి.

వినోద్ చిన్నాన్న రాజేష్ ను పరామర్శించడానికి వచ్చాడు.

"చాల అన్యాయం జరిగింది. ఇలాంటివి ఇక ముందు జరగకుండా ఆపాలి." చలనం లేని రాజేష్ ను ఎంతో ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు. దేవుడి ముందు జోలె పట్టుకుని కూర్చున్న జయ దగ్గరకు వెళ్లి, "జయమ్మా! జరగకూడనిది జరిగింది. దుర్మార్గులను పట్టుకోవడానికి గట్టి ప్రయత్నం జరుగుతోంది." అంటూ రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్న అతని ముందుకు జయ వచ్చి తన కొంగు జోలె అతని ముందుకు చాపి,

"నా గంగను నాకివ్వండి. నాబిడ్డను నాకివ్వండి." కన్నీళ్ళతో అర్థించింది.

ఆమె బాధను చూడలేక కళ్ళు తుడుచుకుంటూ అతను దండం పెట్టి వెను దిరిగాడు. అక్కడే నిలబడ్డ ఒక బంధువు

"ఇంటింటికి సేక్యూరిటీలు పెట్టుకుంటారు ఈ నాయకులు. కానీ మన దేశంలో గల్లి గల్లీకి సేక్యూరిటి కావాలి. అప్పుడు గాని ఈ దుర్మార్గుల సంత తగ్గదు." వచ్చిన వాళ్ళు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు.

"స్వతంత్రం వచ్చిందని పెద్ద పండుగ చేసుకుంటారు. స్వతంత్రం ఎవరికి? దేశానికా, పురుషులకా? స్త్రీ ఒంటరిగా నాలుగు అడుగులు వెళితే దోచుకునే మగవాడు ఉన్నంత కాలం స్వతంత్రం అనే పదానికి అర్థమే లేదు. ఆనాడు నిండు సభలో ద్రౌపదికి మానభంగం జరిగినపుడు పదవులిచ్చిన ఆసనాల్లో కూర్చున్న మహా మహులు ఒక్కరైనా ద్రౌపదికి సహాయం చేసారా! చేయి కూడా కదప కుండా అసీనులయ్యే ఉన్నారు. ఈనాడు నాయకులు కూడా అంతే. పదవులు వాళ్ళను బలహీనం చేస్తాయి. స్త్రీ జీవితంలో ఆనాటికి ఈనాటికి తేడా ఏమీ లేదు. అందుకే ప్రజలం మనమే ముందుకు రావాలి." స్త్రీల అన్యాయాలను ఎత్తి చూపుతూ న్యాయం కావాలని వాదించే మహిళా సంఘ అధ్యక్షురాలు మిస్ నందిని కోపంతో బుసలు కొట్టింది.

నిర్జీవమైన రోజులు గడిచి పోతున్నాయి. జయ, రాజేష్ లకు దేని మీద ఆసక్తి లేదు. ఒక జీవితాన్ని అంత సులభంగా ఎలా అంతం చేయగలిగారు రాజేష్ ఊహకు తట్టనిది. దుండగులు దొరకడం వాళ్ళకు శిక్ష పడటం జరిగింది, కానీ గంగ తిరిగి రాలేదుగా!

★★★★★★★★★★★

ఒక సంవత్సరం బరువుగా ముందుకు కదిలింది.

ఒక ఆదివారం నవ యువతీ మండలి బిల్డింగులోని హాలు జనంతో నిండి పోయింది. బేనర్ పై, "గంగ కరాటే అకాడమి" అందంగా కదులుతోంది. వచ్చిన వారు టేబుల్పై ఉన్న ఫోల్డరు తీసుకుని అందులో ఉన్న వివరాలు చూసుకుంటున్నారు. కొంతమంది వాళ్ళ పిల్లల్ని కరాటే క్లాసుల్లో చేర్చడానికి లైనులో నిలబడ్డారు.

హాలుకు పక్కనున్న గదిలో  కావేరి మరి కొంత మంది అమ్మాయిలు కరాటే డేమాన్స్ట్రేషను ఇస్తున్నారు.

దూరంగా నిలబడి క్లాసులో జరిగే కరాటేను గమనిస్తున్న  ఒక మధ్య వయస్సతను రాజేష్ దగ్గరకు వచ్చి,

"మీరు కరాటే ఎక్కడ నేర్చుకున్నాడు? మీరు మన దేశం అంటూ వచ్చి మీ అమ్మాయిని పోగొట్టు కున్నా దేశనికి సేవ చేయాలను కుంటున్నారు. మీరు మహాను భావులండి." దండం పెడ్తూ అన్నాడు ఒక మధ్య వయస్సతను.

నవ్వుతూ "చాలా మంది అడుగుతున్నారు." అంటూ స్టేజ్ దగ్గరగా వెళ్లి మైక్ తీసుకున్నాడు.

రాజేష్ గొంతు ఖంగున వినబడింది.

"మీరిందరూ వచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీలో చాలా మంది అడిగే ప్రశ్నలకు జవాబు ఇవ్వాలని మైకు తీసుకున్నాను. నా పెద్ద కూతురు గంగ ఎనిమిదేళ్ళ వయసునుండి కరాటే నేర్చుకుంది. బ్లాకు బెల్ట్ వచ్చింది. తనను  కరాటే క్లాసుకు తీసికెళ్ళి అక్కడ క్లాసు అయిపోయే వరకు ఊరికే కూర్చోవడం ఎందుకని నేను కూడా

పెద్దవాళ్ళ క్లాసులో చేరి పోయాను. మొదట్లో కాస్త వొళ్ళు నొప్పులు తప్పలేదు. అయినా మానకుండా పట్టుదలగా నేర్చుకున్నాను. ఇండియా  వచ్చాక కూడా కావేరి యమున తో కలిసి అందరం ప్రాక్టీసు చేసే వాళ్ళం. మిమ్మల్ని మీరు రక్షించుకునే శక్తి ఉంటె మీమీద మీకు కాన్ఫిడెన్సు వస్తుంది. మహానుభావులు చెప్పినట్టు నాదేశం నాకేమిచ్చింది అని నేను అడగను, నా దేశానికి నేనేమిచ్చానని ఆలోచిస్తాను." రాజేష్ మనసులో గంగ కదిలి గొంతు మరి పెగల లేదు.

"నా కూతురు పదహారేళ్ళు ఉంటుంది, ఆలస్యమేమో అనుకున్నాను కానీ మీమాటలు విన్నాక .. రేపే జాయిన్ చేస్తాను." ఉత్సాహంగా అందొక తల్లి జయతో.

నవ్వుతూ సరే అన్నట్టు తలూపింది జయ.

"సరదాగ నేర్చుకున్న కరాటే ఇప్పుడు ఇలా ఇంతగా ఉపయోగ పడ్తుందని  మీరు కల్లో కూడా అనుకోలేదు కదూ రాజేష్!" పక్కకు వచ్చి నుంచున్న జయ చిన్నగా అంది. వారిద్దరి మనసులో ఒకటే ఆలోచన మెదులుతోంది.

# ఇల్లు

## దీప్తి వల్మీకం

అర్చన కార్ పార్క్ చేసి కాఫీ షాప్ లోకి వెళ్ళింది. చుట్టు చూసి "చాలా మారిపోయింది" అని మనసులో అనుకుంది కూర్చోబోతు.

అదొక చిన్న టౌన్. దానిలో కలిసిపోయినట్టు ఉండె ఒక ఫ్యాక్టరి తాలుకు క్వార్టర్స్. ఆ ప్రాంతానికి ఎం జి కాలని అని పేరు.

అది అర్చనకి అమ్మమ్మ గారి ఊరు. తాతగారు ఆ ఫ్యాక్టరి గుడిలో పూజారి గా పని చేసినప్పుడు క్వార్టర్స్ లో ఉండే వాళ్ళు. ఆ ఇల్లు తనకెంతో ఇష్టమైన ఇల్లు. ప్రతి అణువణువు తెలుసనే నమ్మకం అర్చనకి. ఇప్పటికీ కళ్ళు మూసుకొని ప్రతీ గది, వాటిలో వస్తువులు ఏవి ఎక్కడ ఉండేవో అన్నీ చెప్పగలదు. అమ్మ పెద్ద కూతురు. తరవాత మామలు, పిన్నులు చాలామందే ఉన్నారు కాని వాళ్ళ పిల్లలు ఈ ఇంట్లో గడిపింది తక్కువే. అమెరికా వెళ్ళే ముందు ఒక సారి చూడాలని అనిపించింది తనకి. మళ్ళీ ఎప్పుడు చూస్తుందో, అసలు చూస్తుందో లేదో అని అనుమానం.

అర్చన ఒక్కర్తే కూతురు వాళ్ళ అమ్మ, నాన్నలకి. చాలా గారాబంగా పెరిగింది. ప్రతి సెలవలకి అమ్మమ్మ ఇంటికే వచ్చేది. గుడిలో గంటలు, గంటలు కూర్చోవడం, పక్కన ఉన్న తోటలో తిరగడం, హారతి సమయానికి గంటలు మోగించడం, ఇదే పని. స్నేహితులెవరు లేరు పెద్దగా, అర్జున్ తప్ప.

గుడినించి, ఇంటిని వెనకనుంచి కలుపుతు ఒక చిన్న దారి. అక్కడ ఒక గేటు. దాని పైన రాధకృష్ణ పూల తీగ . అది దాటి లోపలికి వస్తే కొంచం ఖాళీ స్థలం. ఎండాకాలంలో అక్కడే పడుకునేవాళ్ళు. అటుపక్కన, ఇటుపక్కన రకరకాల చెట్లు. చిన్న తోట, పెద్ద తోట అని పేరు వాటికి. ఖాళి స్థలం దాటితే గచ్చు. అక్కడొక పందిరి పైన పాకిన తీగ సంపెంగ. తోటలో కరివేపాకు, సీతాఫలం, కొబ్బరి, జామ చెట్లు, పారిజాతం, డిసెంబర్ పూలు, సదామల్లె, నూరు వరహాలు ఇంక ఎన్నో రకాల పూల చెట్లు ఉండేవి. ఆ చెట్లకింద ఎన్ని పగళ్ళు పుస్తకాలు చదువుతూ గడిపిందో తనకే తెలుసు. చందమామ, బాలమిత్ర , బొమ్మరిల్లు అద్దెకి తెచ్చుకొని చదివేయటం, వెంటనే తిరిగి ఇచ్చేసి షాప్ వాడికి కోపం తెప్పించడం ఇంక గుర్తే.

ఆ ఇల్లు, అందులో ప్రతీ చెట్టు, ప్రతీ కొమ్మ, ప్రతి రెమ్మ నావే, నావే అని అరిచి చెప్పాలని అనిపిస్తుంది అర్చనకి. కాని ఆ ఇల్లు ఫ్యాక్టరిది. ఎవరికీ లేని ప్రేమ తనకెందుకో తనకే అర్థం కాదు.

ఎవరో తననే చూస్తున్నట్టు అనిపించి ఆలొచనల్లోంచి బయటకి వచ్చి చుట్టూ చూసింది. అర్జున్ కాఫి తాగుతూ తనవైపే చూస్తున్నాడు. సంతోషం పట్టలేక పరిగెత్తి వెళ్ళింది ఆ టేబుల్ దగ్గరికి,

"అర్జున్ నువ్వేంటి ఇక్కడ" అంటూ. అర్జున్ లేచి అర్చనను దగ్గరికి తీసుకున్నాడు "గుర్తు పట్టవనుకున్నాను" అంటూ. అర్చనకి ఒక్కసారిగా ప్రపంచం ఆగిపోయినట్టు, కాలం గిర్రున వెనక్కి తిరిగినట్టు ఉంది.

"ఇది కలా, నిజమా అర్జున్?"

"నిజం, కలలాంటి నిజం. నువ్వేంటి ఇక్కడ? ఇన్ని సంవత్సరాల తరవాత" అన్నాడు అర్జున్.

"అమెరికా వెళ్ళిపోతున్నాను అర్జున్, ఒకసారి తాతగారి ఇల్లు చూడాలని అనిపించింది"

అర్జున్ కళ్ళలో సంతోషం, బాధ ఒకేసారి తొంగిచూసాయి.

"నీకొక విషయం తెలుసా? ఇప్పుడు ఆ ఇంట్లో నేనే ఉంటున్నాను. ఫ్యాక్టరిలో ఇంజనీయర్ని" అన్నాడు.

పిచ్చెక్కినంత పనైపోయింది అర్చనకి.

"అవునా...ఓ అర్జున్...ఐ యాం సో హాపి. నేను ఒకరోజు ఉండిపోవచ్చా?" అంది అర్చన, అని నాలుక కరుచుకుంది. "సారి, మీఆవిడకి ఓకె అయితేనే" అంటూ.

నవ్వేసాడు అర్జున్, "ఏమి పర్లేదు, పద వెళ్దాం" అని లేస్తూ.

గుండె వేగం పెరిగింది అర్చనకి ఇంటిదగ్గరికి చేరుతూనే. కార్ ఆగకుండానే కిందికి దిగింది అర్జున్ వారిస్తున్నాకూడా.

"దేవుడు ఉన్నాడు అర్జున్, ఉన్నాడు. ఇక్కడికి వచ్చి ఈ ఇంట్లో వాళ్ళని ఏమని అడగాలో, ఏమని మాట్లాడాలో ఏమి ఆలోచించలేదు, వచ్చేసాను, అంతే. నువ్వు ఉండటం ఎంత విచిత్రం"

"నిజమే, ముందు లోపలికి వెళ్దాం రా"

"లేదు, గుడి వైపు నుండి వద్దాం రా" అంది అర్చన చెయ్యి పట్టుకొని లాగుతూ.

"సరే పద" అన్నాడు అర్జున్ తన వెనకే నడుస్తూ.

గుడి మెయిన్ గేట్లోనుండి ఇంటివైపు చిన్న దారిలోకి నడిచారు ఇద్దరు. గుడి పక్కన ఒక మండపం, రామనవమికి కళ్యాణం అక్కడే జరిగేది. రెండడుగులు వేస్తే ఒక డ్రామా స్టేజి, పక్కన కొన్ని రూములు ఏవైన శుభకార్యాలకి అద్దెకి ఇవ్వటానికి. వాటి గురించి అర్జున్ కి చెప్తూ నడిచింది అర్చన.

చిన్న గేట్ పైన రాధాకృష్ణ పూలతీగ ఇంకా పెద్దగా పెరిగింది.

“ఇరవై సంవత్సరాలు" అనుకుంది అర్చన నిట్టూరుస్తూ. గేట్ దాటగానే ఉండాల్సిన ఖాళీ స్థలంలో ఏవో పనికిరాని వస్తువులు, తోటలో కొన్నే చెట్లు ఉన్నాయి. మనసంతా ఏదోలా అయిపొయింది అర్చనకి.

"బాధగా ఉందా? కొంచం క్లీన్ చేయిస్తే సరిపోతుంది" అన్నాడు అర్జున్.

అవునన్నట్టుగా తలాడించింది అర్చన.

ఇల్లు కూడా లోపల మారిపోయింది. శుభ్రంగా, పొందికగా ఉంది. హాల్ అలానే ఉంది కాని మంచి సోఫా సెట్ ఇంకా అందాన్ని ఇచ్చింది రూంకి. పైన రేకుల బదులు సిమెంట్ స్లాబ్ అయ్యింది. వంటిల్లు కొత్త రూపు తెచ్చుకుంది.

"చాలా బావుంది" అంది అర్చన మెచ్చుకోలుగా. "మీ ఆవిడ చాలా చక్కగా అలంకరించింది".

గట్టిగా నవ్వేసాడు అర్జున్, "నేనే మా ఆవిడ" అన్నాడు.

"పెళ్ళి చేసుకోలేదూ?" అంది ఆశ్చర్యపోతూ.

సమాధానం చెప్పలేదు అర్జున్. "ఫ్రెష్ అయ్యి రా అర్చనా, డిన్నర్ చేద్దాం" అన్నాడు.

ఇద్దరు కలిసి సింపుల్గా అన్నం, వంకాయ కూర, పప్పు తో వంట ముగించారు.

"కాసేపు బయట కూర్చుందామా?" అని అడిగింది అర్చన. ఇద్దరూ తోటల మధ్య గచ్చు మీద కుర్చీలు వేసుకొని కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పు. అమెరికా ఎప్పుడు వెళ్తున్నావు?"

"ఇంకో రెండు వారాల్లో. అమ్మ,

నాన్నా లేరు, ఇక్కడ ఇంకేం లేదేమో అర్జున్" అంది గొంతులో ఏదో అడ్డుపడుతున్నట్టుగా.

"మరి నేను?" అని పైకి అనలేదు అర్జున్.

అర్జున్,అర్చన చిన్ననాటి స్నేహితులు, అనుకోకుండా ఇంజనీరింగ్ కాలేజి లో మళ్ళీ కలిసారు, ఇష్టపడ్డారు కాని పరిస్థితుల కారణంగా విడిపోయారు. పెళ్ళిని పోస్ట్ పోన్ చేస్తూ గడిపారు. మళ్ళీ కలుస్తారనుకోలేదు.

"ఈ ఇల్లు నేను కొనుక్కున్నాను తెలుసా అర్చన!" అన్నాడు అర్జున్ హటాత్తుగా.

"అవునా, ఎప్పుడు? ఎలా? ఫ్యాక్టరి వాళ్ళు అమ్మరు కదా"

"ఈ మధ్య కొంత నష్టాల్లో పడితే ఉద్యోగులకి ఆఫర్ ఇచ్చారు కొనుక్కొనమని, మైంటనన్స్ బాధ్యత తగ్గించు కోవటానికి" చెప్పాడు అర్జున్.

"ఈ ఇంట్లో ఉంటే నీ పక్కన ఉన్నట్టు ఉంటుందని వెంటనే కొన్నాను. నీకు ఈ ఇల్లు ఎంత ఇష్టమో నాకు తెలుసు. ఈ ఇంట్లొ ఎక్కడ ఏ రూం లో ఉన్నా, నువ్వు చెప్పిన ఎదో ఒక విషయం గుర్తు వస్తుంది అర్చన. నువ్వు లేవు కాని నీ

జ్ఞాపకాలు చాలనుకున్నాను" బాధగా చెప్పాడు.

"అర్జున్, అందరికి వాళ్ళ చిన్నప్పటి ఇల్లంటే ఇష్టం ఉంటుంది, కాని, నాకేంటో ఈ తాతగారి ఇల్లంటే ఇష్టం. నాస్టాల్జియా కావొచ్చు. గడిచిపోయిన కాలంలో ఏదో సంతోషం. అంతేనంటావా?" అంది అర్చన సాలోచనగా.

"కాని ఒక్కసారి చూసి వెళ్ళాం అనుకొని, ఒకరోజు ఉండటం మాత్రం అదృష్టమే" అంది.

"అర్చనా, ఒక్కరోజు కాదు, ఇక్కడే నాతో ఉండిపోవా? ఈ ఇల్లు నీది, నేనూ నీవాడినే, ప్లీజ్" అన్నాడు అర్జున్.

"ఇప్పుడు ఒకరు మన పెళ్ళికి ఒప్పుకోవాలనే అవసరం కాని, ఆలోచన కాని నాకు లేవు. అసలు పెళ్ళే కావాలనే కోరికా లేదు. నువ్వుంటే చాలు. నీకిష్టమైనన్ని రోజులు. నిన్ను బలవంతపెట్టను. నాకు ఇక్కడ జాబ్ రావటం, ఈ ఇల్లు అమ్మకానికి రావటం అంత ఏదొ ఒక కారణం లేకుండా జరగదని నాకు అనిపించేది, అదే ఇప్పుడు నిజం అయ్యింది. ఈ పదిహేను సంవత్సరాలు ఇప్పుడొక పదిహేను నిమిషాలలాగా అనిపిస్తున్నాయి".

అర్చన లేచి అర్జున్ దగ్గరగా కూర్చుని, అతని ముఖాన్ని రెండు చేతులతో పట్టుకుని కళ్ళలోకి చూస్తూ "మరి నా ఉద్యోగం?" అంది. కాని అతన్ని హత్తుకోకుండా, చుంబించకుండా ఉండలేకపోయింది. కాలం ఆగిపోయింది, మధ్యలో ఆగిపోయిన కథని పూర్తి చేయడానికా అన్నట్టు.

"నీ ఇష్టమే నా ఇష్టం, నీకోసం ఎదురుచూస్తాను, తిరిగి రావటం, రాకపోవటం నీ ఇష్టం. నువ్వు ఈ ఇల్లే కావాలంటె నీకే అమ్మేస్తాను"

"లేదు అర్జున్, నువ్వే కావాలి. నువ్వు ఉంటావని, నీతో ఈ ఇంట్లో ఉండాలని రాసిపెట్టి ఉన్నందుకే నాకు అంత పిచ్చి ప్రేమేమో ఈ ఇల్లంటే. ఇప్పుడే, ఈ క్షణమే పెళ్ళి చేసుకుందాం. అమెరికా వెళ్తాను కాని తొందర గా తిరిగి వచ్చేస్తాను. తరవాత ఈ ఇంట్లోనే ఉందాం, తోట బాగుచెయ్యాలి, ఇంట్లొ కొన్ని రిపేర్స్ చేయించాలి, ఇంకా ఎన్నో.. .మన రిటైర్మెంట్ ఇక్కడే" అంది అర్చన. తాతగారి ఇల్లు ఇప్పుడు తన ఇల్లు.

# అనురాగ్

డా. పేరం ఇందిరా దేవి

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తోంది. ఊరు వాడా అదే గోల. ప్రభుత్వ ప్రచారసాధనాల్లో, టీవీల్లో, ఫోన్ లో, వాట్సాప్ లో కరోనా భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించే. అపార్ట్మెంట్ లో ఒక ఇంట్లో వ్యక్తికి కరోనా సోకిందని ఆ ఇంటివారందరినీ క్వారంటైన్ కి తీసికెళ్ళారు. మిగతా ఇళ్లలోని వారిని కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రానివ్వడంలేదు. బయట ఒక పోలీస్ ను కాపలాగా కూడా పెట్టారు. ఏదైనా కావాల్సిన వారు ఆయనకు ఫోన్చేస్తే ఆయన తెచ్చిఇచ్చేవాడు. ఎవరూ బయట కనపడటంలేదు. దిగ్బంధం అంటే ఇదేనేమో. ఎప్పుడూ పిల్లల ఆటలతో, పెద్దల హడావుడి కదలికలతో  ముసలివాళ్ల సమావేశాలతో కళకళ లాడే ఈ అపార్ట్మెంట్ నిశ్శబ్దానికి నిలయమైంది. ఆఫీసులు, బళ్ళు, కళాశాలలు ఏవీ నడవడంలేదు కాబట్టి అందరు ఇళ్లలో బందీలయ్యారు.

బయటికి వెళ్లలేని నా నిస్సహాయతలో నాకున్న ఒకే ఒక ఆనందం కిటికీ. టీవీ, పుస్తకాలు, సెల్ఫోన్ ఇవి మూడూ విసుగు కలిగించినప్పుడు బాహ్య ప్రపంచం ఉనికిని తెలిపేది కిటికీ. ఒక గది కిటికీలో నుండి చూస్తే దూరాన వున్న జగన్నాథగట్టు, కొండచుట్టూ వున్న పచ్చదనం ఆహ్లాదంగా ఉంటుంది. మరొక గదిలో నా కిటికీకి ఎదురుగా పక్కింటి వాళ్ళ కిటికీ ఉంటుంది. అన్ని ఇళ్ళ తలుపులు ఎప్పుడూ మూసుకుని ఉంటాయి. ఎప్పుడైనా ఏ ఇంటి తలుపైనా

తెరుచుకున్న మరుక్షణంలోనే దుమ్ము రేగినప్పుడు అదిరిపడ్డ కంటి రెప్పలా అవి వెంటనే మూసుకు పోతాయి. పక్కింటి కిటికీ గుండా నా లాగే బయటి ప్రపంచాన్ని చూస్తుంటాడు రెండేళ్ళ బాబు. నిప్పులవలయం మధ్యలో చిక్కుకున్న లేడి పిల్లలా ఆ చిన్నారి ముఖంలో బేలతనం, ఆ లేడి కళ్లలాగే వున్న తెల్లటి కళ్ళలో నల్లటి కనుపాప బిత్తర పోయి చూస్తుంటుంది. ఎప్పుడూ కిటికీ చువ్వలు పట్టుకుని వాడు ఖైదీని తలపిస్తుంటాడు.

అప్పుడప్పుడు కోపంగా కిటికీ ఇనుప చువ్వల్ని చిన్నారి చేతుల్తో విరిచివేయడానికి విశ్వప్రయత్నం చేస్తుంటాడు. ఆకాశంలో ఎగిరే పక్షుల్ని, కదులుతున్న మేఘాల్ని పిలుస్తుంటాడు. ఏ భాషా కాని భాషలో మాట్లాడుతుంటాడు. వాళ్ళమ్మ వాడికి అక్కడే అన్నం తినిపిస్తుంది. నేనెప్పుడు ఆ కిటికీ పక్కకి వెళ్లినా ఆ బుజ్జాయి అక్కడే ఉంటాడు. వాడ్ని చూసినప్పుడల్లా గాఢంగా హత్తుకోవాలనిపిస్తుంది. ఆ చిన్నారి అమాయక ముఖంలోకి తదేకంగా చూడాలనిపిస్తుంది. వచ్చిరాని వాడి ముద్దు మాటలు వినాలనిపిస్తుంది.

ఈ ఇంటిని కొని అయిదేళ్ల క్రితం నేను వచ్చినప్పుడే పక్కఇంటిని కొని, దంపతులు ప్రసాద్, జయ, వాళ్ళ అబ్బాయి జయంత్, అమ్మాయి జాన్వీ చేరారు. ఇంట్లో చేరిన నెలకే అమ్మాయికి పెళ్లిచేశారు. బయటివారు మరీ ఎక్కువ రాలేదు కానీ అపార్ట్మెంట్ లోని వారందర్నీ ఆహ్వానించి, ఎంతోఆత్మీయంగా పలకరించి అందరి ప్రశంశలు పొందారు. తర్వాత కొద్దికాలానికే కొడుక్కి పెళ్లి చేశారు. ఈసారి కూడా తక్కువ సంఖ్యలో బయటి అతిధులు, అపార్ట్మెంట్ వారందరం హాజరయ్యాము. కొడుకు, కోడలు హైదరాబాదులో వుంటారు, కూతురు అమెరికాలో వుంటుంది. కూతురు కోసం ప్రసాద్, జయ ఆరు నెలలు అమెరికాలో వుంటారు, ఆరునెలలు ఇక్కడ వుంటారు. మధ్యలో కొడుకు, కోడలు వస్తుంటారు. ఎంతో సంతోషంగా వుంటారు కుటుంబ సభ్యులందరు. జయ, ప్రసాద్ అందరితో కలిసిపోతారు...ఎవరికీ ఏ సహాయం చేయడానికైనా వెంటనే ముందుకొస్తారు. వాళ్ళు అమెరికా పోయినప్పుడు నాకు చాలా ఒంటరిగా అనిపిస్తుంది. మిగతా ఇళ్లవాళ్లు అసలు బయటికి రారు. జయ ఒక్కతే బాగా దగ్గరైంది నాకు. వాళ్ళుఎప్పుడొస్తారా అని నేను ఎదురుచూస్తున్నప్పుడు కరోనా వచ్చింది

"ఇంక ఎప్పుడొస్తామో ఏమో...మాక్కూడా విసుగ్గావుంది ఇంట్లోనే ఉండడం... విమానాలు తిరగ్గానే వచ్చేస్తాం" అంది జయ.

పక్కింట్లో పనమ్మాయి శుభ్రం చేస్తుంటే జయ ప్రసాద్ వస్తున్నారేమోనని అతృతగా ఫోన్చేశా.

"మేం రావడంలేదు, కరోనా వలన జయంత్ కు స్నేహాకు ఆఫీస్ కు వెళ్లాల్సిన అవసరం లేదట...ఇంట్లోంచే పని చేయొచ్చుట హైదరాబాద్ లో ఉండడం దేనికి అని మనింటికి వస్తున్నారు ... కోడలికి ఏదైనా అవసరం వస్తే నిన్ను అడగమని చెప్పా ... బాబుతో ఒక్కతీ చేసుకోలేదు ఆఫీస్ పని కూడా ఉంటుంది కదా. కొంచం చూస్తూ వుండు" అంది.

వాళ్ళు వచ్చిన రోజు నుండి బయటకే రాలేదు...నేను వెళ్లి పలకరిద్దామా అనుకునే లోపల అందరం ఇళ్లకు బంధీలమయాం. జయ కొడుకు కోడలు నాకు పెద్దగా పరిచయం లేదు కానీ బాల్కనీ నుండి రెండు మూడు సార్లు పలకరించా... ఏమైనా అవసరమైతే అడగమని, తలూపింది కానీ ఎప్పుడూ ఏమీ అడగలేదు. నేను కిటికీ దగ్గర వున్నప్పుడు పలకరింపుగా నవ్వుతుంది స్నేహ, అంతే.

ఆ చిన్నారి పేరు అనురాగ్ అట జయ చెప్పింది. ఆ కిటికీ దగ్గరకు నాకు తెలియకుండానే నేను వెళుతుంటాను... వాడ్ని చూడ్డానికి ఎప్పుడెప్పుడు ఎనిమిదవుతుందా అని చూస్తుంటాను...వాళ్ళమ్మ వాడ్ని ఎనిమిదికి బాగా ముస్తాబు చేసి కిటికీకి వాడ్ని అతికించి పాలుత్రాపిస్తుంది...తొమ్మిదికి టిఫిన్ తినిపిస్తుంది. ఇంక పక్కనే కూర్చుని తనలాప్టాప్ ముందేసుకుని పనిచేసుకుంటుంది.

రోజూ ఇదే. కార్యక్రమం... అనురాగ్ ని చూడటం నాకు ముఖ్యమైన దినచర్య గా మారింది ... మా అబ్బాయిలతో మాట్లాడినా, ఇంకెవరితో మాట్లాడినా అనురాగ్ చర్చవచ్చేది. అనురాగ్ ను చూస్తుంటే నా కొడుకుల చిన్నప్పటి మధురజ్ఞాపకాలు గుర్తుకొచ్చి...పిల్లలు పెద్దవకుండా అలాగే ఉంటే ఎంత బావుండేది! ఎందుకుపెద్దగవుతారా? ఎందుకు దూరమవుతారా అనిపిస్తుంది. మళ్ళీ ఎప్పుడెప్పుడు పిల్లలు పెద్దగవుతారా అని తలుచుకున్న రోజుల్ని గుర్తు చేసుకుని నవ్వుకుంటాను. మనిషి నైజం ఇది. వున్నప్పుడు దేని విలువ తెలియదు.... లేనప్పుడు ఎంత కోరుకున్నా దొరకదు. నా కొడుకులు కూడా జయంత్ వయసువాళ్ళే. వాళ్లకు పెళ్లి ఆలోచనేలేదు. లేకపోతే నాకు అనురాగ్ లాంటి ముద్దులొలికే చిన్నారి మనుమడో, మనుమరాలో ఉండేది. ప్చ్ ఏంచేస్తాం? ప్రస్తుతానికి వున్న ఆశీర్వాదం అనురాగ్ ను చూడ్డమే.... ఎడారిలాంటి ఒంటరితనంలో...మనల్ని మనమే బంధించుకున్న బందిఖానాలో... అనురాగ్ గొప్ప అదృష్టం...అనుకుంటాను. ఈ బందిఖానా ఇంకెన్నాళ్లో...! ఆ తర్వాత పక్కిల్లేగా వెళ్లివాడ్ని చూడొచ్చు, ఎత్తుకోవచ్చు. రోజూ నన్ను చూసి నవ్వుతాడు. సంతోషంతో కేకలేస్తాడు...రమ్మని సైగచేస్తాడు, దా...దా అంటూ పిలుస్తాడు కాబట్టి నా దగ్గరికి వస్తాడు... ఆవిధంగా నా మనసు లో అనురాగ్ పై ఆశలు మొదలయ్యాయి. పుస్తకం చదువుకుంటూ మధ్యలో వాడు కిటికీ దగ్గరున్నాడేమో అని చూసి రావడం. ప్రైమ్ లో సినిమా చూస్తూ... మధ్యలో ఆపి వాడి కోసం కిటికీ దగ్గరకు వెళ్లడం, వాడు అక్కడ లేకపోతే నిరాశగా అనిపించడం, వాడు కనపడితే చాలు మనసు తృప్తిగా సంతోషంగా అనిపించడం ఇవన్నీ నా లాంటి ధృడమైన వ్యకిత్వం కలిగిన స్త్రీకి వుండొచ్చునా? ఇది బలహీనతనా? నాలో నేను తర్కించుకున్నా...కానీ నాకు సరైన సమాధానం తోచలేదు. ఏ విషయం అయినా శాంతి, సంతోషం కలిగించేది ఉన్నతమైందే దాన్ని అందుకోవడంలో బలహీనత ఏముంది? నన్ను నేను సమాధానపరుచుకోవడానికి ప్రయత్నించాను.

అర్థరాత్రి రెండు గంటలకు జయ ఫోన్.... "ఓహ్ నిద్రపోతుంటావుకదా! లేపక తప్పలేదు...

స్నేహ నాన్న గారికి చాలా బాగాలేదట...ఆయనకు ఒకసారి గుండెనొప్పి వస్తే ఏదో చేశారు నాకు సరిగ్గా తెలియదు...వాళ్ళు వెంటనే హైదరాబాద్ అపోలో కు పోవాలి, అక్కడికి అనురాగ్ ను రానివ్వరట, పైగా కరోనా వుంది కదా ... వాడ్ని ఎక్కడని వదులుతారు? స్నేహ బంధువులు వచ్చి రేపు అనురాగ్ ను తీసికెళతారు...అంతవరకు అనురాగ్ ను మీ దగ్గరుంచుకుంటారా? వాడేమీ మీకు ఇబ్బంది పెట్టడు. హైద్రాబాద్ లో ఉండగా వాడికి అలవాటే..."

నిద్రమత్తు వదిలింది.

"ఇందులో నాకు ఇబ్బంది ఏమిటి జయా! వాడు నా దగ్గర ఇబ్బంది పడకుండా ఉంటే...ఎన్నిరోజులైనా నాకేమీ కష్టంకాదు...పైగా చాలా సంతోషం కూడాను...స్నేహను బాబుకు ఏమివ్వాలో అవన్నీ చెప్పి వదిలి వెళ్ళమని చెప్పు." జయకు హామీ ఇచ్చాను

స్నేహ, జయంత్ చాలా జాగ్రత్తలు చెప్పి వాడి, బట్టలు, అవసరమైన మందులు, అన్నీ ఇచ్చారు.

"మీరు తిరిగి వచ్చేవరకు అనురాగ్ నాతోనే ఉంటాడు, ఎవరి దగ్గరికీ వాడ్ని పంపవలసిన అవసరం లేదు. నిశ్చింతగా వుండు స్నేహా...నాన్నగారి కెలా వుందో ఫోన్చెయ్యి. అంతా మంచిగా జరుగుతుందిలే... దిగులుపడకు" అన్నాను.

కన్నీళ్లు నింపుకుని నిద్రపోతున్న అనురాగ్ ను నా మంచం మీద పడుకోబెట్టి. ముద్దుపెట్టుకుని వాడ్ని వదలలేక నిలబడిపోయింది. "అమ్మా ఏమైనా ఇబ్బంది పెడితే చెప్పండి...విధిలేని పరిస్థితిలో మీకు శ్రమ కలిగిస్తున్నాము" అన్నాడు జయంత్

"లేదు...జయంత్   మీ అమ్మ దగ్గర వదలడానికి బాధపడతారా, ఇబ్బంది పడతారా? లేదుకదా! అలాగే అనుకోండి. అనురాగ్ ను నా దగ్గరుంచుకోవడం నాకు చాలా ఆనందం. సరేనా! వెళ్లి మామగారిని చూసుకోండి. రోజూ ఫోన్లో అనురాగ్ విషయాలు మాట్లాడుకోవచ్చు."

కలా. నిజమా...అర్థంకాలేదు కాసేపు. ఏదైనా మనసులో తీవ్రంగా కోరుకుంటే జరుగుతుందేమో ...! అనురాగ్ తలపై చేయివేసి వాడి నుదుటిపై పడ్డ జుట్టును సవరిస్తుంటే...మనసంతా హాయి నిండింది. అమాయకత్వం నిండిన నిష్కల్మషమైన పసిపిల్లలే లేకపోతే ఈ ప్రపంచంలో ఆనందం ఏముంది?

# కృష్ణా యమున సంగమం

మల్లవరపు సీతారాం కుమార్

లోకసభ ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి.

తన తండ్రి మరణించడంతో రాజకీయాల్లోకి వచ్చిన శ్రీకృష్ణ, గతంలో తన తండ్రి పోటీచేసిన నియోజక వర్గం నుంచే పోటీచేసి, భారీ మెజారిటీ తో గెలిచాడు.యువకుడూ,ఉన్నత విద్యావంతుడూ అయిన శ్రీకృష్ణ కు కేంద్రంలో మంత్రి పదవి ఇచ్చారు. ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే ప్రధాన మంత్రి శ్రీకృష్ణను తనవద్దకు పిలిపించాడు.

"కాలేజీ స్టూడెంటుగా ఉన్నప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఉద్యమాలు చేసావు. అలంటి నిన్ను ఎన్విరాన్మెంట్ శాఖకు మినిస్టరుగా ఎంపిక చేయడం సరైన నిర్ణయమని నేను భావిస్తున్నాను."అంటూ అభినందించారాయన. కృతజ్ఞతలు చెప్పాడు శ్రీకృష్ణ.

“నిన్ను పిలిపించడానికి అసలు కారణం వేరే ఉంది. ఆగ్రాకు సమీపంలో కొత్తగా ఒక భారీ పరిశ్రమ ఏర్పాటుకు, అప్పటి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ పరిశ్రమ వల్ల యమునా నది మరింత కలుషితమవుతుందని పర్యావరణ ప్రేమికులతో పాటు మనమూ ఉద్యమాలు చేశాం. ఆ పరిశ్రమ స్థాపించేది దేశంలోనే ఒక పెద్ద సంస్థ. అధికారంలో ఏ పార్టీ ఉన్నాభారీగా నిధులు సమకూరుస్తారు వాళ్ళు. వారితో వివాదం రాకుండా, వీలయినంత తక్కువ కాలుష్యం ఉండేలా సమస్యను చాకచక్యంగా పరిష్కరించాలి. నీకు మా పూర్తి సహకారం ఉంటుంది. " చెప్పారు ప్రధాని. అంగీకారంగా తలవూపి బయటకు వచ్చాడు శ్రీకృష్ణ. ఆ రోజే తన పిఏను పిలిచి, వెంటనే ఆ ఫ్యాక్టరీ పరిసరాలను తనిఖీ చేయడానికి ఏర్పాట్లు చేయమని చెప్పాడు. అలాగే ఆ ప్రాంతంలో యమునానదిలో ఏ మేరకు కాలుష్యం ఉందొ వివరాలు తెప్పించమన్నాడు.

మరుసటి రోజే ఢిల్లీ నుండి తన కాన్వాయితో బయలుదేరాడు శ్రీకృష్ణ. ముందు ఒక పోలీస్ జీప్, ఒక కార్, వెనుక రెండు కార్లు అతనితో వస్తున్నాయి. ఆ ప్రాంతపు ఎంపీ కూడా వెంట వస్తున్నాడు. ఆగ్రా దాటి పది కిలోమీటర్లు వెళ్ళాక కుడి వైపు ఒక మెటల్ రోడ్ వస్తుంది.

ఆ రోడ్ లో మరో పదిహేను కిలోమీటర్లు వెళితే శ్రీరాంపూర్ వస్తుంది. ఫ్యాక్టరీ ప్రారంభించబోయేది అక్కడే.

మెటల్ రోడ్ లో కాస్త దూరం వెళ్ళాక హఠాత్తుగా రోడ్ ప్రక్కనుండి ఓ ముసలావిడ కారుకు అడ్డంగా వచ్చింది. సడెన్ బ్రేకుతో కారును ఆపాడు డ్రైవర్. భయంతో రోడ్ కు అడ్డంగా పడిపోయిందావిడ.

గబుక్కున కారుదిగి ఆమెను పైకి లేవనెత్తబోయాడు శ్రీకృష్ణ. ఇంతలో రోడ్ మీద ఓ యాభై అడుగుల దూరంలో పెద్ద పేలుడు జరిగింది. గాజు పెంకులు, రోడ్ మీద పరచిన కంకర రాళ్ళూ చెల్లాచెదురుగా పడ్డాయి.. నేలమీదకు వాలిపోయి తనమీదకు రాళ్ళు పడకుండా కాపాడుకున్నాడు శ్రీకృష్ణ. తరువాత నెమ్మదిగా ముసలావిడను పైకి లేవనెత్తాడు.

"కళ్ళు నెత్తి మీద పెట్టుకుని నడుస్తున్నావా? ఎవరు నువ్వు?" గద్దించాడు డ్రైవర్.

"నాకోసం వచ్చి నన్నే ఎవరని అడుగుతున్నవా?" తెలుగులో అంది ఆమె.

"నీకేమీ దెబ్బలు తగల్లేదు కదా అవ్వా?" అడిగాడు శ్రీకృష్ణ.

తన చేతిని చూపించిందావిడ. ఆమె చేతిపైన శ్రీకృష్ణుడి పచ్చ బొట్టు ఉంది.

“నా కృష్ణుడికేమీ కాలేదు. అది చాలు నాకు." అంటూ రోడ్ ప్రక్కన గుబురుగావున్న చెట్లలోకి వెళ్ళిందామె.

వేగంగా ఆలోచించాడు శ్రీకృష్ణ. ఆమె అడ్డు రాకుంటే తన కారు పేలిపోయేది. అంటే తన మీద హత్యాప్రయత్నం జరిగింది. ఆమె తన ప్రాణాలు కాపాడింది.

ఆమె వెళ్లిన చెట్ల గుబురు వైపు చూస్తూ గట్టిగ అరిచాడు "నీ పేరేమిటి అవ్వా!" అంటూ.

"నా పేరు యమునమ్మ. " దూరంనుంచి అస్పష్టంగా వినిపించిందతనికి

ముందు, వెనుక ఉన్నవాహనాలనుంచి పోలీసులూ, పార్టీ కార్యకర్తలు, స్థానిక ఎంపీ దిగారు. అందరూ శ్రీకృష్ణ చుట్టూ చేరారు. అతడు క్షేమంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. అతన్ని వెనక్కి వెళ్ళమని సూచించారు. కానీ ఒప్పుకోలేదతను. బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్ ను పిలిపించి రోడ్ క్షుణ్ణంగా తనిఖీ చేయించాడు. ఇంకెక్కడా బాంబులు, మందు పాతర్లు లేవని నిర్ధారించుకున్నాక ముందుకు ప్రయాణం సాగించాడు శ్రీకృష్ణ. దారిలోనే ప్రధాని నుండి ఫోన్ వచ్చింది.

"ప్రాధమిక సమాచారం ప్రకారం స్థానిక ఎంపీకి వ్యతిరేక వర్గం వారే ఈ పని చేయించి ఉంటారని తెలుస్తోంది. మీ కాన్వాయ్ లో ఆయనకూడా ఉన్నారుకదా! ఐనా పూర్తి స్థాయి దర్యాప్తు జరిపిస్తాను. మీరు తిరిగి వచ్చేయండి. పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి వెళ్ళవచ్చు. " చెప్పారాయన.

"ఫరవాలేదు సర్. యమునను ప్రక్షాళన చేసే విషయంలో రాజీ పడను."ధృడ నిశ్చయంతో చెప్పాడు శ్రీకృష్ణ.

శ్రీరాంపూర్ వెళ్ళగానే ఫ్యాక్టరీ ప్రతినిధులతో సమావేశమయ్యాడు. యూనిట్ ఇంచార్జి తో ఫ్యాక్టరీ వ్యర్థాల గురించి చర్చించాడు.

"ఈ వ్యర్థాలు వాస్తవానికి ౩౦ కిలోమీటర్ల దూరంలో ఉండే లోయలో వెయ్యాలి. ఇది భారీ ప్రాజెక్టు కాబట్టి వ్యర్థాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. అంత దూరం ఈ వ్యర్థాలను పంపడానికి సంవత్సరానికి పది కోట్లు ఖర్చు

అవుతుంది. అలాకాక రెండు కిలోమీటర్లలో ఉన్న యమునా నదిలో ఒక చిన్న కాలువ ద్వారా కలిపేస్తే అంత డబ్బూ ఆదా అవుతుంది. అందులో సగం ఇతరత్రా ఖర్చు చేస్తుంటాము. పార్టీలకు విరాళాలు ఇస్తుంటాము. ఇప్పటివరకు అన్ని చోట్లా జరుగుతున్నది ఇదే. మీరు వేరేలా చెబితే అలాగే నడుచుకుంటాము." చెప్పాడు ఫ్యాక్టరీ ఇంచార్జి.

“నిజమే. కొన్ని ఫ్యాక్టరీల కాలుష్యంతో అంత పెద్ద నదికి ఏమీ కాదని కలపడం మొదలు పెట్టారు. కానీ కొన్ని వందల ఫ్యాక్టరీల వ్యర్థాలు కలవడంతో యమునా నది దాదాపు మురుగు కాలువలా మారింది. ఈ పరిస్థితికి ఎదో ఒక రోజు అడ్డుకట్ట వేయాలి. అందుకు ఈ రోజే బీజం పడిందని తెలుసుకోండి. ఫ్యాక్టరీ వ్యర్థాల నుండి సబ్సిడరీ ప్రొడక్ట్స్ తయారుచేసే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాను. తద్వారా స్థానికులకు ఉపాధి దొరుకుతుంది. వారికి మీ నుండి ముడిపదార్థం ఉచితంగా దొరుకుతుంది. ప్రభుత్వం నుండి కూడా కొన్ని రాయితీలు కల్పిస్తాము. అలా కాలుష్యాన్ని చాలావరకు నివారించవచ్చు. మొత్తం వివరాలు ప్రధాని గారికి సమర్పిస్తాను. వీలయినంత త్వరగా ఈ సమస్యను పరిష్కరిస్తాను. "ఆత్మవిశ్వాసం తో చెప్పాడు శ్రీకృష్ణ.

ఢిల్లీ వెళ్లిన వెంటనే ప్రధానిని కలిసాడతను. శ్రీకృష్ణ ధృఢ సంకల్పాన్ని అభినందించారు ప్రధాని. ఢిల్లీ పరిసరాలనుంచి యమునలో కలిసే కాలుష్యాల నివారణ బాధ్యతను కూడా శ్రీకృష్ణకు అప్పగించారాయన.

ఒక ఆరు నెలలు గడిచాయి. యమునలో కాలుష్యం సగానికి తగ్గింది. నీళ్లలో విషపు రసాయనాల శాతం తగ్గి, ఆక్సిజన్ శాతం పెరగడంతో జలచరాలు సందడి మొదలైంది. కాలుష్య నివారణ పనుల పురోగతిని పరిశీలించడానికి, మరోసారి శ్రీరాంపూర్ వద్ద వున్న భారీ పరిశ్రమను చూడడానికి వెళ్ళాడు శ్రీకృష్ణ.. ఆ ప్రాంతంలో ప్రతి ఫ్యాక్టరీ సమీపంలో వ్యర్థాలను ఉపయోగించుకునే చిన్న చిన్న కుటీర పరిశ్రమలు వెలిశాయి. చాలా సంతోషించాడు శ్రీకృష్ణ. స్థానిక ప్రజలు చాలామంది మాజీ ఎంపీ అక్రమాల గురించి శ్రీకృష్ణకు ఫిర్యాదు చేసారు. ఫ్యాక్టరీకి భూములు సేకరించే విషయంలో కూడా చాలా అక్రమాలకు పాల్పడ్డాడని చెప్పారు. అన్నిటి మీద ఎంక్వయిరీ వేయిస్తాననీ, ప్రజలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చాడు శ్రీకృష్ణ.

ఆ రాత్రికి అక్కడి ప్రభుత్వ అతిథి గృహంలో బస చేసాడు శ్రీకృష్ణ. ప్రొద్దున నిద్రలేచి బాల్కనీ లోకి వచ్చిన శ్రీకృష్ణకు సెక్యూరిటీ తో ఓ నడివయసు స్త్రీ గొడవపడటం గమనించాడు.

"ఈవిడెవరో మీకోసం వెన్న తీసికొని వచ్చిందట. అలాంటివి మీరు తినరని చెబితే వినడంలేదు." అన్నాడు సెక్యూరిటీ.

ఆమెను పైకి పంపామన్నా డు శ్రీకృష్ణ.

ఆమెకు నలభై ఏళ్ళు ఉంటాయి. ముఖంలో చక్కటి వర్చస్సు కనబడుతోంది. ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది. "ఎవరమ్మా నువ్వు?" అని ప్రశ్నించాడు.

"ప్రక్కనే ఉన్న పల్లెటూరు మాది. వెన్న అమ్ముకొని బ్రతుకుతుంటాను. మీ గురించి చాలా గొప్పగా విని ఉన్నాను. మా యమునమ్మకు మంచి రోజులు వచ్చాయని అందరు చెప్పుకుంటున్నారు. ఏదో ఉడతా భక్తిగా కాస్త వెన్న తినిపిద్దామని వచ్చాను." అంటూ తను తెచ్చిన వెన్నను అతనికి ఆప్యాయంగా తినిపించింది.

"నాకు వెన్నంటే ఇస్తామని నీకెలా తెలుసు?" ప్రశ్నించాడు శ్రీకృష్ణ.

"కృష్ణుడికి ఏమి ఇష్టమో యమునమ్మకు తెలియదా! వెన్నెలంటి మనసున్న నీకు వెన్నంటే ఇష్టముండదా." అందామె.

"యమునమ్మ... ఈ పేరెక్కడో విన్నాను. ఆరోజు కారుకు అడ్డంపడి నా ప్రాణాలు కాపాడింది ఒక అవ్వ. తన పేరు యమునమ్మ అని చెప్పింది. ఆమె నీకేమవుతుంది? నువ్వు ఆమె కూతురివా?"

అడిగాడు శ్రీకృష్ణ.

"అంతలా మురికిపట్టిన యమునానది నీ చలవతో అందంగా తయారయింది. మరి ఆ ముసలవ్వే వయసు తగ్గి నా వయసుకు వచ్చిందేమో. ఈ సారి నువ్వు వచ్చేటప్పటికి నది మరింత శుభ్రమవుతుంది. నేనూ వయసు మరింత తగ్గి పాతికేళ్ళదానిలా మారుతానేమో.' చెప్పి నవ్వుతూ వెళ్లిపోయిందామె. వెళ్లేముందు ఆమె చేతిమీద శ్రీకృష్ణుడి పచ్చబొట్టు కనిపించిందతనికి.

"నీ పేరేమిటి?" వెళ్తున్న ఆమెను ప్రశ్నించాడు.

"యమునా బాయి" సమాధానమిచ్చిందామె.

ఢిల్లీ వెళ్ళగానే ప్రధానిని కలిసాడు శ్రీకృష్ణ. శ్రీరాంపూర్ ప్రాంతంలో ప్రజలు మాజీ ఎంపీ గురించి చేసిన ఫిర్యాదుల వివరాలు అందజేశాడు. వెంటనే ఎంక్వయిరీ వేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

సీఎం ల సమావేశం ఏర్పాటు చేశారాయన.

ఆ సమావేశంలో కాలుష్య నివారణ ఆవశ్యకత గురించి శ్రీకృష్ణ చేసిన ప్రసంగం అందరినీ

ఆకట్టుకుంది. శ్రీకృష్ణ చేస్తున్న ప్రయత్నాలను అందరూ అభినందించారు.

నదుల కాలుష్యం గురించి అధ్యయనం చేసిన అంతర్జాతీయ సంస్థ మన దేశంలో నదుల కాలుష్యం చాలా తగ్గిందనీ, ముఖ్యంగా యమునానది దాదాపుగా కాలుష్య రహితమయిందనీ గణాంకాలతో సహా వివరించారు. దేశవ్యాప్తంగా శ్రీకృష్ణకు ప్రశంసలు వచ్చాయి.

కొద్ది రోజుల తరువాత ఆగ్రాలో ఒక యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి శ్రీకృష్ణను ముఖ్య అతిధిగా ఆహ్వానించారు. ఆ కార్యక్రమం ముగించుకున్న తరువాత అతనికి హఠాత్తుగా ఆరోజు తన ప్రాణాలు కాపాడిన యమునమ్మ గుర్తుకు వచ్చింది. ఆమె గురించి తెలుసుకోవాలనుకున్నాడు.

కాన్వాయితో వెళితే ఎటూ తిరగడానికి వీలుకాదు. అందుకే ఒంటరిగా వెళ్ళడానికి నిశ్చయించు కున్నాడు. తన సెక్యూరిటీని పిలిచి ఓ రెండు గంటలపాటు వ్యక్తిగతమైన పనిమీద వెడుతున్నాననీ, వెంట ఎవరూ రావద్దనీ చెప్పాడు. డ్రైవర్ ను పిలిచి శ్రీరాంపూర్ వైపు వెళ్ళమన్నాడు. ఆ రోజు యమునమ్మ తన కారుకు అడ్డువచ్చిన చోట కారు ఆపించాడు. ఆ పరిసరాలను పరిశీలించాడు. కాస్త దూరంలో ఒక చిన్న కుగ్రామం కనిపించింది. అక్కడకు తీసికెళ్ళమన్నాడు. మౌనంగా కారు స్టార్ట్ చేసాడు డ్రైవర్. సడన్ గా తన ఫోన్ మ్రోగడంతో తీసాడు శ్రీకృష్ణ. ఇంటెలిజెన్స్ నుండి ఫోన్.

"ఇప్పుడే ఇన్ఫర్మేషన్ వచ్చింది. మాజీ ఎంపీ మీ డ్రైవర్ ను కొనేసాడు. ఆక్సిడెంట్ చేయిస్తారేమో జాగ్రత్త."

ఫోన్ పెట్టి డ్రైవర్ వైపు చూసాడు శ్రీకృష్ణ.

తను బయట పడ్డానన్న విషయం తెలిసిపోయింది డ్రైవర్ కి.

కారు వేగాన్ని పెంచి ఎడమ వైపు ఉన్న పెద్ద బాండ రాయికేసి పోనిస్తూ తను బయటకు దూకేసాడు డ్రైవర్.

తప్పించుకోవడానికి క్షణం కూడా సమయం లేదు శ్రీకృష్ణకు.

అంతలో ఎవరో లాగినట్లుగా అతను ఉన్నవైపు కార్ డోర్ తెరుచుకుంది. కారులోంచి ఎగిరి దూరంగా ఉన్న పొదల్లో పడిపోయాడు శ్రీకృష్ణ. విపరీతమైన దాహం వేస్తోంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. తనకు స్పృహ తప్పుతోందని తెలుస్తోందతనికి. ఎవరో తన ముఖం మీద చల్లటి నీళ్లు చిలకరించడంతో కళ్ళు తెరిచాడు శ్రీకృష్ణ. ఎదురుగా ఆ రోజు తనని కాపాడిన యమునమ్మ. మళ్ళీ కళ్ళు మూతలు పడ్డయటానికి. స్పృహ కోల్పోయాడతను. ఒక అగాధంలో పడిపోతున్నట్లు, తన ప్రాణాలు పోతున్నట్లు అనిపించింది. అంతలో ఎవరో అతని చేతిని పట్టుకున్నారు. తన చేతిని పట్టుకున్న స్త్రీని దగ్గరకు లాక్కుని బలంగా కౌగిలించుకున్నాడతను. తన చున్నీతో అతని ముఖానికి అంటిన రక్తాన్ని తుడిచిందామె. ఆమె స్పర్శతో తన గాయాలు మానినట్లు తెలుస్తోందతనికి. అప్పుడు గమనించాడు ఆమె చేతిమీద శ్రీకృష్ణుడి పచ్చబొట్టును.

స్పృహ వచ్చిందతనికి. నెమ్మదిగా కళ్ళు తెరిచి చూసాడు.. తను ఇంకా ఆ గుడిసెలోనే ఉన్నట్లు తెలిసిందతనికి.

తన మంచం ప్రక్కనే స్టూలుమీద ఒక అందమైన పాతికేళ్ల అమ్మాయి కూర్చుని ఉంది. మెడలో స్టెతస్కోపుని బట్టి ఆమె ఒక డాక్టర్ అని తెలుస్తోంది. ఆమె ముఖంలో ఒక దివ్యమైన తేజస్సు కనబడుతోంది. 'ఎక్కడ చూసాడు తను?' గుర్తు చేసుకోవడానికి ప్రయతిస్తున్నాడు శ్రీకృష్ణ.

'మాది ఈ వూరే. ఈ మధ్యే మెడిసిన్ చేశాను. మీ పరిస్థితి తెలిసి ఫస్ట్ ఎయిడ్ చేశాను. "చెప్పిందామె.

లేచి కూర్చోవడానికి ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని చూస్తున్నాడు శ్రీకృష్ణ.

"మీకు ఎవరి సహాయమూ అక్కరలేదు. లేవగలరు." చెప్పింది ఆ యువతి.

సులభంగా లేచి కూర్చోగలగడం తో ఆశ్చర్య పోయాడు శ్రీకృష్ణ. ఈమె స్పర్శ తో తన నొప్పి, అలసటా అంతా మాయమయ్యాయి. ఈమె ఎవరో దేవత లాగా ఉంది. ముఖంలో ఆ తేజస్సు ఎక్కడో చూసినట్లు ఉంది. ఆలోచిస్తూ ఆమె చేతి వంక చూసాడు. ఆమె ఫుల్ స్లీవ్స్ చుడిదార్ వేసి ఉండడం తో చేతి మీద పచ్చబొట్టు ఉన్నది, లేనిది తెలియడం లేదు.

"పోతున్న నా ప్రాణాన్ని నిలబెట్టారు. మిమ్మల్ని ఎప్పటికీ మర్చిపోలేను. మీ పేరు తెలుసుకోవచ్చా?" అడిగాడతను.

"వెళ్ళేటప్పుడు చెబుతాను" అందామె.

"యమునమ్మ మీకేమవుతుంది?" హఠాత్తుగా ప్రశ్నించాడు శ్రీకృష్ణ.

'యమున అనగానే ఇప్పుడందరికీ నాలాంటి అందమైన కన్నెపిల్ల గుర్తుకు వస్తుంది. అంతలా మారింది యమునా నది. ఆ యమునమ్మే వయసు తగ్గి నాలా అయిందేమో..." నవ్వుతూ అంది ఆ యువతి.

"అలాగైతే నేనింతటితో యమునా ప్రక్షాళన కార్యక్రమాలు ఆపేస్తాను. లేదంటే కొద్దిరోజులకు నువ్వు బేబీ యమునగా మారుతావు." అన్నాడు శ్రీకృష్ణ.

"అలాగైతే తొందరగా మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేసుకోండి. నేను మీకు పాపగా పుడతాను." అందామె.

"నేను నిన్నే పెళ్లి చేసుకుంటాను." అన్నాడతను.

"నేను నది లాంటి దాన్ని. ఎవరికీ చిక్కను. మీకోసం ఓ అమ్మాయి ఎక్కడో పుట్టి ఉంటుంది." అందామె.

"ఎలా గుర్తు పట్టడం?" ప్రశ్నించాడు శ్రీకృష్ణ.

తన స్లీవ్స్ నీ పైకి మడిచిందామె

ఆమె చేతి మీద శ్రీకృషుడి పచ్చ బొట్టు.

"అన్నట్లు చెప్పడం మరిచాను. మీ కారు డ్రైవర్ అక్కడికక్కడే చనిపోయాడు. మీ హత్యకు ప్లాన్ చేసిన మాజీ ఎంపీ మీకేదో అయి ఉంటుందని ఉహించుకొని, ఆ ఆనందంలో యమునా నదిలో బోటులో పార్టీ చేసుకుంటూ ఉంటే పెద్ద కెరటం వచ్చి బోట్ తో సహా అందర్నీ ముంచివేసింది. ఇప్పుడే శవాలు ఒడ్డుకు చేరాయట. నీతో పెట్టుకుంటే యమునమ్మ ఊరుకుంటుందా?" అంటూ వేగంగా బయటకు నడిచిందామె. అతడు బయటకు వచ్చేటప్పటికి ఆమె చెట్ల మధ్యలో కనుమరుగైంది.

"యమునా! నాకు నువ్వు కావాలి."ఆమె వెళ్లిన వైపు చూస్తూ గట్టిగా అరిచాడు. ఆ మాటలు పక్కనున్న బండ రాళ్ళలో ప్రతిధ్వనించి, "కృష్ణా! నాకు నువ్వు కావాలి. "అన్నట్లు వినిపించిందతనికి.

ఇంతలో ఫోన్ మోగడంతో లోపలి నడిచాడు శ్రీకృష్ణ.

"శ్రీకృష్ణా! నీకేం కాలేదుగా. నీ గురించి దేశమంతా ఆందోళన చెందుతోంది."అంటూ కొన్నికుశల ప్రశ్నలు వేసారుడు హోమ్ మినిస్టర్.

తరువాత " హోమ్ మిస్టరేమిటీ, పెళ్లి సంబంధాలు చూస్తున్నాడని అనుకోవద్దు. మన ఫైనాన్స్ మినిస్టర్ గారి అమ్మాయి నీకు పెద్ద ఫ్యాన్ అట. అయన నీతో ఒకసారి మాట్లాడమన్నారు. అమ్మాయి ఫోటో, బయో డేటా పంపిస్తున్నాను. చూసి నీ అభిప్రాయం చెప్పు. " ముగించారాయన.

తన మెయిల్ ఓపెన్ చేసి అమ్మాయి పేరు చూసాడు శ్రీకృష్ణ.

"యమున!"

అతృతతో ఫోటో చూసాడు.

ఇంతసేపూ తనతో ఉన్న అమ్మాయే.

వెంటనే ఇంటెలిజెన్స్ ఆఫీసర్ కు ఫోన్ చేసాడు. ఒక విషయం చెప్పి, "ఇది ఆఫీషియల్ మేటర్ కాదు. పూర్తిగా న స్వంత విషయం. పది నిముషాల్లో కనుక్కుని చెప్పాలి."అన్నాడు.

ఐదు నిమిషాల్లో అతనినుండి ఫోన్ వచ్చింది. "సార్! మీరు చెప్పింది ఎంక్వయిరీ చేశాను. ఆ అమ్మాయి కుడిచేతి మీద శ్రీకృష్ణుడి పచ్చబొట్టు ఉంది. మరో విషయమేమిటంటే ఆ అమ్మాయి ఎడమ చేతి మీద మీ బొమ్మను పచ్చ పొడిపించుకుంది. మీకు పెద్ద ఫ్యాన్ అట." అంటూ చెప్పాడతను.

ఆనందంలో మునిగిపోయాడు శ్రీకృష్ణ.

## అద్దె ప్రేమ

శేష చంద్ర

ఎంత సేపటికి లోపల్నుండి భార్య సావిత్రమ్మ వచ్చే జాడ కనపడకపోవడంతో చదువుతున్న న్యూస్ పేపర్ పక్కన పడేసి " ఏమేవ్ " అని కేకేసి పిలిచాడు రఘురామయ్య.

"ఇదో వస్తున్నా ఏదో కొంపలు అంటుకపోయినట్లు ఆ కేకలు ఏంటి"అంటూ విసుక్కొంటూ వచ్చిన సావిత్రమ్మ, ప్లేట్లో ఉన్న ఓ కాఫీ కప్పు రఘురామయ్యకు అందిస్తూ తను ఒకటి తీసుకొని , అతని పడక కుర్చీ పక్కనే ఉన్న కుర్చిలో

కూర్చుంటూ ‘ ఇప్పుడు చెప్పు ఎందుకు పిల్చావు ‘ అన్నట్లు చూసింది. రఘు రామయ్య ఏమి మాట్లాడలేదు. కాఫీ పూర్తిగా తాగేసి పక్కనే ఉన్న డబ్బాలోని రెండు వక్క పలుకులు నోట్లో వేసుకొంటూ సావిత్రమ్మ వైపు చూసి ఆమె కూడా త్రాగింది అని నిర్ధారణ చేసుకొన్నాక “ చిన్నోడితో ఏమన్నా మాట్లాడావా?“ అన్నాడు.

“ఎప్పుడు వాడు ఫోన్ ఎత్తితేకదా మాట్లాడేది. నిన్నట్నుంచి ప్రయత్నంచేస్తునే ఉన్నా ఎప్పుడు చూడూ బిజి బిజి అనే వస్తుంది. మనతో మాట్లాడేందుకు ఓ ఐదునిమిషాలు సమయం ముండదు అలా గంటల సేపు ఎవరితో మాట్లడుతుంటాడో ఏమో . వాడు దొరకడని కోడలు పిల్లకు ఫోన్ చేసినా . దాని ఫోన్ కవరేజ్ ఏరియాలో లేదని రెండు సార్లు స్విచ్చాఫ్ అని మరో రెండు సార్లు వచ్చింది. ఏం ఉద్యోగాలో ఏం జీవితాలో. హాయిగా మన దేశంలో ఉద్యోగాలుచేసుకొంటు మనముందు ఉండక ఎందుకొచ్చిన ఈ తిప్పలు. “అంది సావిత్రమ్మ.

కొడుకులిద్దరి ఫోన్లు ఎప్పుడు బిజి అనో లేదా కవరేజ్ ఎరియాలో లేదని వస్తుండటంతో బహుశా వాళ్లు తమకిచ్చిన నెంబర్లు పక్కన పెట్టి కొత్త నెంబర్లు వాడుకొంటున్నారేమో అన్న అనుమానం మెలకెత్తింది రఘురామయ్యకు. అ మాటే బైటికి అనబోయి తమాయించుకొన్నాడు. ఆ మాట అనడం ఆమె కొడుకును వెనకేసుకొని రావడం , తను ఏదో ఒకటి అనడం అనవసరంగా గొడవ పడటం ఓ వారం రోజులు ఇంట్లో కోల్డ్ వార్ రావడం ఎందుకనుకొంటూ ఒక్క క్షణమాగి “ పెద్దోడ్తో అన్నా మాట్లాడు . నేను చేస్తే వాడు ఎత్తడం లేదు. “అన్నాడు.

వారం వారం వాళ్లకు సెలవు రోజున ఆలా పొద్దున పూట బైట కూర్చుని కాఫీ తాగుతూ కొడుకులకు కూతురికి ఫోన్లో మాట్లడం వాళ్ల అలవాటు. వీళ్లు ఫోన్లు చేస్తారు కాని వాళ్లు వీళ్లతో మాట్లాడింది తక్కువ. ఇప్పుడు వాళ్లతో మాట్లాడాలని గత నాలుగు రోజులుగా తపన పడటానికి కారణం సంక్రాంతికి రమ్మని నెలరోజులుకు ముందే చెప్పారు. అప్పుడు చూస్తామని ఒకరు వస్తామని ఒకరు చెప్పారు కాని ఇప్పుడేమో ఫోన్లు చేస్తుంటే ఫోన్లు ఎత్తడంలేదు.

“ ఆఁ అది అయ్యింది. చిన్నోడి కన్నా పెద్దోడే నయం కనీసం వాడు ఫోన్ అన్నా ఎత్తాడు. “

ఆమె చెప్పబోతుండగా మధ్యలోనే రఘురామయ్య కలగచేసుకొంటూ ,

“నాకు తెలుసు వాడు నాతో మాట్లడక పోయినా నీతో తప్పక మాట్లాడుతాడని. ఎప్పుడు మాట్లాడావ్ ఏమన్నాడు వస్తానన్నాడా? “ అత్రంగా అడుగుతున్న . భర్తను చూచి ఆమె మనసు చివుక్కుమంది.

“వాడు ఎక్కడ పూర్తిగా మాట్లాడాడు. ఫోన్ ఎత్తి మాట్లడుతుండాగానే ఎవరో అర్జంటు కాల్ వస్తుంది మళ్లీ మాట్లడాతా అని చెప్పి పోన్ పెట్టేసాడు “ అంది బాధగా.

నిరాశగా తలాడిస్తూ , “ పోనీ కోడల్తో మాట్లడి చెప్పక పోయావా . “అన్నాడు రఘురామయ్య.

“ఆ మహారాణి ఫోను బిజినే. అయినా తనకు చెప్పి ఏం చెప్పి ఏం ప్రయోజనం. ఒక వేళ వాడు రావాలనుకొన్నా తను ఏదో ఒకటి చెప్పి అడ్డు పుల్ల వేస్తుంది. “

రఘురామయ్య ఏమనుకొన్నాడో ఏమో  మొబైల్ తీసి కూతురికి పోన్ చేయసాగాడు.

"ఎవరికి? "అంది సావిత్రమ్మ

"చంటికి "

"ఆ చేయి. అది ఖాళీగానే ఉంటుంది ఇప్పుడు.  నేనే చేస్తామనుకొన్నా . చేసి స్పీకర్ పెట్టు. "అంటుండగానే,

"హల్లో డాడి బాగున్నారా. అమ్మ ఎలా ఉంది.? "అని పలకరించింది చంటి.

"బాగున్నాం రా. ఇదిగో మీ అమ్మ పక్కనే ఉంది. పండుగాడు , అల్లుడుగారు ఏలా ఉన్నారు నీ ఆరోగ్యం బాగుందికదా.. ". సంతోషం పెల్లుబుకుతుండగా ప్రశ్నల వర్షం కురిపించాడు రఘురామయ్య .

అంతలోనే సావిత్రమ్మ కలగచేసుకొంటూ " అంతా బాగుండాంరా . ఎప్పుడొస్తున్నారు  ఊరికి " అంది.

"ఊరికా ...!? "అంటూ చంటి ఆగిపోవడంతో

"అవునే నెల ముందే చెప్పాం కదా ఏదో ఒక వంక పెట్టి ఎగ్గొట్టకుండా తప్పకుండా అల్లుడ్ని పిల్చుకొని రమ్మని పండుగ ఇంక వారం దినాలే ఉంది మీరొస్తారని ఎదురు చూస్తుండాం. మీ అన్నయ్యల్ను కూడా రమ్మని మని చెప్పాం . వాళ్లు వస్తారు. "

"వాళ్లు వస్తామని చెప్పారా. అంతా ట్రాష్ . ఊరికే చెప్పింటారు.  నాతో రావడం లేదని చెప్పారు . వాళ్లతో పాటు మాకూ వచ్చేందుకు వీలు పడేటట్లులేదు. ఈ మధ్యనే  మీ అల్లుడుగారికి ప్రమోషన్  వచ్చింది పని ఎక్కువైంది ..అడిగితే తర్వాత చూద్దాంలే " అన్నాడు.

ఉత్సాహం నీరు కారిపోయింది ఇద్దరికి .

"అలాగంటే ఎలాగే మిమ్మల్ని చూసి మూడేండ్లు పైనే అయ్యింది. పండుగాడు నువ్వు కళ్లలలో మెదుల్తున్నారు.  ఏలాగో  వీలు చేసుకొని రాండే" సావిత్రమ్మ  కన్నీళ్లు వత్తుకొంటు బొంగురు గొంతుతో ప్రాదేయపడుతుంటే రాఘవయ్య కంట్లోనుంచి వచ్చిన కన్నీటి చుక్కలు అద్దాన్ని తడిపి కంటి చూపును  మసకచేసాయి.

"ఊరికే నువ్వు బాధ పడి ప్రయోజనమేముంది. ఈ వయస్సులో మీకే అక్కడేం పని  ఉన్నది అమ్మేసి మా దగ్గరికి రమ్మంటే డాడీ ససేమిరా అంటూడు. మాకా వచ్చేందుకు తీరిక ఉండదు. "అంటూ దీర్ఘాలు తీసింది చంటి.

"ఈ సారి మీరు రాండే నేనే మీ డాడీతో చెప్పి ఏదో ఒకవిధంగా వప్పించి అస్తిని అమ్మే ప్రయత్నం చేస్తా ఈ ముసలిముప్పున మాకు తోడు ఎవరు మీరు తప్ప " రఘురామయ్య తన పక్క కోపంగా చూస్తున్నా ధైర్యం చేసి అనేసింది ఏమైనా అంటే అనని అని.

“ఆ మాట డాడిని చెప్పమను నేనే వాళ్లకు చెప్పి రమ్మంటాను. వాళ్లతో పాటు నేను మా ఆయనుకు చెప్పి ఎలాగో ఒప్పించి వస్తా. ఓ పదిరోజలుండి అన్ని సెటిల్ చేసుకొని మిమ్మల్ని మా దగ్గరికి పిలచుక వచ్చేస్తాం. “ అంది ఉత్సాహంగా చంటి.

భర్త వైపు చూసింది ప్రాధేయపడుతున్నట్లు ఓ మాట చెప్పండి అంటూ . రఘురామయ్య భార్య మాటలు పట్టించుకోకుండా మాట దాటవేస్తూ ,

“పండుగాడు ఏం చేస్తున్నాడు వాడితో ఒకసారి మాట్లాడించు. “అన్నాడు రఘురామయ్య మనవడి గొంతు ఒకసారి వినాలని ....

తన మాటకు జవాబు ఇవ్వకుండా రఘురామయ్య మాట మార్చే సరికి చంటి కోపంగా “ వాడు ట్యాబ్లో విడియోలు చూస్తున్నాడు డాడి పిలిచినా పలకడు. మాట్లడడు. మీకన్నా మొండి . నేను తర్వాత మాట్లాడిస్తా. “అంటూ కోపంగా ఫోన్ పెట్టేసింది చంటి. వేసవిలో పిల్ల మేఘం వచ్చి నాలుగు చినుకులు రాలుస్తూ పిల్ల తెమ్మర్లు తెచ్చి , సంతోష పెట్టి అంతలోనే వేడి పుట్టించి నట్లైంది. కొడుకులు ఫోన్లు ఎత్తకపోతే వాళ్లు ఏలా రారని కనీసం కూతురైనా వస్తుందనుకొంటే కుండబద్దలు కొట్టినట్లు రావడం లేదని చెప్పడంతో పాటు వాళ్లు రాక పోవడానికి కారణం కూడా చెప్పేయడంతో సావిత్రమ్మ నీరుగారిపోయింది. రఘరామయ్యకు కోపం ముంచుకొచ్చింది.

“ఏం పిల్లలు వీళ్లు . మన మీద ప్రేమలేదు వీళ్లకు మన ఆస్తులు మీద ప్రేమ. తప్ప మన మీద ప్రేమ ఉంటే ఆస్తులు అమ్మి రమ్మనమని చెప్పేబదులు మీరు రాండి కొద్దిరోజులు ఉండి పోవచ్చని చెప్పవచ్చుకదా . అలా చెప్పరు. ఇప్పుడు అర్జంటుగా ఇక్కడ ఆస్తులు అమ్మి వాళ్లకు పంపకం చేయాలి . అప్పుడు వాళ్లకు తృప్తిగా ఉంటుంది. “

“వాళ్లు చెప్పినట్లే చేస్తే ఏమిటంటా. ఏం ఆ ఆస్తులు మనమేమన్నా పోతూ పోతూ మూట కట్టుకొని పోతాం . వాళ్లు చెప్పినట్లు చేస్తే వాళ్ల కోరిక తీరుతుంది మనం ముసలి మొప్పున కృష్ణా రామా అనుకొంటూ మనవళ్లతోను మనవరాళ్లతో హాయిగా ఉండచ్చుకదా..కాని మీరు వినరు . వాళ్లు అది మనసులో పెట్టుకొని అలిగి మూడు సంవత్సారాలనుండి ముఖం ఇటు వైపు పెట్టలే . అయినా మీ ముకుంపట్టు వదలడంలా . పిల్లలకన్నా మీకు ఈ ఆస్తులే ఎక్కువైనయి. మనం చచ్చినా తల కొరివి పెట్టేందుకైనా వస్తారో రారో “ కన్నీళ్లు పెట్టుకొంది సావిత్రమ్మ.

మరో విషయంలో అయితే ఆ కన్నీటికి రఘరామయ్య రాజీ పడేవాడేమో కాని అలా చేసి తన స్నేహితుడు పడే బాధలు ప్రత్యక్ష్యంగా చూస్తుండటంతో ఆ తప్పు తను చేయదల్చుకోలేదు.

“అప్పుడు వస్తార్లేవే . అప్పుడు ఉన్నది అమ్ముకొని పోవచ్చుకదా “ అన్నాడు కోపంగా. దానికి సావిత్రమ్మ పలకక పోవడంతో మళ్లీ ,

"రాక పోతే పోనీ నేను ఆస్తులు అమ్మి వాళ్ల పంచన చేరే ప్రసక్తే లేదు. పిల్లలంటే ఆ చైతన్య ప్రసాద్ పిల్లల్లా ఉండాలి. ఇలా ఆస్తుల కోసం కన్న వాళ్లను కంటతడి పెట్టించే వాళ్ళు కాదు. ఏం ఆ చైతన్యప్రసాద్ వాడు నాలాగ ముసలి వాడే కదా తమ దగ్గరికి రమ్మనమని చెప్పారే కాని ఆస్తులు అమ్మి శాశ్వితంగా రమ్మనమని చెప్పలే.. ఆలా పోలేదని అమ్మనాయన మీద కోపంగా దూరంగా లేరు. విదేశాల్లో ఉన్నా రోజు ఫోన్లు చేస్తారట.సంవత్సరానికి రెండు సార్లు పని గట్టుకొని మరి వచ్చి పది రోజులుండి పోతారట పిల్లలంటే అలా ఉండాలి " ఎప్పుడు కోప్పడని రఘురామయ్యకు కొడుకులు మీద కోపం ముంచుకొంది.

"మహా చెప్పొచ్చార్లే .. ఆయన మీ ముందు బడాయి పోతుంటాడు. మన పిల్లలకన్నా వాళ్లంతా మంచి వాళ్లా ఏం. విదేశాల్లో ఉన్న వాళ్లు పని పాటలేకుండా రోజు ఫోన్లు చేస్తారటా సంవత్సరానికి రెండు సార్లు వస్తారట . ఆయన చెప్తున్నాడు. మీరై నమ్ముతున్నారు. పొరుగుంటి పుల్లగూర రుచి అన్నట్లు ఎవరో పిల్లలు మంచి వాళ్లట మన పిల్లలు మంచి వాళ్లు కాదట..మీరు మీ ముకుంపట్టు వదిలి పిల్లలుచెప్పినట్లు చేస్తేనే నేను నాలుగుకాలాల పాటు బతుకు తా లేదంటే ఏదో ఒక రోజ వాళ్ల మీద దిగులుతో హరీ అంటా నీ ఇష్టం " అంటూ అక్కడ్నుంచి కన్నీళ్లు కార్చుకొంటూ లేచిపోయింది సావిత్రమ్మ.

★★★

రఘురామయ్యకు ముగ్గురు స్నేహితులు రోజు సాయంత్రం అలా పార్కు దగ్గర కలుసుకొని కష్ట సుఖాలు చెప్పుకొంటుంటారు. రఘురామయ్యకు ఫించన్తో పాటు స్వంత ఇల్లు పొలం ఉండటంతో పాటు రిటైర్డు అయినప్పుడు వచ్చిన డబ్బులు కూడా అలాగే బ్యాంకులో ఉండటంతో ఆర్థిక పరమైన ఇబ్బందులులేవు. స్నేహితుల్లో ఒకరు తొందర పడి కొడుకులు మాటలు విని ఆస్తులు అమ్మి కొడుకుల పంచన చేరడంతో బ్రతుకు నరకం తయారైపోయిందని ప్రతిరోజు వాపోతుంటాడు . మరొకడేమో రఘురామయ్యలాగే ఆస్తులు అమ్మకపోవడంతో కొడుకులు రోజు ఘర్షణ పడుతుంటారు. తండ్రి కొడుకులకు మాటల్లేవు. దిక్కులేని ముసిలి పక్షుల్లాగా బిక్కుబిక్కుమని కాలం వెల్లదీస్తున్నారు వాళ్లు. మిగిలింది చైతన్యప్రసాద్ తహశిల్దారుగా రిటైర్డయ్యాడు. ఆస్తుపాస్తులకు కొదవలేదు. భార్యకూడ గెజిటెడ్ ఆఫీసరుగాని రిటైర్డు అయ్యింది. అతనికి ఇద్దరు కొడుకులు ఒక కూతురు రఘురామయ్యకు లాగానే . అతన్ని చూస్తుంటే జెలసీ మిగతా ముగ్గురికి. దానికి కారణం అతనికి ఆర్థిక సమస్యల్తో పాటు మానసిక సమస్యలు లేవు. అతడు చెప్పే మాటలు బట్టి కొడుకులు కొడళ్లు కూతరు అల్లుడు రత్నల్లాంటి వాళ్లని . వాళ్లు విదేశాల్లో ఉన్నా తను ఎంత చెప్తే అంతే ఇప్పటికి తన మాట జవదాటరని చెప్తుంటాడు. అంతే కాదు ప్రతిరోజు అందరు ఎన్ని పనులున్నా ఫోన్లో మాట్లాడ్తారని మనవళ్లు మనవరాళ్లుకూడా వీడియో కాల్స్లో కబుర్లు చెప్తుంటారని వాళ్లు దూరంగా ఉన్నా తమకు చాలా దగ్గరగా ఉన్నట్లుంటుందని

అంతా ప్రతి సంవత్సరం దసరా, సంక్రాంతికి వచ్చి ఓ వారం ఉంటారని చెప్తుంటే అతని అదృష్టానికి అసూయ పడుతుంటారు.

రఘురామయ్యకు భార్య కన్నీళ్లు కారుస్తూ వెళ్లి పోవడంతో కొడుకులు మీద కోపం వచ్చింది. తర్వాత భార్య మీద కూడా వచ్చింది. ఏడ్వడం తప్ప పిల్లల మాటలు విని ఆస్తి అమ్మేసి వాళ్ల పంచన చేర్తే ఏం జరగుతుంది దాని మట్టి బుర్రకు అర్థం కావడం ఇప్పుడు అప్పుడప్పుడు ఏడుస్తుంది . ఆస్తులు అమ్మి వాళ్ల పంచన చేరితే అప్పుడు రోజు ఏడ్వక తప్పదు అనుకొన్నాడు. తర్వాత అతని ఆలోచన చైతన్య ప్రసాద్ మీదికి పోయింది. చైతన్య ప్రసాద్ చెప్తున్నట్లు అతని కొడుకులు కూతరు అంత మంచి వాళ్లా. విదేశాలనుంచి సంవత్సరానికి రెండు సార్లు రావడం మేమిటి పదిరోజులు ఇక్కడ ఉండిపోవడమేమిటి . భార్య అన్నట్లు చైతన్యప్రసాద్ తమతో అబద్దాలుచెప్తున్నాడేమో . చైతన్య ప్రసాద్ గురించి ఆలోచన్లు సాగుతుండగానే అతనే ఫోన్ చేసాడు. "అరే రఘు నేను రెండు రోజులు పార్కు రావడం లేదురా పిల్లలు వచ్చారు.మిగతా వాళ్లకు చెప్పు లేకపోతే పని గట్టుకొని మరీ ఇంటి దగ్గరికి వస్తారు నాకేమైందోనని అని ... "

పిల్లలు రారని దిగాలుగా ఉన్న రఘురామయ్యరు చైతన్య ప్రసాద్ పిల్లలు వచ్చారని చెప్పడంతో అదోలా ఫీలయ్యాడు. చైతన్య ప్రసాద్ ఎంతైనా అదృష్టవంతడునిపించింది. కాని అంతలోనే చైతన్య ప్రసాద్ తమకు అబద్దాలు చెప్తున్నాడా ? అందుకే తన ఇంటి దగ్గరికి ఎవరు రాకుండా ముందుగానే పిల్లలు వచ్చారు నేను రావడం లేదని ఫోన్ చేసి చెప్తున్నాడా అన్న అనుమానమూ వేసింది అతని మాటల్లో నిజమెంతో తెలుసుకోవాలనిపించింది. ఒక వేళ అతను నిజమే చెప్తుంటే అంత మంచి పిల్లల్ని ఒక సారి చూసినట్లుంటుంది లేకపోతే చాలా మంది పిల్లల్లాగా వాళ్లు అంతే అని తేలిపోతుంది. అనుకొని ముందుగా వస్తానని చెప్తే ఎక్కడ చైతన్య ప్రసాద్ అడ్డు పుల్ల వేస్తాడేమో నని చెప్పకుండా ఆ మరుసటి రోజు చైతన్య ప్రసాద్ ఇంటికి వెళ్లాలనుకొన్నాడు రఘురామయ్య.

★★★

గేటు లోపల కట్టేసిన అల్సేషన్ కుక్కను చూడగానే గేటు మీద చేయి వేసి లోపలికి వెళ్లబోయి ఆగి పోయాడు రఘురామయ్య. ఇంట్లోంచి ఏలాంటి శబ్దంలేదు. బహుశా లోపలున్నారేమో అంతా అనుకొంటూ రెండు క్షణాలు అలాగే నిల్చున్నాడు. రఘురామయ్యను చూడగానే కుక్క పెద్ద పెట్టున అరుస్తూ ఆగమేఘాల్తో గేటు దగ్గర వచ్చింది. కంగారు పడి చెయి వెనక్కి తీసుకొన్నాడు. కుక్క అరుపులు విని కుక్కను పిలుస్తూ చేతిలో పుస్తకంతో బైటికి వచ్చాడు చైతన్య ప్రసాద్ . గేటు ముందు రఘురామయ్య చూడగానే ఆశ్చర్యపోతూ " ఓరే రఘూ నువ్వా ఏం దారి తప్పి వచ్చావే? " అంటూ కుక్కను సముదాయిస్తూ గేటు వాకిలి తీసాడు. తను వచ్చిన పని మరిచిపోయి కుక్కనే చూస్తూ ఇదెప్పుడు తెచ్చావురా. ఇంతకు ముందు వచ్చినప్పుడు లేదు.

" నా ఫ్రెండు ఒకడు పంపిస్తానంటే సరేనన్నా ఇద్దరం ముసలోళ్లమే కదా ఎందుకైనా మంచిదని తోడు ఉంటుందని. రారా లోపలికి " అంటూ ఆప్యాయంగా లోపలికి పిలుచుకపోయాడు. ఇళ్లంతా నిశబ్దంగా ఉంది. మొదటి సారిగా తన భార్య చెప్పిన మాటలు నిజమనిపించాయి రఘురామయ్యకు. చైతన్య ప్రసాద్ అబద్దాలు చెప్తున్నాడు. అతడు చెప్పేది నిజమే అయితే కొడుకులు కోడళ్లు కూతురు అల్లుడు పిల్లల్తో హోరెత్తి పోతుండాలి ఇళ్లు ఎంత పెద్దదైనా . అసలు ఇంట్లో మనుష్యులున్నట్లే అనిపించలేదు. చైతన్య ప్రసాద్ రఘురామయ్యను లోపలికి తీసుకపోతూ హాల్లోకూర్చుంటామా లేక నా రూంలో కూర్చుంటామా అన్నాడు మర్యాద పూర్వకంగా .

"ఎక్కడ కూర్చుంటే ఏముందిలే ఉండేది మనమిద్దరమే. మా చెల్లెలు ఎక్కడో లోపల ఉంటుంది " అన్నాడు నర్మగర్భంగా , చైతన్యప్రసాద్ ముఖంలోకి చూస్తూ అతనేం చెప్పబోతాడో అని . రెండు దినాల క్రితం పిల్లలు వచ్చారని చెప్పాడు ఇప్పుడు అందరు వెళ్లిపోయారని చెప్తాడా ఒక వేళ అదే చెప్తే వాడు అబద్ధం చెప్తున్నాడని తేలిపోతుంది అనుకొంటూ.

"సరే ఈలా కూర్చో కన్వీనియంట్గా ఉంటుంది. ఏం తీసుకొంటావ్? "

"అబ్బే ఏమి వద్దురా ఊరికే వచ్చాను. "

"ఊరికే ఇంత దూరం పనికట్టుకొని రావడమా నా దగ్గర దాపిరికం ఎందుకురా చెప్పు "అన్నాడు చైతన్యప్రసాద్. రఘురామయ్య రాకకు కారణమేమిటో తెలుసుకోవాలని.

"దాస్తున్నది నేను కాదు నువ్వు. "చైతన్య ప్రసాద్కు అర్థం కాలేదు. ఏ విషయం రా ..అన్నాడు.

"పిల్లలు వచ్చారని చెప్పావు ఏది ఎవరు కనపడటం లేదు అంతా వెళ్లిపోయారా?" అప్పుడే అన్నాడు ఎగతాళి చేస్తున్నట్లు...

"నీ ముఖం అప్పుడే వెళ్లిపోవడం మేమిటి ఏదో దేవళం వద్దకు వెళ్తామంటే అంతా పోయారు వాళ్లు వచ్చే టైమయ్యింది. నీకు ఇబ్బందిగా ఉంటుందేమో అని నా రూంలోకూర్చుంటామా అన్నా?" అని అంటుండగానే ఇంటి ముందుకార్లు ఆగడం బిలబిల మంటూ పిల్లలు పెద్దలు లోపలకి వస్తుండటంతో రఘురామయ్యకు నోట మాటరాలేదు. రఘురామయ్యను కొడుకులకు కోడళ్లకు , కూతరికి అల్లుడికి పరిచయంచేసాడు వాళ్లు ఎంతో మర్యాద పూర్వకంగా రఘురామయ్యను పలకరించారు అతని కొడుకులగురించి అడిగారు. ఇక పిల్లలు చైతన్య ప్రసాద్ మీదికి ఎక్కి బైటికి వెళ్లి ఏం చేసింది వచ్చిరాని మాటల్తో చెప్తుంటే, చైతన్య ప్రసాద్ పిల్లల్తో కలిసిపోయి , ఏమి తెలియనట్లు వాళ్లు చెప్తున్నది వింటునట్లు నటిస్తూ చెప్తూ వాళ్లలో తను ఒకడిగా మారిపోయాడు. ఆ దృశ్యాన్ని చూస్తున్న రఘురామయ్యకు తన మనమళ్లు మనమరాళ్లు గుర్తుకొచ్చి అప్రయత్నంగా కంట్లో నీళ్లు తిరిగాయి. పిల్లల్తో కలిసిపోయినా రఘురామయ్య కళ్లు

వత్తుకోవడం గమనిస్తున్న చైతన్య ప్రసాద్ పిల్లల్తో కొద్ది సేపు గడిపి వాళ్ళకు ఏదో చెప్పి లోపలికి పంపించి , రఘురామయ్య దగ్గరకి వచ్చి భుజం మీద చేయి వేస్తూ " ఏమైందిరా నా రూంలోకి పోదాం పద " అంటూ బలవంతంగా లేపాడు

★★★

"సారీ రా "

రఘు రామయ్య ఎందుకు సారీ చెప్తున్నాడో అర్థంకాక " దేనికిరా ఏమైంది? ఎందుకలా ఉన్నావ్? నాకెందుకు సారీ చెప్తున్నావ్? " అన్నాడు తన రూంలోకి వెళ్లాక అతని పక్కనే కూర్చుంటూ.

"నిన్ను తప్పుగా అర్థంచేసుకొన్నా నువ్వు చెప్పేది అబద్ధమనుకొన్నా అందుకే చెప్పకుండా వచ్చాను. " తను చెప్పేది అర్థంకానట్లు చైతన్య ప్రసాద్ ప్రశ్నార్థకంగాచూస్తుంటే.. "ఏం లేదురా మా పిల్లల్లా , మన మిత్రుల పిల్లల్లాగే మీ పిల్లలుంటారని దాన్ని నువ్వు కవర్ చేస్తూ మీ పిల్లలు మంచి వాళ్లని గొప్పగా చెప్పుకొంటున్నావని లేకపోతే స్టేట్స్ నుండి సంవత్సరానికి రెండు సార్లు రావడమేంది వారం రోజులు గడవడమేమిటి అనుకొన్నా కాని ఇప్పుడు ప్రత్యక్ష్యంగా చూసాక నిన్ను అపార్థం చేసుకొన్నందు సారీ చెప్తున్నా మరోసారి. మీ పిల్లలు నీ పైన చూపిస్తున్న అభిమానాన్ని ప్రేమను చూస్తుంటే నువ్వు చాలా అదృష్టవంతుడివని పిస్తుంది. ముసలి తనంలో పిల్లపాపల్తో హాయిగా గడుపుతున్నావ్ ఇంత కన్నా ఏం కావాలి జీవితానికి . "

చైతన్య ప్రసాద్ మాట్లడలేదు. అతని కనుకొలుకుల్లో ఉబుకుతున్న కన్నీటి చుక్కలు చూసి అవి తన పిల్లల్నుపొగుడుతుంటే ఉద్వేగంతో పొంగే ఆనందబాష్పాలేమో అనుకొన్నాడు రఘురామయ్య. కొద్ది క్షణాలు వాళ్ల మధ్య మాటలులేవు.

"నువ్వు మీ పిల్లల్ని అమితంగా ప్రేమిస్తున్నావ్ కదూ . " అన్నాడు నిశబ్దాన్ని ఛేదిస్తూ చైతన్య ప్రసాద్ .

"అదేం ప్రశ్న నూటికి నూరు మంది తమ పిల్లల్ను అమితంగానే ప్రేమిస్తారు నేను అంతే అందరిలాగే అంతకన్నా ఎక్కువగానే మా పిల్లల్ని ప్రేమిస్తాను. కానీ వాళ్లకు మా వద్ద ఉన్న ఆస్థి మీద తప్ప కనీసం అందులో ఒక్క శాతంకూడా మా పైన ప్రేమలేదు. అదే ఉంటే మూడు సంవత్సరాలుగా కనీసం మమ్మల్ని చూసేందుకు రాలేదు. మనస్ఫూర్తిగా మాట్లాడిందిలేదు. "

"అదే పొరపాటు. నువ్వు నిజంగా నీ పిల్లల్ను ప్రేమిస్తుంటే ప్రేమించు అంతే అంత వరకే కాని అలాగే నీ పిల్లలు నిన్ను ప్రేమించాలనుకొనుకొవడం తప్పుకాదా . "

"నీకేంరా గట్టు మీద కూర్చోన్న నువ్వు ఏట్లో ఈదే వాడికి ఎన్నైనా చెప్పగలవు. మా బాధ అనుభ విస్తేకాని తెలియదు. "

"తెలుసురా . నాకు తెలుసు ఆబాధేంటో ఎందుకంటే నేను అనుభవించాను నీ కన్నా ఎక్కువుగా. ఈ తరమే అంతా. సమిష్టి కుటుంబాలు పోయి వ్యష్టి కుటుంబాలు ఎప్పుడైతే వచ్చాయో అప్పుడే వాళ్లలో నేను నా భార్య నా పిల్లలు బాగుంటే చాలు అన్న ఆలోచన తప్ప తల్లితండ్రులు అన్న దమ్ములు అక్క చెల్లెల్లు అన్న ఆలోచనలు చాలా మందికి ఉండటంలేదు. చాలా మంది పిల్లలు అంతే నూటికి కోటికి ఒకరు తల్లి తండ్రులు కుటుంబసభ్యులంటే నిజమైన ప్రేమ ఉండే వాళ్లు "

"అవునురా ఆనూటికో కోటికోలో మీ పిల్లలు ఒకరు "అన్నాడు రఘురామయ్య . బాధగా నవ్వాడు చైతన్య ప్రసాద్.

"కాదురా. మా పిల్లల్లు మీ పిల్లల్లాంటి వాళ్లే. మేము బాధ పడ్డాం మొదట మీ లాగే. ".

"మరి... ". ఆశ్చర్యంగా, ఆత్రంగా, అర్థం కాక అడిగాడు రఘురామయ్య..

"ఏదైన మనం కొనలేనప్పుడు మనం దాన్ని అద్దెకు తెచ్చుకొంటాం. నేను అదే చేస్తున్నాను. వాళ్ల ప్రేమను స్వంతం చేసుకోలేక అద్దెకు పొందుతున్నా . నేను నా భార్య రిటైర్డు కాగానే ఆ మొత్తాని ధైర్యం చేసి రియల్ ఏస్టేట్లో పెట్టడం నా ఆస్తి పదింతలు పెరగడం నీకు తెలిసిందేకదా. నా పిల్లలు అందరిలాగే ఆస్తులమ్మేసి వాళ్ల దగ్గరికి రమ్మన్నారు. కాని నేను నేను రావడం కాదు మీరు సంవత్సరానికి రెండు సార్లు మా దగ్గరికి రావాలి కొద్ది రోజులు గడపాలి అలా గడపిన వాళ్లకే నా ఆస్తి లేదంటే మొత్తం అనాధాశ్రయానికి రాసేస్తాను అని వార్నింగ్ ఇచ్చాను. వాళ్లలో నా మాటలు మార్పు తెచ్చాయి. అంతే కాదు వాళ్లు వచ్చేందుకు పోయేందుకు , ఎప్పుడు ఏ అవసరమన్నా డబ్బులిస్తుంటాను అందుకే ఒకరి కన్నా మరొకరు ప్రేమను చూపిస్తున్నారు. అది నిజమైన ప్రేమ అయినా కాకపోయినా నాకు అవసరం లేదు. నేను వాళ్లను నేను ప్రేమిస్తున్నాను. వాళ్లు నా దగ్గర ఉండాలనుకొంటున్నాను. నా పిల్లల ప్రేమలో కల్మషం మున్నా అది తెలియని వాళ్ల పిల్లలు చూపించే నిజమైన ప్రేమతో నేను నా భార్య పులకరించిపోతున్నాం. నా భార్య వాళ్లది నిజమైన ప్రేమే అని భ్రమ పడుతుంది సంతోష పడిపోతుంది.అందరి ముందు వాళ్లను ఆకాశానికి ఎత్తేస్తుంది. నాలాగా అర్థం చేసుకోకపోతే బాధ పడుతుందని వాళ్లతో మాట్లడిన విషయం నాలోనే దాచుకొన్నా నా భార్యకు చెప్పలేదు. వాళ్లకు చెప్పవద్దన్నా . మీరు బాధ పడుతున్నప్పుడల్లా మీకు ఈ విషయం చెప్పాలనుకొన్నా తండ్రి ప్రేమ పిల్లల్ను తక్కువ చేసి చూపడం ఇష్టం లేక చెప్పలేదు. ఇప్పుడు నువ్వు బాధ పడటం చూసి చెప్తున్నా . డబ్బులు లేని అలాంటి పిల్లలు కలవాళ్లు పాపం బాధ పడక తప్పదు. మన లాంటి డబ్బులున్న వాళ్లు పిల్లల ప్రేమ పొందటానికి ఇంత కన్నా మరో మార్గం కనపడలేదు నాకు. "

రఘురామయ్యకు నోట మాట రాలేదు కొద్ది సేపు. చైతన్య ప్రసాద్ చెప్పింది నిజమే అనిపించింది. వాళ్లను తాము ప్రేమించినంతమాత్రనా వాళ్లు తమను ప్రేమించాలని ఎక్కడుంది. అద్దె ప్రేమైతేం అరువు ప్రేమైతే ఏం కొనగలిగే శక్తి

ఉన్నప్పుడు కొంటే సరే .వాళ్లు తమ కళ్లముంది కొద్ది రోజులు తమతో కలిసి మెలిసి ఉంటే అదే చాలు. వెంటనే చైతన్య ప్రసాద్లా తనూ చేయాలనుకొంటూ "థాంక్స్ రా నా సమస్యకు పరిష్కారం చూపావు వస్తాను" అంటూ లేచాడు సంతోషంగా రఘురామయ్య.

# కొండ మీద నక్షత్రాలు యండమూరి వీరేంద్రనాథ్

**ఇటీవలే స్వాతి వారపత్రికలో ప్రచురితమైన ఈ కథ ఎక్కువమంది పాఠకులకు చేరాలన్న ఉద్దేశ్యంతో రచయిత ప్రత్యేక అనుమతితో ఇక్కడ పునర్ముద్రిస్తున్నాము.**

"వాడిని వంటింట్లోకి తీసుకురావద్దని ఎన్నిసార్లు చెప్పాను? కళ్ళు సరీగ్గా కనబడవు. ఆవకాయ జాడీ బ్రద్దలు కొట్టాడు చూడు" ప్రొద్దున్నే తిడుతోంది మా ఆవిడ. ప్రతిరోజూ నా మీద పడాల్సిన వర్షపు జల్లు ఈరోజు నా పనిమనిషి మీద పడింది. అలా అని నా కోటా కాన్సిల్ అవుతుందని రూల్ ఏమీ లేదు.

"వాడి బతుకు బండలు చేసాడమ్మా ఆ దేవుడు" అంటోంది మా పనిమనిషి.

"నేను చెపుతోంది దేవుడి గురించి కాదు. వాడిని ఇక్కడకు తీసుకురావద్దని" రుసరుసలాడుతూ వంటింట్లోంచి బయటకు వచ్చింది నా భార్య. వెనుకే పనిమనిషి. ఆవిడ నవ్వటం నేను ఒక్కసారి కూడా చూడలేదు. పనిమనిషి కాదు. మా ఆవిడ.

పెళ్ళయిన ఈ నలభై ఏళ్లలో నా భార్య నవ్వగా నేను ఒక్కసారి కూడా చూడలేదు.

మా మామగారు త్రికాలజ్ఞాని. దేశం గర్వించదగ్గ జ్యోతిష్కుడు. కానీ కూతురి భవిష్యత్తు సరీగ్గా అంచనా వెయ్యలేదేమో, 'మందస్మిత' అని పెట్టాడు. ఆయన భవిష్యత్-దర్శనం ఇంత దారుణంగా ఎలా ఫెయిల్ అయిందని ఆయన్నే అడిగాను.

నన్నో పిచ్చివాడిని చూసినట్టు చూసి "పెళ్ళవక ముందు తెగ నవ్వేది" అన్నాడు క్లుప్తంగా. ఇంకేం మాట్లాడను? ముక్కూ నోరూ మూసుకుని వచ్చేశాను.

చిత్రమేమిటంటే హిరణ్యకశిపుడి కడుపున మహా భక్తుడయిన ప్రహ్లాదుడు పుట్టాడు. ఇక్కడ రివర్సు. పరమ నిష్ఠా గరిష్ఠుడైన మా మామగారికి ఈవిడ పుట్టింది. నా విషయం కూడా అంతే. అపర భక్తుడనైన నా కూతురు కూడా అమ్మ టైపే. మా అల్లుడు నాలాగే నోట్లో నాలుక లేనివాడు. పాపం అతడిని ఒక ఆట ఆడిస్తుంది.

ఒకే ఒక అదృష్టం ఏమిటంటే నా కొడుకు నా వారసుడు. గతజన్మలో ఎంత పుణ్యం చేసుకున్నానో వాడు పుట్టాడు. భగవంతుడి దయ వల్ల ఇన్ఫోసిస్ లో చాలా పెద్ద పోస్టులో ఉన్నాడు.

మా ఆవిడ నాతో చెడుగుడు ఆడటానికి కారణం నా గుండు. మీకు ఆశ్చర్యంగా ఉండొచ్చు. కానీ నిజం. కేదార్‌నాథ్ నుంచి కన్యాకుమారి వరకూ నేను చూడని క్షేత్రాలు లేవు. సంవత్సరానికి పదకొండు నెలలు గుండులో ఉంటాను. మొదట తిరుపతిలో, మళ్ళీ కాస్త జుత్తు పెరిగాక అన్నవరంలో... ఆపైన ... వద్దులెండి. చెప్పుకుంటూ పోతే ఆ లిస్టు ఆగదు. నా అనుమానం ఏమిటంటే... నాపై ఆవిడ చిన్న చూపుకి కారణం నా గుండే (గుండె కాదు. 'గుండు' యే).

నా పట్ల ఆవిడ చులకనకి మరొక కారణం కూడా ఉన్నది. రిటైర్ అయిన తరువాత సుబ్బరాజుతో కలిసి వ్యాపారం పెట్టి, ఉద్యోగంలో సంపాదించినదంతా (రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో సహా) పోగొట్టటం. నిజానికి ఇదే నిజమైన కారణం అని నా అనుమానం.

కానీ ఇందులో నా తప్పు లేదు. రాజుగారు మా భజన సమాజంలో సభ్యుడు. కోటీశ్వరుడు. "కొత్త రకం ప్లాస్టిక్ వచ్చింది. దాంతో దువ్వెనలు చేస్తే 'పైసాకి పది పైసలు లాభం" అని చెప్తే ఇద్దరం తలో సగం వేసుకుని ఫ్యాక్టరీ పెట్టాం.

"గ్రహాలు అద్భుతంగా ఉన్నాయ్. గో ఎహేడ్" అన్నారు మా మామగారు. సుబ్బరాజుగారి గురువుగారు హరిద్వార్ నుంచి జూమ్-మీటింగ్ లో ముహూర్తం పెట్టారు. రెండు నెలల్లో నిర్మాణం పూర్తి అయింది. ఈస్ట్ ఫేసింగ్ ఫ్యాక్టరీ కట్టాము. ప్రారంభోత్సవానికి గురువుగారు అంత దూరం నుంచి నలుగురు శిష్యులతో కలిసి వచ్చారు. లక్ష ఖర్చయితేనేం, 'నభూతో న భవిష్యతి' అన్నట్టు యజ్ఞం చేశారు.

అప్పుడు జరిగిన ఒక అద్భుతం మీతో పంచుకుంటాను. ఆయన మంత్రాలు చదువుతూ ఉంటే ఆ వైబ్రేషన్స్ కి హోమగుండంలో దానంతట అదే మంట వచ్చింది. ప్రజ్వలించిన ఆ మంటల్లో ఆయన హవిస్సులు సమర్పించటం ఒక మహోద్భుత దృశ్యం.

అప్పుడే కొత్తగా ఫేస్–బుక్ వచ్చిన రోజులవి. అరణులతో రగిలించకుండానే కేవలం మంత్రాలతో మంట ప్రభవించటాన్ని వీడియో పెడితే ఆ రోజుల్లోనే కొన్ని వేల లైకులూ, ఎన్నెన్నో షేర్లూ వచ్చినవి. నా కూతురు మాత్రం, "కింద భాస్వరం పెట్టి ఉంటారు" అని పెదివి విరిచింది. చెప్పానుగా. అమ్మ పోలిక.

అంత యజ్ఞం చేసినా ఫలితం దక్కక పోవటానికి కారణం మళ్ళీ నేనూ, సుబ్బరాజుగారూ, మేమిద్దరమే. అదో పెద్ద కథ.

మేము ఉండేది విజయవాడ. ఫ్యాక్టరీ తిరుపతిలో. అందుకని సుబ్బరాజుగారు తన (రెండో భార్య) కూతుర్ని ఆఫీసు సెక్రెటరీగా పెట్టాడు. ఇటువంటి విషయాల్లో నేను చాలా తెలివైనవాడిని. నామనిషి కూడా ఒకరు ఉండాలని నా వివాహత్పూర్వ స్నేహితురాలి కొడుకుని ట్రెజరర్ గా పెట్టాను.

ఒకరిపై ఒకరు నిఘా ఉంటారని మా ఉద్దేశ్యం.

అయితే వారిద్దరూ ఒకరిపై ఒకరు నిఘా ఉండటం మానేసి, ఒకర్నొకరు ప్రేమించేసుకుని, ఈ ఏడాది కాలంలో చెరో పాతిక లక్షలూ తినేసి, ఆపై కొండమీద పెళ్లి చేసుకున్నారు. పుండు మీద కారం రాసినట్టూ వచ్చిన అతిథులకి తిరుపతి కొండ మీద 'మా' దువ్వెనలు పంచారు. ఆ విధంగా ఏడాదిలో వ్యాపారం అటకెక్కింది. డబ్బునోడు కాబట్టి ఆయనకేం పర్వాలేదు. నేను మునిగిపోయాను.

నిజమే. వ్యాపారంలో నష్టం వచ్చింది. వ్యాపారం అన్నాక లాభాలూ రావచ్చు, నష్టాలూ రావచ్చు. అనుభవం లేదు కాబట్టి ఓడిపోయాం. ఇంత చిన్నవిషయం నా కూతురూ, భార్యా అర్థం చేసుకోరేం? '***గెలుపుకి మొదటి మెట్టు ఓటమి***' అని అన్ని రంగాల్లో ఓడిపోయి వ్యక్తిత్వవికాసంలోకి వచ్చిన నిపుణుడు ఎవరో చెప్పాడు కదా. పోతే ఇక్కడ జరిగిందేమిటంటే, ఓటమి నా మొదటి మెట్టు కాదు. చివరి మెట్టు. ఎందుకంటే ఇకపై గెలవటానికి డబ్బూ లేదు. ఓపికా లేదు.

"ఇన్ని గుళ్ళూ గోపురాలూ తిరుగుతావు కదా. నిన్నే దేవుడూ రక్షించలేదేం?" అడిగింది నా భార్య.

"ఇన్ని దేవుళ్ళ దయ ఉంది కాబట్టే స్వంత ఇల్లు అమ్మకుండా, ఇంతటితో పోయింది" అన్నాను.

"మరి ఫ్యాక్టరీ ఎందుకు పోయింది?" అంది నా కూతురు.

దీన్ని 'మద్దెల శాపం' అంటారు. గత జన్మలో నేను మద్దెల వాయించేవాడినయి ఉంటాను. దాని శాపమే ఇది. రెండు వైపులా ఎడా పెడా కొట్టించుకోవటం.

కానీ నాలో విశిష్ట గుణం ఏమిటంటే ఎప్పుడూ సంయమనం కోల్పోను.

"గ్రహాలు బావున్నాయని మీ నాన్నగారే చెప్పారు కదా" అన్నాను ఆయన్ని కూడా నా వైపు కలుపుకుంటూ.

"గ్రహాలూ బావుంటే వాస్తు ఎందుకు?" అన్నది నా కూతురు.

"ఖర్మ అలా వ్రాసి పెట్టి ఉంది. కర్మని ఎవరూ తప్పించలేరు. ఏది వ్రాసి ఉంటే అది జరుగుతుంది" తత్వ రహస్యం చెప్పాను.

"మరి అటువంటప్పుడు యజ్ఞం ఎందుకు?" అన్నది మా ఆవిడ.

"అది కూడా కర్మలో వ్రాసి ఉంది" అన్నాను. అప్పుడావిడ నా వైపు చూసిన చూపు నేనిప్పటికీ మర్చిపోలేను.

సర్లెండి. 'తివిరి ఇసుమున తైలమ్ము తీయవచ్చు' అన్నారు పెద్దలు. ఇప్పుడా గొడవంతా ఎందుకు గానీ నా సమస్య చెబుతాను.

ప్రవాసాంధ్రులు భారత దేశభక్తులకి... క్షమించండి. దేశభక్తులు కాదు. భారతదేశంలో ఉండే దైవ భక్తులు. వారికి ఒక విన్నపం చేశారు. "వచ్చే నెల రాబోయే శ్రావణ పౌర్ణమి రాత్రి రాయలసీమలోని ఆకురాతి కొండ ఎక్కి, దేవుడికి మరింత 'దగ్గరగా' వెళ్లి అక్కడ లక్షదీపాలు వెలిగించి మనం మన భక్తిని ప్రదర్శించాలనీ, తమ ప్రెసిడెంటు వచ్చి అది చూస్తాడనీ..." ఒక ప్రకటన ఇచ్చారు.

ఇంకేముంది. మా అందరి హృదయవనాల్లో వేలవేల దీపాలు ఒక్కసారిగా వెలిగాయి. ఇలాంటి అవకాశం ఎప్పుడో పుష్కరానికి ఒకసారి వస్తుంది. మా గ్రూపు పదిమందీ ఇప్పుడా కొండ దగ్గరకు వెళ్ళాలి. వెళ్ళటానికీ, అక్కడ ఉండటానికీ మనిషికి పాతికవేల దాకా ఖర్చవుతుంది.

అక్కడే మా ఆవిడ అడ్డుపడింది. "పెళ్ళయిన నలభై సంవత్సరాల్లో తీర్థయాత్రలకని లక్షలు ఖర్చు పెట్టావు. అప్పుడంటే కాస్త డబ్బు ఉండేది. ఇప్పుడు పైసా లేదు. ఈ పరిస్థితిలో నువ్వు అంత దూరం వెళ్ళి దీపం వెలిగించకపోతే నష్టం ఏమైనా ఉందా" అని విరుచుకుపడింది.

నేను మాట్లాడలేదు. '***ఆరంభింపరు నీచ మానవులు***' అన్నాడు భర్తృహరి. ఈ సందర్భంతో అది తప్పు. ఆరంభిస్తే ఆ చర్చ ఎక్కడి వరకూ వెళ్తుందో తెలుసు. అందుకే నేను ఇంట్లో ఎక్కువ మాట్లాడను. ఇలా 'మాట్లాడకుండా' ఉండటం కోసం గతంలో ఒకసారి 'ఏకాగ్రతా_నిశ్శబ్దం.కామ్' వారికి యాభై వేలు కట్టి బెంగళూరు వెళ్లాను. అక్కడ ఒంటరిగా, రోజంతా ఎవరితో మాట్లాడకుండా ఉండాలి. ఉప్పూ కారం లేకుండా నెలరోజుల పాటూ అలా మౌనంగా ఉంటే ఏకాగ్రత పెరిగి సాంత్వన లభిస్తుంది.

వ్యాపారంలో వచ్చిన నష్టం తాలూకు బాధ పోవటం కోసం వెళ్ళాను. మా ఆవిడ అర్థం చేసుకోలేదు.

“ఎవరితో మాట్లాడకుండా ఉండటానికి యాభై వేలా? నీకేమైనా బుద్ధి ఉందా? ఇంట్లోనే ఎవరితోనూ మాట్లాడకుండా ఉండొచ్చుగా” అన్నది. వర్షం వచ్చినా, తుఫాను వచ్చినా ఆకాశవాణి ప్రోగ్రాం ప్రొద్దున్నే ప్రారంభం అవుతుంది.

“తిండీ, నివాసం... అన్నీ కలిపి” అన్నాను సర్ది చెపుతున్నట్టూ.

“ఏదీ... ఆ ఆకులూ అలములకా?” అంది.

“శ్వాస మీద ధ్యాస” అన్నాను.

“శ్వాస మీద ధ్యాసకి బెంగుళూరు దేనికి? బాత్రూములో ఏం చేస్తావ్? అక్కడ పెట్టు ధ్యాస” అంది. ఈమె ఐక్యరాజసమితిలో వాదించి ఉంటే, కాశ్మీరు ఎప్పుడో మనదై ఉండేది.

మా ఆవిడకి ఇంగ్లీషు రాదు. అందుకే ఇంగ్లీషుతో కొట్టాలనుకున్నాను. “మౌనం గోప్ప ధ్యానం. ఇంగ్లీషులో ‘మెడిటేషన్’ అంటారు. నీకు అర్థం కాదులే. అలా చెయ్యటం వలన ఏకాగ్రత పెరుగుతుంది.”

ఆవిడా ఏం తగ్గలేదు. “నిజమే. కానీ నాకు అర్థం కాక అడుగుతానూ. ఏ పని చేస్తే ఆ పనిలో శ్రద్ధ పెట్టటమే కదా ధ్యానం అంటే. దానికి మాట్లాడటం మానెయ్యటం ఎందుకు? ఆకులు తినటం ఎందుకు? ఈ మాత్రం ‘ధ్యాస’ ఆ తిరుపతి ఫ్యాక్టరీ వ్యవహారాల్లో పెట్టి ఉంటే అదే మెడిటేషన్ అయ్యుండేది కదా”.

లాభం లేదు. ఈ నిరంతర పోరాటంలో నేను ఎన్నటికీ గెలవలేను. లేదు లేదు. ఒకసారి గెలిచాను. మా ఆవిడని వప్పించి ఒక పుణ్య ప్రవచన సభకి తీసుకువెళ్లాను. ఏ మూడ్ లో ఉందో వప్పుకుంది. జనం కిటకిటలాడుతున్నారు. స్వామీజీ ఒక కథతో ఉపన్యాసం ప్రారభించారు.

“ఒక గుజరాతీ కోటీశ్వరుల కుటుంబం పెళ్లి కూతురి అలంకరణ కోసం బొంబాయి నుంచి మనిషిని పిలిపించారు. అతడు ఆ రంగంలో నిష్ణాతుడు. మూడు గంటల మేకప్ కోసం ముప్పై లక్షలు తీసుకుంటాడు. అయినా సరే, అతడి సమయం దొరకడమే కష్టం” స్వామీజీ చెప్తున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే... నా భార్య శ్రద్ధగా వింటోంది..!

“పొద్దున్న పదింటికి పెళ్లి. ఆరుగంటలకి మేకప్ ప్రారంభించి తొమ్మిదింటికి పూర్తి చేసి, సహాయకులతో కలిసి కార్లో విమానాశ్రయానికి తిరిగి బయల్దేరాడు. ఎప్పుడూ సరదాగా హాస్యోక్తులతో నవ్వించే మనిషి ఆ రోజు ఎందుకో ఏదో సుదీర్ఘమైన ఆలోచనలో ఉండటం చూసి అసిస్టెంట్లకి అర్థం కాలేదు. పది నిమిషాల తర్వాత అ యువకుడు హఠాత్తుగా

“వాహనం వెనక్కి తిప్పండి” అన్నాడు. అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకని అడిగాడు అసిస్టెంట్. “ఎక్కడో తప్పు జరిగింది. ఏమిటా అని ఇంత సేపూ ఆలోచించాను. ఇప్పుడు తెలిసింది. పెళ్ళి కూతురికి గడ్డం మీద చుక్క ఎడమవైపు పెట్టాను. ఆ అమ్మాయిది కోలామొహం. కుడి వైపు బాగుంటుంది. కారు వెనక్కి తిప్పండి’ అన్నాడు ఆ బ్యూటీషియన్” ఆగి, స్వామీజీ కొనసాగించాడు. “అప్పుడా అసిస్టెంటు ‘సార్ ఇది గుజరాతీ పెళ్లి. పెళ్లికూతురు మేలిముసుగులో ఉంటుంది. వచ్చిన వాళ్ళందరూ దూరంగా కూర్చుంటారు. గడ్డం కింద చుక్క ఎటు వైపు ఉందో ఎవరు చూస్తారు? చూసి, అది ఎడమవైపు ఉంటే బాగుండేదని ఎవరనుకుంటారు?” అన్నాడు.

“నేను అనుకుంటాను” అన్నాడు ఆ కళాకారుడు”.

స్వామీజీ ఇది చెప్పగానే జనం కరతాళ ధ్వనులు చేశారు. నాకయితే ఒక్క ముక్క అర్థం కాలేదు. సభ నుంచి ఇంటికి వచ్చేస్తూ ఉంటే ఆ మాటే చెప్పాను. నా భార్య మాత్రం “బాగా చెప్పాడు పెద్దాయన” అన్నది .

“చూసావా మరి. అందుకే ఇలాంటి ప్రవచనాలు వినటానికి రమ్మంటాను” అన్నాను గర్వంగా.

“ఇప్పుడేగా ఏమీ అర్థం కాలేదన్నావ్”.

గతుక్కుమని, “వినటానికి బావుంది” అన్నాను.

“అవును. విన్నా, పుస్తకాలు చదివినా బావుంటుంది. ఆచరిస్తే ఇంకా బావుంటుంది” అన్నది.

నలభై సంవత్సరాలనుంచీ భగవద్గీత చదువుతున్నాను. నేనేమి ఆచరించిస్తే బావుంటుందో అర్థం కాలేదు. అయినా చెప్పానుగా. ఈ మాటల ప్రవాహం ఆగదు. మొత్తానికి ఎలాగో అప్పుచేసి అప్పట్లో బెంగళూరు వెళ్ళాననుకోండి. అది వేరే సంగతి.

కానీ ఇప్పుడు ఈ దీపాల సంగతి ఎలా? ఎలా మా ఆవిడని కన్విన్స్ చెయ్యటం? చేతిలో డబ్బు ఉన్నప్పుడే నా మాట చెల్లలేదు. ఇప్పుడేం చెల్లుతుంది? ఇంకో నెల మాత్రమే టైమ్ ఉన్నది. మా బృందానికి నేను లీడర్ లాంటివాడిని. నేను మానేస్తానంటే అందరూ గోల చేస్తారు. దీనికి ఏది మార్గం? ఆ రాత్రి భగవంతుడిని మనస్పూర్తిగా ప్రార్థించాను.

భక్తుడి కష్టాలు తీర్చేడివాడు భగవంతుడే కదా. తనకి దగ్గరగా వచ్చిన్ కొండమీద నక్షత్రం పెట్టటానికి నా కొడుకు రూపంలో ఆదుకున్నాడు. మరో పది రోజుల్లో శ్రావణ పౌర్ణమి అనగా నా కొడుకు యాభై వేలు పంపాడు. ప్రయాణానికి మార్గం సుగమమైంది. చెప్పానుగా. ఐ యామ్ ప్రౌడ్ ఆఫ్ మై సన్.

మరో వారంలో ప్రయాణం. నా మనసు మేఘాల్లో తేలుతూ ఉంది.

++ ++ ++

ఇలా మేఘాల్లో తేలుతూ వెళ్తూ ఉండగా మోటార్ సైకిల్ గుంటలో పడింది. చిన్న శబ్దమూ, ఆపై నాలుగు రోజుల తర్వాత మెలకువా వచ్చింది. పెద్ద దెబ్బ తగల్లేదు కానీ, రక్తం ఎక్కించవలసి వచ్చింది.

ఆపై రెండు రోజులకి కాస్త కోలుకున్నాను. బెడ్ పక్కన కూర్చొని బత్తాయి పండు వలుస్తూ, "అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం జరగలేదు" అంది మా ఆవిడ.

"చూసావా! ఇష్ట దైవం మహిమ" అన్నాను.

“మరి అంత ప్రేముంటే, అసలు ఆక్సిడెంటు అవకుండానే చూడొచ్చుగా” అన్నది.

“ఎడ్డెం అంటే తెలుసా?” అన్నాను.

“తెడ్డానికి అపోజిట్” అంది.

ఎడ్డే అంటే వంకర, మూర్ఖుడు అని రెండు అర్థాలు. ‘వంకర’ అంటే ‘టింకర’ అనేవాడు మూర్ఖుడు. అదంతా చెప్పి నా తెలుగు పరిజ్ఞానాన్నిఆవిడ ముందు ప్రదర్శించబోతూండగా మా కూతురూ, అల్లుడు, కొడుకూ, కోడలూ వచ్చారు. ‘రికవర్ సూన్ అంకుల్..’ అంటూ నా అల్లుడు ఫ్లవర్ బొకే అందించాడు. కూతరు ఆపిల్స్ ఇచ్చింది. నా కొడుకు ఒక ఫోటో ఇస్తూ, “దగ్గర పెట్టుకో నాన్నా. తొందరగా నయమవుతుంది” అన్నాడు.

మధ్యలో మా ఆవిడ ఫోటో అందుకుని చూస్తూ, “ కృష్ణుడు చాలా ముద్దుగా ఉన్నాడు కదా” అన్నది .

“కృష్ణుడు నీకు నచ్చటం నాకు నచ్చింది” అనుకున్నాను.

నిద్రబోయే ముందు ప్రతిరోజూ చదివి తల పక్కన పెట్టుకునే భగవద్గీత పుస్తకం మధ్యలో ఆ ఫోటో పెట్టుకుని, మా అబ్బాయితో “ఆకురాతి ప్రోగ్రాం కాన్సిల్ అయింది కదరా. నీ యాభై వేలూ...” అని అనబోతూ ఉంటే నా భార్య చప్పున తలెత్తి, “యాభై వేలేమిటి?” అన్నది.

ఆపిల్ పండు విషయమై మొగాడి మీద కోపమొచ్చిన దేవుడు భార్యలకి పాము చెవులిచ్చి మొగుళ్ళ మీద కక్ష తీర్చుకున్నాడు.

నేను ఏదో చెప్పబోయేటంతలో నన్ను రక్షించటానికా అన్నట్టు ఒకాయన మంచం దగ్గరకు వచ్చాడు. లాల్చీ పైజమాలో ఉన్నాడు. కళ్ళు నిర్మలంగా ఉన్నాయి. మొహం ప్రశాంతంగా ఉంది. చేతికి ఒక బెంగాలీ సంచి వేలాడుతోంది.

నా భార్య స్టూల్ మీద నుంచి లేస్తూ, "ఈయన పేరు మురారి. ఈయనే నీకు రక్తం ఇచ్చింది. ఆ సమయంలో ఈయన రాకపోయి ఉంటే.." అని ఆపింది. కళ్ళకి మంగళసూత్రం అద్దుకుంటుందేమో అనుకున్నాను గానీ అటువంటిదేమీ చెయ్యలేదు.

నిజమే. నా గ్రూపు రక్తం సాధారణంగా దొరకదు. చేతులు జోడించి, "అంతా భగవత్ లీల. మీలాంటి వాళ్ళు ఇంకా ఉండబట్టే ధర్మం నాలుగుపాదాలతో నడుస్తోంది. మురారి అంటే కృష్ణుడు. మిమ్మల్ని దేవుడు కాపాడతాడు" అన్నాను.

ఆయన నవ్వి "అవును. నన్ను భగవంతుడు కాపాడతాడు. నేను భగవంతుడిని కాపాడతాను" అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. దేవుడు ఉన్నాడనే ఆస్తికులూ, లేడనే నాస్తికులూ ఉంటారని తెలుసు గానీ 'దేవుడితో నాకు సంబంధం లేద'నే వారెవరో నాకు అర్థం కాలేదు. నా అనుమానం అర్థం చేసుకున్నట్టు "స్నేహం, ధ్యానం మొదలైనవి భగవంతుడితో ఏడు రకాల సంబంధాలు" అన్నాడు.

పిల్లి అంటే మార్జాలమన్నట్టు ఉంది అందామనుకుని, ఎంతైనా రక్తం ఇచ్చిన వాడు కదా, మర్యాద కాదని మానేశాను.

మరికొంచెం సేపు మాట్లాడి ఆయన వెళ్ళిపోయాడు. అప్పటి వరకూ ముళ్ళ మీద కూర్చున్నట్టూ ఉన్న మేము ఒక్కసారిగా రిలాక్స్ అయ్యాం. వెళ్తున్నవాడి వైపు నా భార్య కొరకొరా చూస్తూ, "ఇన్ని కబుర్లు చెప్తున్నాడా. నీకు రక్తం ఇవ్వటానికి పదివేలు తీసుకున్నాడు" అన్నది.

విస్తుబోవటం నా వంతు అయింది. అప్పుడు మా టాపిక్ రక్తం అమ్మకాలూ, కిడ్నీ మాఫియా మీదకు వెళ్ళింది. ఇంతలో నర్సు వచ్చి "అదేంటి? మురారి బాబు వెళ్ళిపోయారా?" అని అడిగింది.

"ఆయన మీకు తెలుసా?" నా భార్య అన్నది.

"తెలియకపోవటమేమిటి? రేర్-గ్రూప్ రక్తం. డబ్బున్నవాళ్ళకి రక్తం అమ్మి, ఆ డబ్బుతో బీదవాళ్ళకి రక్తం కొనిస్తాడు. ఎప్పుడూ ఇక్కడే ఉంటాడు." అని చెప్పింది.

నా భార్యా నేనూ మొహామొహాలు చూసుకున్నాం.

++ ++ ++

ఆరాత్రి నేను నిద్రపోలేదు. 'నాలో ఎక్కడో ఏదో పటేలున పగిలింది' అన్న పెద్ద మాటలు చెప్పను గానీ, 'స్నేహం, ఆరాధన' మొదలైన బంధాల గురించి మురారి చెప్పిన వివరణ మళ్ళీ మళ్ళీ (ఈ సారి కొత్తగా) మననం చేసుకున్నాను.

"భగవంతుడితో స్నేహం చెయ్యి. స్నేహంకన్నా గొప్పది మరేమి ఉన్నది? గోపబాలురు ఎవరు? తపశ్శక్తితో పునీతులైన ఋషులు. ఆ పుణ్య ఫలితంగానే కృష్ణుడితో జలకాలాడారు. వీపు మీద ఎక్కి చెరువుల్లో దూకారు. అంతెందుకు? కురుక్షేత్ర యుద్ధ సమయంలో కృష్ణుడు అర్జునుడి రథసారధి. అశ్వాల రొదలో, ఏనుగుల ఘీంకారాల్లో అవతలివారి మాటలు వినిపించవు. భుజాన్ని వామపాదంతో కొడితే అటూ, కుడికాలితో కొడితే ఇటూ తిప్పాలి. కృష్ణుడు నిజరూపం తెలిసే సరికి 'ఓ దేవదేవా! నువ్వు భగవంతుడివా? నిన్నా నేను కాలితో కొట్టింది?' అని అర్జునుడు వాపోతాడు. కృష్ణుడు ఆప్యాయంగా నవ్వి, "కొట్టేటంత చనువు నీకు కాక ఇంకెవరికుంటుంది? స్నేహితుడివైన నీవు కాకపోతే నేను ఎటు వెళ్ళాలో ఎవరు చెపుతారు? " అంటాడు.

భగవంతుడితో స్నేహం అంటే అది. నీవు నిజమైన స్నేహితుడివైతే 'ఎవడబ్బ సొమ్మ'ని తిడితే బెదురుతూ వచ్చి నీ ఆభరణాలు నీకు అందజేస్తాడు. నీవు నిజమైన భక్తుడివైతే 'లావొక్కింత లేదు' అనగానే పెళ్ళాంతో సరసాలాపి పరుగెత్తుకు వస్తాడు.

పని చేయటానికి కావలసిన శక్తినిచ్చేది ధ్యానం. అంతే తప్ప ముక్కు మూసుకుని స్పృహ కోల్పోవటమూ, ఆ భ్రమలో దేవుణ్ణి చూడటమూ కాదు. చేసే పని మీద భక్తే ధ్యానం. చేస్తున్న పని తప్ప మరేమీ గుర్తు ఉండక పోవటం ఏకాగ్రత. పక్షి కన్ను తప్ప మరేమీ కనపడక పోవటమే ఏకాగ్రత. అందమైన అమ్మాయి బొమ్మ వేసి, 'వదనం మీద చుక్క ఎక్కడ పెట్టాలి' అని తపించటం తన పని పట్ల చిత్రకారుడికి ఉన్న ప్రేమ. చేసే పని గురించి ఇరవై నాలుగ్గంటలూ ఆలోచించటమే ఆరాధన. రాధకి కృష్ణుడి పట్ల ఆరాధన అదే. ఆ'రాధ' పేరులోనే అది ఉన్నది కదా.

తాదాత్మ్యతకి గొప్ప ఉదాహరణ ప్రహ్లాదుడు. 'ఇందుగలడు—అందులేడని సందేహము వలదు' అంటాడు. నరసింహుడు మనిషిలోనూ ఉన్నాడు. రాతి స్థంభంలోనూ ఉన్నాడు. రాతికి పూజ చెయ్యటం నీ ఆనందం. నువ్వు సాటి మనిషికి సేవ చెయ్యటం దేవుడికి ఆనందం.

భగవంతుడిని నమ్ము. నమ్మకంతో పని చెయ్యి. అతడు ఎక్కడున్నాడు? నీలోనే. నమ్మకానికి వారసుడు ఆంజనేయుడు. సంజీవని తెమ్మంటే హిమాలయాలనే తీసుకొస్తాడు. "హనుమా..! నేను చెప్పగానే ఇది సాధ్యమా కాదా అని ఆలోచించకుండా ఆ పనికి బయలుదేరతావు కదా. నీకేమీ అనుమానాలుండవా?" అని రాముడు అడుగుతాడు. 'రామా! నువ్వు నాకొక పని చెప్పావంటే, ఆ శక్తి కూడా నువ్వే ఇస్తావనే నమ్మకం నాకుంది' అంటాడు ఆంజనేయుడు.

నీలో ఉన్న భగవంతుడి పై నమ్మకం లేకుండా ఎన్ని యజ్ఞాలు చేస్తే ఏమి లాభం? హుండీలో ఎన్ని డబ్బులు వేస్తే ఏం లాభం? హుండీ కేవలం నీ ఆనందం మాత్రమే.

భగవంతుడిని ప్రార్ధించటం అంటే, నీతో పాటూ అతడు సృష్టించిన సకల చరాచారాలనీ ప్రేమించటం. అవన్నీ నీ తోబుట్టువులు. అందరూ నీ సహోదరులు. వారి పట్ల వాత్సల్యం చూపించు. ప్రకృతిని ప్రేమించు. తాదాత్మ్యత చెందు. నీ ప్రేమ విశ్వజనీయమైనది అయితే, ఆ ప్రేమ కోసం కోసం భగవంతుడు నీ ముందు చేయి సాచి నిలబడతాడు. యశోదకి అంత వాత్సల్యం ఉండబట్టే నోరు చూపించమంటే వినయంగా చేతులు కట్టుకుని చూపించాడు. 'ఓయమ్మ నీ కుమారుడు' అని పొరుగింటివారు ఫిర్యాదు చేసినప్పుడు రోటికి కట్టేసినా ఆ దివ్య మంగళుడు కిమ్మనలేదు.

భగవంతుడు నీకు డబ్బు కాస్త ఎక్కువ ఇచ్చాడంటే వాటిని నీ సహచరులకు పంచమని. నాకు ఖరీదైన రక్తం ఇచ్చాడంటే దాన్ని ఇతరులకి పంచమని. జ్ఞానం ఇచ్చాడంటే కాస్త ఆలోచించమని. ఇన్ని విధాలుగా భగవంతుడికి స్నేహితుడిగా, ఆరాధకుడిగా, సఖుడిగా, వాత్సల్యంతో ఉండగా నాకు భగవంతుడు కొత్తగా ఏమి ఇస్తాడనీ, చేస్తాడనీ మీ ఉద్దేశ్యం?" అని అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా అదే ఆలోచించాను.

++ ++ ++

కొండ మీద దీపాలు పెట్టే కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. కోటి పైగా ఖర్చయిందట. చాలా పేపర్లూ, చానెళ్ళూ దానికి బహుళ ప్రాచుర్యం ఇచ్చాయి. నేను వెళ్ళలేదు. భగవంతుడికి ఎలా దగ్గరవ్వాలో, మురారిబాబు చెప్పిన ఆ ఎనిమిది మార్గాలూ మా గ్రూపుకి కూడా చెప్పాను. వాళ్ళూ హేతువుతో ఆలోచించే వారే. తరువాత ఆ మాట మీద ఉంటారో లేదో గానీ, ప్రస్తుతానికి నేను చెప్పింది అర్థం చేసుకున్నారు.

నెల రోజులు పోయాక ఒక రోజు ప్రొద్దున్నే పనిమనిషి "మీరందరూ కలిసి నా కొడుకు కళ్ళు బాగుచేశారయ్యా. ఏమి చేస్తే మీ రుణం తీరుతుంది" అంటూ కొడుకుతో దణ్ణం పెట్టించింది. కుర్రాడు కృతజ్ఞతతో నావైపు చూస్తున్నాడు.

కొండ మీద లక్షల దీపాలు వెలుగుతున్నాయి.

నా ముందున్న రెండు నక్షత్రాలూ మరింత ప్రకాశవంతంగా ఉన్నాయి.

వెనుకే వచ్చిన నా భార్య మందస్మిత నన్ను చూసి తొలిసారి నవ్వింది.

# పగుళ్ళు

ఎస్.శ్రీదేవి

"శ్రీకళా! వదిన పద్ధతేం నచ్చట్లేదు. ఎవరెవర్నో భోజనానికి పిలుస్తోంది. నేను లేని వేళ పరాయిమగవాడికి భోజనం పెట్టడమేమిటి చెప్పు?" పనిగట్టుకుని ఫోన్ చేసి చెల్లెలికి చెప్పాడు శ్రీధరమూర్తి.

"భోజనాలవేళ నువ్వు లేకపోవటమేమిటి? ఎక్కడికి వెళ్తున్నావు?" అడిగింది శ్రీకళ. ఆమెకి విషయం అంతా తెలిసిందని అర్థమైంది.

"నాకు సవాలక్షపనులుంటాయి. రోజంతా ఇల్లు కనిపెట్టుకునే వుండలేనుకదా? ఐనా నేను వద్దన్నా ఈ అల్లరేమిటి? అరవయ్యేళ్ళ మనిషి..." అన్నాడు కింద పడ్డా గెలుపు తనదేనన్నట్టు.

"నీకు అరవయ్యైదు లేవూ? నాకన్నా నాలుగేళ్ళు పెద్దవాడివికదూ?" అంది. శ్లేష అర్థమైంది. శ్రీధరమూర్తి భార్య, భానుమతి ఆమె వయసుదే.

"నీ కాలక్షేపం నువ్వు చూసుకుంటే వదిన తన కాలక్షేపం తను చేసుకుంటోందేమో!"

అతను కోపంగా ఫోన్ పెట్టేసాడు. ఆమె చిన్నగా నిట్టూర్చింది. అందరూ అరవైలు పైబడ్డవాళ్ళే. పెళ్ళిళ్ళు, పిల్లలు- వాళ్ళ చదువులు, వుద్యోగాలు, పెళ్ళిళ్ళు, ఆఖరికి తమ రిటైర్మెంటు అనే మెట్లన్నీ ఎక్కేసి తర్వాతేమిటన్న ఆలోచనలో వున్నారు. చేతినిండా డబ్బు, తీరిక. బాధ్యతల్లేవు. ఇదివరకట్లా కాదు, వొళ్ళలో వోపికలు వున్నాయి. బీపీ, షుగరు, థైరాయిడు కంట్రోల్లో వుంటే ప్రపంచాన్ని దున్నెయ్యచ్చనే జోష్‌లో వున్నారు.

భారతదేశమంతా తిరిగేసారు. అమెరికాకి వంతెన వేసుకున్నారు. అప్పుడు మొదలైంది శ్రీధరమూర్తిలో మార్పు. శ్రావణి అనే కవిగాయకురాలి చుట్టూ తిరుగుతున్నాడట. తమ ఫ్రెండ్స్ సర్కిల్లోనే ఎవరో చెప్పారు ఆ విషయం. అదలా వుంచితే వదినమీద అతని అభియోగమేమిటో! ఆవిడకూడా తనదారి తను చూసుకుంటోందా? అన్నయ్య మీద కోపంతోనా? తప్పనిసరనా? బంధాలు ఎందుకింత బలహీనపడుతున్నాయి?

స్వయంగా వెళ్ళి మాట్లాడితే తప్ప తెలీదనిపించింది. తెలిసినా చెయ్యగలిగింది ఏమీ లేదు. ఇద్దరూ చిన్నవాళ్ళు కాదు. టీనేజి పిల్లలని మందలించినట్టు కోప్పడి చెప్పేవాళ్ళు ఎవరు? ఐనా ఇలా విడిపోవటంలోని నిర్ణయం వాళ్ళకే వదిలేసినా, దాన్ని ప్రభావితం చేసేలా సాధకబాధకాలు వివరించాలి.

భానుమతికి ఫోన్ చేసింది తనొస్తున్నట్టు చెప్పడానికి. ఆమె ఇంట్లోనే వున్నానంది. భర్తకి చెప్పి, కారు తీసుకుని బయల్దేరింది. పావుగంట డ్రైవ్. ట్రాఫిక్ చేత ఇంకో పది నిముషాలు పట్టింది. విజిటర్స్ పార్కింగ్‌లో చోటు వెతుక్కుని పార్క్ చేసి, వీళ్ళ బ్లాక్‌కి వచ్చి, ఫ్లాట్ ముందు నిలబడి డోర్‌బెల్ నొక్కేసరికి ఇంకో పదినిముషాలు.

ఆప్యాయంగా ఆహ్వానించింది భానుమతి ఆడబిడ్డని. కాఫీలు మానేసారు. గ్లాసునిండా చల్లటి మజ్జిగ తెచ్చిచ్చింది భానుమతి. ఇద్దరూ మాటల్లో పడ్డారు.

"ఇప్పటిదాకా వురుకులూ పరుగుల్తో గడిచిన జీవితం ఒక్కసారి ఎవరో స్టాచ్యూ చెప్తే ఆగిపోయినట్టు ఐపోయింది. మూడు వంటలు, మధ్యలో రెండు నిద్రలు, ఒక సినిమా లేదా వెబ్‌సీరీస్... చట్రంలో ఇరుక్కుపోయినట్టు వుంది. కరోనా వచ్చాక మరీ నింపుకోవటానికేమీ లేనంత శూన్యంలా తయారైంది సమయం" అంది భానుమతి.

ఆమెకేసి నిశితంగా చూసింది శ్రీకళ.

"అందరి పరిస్థితీ అలాగే వుంది వదినా! ఇళ్ళన్నీ ఖాళీ ఐపోయాయి. వంటరితనపు గూళ్ళలా వున్నాయి"

"నాది ఇంకా భిన్నమైన పరిస్థితి శ్రీకళా! నీకు తెలుసో లేదో. శ్రీధరమూర్తి ఒకావిడతో లివింగ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో వున్నారు. అదేమిటంటే నాకు కవిత్వం ఇష్టం సంగీతమంటే ప్రాణం అంటారు. ఇంట్లో వుండరు. అస్తమానూ ఆమె దగ్గరకే వెళ్తున్నారు" అంది భానుమతి. అంటుంటే ఆమె కళ్లలో నీళ్ళు తిరిగాయి.

"నలభయ్యేళ్ళైంది మా పెళ్ళై. ఇద్దరిదీ ఒకటే జీవితమనుకుంటూ బతికాం. ఇప్పుడు ఎలా విడగొట్టుకోవాలో అర్థం కావటం లేదు"

"అన్నయ్యేమంటాడు? పిల్లలకి తెలుసా, యీ విషయం?"

"ఇప్పుడు నీకు విడాకులు దేనికి, నేనేం నిన్ను వద్దనుకోలేదుకదా, అంటారు. ఇక పిల్లలు... వాళ్ళగురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది"

"అదేమిటొదినా?"

"అంతే శ్రీకళా! విన్నింగ్ సైడ్ ఎటైతే అటు సర్దుకోవటం నేర్చుకున్నారు వాళ్ళు. తండ్రి ఎంతో కష్టపడి తమని పైకి తీసుకొచ్చారట. ఆయన సంపాదించుకొస్తుంటే నేను ఇంట్లో కూర్చుని ఎంజాయ్ చేసానట. ఇప్పుడే ఆయన లైఫ్ ఎంజాయ్ చేస్తున్నది, నువ్వు అడ్డు చెప్పకమ్మా అంటున్నారు. అంతగా నేనిక్కడ వుండలేననుకుంటే తమ దగ్గరకి వచ్చెయ్యమన్నారు. అంటే వాళ్ళ దయాధర్మం మీద బతకడానికి"

"ఛ... అదేమిటి?"

"ఎవరికి చెప్పను? ఎవరి సిద్ధాంతాలు వాళ్ళవి"

ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకోలేదు. అన్నయ్య చెప్పిన విషయం ఎలా అడగాలో అర్థం కాలేదు శ్రీకళకి. తన స్వంత ఆడబిడ్డ సత్యమీదికి పోయాయి ఆలోచనలు. వాళ్లదీ ఇదే వయసు. అక్కడ సమస్య ఇంకోలా. మినీలు, మైక్రోలూ కొనుక్కొచ్చి ఇస్తాడట భర్త. అవి వేసుకొమ్మని సతాయింపు.

"ఇంట్లో మనిద్దరమేకదా, వుండేది?" అంటాడట. అతను షార్ట్స్ వేసుకుని పూలపూల షర్టుల్తో తిరుగుతాడు.

"తను వేసుకుంటే వేసుకున్నారు, తనిష్టం. నేను వేసుకుంటే తనకి సంతోషం కలగటమేమిటి? నాకిష్టం లేనివీ, అలవాటు లేనివీ అతనికోసం నేను వేసుకోవటమేమిటి? చీదరెత్తిపోతోంది అతని గొడవకి" అంది నాలుగైదుసార్లు ఫోన్లో. వాళ్ళ సమస్యని ఎలా పరిష్కరించాలో సత్యకి ఏమని సలహా ఇవ్వాలో అర్థమవ్వలేదు. భార్యాభర్తల బెడ్‌రూమ్ విషయాల్లో ఎవరేనా ఎలా తలదూర్చగలరు? ఆమే ఆలోచించుకుని అత్తగారిని తెచ్చి దగ్గరపెట్టుకుంది.

"పెళ్లైన కొత్తలో ఏవో భయాలతో అత్తగారి స్థానాన్ని కొద్దిగా కదుపుతాము. కానీ వదినా, మగవాడు కాస్త అదిలిస్తే ఆగేది తల్లికే. ఎంత వయసొచ్చినా. ఆవిడ రాగానే అడిగింది, ఈమధ్య ఏం చీరలు కొనుక్కునావో చూపించమని. కొడుకు కొన్న గుడ్డలన్నీ తెచ్చి ఆవిడ ముందు పడేసాను. ఇంక తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. మేం ఇద్దరం వున్నప్పుడు పులిలా ఎగిరిన మనిషి ఇప్పుడు పిల్లిలా మారాడు" అంది సత్య చివరికి.

అంత గొడవా చేసిన మనిషికి హార్టెటాక్ వచ్చింది. బైపాస్ సర్జరీ చేసారు. ప్రాణభయంతోటీ భార్య మొహంలో మొహం పెట్టి చూడటానికీ కూడా హడిలిపోతున్నాడు.

మనుషులు బంధాలు మర్చిపోతున్నారు. ముప్పయ్యేళ్ళో నలభయ్యేళ్ళో వైవాహిక జీవితం గడిపేది విశ్రాంతి సమయాన్ని ఒకరితో ఒకరు పంచుకోవటానికి, ఇంకా ముదిమివయసులో ఒకరికొకరు సాయంగా వుండటానికి. ఇది మర్చిపోయి, తనొక్కరే, సుఖం తనొక్కరిదే అనుకుంటూ భార్యని భర్తా, భర్తని భార్యా ఎందుకు బాధించుకుంటున్నారు ? మనుషుల్నీ మనుషుల్నీ విడగొట్టే సిద్ధాంతాలు ఎక్కడినుంచీ వస్తున్నాయి? పిల్లలు తల్లిదండ్రుల రిలేషిప్‌ని జడ్జి చెయ్యటమేమిటి?

అసలు తల్లి ఇంట్లో కూర్చుని సుఖపడిపోయిందని అన్న పిల్లలకి ఎందుకు అనిపించింది? వాళ్ళ జీవనశైలినిబట్టి అలా అనిపిస్తోందా? అందరికీ అన్నీ వేళకి అమర్చి, ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళాక, మళ్ళీ ఎప్పుడు తిరిగొస్తారా అని నిర్వ్యాపారంగా కూర్చుని ఎదురుచూడటం, వాళ్లలో ఏ వొక్కరేనా వేళకి తిరిగి రాకపోతే పడే టెన్షను... ఇవన్నీ వాళ్లకి ఎలా అర్థమౌతాయి? ఇవన్నీ పక్కనబెడితే, ఇద్దరు పిల్లలని కనటం, వాళ్ళని పెంచి పెద్దచెయ్యటంకోసం ఆడవాళ్ళు మాత్రం త్యాగాలు చెయ్యటం లేదూ? ఉద్యోగాలు, కెరీర్, సరదాలు అన్నీ పక్కని పెడితేనేగా, మగవాళ్ళు పిల్లలతోపాటు పైకెదిగేది?

ఇంతకీ అన్నయ్య చెప్పిన విషయం?

"సమాజంలోనూ, మనం నమ్మిన విలువల్లోనూ మార్పు వచ్చింది శ్రీకళా! మనం మారకపోయినా. బాధపడుతున్నా ఎవరికీ లక్ష్యం లేదు. వదిలేసి వెళ్ళిపోతున్నారు. మీ అన్నయ్యలో మార్పొచ్చింది. పిల్లలు వాళ్ళు బతుకుతున్న వాతావరణానికి అనుగుణంగా మారిపోయారు. నాదారి నేను చూసుకోవలసిన పరిస్థితి వచ్చింది" అంది భానుమతి కొంతసేపటికి.

"ఏం చెయ్యాలనుకుంటున్నావు వదినా?"

"మీ అన్నయ్య నీతో ఏం చెప్పలేదా? అందుకే వచ్చావనుకుంటున్నాను"

"తను చెప్పింది కాదు, నువ్వు చెప్పేది నాకు ముఖ్యం"

"మిత్రాగారనీ పై ఫ్లాట్‌లో వుంటారు. వాకింగ్‌లో కలుస్తుంటాం. ఈమధ్యనే భార్య పోయింది. బాగా కృంగిపోయారు. నాలుగు ఓదార్పు మాటలు చెప్పాను. ఒకటి రెండుసార్లు మనింట్లో భోజనానికి పిలిచాను. మీ అన్నయ్య వుంటే బావుండేది. పిలిచినందుకు కనీసం నా మర్యాద నిలబెట్టేందుకేనా వుండచ్చు. ఉండలేదు" భార్యాభర్తలిద్దరి మాటల్లో ఎంత తేడా!

శ్రీధరమూర్తికి తను చేస్తున్నది సరైనది కాదనే విషయం తెలుసు. భార్యని తప్పు పట్టి తనమీది భారం తగ్గించుకోవాలనుకుంటున్నాడు. ఆ విషయం స్పష్టంగా అర్థమైంది శ్రీకళకి.

"అతను షెఫ్‌గా చేసేవారు. అతనితో కలిసి ఫుడ్‌కోర్టు పెడితే బావుణ్ణని ఆలోచన. బ్లూప్రింటుకూడా రెడిగా చేసాము. ఒక చిన్న కన్సర్ట్ హాలు, ఎవరికేనా ఆసక్తి వుంటే బొటిక్. బాబీకోసం కొన్న ఫ్లాట్ వుందికదా, అందులో మొదలుపెట్టాలని. పర్మిషన్స్ తీసుకోవాలి. మేమిద్దరమే పెడితే విమర్శలు ఎదుర్కోవాలి. మీ అన్నయ్య నాతోకూడా వుంటే బావుండేది. తన ప్రపంచం వేరైపోయింది. ఫ్రెండ్స్‌ని కలుస్తారేమోనని అడుగుతున్నాను."

ఇద్దరూ మరికాసేపు మాట్లాడుకున్నారు.

"బెడ్‌రూంలో పక్కపక్కని పడుకుని పంచుకుంటేనే అనుబంధం కాదు శ్రీకళా, హాల్లో ఎదురెదురుగా కూర్చుని మాటల్లోకూడా పంచుకోవచ్చు. ముఖ్యంగా యీ వయసులో. మీ అన్నయ్యలో సుఖలాలస ఇంకా తగ్గలేదు. అందుకే నేను తప్పుకుంటే హుందాగా వుంటుందనిపించింది" అంది భానుమతి చివరగా. పూర్తిగా అర్థమైంది శ్రీకళకి.

వెళ్తానని బయల్దేరింది.

"వదినతో మాట్లాడావా? ఏమంది?" ఇంటికి వచ్చేసరికి శ్రీధరమూర్తి ఫోను.

"ఫుడ్‌కోర్టు పెడదామనుకుంటోంది వదిన. ఆ ఆలోచన నాకూ నచ్చింది" అంది కూల్‌గా.

"నేనడుగుతున్నది ఆ వంటలవాడిగురించి"

"నువ్వు నీ పాటకత్తెని ఎవరేనా వంటరివాడిని వెతుక్కోమని చెప్పకూడదూ?"

అతను కోపంగా ఫోన్ పెట్టేసాడు.

మనసంతా చికాగ్గా అనిపించింది శ్రీకళకి.

"ఏమైంది?" అడిగాడు ఆమె భర్త ప్రభు.

"అన్నయ్యగురించి మనం విన్నది నిజమే. వదినమీద అనవసరంగా నింద వేస్తున్నాడు"

చిన్నగా నవ్వాడు ప్రభు. "శ్రీధరమూర్తి పెద్ద స్ట్రాటజిస్టు. ***తప్పుచేసినవాడికన్నా, చేసినట్టు ఆరోపించబడినవాడికే తనే తప్పూ చెయ్యలేదని నిరూపించుకోవలసిన అవసరం ఎక్కువగా వుంటుంది***" అన్నాడు.

ఏం జరగబోతోందో అని ఆలోచిస్తుండగా, ఏమీ జరగకుండానే నెలరోజులు గడిచిపోయాయి. అన్ ఈవెంట్‌ఫుల్‌గా.

★★★

"ఫుడ్‌కోర్టు ప్రపోజల్ ఆగిపోయింది శ్రీకళా! మిత్రాగారు పెళ్ళిచేసుకున్నారు. జాబ్ వెతుక్కున్నారు. ఇప్పుడు నేను హోటల్ మేనేజిమెంటు చేసిన మనిషిని వెతుక్కోవాలి. నాడా దొరికిందని గుర్రాన్ని కొనుక్కున్నట్టుంటుంది" అంది భానుమతి ఫోన్ చేసి.

"అదేమిటొదినా?" అంది ఇంకేమనాలో తోచక.

"అతనొక కదిలి వెళ్ళిపోయే మేఘం. అది కురవాలనీ, ఆ జల్లుల్లో నేను తడవాలనీ అనుకోలేదు"

"మరి?"

"అవంతీపురం వెళ్ళిపోదామనుకుంటున్నాను. అమ్మావాళ్ళూ ఇల్లు డెవలప్‌మెంటుకి ఇచ్చారు. అపార్ట్‌మెంటు పూర్తై ఫ్లాట్లు చేతికి వచ్చాయి. అందులో నాకొకటి వుంది. వచ్చి ఇంటీరియర్స్ పూర్తి చేసుకొమ్మని నాన్న చెప్పారు. అక్కడ కొన్నాళ్ళు వుండిపోయి, తర్వాతేం చెయ్యాలో ఆలోచిస్తాను"

"ఇక్కడి యిల్లు? నువ్వూ అన్నయ్యా ఎంతో కష్టపడి యిష్టంగా కట్టుకున్నది?"

"చిన్నప్పుడు నది వొడ్డునా, సముద్రం వొడ్డునా కూర్చుని ఇసుకతో గూళ్ళు కట్టేవాళ్ళం పిల్లలందరం. దాన్ని గవ్వలతోటీ శంఖాలతోటీ అలంకరించేవాళ్ళం. గడ్డిపువ్వులు, ఆకులు తెచ్చి గుచ్చేవాళ్ళం. ఆటైపోయాక దాన్ని వదిలేసి వెళ్ళిపోయేవాళ్ళం. అందరం వున్నప్పుడేకదా, ఆట? పిల్లలు ఎలాగా దగ్గర లేకుండా పోయారు. శ్రీధరమూర్తికూడా లేకుండా పోయాక ఇంక అదేం యిల్లు?"

"బాధగా అనిపిస్తోంది"

"మనుషులం స్వేచ్ఛ కోరుకుంటున్నాంకదూ? బంధాలు బరువనిపిస్తున్నాయి"

"పిల్లలేమంటున్నారు?" అడగక తప్పని ప్రశ్న.

"మీరిద్దరూ కల్సి వున్నారంటే ఒకరికొకరు తోడుగా వున్నారని ధైర్యం మాకు. నాన్న తనదార్లో వెళ్తున్నా, నిన్నూ చూసుకుంటానంటున్నారు కదా, అది కాదనకు. ఒక్కదానివీ అవంతీపురం వెళ్ళి ఏం చేస్తావు- అని దెబ్బలాడుతున్నారు. పాతమిత్రులున్నారని చెప్పాను. వాళ్ళకర్థమైందో లేదో!"

"కొత్తశతృవు అన్నయ్యని వాళ్ళు వప్పుకోలేరు"

"అంతేకదా? నేనే తప్పుచేస్తున్నట్టు "

"ఎప్పుడు నీ ప్రయాణం?"

"వచ్చే వారం"

"గొడవ నీకూ అన్నయ్యకీ మధ్యని. మనిద్దరికీ ఏమీలేదు. నలభయ్యేళ్ళ స్నేహం మనది. నన్ను మర్చిపోకు"

"నేనూ అదే చెప్తున్నాను. అక్కడికోసారి వచ్చి వెళ్ళు. ప్రభుకికూడా చెప్పు"

★★★

"వదిన వాళ్ల వూరు వెళిపోతోంది. చక్కటి సంసారాన్ని చిందరవందర చేసి, ఆమెని బాధపెట్టేందుకు నీకు మనసెలా వప్పింది అన్నయ్యా?" ఆవేదనగా అడిగింది శ్రీకళ.

నవ్వేసాడు శ్రీధరమూర్తి.

"చిన్నప్పటినుంచీ నాకు సంగీతం అన్నా, కవిత్వమన్నా ఎంత ఇష్టమో నీకు తెలీనిది కాదు. రెండిట్లో ఏ ఒక్కటీ నాకు నాన్న పడనివ్వలేదు. మీ వదినకి అసలు ఆసక్తే లేదు"

"అమ్మానాన్నలు చెడ్డవాళ్ళు కాదన్నయ్యా! పాటలూ పద్యాలూ పాడుకుంటూ తిరిగితే కడుపు నిండదని వాళ్ళకి తెలుసు. కడుపు నిండాలంటే డబ్బుకావాలి. ఆ డబ్బొచ్చే చదువు చదివించారు. కళల్లోనూ సాహిత్యంలోనూ ఏ ఒకరో ఇద్దరో పైకొస్తారు. చదువుకున్నవాళ్ళుమాత్రం అందరూ పైకొస్తారు. వదినకూడా నీలాగే పెరిగింది. తను నీకన్నా ప్రాక్టికల్"

"జీవితం చాలా వెల్తిగా అనిపిస్తోంది. శ్రావణి... తనొక వసంతంలా వచ్చింది. నాలో వున్న వెల్తిని నింపింది"

"వదిన తెచ్చింది వసంతం కాదా?"

"కాదని ఎందుకంటాను? కానీ మార్పుకూడా కావాలికదా? ఎంతకాలం ఒకేలా బతుకుతాం? వండుకుంటూ, తింటూ, తిరుగుతూ... అదే మనిషితో? అదే మూసలో? వదిన్ని నేను వద్దనుకోలేదు. ఇక్కడే వుండచ్చు. కానీ తను వాళ్ళ పేరెంట్స్ దగ్గరకి వెళ్ళాలనుకుంది. ఇప్పటికే ఇద్దరిని వదిలేసి నాదగ్గరికి వచ్చిన శ్రావణి నాతోటే వుంటుందని అనుకోను. మా ఇద్దరిలో ఎవరికి నచ్చకపోయినా ఎవరి దారి వాళ్ళది. భాను ఆ వంటలవాడిని

పెళ్ళిచేసుకుంటే అన్న భయం నాలో వుండేది. తనే దగ్గరుండి వాడి పెళ్ళి చేయించింది. ఇప్పుడింక ఎప్పుడేనా అవంతీపురంలో నేను వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వచ్చు" అన్నాడు.

అతన్ని ఎంత సంస్కారంగా పెంచామనుకున్నారో తల్లిదండ్రులు! ఇదా అతని సంస్కారం! కాలం మార్పు తెచ్చిందా? పరిస్థితులు మార్పు తెచ్చాయా? ఇదే అతని నైజగుణమా? లేక మగబుద్ధంటే ఇదా? రేపెప్పుడేనా అవకాశం దొరికితే ప్రభు కూడా ఇలాగే మారిపోతాడా? ఒక్క క్షణం తన చుట్టూ వున్న ప్రపంచమంతా మారిపోయి, భూకంపం తర్వాత పగుళ్ళేసిన భవనాల్లా మనుషులు అనిపించారు. ఈ అనుభవం రంగుటద్దంలా మారి, ఆమె మనసులో చేరి భయపెట్టింది.

★★★

భానుమతి అవంతీపురం వెళ్ళిపోయింది.

"అతనేమైనా చిన్నవాడా, చితకవాడా? అరవయ్యేదేళ్ళ మనిషి. బుద్ధి వుండాలి. ఈ వయసులో ఏమని చెప్తాం?" అన్నాడు ఆమె తండ్రి. కూతురు చూసీచూడనట్టు వూరుకోవలసిందని ఆయన అభిప్రాయం. పైకి అనలేదు. కూతురు, భార్య విరుచుకు పడతారని వూరుకున్నాడు.

"రేపొద్దున్న కాలూచెయ్యీ సాగకపోతే అప్పుడు అతనికే తెలిసొస్తుంది. ఇక్కడే వుండు హాయిగా. ఆ యిల్లూ మిగిలిన ఆస్తుల గొడవ పిల్లలు చూసుకుంటార్లే. వాళ్ళేం అంత తెలివితక్కువవాళ్ళు కారు" అంది తల్లి నిరసనగా. ఆవిడ మాటలు ఆమెకి కొత్త సమస్యని చూపించాయి.

★★★

ఇంకో నెలకి విడాకుల కేసు మొదలైంది.

"ఎందుకొదినా?" అడిగింది శ్రీకళ.

"రేపెప్పుడేనా పరిస్థితులు మారిపోతే అతను నాకొక లీగల్ ఆబ్లిగేషన్ కాకూడదని" జవాబిచ్చింది భానుమతి. పగుళ్ళేసిన మనుషుల్లో క్షమకూడా కనుమరుగౌతుందని అర్థమైంది శ్రీకళకి.

# ప్రేమతో..!

రామ్ పెరుమాండ్ల

సమయం గడియారంలో రాత్రి తొమ్మిదిపై నుంచి చిన్న ముల్లు మెల్లిగా కదులుతున్నది. ఊర్లోని అన్ని ఇంటి తలుపులు ఒక్కొక్కటిగా మూసుకొని నిశ్శబ్దంగా నిద్రపోతున్నాయి.ఇంతలో అప్పటికే తినమని భోజనం పెట్టినప్పటికి తన కొడుకు ఇంకా తినకపోవడం చూసిన రవి అమ్మ, ఇంట్లో రవి కోసం అటు ఇటు వెతికుతూ చివరకు ఇంటి ముందుకు వచ్చి చూస్తే రవి అరుగుపై తన ఫోన్ చూసుకుంటూ ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు .

"నాయనా రవి! ఇంత వరకు తినకుండా ఏం చేస్తున్నావు అక్కడ! వచ్చి తిని పడుకో" అంటూ పిలవడంతో మొదటి పిలుపుకు పలకపోవడంతో ఏదో చదువుకుంటూన్నట్టు ఉన్నాడని వెళ్ళిపోయింది.

కానీ రవి గత రెండు నెలలుగా తనను వెంటాడుతున్న బాధను మోస్తున్నాడు. ఫోన్లో తను ప్రేమించే అమ్మాయి ఫోటో చూసుకుంటూ ఆమె సమాధానం కోసం తడి కన్నీళ్ళతో కుమిలిపోతూ ఎదురుచూస్తున్నాడు.

నిజానికి వారిది కాలేజ్ రోజులనాటి ప్రేమ ఇప్పుడు వారికి ఒక ఇరవై సంవత్సరాల వయస్సు ఉండొచ్చు. ఇద్దరి మనస్ఫూర్తిగా సాగుతున్న ప్రేమనే కానీ గత రెండు నెలలుగా తనను స్వాతి పట్టించుకోవడం లేదు. దూరం చేస్తున్నది .అందుకే రవికి ఇది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి అదే ఆలోచనలో ఉంటున్నాడు. ఏ క్షణమైనా తన స్వాతి నుంచి సమాధానం రావచ్చని ఫోన్లో ఆమె ఫొటోనే చూసుకుంటూ వారు గడిపిన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కూర్చున్నాడు.

ఇలా నిశ్శబ్దంగా సాగుతున్న వాతావరణంలో ఒంటరిగా ఆలోచనలో పడ్డ రవికి అనుకోకుండా ఫోన్ మోగిన శబ్దం విని ఒక్క క్షణంలో ప్రాణం లేచి వచ్చినట్టయింది. స్వాతినే తన ముందుకు వచ్చినంత ఆనందిస్తూ తనను ఎందుకు ఇంతటి క్షోభకు గురి చేసిందని అడగాలనుకున్నాడు రవి. కానీ ఫోన్ వచ్చింది తన మిత్రుడు తరుణ్ నుంచి. రవి నిరాశతో మొదట ఎత్తలేదు. కానీ తరుణ్ పదే పదే చేస్తున్నాడు. ఈ సాయంత్రమే చౌరస్తాలో టీ కొట్టు దగ్గర కలిసినప్పుడు తన బాధను చెప్పుకున్న రవి. బహుశా తన బాధను ఓదార్చడానికి చేస్తున్నడేమోనని అనుకుంటూ తనకు ఇష్టం లేకపోయినా నీరసంగా ఫోన్ ఎత్తాడు .

"హలో రవి "అంటూ అటునుంచి తరుణ్

"ఆ చెప్పు ర ,తరుణ్!' అంటూ ఇటు రవి .

"ఇందాకే తెలిసింది సాయంత్రం పొలంలో పశువులకు గడ్డి కోస్తుండగ రఘు వాళ్ళ బావకు ఏదో పాము కరిచిందంట వెంటనే మన కల్వకుర్తి గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకెళ్లారంట మనం కూడా వెళదాం నువ్వు రెడీగా ఉండు.నేను బయలుదేరుతున్న" అంటూ ఫోన్ పెట్టేసి తన బైక్ తీసుకొని కదిలాడు.

రఘు, తరుణ్, రవి ముగ్గురు చిన్ననాటి నుంచి మంచి స్నేహితులు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. వారి మధ్య ఎలాంటి దాపరికలు ఉండేవి కావు. వాళ్లకు రఘు వాళ్ళ బావ చంద్రయ్యతో కూడా మంచి సత్సంబంధాలు ఉండేవి. కల్వకుర్తికి వారి ఊరికి మధ్య తక్కువ దూరమే ఉండడంతో త్వరగానే హాస్పిటల్ కు చేరారు ఇద్దరు.

వెళ్ళగానే రఘును కలిసి ఓదార్చుతూ అక్కడున్న డాక్టర్ ను కలిసి ట్రీట్మెంట్ ఇప్పించి చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఓ బెంచీపై కూర్చున్న చంద్రయ్య భార్య బాలమణి ఎంతో దుఃఖాన్ని మోస్తున్నది. తన ఇద్దరు పిల్లల్ని ఒళ్ళోకి తీసుకొని ఏడుస్తున్నది.

ఇది గమనించిన తరుణ్ బాలమణి దగ్గరకు చేరి "అక్క నీవేమి బాధపడకు బావకు పెద్దగా ప్రమాదమేమి లేదని డాక్టర్ గారు చెప్పారు" అంటూ బాలమణిలో కొంత ధైర్యం నింపే ప్రయత్నం చేశాడు.

అప్పటికే ఎంతో దుఃఖాన్ని మోస్తున్న బాలమణి తన చెంపలపై ఎండిపోయిన కన్నీటి చారాల్ని తన చీర కొంగుతో తుడుచుకుంటూ తరుణ్ చెప్పిన మాటలకు కొంత సేద తీరుతూ "మంచి మాట చెప్పినవు తమ్మి!, లేకపోతే నేను ,నా పిల్లలం దిక్కులేని వాళ్ళమవుదుము." అంటూ బాధ తాలూకు మాటల్ని వాళ్ళ ముందేసింది .

కొంత సమయానికి ఒక నర్సు బయటకొచ్చి "పెద్ద ప్రమాదమేమి లేదు కనుక చంద్రయ్యను ఈ రాత్రికి ఇక్కడే ఉంచి రేపు ఉదయాన్నే తీసుకువెళ్లండి" గ్లూకోజ్ బాటిల్ ఎక్కిస్తూ చెప్పింది. దాంతో రఘుకి తోడుగా ఈ రాత్రికి అక్కడే ఉందామని రవి,తరుణ్ లిద్దరూ నిర్ణయించుకున్నారు.

మరికొంత సమయానికి ముగ్గురు బయటకు కదులుతుండగా రవిని గమనించాడు తరుణ్. తను ఎప్పుడు ఫోన్ పట్టుకొని అదే ఫొటో చూస్తున్నాడు. మనిషైతే ఉన్నాడు కానీ మనసు మొత్తం అదే ధ్యాసలో ఉన్నదని భావిస్తూ " అరే ,రవి ఎందుకు అంతలా కుమిలిపోతావు. జీవితంలో మనం అనుకున్నవన్ని జరిగిపోతాయా చెప్పు? కొన్నిసార్లు పరిస్థితులకు తగ్గట్లు మనం సర్దుకుపోవాలి. అర్థం చేసుకోరా."అంటూ రవిని సముదాయించేతట్టు చెప్పాడు తన స్థితిని చూడలేక.

అప్పటివరకు ఎంతో మౌనం మోస్తున్న రవికి ఒక్కసారిగా మాట్లాడటకు మనుషులు దొరికినట్టుగా ఉద్వేగభరితమైన బాధతో "ఏం చెప్పమంటారురా! ఈ అమ్మాయిలు ఎందుకు ప్రేమిస్తారో ఏమో?ఆ తరువాత ఏమి చెప్పకుండానే వేరేవారితో ఎగిరిపోతారు "అంటూ బాధతో జవాబిచ్చాడు.

అమ్మాయిల దృష్టిలో ప్రేమకు విలువుండదు అన్నట్టుగా కొంత నిరుత్సాహంతో మరి కొంత సమయానికి "ఇంట్లో వాళ్ళ కోసం ధైర్యం చేయలేక జీవితాన్ని ఎవరితోనైనా సర్దుకుపోతారు."అంటూ చెబుతుండగా వీడు వినేటట్టు లేడు అని రఘు ఆ విషయాన్ని మరిచేలా "సరే ఇక మనం ఏదైనా తినేసి అక్కవాళ్ళకు తినడానికి పార్సిల్ తెద్దాం పదా!"అంటూ హాస్పిటల్స్ ముందుండే హోటల్ దగ్గరకు వెళ్లారు.

కానీ రవి అదే నిరుత్సాహంతో ఎవరు ఏమి చెప్పిన వినట్లేదు.అందుకే భోజనం కూడా సరిగా చేయలేదు .ముగ్గురు భోజనం పూర్తయ్యాక పార్సిల్ తో తిరిగి హాస్పిటల్ దగ్గరకు చేరుతుండగా "మీరు ఇక్కడే కూర్చోండి నేను లోపలికి వెళ్ళి అక్కకు భోజనం ఇచ్చి వస్తాను"అని రవి ,తరుణ్ లకు చెప్పి పార్సిల్ తో లోపలికి వెళ్ళాడు రఘు .

★★★

ఆ రాత్రి నిశ్శబ్ద వాతావరణంలో హాస్పిటల్ ముందుండే బెంచీపై కూర్చున్న రవి, తరుణ్ ల మధ్య కొన్ని మాటలు కదిలాయి .కానీ రవి మనసు నిండా అవే ఆలోచనలు స్వాతి తనను ఎందుకు దూరం చేస్తుందని,అసలు తన ఫోన్ లిఫ్ట్ చేయకపోవడానికి కారణం ఏంటని పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నాడు. ఎంత వెతికిన వారి ప్రేమలో ఏ చిన్నపాటి మనస్పర్థలు కూడా రాలేదని ఆలోచిస్తుండగా అకస్మాత్తుగా ఒక కారు వచ్చి వారి పక్కగా ఆగింది.అంతలోనే అందులో నుంచి ఒకతను దిగి అక్కడే కూర్చున్న రవి, తరుణ్ లతో "బాబూ !డాక్టర్ ఉన్నారా? ఎమర్జెన్సీ వార్డు కి ఎటువైపు తీసుకెళ్ళాలి?"అంటూ ప్రశ్నిస్తుంటే అప్పటినుండి దీర్ఘలోచనలో ఉన్న రవిపై నీళ్ళు చల్లినట్టుగా అనిపించి "అటువైపు వెళ్ళాలి పదండి "అంటూ అనేలోపే కాస్తా సాయం చేయమన్నట్టు సైగలు చేసాడు.

చూస్తే కారులో అమ్మాయి మెడపై గాయాలతో స్పృహ కోల్పోయి పడుంది. దాదాపు ఆమెకు ఇరవై సంవత్సరాలు ఉండొచ్చు. అందంగా ఉన్నది. రవికి అక్కడ ఏం జరుగుతుందో అర్థమవ్వడం లేదు. కారులోంచి దిగిన వ్యక్తి ఆ అమ్మాయిని తలవైపు పట్టుకోగా రవి ఆ అమ్మాయి కాళ్ళవైపు పట్టుకొని తొందర తొందరగా ఎమర్జెన్సీ వార్డులోకి కదిలారు. వీరితో పాటు తరుణ్ కూడా లోపలికి వెళ్ళి డాక్టర్ ను తీసుకురావడానికి వెళ్ళాడు..

ఆ అమ్మాయిని బెడ్ పై పడుకోబెట్టారు. అప్పటికే తన బావకు భోజనం ఇవ్వడానికి వచ్చిన రఘు. తన బావ చంద్రయ్య బెడ్ ప్రక్కనే రవి ఆ అమ్మాయిని తీసుకొచ్చి పడుకోబెట్టడం చూసి ఆశ్చర్యపోయాడు. ఎవరన్నట్టు రఘు కనులతో సైగ చేస్తుండగా ఎవరో తెలీదన్నట్టు తలూపుతూ పక్కకు కదిలాడు రవి.

అంతలోనే హాస్పిటల్ వైద్య సిబ్బంది చక చక ట్రీట్మెంట్ మొదలుపెట్టారు. ఒక్కసారిగా హాస్పిటల్ వాతావరణం నిశ్శబ్దంగా మారిపోయింది. అందరిలో తెలియని ఉత్కంఠ ఏం జరిగిందో తెలుసుకోవాలనే ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. అక్కడక్కడ కొన్ని గుస గుసలు వినిపిస్తున్నాయి. వైద్య సిబ్బంది అటు ఇటు కదులుతున్నారు.

ఇలా జరుగుతున్న సమయానికి వార్డు బాయ్ "బాబూ!బయట ఉండండి పిలుస్తారు" అని వారికి చెప్పడంతో బయటకు కదులుతున్నా కారులోంచి దిగిన వ్యక్తికి కండ్లల్లో నీళ్ళు ఆగటంలేదు.

రవి కూడా ఆ అమ్మాయికి ఎలాంటి ప్రమాదం జరగొద్దని తనలో తానే కోరుకుంటున్నాడు. వారు బయటకు అలా వెళ్తుంటే తరుణ్ కారులో వచ్చిన వ్యక్తితో "ఎలా జరిగింది ?"అంటూ తెలుసుకొనే ప్రయత్నం చేశాడు.

"ప్రేమ కోసం ఆత్మహత్య బాబూ! ఉరివేసుకుంది"అంటూ బాధ తాలూకు మాటలతో అన్నాడు.

రవికి ఎంతో బాధ వేసింది ఆ అమ్మాయి తప్పక బ్రతకాలి అన్నట్టు బలంగా కోరుతున్నాడు.

అలా ముగ్గురు హాస్పిటల్ బయట ఉన్న బెంచీపై కూర్చునేలోపే మరో మూడు కార్లు, ఒక ఆటోలో ఆ అమ్మాయి సంబంధికులు వచ్చారు. వస్తూనే ఏడుపుల రాగలతో హాస్పిటల్ మొత్తం నిండిపోయింది. మరి కొంత సమయానికి లోపటినుంచి ఆ అమ్మాయి శవాన్ని మార్చురీ వార్డు లోనికి తీసుకువెళ్తున్నారు. ఇది చూసిన అమ్మాయి సంబంధికులు ,అమ్మాయి తల్లి దుఃఖం ఆపుకోలేకపోయారు. హాస్పిటల్ నిండా దుఃఖం ప్రవహిస్తున్నది. రవి కూడా నమ్మలేకపోతున్నాడు మనిషి చావు ఇంత తేలికనా అన్నట్టు తన చేతుల్లో తీసుకుపోయిన అమ్మాయి చనిపోవడం ఎంతో ఉద్వేగానికి లోనయ్యాడు. తనకు మాటలు రావడం లేదు. అక్కడ అంత విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఈ రాత్రి ఒక కలగ మిగిలిపోతే బాగుండు అన్నట్టుగా తను కళ్ళ ముందే జరిగిన సంఘటన నుంచి తేరుకోలేకపోయాడు. ఆ తల్లి ఏడుస్తుండగా రవికి తెలియకుండానే ఏడుస్తున్నాడు. లోపటినుంచి బయటకొచ్చిన రఘు,బయట ఉన్న తరుణ్ ఇద్దరు కలిసి రవిని ఓదార్చుతున్నారు కానీ అతను ఏడవడం చూడడం వారిద్దరికీ ఇదే మొదటి సారి కూడా.

★★★★

చనిపోయిన ఆ అమ్మాయి ప్రేమలో విఫలమై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని కారులో తీసుకొచ్చిన వ్యక్తి ద్వారా తెలిసిన క్షణం నుంచి రకరకాల వ్యక్తులకు రకరకాల ఆలోచనలు. ఈ బాధకు తట్టుకోలేక "ఇంత చిన్న వయసులో బంగారు భవిష్యత్తును విడిచి కేవలం ప్రేమ కోసం జీవితాన్ని వదులుకోవడం నిజంగా నేరం. ప్రేమ ఒక మనిషిని దూరం చేస్తోందంటేనే నమ్మలేకపోతున్న"అంటూ తరుణ్ మనస్తాపంతో బాధను వ్యక్తపరిచాడు. ఈ సంఘటన నుండి ఇంకా తేరుకోలేకపోతున్న రవికి తన మనసులో ఎన్నో అనుమానాలు తిరుగుతున్నాయి.

ఆ అమ్మాయి స్థానంలో తన స్వాతినే ఉండుంటే ఇంకెంతల కుమిలిపోయేవాన్నోనని ఆలోచిస్తున్నాడు. అందుకే తన ఫోన్ లో స్వాతి ఫోటోనే చూస్తూ ఎడతెగని కన్నీళ్లను జారవిడుస్తూ స్వాతి కూడా తన ఫోన్ ఎత్తకపోవడానికి ఏవో తప్పక కుటుంబ సమస్యలు ఎదురుకావొచ్చని అనుకుంటూ "నిజం చెప్పావురా! తెలిసి తెలియని వయసులో ప్రేమకు ఆకర్షితులమై జీవితాలను కోల్పోతున్నాం. కుటుంబాలకు జీవితానికి సరిపడా శోకాన్ని మిగిల్చుతున్నాం ."అంటూ పశ్చాత్తంతో పలుకుతూ అసలు విషయం తెలుసుకుందామని ఆరాటపడుతున్నాడు రవి.

అక్కడంతా గుంపు గుంపులుగా విడిపోయారు. వారి బెంచీ ప్రక్కల గుంపు చనిపోయిన అమ్మాయి ఊరి యువకులతో మాట్లాడుతున్నారు.

"మధ్యాహ్నం వరకు అందరితో కలిసే ఉన్నది. అందరూ సాయంత్రం వచ్చి చూస్తే ఉరి వేసుకున్నది. నిజానికి తన ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలిసి అబ్బాయిది వేరే కులం అవడంతో గత నెలలో బలవంతంగా మరొక అబ్బాయితో పెళ్ళి

నిశ్చయించారు. అది మనసులో పెట్టుకొని అటు ప్రేమించిన వానికి, తల్లిదండ్రులకు న్యాయం చేయలేక ఇలాంటి అఘాయిత్యం చేసింది. చదువులో మంచి ర్యాంకర్ కూడా తను " అంటూ ఎవరో ఆ ఊరి యువకుడు చెబుతుండగా ఇది వినిన రవికి తన కథనే విన్నట్టుగా కుమిలిపోయాడు.అటు మార్చురీ గది దగ్గర గేటును పట్టుకొని రోధిస్తున్న ఆ తల్లిని ,ఆ తండ్రిని ఆపడం ఎవరి వల్ల కావట్లేదు. "అయ్యో !నా బంగారు కొండ నన్ను విడిచిపోయిందే .ఇక నేనుండను" అంటూ హాస్పిటల్ ముందుండే రోడ్డువైపు వాహనాల పైకి పరుగెడుతున్నది చనిపోవడానికి తృటిలో ప్రమాదం తప్పింది.

అమ్మాయి అన్నను పట్టుకొని వాళ్ళ చుట్టాళ్ళందరు ఏడుస్తుంటే "చెల్లె ఎంతపని చేశావమ్మా!"అంటూ తలను కొట్టుకుంటూ ఏడుస్తుంటే ఇన్ని శోకాలకు కారణం ఎంటని ఆలోచిస్తూ " మనుషులు మూర్ఖత్వం ఎప్పుడు మారుతుందో కదరా! తెలియని వయసులో ప్రేమకు తల్లిదండ్రులు కూడా బాధ్యులేరా! వాళ్ళు సమస్యకు పరిష్కారం చూపకుండా దానిని కప్పిపుచ్చుకునేందుకే ఎక్కువ ప్రయత్నిస్తారు. ఇదిగో ఇలాంటివి ఆత్మహత్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి".అంటూ రఘు తన ఇద్దరి మిత్రులతో అంటుండగా,అక్కడే వారి పక్కల ఉండి వింటున్న హాస్పిటల్ వార్డు బాయ్ గా పనిచేసే ఒక నలభై ఏళ్ల వయసున్న వ్యక్తి ఇలాంటివి ఎన్నో చూసిన అనుభవంతో "ప్రతి వ్యక్తికి ఆలోచన చేసే విధానంలో పరిణితి ఉండాలి బాబూ అప్పుడే ఇలాంటి ప్రమాదాలు జరగవు. మీరు నిదానంగా ఆలోచిస్తే ఆ అమ్మాయికి ,ఆ వయసులోని వారికి ప్రేమలో పడటం కంటే జీవితంపై దృష్టి పెట్టడం ముఖ్యం. తల్లిదండ్రులు కూడా సామరస్యంగా చర్చించి ఉంటే ఇపుడు అమ్మాయి బ్రతుకేది. ఎప్పుడైతే వారు వారి కులానికి గౌరవం ఇచ్చే ప్రయత్నం చేశారో అపుడే ఆ అమ్మాయి చనిపోయింది. ఇది బాధ్యతలు మరిచిన సమాజం బాబూ! మనమే అర్థం చేసుకొని బ్రతకాలి" అంటూ ఆ వ్యక్తి చెప్పగా రవి తన స్వాతి గుర్తుకొచ్చి ఆమె పరిస్థితి ఎలా ఉందో అన్నట్టుగా ఆలోచిస్తున్నాడు. అమ్మాయి కుటుంబ కట్టుబాట్లు ,ఆమెపై సమాజం చూపే ధోరణి వీటన్నింటికి ప్రభావమవుతూ ఎంతలా సంఘర్షణకు గురౌతుందోనని దుఃఖం లోనే ఆలోచిస్తున్నాడు రవి.

★★★

మార్చురీ రూమ్ గేటు దగ్గర తల్లిదండ్రులు ఏడుస్తూనే ఉన్నారు. అమ్మాయి జ్ఞాపకాలతో ఒక్కొక్కటిగా తన దుఃఖంతో విలపిస్తుంది అమ్మాయి తల్లి. దాదాపు అర్ధరాత్రి కావొస్తుంది. అక్కడ గుమికూడిన యువకులలో ఒకరికి ఫోన్ ద్వారా అమ్మాయిని ప్రేమించిన అబ్బాయి కూడా ఈ వార్త తెలిసి విషం త్రాగి చనిపోయాడని తెలిసింది. ఇది తెలిసి రవి గుండె మరింత బరువెక్కింది. ఆ అమ్మాయి ప్రాణం విడిచిన దేహాన్ని మార్చురీ గది దగ్గర ఒక అనాధగా పెట్టడంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న గారాల కూతురు ఒంటరిగా మిగిలిందని గేటు వద్దనే కూర్చుని రోధిస్తున్న ఆ తల్లీని చూస్తూనే రాత్రంతా మేల్కొనే ఉన్నాడు రవి. మిగితా కార్యక్రమాలు రేపు జరుగుతాయని డాక్టర్ లు కుటుంబ సభ్యులకు తెలుపుతూ పోలీసులకు సమాచారం అందించగా వారు కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు.

కానీ ఇదంతా కళ్ళముందే చూస్తున్న ఆ ముగ్గురికి ఇదొక సామాజిక పాఠం గా తెలిసిందని అనుకుంటూ ప్రేమవలన పోయిన ఇద్దరి ప్రాణాలు తిరిగి తీసుకురాలేమని ప్రేమకు తెలియని వయసులో సంఘర్షణకు గురికావడం కుటుంబాలు ఎలా నాశనం అవుతున్నాయో వాళ్ళ జీవితకాల బాధను మోయలేక ఎంత కుమిలి కుమిలి చస్తున్నారో మనం చూస్తూనే ఉన్నామని అనుకున్నారు.

రవి తన జీవితానికి సంబంధించిన గొప్ప పాఠం తెలిసిందని అనుకున్నాడు. అలా సమయం ఏడ్చి ఏడ్చి అలసిన కన్నీళ్ల తడితోనే తెల్లారింది.ఇక ఆ ముగ్గురు రఘు వాళ్ళ బావను తీసుకొని ఇంటికి బయలుదేరారు.

తనవల్ల,తన ప్రేమవల్ల ఎవరు నష్టపోవద్దని తన జీవిత సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నాడు. జీవితంపై దృష్టి పెట్టి తను ప్రేమించిన స్వాతికి ఫోన్ చేసి కాకుండా నేరుగా ఇంటికి వెళ్ళి కలిశాడు. స్వాతి ఇంట్లో రవి ఊహించిందే జరిగింది. స్వాతి ఏడ్చి ఏడ్చి కన్నుల కింద నల్లని చారలు కనిపించాయి. ఆమె ఈ రెండు నెలలు ఎన్ని కష్టాలు అనుభవించిందో ఉహించాడు. ఇక తప్పదని స్వాతితో పాటే వారి తల్లిదండ్రులకు "మా ప్రేమ వల్ల ఎవరి జీవితాలు నష్టపోవద్దు. మేము ఉన్నతమైన జీవితాన్ని పొందాకే ఒక్కటవుతాం.మాపై నమ్మకం ఉంచండి. ఇక మీరు ఇతర ఏ విషయాలు ఆలోచించవద్దు.దయచేసి అర్థం చేసుకోండి."అని స్వాతి నాన్నగారిని రవి కోరాడు.

అల్లారుముద్దుగా పెంచుకునే కూతురి జీవితం నాశనం అవ్వడం సహించలేనని ఎందుకు ఇన్ని రోజులు మృగంలా ప్రవర్తించానోనని తనలో తానే ఆలోచించాడు. అందుకే సామాజిక దృష్టితో కాకుండా లోతుగా ఆలోచించి చిన్న చిరునవ్వుతో తన కూతురు స్వాతి వైపు చూస్తూ కనురెప్పలను ఒప్పుకున్నట్టుగా ఆర్పాడు. వెంటనే స్వాతిపై పచ్చని ఆనందవర్షం కురిసినట్టుగా తన నాన్నపై వాలింది. రవి ఎంతో ఆత్మవిశ్వాసంతో తన జీవితాన్ని ప్రారంభించాడు.జీవితంపై ఉండే నమ్మకమే ప్రేమ అనుకుంటూ ఇంటికి కదిలాడు.

# తారుమారు

బి. రాజ్యలక్ష్మి

సీత అందమైనది కాకపోయినా అనాకారి మాత్రం కాదు! ముఖ్యంగా విశాలంగమైన గుండ్రని కాటుక కళ్లు కావ్యనాయికలను గుర్తుకుతెస్తాయి. సౌజన్యం సౌశీల్యం సీతను అందగత్తె గా మలిచాయి. సీత ఇంటినించి కాలేజీకి

వెళ్తుంటే స్వయంవరానికి రాకుమారులు నిల్చున్నట్టు రోడ్డుకి అటూయిటూ అబ్బాయిలు సీత కటాక్షవీక్షణాలకోసం యెదురుచూస్తూ వుంటారు. తల వంచుకుని వెళ్తుంది, వస్తుంది. అయినాసరే వాళ్లు గడకర్రల్లాగా ఒక్కక్కళ్లు ఒక్కోచోట కాపుకాస్తారు. వాళ్ళపంతం సీత సౌశీల్యం పోటీపడుతూవుంటాయి . ఈ పద్మవ్యూహాన్ని ఛేదించుకుంటూ పోవడం ఆమెకు వెన్నతోపెట్టిన విద్య!

సూర్యోదయం అయినా ఆలస్యం అవుతుందేమోకానీ శివరాం మాత్రం అన్నికాలాలో క్రమతప్పకుండా పార్క్ దగ్గర హాజరువేస్తాడు. రామం ఆయుర్వేదక్లినిక్ దగ్గర యెదురు చూస్తుంటాడు. రఘురాం ఏదో పోయిన వస్తువు వెతుకుతున్నట్టూ కాసేపు అటూ కాసేపు యిటూ చూస్తూ స్తంభం దగ్గర నడుస్తుండాడు. అయితే సీత యీ సమాంతర రేఖలను దాఁటుతూ వెళ్లిపోతుంది !

మంగళ సీత స్నేహితురాలు. అన్ని సంగతులూ కాలేజీలో ఫ్రీ సమయం మాట్లాడుకుంటారు. సీతకోసం అబ్బాయిల పడిగాపులు మంగళకు తెలుసు !

"ఒసేయ్ సీతా నీ అందమైన కళ్లు దేవుడు నాకే వుండుంటే యీ ప్రపంచాన్నే నా గుప్పిట్లో పెట్టుకునేదాన్ని !నువ్వుకాబట్టి అలా వస్తున్నావు ,వెళ్తున్నావు !"అన్నది మంగళ .

సీత నవ్వుతూ "పిచ్చి మంగళా కాటుక పెట్టుకుంటే నీ కళ్లు కూడా అందం గా వుంటాయి. అందమైనమనసు వుండాలి ,నీ కళ్లల్లో అందమైన మనసున్నది . "అన్నది

"నా కళ్లను నువ్వు పొగడాల్సిందే !! చూడు నీ కటాక్షవీక్షణాల కోసం అబ్బాయిలు యెలా పడిగాపులు కాస్తారో ! అయినా కనీసం కళ్లెత్తి కూడా చూడవు ,వాళ్లు ఆలా వెళ్లాడడం మానరు !"అన్నది మంగళ .

"అది నా దురదృష్టం ,నేనేమీ అందాలపోటీకి వెళ్ళడడం లేదు. చదువుకోవడానికి వస్తున్నాను . బాగాచదువుకోవాలి ,తీయని పాటలు వినాలి ,ప్రకృతిని మనసుతో కళ్లతో ఆస్వాదించాలి !నిజంగా జీవితం యెంత మధురం!" సీత చెప్తూ చెప్తూ వివశురాలయింది .

"సీతా ........ నువ్వు యింకా ఎక్కడోవున్నావు ,నీ అభిలాష వూహలు ,భావాలూ అందంగా వున్నాయి ,. పొగడ్తలకు లొంగవు ,ఆకర్షణలకు లొంగవు . నన్ను చూడు చిన్నచిన్న పొగడ్తలకు కూడా యెండమావిలాగా యెదురు చూస్తుంటాను . " నవ్వుతూ సితకేసి చూసింది మంగళ .

"నా ఊపిరేదో నన్ను పీల్చుకోనిస్తే చాలు !నిరంతరం అంగరక్షకులలాగా యీ కాపలాలేమిటి ? నీకేం తెలుసు నా బాధ ? నాకెంత చిరాగ్గా వుంటుందో !! ఒక్కోసారి అసహ్యం వేస్తుంది . అయినా నేనెప్పుడూ యెవ్వరినీ కవ్వించలేదు ,రెచ్చగొట్టలేదు . ఆలా అనీ వయ్యారాలు వొలకబొయ్యటం లేదు. " అన్నది సీత .

__________________

_కాలేజీలో విద్యార్థి సంఘ ఎన్నికలు మొదలయ్యాయి. అంతా సందడీ ,హడావిడీ ,కోలాహలం !! ప్రచారాలూ ,కరపత్రాలు ! భాషాభాగానికి విద్యార్థినిని నిలబెట్టాలనుకున్నారు .
ఎవరి గ్రూపులు వాళ్లు వాళ్లవాళ్లకోసం ప్రచారానికి తయారవుతున్నారు.
భాషావిభాగానికి అందరూ యేకగ్రీవంగా సీత ను నిలబెడదామని నిర్ణయించారు .

"సీత పేరు చెప్తే సీతను నిలబెడితే మొత్తం గ్రూపంతా గెలుస్తుంది . స్టూడెంట్సంతా పిచ్చెక్కినట్టూ వోట్లేసిపోతారంతా మనకే " యిలా యెవరి గ్రూపు వాళ్లు వాళ్ల వాళ్ల గ్రూపుల్లో చర్చించుకుంటున్నారు .

కానీ సీత ను యెవరు అడుగుతారు! యెవరు సీతను ఒప్పిస్తారు! యెవరు వెళ్లి అడుగుతారు !

తర్జనభర్జనలు జరిగాయి .

శివరాం గ్రూపువాళ్లు చర్చించుకుంటున్నారు . శివరాం యీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్నాడు .

ఒకరోజు ట్రిమ్ గా తయారయ్యాడు. చెట్టుకింద కూర్చున్న సీతా, మంగళల వైపు వెళ్లి కొద్దిదూరం లో నించుని "సీతగారూ "అని పిలిచాడు .
యివాళ యీ గొట్టంగాడు యేదో సాహసానికి పూనుకున్నట్టున్నాడు అనుకున్నది సీత..

"ఏమిటండీ శివరాం గారూ "అంటూ సీత అతనికి కొంచెం దూరం లో వచ్చి నిల్చుంది .

"మా గ్రూపు ఎన్నికలకు పోటీ చేస్తున్నాం !" భయం భయం గా జంకు జంకు గా శివరాం గొణిగాడు !

"సరే నా ఓటు మీకే వేస్తాను "అంటూ సీత వెనక్కి వెళ్ళబోతున్నది ,వెంటనే శివరాం కంగారు కంగారుగా

"సీతగారూ ఆగండీ ,మిమ్మల్ని భాషా విభాగానికి అభ్యర్థినిగా నిలబెడదామనుకుంటున్నాం , సరేనా? !!"అడిగాడు .
"క్షమించండి నాకిలాంటివి నచ్చవు "అంటూ వెనక్కి తిరిగింది సీత !

"అయ్యో మీరలా అంటే మేమేం కావాలి "జాలిగా మొఖం పెట్టాడు .

సీతకు చిర్రెత్తింది ,కోపం వచ్చింది " గంగలో దూకండి " సరా సరా వెళ్లిపోయింది .

శివరాం యుద్ధం లో ఓడిపోయిన వీరుడిలాగా తిరుగుముఖం పట్టాడు .

శివరాం చుట్టూ అతని గ్రూపు చేరింది .

"ఏమయిందిరా సీత ఒప్పుకుందా ,మనతో ప్రచారానికి వస్తానందా ?"

"నువ్వు అదృష్టవంతుడివిరా సీత నీతో మాట్లాడింది "

" సీత నవ్వుతూ మాట్లాడిందా , శివరాం చెప్పరా? "

ప్రశ్నల పరంపర !!!!

అభినందనల వర్షం !

" నన్ను చంపకండిరా బాబూ మనల్ని గంగలో దూకమంది! బాగా తిట్టి పంపింది "అన్నాడు బిక్కమొహంతో శివరాం .

"ఓహో అలా అన్నదా !!! సీత చేత చివాట్లు తిన్న మొదటి హీరోవి నువ్వు . అయితే యింకా అదృష్టవంతుడివిరా "అందరూ శివరాం చుట్టూ చేరి ఒకటే గోల !!

, ,,,,,,,,,,,,,,,,

సీత కోపంగా మంగళ దగ్గరకొచ్చింది .

"సీతా యేమైందే? శివరాం యేమన్నాడు? అంతకోపంగా వున్నావు " మంగళ ప్రశ్నించింది .

"వాడి మొఖం ఎన్నికలుట నేను నిలబడాలిట యేదో నెపం తో నాతో మాట్లాడాలని వచ్చాడు నాకిలాంటివి నచ్చవు "సీత నిర్లక్ష్యంగా పలికింది .

"అసలేం అడిగాడు? " కుతూహలం అడిగింది మంగళ .

.."మంగళా నీకు మతిపోయిందే యింత చిన్నవిషయానికి అంత ప్రాధాన్యత యెందుకు !! సవాలక్షగాళ్లు వస్తుంటారు ,పోతుంటారు !.వదిలెయ్యి "అన్నది సీత .

మంగళ సీతను ఒక జగదేకసుందరిని చూస్తున్నట్టు తన్మయం గా చూస్తున్నది నవ్వుతూ !

"ఏమిటే యీ తన్మయత్వం!? " సీత కూడా నవ్వుతూ ప్రశ్నించింది !

"సీతా నిజం చెప్పవే వాళ్లు ఆలా నీ చుట్టూ తిరుగుతుంటే నీకు కూడా సంతోషం వుంటుంది కదూ ! పైకి వాళ్లను విసుక్కుంటావు కానీ లోలోపల వాళ్లు ఆలా పడిగాపులు నీకు సరదా కదూ " కవ్విస్తూ అడిగింది మంగళ .

సీత కోపం గా "చాల్లే నీ యక్షప్రశ్నలు పద "అంటూ మంగళను వెంటబెట్టుకుని క్లాసుకు వెళ్లింది .

---------- -----

ఎన్నికలు ముగిసాయి – సీత ఓటువెయ్యడానికి కూడా వెళ్లలేదు .మళ్లీ అంతా మామూలే !అబ్బాయిల పడిగాపులు ,యెదురుచూపులు ,సీత పట్టనట్టు వెళ్లిపోవడం .

కొత్తసంవత్సరం కొత్త విద్యార్థి విద్యార్థినులు జాయిన్ అవుతున్నారు . నళిని కొత్తగా జాయిన్ అయ్యింది . అయితే తన తండ్రి బదిలీవల్ల కాబట్టి తనుకూడా సీత తో పాటు రెండవ సంవత్సరం లో వచ్చింది. కాలేజీలో కొత్తవెలుగు , కొత్తతళుక్కు!! సీతకన్నా చాలా అందమైన అమ్మాయి ! పచ్చనిపసిమి అందమైనశరీరసౌష్టవం !! హుషారైన చూపులు ,నవ్వించేపలువరుస !! అన్నింటికీ మించి మంచి చలాకీతనం సరదా అమ్మాయి ! ఎప్పుడూ చుట్టూ ఫ్రెండ్స్ !!! అందరితో కలిసిపోయింది. అబ్బాయిలతో కూడా సరదాగాగా వుంటుంది .

యిప్పుడు సీతకు అబ్బాయిల పడిగాపులు కనిపించడం లేదు. మొదట్లో సీత పెద్దగా పట్టించుకోలేదు కానీ రెండురోజుల తర్వాత వుండబట్టలేక మంగళను అడిగింది .

"ఏమిటే మంగళా అబ్బాయిలంతా దోవలో పడిగాపులు, యెదురుచూపులు లేవు !ప్రిన్సిపల్ గారు యేమైనా చర్య తీసుకున్నారా!! అయినా నాకు హాయిగావుంది. పీడ వదిలింది " సీత మాటల్లో ఆనందం కన్నా యేదో ఆత్రుత గమనించింది మంగళ .

"పిచ్చి సీతా యిప్పుడు అబ్బాయిలకు నీకోసం యెదురుచూపులు అవసరం లేదు. నళినీ చుట్టూ తిరుగుతున్నారు. నేనూ నళినీ తో మాట్లాడాను ,బలేచురుకు అందరూ నీలా గిరిగీసుకుని వుండరు సీతా "అంటున్న మంగళ ను సీత చిరాగ్గా చూసింది. మొదటిసారి సీత కు తనల్ని యెవరూ గుర్తించడం లేదన్న భావన కలిగింది .

"యెంతసేపూ నళినీ నళినీ భజన తప్ప మరో పనిలేదా వీళ్లకు!! "ఉక్రోషం వచ్చింది సీతకు . "నళినీ నళినీ అవును యిప్పుడు అబ్బాయిలంతా అదే భజన .సీతా సీతా భజన ముగిసిన గతం " అన్నది మంగళ . "అయినా నీకిప్పుడు యెవరూ వెంటబడడం లేదని బాధలేదుకదా ,హాయిగా వుందిగా "మంగళ నవ్వింది .

----------

ఆ రాత్రి సీతకు నిద్రపట్టలేదు . యేదో చెప్పలేని వెలితి !చెప్పలేని దిగులు! తనలో ఆకర్షణ తగ్గిందా ?? తనకళ్లు యిప్పుడు అందం గా లేవా ?? యేదో అశాంతి ,ఆరాటం !!!! అదీ యిదీ అని నిర్వచించలేని వేదన !! అద్దంలో కళ్లు చూసుకుంది . కళ్లలో కాంతి తగ్గినట్టుగా భావించుకున్నది. అందమైన సీత యెంత వద్దనుకున్నా అబ్బాయిలు తనను పట్టించుకోవడం లేదన్న నిజాన్ని ఒప్పుకోలేకపోతున్నది .

మళ్లీ మరోసంవత్సరం కాలేజీలో ఎన్నికలు మొదలయ్యాయి !! హడావిడీ ,సందడీ ప్రచారాలూ ,కరపత్రాలు !!కానీ యీసారి యెవ్వరూ సీతను అడగలేదు. నేరుగా నళినీ దగ్గరకు అబ్బాయిలు వెళ్లారు !భాషావిభాగానికి యేకగ్రీవం గా నళినీ పేరు సూచించారు . నళిని నవ్వుతూ ఒప్పేసుకుంది . సీత చాలా అవమానం గా ఫీల్ అయ్యింది. అసలు సీతను యెవ్వరూ పట్టించుకోలేదు . కనిపించినా చూడకుండా వెళ్లిపోతున్నారు !

కాలేజీలో వక్తృత్వ పోటీలు మొదలయ్యాయి . అందరూ తమ తమ పేర్లను కార్యదర్శికి యిస్తున్నారు ! కానీ సీతను యెవ్వరూ అడగలేదు. అంతకుముందు సంవత్సరం పోటీలో సీతకు మొదటి బహుమతి వచ్చింది . యీ సారి సీత పేరివ్వడానికి వెళ్తే అక్కడ యెవ్వరూ పలకరించనుకూడా లేదు. సీతకు తల కొట్టేసినంత అయ్యింది. అయినా పేరిచ్చి తలవంచుకుని వచ్చేసింది .

నళినీ వేదిక పైకి రాగానే హాలంతా చప్పట్లు!! నళినీ అందమైన నవ్వు ,అందమైన హావభావాలు అందమైన చలాకీతనం అందరు ఆస్వాదిస్తున్నారు . భాష సరిగా లేకపోయినా భావం సరిగా తెలపలేక పోయినా నళినీ ప్రతివాక్యానికి హాలంతా చప్పట్లు!హుషారయిన సందడి. నళిని ఏం మాట్లాడిందో ,ఏం విన్నారో !!1

తర్వాత సీత వేదిక పైకి మాట్లాడడానికి వచ్చింది. వినయంగా ,ఒద్దికగా వచ్చింది చేతులు జోడించి నమస్కరించి తన ఉపన్యాసం మొదలుపెట్టింది. చప్పట్లు లేవు, సంతోషం లేదు !ఒక్కొక్కళ్లూ మెల్లమెల్లగా లేచి వెళ్లిపోతున్నారు . అసలు సీతను చూడడమే విసుగ్గా వుంది అక్కడ చాలామందికి . సీత మొదలుపెట్టగానే వెక్కిరింతలు ,పిల్లికూతలూ !! అవహేళన !! సీత అవమానం భరించలేక సగం లోనే కన్నీళ్లతో వేదిక దిగింది ! నళినికి మొదటి బహుమతి ప్రకటించారు . అందరూ నళినీ చుట్టూ చేరారు .

---

సీత ఆ హడావుడిలో ఒంటరిగా యెప్పుడు యింటికి చేరిందో యెవరికీ పట్టలేదు . ఇప్పుడు సీత ఒకనాటి సౌందర్య పీఠాన్ని అధిష్టించిన దేవతకాదు. ఒకనాడు అందరిచేత ఎదురుచూపులూ ,అలుపెరుగని పడిగాపులు చేయించిన సీత యిప్పుడు అందరిచేత తిరస్కరింపబడిన సీతగా మిగిలిపోయింది. ఆనాటి సీతకు అందరూ ఆరాధిస్తుంటే యేదో తృప్తి ,అహంకారం ,అభిమానం! యీనాటి సీతకు అందరూ తిరస్కరిస్తుంటే చెప్పలేని అవమానం ,వేదన ,నైరాశ్యం !!

సీతలోని నిర్లిప్తత గమనించింది మంగళ .

"సీతా యేందుకే దిగులు? అన్నీ మర్చిపో నీ చదువూ నీలోకం అంతే !! యిది జీవితం , అబ్బాయిలకు నళిని మన కాలేజీలోకి రానిరోజుల్లో నువ్వు వాళ్లకు సౌందర్య ఆరాధ్య దేవతవు !యిప్పుడు నళిని అబ్బాయిలకు ఆరాధ్య ,సౌందర్య దేవత ! యింకో అందమైన నళినీ కన్నా అందమైన అమ్మాయి వస్తే అప్పుడు అందరూ తననీ మర్చిపోయి ఆ అమ్మాయి చుట్టూ తిరుగుతారు . ఇది సహజం ! అయినా యింకో సంవత్సరం తో మన చదువయిపోతుంది !తర్వాత యెవరికి యెవరో ! జీవితం మనకు పాఠాలు నేర్పుతుంది. యీ కొద్దిరోజులు హాయిగా నవ్వుతూ అందరితో సరదాగా గడుపుదాం !! అబ్బాయిలూ బాధ్యతలు ,అమ్మాయిలూ బాధ్యతలూ ఇకముందు

జీవితమంతా కదా !! సీతా నీ మనసులోని నిరాశను తరిమేసెయ్యి " భావోద్రేకంతో నిండుమనసుతో సజలనయనాలతో మంగళ సీతను వుత్సాహపరిచింది .

సీత మంగళ మాటలతో తనల్ని తానే ప్రశ్నించుకుని సమాధానం వెతుక్కుంది . సీతగా తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంది . ఆ సంవత్సరం తనకిష్టమైన గణితం లో విశ్వవిద్యాలయ బంగారుపతకం పొందింది. విద్యావేత్తల మెప్పుపొందింది . మనసారా తృప్తిగా హాయిగా నవ్వుకుంది . తన జీవనపయనం అర్థం చేసుకుంది .

జీవన సమర తొలిఉషోదయం యుక్తవయస్సులో ,యవ్వనపు భావనలు అందం చుట్టూ తిరుగుతాయి! గుర్తింపు కోసం తపన !!కానీ మరోకొద్దిపయనం యెన్నో మలుపులు !! యెన్నో పాఠాలు !! అన్నింటినీ ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపెయ్యాలి .

## శ్రీమతి ప్రేమలేఖ — డా.కనుపూరు శ్రీనివాసులు రెడ్డి

చాలా చిరాగ్గా ఉంది. సగం రాత్రి దాటి పోయింది. ఆవిడ యింకా నన్ను వదల్లేదు. సాధిస్తూనే ఉంది. ఎన్ని వివరణలు ఇచ్చినా సంతృప్తి పడటం లేదు. తల పగిలి పోతోంది. ఇన్ని సంవత్సరాల కాపురంలో మనశ్శాంతిగా ఉన్నది ఎప్పుడో తన వాదన పట్టుదల ఒక్కటే ముఖ్యం. ప్రేమించి మరీ పెళ్లి చేసుకున్నాము. ప్రేమించినప్పుడు ఈ వ్యత్యాసాలు గుర్తు రాలేదు. వచ్చినా ఇవి ఎంత ప్రేమ ముందు అనే లెక్కలేని తనం. అర్థం చేసుకున్నాము అని గుడ్డి నమ్మకం.!! విడిపోయ్యంత ఉండవు ; కలిసి ఉండటానికి పనికిరావు. తలలు గుండెలు పగలగొట్టుకోవాల్సిందే. ఏదీ తేలదు. తేల్చుకోవాలని కూడా ఇద్దరికీ ఉండదు.. ఈ కట్టెలు ఇలా మండాల్సిదే! ఈ కొంప ఇలా తగల పడుతూ ఉండాల్సింది! పిల్లలు. అందునా ఆడ పిల్లలు. అదీ చెప్పి చూసాను మనల్ని చూసి నేర్చుకుంటారు అని. పోనీండి వాళ్లైనా బాగు పడుతారు అంది. నోరు మూసుకునే ఉండాల్సిందే .తప్పదు.

ఎ.సి రూములో చెమటలు పోసిపోతుంటే, హాల్లోకి వచ్చి గుడ్డి టేబిలు లైటు వేసుకుని, పైన తిరుగుతున్న ఫ్యానును చూస్తూ, నెత్తి పగల గొట్టుకుంటూ ఉండి పోయాను. ఎంత వెతికినా లోడినా కనపడితే కదా సమాధానం!! తీర్పు; ఒక కొలిక్కి వస్తే కదా?

ఎంత సేపటికో టీపాయ్ మీది పుస్తకం చేయి తగిలి క్రింద పడింది. అందులోనుంచి ఏవో కాగితాలు క్రింద పడ్డాయి. అన్నీ ఏరి సరిగ్గా పెడుతూ చూసాను. ఉత్తరం లాగా ఉంది. ఆ చిన్న వెలుగులో అక్షరాలు కనిపిస్తున్నాయిగాని, స్పష్టంగా తెలియడం లేదు. పెద్ద లైటు వేస్తామంటే, ఆవిడ నిదుర చెడుతుందేమో? లోపల పెట్టేస్తే పోతుంది. సర్దు తున్నప్పుడు, మొదటి పేజీలో మొదటి లైను 'మై డియర్ స్వీట్ హార్ట్ ' అని కనిపించింది. ఇదేవిటి? అక్షరాలు నావేనా..! ఆ గుడ్డి వెలుగులో అలాగే అనించాయి.

నా ప్రేమ లేఖ.!! ఇప్పుడు...ఇక్కడ ..పాపం, స్మృతులను, ఇంత సంఘర్షణలో జ్ఞాపకం చేసుకుటుందేమో? ఎంత మనసుంది నా మీద. మా ప్రేమ మీద ఎంత తపనుంది. ఆ నమ్మకంతోనే ఇంతకాలం నాతో కాపురం చేసిందేమో! బంధం మీద భార్యా భర్తల అనుబంధం మీద ఎంత గౌరవం. లేకుంటే ఎప్పుడో రాసిన ...!

మై స్వీట్ హార్ట్ 'మొదటి పదం చదవగానే తనువు పులకరించింది. ఎంతటి మధురమైన తీయనైన జ్ఞాపకం. ఆకాశంలో విహారానికి వెళ్ళింది నా మనసు.

"దిగంతాలకవతల మన మిద్దరం ; మనమే... ఒకరి వొడిలో ఒకరం..!!. సృష్టి లయకారులంతా మన ఇద్దరి ఏకాంతానికి భంగం రానీక గోప్యంగా నవ్వుకుంటూ ఆశీర్వదించి తప్పుకున్నారు.

నువ్వు నాకు వాళ్ళు స్వాధీనం చేసిన విలువైన కానుకవి అని , మన ప్రేమకు దివ్య జ్యోతివని , దగ్గరకు తీసుకుంటే, ఈ కౌగిలికంటే గొప్పవా..మీ ప్రేమకంటే విలువైనవా అన్నావు, మధువు వర్షిస్తున్న కళ్ళతో, హంస తూలికా తల్పంలో, ప్రేమోన్మాధపు తటాకంలో పయనిస్తూ, ప్రణయ సంగమ వసంతోత్సవం జరుపుకున్నాం. కానీ ఇప్పుడో...?"

ఎప్పుడో తొలి రోజుల్లో అలాగే సంభోధించేవాడిని. వేడికదూ ...!

పూర్తిగా చదువు దామని..; చదివి ఇప్పుడెందుకు గుండెలు పగలగొట్టుకోవడం అని తీసి పెడుతూ, బెడ్ రూము వైపు చూసాను. శబ్దం లేదు. నాకు తెలుసు హాయిగా నిదుర పోతూ ఉంటుంది. అది నిత్యం జరిగేదే. అంత తల పగల కొట్టుకుని ఏడ్చి ' నా బ్రతుకుని నాశన చేసావు' అని నన్ను నానా శాపనార్ధాలు పెడితేగాని ఆమెకు నిదుర పట్టదు, నాకు నిదురుండదు. ఉదయం లేవగానే ఎక్కడ లేని ప్రేమానురాగాలతో ముంచేస్తుంది. చేతిలో ఆ ఉత్తరం...! పోనీ చదివితే తీపి గత స్మృతులు ...కాస్త మన...?

"మనిద్దరి మాటలు చేష్టలు ప్రణయ కావ్యాలలోలేని ప్రమోదభరిత ప్రేమ బీజాక్షరాలు. తొలి ప్రేమికులకు వలపు గీతాలు. రతీ మన్మధులకు అమలిన శృంగార హృదయ గ్రంధాలు. అంత స్వచ్ఛమైంది మన వలపు."

★★★

"ఏవిటి అలా చూస్తున్నారు.!?" సిగ్గుతో మరులు పోతూ అడిగింది ఆమె.

"మతి పోగొట్టావు కదా!" అన్నాను.ఇంకా చాలనట్లు ఆమెనే చూస్తూ.

“మనసును దోచినప్పుడు మతికూడా నాదే కదా.”

“అందుకే వశం తప్పింది.” కళ్ళు నా మాట వినవు. మనస్సు అంతకన్నా ఎక్కువే ఆమె నుంచి రెండింటిని తిప్పు కోలేకపోయే వాడ్ని.

★★★

“ఆ క్షణంలో ఎలా ఉంటుందో తెలుసా? పంచేంద్రియాలు నీ వలపుకు దాశోహమైపోతాయి . నన్ను నేను మరిచిపోతాను. ఈ ప్రపంచాన్ని మరిపించి, నీ స్వర్గంలో బందీని అవుతాను. నువ్వు ఎం చెప్పినా అవును అనే సమాధానమేగాని కాదు అనే మాట మరిచి పోతాను. నువ్వు కూడా అంతే అన్నింటికి అంగీకారమే, మరొక పదం వినలేదు.

ఆలశ్యాన్నిభరించడం బ్రహ్మతరమైయ్యేది. నువ్వు వస్తే ప్రశాంతత తోడు వచ్చేది. నీ తోనే వసంతం వచ్చేది. మండుటేడారులు పచ్చిక మైదానులను, విరబూయించుకొని వెన్నెల తోడుంచుకొని, రాజ హంసలు, మయూరాలు, కోయలగానాకి, నాట్యం చేస్తుంటే అప్సరసలా నాజూకుగా సుగంధాలను, విశ్వమంతా విరజిమ్ముతూ మబ్బుల పల్లకిలో భువినంతా వెలిగిస్తూ, నా హృదయ వీణను సునిశిత రాగాలను శృతిచేస్తూ, ప్రేమ పల్లకిలో హృదయాన్ని నిదుర పుచ్చేదానావు.

స్త్రే అందం ఎక్కడ దాగి ఉంటుంది.? అని అనుమానమోచ్చేది. జవాబు..?

అణువణువులోనూ విరజిమ్ముతుంటూ ఉంటుంది. ఇది నిజం కాదు !! వాలు చూపులో, పుష్పించిన కొంటె నవ్వులో, అర చెదరిన పైట చాటులో!! అదికూడా కాదు!!.

ప్రేమతో మమకంతో, మరులు నిండిన బిగి కౌగిలిలో, మత్తులో మునిగిన మనసులో, మందారాలు పూచిన మరుమల్లి తోటలో, మధువును కురిపిస్తున్న పెదవుల్ని, అందుకోబోయే ముందు, పలవరించే ‘ ఛీ ‘అనే , తియ్యని వలపు పిలుపు చిరు పెదవుల్ని అందించే చిరునవ్వులో దాగి ఉంటుందని.!!

ఇది గతం అనుకోడానికి లేదు. ఇప్పటికీ సజీవంగా నాలో బ్రతికే ఉంది. సంతోషం ఆనందం, ఆశ లేనప్పుడు జీవించాల్సిన అవసరం లేదు. నువ్వు లేని ఈ జీవితం అర్ధం లేనిది. మళ్ళీ ఈ రోజు మొదలయ్యింది చూడాలనే తపన. అందుకే ఈ మనసు ఊరుకోలేదు పలకరించాలని పదాలరూపంలో పరుగులు పెడుతుంది."

★★★

‘ఎప్పుడు రాసాను ఇలా?తల గోక్కున్నాను. గుర్తు రాలేదు. ఏమోలే ఆమె అలిగి ఊరేల్లినప్పుడో, మరో పండక్కో పబ్బానికో వెళ్ళినప్పుడు రాసుండవచ్చు. ఇప్పటికీ అంటే....?మరుపు సహజం కదా!’

కానీ బ్రతికున్నాను. గడిపేశాను కాలాన్ని మింగి; కడుపులో చల్ల కదలకుండా!

ఇదేమాట అన్నాను. నేను లేకుంటే ; మనం దూరం అయితే.!?

★★★

"స్పృహ తప్పి పోయి ఒక్క సారిగా నామీద వాలిపోయావు. భయంవేసింది. దూరం చెయ్యాలను కున్నాను. ఎక్కడో నీ మాటలు వినిపించాయి. 'దూరం చెయ్యకండి చచ్చిపోతాను'. గబుక్కున నిన్ను నాలో ఇక్యం చేసుకున్నాను. అలా ఎంత సేపు ఉన్నామో తెలియదు.

తలెత్తి నా వైపు చూసావు. ఎంత దయనీయంగా ఉందో.! అప్పటికప్పుడు నా హృదయాన్ని నీ కాళ్ళ ముందు అర్పించాలనుకున్నాను. ప్రపంచం తల్లక్రిందులయినా, ఆరు నూరయైనా, హరి వీర భయంకరులు అడ్డొచ్చినా నిన్ను వదలకూడదని, ఆ క్షణమే నిర్ణయించుకున్నాను. దగ్గరకు తీసుకుని నీ నొసట ముద్దు పెట్టుకున్నాను. క్రిందకు జారుతున్న నా పెదవుల్ని సుతారంగా తాకి, తొలి ముద్దు, తొలి సంగమాన్ని, తొలి రేయి కానుకగా, జీవితాంతం దాచుకోవాలనుంది. చేరువయ్యేంత వరకు చేజారకుండా, హృదయం కవాటాలు ఆహ్వానిస్తూనే ఉండాలని. సిగ్గుతో మరులుతో ఎరుపెక్కిన నీ బుగ్గలు, మధువును చిందించిన ఆ పెదవులు నవ్విన నవ్వు ,యింకా నన్ను పులకరింప చేస్తుంది. మనసులు ఒకటైనా శరీరాన్ని దరికి రానివ్వలేదు. చేరువకావాలని తపించే ఈ మధుర స్మృతిని పదిలంగా దాచుకుందామని నా కల్లోకి చూసి కాదనకుండా దిగంతాలకవతలకు నెట్టావు, నీ చేతిని తోడుగా....!

గుర్తుందా చీకటి పడుతుంది. మీ ఇంటికి వచ్చాను. వర్షపు సూచనలు. బాగా చీకటి కమ్ముకుంది. ఒళ్ళు పులకరింప చేసే చల్లని గాలి. ఇంటిలో నువ్వొక్కదానివే ఉన్నావు.ఆ రోజు కరెంటు దేశమంతా పోయింది. బయటకొచ్చి పోర్టికో ప్రక్కన, పూతోటలో కూర్చున్నాము. నైట్ క్వీన్ పువ్వుల మధుర సువాసన, సృష్టినంతా ముంచి, మనతో సరసాలు ఆడుతూ పిచ్చి పట్టిస్తుంది. చిమ్మ చీకటి, మన మనసు తెలుసుకుందేమో ఆ వెన్నెల; చుక్కల్ని నింపి తప్పుకుంది. ఆరుబయట ఆకాశంలో మనిద్దరం; మనతో నక్షత్రాలు ; ఆడుకున్నాం కదూ! మనతో మంతనాలు ఆడాయికదూ! ఎంత మనసో వాళ్లకు మన జంట అంటే!,వదల్లేదు మనల్ని, చంద్రుని ప్రేమగాధలన్నీ వినేదాకా! మీరు వెళ్ళండి, మా మధ్య మీరెందుకు ; ఇది న్యాయమా అని నిలదీసినా , చిరుకోపం చూపించినా, చిరునవ్వే సమాధానం.

'పోనీండి పాపం; వాళ్ళ మనసెంత పరితపిస్తుందో పంచుకోవాలని.' సుతారంగా నన్ను మందలించి, ఆహ్లాదంగా వాళ్ళను ఆహ్వానించావు.

★★★

'చుట్టూ చీకటి; ఎక్కడ? ఎప్పుడు? మేమిద్దరం! గుర్తు రాడంలేదు.!! నేనేనా? అలాఅన్నానా?'

★★★

చీకట్లో,ఆకాశంలో, చుక్కల్లో, కీచురాళ్ళ శబ్దంలో ,మిణుగురు పురుగుల విన్యాశాల నృత్యాలు చూసి,మౌనంగా చిక్కగా కనులకు విందుచేసే నవ్వు నవ్వుతూ, చద్రుని వెలిగించావు. చేతిలోకి తీసుకుని, నా మనసు, నీ మనసులోని వలపు పిలుపులు చెబుతూ, ఎంతసేపు చూసామో కదా? ఆకాశం విరహంతో విలపిస్తుందని, నీ మోము చందనాన్ని పూసి కలువ రేడును అర్పించావు, చుక్కలకు బహుమతిగా! 'నా గుండె వెళ్లి పోతుంది. మీ హృదయాన్ని పంపారా ఆ చుక్కలకు రాయబారం!! నా గుండే మీ గుండే నేస్తమని, ఇద్దరి ప్రాణాలు అందులోనే ఉన్నాయని , ఎడబాటు చెయ్యొద్దని, యిస్తే జన్మ జన్మలకు పదిలంగా దాచు కోవాలని. అడగరా ఒక మాట , వాళ్లకు వలపు మాంత్రికుడను ఇచ్చానని చెప్పరా ! ఈ చీకట్లో మనసుకు దారి చూపి, మన బంధానికి శాశ్వితంగా వెలుగునిచ్చే, ఒకే ఒక హృదయ జ్యోతిని, వరంగా పొందరా?'

అన్నారు కదా మేమున్నాం వెలిగిస్తూనే ఉంటాము మీ హృదయాలను, యుగ యుగాలు, అని మనసు విప్పి స్వాగాతించారు కదా విన్నపాన్ని.శుభాకాంక్షలు అంద చేసారుకదా; తోడుగా శాశ్వతంగా ఉన్నారుకదా! పాపం, ఎంతో దిగులు పడ్డావు. మరిచి పోయారేమో కమలనాధుని రాకను. ఒక రోజు ఎడబాటు బ్రహ్మ రాసుంచాడని !!

★★★

'ఇదేవిటిది.? ఆవిడ ఎప్పుడంది?... మరిచి పోయానేమో? నేనేవిటి చీకట్లో....?
మరుపు సహజం కదా! సంసార సాగరంలో జరిగే ఉండొచ్చు.! ఈ ఉత్తరం నేను రాసినదేనా? ఆవిడ అలా మాట్లాడిందా? ఏమో తొలి రోజుల్లో....?

★★★

మనిద్దరం ఆరోజు ఎలా కొట్లాడేమోకదా! ఎందుకు? నేనే నిన్ను ఎక్కువగా ప్రేమిస్తున్నానని నేను, నేనే నని నువ్వు! నా ప్రేమే గొప్పదని నువ్వు లేదు నాదేనని నేను ...అబ్బ నవ్వుస్తుంది! ఎంత సేపు వాదించుకున్నామో కదా? చివరకు చిలికి చిలికి గాలివానగా, తెగతెంపులు దాకా వెళ్ళాము. అలిసి పోయాము. జీవితం ఇక మరీ దుర్భరంగా, ఆ రోజుతోనే అంతమయ్యేటట్లుగా , విరక్తిపుట్టి ఇద్దరం కలిసి ఆత్మహత్య చేసుకుందామని ,దూకి చనిపోదామని,కొండ పైకి ఎక్కాము. నేను జారాను. నువ్వు పట్టుకున్నావు. నీకు ముళ్ళు గుచ్చుకున్నాయి. నా హృదయం తల్లడిల్లిపోయింది. అడుగు క్రింద పెట్టనివ్వక మోసుకు పోయాను. అలిసిపోయాము. ఆ శిఖరానుంచి చూస్తే కీకారణ్యం అగాధమైన లోయలు.. మతిపోయింది. అప్పుడు గుర్తుకొచ్చింది. అక్కడకేందుకు వచ్చామా అని అడిగాను. నా ప్రేమ గొప్పదా నీదా అని.!!

అహంకారమని పక్కున నవ్వావు. ప్రేమ లేక పోతే చావాలిగాని; ఎవరిది ఎక్కువ అని చావాలనుకోవడం ఏవిటి? ఇద్దరిలోను మెదిలిన ప్రశ్న !!

అవునుకదా! పిచ్చికదా! దానికి ఈ నిర్ణయం ఏవిటి? ఈగోసే.. అహంకారమే కదా భార్యా భర్తలను విడదీసేది, మనశ్శాంతి లేకుండా చేసి, సంసారాల్లో చిచ్చుపెట్టేది.!!

అప్పుడే ప్రమాణం చేసుకున్నాము కదా, అహంకారాలతో, అభిజాత్యాలతో, అనుమానాలతో ప్రేమను కొలవ కూడదు, అవమానించకూడదు ; సర్దుబాటుతో, మన్నింపుతో మలుచుకోవాలని. అదే పెండ్లికి అర్ధం అని!! ఇలాగే ఉంటాయి ఆలుమగల కొట్లాట లని, చాలా చాలా అర్ధం లేని అనవసరమైనవి. మనసారా నవ్వుకున్నాము అజ్ఞానానికి.

★★★

'ఇప్పుడు అలాగే ఏడుస్తూ చస్తున్నాము కదా! దేవతలు దీవించిన బంధం కాదు; ముక్కోటి దేవతల సాక్షిగా వేసిన మూడు ముళ్ళు కాదు. జీవితంలోకి ఆహ్వానించిన అగ్గి పుల్లలు పెట్రోలు. జీవితం అతి చిన్నదని తెలియక, సంతోషం విలువ మరిచిపోయి, సర్దుబాటు మన్నింపు అనే అమృత వాక్యాలను అవమానించుకుంటూ, పంతాలతో పగతో నిర్భంధంగా ఎవరికోసమో చేసే సంసారంలాగా కలిసి బ్రతుకుతున్నాం కదా! పాటాలు నేర్చుకుంటూ ఉంటాము; ఎన్నో నిదర్శనాలు చూస్తూ ఉంటాము కానీ మూర్ఖత్వం అహంకారం ఆలోచింపనివ్వవు. వాళ్ళ పరిస్థితులు వేరు మనవి వేరు అనే సమర్దనే ఇంగిత జనాన్ని వివేకాన్ని తగలపెడుతుంది. దానికి మన్నింపే లేదు.

మనం ఊహించిన కలలుగన్నసుందర జీవితం ఉండదు. నిజాలు వేరు, ప్రేమ వేరు, జీవితం మరీ వేరు. ఇవే నిరాశను కలిగించి ప్రేమకు పరిక్షలు పెడుతాయి . అవి ప్రేమ మత్తులో లెక్కలోకి రావు. కానీ ఆ తేడాను పెండ్లయిన వాళ్ళు అంగీకరించాలి. మరిచిపోవాలి, మన్నించుకోవాలి. లేకుంటే ఆత్మీయత అనుబధం సంసారపు మధురిమలు సర్వ నాశనమే! రోజు జుట్లు జుట్లు పట్టుకోవాల్సిందే! పిల్లలుంటే వాళ్ళ వ్యక్తిత్వాలు కూడా పూర్తిగా నాశనం అవుతాయి. ఆకతాయిలుగా మానసిక రోగులుగా కృరారాతి క్రూరులుగా తయారవుతారు.

ఇవి నేను చెప్పిన మాటలే! ఈ ఉత్తరం నేను రాసిందే! యింకా చాలా చెప్పాను. ఇలా ఉంటుంది జీవితం అని.చదవడం మొదలుపెట్టాను.

★★★

అందుకు మనం పెండ్లి చేసుకోవాల్సిన అవసరం లేదు. మన ప్రేమలో ఎలాంటి అపార్ధాలు వైషమ్యాలు, అభిజాత్యాలు జోరబడకూడదు. అంత ఆత్మవిశ్వాసం లేక పోతే మన బ్రతికినంతకాలం కల్మషం లేకుండా ఆరాధించుకుంటూనే ఉంటాము. ఇలాగే ఉందాం ప్రేమించుకుంటూ.!!

ఆ మాటకు " మరెందుకు కలుసుకుంటున్నాం. ఒకరికోసం ఒకరం ఇంత తపన ఎందుకు పడుతున్నాం. ఇన్ని సంవత్సరాల స్నేహనికి అర్ధం ఏవిటి?." అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుని నువ్వు బాధపడ్డావు. మన ప్రేమ వాటిని జయిస్తుంది అన్నావు. మీరు తోడుంటే అవి లెక్కలోకి రావన్నావు. మన కలయిక ఆనందానికి అంతిమ తీర్పు. మనకు అలాంటివి ఎదురు పడవని నన్ను తృప్తిపరిచి, ధైర్యమిచ్చి, మనమిద్దరం జన్మ జన్మలకు,యుగాంతం వరకు ఒక్కటే అని శపథం

చేసుకుని, మనస్ఫూర్తిగా నవ్వుకున్నాము. !! ఇప్పటికి గుర్తు; నవ్వి నవ్వి అలిసి నా ఒడిలో ఆదమరచి లోకాన్ని మరిచిపోయి, నమ్మకంతో నిదురపోయావో ! ఆ నమ్మకమే కదా ప్రేమకు నిదర్శనం!!

★★★

'నన్ను నేను గిల్లుకు చూసాను. ఇది నిజమా! అంత సంస్కారవంతంగా, ఆదర్శప్రాయంగా మాట్లాడుకున్నట్లు, ఎంత ఆలోచించినా గుర్తు రాలేదు. ఎప్పుడో లొంగి పోయాను. అయినా అసంతృప్తి తగ్గలేదు ! ఆమెకేమైనా మానసిక వ్యాధి ఉందా అని చాలా ఆలోచించాను. నా ప్రవర్తనలో లోపాలు వెతుక్కున్నాను. నా పరిధికి అందలేదు. పిల్లలు పుట్టారు, ఇరవై సంవత్సరాలు గడిచిపోయాయి. యింకా....? బహుశా ఆమె నన్ను ప్రేమించలేదేమో! మరి ఈ ప్రేమలేఖ ఏవిటి? బహుశా గతాన్ని తలుచుకుని ఆనందాన్ని వెతుక్కుంటూ ఉందా? ఇంత జాగర్తగా ఈ ప్రేమ లేఖను...?పాపం...!! ఆమె ప్రేమను తక్కువగా అంచనా వేసాను.' నాకు తెలియకనే కన్నీళ్లు ఉబికాయి.

ఆవిడ రాసినవి నేనెక్కడ ఉంచాను.? విరక్తితో, అబద్ధాలని చించి పారేసాను.! మరి ఆవిడో....?ఇప్పటి వరకు గుర్తుగా...,! నిజంగా ఆవిడకే ప్రేమ మీద నమ్మకం, బంధం మీద గౌరవం ఉంది. ప్రేమ మూర్తి. సహచరి.అర్ధాంగి.!! నేనెంత తప్పుగా అర్థం చేసుకున్నాను. క్షమాపణ కోరాలి. పెండ్లిగాక ముందు వేరేవరినైనా ..?ఛీ.. ఏవిటీ ఈ దరిద్రపు అనుమానం.!! గట్టిగా నిట్టూర్పు వదిలి చదవడం మొదలు పెట్టాను.

★★★

ఒక రోజు నా ఎదపై వాలి, ఆ సంధ్యా సమయంలో సూరీడు తన వన్నెలన్నికలిపి, సృష్టి కుంచెతో మనకోసం, ఆకాశాన్ని రంగు రంగుల చిత్రాలతో అలంకరించి, పడమటలో విరహంతో తపించిపోతున్న తన ప్రియురాళ్ళు కమల తరుణులు కోసం వెళుతూ, తూరుపు వైపు నవ్వుతూ చూసి, 'అదిగో మీ చెలికాడు, ప్రేమ వల్లభుడు కొటాను కోట్ల రమణులతో మీ దగ్గర ప్రేమ పాటాలు నేర్చుకోవాలని వస్తున్నాడు. చతురుడు తారను మరిపించి కోటి రాణులతో కులకాలని.!!' అని చిరునవ్వుతో పారిపోయాడు. నీకు కోపం వచ్చింది. పట్టుకున్న చేయి వదలకు, వేయి జన్మలైనా ఒకరు చాలని చంద్రునికి బుద్ధి చెప్పాలని అన్నావు నువ్వు. నిజం కదూ అన్నాను నేను. చుట్టుకున్నావు నన్ను.

కానీ మన జీవితాల్లోనే వేరొకరి చేయి పట్టుకుని నడవాల్సి వచ్చింది. కలలోకూడా ఊహించ లేదు. అది నిజం ; జరిగిపోయింది. దేవుడ్ని తిట్టలేదు. జీవితంలో ఇలాంటివి సహజమేమో! నమ్మాల్సి వచ్చింది. నమ్మినా నమ్మకపోయినా కాలం ఆగదుగా! లాక్కుపోయింది. నీ తలపు నాతోనే ప్రయాణం చేస్తూనే ఉంది. ఈ కట్టెలో ఊపిరి ఉన్నంత వరకు జీవితాన్ని నడిపిస్తున్నది, నీ ప్రేమ అందులోని మాధుర్యమే!ఆ తలపులు ఇప్పటికి మనసును మరులతోనింపుతూనే ఉన్నాయి.

★★★

ఈ మాట నేనెప్పుడు అనలేదే? అసలు ఆలోచనే కలగ లేదు. బంధం జీవితానికి ఒక్కటే అని ఇప్పటికి నమ్ముతున్నాను. అందుకే దూరంగావాలనే తలపే లేదు.మరి ఇదేవిటి?

★★★

చెప్పాలంటే చాలా సంవత్సరాలు నిన్ను మరిచిపోలేక నిజాన్ని నమ్మలేక నమ్మి భరించలేక ఎంత మానసిక క్షోభను అనుభవించానో? సంసార సాగరంలోపడి తెలుసుకోలేక పోయాను. ఆమె మరిపించింది అని చెప్పలేను. తోడు నిలిచింది. ఆలోచించి ఆలోచించి మనిద్దరం వేరు వేరు జీవితాలు ఎన్నుకోవడం,ఒక విధంగా చాలా మంచే జరిగిందని తృప్తి చెందాను. సాంఘికంగా సామాజికంగా తేడాలున్నాప్పుడు మన వ్యక్తిత్వంలో అభిరుచులులో, ఆశయాలలో ఎన్నో మార్పులు చేసుకోవాల్సివస్తుంది. కొన్ని గడ్డు సమయాల్లో మన త్యాగాలను సరిపోల్చుకోవడం జరుగుతుంది. అప్పుడు నీకు నువ్వు, నాకు నేను, ఒకరి త్యాగానికి మరొకరి త్యాగం ఏమాత్రం సరికాదు అనే భావన వస్తుంది. నిరాశతో జీవితం నరకమై, నిత్యకాష్టంగా తయారు అవుతుంది. అందుకని స్టిమితం తెచ్చుకున్నాను. సుఖంగానే జరిగిపోతుంది. బిడ్డలున్నప్పుడు తల్లిదండ్రులు తెగతెంపులు చేసుకోవడంగాని,ఆత్మహత్య ప్రయత్నంగాని చెయ్యకూడదు. అది తీర్పు కాదు. ముగింపూ కాదు. జీవితం మనం కోరుకున్నది ఇచ్చేది చాలా అరుదు. అలాగని ఓడిపోయినట్లు ఎప్పుడు ఆలోచించనే కూడదు. గెలుపు నీకు దక్కినదాన్ని మలుచుకోవడంలోనే ఉంది. సంతోషం నీ తృప్తిలో, విచక్షణలో ఉంటుంది. బిడ్డల ఆత్మీయ అనురాగాలను, భవిష్యత్తును అవమానాలతో నింపి, నిరాస నిస్పరుహలతో జీవింపచేయడం కాదు. అవి అంగడి వస్తువులుకాదు. అది క్షమించరాని నేరం. కానీ మన పరిచయాన్ని నీ జ్ఞాపకాలు ఒక్కోసారి మరీ తికమక పుట్టిస్తాయి. క్షమించు.

నీ జీవితం చక్కగానే ఉంటుందని మనస్పూర్తిగా నమ్ముతున్నాను. నీ వ్యక్తిత్వం నాకు తెలుసు. సర్దుకునే మనస్తత్వం నీకు జీవం; అదే నిన్ను అన్ని సంఘర్షణలను ఎదుర్కునే శక్తీ నిస్తుంది. అన్ని గొప్ప గుణాలలో ప్రేమలో స్వచ్చత సాధించాలనే పట్టుదలకంటే, యధార్థాన్ని భరించే మనస్తత్వమే, నీలో పిచ్చి పిచ్చిగా నచ్చిన గుణం. కానీ నిజం, ఇప్పటికి బాధాకరంగా నరకప్రాయంగా ఉంది. నువ్వు దూరంగావటం !!

★★★

నాకు తెలియకనే చెమటలు పోసిపోయాయి.ఊపిరిఆడటం లేదు.గొంతులో ఎదో అడ్డుపడి నట్లుంది. మింగుడు పడలేదు.

ఆ ఉత్తరాన్ని పైకి క్రిందకు రెండుమూడుసార్లు చూసాను. రోజాపువ్వులు ముద్రించి నిండుగా ఉన్నాయి. అప్పుడు తను రాసే లెటర్ ప్యాడే.!! మరి? మిగిలింది చదవడానికి.భయంవేసింది.అయినా..!

★★★

నీ భర్తతో చాలా సంతషంగా కాపురం చేస్తుంటావని...?

★★★

ఒక్కుదుటన లేచి కూర్చున్నాను. ప్రాణం పోయినంత పనయ్యింది..తల తిరిగిపోతుంది. గుండెల్లో మోయలేనంత భరువు, నిలిచిపోతుందేమో  అనుకున్నాను.ఇది నేను రాసింది కాదు.ఇరవై సంవత్సరాల ముందటి ప్రియిని ప్రేమ లేఖ. యింకా మరిచిపోలేనంత మధుర ప్రేమా ....?

ఇది మనసులో ఉంచుకుని జ్ఞాపకం చేసుకుని, నన్ను నా ప్రేమను అంత అసహ్యించుకుని, జీవితాన్ని అవమానిస్తున్నది. నరక ప్రాయం చేసుకుంటుంది. ఇప్పటికైనా ఆమెలో మార్పు...? అతను గుట్టుగా సంసారం చేసుకుంటున్నాడు. అతను ఇప్పుడు రాయడం  ఏవిటి? ఈమె చించి పారెయ్యక ఉంచడం ఏవిటి? అయినా పెండ్లికి ముందు మరొకరిని ప్రేమించడం తప్పా? ఇప్పుడు నేనేం  చెయ్యాలి.?

తల పగిలిపోతుంది. తన బ్రతుకే అసహ్యంగా అనిపిస్తుంది. ఇన్నాళ్ళు ఆమె నాతో చేసింది ఏవిటి? మనసులో ఒకర్ని ఉంచుకుని ప్రక్కలో మరొకడితో....! భర్తకు ఇంతకంటే మరొక శిక్ష అవసరమా? మగాడికి ఇంత కంటే అవమానం ఉంటుందా?నా మంచితనానికి, సహనానికి, ప్రేమకు, తిరుగులేని  శిక్ష వేసింది. అందుకే ఆవిడ నాతో సంసారం చెయ్యక,  కసిని తీర్చుకుంటుంది. ఈ అవమానాన్ని  ఏ మగాడయినా భరించగాలడా ! బ్రతికి ఉండగలడా ?

ఉన్నట్లుండి తలుపు తీసిన శబ్దం వినిపించింది. లైటు వెలిగింది. ఉల్లిక్కి పడ్డాను. చేతిలో ఆ ఉత్తరం...? చెమట విపరీతంగా పోయసాగింది. గుండెల్లో విపరేతమైన బాధ, నలిపి వేస్తుంది. మనసు మెలితిరిగి పోతుంది. నోరు పిడచ కట్టుకు పోయింది.

వెను తిరిగి ఆమె వైపు చూసాను. ఆమె నా చేతిలో ఉన్న కాగితాలనే చూస్తూ, పరుగులాగా దగ్గరకు వచ్చి, నన్ను వాటిని మార్చిమార్చి చూస్తూ, కోన ఊపిరి పోయేముందు, అన్ని బంధాలు రంధ్రాలు మూసుకుపోయి, ఏ క్షణంలోనయినా ప్రాణం పోయేట్లు,  భూమి పగిలి పోతున్నట్లు ఆకాశం కూలిపోతునట్లు, నోరు తెరుచుకుని, వణుకుతున్న శరీరాన్ని అదుపు చేసుకోలేక, చెమటతో ముద్ద ముద్దైన ముఖంలో నెత్తుటి చుక్కలేక, పీల్చుకుపోయి చచ్చిన శవంలా నిలుచుంది.

నా పరిస్థితి  అలాగే ఉంది. కాస్సేపు అలాగే ఉంటే పిల్లలు అనాధులై పోతారనిపించింది. భయంకరమైన ఆ క్షణం మరీ నిర్దాక్షణ్యంగా హృదయాన్ని కసిగా రంపపుకోత కోయసాగింది.

నిలబడలేను. ఎదుర్కోలేను. అన్ని శక్తుల్ని కూడగట్టుకుని విశ్వప్రయత్నం మీద లేచి,” ఆ పుస్తకాలలోనుంచి పడ్డాయి.” అంటూ కిచెన్లోకి నడిచాను. ఎక్కడో వినిపించాయి మాటలు.’చదివారా అని. ‘ఆ ‘ అంటూ లోపలి నడిచాను.

స్టౌముందు,నిలుచున్నాను.వెలిగించాలా,వద్దా,అని తలబద్దలు,కొట్టుకున్నాను. వెలిగించాను.

మండుతుంది. ఎంతసేపు అని ఆలోచించడం లేదు. హై ఫ్లేమా, లో ఫ్లేమా కాదు, కాలబోయేది ఇరవై సంవత్సరాల జీవితం. వంద సంవత్సరాలు దాని కాల పరిమితి. తగల పెట్టాల్సింది...! మూడుముళ్ల బంధం...!.అన్నెం పుణ్యం ఎరుగని ఆ చిన్నారుల భవిష్యత్తు.!!తెగ తెంపులు ...? మన్నించగలనా?

కాఫీ గిన్నెపెట్టి మాడువాసన వచ్చేవరకు మరిచిపోయాను. వెంటేనే తీద్దామని పట్టుకున్నాను. చేతులు కాలిపోయాయి. ఒక్క అరుపు అరిచి తిరిగి చూసాను. ఉలిక్కిపడింది గాని దగ్గరకు రాలేదు.

ఏ పోస్తాం ఆ గిన్నెలో? మగాడనే అహంకారామా! భర్త అనే బాధ్యతనా! మొగుడ నిపించుకోవాలా..నపుంసకుడని నిర్ధారించుకోవాలా?బంధానికి వ్యక్తిత్వపు సమాధి ? మార్పు..?

కాఫీ తీసుకొచ్చి ఆమె ముందు నిలుచున్నాను. వణికి పోతూనే ఉంది. చెమట కారిపోతూనే ఉంది . ఒకసారి కళ్ళెత్తి నన్ను చూసి తలదించుకుంది.

కాఫీ చేతికిస్తూ, " ఇలాంటి చిన్న పొరపాట్లు జీవితాన్ని సరిదిద్దుకునే మధుర స్మృతుల హెచ్చరికలు .. జాగ్రతగా దాచుకోవాలి. జీవితాన్ని మలుచుకోవాలి. నాకూ ఎవ్వరైనా, అంత గొప్ప ప్రేమికులు ఉంటే బాగుండును." రాని నవ్వు నవ్వుతూ అన్నాను.

అలాగే నా కాళ్ళ ముందు వాలిపోయింది.

## నిర్ణయం

శాంతిశ్రీ బెనర్జీ

ఉదయం ఏడుగంటలవ్వొస్తుంది. టేబుల్ మీదున్న సెల్ మ్రోగింది. మెలకువ వచ్చినా బద్ధకంగా పడుకున్న రాజ్యలక్ష్మి ఉలిక్కిపడింది. పక్కకి తిరిగి చూసింది. భర్త మనోహర్ గాఢ నిద్రలో ఉన్నాడు. అతనికి మెలకువ రాకుండా ఉండటానికి గబుక్కున మంచం దిగి, ఫోను తీసుకుని బయటికి వచ్చి, బెడ్ రూం తలుపు వేసి –

"హల్లో" అంది.

"అమ్మా! నేను" అంది కూతురు కావ్య.

న్యూయార్క్ లో ఉంటున్న కావ్య సాధారణంగా సాయంత్రం ఫోను చేస్తుంది. ఇప్పుడెందుకు చేసిందో రాజ్యలక్ష్మి కి అర్థం కాలేదు.

"ఏంటి కావ్యా ఇప్పుడు చేశావు? ఎవ్రిథింగ్ ఓకే?"

"అమ్మా! నాన్న నిద్దరపోతున్నారు కదా? ముఖ్యంగా నీతో మాట్లాడాలనే ఇప్పుడు చేశాను. నేను నా జీవితానికి సంబంధించిన ఒక నిర్ణయం తీసుకున్నాను. అది నీతో చెప్పాలనే చేశాను " కావ్య గొంతు సీరియస్ గా ఉంది.

"చెప్పమ్మా కావ్యా" అంది ఆదుర్దాగా రాజ్యలక్ష్మి .

"అమ్మా! నేను రిషితో విడిపోయి వేరుగా ఉండాలనుకుంటున్నాను. వేరే ఫ్లాటు కూడా చూసుకున్నాను. రేపు శనివారం కదా! నా సామాన్లు తీసుకుని వెళ్ళిపోతున్నాను" అంది గబగబా.

"ఏమయిందమ్మా? ఇంత హఠాత్తుగా ఇలాంటి నిర్ణయం తీసుకోడానికి కారణం?" అంది రాజ్యలక్ష్మి అయోమయంగా.

కావ్య న్యూయార్క్ లో ఒక ఇంటర్ నేషనల్ బ్యాంక్ లో పని చేస్తోంది. ఢిల్లీలో అదే బ్యాంక్ లో పని చేసేది. వాళ్ళే నాలుగేళ్ళ క్రితం న్యూయార్క్ ట్రాన్స్ఫర్ చేశారు. అక్కడే పంజాబ్ కి చెందిన యువకుడు రిషి గులాటీతో పరిచయం కలిగింది. అతను ఒక స్టార్ట్ అప్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వారి పరిచయం క్రమేణా ప్రేమగా మారింది. రెండేళ్ళ నుంచి ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. కావ్యకి ముప్పయేళ్ళు వచ్చాయి. వయస్సు పెరుగుతుంది పెళ్ళి చేసుకుని స్థిరపడమని తల్లి పదే పదే కోరటంతో సంవత్సరం లోపే పెళ్ళి చేసుకుంటామని మాట కూడా ఇచ్చింది.

"అమ్మా! నీతో చెప్పలేదు కాని రిషిది అదోరకమైన స్వభావం. ఆడవాళ్ళ పట్ల అతనికి విపరీతమైన ఆసక్తి! అతని ధోరణి ఒక్కోసారి భరించరానిదిగా ఉంటుంది. ఆడవాళ్ళతో బాహాటంగా ఫ్లర్ట్ చేస్తాడు. నా స్నేహితురాళ్ళతో అతను ప్రవర్తించే తీరు అతిగా అనిపిస్తుంది. అలా అని నా పట్ల ప్రేమగా ఉండడా అంటే అదేం లేదు. నన్నెంతో ప్రేమిస్తాడు. కానీ అతని ఈ బలహీనత వలన మా మధ్య విభేదాలొచ్చాయి. చాలాసార్లు అతనికి చెప్పి మార్చడానికి ప్రయత్నించాను. మొదట్లో సరిగ్గా ఉన్నా చివరికి మళ్ళా మామూలే! ఇక నాకు ఓర్పు నశించింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. నువ్వు నన్నర్థం చేసుకుంటా వనుకుంటాను" అంది గొంతు జీరబోగా.

ఆ తర్వాత కావ్య ఫోనులో ఏడుస్తున్నట్లు శబ్దం వచ్చింది. రాజ్యలక్ష్మి తట్టుకోలేకపోయింది.

"ఏడవకమ్మా కావ్యా! నీ సమస్యను నేనర్థం చేసుకోగలను. జీవితాంతం బాధపడేకంటే, ఈ సమస్యకి ఇప్పుడు పరిష్కారం వెదకడం ఒక విధంగా మంచిదని నువ్వనుకున్నావు. ధైర్యంగా నిర్ణయం తీసుకున్నావు. నీకేది మంచిదో నీకంటే బాగా ఎవరికి తెలుస్తుంది చెప్పు. బాధపడకు. నెమ్మదిగా పరిస్థితులు సర్దుకుంటాయి. నువ్వు వేరుగా వెళ్ళిన తర్వాత రిషిలో మార్పు వస్తుందేమో గమనించు. వీలయినంత త్వరలో ఒకసారి ఇండియా రావడానికి ప్రయత్నించు. నీకు మార్పు అవసరం. ఈ విషయం నాన్నకిపుడు చెప్పడం నాకిష్టంలేదు. ఆయన ఆరోగ్యం అలాగే ఉంది. మనిద్దరి మధ్యే ఉంచుకుందాం! " అంది.

"అలాగేనమ్మా! నీకు చెప్పింతర్వాత నా మనస్సెంతో తేలికయింది. నీ మాటలు నా ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. తొందరలోనే ఇండియా రావడానికి ప్రయత్నిస్తాను. మళ్ళీ సాయంత్రం ఫోను చేస్తాను. బై!" అని ఫోను పెట్టేసింది.

కావ్య ఫోను చేసిందగ్గర నుంచి రాజ్యలక్ష్మి ఆలోచనలతో సతమతమయింది. కావ్య మాటలు పదే పదే గుర్తుకు వచ్చి ఆమె మనస్సు వికలమయింది.

"ఓరి భగవంతుడా! నా జీవితంలో నేనెదుర్కొన్న సమస్య చివరికి నా కూతురు కూడా ఎదుర్కొందా? దానికి పరిష్కారంగా కావ్య తీసుకున్న నిర్ణయం సరైనదేనా? తనెందుకు ఆ ధైర్యం చెయ్యలేకపోయింది?" అని పరిపరి విధాలుగా ఆలోచించింది. ఆమెకి ఒక్కసారి గతమంతా గిర్రున తిరిగింది.

★ ★ ★

రాజ్యలక్ష్మి మెరిసే చామనఛాయతో, చక్కటి పర్సనాలిటీతో, ఠీవీగా, అందంగా ఉంటుంది. ఆమె హైదరాబాదు యూనివర్సిటీలో ఎమ్.ఏ. సోషియాలజీ చేసి, తర్వాత ఎమ్.ఫిల్. కూడా చేసి పిహెచ్.డి.లో జాయిన్ అయ్యింది. అదే యూనివర్సిటీలో ఎకనామిక్స్ లో పిహెచ్.డి. చేస్తున్న మనోహర్ తో పరిచయం అయింది. అతను మంచి రంగుతో చూడటానికి బాగానే ఉంటాడు. మనిషి సరదాగా జోక్స్ వేస్తూ ఉంటాడు. అందరూ అతనిపట్ల ఆకర్షితులవుతూ ఉంటారు. లైబ్రరీలో తరచు కలుసుకోవడం వలన వారి పరిచయం స్నేహంగా మారింది. ఆ స్నేహమే తర్వాత ప్రేమలోకి దారి తీసింది. ఇద్దరూ పిహెచ్.డి. పూర్తి చేసి తల్లిదండ్రులకు చెప్పి వాళ్ళ అంగీకారంతో పెళ్ళి చేసుకుందామన్న నిర్ణయానికొచ్చారు. యూనివర్సిటీ హాస్టల్స్ లో ఉంటున్న ఇద్దరూ తరచుగా కలుసుకుంటున్నారు.

ఆ సమయంలోనే అతి దగ్గరగా చూస్తున్న మనోహర్ స్వభావం ఆమెను అయోమయంలో పడవేసింది. అతని ప్రవర్తనకి సంబంధించిన రెండు సంఘటనలు ఆమెకెంతో మనస్తాపాన్ని కలిగించాయి. మొదటి సంఘటనలో సంధ్య అనే అమ్మాయి వాళ్ళ జీవితాల్లోకి ప్రవేశించడం జరిగింది. ఆమె ఎకనామిక్స్ లో ఎమ్.ఫిల్. చేస్తోంది. చూడటానికి అందంగా ఉంటుంది. ఆమె కూడా రాజ్యలక్ష్మి ఉండే హాస్టల్లోనే ఉంటుంది. ఇద్దరికీ కొద్దో గొప్పో పరిచయం ఉంది.

ఒకరోజు రాజ్యలక్ష్మి , మనోహర్ లు యూనివర్సిటీ కాంటీన్ లో కూర్చుని కాఫీ తాగుతున్నారు. ఆ సమయంలో సంధ్య తన స్నేహితురాలితో వచ్చి, దోవలో రాజ్యలక్ష్మి ని పలకరించి ఇంకో టేబుల్ దగ్గిరకి వెళ్ళి కూర్చుంది. మనోహర్ ఇది గమనించి, "రాజీ! నేను ఎకనామిక్స్ లో ఒక ప్రాజెక్టు చేస్తున్నాను. దానికి నాకు కొంత డబ్బు కూడా గ్రాంటయింది. నా పిహెచ్.డి. వలన నేనా ప్రాజెక్టు సరిగ్గా చెయ్యలేకపోతున్నాను. నాకెవరయినా సహాయం చేసే వాళ్ళుంటే బాగుండుననుకుంటున్నాను. నేను నెలకింతని పేమెంట్ కూడా చెయ్యగలను. నువ్వు సంధ్యనడుగు. ఆమె ఎకనామిక్స్ లో ఎమ్.ఫిల్. చేస్తుంది కాబట్టి, ఈ ప్రాజెక్టు మీద పని చెయ్యడం అంత కష్టం కాదు" అన్నాడు ఎంతో సీరియస్ గా.

రాజ్యలక్ష్మి కి సంధ్య ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న విషయం తెలుసు. ఈ విధంగానైనా ఆమెకి సహాయం చేసినట్లవుతుందని, వెంటనే సంధ్యని పిలిచి మనోహర్ కి పరిచయం చేసింది.  ఆమెకి విషయం చెప్పింది. తర్వాత మనోహర్ కూడా ప్రాజెక్టు వివరాలు చెప్పాడు. సంధ్య సంతోషంగా ఒప్పుకుంది. మరుసటి రోజు డిపార్ట్ మెంట్ లో కలవమని సంధ్యకి చెప్పాడు మనోహర్. సంధ్య సరేనంది. ఆ తర్వాత సంధ్య ప్రాజెక్టులో చేరినట్లు తెలిసింది.

నెలరోజులు గడిచిపోయాయి. ఈ మధ్య మనోహర్ సంధ్యని గురించి ఎక్కువగా మాట్లాడడం మొదలెట్టాడు. ఆమె కుటుంబంలో సమస్యలున్నట్లు, తల్లిదండ్రుల మధ్య సఖ్యత లేనట్లు కూడా చెప్పాడు. రాజ్యలక్ష్మి కి ఆశ్చర్యం వేసింది. ఇంత తక్కువ వ్యవధిలో సంధ్య తన కుటుంబ విషయాలన్నీ మనోహర్ కి చెప్పడం, మనోహర్ ఆమెకి సలహాలివ్వడం, ప్రాజెక్టు డబ్బుతో ఆమె తన ఊరు వెళ్ళి తల్లిని చూసి రావడం జరిగాయి. అంతే కాకుండా మనోహర్ డిన్నర్ తర్వాత లేడీస్ హాస్టల్ కొచ్చి సంధ్యను పిలవడం, వాళ్ళిద్దరూ బయట బెంచీమీద కూర్చుని గంటల తరబడి మాట్లాడుకోవడం కూడా గమనించింది. ఆదివారాల్లో ఎకనామిక్స్ కి సంబంధించిన లెక్చర్స్ కి ఇద్దరూ కలిసి వెళ్ళడం లాంటివి కూడా జరుగుతున్నాయని తెలుసుకుంది. రాజ్యలక్ష్మి డైలమాలో పడింది. మనోహర్ ని అడుగుదామా వద్దా అని చాలా రోజులు ఊగిసలాడింది. చివరికి ఒకరోజు ఇదంతా ఏమిటని అడిగితే మనోహర్ –

"అదేంటి రాజీ! అలా అనుమాన పడుతున్నావు? ప్రాజెక్టు మూలంగా కలసి మాట్లాడుకోవడం, కలసి పని చెయ్యడం తప్పదు కదా? అంతేకాక సంధ్య ఎకనామిక్స్ లో కొన్ని రిసెర్చి పేపర్లు రాస్తున్నది. వాటి విషయంలో కూడా నేనామెకు సహాయం చేస్తున్నాను. వాటి గురించి చర్చించుకోవడం చేస్తున్నాం. అంతకు మించి మా మధ్య ఎటువంటి సంబంధం లేదు. నా భార్యగా నిన్నుతప్ప నేనెవ్వరినీ ఊహించలేను. నా మనస్సులో నీకొక్కదానికే స్థానం" అని ఎంతో నమ్మకంగా చెప్పాడు.  రాజ్యలక్ష్మి కింకేమనాలో తెలియలేదు.

కొన్ని వారాల తర్వాత ఒకరోజు ఎకనామిక్స్ లో పిహెచ్.డి. చేస్తున్న సునయన రాజ్యలక్ష్మి ని కలవడానికి హాస్టల్ కి వచ్చింది. ఆమె రాజ్యలక్ష్మి కి మంచి స్నేహితురాలు. కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్న తర్వాత సునయన – "నిన్నొక విషయం అడగాలని వచ్చాను. ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోవుగా?" అంది.

"అరే! అదేంటి అలా అంటున్నావు? నా దగ్గర నీకామాత్రం చనువు లేదా?" అంది రాజ్యలక్ష్మి .

"రాజీ! నువ్వు, మనోహర్ థీసిస్ లు సబ్మిట్ చేసిం తర్వాత పెళ్ళి చేసుకుందామని అనుకుంటున్నారు కదా? మరి ఇదేమిటి డిపార్ట్ మెంట్ లో ఇలా జరుగుతున్నది? మనోహర్, సంధ్య చాలా దగ్గరైనట్లు ప్రవర్తిస్తున్నారేమిటి? అందరూ వాళ్ళని గురించి మాట్లాడుకోవడమే? డిపార్ట్ మెంట్ అంతా ఒకటే గుసగుసలు. అసలు వీళ్ళద్దరి మధ్య జరుగుతున్నదేంటో నీకు తెలుసా?" అంది.

రాజ్యలక్ష్మి విస్తుబోయింది. ఆమెకేం మాట్లాడాలో తెలియలేదు. కొంచెం సేపు మౌనంగా ఉంది. తర్వాత ముఖం క్రిందకు దించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. సునయన ప్రేమగా ఆమె చేతిని పట్టుకుని –

"మనోహర్ కి బుద్ధిలేకపోతే ఆ సంధ్యకైనా ఉండొచ్చు కదా? నేనీ విషయం సంధ్యతో మాట్లాడుతాను నువ్వు బాధపడకు. అసలు సంగతి కనుక్కుంటాను" అంది.

రాజ్యలక్ష్మి బేలగా తలూపింది.

ఆ తర్వాత సునయన సంధ్యతో మాట్లాడింది. రాజ్యలక్ష్మి , మనోహర్ ల గురించి ఆమెకు చెప్పింది. సంధ్య ఎంతో బాధగా – "మనోహర్ ఆ విషయం నాకు చెప్పలేదు. అలా అని తెలిస్తే పరిస్థితులను ఇంతవరకూ రానిచ్చేదాన్ని కాదు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. నేను వాళ్ళిద్దరి మధ్య నుంచి తప్పుకుంటాను" అందిట!

ఆ తర్వాత రెండు నెలల తర్వాత సంధ్య ప్రాజెక్టు వర్క్ చెయ్యడం విరమించుకుంది. మనోహర్ ని కలవడం మానుకుంది. కానీ ఈ సంఘటన రాజ్యలక్ష్మి మీద చెరగని ముద్ర వేసింది. అతనిపట్ల నమ్మకం సన్నగిల్లింది.

రెండేళ్ళకి ఆర్నెల్ల తేడాతో ఇద్దరూ థీసిస్ లు సబ్మిట్ చేశారు. తల్లిదండ్రులతో పెళ్ళి చేసుకుంటామని చెప్పారు. కులాంతర వివాహం వలన ఇరువైపులా తల్లిదండ్రులు అంత తొందరగా అంగీకరించలేదు. వాళ్ళని ఒప్పించి, అంగీకరించేలా చెయ్యడంలో ఇంకో సంవత్సరం గడిచిపోయింది. చివరికి రిజిస్టర్ మారేజ్ చేసుకుని, చిన్నపార్టీ ఇచ్చారు. మనోహర్ కి యూనివర్సిటీలోనే ఎకనామిక్స్ డిపార్ట్ మెంట్ లో లెక్చరర్ గా ఉద్యోగం వచ్చింది. రాజ్యలక్ష్మి కి కూడా సిటీలో వున్న మహిళా కాలేజ్ లో సోషియాలజీ లెక్చరర్ గా జాబ్ వచ్చింది. యూనివర్సిటీకి దగ్గరలోనే చిన్న ఫ్లాటు అద్దెకు తీసుకుని స్థిరపడ్డారు. ఇరువురు తమ తమ దైనందిన జీవితాల్లో బిజీగా ఉండసాగారు.

అప్పుడే రాజ్యలక్ష్మి ని కలతపెట్టే మరొక సంఘటన జరిగింది. ఆమె కొలీగ్ వసంతకి బ్యాంకులో పనిచేసే శ్రీకాంత్ తో వివాహం అయింది. లేడీస్ హాస్టల్లో ఉంటున్న ఆమె రాజ్యలక్ష్మి ని వాళ్ళకొక ఫ్లాటు అద్దెకి చూడమని కోరింది. రాజ్యలక్ష్మి

ఎంతో శ్రమపడి తమ ఫ్లాటుకి దగ్గరలోనే ఇల్లు చూపించింది. వసంత, ఆమె భర్త వచ్చి చేరారు. రెండు కుటుంబాలు దగ్గరయి కలుపుగోలుగా ఉంటున్నారు.

ఆ సమయంలోనే రాజ్యలక్ష్మి కి అమెరికాలోని ఒక యూనివర్సిటీలో ఆరు నెలల టీచింగ్ అసైన్మెంట్ వచ్చింది. మనోహర్ ఎంతో ప్రోత్సహించి ఆమె ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేశాడు. ఆరునెలలు అమెరికాలో ఆనందంగా గడిపి రాజ్యలక్ష్మి  ఇండియా వచ్చింది.

వచ్చిందగ్గిరి నుంచి ఆమెకి వసంత, మనోహర్ లు వ్యవహరించే తీరు నచ్చలేదు. శ్రీకాంత్ పనిచేసే బ్యాంకు సిటీకి చాలా దూరం. పైపెచ్చు అతను బ్యాంకు మానేజర్ అవడం వలన బాధ్యతలెక్కువ. ఇంటికి రోజూ ఆలస్యంగా వచ్చేవాడు. వసంత చాలా వరకు వంటరిగా ఉండేది. మనోహర్ ఆమెకి సహాయం చేసే వంకతో తరచుకలవడం, ఆమెపట్ల ఎంతో ఆసక్తి చూపడం, ఆమె వంటని అతిగా మెచ్చుకోవడం చేసేవాడు. రాజ్యలక్ష్మి  కూడా లేకపోవడం అతనికి అడ్డు, అదుపు లేకుండా పోయింది. వసంత మనోహర్ చూపించే ఆప్యాయతకి, అటెన్షన్ కి లొంగిపోయి అతనికి బాగా దగ్గరయింది.

రాజ్యలక్ష్మి కి ఇదంతా భరించరానిదిగా అనిపించేది. ఇక ఆపుకోలేక ఒకరోజు "వసంతతో అంత చనువుగా ఉండడం అవసరమా?" అని మనోహర్ ని అడిగింది.

"అబ్బే! నీ ఫ్రెండ్, కొలీగ్ కదా అందుకే స్నేహంగా ఉంటున్నాను. అంతకుమించి మా మధ్య ఏమీలేదు" అని జవాబిచ్చాడు.

వారిద్దరూ మారతారేమోనని కొన్ని రోజులు ఓపికపట్టింది. చివరికి లాభంలేక వసంతని నిలదీసింది. అది ఊహించని వసంత కంగారుపడి – "మా మధ్య అలాంటిదేం లేదు రాజీ! మనోహర్ నాకన్నయ్యలాంటివాడు" అంది గబగబా.

రాజ్యలక్ష్మి  ఇంకేం చెప్పలేక మౌనం వహించింది.

ఇది జరిగిన నెలరోజులకి రాఖీ పండుగ వచ్చింది. ఆరోజు ఆదివారం సాయంత్రం వసంత, శ్రీకాంత్ స్వీట్స్ తీసుకుని వచ్చారు. వసంత మనోహర్ కి రాఖీ కట్టింది. మనోహర్ ముఖం అయిష్టంగా పెట్టాడు. అతనూహించని పరిణామం ఇది. ఆ తర్వాత రాజ్యలక్ష్మి  వసంతతో స్నేహన్ని తగ్గించుకుంది. మనోహర్, వసంతలకి క్రమేణా ఒకరిమీదొకరికున్న ఆసక్తి తగ్గిపోయింది.

ఈ రెండు సంఘటనలతో రాజ్యలక్ష్మి మనస్సు ఛిన్నాభిన్నమైంది. ఇవే కాకుండా ఇంకా కొన్ని చిన్న చిన్న సంఘటనలు రాజ్యలక్ష్మి కి వాస్తవాన్ని తెలియజేశాయి. మనోహర్ కి ఆడవాళ్ళపట్ల ఉన్న బలహీనత స్పష్టం అయింది. ఇక అప్పటి నుంచి చాలా జాగ్రత్తగా ఉండసాగింది. తన స్నేహితురాండ్రని, కొలీగ్స్ ని ఇంటికి ఆహ్వానించడం మానేసింది. వీలయినంతవరకూ వంటరి జీవితాన్ని గడపసాగింది. జీవితంలో వచ్చిన ఈ మార్పుకి ఆమె ఎంతో కృంగిపోయింది. కానీ తనపట్ల ప్రేమగా ఉండే మనోహర్ ని వదిలేసి వేరుగా వెళ్ళలేకపోయింది. ఎందుకంటే ఆమె మనోహర్ ని ఎంతో గాఢంగా ప్రేమించింది.

ఆ తర్వాత కావ్య పుట్టింది. కావ్యని పెంచి పెద్ద చెయ్యడంలో మనోహర్ ఎంతో సహాయపడేవాడు రాజ్యలక్ష్మి కి. కావ్యని కంటికి రెప్పలా చూసుకునేవాడు.

“అతనిలో ఆ ఒక్క బలహీనత లేకపోతే తన జీవితం నందనవనం అయ్యేది కదా!” అనుకునేది రాజ్యలక్ష్మి .

★ ★ ★

కాలచక్రం గిర్రున తిరిగింది. కావ్య పెద్దదయి ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళింది. మనోహర్, రాజ్యలక్ష్మి ఐదునెల్ల తేడాతో రిటైరయ్యారు. ఒక సంవత్సరం క్రితం మనోహర్ లో బ్లెడ్ కాన్సర్ డిటెక్టయింది. అప్పటి నుంచి అతనికి ట్రీట్ మెంట్ జరుగుతున్నది. అతనికి సేవ చేస్తూ జాగ్రత్తగా చూసుకుంటున్నది రాజ్యలక్ష్మి . మనోహర్ అన్నింటికీ ఆమె మీద ఆధారపడి ఉంటున్నాడు. కావ్య తండ్రిని చూడటానికి తరుచూ ఇండియా వస్తున్నది.

ఆ రాత్రి మనోహర్ పడుకున్న తర్వాత రాజ్యలక్ష్మి సోఫాలో కూర్చుని ఆలోచనల్లో పడింది. తన జీవితం, కావ్య జీవితం పోల్చుకుని చూసుకుంది. మనోహర్ బలహీనతని భరిస్తూ, అతన్ని దూరం చేసుకోలేక, జీవితాంతం బాధపడుతూ బ్రతకాలనుకున్న తన నిర్ణయం సరైనదా? బాయ్ ఫ్రెండ్ బలహీనతని ఏమాత్రం సహించక, దానితో రాజీపడక, జీవితాంతం బాధపడేకంటే మొదట్లోనే విడిపోవడం మేలనుకున్న కావ్య నిర్ణయం సరైనదా? అని తనకు తానే ప్రశ్న వేసుకుంది. ఎటూ తేల్చుకోలేకపోయింది.

# ధీమా !

వేణు నక్షత్రం

"ప్రశాంత్, ఈ రోజు 'ట్యాక్స్ ఫ్రీ బ్యాక్ టు స్కూల్' సేల్స్ లాస్ట్ డే. గీత, కిరణ్ వాళ్ళు కూడా వస్తున్నారు. నీవొస్తావా?" అంది ప్రశ్నార్థకంగా అప్పుడే డ్రైయ్యర్ లోంచి తీసిన బట్టలు మడతేస్తూ అనురాధ.

"ఆ .. నాకు మధ్యాహ్నం ఒక అసైన్మెంట్ ఉంది. మీరు వెళ్లి రండి. ఈ మధ్య చాలా రోజులయ్యింది కిరణ్ ని కలవక. షాపింగ్ తర్వాత ఇంటికి రమ్మను. అప్పటికి నా పని కూడా అయిపోతుంది" అన్నాడు ఆఫీసు కంప్యూటర్ లో ఈమెయిల్ డ్రాఫ్ట్ చేస్తూ ప్రశాంత్ .

"సౌండ్స్ లైక్ ఎ ప్లాన్ " అనుకుంటూ బట్టల బాస్కెట్ బెడ్రూమ్ కి తీసుకెళ్లింది. గీత కి ఫోన్ చేసి "ఆఫీస్ డిపోలో కలుద్దాం" అని చెప్పి రెడీ అయి పిల్లల్ని తీసుకుని షాపింగ్ కి వెళ్లింది.

అనురాధ, ప్రశాంత్ ఇద్దరూ సాఫ్ట్వేర్ ఉద్యోగులే. పదేళ్లకు పైగా అమెరికాలో నివాసం. ఇద్దరు పిల్లలు. అమ్మాయి వైష్ణవికి ఎనిమిదేళ్లు, బాబు మోక్షిత్ కి ఆరేళ్ళు. ఇద్దరు పిల్లలతో, ప్రాజెక్ట్ డెడ్లైన్ల తో జీవితం బిజీ గా మారడంతో, బాబు పుట్టిన తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసింది అనురాధ. ఆన్లైన్ సాఫ్ట్వేర్ ట్రైనింగ్ ప్రారంభించి పిల్లల ఆలనా పాలనా చూసుకుంటుంది.

కొంత ఆదాయం తగ్గింది కానీ, ఇప్పుడు ప్రాజెక్టు డెడ్ లైన్లు, బాసుతో టెన్షన్లు లేవు. కిడ్స్ కేర్ లో డ్రాప్ అండ్ పికప్, టైం అయిపోతుంది అనే కంగారు అసలే లేదు. వారం రోజుల వంట అంతా ఒకే రోజు వీకెండ్ లో చేసి పెట్టే పద్ధతికి స్వస్తి చెప్పి, ప్రతి రోజూ పిల్లలు అడిగిన వంటలు చేస్తూ వాళ్లకు భారతీయ రుచులు చూపిస్తుంది. డాన్స్ ప్రాక్టీస్, స్పోర్ట్స్ కోసం, ప్రైవేట్ క్లాసెస్ కు తీసుకు వెళ్తూ ఆదరా బాదరాగా దారిలో ఏ పిజ్జానో, బర్గరో కొనిచ్చి డిన్నర్ అయ్యింది అనిపించే హడావిడి జీవితాన్ని మరచి పోయి చాలా రోజులయ్యింది. తీరిక వేళల్లో తన హాబీలయిన పెయింటింగ్, డిజైనర్ జువెల్లరీ, చేస్తూ తనకిష్టమయిన పుస్తక పఠనం కూడా చేస్తుంది.

పిల్లలని ఆడిస్తూ, పాడిస్తూ, హోమ్ వర్కులో, ఇతర ఆక్టివిటీస్ లో సహాయపడుతుంటే వారితో గడుపుతున్న ప్రతి నిమిషం తన చిన్న తనంలో తల్లితండ్రులతో, అమ్మమ్మ,

నానమ్మలతో చిన్నప్పుడు గడిపిన రోజులని గుర్తుకుచేసుకుంటుంది అనురాధ. ప్రశాంత్ కొంత ఫ్రీ సమయం దొరికినా కిచెన్లో గాని, లాండ్రీ కి గానీ హెల్ప్ చేస్తాడు. స్టోరీ టైం అని అందరూ కూర్చుని కథలు చెప్పుకుంటారు.

ప్రశాంత్, అనురాధ వాళ్ళ పక్క నైబర్ హుడ్ లోనే నివాసముంటున్న గీత, కిరణ్ లకి ముగ్గురు పిల్లలు. ఎనిమిదేళ్ల అమ్మాయి మానసి, ఐదు సంవత్సరాల ప్రణతి, రెండేళ్ల అక్షయ్. బాబు కోసమే మూడవ బిడ్డని కన్నారని చెప్పింది గీత. ఈ రోజుల్లో కూడా పాప, బాబు అనే పట్టుదల ఏంటో అనుకున్నారు విషయం తెలిసి అనురాధ, ప్రశాంత్.

వైష్ణవి, మానసి ఒకే స్కూల్ కి వెళతారు. స్కూల్ బస్ దగ్గర, స్కూల్ లో 'బ్యాక్ టు స్కూల్ ' కార్యక్రమాల్లో అనురాధ, గీత తరుచుగా కలవడం వల్ల రెండు ఫ్యామిలీల మధ్య స్నేహం పెరగడానికి ఎక్కువ సమయం పట్టలేదు. గీత బి. ఏ వరకు చదువుకుంది. పెళ్లి కాక ముందు స్కూల్లో టీచర్ గా పనిచేసిన అనుభవం, అమెరికాకు వచ్చిన తర్వాత పిల్లలను చూసుకుంటూ, ఇంటి పనులకే పరిమితం అయ్యింది. కిరణ్ సాఫ్ట్వేర్ లో ట్రావెల్ జాబ్ చేస్తాడు. సోమవారం నుండి గురువారం వరకు బయటే, వారంలో మూడు రోజులు మాత్రమే ఇంట్లో ఉంటాడు. చాలా సార్లు వీకెండ్స్ లో రెండు కుంటుంబాలు ఎవరో ఒకరి ఇంట్లో కలుస్తూనే ఉంటారు. షాపింగ్ కి, వీకెండ్ పార్టీలనీ, ఫార్మ్ హౌస్ లకి ఎక్కడికయినా అందరూ కల్సే వెళ్తుంటారు.

★★★

ముందుగా అనుకున్నట్టుగా ఆఫీసు డిపో లో కలుసుకున్నారు అందరూ. పిల్లలు వారి స్కూల్ కి సంబంధించిన స్టేషనరీ కొనుక్కుని రెండు గంటల తర్వాత అందరూ కల్సి అనురాధ ఇంటికి వచ్చారు. ఈ మధ్యనే కొన్న కొత్త ఫెరారీ కారులో పిల్లలు రైడ్ కావాలంటే, అందర్నీ ఒక రౌండ్ తిప్పుకొని వచ్చాడు కిరణ్.

మ్యారినేట్ చేసి రెడీగా ఉన్న చికెన్ ని ఓవెన్ లో పెట్టి సిద్ధం చేసాడు ప్రశాంత్. కొద్దిసేపు ఆఫీసు పని వివరాలు మాట్లాడుకున్నారు.

అనురాధ, గీత కిచెన్ లోకి వెళ్లి తినడానికి ఏదో సిద్ధం చేస్తున్నారు. పిల్లలందరూ వారి వారి గేమ్స్ లో బిజీ అయిపోయారు.

"కిరణ్! వైనా.. స్కాచా?" రెండు చేతుల్లో రెండు బాటిల్స్ పట్టుకొని అడిగాడు ప్రశాంత్.

కొద్ది రోజుల క్రితమే కొన్న ఐ–ఫోన్12 లో దూర్చిన తలను పైకి తీసి, చదువు తున్న వాట్సాప్ మెసేజ్ ను పక్కకు పెట్టి కొద్ది సేపు ఆలోచించి "ఆ ..స్కాచ్ ఇస్ ఫైన్" అన్నాడు .

"ఓకే " అని స్కాచ్ బాటిల్ ఓపెన్ చేసి రెండు గ్లాసుల్లో సర్వ్ చేసాడు ప్రశాంత్. ఇద్దరూ చీర్స్ చెప్పుకుని చెరొక్క సిప్పు తీసుకున్నారు.

ప్రశాంత్ కి తీరిక దొరికినప్పుడల్లా పుస్తకాలు చదవడం, పిల్లలతో గడపడం, సినిమాలు చూడడం ఇష్టం. ఎప్పుడూ సరదాగా ఏదో మాట్లాడుతూనే ఉంటాడు. కిరణ్ కి మార్కెట్ లో వస్తున్న కొత్త టెక్నాలజీ, కంప్యూటర్ రంగంలో వాటి ఉపయోగం, షేర్ మార్కెట్ లో డబ్బులు పెట్టడం లాంటి హాబీలు.

కిరణ్ చేతిలో ఎప్పుడూ మొబైల్ ఫోన్ ఉండాల్సిందే, అదీ మార్కెట్ లో ఉన్న లేటెస్ట్ ఫోన్. వాట్సాప్ మెసేజెస్ చూస్తూనే ఉంటాడు ఎప్పుడూ. కిరణ్ తను చేసే ఉద్యోగానికి తోడుగా ఇంకొక పార్ట్ టైం ఉద్యోగం కూడా చేస్తున్నాడు. ఎప్పుడూ ఏదో ఒక ఆఫీసుకి సంబంధించిన ఫోన్ మెసేజ్ కానీ, ఫోన్ కాల్ కానీ వస్తూనే ఉంటాయి. చాలా తక్కువగా మాట్లాడతాడు, ఎప్పుడూ ఆఫీసు పని గురించే ఆలోచిస్తూ మాటలు తక్కువ చేసాడేమో అనిపిస్తుంది కిరణ్ ని చూస్తే. తనకు ఇష్టమయిన టాపిక్ ఏదన్నా దొరికితే మాత్రం ఏ మాత్రం ఆలోచించకుండా మాట్లాడుతూనే ఉంటాడు.

కొద్దిసేపు ఇండియా పాలిటిక్స్, సినిమాల గురించి మాట్లాడాడు ప్రశాంత్. కానీ కిరణ్ దృష్టి అంతా ఫోన్ పైనే. ఆఫీసులో ఏదో డిప్లొయిమెంట్ నడుస్తుంది అన్నాడు. ఈ మధ్య ఆఫీసు పని వత్తిడి ఎక్కువ అవుతుందని మాటల్లో చెప్పాడు, కానీ రెండో జాబు చేస్తున్న విషయం ఎప్పుడూ చెప్పలేదు ప్రశాంత్ తో. లేడీస్ మాటల్లో బయటపడిన ఆ రెండో ఉద్యోగం విషయం అనురాధ ద్వారా తెలిసింది ప్రశాంత్ కి.

మెల్లిగా ఇంకొక సిప్పు తీసుకుంటూ, చుట్టూ ఇంటిని పరిశీలిస్తూ "ప్రశాంత్ .. ఇంకా ఎన్ని రోజులు ఈ టౌన్ హోమ్ లోనే ఉంటావు? నువ్వు కూడా మా కమ్యూనిటీలో ఇల్లు బుక్ చేయరాదు, మొన్ననే ఫైవ్ న్యూ హోమ్స్ కి అప్రూవల్ వచ్చింది" అన్నాడు కిరణ్.

"ఇళ్లా..? మాకా ..? " 'నేనా ..కాలేజా ?' అన్నసంతూర్ యాడ్ లా కొంత ఆశ్చర్యానికి గురయ్యాడు అనుకోని ప్రపోజల్ కిరణ్ నుండి వచ్చే సరికి.

"ఆ.. మీకే.. లేకుంటే లైఫ్ అంతా ఇక్కడే ఉంటావా?" అన్నాడు కొంత టీజ్ చేస్తున్నట్టు.

"ఆ .. చూద్దాం! ఇప్పుడేం తొందర. ఇప్పటికయితే పెద్దగా ఇబ్బంది లేదు. అందరికి తలా ఒక బెడ్ రూమ్ అయితే ఉంది, స్కూల్స్ అన్నీ హై స్టాండర్డ్స్, షాప్స్ కూడా అన్నీ దగ్గరే కదా!" అన్నాడు ప్రశాంత్ . కొద్దిసేపు తల పైకి పెట్టి ఆలోచించినట్టు చేసి "ఎంతుంది బేస్ ప్రైస్ " అన్నాడు మళ్ళీ.

"1.2 మిలియన్స్ అంటున్నారు, నెగోషియేట్ చెయ్యొచ్చు, కొంత తగ్గుతారు" అన్నాడు ప్రోత్సహించినట్టు కిరణ్.

మనసులో కొన్ని లెక్కలు చేసుకొని, కొంత సేపు ఆలోచించుకొని, కొనాలనే ఉత్సాహాన్ని బయటకి కనపడకుండా మనసులోనే దాచుకొని "ఇప్పుడు అంత మోర్ట్ గేజ్ కట్టటం కష్టం, మరీ సింగల్ ఇన్కమ్ కదా, 'అనురాధ' తో ఆలోచిస్తా! కానీ కష్టమే " అన్నాడు అనురాధ పేరుని కొంచెం గట్టిగా వట్టి పలుకుతూ.

పక్కనే కిచెన్లో గీత కూడా అదే విషయం చెపుతుంది అనురాధకి. తన పేరు ప్రశాంత్ నోట వినపడటంతో "ఏంటీ అంది" కిచెన్ లో నుండే అనురాధ

"కిరణ్ వాళ్ళ కమ్యూనిటీ లో ఇల్లు కొనమంటున్నాడు" అన్నాడు కొంచెం గట్టిగా అందరికీ వినపడేట్టు.

"ఆ .. ఉన్న సాలరీ అంతా ఇంటికే పెడితే ఏం తిందాం? మిగతా పేమెంట్స్ అన్నీ ఎలా కడతాం? అసలే ఇప్పుడు మనది సింగల్ ఇన్కమ్" అంది ''సింగల్ ఇన్కమ్' అనేది ఏదో ఒక పెద్ద తప్పు, ఒక దారుణమైన విషయం అన్నట్టు, ఐటీ జాబ్ ని మాత్రమే జాబ్ గా పరిగణిస్తూ, గట్టిగా వత్తి పలికింది అనురాధ కొంత నిష్టూరంగా.

"సాఫ్ట్వేర్ ట్రైనింగ్ నడుస్తుంది కదా" అంది గీత ప్లేట్స్ లో చికెన్ ని సర్వ్ చేస్తూ.

సమాధానం చెప్పకుండా కొంచెం పెదవి విరిచింది అనురాధ . కొంచెం సేపు నిశ్శబ్దం రాజ్యమేలింది అక్కడ. చెరొక్క సిప్పు డ్రింకు చేశారు ప్రశాంత్, కిరణ్.

ఆ విషయం అక్కడే ఆగి పోయింది, కానీ అనురాధ, ప్రశాంత్ ఇద్దరి మనసుల్లో ఇల్లు విషయంలో కొత్త ఆలోచనలు మొదలయ్యాయి. కిరణ్ వాళ్ళ ఇల్లు మంచి లేఔట్ తో, కొత్త అప్లియాన్స్ తో, ఎంతో విశాలంగా, ఎంత అందంగా ఉందో ప్రశాంత్, అనురాధ ల మనసులో మెదిలింది.

ఇంతలో ఒక ఫోన్ కాల్ వచ్చింది కిరణ్ కి.  దాదాపు పది నిమిషాలకి పైగానే బయటికి వెళ్లి మాట్లాడి వచ్చాడు. మనిషిని చూస్తే, చాలా  పని వత్తిడికి  గురి అవుతున్నాడు అని తెలుస్తుంది, కానీ బయటకి కనపడకుండా దాచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని అర్థం అయింది ప్రశాంత్ కి.

మళ్లీ డ్రింక్ ఒక సిప్ చేసి, వాట్సాప్ లో మెసేజెస్ చూసి  తనలో తానే గునిగినట్టు నిట్టూర్చాడు కిరణ్.  "విషయం ఏంటి?" అన్నాడు  ప్రశాంత్.

"ఈ మధ్య ఎవరో ఒకరు పోవడం, దానికి వెంటనే ఏవో ఫండ్-రేజర్ లాంటివి క్రియేట్ చేసి డబ్బులు అడుక్కోవడం రోజు రోజుకీ ఎక్కువ అవుతున్నాయి. అడుక్కోవడానికి అయినా ఒక హద్దు ఉండాలి కదా?" అన్నాడు నిష్టూరంగా కిరణ్. ఆయన మాటల్లో సాటి మనుషులు చనిపోవడం పై బాధ కన్నా వాళ్ళు ఫండ్ రైజింగ్  చేస్తున్నారనే కోపం ఎక్కువ కనపడుతుంది.

"యా .. ఈ మధ్య దురదృష్టం మనల్నే వెంటాడుతుంది, ముఖ్యంగా మన ఇండియన్స్ ని అందులో మన తెలుగు వారినే టార్గెట్ చేసినట్టు అనిపిస్తుంది. కనీసం వారం రోజులకొకసారి ఎవరో ఒకరు ఇలా సడెన్ గా పోవడం కూడా కొంత ఆలోచించాల్సిన విషయమే! మొన్నటికి మొన్న ఆ తెలుగు సంఘం కార్యకర్త , ఎప్పుడూ సరదాగా ఉండేవాడు. ఎలాంటి సిమ్టమ్స్ కూడా లేకుండా, ఏదో  చెస్ట్ పెయిన్ అని హాస్పిటల్ కి వెళ్లే లోపు చనిపోయాడాడట! రెండు వారాల క్రితం  బి.ఎం.ఐ ఆఫీసులో పనిచేసే ప్రాజెక్టు మేనేజర్ హార్ట్ అట్టాక్ తో పోయాడట, ఇంకా ఆయన  మారథాన్ లో పాల్గొంటూ చాలా హెల్త్ కాన్షియస్ గా ఉంటాడట! మరీ నలభైల్లోనే అందరినీ అనాథలుగా చేసి  పోవడం అంటే చాలా దారుణం. కనీసం ఎలాంటి సేవింగ్స్ కానీ, బెనిఫిట్స్ కానీ  లేకపోవడం వల్ల  ఫండ్ రేజింగ్ మీద ఆధారపడుతున్నారు" అన్నాడు కొంత బాధగా ప్రశాంత్.

"ఫండ్ రైజింగ్ చేయడంలో తప్పులేదు, ఇదిగో ఈ ఫామిలీ చూడు, గోఫండ్ మీ  లో 250కె లిమిట్ పెట్టారు. ఏదో, క్రిమేషన్ ఖర్చుల కోసం 20కె ,30కే  అంటే ఒకే కానీ, మరీ వాళ్ళ ఫామిలీ లైఫ్ సెటిల్ మెంట్ అంతా పబ్లిక్ మనీ మీదే ఆధారపడితే ఎలా? మనకు ఇట్లాంటివి నెలలో రెండు మూడు అయినా  వస్తున్నాయి, ఎంత మందికని సహాయం చేస్తాం?" అన్నాడు ఆ మెసేజ్  ప్రశాంత్ కి చూపిస్తూ  కోపంగా.

ఇద్దరు చిన్న పిల్లలు, పెద్దగా చదువుకోని భార్య, భర్త హఠాన్మరణం. దేశం కాని దేశం, తన వాళ్ళు అంటూ ఎవరూ లేని ఒంటరి తనం. నాన్నకేమయిందో తెలియని బిక్కు బిక్కుమంటున్న పసివాళ్ళు. ఆ ఫోటో చూస్తుంటే గుండె తరుక్కుపోయింది ప్రశాంత్ కి. ఆ వాట్సాప్ లింక్ తనకు పంపుమన్నాడు ప్రశాంత్.

ఒక కుటుంబం, దిక్కు లేకుండా అనాధ అయిపోవడం, కొడుకు శవాన్ని కన్న తల్లితండ్రుల చివరి చూపుకు నోచుకోకపోవడం, రేపటి వారి జీవితం ఆలోచిస్తుంటే ఎవరికయినా బాధ కలిగేదే!. కొంత నైనా సానుభూతి ప్రకటించేది పోయి, డబ్బుల లిమిట్ ఎక్కువ పెట్టారని కిరణ్ కోపానికి రావడం ప్రశాంత్ కి నచ్చలేదు. ఎవరి పరిస్థితి ఎలా వస్తుందో? జాలి పడాల్సిన చోట అసహ్యించు కోవడం కొంత ఆశ్చర్యానికి గురి చేసింది ప్రశాంత్ ని. ఎవరో చేసిన ఆ ప్రకటనకి, చనిపోయిన మనిషి మీద, ఆ కుటుంబం మీద కొంత కూడా జాలి,కరుణ కూడా లేకుండా నిందించడం విస్మయానికి గురి చేసింది. ఇలా కూడా ఆలోచిస్తారా మనుషులు అనుకున్నాడు ప్రశాంత్.

'డిన్నర్ రెడీ!' అని లేడీస్ పిలవడంతో ఆ టాపిక్ అక్కడే వదిలేసి డిన్నర్ కి లేచారు అందరూ. అప్పటికే ఆఫీసుకి సంబంధించిన ఫోన్ కాల్స్, మెసేజెస్ రావడం తో డిన్నర్ చేయగానే వెళ్లిపోయారు కిరణ్ ఫ్యామిలీ.

కిరణ్ వాళ్ళు వెళ్లి పోగానే కొద్దిసేపు కిచెన్ లో అన్ని సర్దడంలో అనురాధ కు హెల్ప్ చేస్తూ కిరణ్ తో జరిగిన సంభాషణని ఆమెతో పంచుకున్నాడు ప్రశాంత్. అనురాధ కూడా కొంత ఆశ్చర్య పోయింది కిరణ్ ప్రవర్తన చూసి. ఆ తర్వాత ఇద్దరూ కల్సి కిచెన్ అంతా క్లీన్ చేసి బెడ్రూమ్ లోకి వెళ్లిపోయారు. ముందుగా వాట్సాప్ లో ఇచ్చిన గో ఫండ్ బ్యాంక్ అకౌంట్ కి కొన్ని డబ్బులు పంపి తన చేతనైన సహాయం చేసాడు ప్రశాంత్ ఆ బాధిత కుటుంబానికి. అనురాధ కూడా ఇలాంటి విషయాల్లో ప్రశాంత్ కి సపోర్ట్ చేస్తుంది ఎప్పుడూ. ఈ మధ్య వరుసగా జరుగుతున్న కొన్ని అవాంఛనీయ సంఘటనలు, ఎన్నో ఆశలతో అమెరికా వస్తే, అన్ని ఆశలు కుప్పకూలి పోయి, భార్యా పిల్లలను అనాధలుగా చేసి, చిన్నాభిన్నం అయిన వారి జీవితాల గురించి మాట్లాడుతూ బాధపడ్డారు ఇద్దరూ.

కిచెన్ లో లైట్లు ఆర్పీ బెడ్ రూమ్ వైపు వెళ్తుంటే, ఎప్పుడెప్పుడు కిరణ్ తెచ్చిన కొత్త ఇల్లు గురించి మాట్లాడాలా అని ఉంది ఇద్దరికీ, కానీ ఎవరు ముందు ఆ విషయం తీస్తారా అని ఎదురు చూస్తున్నారు మెల్లిగా నడుచుకుంటూ.

కొద్దిసేపు నిశ్శబ్దం తర్వాత "మాకొల్లీగ్ లక్ష్మీ వాళ్ళు కూడా టౌన్ హోమ్ నుండి పెద్దింటికి మారుతున్నారట. ఏదో కొత్త కమ్మూనిటీ అంట, పేరేదో చెప్పింది" బెడ్షీట్ సర్దుతూ అంది అనురాధ నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ.

“ఓ.. అలాగా..“ అన్నాడు ప్రశాంత్. మెల్లిగా కొంత సేపటి తర్వాత ఏదో ఆలోచిస్తూ. “మనకిప్పుడు కొత్త ఇల్లు అవసరమంటావా?” అన్నాడు ప్రశాంత్ కొంత సందేహంగా.

“అవసరం అంటే అవసరం, లేదంటే లేదు .. మీ ఇష్టం” కావాలి అని స్పష్టంగా చెప్పలేక ఊహాత్మక సమాధానం చెప్పింది అనురాధ. కొత్త ఇల్లు, అందులో పెద్దది అంటే ఎవరికీ మాత్రం ఇష్టం ఉండదు?

“ఇప్పుడు మన ఇల్లు అమ్మగా వచ్చే డబ్బులు పోను, ఎంత లేదన్నా ఇంకో ఎనిమిది వందల-కె నుండి తొమ్మిది వందల-కె వరకు కొత్త లోన్ తీసుకోవాలి. అంత కట్టితే మనకు మిగతా ఖర్చులకి కష్టం” అన్నాడు ప్రశాంత్.

“కిరణ్ ఇంకో జాబ్ కూడా చేస్తుండు కదా, పార్టు టైం జాబ్ నేనయినా చేస్తాను, లేదా కిరణ్ వాళ్ళ కంపెనీ లో పార్ట్ టైం జాబ్స్ ఉన్నాయట, మీరయినా చేయండి” అంది అనురాధ కొత్తింటి కోసం ఎంత త్యాగానికి అయినా సిద్ధం అవుతూ.

అసలు ఇల్లు కొనాలని ఎప్పుడూ ఊహించని అనురాధ-ప్రశాంత్ లకి కిరణ్ వేసిన ఆ బీజం మొలకెత్తి క్రమంగా పాకుతూ ఇద్దరి మనుషుల్లో కొత్త కోరికలు రేపింది. ఒకసారి మొదలయిన ఈ ఆలోచనలు ఇద్దరినీ మౌనంగా కూర్చోనివ్వడం లేదు. కిరణ్ వాళ్ళ ఇల్లు, ఇంటీరియర్ అన్ని గుర్తుకువస్తున్నాయి పదే పదే. కొత్త ఇంటి ఊహల్లో తేలిపోతున్నారు ఇద్దరూ. మొత్తానికి ఇంకొక ఉద్యోగం ఉంటే తప్ప ఇల్లు కొనలేము అని నిర్ణయానికి వచ్చారు.

“చా, అనవసరంగా నేను ఉద్యోగం మానేసాను, ఇప్పుడు మళ్ళీ అంత మంచి ఉద్యోగం రావాలన్నా రాదు, అంత సాలరీ కూడా రాదు” చాలా పెద్ద తప్పు చేసానన్నట్టు బాధపడింది అనురాధ. ఇన్ని రోజులు ఎంతో హాయిగా ప్రశాంతంగా ఉందనుకున్న జీవితం, కొత్త ఇంటి ఆలోచన రాగానే చేదు అయిపోయింది ఇద్దరికీ.

“నేను ఇంకో పార్ట్-టైం జాబ్ చేస్తే ఎలా ఉంటుంది అని ఆలోచిస్తున్నాను” అన్నాడు సుదీర్ఘంగా ఆలోచిస్తూ ప్రశాంత్.

“సర్లే, రేపు ఆలోచిద్దాం! ఇప్పుడు పడుకుందాం బాగా లేట్ అయ్యింది“ అనుకుంటూ లైట్ ఆఫ్ చేసింది అనురాధ.

“డిష్ వాషర్  పని చేయడంలేదు, గిన్నెలన్నీ చేతుల్తో కడగాల్సొచ్చింది. ఫ్రిడ్జ్, వాషెర్,డ్రయ్యర్ కూడా కొన్ని సార్లు మొరాయిస్తున్నాయి” అంది కాంప్లేన్ చేస్తున్నట్టు.

“బాగా పాతవి కదా , సర్వీస్ అయిపోతుంది. అయినా మనకు అప్లియాన్స్ ఇన్సూరెన్స్  ఉంది కదా, రేపు ఫోన్ చేసి మాట్లాడుదాం ” అన్నాడు ప్రశాంత్. కొత్త ఇల్లు ఆలోచనలు రాగానే ఇప్పుడు వాడుతున్న ఐటమ్స్ అన్నీ పాతవి,  పనికిరావు  అన్నట్లు అనిపిస్తుంది ఇద్దరికీ.

పడుకున్నా కూడా మనసులో కొత్త ఇంటి ఆలోచనలు మాత్రం తిరుగుతూనే ఉన్నాయి, ఎప్పటికో కానీ నిద్రపట్టలేదు ఇద్దరికీ.

తమ ఇల్లు అమ్మితే ఎంత వస్తుంది, ఇంటరెస్ట్ రేట్ల వివరాలు, కొత్త ఉద్యోగం,  లేదా పార్ట్ టైం ఉద్యోగ అన్వేషణ లాంటి కార్యక్రమాలతో  బాగా బిజీ అయ్యారు ఇద్దరూ  ఆ వారం అంతా.

★★★

**ఒక వారం రోజుల తర్వాత:**

ఆ రోజు సోమవారం,  పొద్దున్నే ప్రశాంత్ తన ఆఫీసు పనిలో మునిగి పోయాడు.  అనురాధ పిల్లలకోసం బ్రేక్ ఫాస్ట్ సిద్ధం చేస్తుంది. అంతలోనే గీత నుండి ఫోన్ వచ్చింది అనురాధకి .

“ప్రశాంత్, ప్రశాంత్ .. ఎక్కడున్నావ్? “ అప్పుడే వచ్చిన ఫోన్ కాల్లో విషయం విని షాక్ కి గురై, కాళ్ళు చేతులు వణుకుతుంటే, వెంటనే స్టవ్ ఆర్పి విషయం ప్రశాంత్ కి చెప్పాలి అని వెతుకుతుంది అనురాధ.

తన ఆఫీసు రూంలో పని చేసుకుంటున్న ప్రశాంత్, అనురాధ అరుపులకి ఉలిక్కి పడి కిచెన్ లో ఏదో ప్రమాదం జరిగి ఉంటుందని ఉన్నపళంగా పరుగు పరుగున కిచెన్ వైపుకి వెళ్ళాడు అనురాధని  వెతుక్కుంటూ.  చాలా ఆందోళన గా వణకుతున్న అనురాధ చేతులు పట్టుకొన్నాడు గట్టిగా ప్రశాంత్.  విషయం ఏంటి అన్నట్టు చూసాడు.

"ప్రశాంత్... అది.. కిరణ్ .. కిరణ్" అని ఏదో చెప్పబోతుంది, కానీ మాటలు రావడం లేదు. విషయం తెలియక మరింత కంగారుకు గురయ్యాడు ప్రశాంత్.

అనురాధని దగ్గరకి తీసుకుకొని, కొంత సముదాయించి పక్కనే ఉన్న సోఫాలో కూర్చండబెట్టి తాగడానికి నీళ్లు ఇచ్చి ఇప్పుడు చెప్పమన్నాడు విషయం ఏంటో!

"కిరణ్ ఇస్ నో మోర్, హార్ట్ ఎటాక్ అంట" కుండ బ్రద్దలు కొట్టినట్టు అసలు విషయం చెప్పింది గద్గద స్వరంతో తడబడుతూ. అది విన్న ప్రశాంత్ కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురై సోఫాలో అచేతనంగా కూలబడ్డాడు. కొద్దిసేపు ఎవ్వరూ మాట్లాడలేక పోయారు ఊహించని ఆ దుర్వార్త విని. ఎన్నో సార్లు కూర్చుని కబుర్లు చెప్పుకున్న కిరణ్ ఇక లేదు అంటే నమ్మబుద్ధి కావడం లేదు ప్రశాంత్ కి. కిరణ్ తో తన జ్ఞాపకాలు ఒక్కొక్కటీ గుర్తుకు వస్తున్నాయి.

కిరణ్ ని తమ ఇంట్లో కలసిన సరిగ్గా వారం రోజుల తర్వాత, ఇప్పుడు ఇంత చేదు నిజం వినాల్సొస్తుందని ఊహించలేదు ప్రశాంత్. కమ్యూనిటీ లో భారతీయుల హఠాత్మరణాల గురించి, గో-ఫండ్-మి ల ద్వారా డబ్బు సేకరించరించడం గురించి ఎంతో మాట్లాడుకున్న కిరణ్ ఈ రోజు ఈ లోకంలో లేడు. నిండుగా నలభయ్ ఏళ్ళు కూడా నిండని కిరణ్ ఈ రోజు అభం శుభం తెలియని ముగ్గురు పిల్లల్ని, భార్యని అనాధలుగా వదిలేసి వెళ్లిపోవడం తట్టుకోలేక పోతున్నారు ప్రశాంత్,అనురాధ.

ప్రశాంత్ వెంటనే తన బాస్ కి ఒక మెసెజ్ పంపి, అనురాధతో కల్సి కిరణ్ వాళ్ళ ఇంటికి వెళ్లారు. అనురాధ ఇంకా షాక్ లోనే ఉంది. ఎలా జరిగిందో ఇంకా కారణం తెలియదు. డ్రైవ్ చేస్తున్న ప్రశాంత్ మనసంతా ఆందోళనగా ఉంది. అమెరికాలో ఎక్కువ హార్ట్ ఎట్టాక్ లు సోమవారమే వస్తాయట అని ఎక్కడో చదివిన విషయం గుర్తుకి వచ్చింది.

"కిరణ్ కి హార్ట్ ఎట్టాక్ వచ్చి ఉంటుందా? ఈ రోజు సోమవారం కదా? ఆఫీసులో అంత ప్రెషర్ ఉన్నప్పుడు రెండు జాబులు ఎందుకు చేయాలి? " ఎన్నో ప్రశ్నలు మనసులో సుడులు తిరుగుతున్నాయి ప్రశాంత్ కి. అనురాధ ఏమీ మాట్లాడే పరిస్థితిలో లేదు.

★★★

కిరణ్ ఇల్లు చేరుకున్నారు అనురాధ, ప్రశాంత్. అనురాధని చూడగానే పట్టుకొని బోరున విలపించింది గీత. రోదిస్తుంటే ఆపడం అనురాధ, ప్రశాంత్ ల వల్ల కాలేదు. ఇది ఏజన్మ బంధమో తెలియదు కానీ

ఈరోజు అనురాధ, గీతకి ఒక రక్త సంబంధం కన్నా ఎక్కువ అయిపోయింది. గుండె తరుక్కుపోయింది అనురాధకి గీత ఏడుస్తుంటే.

పక్కనే పిల్లలు బిక్కు బిక్కు మని చూస్తున్నారు, చిన్నవాడికి అసలు ఏమి జరిగిందో కూడా తెలియదు, వాడి తండ్రి ఇక ఎప్పటికీ రాడనే విషయం కూడా తెలియదు. ఇద్దరు పిల్లలని దగ్గరికి తీసుకొని ఓదార్చదానికి ప్రయత్నించాడు ప్రశాంత్.

“పొద్దున్నే ఎయిర్పోర్ట్ కి వెళ్లాలని క్యాబ్ బుక్ చేసాడు. క్యాబ్ డ్రైవర్ ఇంటి ముందుకి వచ్చి, ఫోన్ లేపడం లేదు అని హారన్ కొట్టాడు. ఎప్పుడో వెళ్లి పోయి ఉంటారు కదా అని నేను లేచి చూస్తే కింద హాల్లో సోఫాలో అలాగే కూర్చుని ఉన్నాడు ఉలుకూ పలుకూ లేకుండా. 911 కి డయల్ చేస్తే అయిదు నిమిషాల్లోవచ్చారు, కానీ నో మోర్ అని చెప్పారు” బావురు మంది గీత కొద్దిసేపటి తర్వాత.

“అటాప్సి లాంటి ఫార్మాలిటీస్ కోసం బాడీని అదే ఆంబులెన్సు లో తీసుకుపోయారు,తర్వాత ఫ్యునెరల్ హోమ్ కి పంపిస్తారట” చెప్పింది గీత ఆగని వెక్కిళ్ల మధ్య.

కిరణ్ ఎప్పుడూ ట్రావెలింగ్ జాబ్ కనుక స్థానికంగా పెద్దగా ఫ్రెండ్స్ గానీ, కొల్లీగ్స్ కానీ లేరు. ఇప్పుడు వాళ్ళ ఫ్యామిలీకి ఏకైక దిక్కు ప్రశాంత్–అనురాధ మాత్రమే. అనుకోకుండా చాలా పెద్ద బాధ్యత ప్రశాంత్, అనురాధల భుజాలపై పడింది. ప్రశాంత్ కి కూడా ఏమి చేయాలో తెలియడం లేదు. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు. వెంటనే తెలిసిన తెలుగు సంఘం ప్రతినిధికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. కొద్దిసేపట్లోనే ఆ సభ్యుడు ఇంకొంత మంది అనుచరులతో వచ్చి ప్రశాంత్ ని కలిసాడు.

జరగబోయే తంతు గురించి, లైఫ్ ఇన్సూరెన్సు, వీలునామా, బ్యాంకు డిపాజిట్స్, సేవింగ్స్ గురించి మాట్లాడితే అన్నిటికి గీత నుండి ఏడుపు, కొన్ని సార్లు మౌనమే సమాధానం గా వచ్చింది ఆ తెలుగు సంఘం ప్రతినిధికి. ఇంకా చేసేదేమి లేక గో–ఫండ్–మీ లో ఫ్యూ నెరల్ ఖర్చులకోసం అకౌంట్ క్రియేట్ చేయమని ప్రశాంత్ కి చెప్పాడు ఆ ప్రతినిధి.

ఇలాంటి ఫండ్ రేజింగ్ లని తీవ్రంగా వ్యతిరేకించిన కిరణ్ అంత్యక్రియల కోసం, ఇప్పుడు తనే ఆ అకౌంట్ ని క్రియేట్ చేయడం చాలా ఇబ్బంది అనిపించింది ప్రశాంత్ కి.

"ఏదో, క్రిమేషన్ ఖర్చుల కోసం 20కె –30కే అంటే ఒకే కానీ, మరీ వాళ్ళ ఫామిలీ లైఫ్ సెటిల్ మెంట్ అంతా పబ్లిక్ మనీ మీదే ఆధార పడితే ఎలా? మనకు ఇట్లాంటివి నెలలో రెండు మూడు అయినా వస్తున్నాయి, ఎంత మందికని సహాయం చేస్తాం?" – ఎంత గుర్తుచేసుకోవద్దనుకున్నా గత వారం కిరణ్ అన్న మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి ప్రశాంత్ కి. నెలలో రెండు మూడు జరుగుతున్నాయి అన్నాడు నిజమే కానీ అది తన ఫ్యునెరల్ కోసమే అని ఎవ్వరూహించని చేదు నిజం.

"జీవితం ఎంత విచిత్రమయినది? తనదాకా వస్తే కానీ తెలియదు అంటారు, ఇప్పుడు తన దాకా వచ్చినప్పుడు, తాను ఈ లోకం లోనే ఉండకపోవడం. విధి ఆడే వింత నాటకం అంటే ఇదేనేమో!" మనసులో అనుకున్నాడు ప్రశాంత్.

"ఇప్పుడు ప్రశాంత్ కోరిక ప్రకారం, ఏదో ఇరవై–ముప్పై వేలు మాత్రమే అడిగితే రేపు పిల్లల పరిస్థితి ఏమిటి? ఇప్పుడు ఇల్లు,కారు బ్యాంక్ వాళ్ళు తీసుకుంటారు. రేపు పిల్లల ఆలనా పాలనా కి అయ్యే ఖర్చు ఎలా?" మనసులో ఎన్నో ప్రశ్నలు ప్రశాంత్ కి.

మొత్తానికి తెలుగు సంఘం ప్రతినిధితో మాట్లాడి 100కే కి ఫండ్ రేజింగ్ మొదలు పెట్టి, తెలిసిన మిత్రులందరికీ పంపాడు ప్రశాంత్. అలాగే అన్ని ఎన్నారై సంఘాలు కూడా తమకు చేతనైన ఆర్ధిక సహాయం చేయడంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. పిల్లల్ని చూస్తే గుండె తరుక్కు పోతుంది చూసే వారందరికీ.

"నిన్నటి వరకూ తమ పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపిన పిల్లల అభం, శుభం తెలియని ఆ బాల్యం, ఆ సంతోషం, ఆ కేరింతలు శాశ్వతంగా దూరం కావాల్సిందేనా? ఎంతో చదువుకొని, అమెరికా వచ్చి తన తల్లి తండ్రులకి, తన భార్యా పిల్లలకి ఒక మంచి జీవితాన్ని ఇవ్వాల్సిన కొడుకు, అందరినీ వదలిపెట్టి, ఈ రోజు అన్ని బాధ్యతలని వాళ్ళకే వదిలేసి తెలియని లోకాలకి వెళ్లిపోవడం ఎంత దారుణం" ప్రశాంత్ మనసు బాధ తో తల్లడిల్లింది.

"ఏవన్నా లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నాడా కిరణ్?" ఒక తెలుగు సంఘం సభ్యుడు అడిగిన ప్రశ్నకి మౌనమే జవాబుగా వచ్చింది గీత నుండి.

"ఇండియాలో అందరూ ఎల్.ఐ.సి అనీ ఇంకా ఏవో ఏవో ప్రయివేట్ పాలసీలు చేసే మనం, ఇక్కడ అమెరికాలో కారు కు మాత్రం తప్పని సరిగా ఇన్సూరెన్సు తీసుకునే మనం, మన ఫ్యామిలీ గురించి ఎందుకు ఆలోచించట్లేదో? ఇంట్లో

ఫ్రిడ్జ్ కి, వాషింగ్ మిషన్ కి ఇన్సూరెన్సు తీసుకుంటున్న మనం, ఒక ఫ్రిడ్జ్ కు ఇస్తున్న విలువ మన కుటుంబానికి ఇవ్వక పోవడం చాలా విచిత్రం" ఆ తెలుగు సంఘం సభ్యుడు తన ఆక్రోశాన్నంతా వెళ్ళగక్కాడు.

ఆమాటలు ప్రశాంత్ ని బాగా ఆలోచింప చేశాయి. అవును కదా, ఇక్కడ జీవిత భీమా కోసం వందల ఇన్సూరెన్సు కంపెనీలు ఉన్నా చాలా మంది భారతీయులు ఆవిషయం గురించి ఎక్కడా మాట్లాడకపోవడం ఆలోచిస్తుంటే నిజమే అనిపిస్తుంది. అదే కారుని మాత్రం ఇన్సూరెన్సు లేకుండా రోడ్డు పైకి తీసుకురారు. అసలు రెండు డాలర్ల సేవింగ్ కూపన్ ల కోసం, పది షాపుల గురించి మాట్లాడే మనం, మనపై ఆధారపడిన వారి భవిష్యత్తు కోసం, ఇలాంటి ఉపద్రవాలని ఎదుర్కునేందుకు తీసుకోవాల్సిన కొన్ని నిర్ణయాల గురించి ఎప్పుడూ మాట్లాడక పోవడం విచిత్రం అనిపించింది ప్రశాంత్ కి ఆలోచిస్తుంటే. దానికి తానూ మినహాయింపు కాదు అనుకున్నాడు.

"ఎప్పుడూ మన సుఖాలకోసం, సంతోషాల కోసం మాట్లాడుతాం కానీ, ఇలాంటి విపత్కర పరిస్థితి ఒకటి వస్తే ఎలా నెగ్గుకు రావాలి, అని మాత్రం ఎప్పుడూ మాట్లాడము" ప్రశాంత్ మనసు చాలా తీవ్రంగా ఆలోచిస్తుంది. మొత్తానికి తెలిసిన మిత్రులు, తెలుగు సంఘాల ప్రతినిధుల సహకారంతో ఫ్యునెరల్ జరిపించి వచ్చారు ఇంటికి.

ఇంటికి వచ్చిన అనూరాధ, ప్రశాంత్ లకి మనసు మనసులో లేదు. చాలా బాధగా ఉంది. స్నానం చేసి పడుకున్నాడు ప్రశాంత్. తినాలని పించలేదు. నిద్ర పట్టడం లేదు. కళ్ళు మూసుకున్నాడు కానీ మనసులో ఎన్నో ఆలోచనలు. కిరణ్ కి సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు మనసుని తొలిచేస్తున్నాయి.

"సంపాదించే మనిషి పోతే ఆ ఫ్యామిలీ పరిస్థితి ఏంటి?" మనసులో ఎన్నో ఆలోచనలు అనురాదని వదలట్లేదు. కిరణ్ ఉన్నప్పుడు చాలా గొప్పగా, కుటుంబం మొత్తాన్ని లేని ఆడంబరాలకు అలవాటు చేసి ఇప్పుడు అందరినీ వదిలేసి తన దారిలో తాను పోతే,ఇప్పుడు వారి పరిస్థితి ఏమిటి? ఎన్నో సమాధానం లేని ప్రశ్నలు మదిలో తిరుగుతుంటే ఇంట్లో మనిషి పోయినంత బాధతో అనురాధ చాలా షాక్ కు గురయ్యింది.

★★★

కిరణ్ పోయి అప్పటికే ఒక వారం రోజులు అయ్యింది. అనురాధ, ప్రశాంత్ దాదాపు ప్రతిరోజు గీతని కలసి, జరగాల్సిన పనుల్లో సహాయం చేస్తున్నారు. అనురాధ ఇంకొంత మంది మిత్రులు ప్రతి రోజు వంట చేసి భోజనం తీసుకెళ్తున్నారు. చివరికి తెలిసిందేమిటంటే బ్యాంకు అకౌంట్ లో ఎలాంటి సేవింగ్స్ లేవు. కిరణ్ ఇమెయిల్, బ్యాంకు

అకౌంట్ పాస్వర్డ్స్ ఏవీ గీత దగ్గర లేవు. వచ్చిన సాలరీ అంతా రెండు మిలియన్ల ఇంటికి నెలసరి మోర్ట్గేజ్ కట్టడానికే సరిపోతుంది. అప్పటికే ఇండియాలో ఉన్న కొన్ని ప్రాపర్టీస్ అమ్ముకుని డౌన్ పేమెంట్ కూడా కట్టాడట. ఇంకా మోర్ట్ గేజ్ కట్టడానికి సరిపోకపోవడం వల్లే ఈమధ్యే రెండవ జాబు కూడా చేస్తున్నాడని చెప్పింది గీత.

“అంత పెద్ద ఇల్లు వద్దని చెప్పితే ‘ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు సుఖపడతాం? ఆమాత్రం స్టేటస్ మెయింటెన్ చేయాలి కదా?’ అంటూ వినకుండా సైన్ చేశాడు . ఇంటికి దగ్గట్టు కారు ఉండాలని ఫెరారీ కారు కొన్నాడు, దాని పేమెంట్ కూడా చాలా ఉంది” కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యింది గీత.

రాత్రి ఇంటికి వచ్చిన ప్రశాంత్ కి మనసు మనసులో లేదు. ఏవేవో ఆలోచనలు తనను మౌనంగా ఉండనీయడం లేవు. “ఇంకా ఎన్ని రోజులు ఆ టౌన్ హోమ్ లోనే ఉంటావు?” కిరణ్ అడిగిన ప్రశ్న ప్రశాంత్ మనసులో తిరుగుతూనే ఉంది.

ఇమెయిల్ చెక్ చేయడానికి ఆఫీసు కంప్యూటర్ ఓపెన్ చేసాడు ప్రశాంత్. చిన్నప్పుడు తన కుటుంబం మొత్తం ఆరుగురు కల్సి ఒకే చిన్న ఇంట్లో కేవలం రెండు గదులలో ఉండటం, సైకిల్ కూడా లేకుండా మొదలైన తన జీవితం, తన పిల్లలకు మాత్రం ఒక్కొక్కరి ఒక బెడ్ రూమ్, లగ్జరీ కారు నుండి మొదలైన వారి జీవితం ఎలాంటి బాధలు తెలియకుండా పెరగడం“ అన్నీ కళ్ళ ముందు మెదిలాయి.

“విశాలమయిన నాలుగు బెడ్ రూంలు, ఇంటి వెనుక తోట, పిల్లలు ఆడుకోవడానికి కొంత స్థలం, పెద్ద కిచన్, కమ్యూనిటీ టెన్నిస్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, అంతకంటే ఇంకేం కావాలి? ఇన్ని వసతులను వదలుకొని కిరణ్ చెప్పగానే ఇంకా పెద్దిల్లు కావాలని లెక్కలు వేసుకోవడం, ఈ ప్రశాంత జీవితాన్ని వదులుకొని అనురాధ కూడా మళ్ళీ పని చేయడానికి సిద్ధపడటం ఎంత విచిత్రంగా ఉంది“ అనుకుంటూ స్నానం చేయడానికి వెళ్ళాడు ప్రశాంత్.

“సుఖ పడాలి అంటే పెద్ద ఇల్లు ఉండాలా? స్తోమత లేక పోయినా, మిలియన్ డాలర్ల ఇళ్లు, హై ఎండ్ కార్లు ఎందుకు కొనాలి?“ స్నానం చేస్తున్నా ఆలోచనలు మాత్రం వదలట్లేదు ప్రశాంత్ ని. ఇరుకు ఇండ్లలో ఉన్న ప్రేమ, ఆప్యాయత లు పెద్ద భవంతుల్లో ఉండవు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

“అంత పెద్ద ఇల్లు ఎందుకుకొనాలి? మోర్ట్ గేజ్ కట్టడం కోసం ఎందుకు కష్టపడి ప్రాణం మీదికి తెచ్చుకోవాలి? “ఫ్యునెరల్ హోమ్ లో కిరణ్ ని ఉద్దేశించి ఎవరో అన్న మాటలు గుర్తుకు వచ్చాయి ప్రశాంత్ కి. ఇంకా ఏవేవో ఆలోచనలు మనసులో సుడులు తిరుగుతుంటే బెడ్ పై నడుంవాల్చాడు ప్రశాంత్.

"ఇదే పరిస్థితి తనకు వస్తే?" ఆలోచిస్తూ కళ్ళు మూసుకోగానే, బాగా అలసిపోవడం వల్ల వెంటనే నిద్రలోకి జారుకున్నాడు ప్రశాంత్. తన పార్థివ శరీరం పక్కన పిల్లలు, అనురాధ తనకోసం ఏడుస్తూ... ఒక పీడకల నుండి హఠాత్తున మెలకువ వచ్చింది. వంటి నిండా చమటలు పట్టేసాయి. వెంటనే లేచి మంచి నీళ్లు తాగి అలాగే కూర్చున్నాడు బెడ్డు పై.

మొన్న ఆఫీసు కి పోయి వస్తుంటే ఇద్దరు బాగా బతికినటువంటి ఫ్యామిలీ నుండి వచ్చినట్టు కనపడుతున్న మిడిల్ స్కూల్ పిల్లలు, డబ్బుల కోసం సిగ్నల్ దగ్గర ప్ల కార్డులు పట్టుకొని నిలుచుంటే, వారికి అయిదు డాలర్లు ఇచ్చిన విషయం కళ్లలో మెదిలింది ప్రశాంత్ కి. రేపు తనకేమయినా అయితే నా పిల్లల పరిస్థితి కూడా అలాగే అవుతుందా? ఊహించుకోవడానికే వణకి పోయాడు. ఏవేవో ఆలోచనలు బాగా కలవర పెడుతున్నాయి.

అనురాధ కూడా పడుకున్నట్టు కళ్ళు మూసుకుంది కానీ నిద్రపట్టనట్టు ఉంది. ప్రశాంత్ లేచి కూర్చోగానే అనురాధ కూడా కళ్ళు తెరచింది.

"కనీసం లైఫ్ ఇన్సూరెన్సు కూడా తీసుకోలేదట, ముగ్గురిని కనే ముందు కొంచెం వాళ్ళ భవిష్యత్తు కోసం కూడా ఆలోచించాలి కదా? " ఫ్యునెరల్ హోమ్ దగ్గర ఇంకెవరో అన్న మాటలు తననే తిట్టినట్టు అనిపించాయి ప్రశాంత్ కి.

"ఒక ఫ్రిడ్జ్ కు ఇస్తున్న విలువ మన కుటుంబానికి ఇవ్వక పోవడం చాలా విచిత్రం" తెలుగు సంఘం సభ్యుడి ఆక్రోశం మనసులో మెదిలింది. రెండు నెలల క్రితం అనురాధ ఫ్రెండ్ ఒకమ్మాయి ఇన్సూరెన్స్ ఏజెన్సీ తీసుకుందట, ఇంటికి వచ్చి ఒక పాలసీ తీసుకొమ్మని, ఫ్యామిలీ భద్రత గురించి గంట సేపు చెప్పిన మాటలని నవ్వుతూ, "పోయినప్పుడు చూసుకుందాములే" అని పంపించిన విషయం గుర్తుకు వచ్చింది ప్రశాంత్ కి.

ఆ అమ్మాయి చెప్పిన విషయం, ఆ మాటల్లోని నిజమేంటో, ఇన్సూరెన్సు విలువేంటో ఇప్పుడు బాగా తెలిసి వచ్చింది ప్రశాంత్ కి. వారం రోజుల క్రితం డిష్ వాషర్ పని చేయనప్పుడు అప్లియాన్స్ ఇన్సూరెన్సు కి ఫోన్ చేస్తే, కొత్త మెషీన్ పెట్టేసి వెళ్లడం గుర్తుకు వచ్చింది. ఇరవై డాలర్ల అప్లియాన్స్ ఇన్సూరెన్సు ఆరు వందల విలువ చేసే మెషీన్ ని రీప్లేస్ చేసింది. ఇన్సూరెన్సు విలువేంటో స్పష్టంగా అ ర్థం అయ్యింది ప్రశాంత్ కి.

తండ్రిని కోల్పోయి బిక్కు బిక్కు మని చూస్తున్న కిరణ్ పిల్లల ముఖాలు గుర్తుకు వచ్చాయి. సిగ్నల్ లైట్ దగ్గర ప్లకార్డులు పట్టుకుని అడుక్కుంటున్న పిల్లలు గుర్తుకు వచ్చారు. ఇప్పుడు వాళ్ళ పరిస్థితి ఏమిటి? ఇప్పుడు నాకూ అదే జరిగితే నా పిల్లల పరిస్థితి ఏమిటి? ఎంత వద్దు అనుకున్నా ఈ పాడు ఆలోచనలను ఆపలేక పోయాడు ప్రశాంత్. ఆ

రోజు ఆ అమ్మాయి ఇన్సూరెన్సు ప్లాన్స్ గురించి చెపుతుంటే ఏదో ఆన్లైన్ మార్కెటింగ్ వాళ్ళని బలవంతంగా పంపేసినట్టు, ఆ అమ్మాయిని కూడా పంపేసిన ప్రశాంత్ కి ఇప్పుడు ఆలోచిస్తుంటే చాలా సిగ్గుగా అనిపించింది.

"ఇప్పుడు కిరణ్ లేని లోటు ఎవ్వరూ పూడ్చలేరు, కానీ ఒక్క పాలసీ చేసుంటే, ఈ రోజు మొత్తం ఫ్యామిలీ ఎవ్వరిపై ఆధారపడకుండా బ్రతికే వారు కదా! బ్రతికున్నపుడు కిరణ్ ఎవరినో అన్నట్టు ఈరోజు కిరణ్ ఫంఢ్రేజింగ్ ని ఎంత మంది తిట్టుకుంటున్నారో!" ఇప్పుడు ఆలోచనలు సరైన మార్గంలోనే వెళ్తున్నాయి అనిపించింది ప్రశాంత్ కి. అవి పాడు ఆలోచనలు కాదు , జీవితాలను సరైన దిశలో నడిపించే ఆశాకిరణాలు అని అర్థం అయ్యింది.

కొన్ని నిజాలు మాట్లాడుకోవడానికి చాలా ఇబ్బంది గా ఉంటాయి! కానీ వాటి ప్రభావం ఎంత చేదుగా ఉంటుందో మన వరకు వస్తే కానీ తెలియదు!! " అనుకున్నాడు మనసులో.

ఆలోచనలనుండి బయటకి రావడానికి ఎంత ప్రయత్నిస్తున్నా ఆ ఆలోచనలు వదలట్లేదు. ఏదో పాటల వాట్సాప్ గ్రూప్ ఓపెన్ చేసాడు. "గాలిబుడగ జీవితం ఓటి పడవ యవ్వనం, నిన్న మరల రాదు రాదు రాదు.. నేడే నిజం.. నేడే నిజం.." ప్లే చేయగానే మొదలయ్యింది పాట. "ఎంతో అర్థం ఉన్న పాట, సందర్భం వేరే అయినప్పటికీ కొన్ని మాటలు నిజం. అవును, జీవితం ఒక గాలి బుడగ, ఎప్పుడు టపీ మని పేలుతుందో ఎవరికీ తెలియదు, నిన్న మరల రాదు, అవును పోయిన కిరణ్ రాదు, అన్నిటికీ సిద్దపడాలి! ఈ రోజు మనం ఉండొచ్చు, లేక పోవచ్చు, కానీ మన కుటుంబాన్ని అనాధలుగా చేయకూడదు, మనపై ఆధారపడ్డ వారి బ్రతుకుల్ని బజారు కీడ్చకూడదు" ఎంత వద్దనుకున్నా మళ్ళీ ఆలోచనలు అటే వైపు, అయినా ఇప్పుడు ఈ ఆలోచనలు ఒక పరిష్కారం వైపు.

"రెండు నెలల క్రితం వచ్చిన ఇన్సూరెన్సు అమ్మాయి పేరేంటి? నంబర్ ఉందా? " అన్నాడు మెల్లిగా అనురాధ పడుకోలేదు అని తెలిసి.

"ఉండే ఉంటుంది" అంది కళ్ళు మూసుకొని.

దాదాపు రాత్రి పన్నెండు అయిపోయింది, అయినా అంత తొందరగా నిద్రపట్టడం లేదు ఇప్పుడు ఇద్దరికీ. రోజూ గీత తో మాట్లాడి రావడం, రోజుకొక కొత్త అప్పు విషయం తెలుసుకుంటూ గీత ఇబ్బంది పడుతుంటే తట్టుకోలేక పోతున్నారు ప్రశాంత్, అనురాధ .

“రేపు మొట్ట మొదటి టాస్క్ , ఆ అమ్మాయికి ఫోన్ చేసి రమ్మను, ఇన్సూరెన్సు పాలసీ చేయడానికి సిద్ధంగా ఉన్నాము అని చెప్పు “ అన్నాడు కొంచెం నిద్ర నటిస్తూ.

“సరే “ అంది ఇంకో పక్కకి తిరుగుతూ.

మళ్ళీ ఒక నిమిషం తర్వాత .. “ఇప్పుడు మనకు కొత్త ఇల్లు అవసరం అంటావా?” అంది మెల్లిగా.

“ముందు మనకు ఈ ఇంట్లో ఏమి తక్కువయిందని మనం ఇల్లు మార్చుదాం అనుకున్నాం? కేవలం కిరణ్,గీత తీసుకున్నారనే కదా? మనం ఎప్పుడయినా ఇల్లు ఇరుకుగా ఉందనుకున్నామా? మీ కొల్లీగ్ ఎవరో తీసుకున్నారనే కదా? “ అన్నాడు మెల్లిగా .

“అవును, మనం ఈ ఇంటితో ఎప్పుడూ ఇబ్బంది పడింది లేదు” అంది మెల్లిగా అనురాధ కొంచెం అవమానకరంగా సిగ్గు పడుతున్నట్టు.

“అంటే మన అవసరం కన్నా, ఎవరో ఏమో అనుకుంటారని, వాళ్లకు ఉందని మనకు పెద్ద ఇల్లు లేదని, ఇన్ని రోజుల మన ప్రశాంత జీవితాన్ని కాదని ఎక్కువ డబ్బుల కోసం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాము. పిల్లల కోసమని వదలిన నీ ఉద్యోగాన్ని ఇంటి కోసం, మళ్ళీ హడావిడి జీవితానికి సిద్ధ పడ్డావ్. కేవలం సమాజంలో మనకు ఒక పెద్ద ఇల్లు ఉందని చెప్పుకోవడానికి ఎన్నో త్యాగాలకు, ఎంతో మానసిక క్షోభకి సిద్ధమైనాము. దానివల్ల నిజంగా మనకెలాంటి ఉపయోగం లేదు”

“అవునండీ, మనకు ఈ ఇల్లు చాలు. పిల్లలు హై స్కూల్ కి వెళ్లే వరకు నేను ఎలాంటి ఉద్యోగం అని అనను. ఇకనుండి కొత్త ఇల్లు గురించి ఎలాంటి ఆలోచనలను నామనస్సులోకి కూడా రానివ్వను” అంది అనురాధ

“నేనే చెపుదామనుకున్నది, నీవేచెప్పేసావ్. ఇద్దరమూ రెండు పాలసీలు తీసుకుందాము. ఫ్యామిలీ భద్రత తర్వాతే ఇంకేదయినా“ అన్నాడు అనురాధ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

“మనం కారు తీసుకోగానే, ఆల్ స్టేట్ ఇన్సూరెన్సు తీసుకో అని ఒకరు, స్టేట్ ఫార్మ్ ఇన్సూరెన్సు తీసుకో అని ఒకరు చెప్పారు కదా అప్పుడు మీ ఫ్రెండ్స్? మరి లైఫ్ ఇన్సూరెన్సు తీసుకోమని ఇంత వరకూ ఎవ్వరూ చెప్పలేదు” ఒక మంచి పాయింట్ లేవదీసింది అనురాధ

"అవునుకదా! అంతెందుకు మనం ఇల్లు తీసుకున్నప్పుడు కూడా హోమ్ ఇన్సూరెన్సు, అప్లియాన్స్ ఇన్సూరెన్సు తీసుకోమని ఎంత మంది చెప్పారు? అంటే మనం వస్తువులకి, కార్లకు, ఇంటికి ఇస్తున్న విలువ మనుషుల జీవితానికి ఇవ్వడం లేదు. ఏదో ఆఫీసులో కొంత కవరేజ్ ఉంటుంది కదా అని అనుకుంటాము, అది కొంత ఉపశమనం మాత్రమే కానీ పూర్తిభద్రత కోసం ఆలోచించడం లేదు" అన్నాడు అనూరాధని సమర్థిస్తూ.

"కొత్తగా ఉద్యోగంలో చేరినప్పుడో లేదా పెళ్లి చేసుకున్నప్పుడో ఈ ఇన్సూరెన్స్ ని తప్పనిసరి చేస్తే, ఈ రోజు ఎన్నో కుటుంబాలు గాలికి పడేవి కాదు" మరొక్క మంచి ఐడియా ఇచ్చింది అనురాధ.

"అవును కదా కరెక్ట్. నాకు ఈ ఆలోచనే రాలేదు. ఎవరు చెప్పినా చెప్పక పోయినా ఈ రోజు నుండి మనం ఈ కుటుంబ భద్రత ని ఆరెండు సందర్భాల్లో మన స్నేహితులందరికీ గుర్తు చేద్దాం!" ఒక ప్రాజెక్టు ప్లాన్ సిద్ధం చేసినట్టు అన్నాడు ప్రశాంత్.

చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్టు, దుర్ఘటన జరిగిన తర్వాత ఫండ్ రేజింగ్ ల ద్వారా ఇతరుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడటం కన్నా ముందే మొత్తం కుటుంబానికి భద్రత కల్పించడం చాలా అవసరం అని ఒక చేదు సంఘటన ద్వారా అర్థం అయ్యింది అనురాధ, ప్రశాంత్ లకి . మొత్తానికి పది మందికి ఉపయోగపడే ఒక పరిష్కారం దొరికినందుకు, దాన్ని తమ ఫ్యామిలీ తోనే మొదలు పెట్టబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది అనురాధకి. మనసు బాగా కుదుటపడింది.

అనురాధ కూడా తన ఆలోచనలకు అనుగుణంగా నడుచుకోవడం, ఇద్దరి నిర్ణయాలు ఒకటే కావడం ఆలోచించుకుంటే చాలా గర్వంగా ఉంది ప్రశాంత్ కి.

గుండెలనిండా హాయిగా ఊపిరి తీసుకుని, చాలా సంతృప్తి గా, ప్రశాంతంగా ఒక మంచి జీవన గుణపాఠాన్ని మననం చేసుకుంటూ , పొద్దున్నే ఒక పాలసీ తో తమ కుటుంబానికి భద్రతని ఊహిస్తూ హాయిగా నిద్రకుపక్రమించారు ప్రశాంత్ – అనురాధ

"రెండు నెలల క్రితం వచ్చిన ఇన్సూరెన్సు అమ్మాయి పేరేంటి? నంబర్ ఉందా? " అన్నాడు మెల్లిగా అనురాధ పడుకోలేదు అని తెలిసి. దాదాపు రాత్రి పన్నెండు అయిపోయింది, అయినా అంత తొందరగా నిద్రపట్టడం లేదు ఇప్పుడు ఇద్దరికీ.

“అవంతిక , నంబర్ కూడా ఉండే ఉంటుంది” అంది కళ్ళు మూసుకొని.

“రేపు మొట్ట మొదటి టాస్క్ , ఆ అమ్మాయికి ఫోన్ చేసి రమ్మను, ఇన్సూరెన్సు పాలసీ చేయడానికి సిద్ధంగా ఉన్నాము అని చెప్పు “ అన్నాడు కొంచెం నిద్ర నటిస్తూ.

# ఒన్స్ ఇనె లైఫ్ టైమ్ జర్నీ

జోగేశ్వర్ చల్లపల్లి

ఆదివారం ఉదయం 7 గం. ల కల్లా లేచి, పెరట్లో కుర్చీలేసుక్కూర్చుని, పూల మొక్కలను చూస్తూ, వేసవి కాలం సూర్యుడు చెట్ల చాటునుంచి తొంగి చూసే వాతావరణం లో కాఫీ నెమ్మదిగా తాగుతూ ఆనందించటమంటే నాకు చాల ఇష్టం. మా వారు కూడా నాతో పాటే పక్కన కూర్చుని ఆ రోజు వార్తలు చదువుకుంటూ, అప్పుడప్పుడు కొన్ని వార్తల మీద వ్యాఖ్యానం చేయటం, నేను “ఊ” అంటూ వినటం మాకు అలవాటు.

ఈ రోజు కూడా అలాగే నడుస్తోంది ఇప్పటివరకు. ఇంతలో ఆయన ఉన్నట్టుండి లేచి పక్కనున్న పూల కుండి వైపు నడిచి వెళ్ళారు. ఆ పక్కన ఓ చిన్న పుల్ల ముక్క ఉంటే, దాంతో కుండిలో మట్టిని కెలకడం మొదలెట్టారు.

“ ఏమిటండి, ఏమయింది? ” అని అడిగాను కానీ, సమాధానం చెప్పకుండా వచ్చి పక్కన కుర్చీలో కూర్చున్నారు.

కాసేపయిన తరువాత, “ఏమిలేదు, ఆ తులసి కుండి లోంచి ఎదో చిన్న జంతువు, పక్కన పూల కుండీ లోకి దూకి నట్టనిపించింది. నేను న్యూస్ పేపర్ లోంచి కొద్దిగా తలెత్తే సమయానికి అదలా దూకటం చూసాను” అన్నారు.

“ఆ అంతా మీ భ్రమ. ఏదో చిన్న ఫ్లై అయి ఉంటుంది లెండి” అని సర్ది చెప్పాను.

“కాదోయ్! నా అనుమానం నిజం అయితే, అది ఒక ఎలుక పిల్ల అయిఉండాలి” అన్నారు.

“అయ్య బాబోయ్ ఎలుకా? నాకు ఒళ్ళు జుగుల్పు పుడుతోంది, ఎంత పెద్దదండి?” అంటూ గబాగబా ఇంట్లోకి వెళ్ళటం మొదలెట్టా.

నాకు ఎలుకలంటే అసహ్యం. నేను ఎం.స్సీ చదివేరోజుల్లో, బయాలజీ లేబ్ లో ఎలుకల్ని హేండిల్ చేసాంగాని, అప్పుడవి బోనుల్లో ఉండేవి. దాని తిండిలో ఏదో మందుపెట్టి ఇచ్చేవాళ్ళం. అది తిన్నాక, దాని రియాక్షన్ రికార్డ్ చేయటం, అంతవరకే. ఇలా ఇంట్లో, అదే పెరట్లో, విచ్చల విడిగా తిరుగుతూ ఉంటే భయమేస్తుంది.

ఆయన మౌనంగా ఇంటర్నెట్లో, ఎలుకల బోనుల కోసం వెతకటం మొదలెట్టారు.

“ఈ బోన్లు ఎలాటివో తెలుసా! ఒకసారి బోనులోకి ఎలుక వెళ్లిందంటే, ఓ రంపం దాని మెడ మీదో, పొట్టమీదో గట్టిగ దిగపడిపోతుంది. దాంతో అది కదలలేక, ఒక్క సారి చచ్చి వూరుకుంటుంది. పాపం తిండి కోసం అది వెతుక్కుంటుంటే, దాన్నిమోసం చేసి, అలా హింసపెడుతూ చంపడం బాధగా ఉంటుంది. బోను వద్దండి ” అని ఆయనకు నచ్చచెప్పటానికి ప్రయత్నించాను.

“అదికాదోయ్. ప్లాస్టిక్వి ట్రాన్స్పరెంట్గా ఉండి, ఎలిక పడ్డాక అది ఎలా ఉందొ చూడొచ్చు. ఇవి చూడు. క్యాచ్ అండ్ రిలీజ్ అంటారు” అని, “ ఇదేదో వర్డు ఇల్లీగల్ ఇమ్మిగ్రెంట్స్ గురించో, క్రిమినల్స్ గురించో టీవీలో విన్నట్టు అనిపిస్తోంది.” వ్యాఖ్యానించారు .

“తరువాత చూద్దాం లెండి” అనిమాట దాటేసాను.

“సరే ఉన్నరకాలు చూపించాను, ఆ తరువాత నీ ఇష్టం. ఏది కావాలో నువ్వే ఆన్లైన్లో ఆర్డర్చేసుకో” అంటూ ఆయన తన పని మీద వెళ్లి పోయారు.

ఇంతలో వినాయక చవితి వచ్చింది. అందరి లాగా నేను కూడా బంక మన్ను కొనుక్కుతెచ్చుకుని, ఆన్లైన్లో వినాయకుడి విగ్రహం చేయడం ఎలా, ప్రోగ్రాం చూస్తూ విగ్రహం చేయడం మొదలు పెట్టాను. వినాయకుడి విగ్రహం

అయిన తరువాత, చిన్నఎలుక బొమ్మ చేయడం చూపిస్తున్నాడు. అది చేస్తూ ఉండగా అనిపించింది, "మూషిక వాహనం" అంటూ వినాయకుడితో పాటు ఎలుకని కూడా పూజిస్తాము. మరి అది ఇంట్లో గాని ఇంటి చుట్టుపట్ల గాని కనిపించిందంటే భరించలేము. ఏమిటో మన నమ్మకాలు అనుకుంటూ ఉండగా ఆయన వచ్చారు.

"బాగుందోయి నీ వినాయకుడి విగ్రహం. ఆహా, మూషిక వాహనంకూడా చాలా బాగా చేసావే. మన పూజలకు మెచ్చి పోయి ఇంట్లో తిష్ట వేసుకు కూర్చుంటుందేమో చూసుకో" అంటూ వేళాకోళం పట్టించారు.

"ఏమో, నేనయితే దాన్నింతవరకు చూడలేదు. నిజంగా ఎలుక కాదేమోననిపిస్తోంది" అన్నాను.

"ఖచ్చితంగా ఎలుకే! నేను దాన్ని తరవాత మరోసారి ఆ గోడ కంత లోకి వెళ్లడం చూసాను. దాన్ని పట్టుకోడానికి మన కుక్కనైనా వదలాలి, లేకపోతే పిల్లినైనా పెంచాలి" అన్నారు.

"చాల్లెండి, దానికోసం ఇప్పుడో పిల్లిని పెంచాలా! పిల్లులంటే నాకసహ్యం అని తెలీదూ" కాస్త విసుక్కున్నాను.

"కాపీన సంరక్షణార్థం హయం పటాటోపహా" అంటూ ఆయన నవ్వారు.

ప్రతిరోజు ఉదయం స్నానం చేసిన తరువాత తులసికుండి దగ్గర దీపారాధన చేసి నమస్కారం చేసుకోవటం నాకలవాటు. వినాయక చవితి పండగ అయిన తరువాత నేను పెట్టిన దీపారాధన కుందె నేల మీద పద పడి ఉండటం గమనించాను. ఇదేదో ఎలుక చేస్తున్న పని కాదు కదా అనిపించింది. మరో వారం రోజులు గమనించాను. ప్రతిరోజూ కాక పోయినా , చాల రోజులు కుందె కింద పడి ఉండటం గమనించాను.

"లాభం లేదండి. దాన్ని ఏదో రకంగా పట్టుకోవాల్సిందే" నా నిర్ణయం చెప్పేసాను.

" నీ వరకు వస్తే గాని కాలు ముందుకు వేయవన్నమాట." అంటూ బోన్ల రకాలు మళ్ళీ చూపించి "ఇందులో ఎలాంటిది కావాలో నువ్వే నిర్ణయించుకో" అన్నారు.

"మీరేచూడండి. పాపం దాన్ని మాత్రం చంపకూడదు."

"ఇదిగో ఈ బ్రాండు ఆర్డరు చేద్దాం. ప్లాస్టిక్ తో చేసినవి. జస్ట్ ట్రాప్ చేస్తుంది అంతే. తరువాత దూరంగా తీసుకు వెళ్లి వదిలేయచ్చు. ఖరీదు కూడాతక్కువే. చైనా లో చేసింది కూడా కాదు" వ్యంగంగా నవ్వుతూ ఆయన సలహా ఇవ్వటం, ఆర్డర్ చేయటం, రెండురోజుల్లో అవి ఇంటి ముందు ఉండటం అన్నిజరిగి పోయాయి.

శనివారం:

ప్యాకెట్ తెరిచి అందులోంచి రెండు బోన్లు బయటకు తీసి కాగితం మీద రాసివున్న సూచనల ప్రకారం ఛీజ్ ముక్కలను పెట్టి వాటిని సిద్ధం చేసారు. ఆయనకి మంచి సరదాగా ఉన్నట్టుంది దాన్ని పట్టుకోవడం.

" ఎలుకా ! (చూడు) నా మజాకా " అంటూ దీర్ఘాలుతీస్తూ , "చూసావా 'నా' అనే అక్షరాన్నిముందుకు లాగేటప్పుడికి సరదా అంతా నాదయింది" అంటూగెంతలేయ్య సాగేరు.

"ఏంటో అర్థం కాలేదు కానీ, మీరు సరదా పడటం మాత్రం బాగుంది" అన్నా.

"అదేనోయ్, మొన్న చూల్లా 'ఏలికా మజాకానా ' అన్న సినిమా. అందులో చివరున్న'నా' అక్షరాన్ని ముందుకు లాగానన్నమాట" తన వెధవ తెలివితేటలకు మురిసి పోసాగారు.

రెండు బోన్లులో ఒకటి తులసి కుండి దగ్గర, రెండోది దూరంగా గోడ పక్కన ఉంచారు నా సలహా ప్రకారం.

ఆదివారం:

-------------

నా కంటే ముందే లేచి పెరట్లోకి వెళ్లారు. నేను లేచి కాఫీ చేసి తీసుకు వస్తుండగా, గుప్పిట మూసుకుని వస్తూ "ఎస్" అంటూ గుప్పిట చూపించసాగేరు.

"ఏమిటి? " అని అడిగే లోపునే గుప్పిట చూపించి "దొరికింది" అన్నారు.

" ఏంటి బోనులో పడిందా!, ఏంటి ఖర్మకాలి గుప్పిట్లో తీసుకు రాలేదు కదా " అంటూకంగారుపడ్డా.

ఒకసారి దొడ్లోకి పాము వస్తే దాన్ని చంపి, చచ్చిన దాన్ని మెడలో వేసుకుని శివుడు ఇలాగే వేసుకుంటాడు అంటూ తిరిగిన పిచ్చ మొగాడు అనితెలుసు. అలాంటి పనేదో చెసాడేమోనన్న భయం వేసింది.

"లేదు లేవోయ్, కింద బోనులో ఉంది". అని గుప్పిట విప్పి చూపిస్తూ "త్వరగా కాఫీ తాగి తయారవు. ఊరుకు దూరంగా తీసుకు వెళ్లి వదిలేద్దాం" అన్నారు. " పాపం అది ఎప్పుడు బోనులో పడిందో, ఎంత కంగారు పడుతోందో ఏమిటో ! చిన్న పిల్లలాగుందోయ్. దానిపెద్ద దిక్కెక్కడుందో" అంటూ కాస్త జాలితో నిట్టూర్చారు.

"నిజమేనండి. ఊరు చివర వదిలేసి వస్తే పాపం బతగ్గలదో లేదో ఏంటో" కాస్త బాధేసింది.

"మంచి చిక్కులో పడి పోయామోయ్. పిల్ల కదాని వదిలేస్తే, మనం పెట్టిన చీజ్కి అలవాటుపడి ఇంటి చుట్టూ తిరగొచ్చు. ఎలికలుంటే వాటి కోసం పాములు రావచ్చంటారు. అప్పుడు మనం భయం భయంగా బతకాలి. చట్ ! చిన్నదీలేదు, పెద్దదీలేదు, అది మన చుట్టు పక్కల ఉండటం అంత మంచిది కాదు. బయట వదిలేసి రావటమే మంచిది. దానికి ఎంత రాసిపెట్టి ఉంటే అంతే బతగ్గలదు, ఇంకేం ఆలోచించక బయలుదేరు" అంటూ బోను తీసుకురావటానికి వెళ్లారు.

"దాన్ని నాకు మాత్రం చూపించకండి" అని నేను కూడా రెడీ అవటానికి ఇంట్లోకి వెళ్ళాను. నేను వచ్చేటప్పటికి కారులో రెడీగా ఉన్నారు. నేను ఎక్కగానే తెలుగు సినిమా పాటలు పెట్టి పాడుకుంటూ బయలుదేరారు. కొంత దూరం పోయిం తరువాత ట్రాఫిక్లైట్ల దగ్గర ఆగినప్పుడు, నా వైపు చూసి " It's a one in a life time journey" కదా " అన్నారు.

"అంటే? " కుతూహలంగా ఆయన వైపు చూసాను.

“అదేనోయ్. ఆ ఎలలుక ఎప్పుడన్నా కార్ ఎక్కుతా ననుకుందా ? కారు ఎక్కడం ఒక అదృష్టం అయితే మనతో ప్రయాణం చేయటం మరో అదృష్టం. ఎక్కడికి వెడుతోందో దానికి తెలియదు. కొన్ని నిముషాల్లో ఎం జరగబోతోందో తెలియదు. ఈ బోనులోంచి ఎలా బయట పడాలో తెలియదు. ఎవరో వస్తారు, తన్ని రక్షిస్తారు అని ఆలోచించటంతప్ప. పాపం ఏం పాలుపోక బిక్కుబిక్కు మంటూ కూర్చుని ఉంటుంది. ఏదిఏమయినా ” It is a one in a lifetime journey” అని అదేమాట మళ్ళీ అన్నారు.

“ దాని గురించే మరచి పోయాను.ఏది, ఎక్కడ పెట్టారు?” అని కంగారు పడుతూ, నా కాళ్ళ దగ్గర చూసుకున్నాను.

“కంగారుపడకోయ్. క్షేమంగా డిక్కీలో ఉంది. ఏం బయటకు రాదులే, కంగారు పడకు “ అనిసర్దిచెప్పారు.

ఊరి బయటకు వచ్చిన తరువాత, ఒక చెట్టు కింద కారాపి , బోనుతీసుకు వెళ్తూ “ బోనులో వున్న చీజ్ ముక్కలు కూడా ఇస్తాలే” అంటూ దానితో మాట్లాడుతూ తీసుకు వెళ్ళారు.

తిరిగొచ్చి “ now it is in its wild life” ఇక దాని ఖర్మకి దేవుడెలా రాసిపెట్టి ఉంటె అలా జరుగుతుంది. ఫ్రీగా బతగ్గలదో, లేక దేనికయినా ఆహారం అయి పోతుందో ఏం చెప్పగలం “ అంటూ నిట్టూరుస్తూ కారెక్కారు.

“ దానికి ఛీజు ముక్కలు ఇస్తానన్నారు గదా, ఏం చేశారు?” ఎం జరిగిందో వినాలనిపించింది.

“ బోను మూత ఓపెన్ చేయగానే ముందు కాస్త జంకింది. తరువాత ఒక్కసారి బయటకి దూకి తుర్రు మని సెకనులో మాయమయింది. మళ్ళీ అది ఆ ప్రాంతానికి తిరిగి వస్తే గిస్తే తింటుందిలే అని ఒక ఆకు లో వేసి పెట్టా . అంత కంటే ఏం చేయగలం” అన్నారు కార్ స్టార్ట్చేస్తూ.

" భగవద్గీత లో భగవానుడు ఏం చెప్పాడు. నువ్వు చెయ్యాల్సింది, చెయ్యగలిగింది చెయ్యి, ఆ తరువాత ఫలితం నేను చుపిస్తాను. అన్నాడా. అలాగే, నేను చేయాల్సింది చేశాను. ఆపైన ఆయన ఇష్టం. ఆ మూషికానికి ఏం జరగాలని ఉందొ భగవంతుడే నిర్ణయిస్తాడు." అన్నారు.

" ఆ మాటలు వేరే సందర్భంలోవి గాని మీరిక పదండి. షాపు లో కాసిని సరుకులు కొనుక్కుని వెడదాం" అన్నా కాని , నా మనుసులో కూడా కొంచం అశాంతిగ ఉన్నట్లనిపించింది.

డ్రైవ్ చేస్తూ ఉన్నట్టుండి నా వైపు తిరిగి "మనం ఇంటికి వెళ్ళేటప్పటికి అది తిరిగి ఇంటికి వచ్చేసుంటే భలేగా ఉంటుంది కదా, ఆ ఎలుక సినిమా లో లాగా!" ఆయన లో కొద్దీ హుషారు కనిపించింది.

" అదే అని ఎందుకనుకోవాలి, వాళ్ళమ్మో, మరో పిల్ల అయినా అయి ఉండచ్చు గదా. పెద్ద ఫామిలీనేమో" తోడు పలికాను.

"మళ్లి బోన్లు పెట్టడమే. "They all get their lifetime journey." అంటూ కిరాణా షాప్ ముందు కారు ఆపారు.

## సితార సోమ సుధేష్ణ

ఐశ్వర్య కిటికీ లోంచి ఇంటి వెనక కనబడే పూల చెట్లను తదేకంగా చూస్తూ కూర్చుంది. 'సుదూరంలో ఆకాశం, భూమి అంచులు కలిసి పోయిన చోట బంతి ఆట అడుకుంటున్నావా సితారా! నా చేతులారా నిన్ను దూరం చేసుకున్నాను. సితార అని నిన్ను నా మనసార పిలుచుకోక ముందే వెళ్లి పోయి ఆ తారలతో ఆడు కుంటున్నావా!! అమ్మా

అని పిలవక ముందే వెళ్లి పోయావా!!' చెట్ల ఆకుల మధ్యలోంచి సుదూరంగా కనిపించే అర చేయంత ఆకాశాన్ని చూస్తున్న ఐశ్వర్య కళ్ళల్లోంచి రెండు కన్నీటి బొట్లు రాలాయి.

ఉదాసీనంగా ఉన్న ఐశ్వర్యను వదిలి ఇండియా వెళ్ళాలంటే ప్రమీలకు మనసు ఒప్పుకోవడం లేదు.

"ఏమండీ! ఇంకొన్నాళ్ళు మనం ఇక్కడే ఉండడానికి ప్రయత్నం చేయండి. ఉల్లాసంగా తిరిగే బిడ్డ అలా పాలి పోయిన మొహంతో ఎప్పుడూ పరధ్యానంగా ఉంటోంది. దాన్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందండి." వేదనగా భర్తతో అంది ప్రమీల.

"వీలవుతే ఉండమ్మా! నువ్వు పదిసార్లు చెప్పాల్సిన పని లేదు. నాకు మాత్రం ఉండాలని లేదా! ఐశు బాధ నాకూ అర్థం అవుతోంది. ఎక్స్ టెన్షన్ ఇవ్వడం లేదు. మన కారణాలు ఈ అమెరికన్లకు అర్థమయి చావవు. 'నో' అనేస్తారు. ఐశు ఇప్పుడు ఇండియా రావడానికి కూడా కుదరదు. గ్రీన్ కార్డ్ కు అప్లై చేసారు ఆ కార్డు వచ్చే వరకు ఈ దేశం నుండి కదలడానికి వీల్లేదాయే." శరత్చంద్ర పైకి చిరాకుగా అన్నాడే కాని అతని మనసులో కలతగా ఉంది.

"ఆ దేవుడి మీద భారం వేస్తున్నాను." కంట నీరు పెట్టుకుంది ప్రమీల.

'మొదటి కాన్పుకే నా బిడ్డకు ఇంత కష్టం వచ్చింది.' తల్లి మనసు గగ్గోలు పడింది. ఇండియా వెళ్లి పోయే రోజులు దగ్గర కొచ్చాయి. కూతురిని నీడలా అంటి పెట్టుకుని హిత భోధ చేస్తూనే ఉంది ఆ తల్లి.

"నీ వయసెంతని అలా బెంబేలు పడతావు. పుట్టగానే పోయినా పేగు తీపి కదా! బిడ్డ ఆయుష్షు నిండింది. బాధ ఉంటుంది. మన చేతిలో ఏముంది చేయడానికి, ముందు నువ్వు కోలుకోవాలి ఐశూ."

"నేను బానే ఉన్నాను మమ్మీ."

"నువ్వు ఇలా సరిగ్గా తినకుండా, నిద్ర లేకుండా ఉంటె ఇక్కడ ఎవరున్నారు నిన్ను చూసుకోవడానికి? పవన ఎన్ని రోజులు పని మానేయగలడు చెప్పు! నీకు దగ్గరలో మన వాళ్ళంటూ ఎవరూ లేరు. ఈ దేశంలో అందరూ వీకేందుకే కనిపిస్తారు. నీ మనసులో బాధను నువ్వే తీసేసుకోవాలి." మాటలు గాలిలో తేలి పోయినా ఏదో ఒక మాట ఐశ్వర్యలో మార్పు తెస్తుందనే ఆశతో వదలలేక ఇండియా వెళ్లి పోయారు ఆ దంపతులు.

ఐశ్వర్య మనసులోని భావాలన్ని ఒక మంచు ముద్దలా మారి ఆ మంచు ముద్దపై బంగారు పాప కళ్ళు విప్పి ఐశ్వర్యను చూస్తోంది. చిన్నారి చేతి వేళ్ళు కదులుతున్నాయి. కారణం లేకుండానే చిరు నవ్వు నవ్వుతోంది. మొఖమంతా వెలుగే. మంచులో కనుమరుగవుతున్న పాపను ఎత్తుకోవాలని ఐశ్వర్య మనసు పరి తపించింది. అజ్ఞానంతో పాపను దూరం చేసుకున్నానని కుమిలి పోయింది. పవన్ పరిస్థితి మరీ బాధాకరంగా ఉంది. మనసులో పాప దక్కలేదనే బాధ ఒకవైపు, ఐశ్వర్య మనఃస్థితిని చూడలేక కలిగే బాధ మరోవైపు. పవన్ పేరెంట్సు వీసా సమస్య వల్ల అమెరికా రాలేక పోయినా తరుచుగా ఫోను చేసి ఐశ్వర్యకు, పవన్ కు ఓదార్పు మాటలు చెప్తూనే ఉన్నారు.

"పాపకు ఆయుష్షు లేకపోతే మనమేమి చేయగలము. బతికించడం మన చేతిలో పనికాదుగా! వయస్సులో ఉన్నదానివి ముందు ముందు నీకు పిల్లలు పుడతారు. నీ ఆరోగ్యం బావుండేట్టు చూసుకో." అత్త చెప్పిన మాటలు వినడమయితే వింది కానీ ఐశ్వర్యలో ఏ మార్పు రాలేదు.

ఒక శనివారం రోజు, "ఐశూ! సినిప్లేక్స్లో నీ ఫేవరేట్ దీపిక పెడుకోన్ మూవీ ఉంది. నీకు హిందీ మూవీ ఇష్టం కదా! వెళ్దామా?" ఐశును ప్రసన్నం చేయడానికి పవన్ సరదాగా అన్నాడు.

పక్కనే కూచున్న పవన్ను చిరాగ్గా చూసి ఐశు చటుక్కున లేచి, "నేను రాను. నువ్వెళ్ళు." అంటూ లేచి వెళ్ళి పోయింది. ఏం చేయాలో తెలీక పవన్ నీరస పడి పోయాడు.

ఓపికగా ఐశులోని ఉదాసీనతను, నిరాసక్తతను తొలగించాలని పవన్ చేసే ప్రయత్నాలన్నీ ఐశూలో ఏ స్పందన తీసుకు రాలేదు. ఉలుకు, పలుకు లేని మనిషి మనసులో ఏముందో ఇతరులకు ఎలా తెలుస్తుంది. అడగనిదే అమ్మైనా పెట్టదని సామెత అందుకే వచ్చిందా! ఐశుకు ఎవరినీ కలవడం ఇష్టం లేదు, ఎక్కడికి వెళ్ళడం ఇష్టం లేదు. ఫెమిలీ డాక్టరు రిఫర్ చేసిన సైకియాట్రిస్తును చూడ నంటుంది. దేవుడిపై భక్తీ, నమ్మకం పూర్తిగా చెరిపేసింది. ఆరునెల్లు గడిచి పోయాయి. పవనులో కూడా ఓపిక నశించి పోతోంది. ఆఫీసు నుండి అలసిపోయి ఇంటికి రాగానే ఐశూని చూసి మరింత దిగాలు పడ్తున్నాడు.

"పుట్టిన బిడ్డ చనిపోతే భర్తను ఏడిపిస్తుందేమిటి! ఒకరినొకరు ఓదార్చుకోవాలె గాని ఈ విధంగా భర్తను దూరం చేసుకుంటుందా! ఇలా భర్త మొహం చూడకుండా ఆడది ఇల్లు ఏం చూస్తుంది, సంసారం ఏమి చేస్తుంది! బాధ కొంత కాలం ఉంటుంది కాని జీవితమంతా బాధకే అర్పిస్తానంటే సంసారానికి పనికి రాదు. ఆమె తల్లి దండ్రుల దగ్గరకు పంపించు. ఆ తిప్ప లేదో వాళ్ళే పడతారు. విడాకులు తీసుకో పవన్. మరో అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకుందువు." ఇంటా, బయటా అన్ని పనులు చూసుకుంటూ కష్ట పడే కొడుకు కోసం తల్లడిల్లింది పవన్ తల్లి.

"అమ్మా! నేను ఇష్టపడి ఐశూను పెళ్ళి చేసుకున్నాను. అందరి బాధ ఒకే రకంగా ఉండదు. ఇంత చిన్నవిషయానికే విడాకులు అని మాట్లాడొద్దు అమ్మా. ఐశుది సెన్సిటివ్ మనసు అందుకే బాధ ఎక్కువగా ఉంది. నా గురించి మీరేం బాధ పడకండి. నేను ఎలాగో మేనేజ్ చేసుకుంటాను. అన్నీ త్వరలోనే సర్దుకుంటాయి." తల్లికి నచ్చ చెప్పాడే కానీ లోలోన హోప్లెస్ గా ఫీలవుతున్నాడు. సితార గురించి మాట్లాడితే బాధ వెలికి వచ్చి మనసు తేలిక పడ్తుందని చాల సార్లు ప్రయత్నించి విఫలుడయ్యాడు.

"బిడ్డ పోయి సంవత్సరం కావస్తోంది కానీ మీ అమ్మాయి ఇంకా కోలుకోలేదు. నా కొడుకును గాలికి వదిలేసింది. ఇంటి పని చేయదు. సంసారం చేయదు, సంతోషంగా ఉండదు. మీ బిడ్డను తెచ్చుకొని మీ దగ్గరే ఉంచుకోండి. నా కొడుకు జీవితం ఎడారి చేస్తోంది." అంటూ పవన్ పేరెంట్స్ పెట్టె పోరు పడలేక ప్రమీల ఐశూ చెవిని

ఇల్లు కట్టుకొని చెప్తూనే ఉంది. బిడ్డ బ్రతుకేమవుతుందా! అని కంట నీరు పెట్టింది. ఆశించని తీరుగా ఉన్నట్టుండి రెండు నెలల తర్వాత పవన్ ఐశుని తీసుకుని ఇండియా వచ్చాడు.

పవన్, ప్రమీల, శరత్చంద్రల మధ్య చాలా సేపు తర్జన, భర్జనలు జరిగాయి. ఐశ్వర్య మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు తనకెమీ పట్టనట్టు అంతఃముఖి అయిపొయింది.

"మీ దగ్గర ఉంటె ఐశు కాస్త కోలు కుంటుందేమో!" అంటూ పవన్ ఐశూకు వినబడేట్టు కాస్త పెద్దగా అనేసి వెళ్లి పోయాడు.

ఒక సంవత్సరం క్రితం –

దీపావళి పండుగకు రెండు నెలల ముందుగా సితార పుట్టింది. సితార పుట్టిన రెండు నెలలకే చనిపోయింది. కానీ ఆ ఇంట్లో దీపావళి జరుపు కోలేదు. అలంకరణలు లేవు, ఇల్లంతా చీకటి – ఇల్లే కాదు అందరి మనసులోనూ చీకటి విస్తరించుకుంది. ఆ తర్వాత వాళ్ళకు దీపావళి పండుగ రానేలేదు, ఆ ఇంట్లో ఏ పండగ జరగలేదు. ఇల్లంతా చీకటి– నిశ్శబ్దం– మనసులను బద్దలు చేసే నిశ్శబ్దం. జీవితాలను ఐసులా నిశ్చేతనులను చేసే నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో నడిచే రాతి బొమ్మలా బతుకుతోంది ఐశు. ఏం జరిగింది!

అ రోజు సితారాను రెండు నెలల రొటీన్ చెకప్ కోసం డాక్టర్ దగ్గరకు తీసికెళ్ళింది ఐశు. పీడియాట్రిస్ట్ చెకప్ చేసి,

"పర్ఫెక్ట్ గా ఉంది. సితార బరువు పెరిగింది. గుడ్! షి ఈజ్ ఎ హేల్తి బెబీ."

డాక్టరు మాటలు విని ఐశ్వర్య సంతోషంగా బిడ్డను ముద్దు పెట్టుకుంది. ఆడుతూ పాడుతూ గంతులేసే సితార కళ్ళముందు కదిలింది.

మరునాడు ఉదయం నాలుగ్గంటలకు అలారం మోగింది. సగం తెరిచిన కళ్ళతో యాంత్రికంగా సితారాకు పాలు పట్టే వేళ్ళయిందని ఆవలింత తీస్తూ లేచింది ఐశ్వర్య. పక్కనే ఉన్న గ్లాసులోంచి రెండు గుటకల నీళ్ళు తాగి కళ్ళు పూర్తిగా తెరిచి క్రిబ్ దగ్గర కెళ్ళింది. సితార క్రిబ్లో ఒక మూల పైన కప్పిన షీట్ అంతా చుట్టుకుని చిన్న మూటలా కనబడింది.

"చిన్ని సితార! షీట్ అంతా లాగేసి నీ తల చుట్టు అలా కప్పుకున్నావేంటి. దోబూచు లాడుతున్నావా! చలిగా ఉందా? ఈ షీట్ తీసేసి మందంగా ఉన్న బ్లాంకెట్ కప్పుతాలే. ఇంత కదలిక ఎలా వచ్చింది నీకు!"

ముద్దుగా అంటూ సితార తలపై చుట్టుకు పోయిన షీట్ను తీసి బిడ్డను చేతిలోకి తీసుకుంది. సితార శరీరాన్ని తాకగానే ఐశు కెవ్వున కేక వేసింది. సితార శరీరం ఐసు ముద్దలా ఉంది. ఐశ్వర్య కేక విని పవన్ కళ్ళు తెరిచి

ఒక్క పెద్ద అంగ వేసి బెడ్ కు కొంచెం దూరంలో గోడవారగా ఉన్న క్రిబ్ దగ్గరకు చేరాడు. నిమిషాలలో అంబులెన్సు వచ్చింది. సితరాను ఏమర్జెన్సీ రూమ్కు తీసికెళ్ళారు. కానీ అప్పటికే సితార లోకం వదిలి వెళ్లి పోయింది.

"సారీ! నథింగ్ కెన్ బి డన్." వైద్యుని మాట. ఏమి జరిగిందో తెలీక పిచ్చివాళ్ళలా ఉన్న పవన్ను, ఐశ్వర్యను కొన్ని పశ్నలడిగాడు డాక్టరు ఆ తర్వాత,

"ఇది సడెన్ ఇన్ఫెంట్ డెత్ సింద్రోమ్ – యస్ ఐ డి యస్." అన్నాడు.

పాలిపోయిన మొహాలతో నిలబడ్డ ఆ యువ దంపతులను కాస్త దూరంలో ఉన్న రూములోకి తీసికెళ్ళి కూర్చోబెట్టి వెళ్లి రెండు నీళ్ళ సీసాలు వాళ్ళకిచ్చి "తాగండి" అన్నాడు. నా ఒడిలో ఉన్న బిడ్డ మాయమైందా! అదెలా!! నాకు తెలియకుండా ఎవరు లాక్కున్నారు!! ఐశ్వర్య మనసు గగ్గోలు పెట్టింది.

"పసి పిల్లలను పొట్టమీద పడుకోబెట్టడం, పైన షీటుతో కప్పడం లాంటి అలవాటు చాలా కాలం క్రితం ఉండేది. నేనే కాదు ఏ డాక్టరైనా పసి పిల్లలను వెల్లకిలా పడుకో బెట్టమనే చెప్తాం. కడుపు నొప్పి, గ్యాస్ సమస్య ఉన్న పిల్లలను కూడా బోర్ల పడుకో బెట్టమని చెప్పను. అంతేకాదు బేబికి పైన ఏమీ కప్పగూడదు. చాల ప్రమాదం. చిన్న చిన్నబొమ్మలు, వస్తువలు ఏవీ కూడా క్రిబ్లో ఉంచ కూడదు. చలిగా ఉంటె మందంగా ఉన్న నైట్ డ్రెస్ వేయాలి కానీ పైన ఏమి కప్పగూడదు."

"చలిగా ఉంటుందని షీట్ కప్పాను." నూతిలోంచి వస్తున్నట్టుగా ఉంది ఐశ్వర్య మాట.

పవనుకు తల దిమ్ముగా ఉంది. "నేను కూడా ఎన్నోసార్లు కదిలి పోయిన షీటు పాపపైన సరి చేస్తుమ్నాను." అంటూ తల పట్టుకున్నాడు.

"ఇప్పుడు మీరు బ్లేం గేమ్ ఆడి ఏమీ చేయలేరు. బేబికి ఆ వయస్సులో గాలి ఆడక పోతే తల తిప్పి ఊపిరి తీసుకోవాలని తెలీదు. కాళ్ళు చేతులు కదిలినప్పుడు కప్పిన షీటు చుట్టుకు పోయే ప్రమాదముంది. బోర్లా పడుకున్నపుడు కూడా ఉపిరాడదు. అది ప్రమాదమే కదా! ఆరోగ్యం, అనారోగ్యం సంగతి అటుంచి సఫ్ఫోకేషన్ జరిగే అవకాశం ఉంది. ఐయాం వెరీ సారి ఫర్ యువర్ లాస్" డాక్టరు సానుభూతి తెలిపాడు.

డాక్టరు వివరంగా చెప్పాడు కానీ చాల ఆలస్యం అయిపోయింది. ఇద్దరూ ఎదో కలలో వింటున్నట్టు సుషుప్తా వస్థలో ఉన్నారు. సితార లేదు, వెళ్లి పోయింది. వాళ్ళకు అర్థం కాలేదు.

"నాకీ జ్ఞానం ఎందుకు రాలేదు! నా మూలంగా నా బంగారు బిడ్డ ప్రాణాలు వదిలింది." ఐశ్వర్య తనను తాను నిందించు కుంది. 'నేను అమ్మను, నీ అమ్మను' అని కుమిలి పోయింది. ఐశు గుండె తునాతునకలైంది.

తన చేతుల్లోకి ఒరిగి పోయిన ఐశూ గుండె బీటు వింటూ అచేతనంగా అలాగే ఉండి పోయాడు పవన్. ఆనాటినుండి ఉదాసీనతలో అనాసక్తలా జీవించింది ఐశు. పవన్ ఇండియా తీసికెళ్ళి ఐశును పేరెంట్సు దగ్గర వదిలిన రోజు కూడా ఐశు మనసులోని మంచు కరగ లేదు.

"ఐశూ! వేరే పనుల మీద ధ్యాస పెట్టు నీ బాధ తగ్గుతుంది. పవను మనసు కూడా అర్థం చేసుకో. పాపకోసమే కాదు నీకోసం కూడా బాధ పడ్తున్నాడతడు. నీకొక పాపో, బాబో పుడితే అన్ని సర్దుకుంటాయి. జరిగి పోయిన రోజులు తిరిగి రావు. ఇలా జీవితాన్ని వృధా చేసుకోకు." తల్లి ఐశును ప్రేమతో ఓదార్చని రోజు లేదు.

★★★★★★★★

ఐశ్వర్య జీవితంలో ఇండియా వచ్చినా ఏ మార్పు లేదు . చూస్తుండగానే ఆరునెలలు గడిచి పోయాయి. ఒక నాడు ప్రమీల మందంగా ఉన్న ఒక కవరును ఐశ్వర్య చేతికందిస్తూ "పవన్ మళ్ళీ పెళ్లి చేసుకుంటున్నాడట, అందులో విడాకుల పేపర్లు ఉన్నాయట. సంతకం పెట్టి పంపించమన్నారు. పెళ్లి రోజు కూడా నిర్ణయించారట. "

"ఇప్పటి వరకు మీరిద్దరూ కలుస్తారనే ఆశ ఉండేది. పెళ్లి చేసుకుంటున్నాడంటే ఆ ఆశ కూడా చచ్చి పోతుంది.నీ బతుకు నీ చేతులారా పాడు చేసుకుంటున్నావు." ప్రమీల తల బాదుకుంటూ ఏడుస్తూ ఐశూకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

చదువుతున్న పుస్తకంలోంచి ఐశు తలెత్తి తల్లివేపు చూసి మళ్ళి పుస్తకంలోకి మొహం దూర్చింది.

"నువ్వింత రాయిలా తయారయ్యావేమిటి! నీకు పవను అంటే నీకెంత ఇష్టమో అది మరిచిపోకు!! బిడ్డ చనిపోతే నీ బతుకు బుగ్గిలం చేసుకుంటావా! పసిపిల్లలాగా తిను అంటే తింటావు లేకపోతే లేదు. మేమున్నంత కాలం సరే. మేము పోయాక నీ గతేం కాను! నీ అక్కను చూడు ఇద్దరూ పిల్లలతో కాపురం చేసుకుంటోంది. అక్క వస్తే తన పిల్లలను ఒక్క సారైనా దగ్గరకు తీసుకోవు. నీ స్నేహితులు అందరూ కాపురాలు చెయ్యటం లేదా. మంచి చెడ్డ అన్ని భరిస్తూ జీవితంలో ముందుకు పోవాలి. చిన్న, పెద్ద కష్టాలు అందరికి వస్తాయి. అంత మాత్రాన జీవితం వదులు కుంటామా! భరించడం నేర్చుకోవాలి. కష్టాలు ఎల్ల కాలం ఉండవు."

"నా తలరాత ఇలాగే ఉంది." పొడి మాటలు.

కళ్ళు తుడుచుకుంటూ, ముక్కు చీదుకుంటూ ప్రమీల నిస్సహాయంగా గదిలోంచి వెళ్లి పోయింది.

తల్లి గదిలోంచి వెళ్ళాక చదువుతున్న పేజీ పూర్తి చేసి ఐశ్వర్య లేచి వళ్ళు విరుచుకుంటూ మందంగా ఉన్న కవరును తీసుకుని విప్పి చూసింది. గబ గబా పేపర్లు తిప్పింది. అవి నిజంగా డివోర్సు పేపర్లే. మనసులో ఏదో గుచ్చు కున్నట్టుగా బాధ, గుండెల్లో పోటు ఎక్కువైంది. వెంటనే వెళ్లి డ్రెస్సర్ డ్రాయరులో వెతక సాగింది. పవన్ అమెరికా వెళ్లి

పోయే ముందు రోజు ఒక లెటరు ఐశ్వర్య చేతికివ్వ బోయాడు. ఐశ్వర్య తీసుకోలేదు. ఆ పక్కనే ఉన్నటేబులుపై పెట్టి వెళ్ళాక అది తీసి డ్రాయర్ లో పడేసింది.

"నీ మనసు మారుతుందని ఆశిస్తున్నాను. మన ఇద్దరిలో ఉన్న ప్రేమను ఇలా ధారుణంగా చంపేయడం న్యాయం కాదు." ఉత్తరం ఇస్తూ గాద్గాదికమైన గొంతుతో పవన్ అన్న మాటలు ఆ క్షణం మళ్ళీ వినిపించాయి.

ఐశ్వర్య ఒక్కొక్క డ్రాయరు తెరుస్తూ చూడ సాగింది. ఎంత వెతికినా కనబడడం లేదు. ఐశు మనసులో ఆరాటం ఎక్కువ య్యింది. 'ఈ డ్రెస్సరుకు ఇన్ని డ్రాయర్లు ఎందుకు పెట్టారో' విసుక్కుంది. ఓ గంట వెతికిన తర్వాత ఆ కవరు బట్టల మధ్యలో దొరికింది. 'విడాకులిస్తున్నాడు ఇక ఈ ఉత్తరం చూడటం ఎందుకు!' కోపంగా చింప బోయింది. ఐశ్వర్య మనసులో ఆరాటం. 'చదివి చింపితే' మనసు చెప్పే మాట విని చదవడం మొదలు పెట్టింది.

"నా ప్రియమైన ఐశూ! ఇలా నీకు రాయాల్సి వస్తుందని నేను కల్లో కూడా అనుకోలేదు. మనం ఒకరికొకరం మనసిచ్చుకున్నాక మన మధ్య ముఖః స్థంగా మాట్లాడుకోవడం, టెక్స్ట్ కొట్టడం తప్ప ఇలా మనసు లోతుల్లోంచి వచ్చే భావాలను కాగితం పై పెట్టె అవసరమే రాలేదు. నా మనసులోని భావాలూ నీకు చెప్పాలని ఉంది, కాని వ్రాయాల్సిన అవసరం వచ్చింది. సితారా పుట్టే వరకు మన కథ వేరు. అది ఆనందాల స్వర్గం. సితార వెళ్లి పోయాక అంధకారమయింది మన జీవితం. అందాల బొమ్మ సితార మనల్ని వదిలి పోయింది నిజమే కానీ

సితారను అపురూపంగా మన మనసులో దాచుకోవాలని మన జీవితంలో ఒక భాగంగా నిలుపు కోవాలని ఉంది.

సితారను తలుచుకుని కుంచించుకు పోయి దుఃఖంతో జీవితాన్ని నిర్జీవంగా చేసుకుంటే నీకు, నాకే కాదు మన కుటుంబ సభ్యులకు కూడా బాధగా ఉంటుంది. నాకది ఇష్టం లేదు. మనం నవ్వుతూ సితార గుర్తులను ప్రేమగా మననం చేసుకోవాలి. మన ప్రేమకు సితార ఆత్మ కూడా సంతోషిస్తుంది. మన ప్రేమకు గుర్తు అయిన సితారను బాధలో ముంచితే అర్థం ఉండదు.

ఐశూ! నువ్వు ఆలోచించు. మధ్య ఉన్న ప్రేమ ఇంతేనా! వంద ఏళ్ళు మనిద్దరం కలిసి జీవించాలని కలలు కన్నాం. ఇంతేనా మన ప్రేమ! కాదు, మన ప్రేమ అంత బలహీనం కాదు అని నా నమ్మకం. నీలోని ఈ విచార మబ్బులను ఒకసారి తొలగించి చూడు–మన ప్రేమ చాలా గట్టిది.

నీవు లేకుండా నా జీవితం శూన్యంగా ఉంది. అర్థం లేని బతుకులా ఉంది. నీవు కోలుకోవాలని ఆశించని రోజు లేదు. నువ్వు నవ్వుతూ నన్ను పలకరిస్తూ నా దగ్గరకు వచ్చే రోజు కోసం ఎదురు చూస్తూ ఉంటాను. మన జీవితంలోని స్వీట్ మెమోరీస్ ను నీ మదిలోంచి తీసివేయకు. నీ కోసం, నీ రాక కోసం ఎదురు చూస్తూ

ప్రేమతో నీ పవన్

ఆ ఉత్తరం చదువుతూంటే పవను మాటలు వెచ్చగా తగిలి మంచు గడ్డలా ఉన్న ఐశు మనసు కరిగి కళ్ళవెంట నీళ్ళు కారు తున్నాయి.

"మామ్!" అంటూ గట్టిగా ఏడుపు గొంతుతో తల్లి దగ్గరకు వేగంగా వెళ్ళింది.

"మామ్! పవన్ ... పవన్ పెళ్లి .." మాటలు రాక కన్నీళ్ళతో తల్లి చేతుల్లోకి వాలి పోయింది. కూతురిని ఎగాదిగా చూసిన ప్రమీల ఆనందానికి అంతులేదు. బాధా తప్తమైన కూతురి మొహం చూడగానే తల్లికి అర్థమయ్యింది. పవన్ వేసిన ప్లాను పనిచేసింది. కూతురిని గట్టిగా కావలించుకుని తనకు వచ్చే దుఃఖాన్ని ఆపుకోవడానికి ప్రయత్నించలేదు. తనూ ఏడ్చింది, సంతోషంతో.

★★★★★★★★

మూడేళ్ళ తర్వాత ఒక రోజు –

"డేకోలైట్సు కొనుక్కోచ్చానుగా ఏవీ?" పవన్ వారం రోజుల నుండి ఏదో ఒకటి వెతుకుతూనే ఉన్నాడు.

ఈశ పుట్టాక ఇదే మొదటి దీపావళి. ఇల్లంతా దీపాలతో వెలగాలి, ఈశ గది కూడా దీపాలతో అలంకరిస్తా నంటాడు. కాసేపు మేకులు, కాసేపు హేమ్మరు కోసం వెతుకుతున్నాడు. అవి దొరగ్గానే అలంకరణలు పూర్తి చేసాడు.

"టూ మచ్గా చేస్తున్నావు పవన్." ఐశ్వర్య ఈశను ఒక చేతిలోంచి మరో చేతిలోకి మారుస్తూ అంది.

"ఇది మొదటి దీపావళి. ప్రపంచం అందమైనదని, ఈశని ఆహ్వానిస్తోందని తెలిసేట్టుగా అన్ని సక్రమంగా అందంగా చేయాలి." గర్వంగా పవన్ చాతీ విరుచుకున్నాడు.

"ఈశకు ఇంకా నాల్గు నెల్లయినా నిండ లేదు ఇవన్ని ఏం తెలుస్తాయి! ఆకలేయగానే పాలు, వెట్ అవగానే డయిపర్ మారిస్తే చాలు ఈశకు అన్ని అందంగానే కనిపిస్తాయి." ఐశ్వర్య మాటలు వినకుండా పవన్ ఉషారుగా తన పని చేసుకు పోతూనే ఉన్నాడు.

"సితార కోసం ఇలాగె డెకోరేట్ చేస్తానన్నావు." బరువైన గొంతుతో అంది.

"సితార కోసం చేయాలనుకున్నాం నిజమే." అతని కంఠంలోని ఆర్ధ్రత ఐశ్వర్యను తాకింది.

"ఆ లైట్లన్నీ చారిటీకి డొనేట్ చేసాం. సితార ఇప్పుడు లేదు. ఇప్పుడు మనతో ఉన్న ఈశ కోసం, మన కోసం చేస్తున్నాను ఐశు." హుషారుగా అన్నాడు.

ఐశ్వర్య ఈశకు పాలు పట్టి కిటికీ దగ్గరకెళ్ళి నుంచుంది. కిటికిలోంచి కనిపించే అరచేయ్యంత ఆకాశాన్ని ఆర్తిగా చూసింది. ఎక్కడో దూరాలలో ఆకాశం భూమాతను హత్తుకునే చోట–అక్కడే ఈ లోకాన్ని వదిలి వెళ్ళిన వాళ్ళందరితో పాటు సితార కూడా ఆడుకుంటోంది! ఆ ఆలోచన ఐశ్వర్య మనసుకు హాయి నిచ్చింది. ఇప్పుడు సితార

ఉంటె ఇల్లంతా పరుగెత్తుతూ ఆడుకునేది. ఐశూలో మరో దీర్ఘ నిట్టూర్పు. మరో రెండు కన్నీటి బొట్లు. గుండె పొరల్లోంచి మరో జ్ఞాపకం – కాల్చిన కత్తి మొనల్లా దూసుకు వచ్చి కన్నీరై కారుతున్నాయి. జీవితం లోని

ఒడు దుడుకులను తట్టు కోవడం వల్ల వచ్చే అనుభవాలు మనుషులని పరిపూర్ణ మానవుణ్ణి చేస్తాయి. మనో సంఘర్షణ తీరగానే ఆత్మీయత రాగం పలుకుతుంది.

కాస్త చప్పుడుకే ఐశ్వర్య పరుగున క్రిబ్ దగ్గరకు పరుగెత్తింది. ఈశ క్రిబ్లో ఓ మూలకెళ్ళి మూటలా ముడుచుకు పోయింది. ఒక్క అంగలో వెళ్లి మూలుగుతున్న ఈశను ఎత్తుకుంది. ఈశ మొహమంతా ఎర్రబడింది. ధడ ధడ కొట్టుకుంటున్న గుండెతో, వణికే రెండు చేతులతో ఐశ్వర్య ఈశ మొహాన్ని తాకింది. వెచ్చగా తగిలింది. అప్పుడే నిద్దర లేచిన ఈశ వళ్ళు విరుచుకుంటూ పిడికిలితో మొహమంతా రాసుకుంటోంది. ఆ కదలిక చూసి ఐశ్వర్య మనసు కుదుట పడింది. అలా ఎత్తుకోవడం నచ్చలేదు గాబోలు దీప్తి కేర్ కేర్ మంటూ ఏడవడం మొదలు పెట్టింది. 'నీకు తాత శరత్చంద్ర కోపం వచ్చింది. తండ్రి పోలిక గాని తల్లి పోలిక గాని రాలేదు. వింటే నీ తాత మురిసి పోతాడు.' ఏడుపు లంఘించుకున్న ఈశను ఎత్తుకుని బాటిల్ వార్మర్ చూసింది. టెంపరేచర్ సెట్ చేసి ఉంది అయినా తన చేతి మీద ఒక చుక్కవేసి సరియైన వేడి ఉందని బాటిల్ను ఈశ నోటికి అందిచ్చింది. ఆకలిగా ఉందేమో మూతి బిగించి జుప్ జుప్ అంటూ వేగాన్ని పుంజుకుంది. ఐశ్వర్య ప్రేమగా ఒళ్లో ఉన్న ఈశ తల నిమిరింది. కళ్ళు తిప్పి తల్లిని చూసి మళ్ళీ పాలు తాగడంలో మునిగి పోయింది.

"ఆకలి అరుపులా అవి!" అంటూ పవన్ వచ్చి పక్కనే కూర్చుని ఈశ చేతిని నిమరసాగాడు. ఈశ నోరంతా విప్పి నవ్వి మళ్ళీ పాలు తాగడంలో బిజీ అయిపోయింది. మనసుల్ని కట్టి పడేసే నవ్వు.

"గోపాలం తాత పోలికలు కనిపిస్తున్నాయి కదూ!" అంటూ టప టపా ఆడిస్తున్న ఈశ పాదం చేతితో తాకాడు పవన్.

"నా కెప్పటినుండో ముసలి మొహం ఉన్న అమ్మాయిని కనాలనుండింది."

"గడ్డం లేదులే. హ్హా..హా.హా... నీక్కాఫీ కావాలా? అమ్మ కాఫీ చేస్తోంది."

"ఓ.కే." తలాడించింది ఐశూ. పాలు తాగుతున్న ఈశ చేతిని తీసుకొని ముద్దు పెట్టుకోవడం చూసి 'మరి నాకో' అన్నాడు పవన్.

"కాఫీ" చిరు కోపాన్ని నటిస్తూ అంటున్న ఐశూను దీనంగా చూస్తూ పవన్ కాఫీ తేవడానికి వెళ్ళాడు.

# వెలుగుబాట

ఓట్రు ప్రకాష్ రావు

"వెంకటనరసింహరాజువారిపేట మా సొంత ఊరు. మా ఊరికి ఒక ప్రత్యేకత ఉంది.మా ఊరి రైల్వే స్టేషన్ పేరు భారతదేశపు రైల్వేస్టేషన్ పేర్లలో అతి పొడవైన పేరుగా రికార్డుకు ఎక్కింది" అంటూ తన ఊరి గురించి కొత్తగా చేరిన క్లర్క్ తో చెబుతున్నాడు జయరాం. జయరాం కు వారి ఊరంటే అభిమానం ఎక్కువ.

"రైలు, బస్సు నందు వెళ్లాలంటే అంత పెద్ద పేరు చెప్పి టికెట్ తియ్యాలా సార్?"

"ఎవరు చెబుతున్నారు..... అందరూ 'తడుకుపేట' అని పిలుస్తారు " అని సమాధాన మిచ్చాడు జయరాం . మేనేజర్ పిలుస్తున్నాడని ప్యూన్ చెప్పడంతో ఆ క్లర్క్ వెళ్లి పోయాడు.

" జయరాం , నీ పెళ్లి తిరుపతి కొండ పైన జరగడం వల్ల తిరుపతికి వచ్చి అలాగే తిరిగి వచ్చేసాం ....ఈ సారి తిరుపతికి వస్తే రైల్వేస్టేషన్ పేర్లలో పొడుగైన పేరుగల మీ వూరు కూడా చూడాలి."అన్నాను

"తప్పకుండా రండి "అంటూ సంతోషముతో ఆహ్వానించాడు.

"మనం ముగ్గురం మూడు సంవత్సరాల క్రితం ఒకే రోజు ఈ సెక్షన్ లో చేరడం వల్ల మన మధ్య మంచి పరిచయం ఏర్పడింది.రెండు సంవత్సరాల క్రితం వివాహం చేసుకొని కాపురం పెట్టావు.ఇంతవరకు మీ అమ్మ ఇక్కడకు రాలేదు ....ఎందుకని?" అడిగాడు హరిప్రసాద్.

చాలా రోజులుగా నేను అడగాలనుకొన్న ప్రశ్నను హరిప్రసాద్ అడగటంతో జయరాం నుండి ఎటువంటి సమాధానం వస్తుందాని వాడివైపు ఆసక్తిగా చూడసాగాను.

"నేను ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడు మా నాన్న చనిపోతే నా కోసం ఇంటిముందు ఉదయంవేళలో ఇడ్లీ వడలు అమ్ముతూ చాలా కష్టపడుతూ చదివించింది. నేను ఉద్యోగంలో చేరిన తరువాత నా బలవంతం వల్ల ఇడ్లీ వ్యాపారం మానుకొంది. మా వూరిలో మా అమ్మకు ఒక్క క్షణం తీరిక ఉండదు మా అమ్మ ఈడున్న ఆడవారు మా ఇంటిలో కూర్చొని బాతాఖానీ వేస్తుంటారు. ఇక్కడకు అమ్మను పిలుచుకొనివస్తే పంజరంలో చిలుక బతుకవుతుందని పిలుచుకొని రాలేదు." అన్నాడు జయరాం .

"నువ్వు మరీ ఎక్కువగా బిల్డ్ అప్ ఇస్తున్నావు "అన్నాను నేను.

“మూడు సంవత్సరాలక్రితం ఈ హైదరాబాద్ ఒకేరోజు మనం ముగ్గురం ఉద్యోగంలో చేరాము. ఆ తరువాత కొంతకాలానికి ఈ కాలనీలో ప్రక్క ప్రక్కనే కాకపోయినా కాస్త దూరంలో అపార్ట్ మెంట్ కొన్నాము. ఈ కాలనీ వాసులందరూ ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా ఒకరినొకరు పట్టించుకోకుండా ఉండటం మీకు తెలీదా"

"కానీ మనమధ్య పరిచయం బాగుందిగా......"అన్నాడు హరిప్రసాద్.

"మన మధ్య పరిచయమా ......నేను కాపురం పెట్టిన రెండు సంవత్సరములలో మీ ఇద్దరి ఇండ్లకు నేను మా ఆవిడా కలసి రెండు సార్లు వచ్చాము అలాగే మీరూ మా ఇంటికి రెండు సార్లు వచ్చారు.నేను మిమ్మల్ని తప్పు పట్టటానికో కించపరచటానికో చెప్పడం లేదు.ఇంటర్నెట్, సెల్ ఫోన్, టీవీ సీరియల్స్ ప్రవేశించి అందరి జీవితాలనే మార్చివేసింది.మా అమ్మ ఇక్కడికి వస్తే జైలు జీవితం లా గడపవలసి వస్తుందని ఇంతవరకు రమ్మని నేను బలవంతం చెయ్యలేదు."అన్నాడు జయరాం

"నువ్ చెప్పింది నిజమే మా ఎదురింటి ప్లాట్ బామ్మతో ఇంతవరకుమాట్లాడలేదు."అన్నాడు హరిప్రసాద్.

★ ★ ★ ★

ఆఫీస్ కాంటీన్ నందు మేము ముగ్గురం టీ త్రాగు సమయాన "ఈ రోజు సాయంత్రం నేను మా ఊరికి వెళ్తున్నాను,వెళ్లి మా అమ్మ కు ఆరోగ్యం బాగోలేదట. కళ్ళు తిరుగుతుందని నగరి లో ఒక ఆసుపత్రికి తీసుకుని వెళితే తిరుపతి కి వెళ్ళమని సలహా ఇచ్చారట .ఇక్కడ వైద్యంచేయించడానికి పిలుచుకొని వస్తాను "అన్నాడు జయరాం .

పది రోజులు గడిచింది.

వారం రోజులుగా జయరాం ఇంటికి వెళ్లి వాళ్ళ అమ్మని పలకరించాలని అనుకొంటూనే వుంటాను. ఏదో ఒక చిన్న అవాంతరములు దానికి తోడు సోమరితనం ......ఈ రోజు వెళ్లదామనుకొన్నాను ,ఆఫీస్ పని ముగించుకొని ఇంటికి వచ్చే సరికి రాత్రి ఎనిమిది గంటలు దాటింది.రేపు ఆదివారం ....ఉదయం తప్పకుండా వెళ్లి పలకరించాలి అనుకొంటూ కాలింగ్ బెల్ నొక్కాను.

మా ఆవిడ తలుపులు తీసింది."గోవిందమ్మా ....గోవిందమ్మా ..."ఎదురింటామె దీనంగా పిలవడం విన్నాను.

ఎదురింటిబామ్మకు ఒక కాలు ఒక చెయ్యి పని చెయ్యదు. అతని కొడుకు కోడలు ఉద్యోగస్తులు. జబ్బుతోపడిఉన్న ఆమెకు సపరిచర్యలు చేయడానికై గోవిందమ్మను పనిలో పెట్టారు. ఆమె ఆ ప్లాటులో వారు చిన్నచిన్న పనులకు పిలిస్తే వారిచ్చే చిల్లర డబ్బులకై అటూ ఇటూ తిరుగుతుంది.

"గోవిందమ్మా ...." మరలా బాధాకరమైన గొంతు పాపం అతనికి ఎంతటి అవసరమైన సహాయం కావలసి వచ్చిందో ' అనుకొంటూ జాలిపడ్డాను.

మా ఆవిడ తలుపులు మూసి గడియపెడుతూ "తలుపులు తెరిస్తే చాలు ఆ ముసలామె అరుపులు ...ఇద్దరూ బాగా సంపాదిస్తున్నారు ఏదైనా మంచి ఆశ్రమంలో చేర్పించాలన్న జ్ఞానం కూడా లేదు " గొణుక్కుంటున్నట్టుగా అంది మా ఆవిడ.

నేను స్నానం చేసివచ్చి సోఫా పై కూర్చున్నాను. కాలింగ్ బెల్ శబ్దానికి ఎవరా అనుకొంటూ తలుపులు తీశాను ఎదురుగా జయరాం అమ్మ అనుకొంటాను .

"ఏమిటయ్యా యాదగిరీ గుర్తుపట్టావా ...నేను జయరాం అమ్మ... లక్ష్మమ్మను . రెండేళ్ల క్రితం మా జయరాం పెళ్ళిలో చూసాను. మా అబ్బాయికూడా నీతో కలసి ఇప్పుడే ఇంటికి వచ్చినట్లు చెప్పాడు. మీ ఇంటి నంబర్ తీసుకొని వెతుక్కొంటూ వచ్చాను."

"నమస్కారం అమ్మా ....ముందు లోనికి వచ్చి కూర్చోండి మిమ్మల్ని ఎలా మరచి పోతాను. జయరాం ఎప్పుడూ మీగురించే చెబుతుంటాడు. డాక్టర్లు అన్ని పరీక్షలు జరిపించి మీకు ఏ జబ్బు లేదని చెప్పారని జయరాం సంతోష పడ్డాడు."అన్నాను. ఆమె కుర్చీలో కూర్చొన్న తరువాత మా ఆవిడను పరిచయం చేసాను. వారి బాగోగులు విచారించింది. ఎవరొచ్చినా మంచినీరు తెచ్చి ఇచ్చే అలవాటు మా ఆవిడకుంది. మంచి నీరు తీసుకొనిరావడానికి లోనికి వెళ్ళింది.

అప్పుడే "గోవిందమ్మా ....గోవిందమ్మా ...." దీనంగా పిలుస్తున్న ఎదురింటి మనిషి గొంతు విని "ఎవరు యాదగిరీ" అడిగింది. ఆమె పరిస్థితి వివరించి చెప్పగానే "అయ్యో అలాగా ....నేనిప్పుడే చూసి వస్తాను ."అంటూ వెళ్ళింది

సుమారు అర్థగంట తరువాత వచ్చారు " ...పాపం నిగ్రహించుకోలేక అలాగే మలమూత్రములు.....ఆ గోవిందమ్మ ఇంటికెళ్లినట్లుంది.... ఆ సంగతి తెలీక దీనంగా పిలుస్తోంది.నేను ఆమె బట్టలు తీసి , శుభ్రం చేసి వేరే దుస్తులు వేసి వస్తున్నాను."అంది

మొదటిసారి నా జీవితంలో మనిషిలోని దేవతను చూస్తున్న అనుభూతి కలిగింది.

★ ★ ★ ★ ★

ఒక రోజు మా ఆవిడ బాత్ రూమ్ లో జారిపడటంతో కాలు ఫ్రాక్చర్ అయింది. కాలుకు ఆపరేషన్ చేసి స్టీల్ ప్లేట్ వేశారు. వారం రోజుల తరువాత డిశ్చార్జ్ చేస్తూ మరో పదిహేనురోజులు మా ఆవిడ మంచం పైననే ఉండాలన్నారు. ఆఫీస్ కు సెలవుపెట్టి అన్ని పనులు నేనే చూసుకొంటున్నాను.

"పనిమనిషి ఎక్కడా దొరకలేదు...నీవు మంచినీరు ఎక్కువగా త్రాగడం వల్ల .....ఎక్కువ సార్లు .... నీరు త్రాగడం కొద్దిగా తగ్గించు." అంటూ మా ఆవిడ యూరిన్ బేసి ను ఇబ్బంది పడుతూ తీసుకెళ్లి ఖాళీ చేసి తెచ్చాను

మా ఆవిడా కనులు చెమ్మగిల్లడం గమనించాను . .'"నడిచేంతవరకు ఆ ఆసుపత్రి నందు ఉండివుంటే బాగుండేది'" బాధతో గొణుక్కొంటున్నట్టుగా అంది. ఆ మాటలు నా గుండెలో ముల్లులా గుచ్చుకొన్నట్లనిపించింది. నీరు త్రాగడం తగ్గించుకో అంటూ చెప్పి తప్పుచేసానన్న భావన కలిగింది

"యాదగిరీ....యాదగిరీ నిదురపోతున్నావా?" అన్న లక్ష్మమ్మ గారి మాటలు విని కళ్ళు తెరచి "రండమ్మా, కూర్చోండి " అన్నాను.

" మరలా నాకు కళ్ళుతిరగడం ప్రారంభిస్తే ఆసుపత్రికెళ్ళాను.నీ భార్యకు ప్రమాదం అయిన రోజే నేను మరో ఆసుపత్రిలో చేరాను. ఆ పరీక్ష....ఈ పరీక్ష అంటూ చివరకు ఈ రోజు డిశ్చార్జ్ చేస్తూ మీకు ఏ రోగమూ లేదంటూ చెప్పారు.."అంటూ చెప్పిన తరువాత మా ఆవిడ కాలు గురించి వివరంగా అడిగి తెలుసుకొంది .

"యాదగిరీ నీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి.ఈ సమయంలో మందులు ఎక్కువగా వాడుతుండటంవల్ల శరీరం బాగా వేడెక్కుతుంది. అందుకే నీరు ఎక్కువగా త్రాగటం అలవాటు చేయించాలి నీరు ఎక్కువగా త్రాగటంవల్ల నీకు పని ఎక్కువ అవుతుందని నీరు త్రాగడం తగ్గించినా నీవు బలవంతం చేసి త్రాగించాలి. ఇప్పుడు కాస్తా వేడినీరు తీసుకునిరా ...."అంది.

వేడినీరు తెచ్చిపెట్టగానే "నువ్వెళ్లు నేను వేడినీటిలో పిండిన గుడ్డతో శరీరం తుడిచి దుస్తులు మార్పిస్తాను. "అంది నేను మరో గదికి వెళ్ళాను .

కొంత సమయం గడచినా తరువాత "యాదగిరీ"అంటూ పిలవగానే వచ్చాను. "ఇప్పటికే చాలా సమయం అయింది నేను రోజూ వస్తుంటాను" అని చెప్పి బయలుదేరింది

" నేను నిన్ను నీరు ఎక్కువగా తాగవద్దంటూ చెప్పడం ఎంత పెద్ద పొరపాటు తెలుసుకున్నాను.ఐ యాం సారీ " అంటూ మా ఆవిడ చేతిని పెట్టుకొన్నాను .

"ఆఫీస్ కు సెలవుపెట్టి మీరు చేస్తున్న పనులు చూస్తుంటే నాకే బాధగా ఉంది.అయినా మీరేమి తప్పుగానో కోపంతోనో ఏమీ అనలేదు. దగ్గర బంధువులు ఎవరూ దగ్గర్లో లేరు. ఉన్న దూరపు బంధువులు చుట్టపు చూపుగా ఆసుపత్రిలో వచ్చి పలుకరించి వెళ్లారు. ఆ బామ్మ నా శరీరాన్ని వేడినీటిలో పిండిన గుడ్డతో తుడిచి నందువల్ల ప్రాణానికి హాయిగా ఉందండీ "అంది .

ప్రతి రోజు ఏదో ఒక సమయంలో వచ్చిమా ఆవిడా శరీరాన్ని వేడినీటి గుడ్డతో తుడిచి దుస్తులు మార్చి వెళ్ళేది

"మీరు కాయగూరలకై మార్కెట్ వెళ్ళినప్పుడు నేను ఒంటరితనంతో బాధపడ్డాను. అనారోగ్యంతో వున్నవారు ఒంటరిగా ఎంతటి కల్లోలానికి గురవుతారో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను పాపం ఒంటరిగా ఉన్న ఎదురింటామేకు ఓదార్పు చెప్పేవారులేక , అవసారాలకు సహాయం చేసే వారు లేక ఎంతటి నరకాన్ని అనుభవిస్తున్నారో అర్థం చేసుకొన్నాను. ఒక్క సారి కూడా మానవత్వంతో సహాయ పడలేదు.సాటి మనిషిని ఏమాత్రం పట్టించుకోకుండా నేను ఏమి సాధించాను అన్న ప్రశ్న నాలో కలుగుతోంది "అంది మా ఆవిడ

★ ★ ★ ★ ★

ఇంటికొచ్చి పదిహేనురోజులు పూర్తికాగానే ఆసుపత్రికి తీసుకెళ్ళాను. కాలుకున్న కట్లు విప్పి, కర్రలతో నడవడం చెప్పించారు. ఆసుపత్రినుంచి ఇంటికి టాక్సీలో బయలుదేరాను,

మా ఎదురింటి ముందు గుంపుగా ఉండటం చూడగానే నాలో ఏదో అనుమానం.......అనారోగ్యంతో ఉన్న ఆమె మరణించిందా అన్న అనుమానం కలిగింది. ఎదురింటారామె వాలు కుర్చీలో కూర్చొని ఉండటం చూసి ఆశ్చర్యపోయాను.ఎప్పుడూ నేలమీద పరచిన దుప్పటి మీద పడుకొనే ఆమె ఈ రోజు వాలు కుర్చీలో కూర్చొని ఉండటం వింతగా తోచింది.

ఆమె ప్రక్కనున్న జయరాం అమ్మ నన్ను చూడగానే లేచి వచ్చి "యాదగిరీ, డాక్టర్లు ఏమి చెప్పారు?"అనడిగారు.

ఆమెకు సమాధానం చెప్పినతరువాత చివరగా “ఇంతమంది ....ఇక్కడ? "అంటూ ప్రశ్నించాను.

"పట్టణాలలో అనారోగ్యంతోనున్న వృద్ధ మహిళల అవసరాలకు సేవ చేసేవారు లేక పలకరింపులు నోచుకోక ఏకాకిలా ఒంటరితనంతో గడపడం గుర్తించాను, మా తడుకు పేటలో అనారోగ్యంతోనున్న వారిని ఆరోగ్యంతోనున్న వారు వెళ్లి పలకరించడం వల్ల వారిలో మానసికానందం కలిగేది. అలాంటి వాతావరణం ఇక్కడా కల్పించాలనుకొన్నాను. వీరందరూ సహకారించారు. అందులో భాగంగా ఇప్పుడు ఈమెకు తోడుగా ఉంటూ మాట్లాడుకొంటున్నాం"అన్నారు.

" లక్ష్మమ్మ గారు ఈ కాలనీలో ఉన్న అన్ని ఇండ్లకు వెళ్లి వృద్ధ మహిళలతో కలసి మాట్లాడి అన్ని వివరములు సేకరించారు.ఈ కాలనీలో మొత్తం పాతిక మంది వృద్ధ మహిళలు ఉండవచ్చని అనుకొన్నాం .కానీ మొత్తం యాభై రెండు మంది వున్నారని చెబితే అందరూ ఆశ్చర్యపడ్డాము. అందులో అనారోగ్యంతో బాధపడేవారు, కోడళ్ళు కొడుకుల ప్రవర్తనతో బాధపడేవారు సుమారు 20 మంది ఉన్నట్లు తెలిపారు. ఈమె లాగా ఎక్కడకూ వెళ్లలేని స్థితిలో

ఆరుమంది మంది ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారిలో ఎక్కువశాతం పంజరంలో చిలుకలా జీవితాన్ని గడుపుతున్నారు. నిన్నటి రోజున అందరినీ ఒక్కటిగా కలిసే ఏర్పాటు చేశారు .తమతమ సమస్యలు చెప్పడం ....చర్చించి పరిష్కార మార్గాలు సూచించడం జరిగింది."అంది ఒక ముసలామె .

"నా ఫ్లాట్ లో ఒంటరిగా ఉంటున్నాను.మా పిల్లలు అమెరికాలో ఉంటున్నారు. ప్రతి ఆదివారం ఫోన్లో మాట్లాడుకొంటాము. ఇక్కడ ఒంటరిగా ఫ్లాట్లో ఉన్న సమయాన పొరపాటున మరణించినా శవం కుళ్లేంతవరకు పట్టించుకొనే వాళ్ళు లేరని బాధపడుతూ ప్రతిరోజూ భయపడుతూ తలుపులు మూసిపడుకొనేదాన్ని. లక్ష్మమ్మగారి దయవలన వృద్ధులందరు కలిసాము. నేను ఉదయం నిదురలేవడానికి కాస్త ఆలస్యం అయినా తలుపులు తట్టి కుశలములు విచారించడానికి వీళ్ళు ఉన్నారన్న తృప్తి నాలో కలిగింది." అంది ఒకామె .

"ఆ మధ్య ప్రముఖ గాయని 82 సంవత్సరాయలు పైబడిన ఆశా భోస్లే గారు 'సరిహద్దు సైనికులను ఉత్తేజ పరిచేందుకు అక్కడ వెళ్లి పాటలు పాడతాను'అని ఒక సభలో ప్రకటించారు.సమాజాభివృద్ధికి తనవంతు నేను సైతం అంటూ ఏదో ఒక సాధన చెయ్యాలని అన్న ఆమెను పొగడకుండా ఉండలేము అలాగే ఈ లక్ష్మమ్మ గారు ఎవరికివారే అన్నట్టుగా ఉండకుండా నేను సైతం అన్నట్లు నడుచుకోవాలని ఒక మంచి మార్గాన్ని చూపించారు.నేడు సమాజానికి కావాల్సింది జాతి మత కుల సంఘాలు కాదు . మహిళా వృద్ధుల సంఘాలు " అంది ఒకామె

“పట్టణాలలో వృద్ధులు ఒకరినొకరు మాట్లాడుకొంటుంటే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు.....వృద్ధుల ఆశ్రమాల వైపు చూడవలసిన అవసరం ఎవరికీ రాదు" వృద్ధ మహిళా

బుద్ధుడు,బాపూజీ మదర్ థెరిస్సా గారు సేవా ధర్మాన్ని చేతుల్లో చూపించి గొప్ప సాధన చేశారు.వారి అడుగుజాడల్లో నేను సైతం అన్నట్టుగా మహిళా వృద్ధులను వెలుగు బాటలో నడిపించటానికి పూనుకొన్న ఆ లక్ష్మమ్మ గారికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకొన్నాను.

## సంకల్పం

అంజన కొడాలి

**అలారం మోతకు** ఉలిక్కిపడి నిద్రలేచాడు పదమూడేళ్ళ రాహుల్. ఆరయ్యింది. లేవబుద్ధికాలేదు. రాత్రి నిద్రపట్టేసరికి రెండు దాటిందేమో. ప్రతి రాత్రి ఇంతే.

వేగంగా తిరుగుతున్న ఫ్యాను వైపు చూస్తూ ఉండిపోయాడు రాహుల్. దీనికి విసుగు రాదా? ఎవరో స్విచ్చి వేస్తే, పాపం తిరుగుతూనే ఉంటుంది. ఒక రకంగా ఇలా యంత్రంలాగా ఉండటమే మంచిదేమో. బాధ, భయం, విసుగు, కోపం ఏమీ ఉండవు.

బలవంతాన లేచి మొహం కడుక్కుని, బట్టలు మార్చుకుని, గదిలోనుండి బైటకు వచ్చాడు. వంటకోసం చకచకా కూరగాయలు తరుగుతున్న తల్లి పావనిని చూస్తే ఎప్పుడు ఆశ్చర్యమే. ఎప్పుడూ ఇంత ఎనర్జిటిక్‌గా ఎలా ఉంటుందా అని. అలసిపోయాను అని పావని రెస్టు తీసుకోవటం చాలా అరుదు.

రాహుల్‌ని చూసిన పావని, "గుడ్‌మార్నింగ్ కన్నా! పద వెళదాం" అంటూ చేతులు తుడుచుకుని ముందు గదిలోకి వచ్చింది, కూడా నిమ్మకాయ తేనె కలిపిన గోరు వెచ్చని నీళ్ళ బాటిల్‌తో. ఇద్దరూ షూ వేసుకుని వాకింగ్‌కి బయలుదేరారు. మే నెల ఎండ తీవ్రంగానే ఉన్నా, చల్లగాలి వేస్తుంది.

పావని, భర్త భాస్కర్ ఇద్దరూ పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో మేనేజర్లుగా పనిచేస్తున్నారు. పెద్ద జీతాలు. దాదాపు పదేళ్ళ క్రితం ఊరికి కొంచెం దూరంలో కొత్త వెంచరులో ఇల్లు తీసుకున్నారు. అన్ని సదుపాయాలు ఉన్న కాలనీ, రెండు అంతస్థుల విల్లాలు, ప్రతి ఇంటికి చిన్న తోట, కమ్యూనిటి హాలు, పార్కు. ఇక్కడికి వచ్చాకే రమ్య పుట్టింది.

మౌనంగా నడుస్తున్నాడు రాహుల్. మూడు నెలలయ్యింది కోవిడ్ మూలాన ఇంట్లోనే బందీ అయిపోయాడు. విసుగు వస్తుంది. ఎంతగా మారిపోయాడు తాను. నిర్లిప్తంగా అనుకున్నాడు రాహుల్.

చిన్నప్పుడు అందరు పిల్లల్లాగే ఆటలు, స్నేహితులు, చదువు. ఎప్పుడు మొదలయ్యిందో, ఎలా మొదలయ్యిందో కూడా రాహుల్‌కు గుర్తులేదు. నిరాసక్తత, ఏదో తెలియని గుబులు, కలవరం. ఒక్కోసారి స్ట్రెస్‌తో తలను నొక్కిపెట్టినట్లు విపరీతమైన నొప్పి, ఎవరితోనన్నా మాట్లాడాలంటే గుండె దడ, చేతిలో చెమటలు, ఫ్రెండ్స్‌తో కూడా ఇబ్బందే

తనలోని ఈ మార్పు ఎందువలనో, ఏం జరుగుతుందో కూడా అర్థంకాలేదు. క్లాసులో టీచర్ అడిగే ప్రశ్నలకు తలదించుకోవటం, టీచర్ కోప్పడుతుంటే అవమానం, తనను ఎవ్వరూ అర్థం చేసుకోవట్లేదన్న ఉక్రోషం, నిద్రలేమి. రాహుల్ 'ఎ క్యూట్ ఏంక్జయిటీ ' డిప్రెషన్‌తో బాధపడుతున్నాడని ఎవ్వరూ గ్రహించలేకపోయారు.

బహుశా అందరికంటే ముందుగా రాహుల్‌లోని మార్పు గమనించింది చెల్లెలు రమ్యనేమో. పిల్లలకు గ్రహింపు శక్తి ఎక్కువగా ఉంటుంది. చిన్న పిల్లలు వాళ్ళకేం తెలుసులే అని కొట్టిపారేస్తారు కానీ, కల్మషం లేని వారి మనసులు బాధ, ఆనందాన్ని ఇట్టే పట్టేస్తాయి.

ఎప్పుడూ తనతో గిల్లికజ్జాలు పెట్టుకుని, మళ్ళీ అంతలోనే తన అలకలు తీర్చే అన్న, ముభావంగా ఉండటం ఆశ్చర్యంగా అనిపించింది రమ్యకు. ఎప్పుడూ రూంలోనే ఉండటం, పలుకరించినా పెద్దగా మాట్లాడకపోవటం అర్థంకాలేదు. ఆడుకుందామని పిలిస్తే వచ్చేవాడు కాదు. ఎక్కువసార్లు అడిగితే విసుక్కునేవాడు.

"అన్నయ్య నాతో అస్సలు మాట్లాడటం లేదమ్మా, ఆడుకుందామంటే అరుస్తున్నాడు" భోజనం చేస్తూ తల్లికి పిర్యాదు చేసింది రమ్య.

"నేను కూడా గమనిస్తున్నా రాహుల్. ఎంతసేపూ రూంలోనే ఉంటున్నావు. భోజనం కూడా సరిగ్గా తినటంలేదు. ఆకలి లేదు అంటున్నావు. ఎప్పుడూ ఆ వెధవ హెడ్‌ఫోన్స్, ఎవ్వరితోనూ మాట్లాడవు. ఏమైంది? మార్కులు కూడా తగ్గుతున్నాయి ఈసారి టెస్టుల్లో. కష్టంగా ఉన్నాయా క్లాసులు?"

రాహుల్ సమాధానం చెప్పకపోవటంతో మళ్ళీ మళ్ళీ రెట్టించింది పావని.

"ఏంటి నీ నస. ఎందుకు వాడిని ఊరికే సతాయిస్తావు? టీనేజర్ అంటే సవాలక్ష గొడవలుంటాయి. అవే సర్దుకుంటాయి. ప్రతిదానికి పెద్ద ఇష్యూ చేయొద్దు" విసుక్కున్నాడు భాస్కర్.

"రాహుల్ చదువులో మాత్రం వెనకపడటానికి వీల్లేదు. వీకెండ్ స్పెషల్ కోచింగ్‌లో పెట్టాను. వచ్చేవారం నుండి నీక్లాసులు" గట్టిగా చెప్పాడు భాస్కర్.

భాస్కర్ అంటే ఇంట్లో అందరికి భయం. ఎప్పుడు చిరాకు పడతాడో, దేనికి కోపంతో అరుస్తాడో గ్రహించటం కష్టం. భయంతో ఇంకా ముడుచుకు పోయాడు రాహుల్.

పావని, భాస్కర్లది ఒకే స్థాయి ఉద్యోగాలు అయినా పావని పొద్దున్నే ఎనిమిదికల్లా ఆఫీసుకు వెళ్ళి ఐదున్నరకల్లా ఇంటికి వస్తుంది. భాస్కర్ పదకొండుకు వెళ్ళి రాత్రి ఎనిమిది, తొమ్మిదికి వస్తాడు. చదువుతోపాటు వేరే వ్యాపకాలు కూడా ఉండాలని పిల్లలను టెన్నిస్ క్లాసుల్లో చిన్నప్పుడే చేర్పించింది. రాహుల్ వయొలిన్ నేర్చుకుంటాడు. రమ్య సంగీతం క్లాసులకు వెళుతుంది. భాస్కర్‌కు స్టేటస్ పిచ్చి ఎక్కువ. అందుకే ఖరీదైనా ఈ కాలనీలో ఇల్లు తీసుకున్నాడు పిల్లలకు ఖరీదైన అలవాట్లు తొందరగానే అలవాటయ్యాయి. పిల్లలకు డబ్బు విలువ తెలియచెయ్యాలనే పావని తాపత్రయం, భాస్కర్ లెక్కచెయ్యడు.

కోవిడ్ లాక్ డౌన్‌తో ఐటీ ఉద్యోగస్థులు ఇంట్లో నుండి పనిచెయ్యగలగటం ఓ రకంగా అదృష్టమే. బైటకు వెళ్ళి ప్రాణాలను రిస్కులో పెట్టవలసిన అవసరం లేకుండా ఇంట్లోనే క్షేమంగా ఉంటున్నారు. కానీ లాక్ డౌన్ మొదలెట్టిన దాదాపు నెలన్నరకు ఆన్‌లైన్ క్లాసులు కూడా ఆపెయ్యటంతో రాహుల్ ప్రవర్తనలో విపరీతమైన మార్పు వచ్చింది.

ఒక్కోసారి గంటల తరబడి గదిలోనుండి బైటకు రాడు. ఒక్కసారి తెచ్చిపెట్టుకున్న హుషారు, పెద్ద సౌండుతో మ్యూజిక్ పెట్టుకుని పాటలు వినటం, వీడియో గేమ్స్ వయొలిన్ పక్కకు పడేశాడు. ఇంట్లో చిరుతిళ్ళు లేవని పేచీలు, కష్టపడి పావని పలహారాలు తయారుచేస్తే, తినే మూడ్ లేదని వెళ్ళిపోయేవాడు. ప్రపంచంలోని దేశాలన్నీ కోవిడ్ మహమ్మారికి భయపడుతూ, టివిలో అదేపనిగా మరణాల సంఖ్య చూపటం, పిల్లల మధ్య నడిచే చాటింగ్‌లలో గాలివార్తలు, సమాజంలో పెరిగిపోతున్న ఆత్మహత్యల వార్తలు - ఒత్తిడి తట్టుకోలేకపోయాడు రాహుల్.

రాహుల్‌లోని విపరీతపు ధోరణిని కనిపెట్టిన పావని చాలా భయపడింది. భాస్కర్‌తో ఎన్నోసార్లు ప్రస్థావించి, ఎవరైనా సైక్రియాట్రిస్ట్‌కు చూపించుదామని అడిగినా, యధావిధిగా భాస్కర్ ఆ మాటలను కొట్టిపారేసి, అతిగా ఆలోచిస్తుందని పావనిని కోప్పడ్డాడు.

భాస్కర్‌తో లాభంలేదని తానే గూగుల్‌లో కాస్త సమాచారం సేకరించింది. రాహుల్ అడాలసెంట్ డిప్రెషన్‌తో బాధపడుతున్నాడని అర్థం అయ్యింది. ఈ కరోనా కాలంలో సైక్రియాట్రిస్టులు అపాయింట్‌మెంట్లు ఇస్తున్నారో లేదో తెలియదు - ఫోనులో కౌన్సిలింగ్ చేయిస్తే రాహుల్ మనస్సు విప్పి మాట్లాడతాడో లేదో. ఏదో ఒకటి చెయ్యాలన్న తపనతో,

తానే రాహుల్‌తో ఎక్కువ సమయం గడపసాగింది. మాస్కులు ధరించి రోజూ ప్రొద్దునా, సాయంత్రం కాలనీలో వాకింగ్‌కి బలవంతాన తీసుకు వెళ్ళసాగింది.

మొదట్లో రానని మొండికేసేవాడు లేదా ఏవో వంకలు చెప్పేవాడు. కానీ పావని ఒక్కోసారి గట్టిగా మాట్లాడి, రాహుల్‌ను బైటకు తీసుకు వచ్చేది. ఎన్నో కబుర్లు చెప్పేది పావని ఆ సమయంలో. తన చిన్ననాటి విషయాలు, అప్పటి సాధారణ జీవితం, టెక్నాలజీ లేని ఆ రోజుల్లో తాము ఆడిన ఆటలు - వేసవి సెలవలు ఎలా గడిపేవారో సరదాగా చెప్పి నవ్వించేది. రాహుల్ మనసారా నవ్విన రోజు పొంగిపోయేది.

రాహుల్‌కు ఒక్కోసారి చాలా చిరాకుగా విసుగ్గా ఉండేది తల్లి తనతో బలవంతాన పనులు చేయించటం. పాజిటివ్‌గా ఆలోచించాలి అంటుంది, రోజూ వేలల్లో జనం చనిపోతుంటే ఇంకెక్కడి పాజిటివ్‌నెస్. అన్నా చెల్లెళ్ళకు రోజూ ఏదో ఒక పోటీ పెడుతుంది. తన చిన్నప్పటి ఆటలు నేర్చుకోవటం, చిన్న చిన్న వంటలు ఇద్దరూ చెయ్యటం, కలిసి మ్యూజిక్ ప్రాక్టీస్. చెయ్యకపోతే మళ్ళీ సాయంత్రం లెక్చరు వినాలని బలవంతాన చెయ్యటం మొదలు పెట్టిన రాహుల్‌లో నెమ్మదిగా మార్పు మొదలయ్యింది.

కాలింగ్ బెల్ మోత విని ఎవరా అని ఆశ్చర్యంగా తలుపు తీసాడు రాహుల్.

"అమ్మగారు ఉన్నారా బాబు" ముఖానికి అడ్డుగా చీరకొంగు పెట్టుకుని అడిగింది, ఇంతకు ముందు ఇంట్లో పనిచేసిన కళావతి."

"అందరికీ మాస్కులు కుట్టించి ఇచ్చాం కదా, పెట్టుకోలేదేంటి?" చూస్తూనే కోప్పడింది పావని. కోవిడ్ మొదలయ్యిన కొత్తల్లోనే కాలనీలో అందరూ కలసి తమ దగ్గర పనిచేసే వాళ్ళ కుటుంబాలకి మాస్కులు ఇచ్చి, తీసుకోవలసిన జాగ్రత్తలు పదేపదే చెప్పి, ఓ రెండు నెలల జీతం ఇచ్చి పిలిచేదాకా పనిలోకి రావొద్దని చెప్పేశారు.

"హడావుడిగా వచ్చానమ్మా. మా ఆయనతో పడలేకున్నా"

"రాహుల్ వెళ్ళి మాస్కులు తీసుకురా. ఏమైంది కళా?"

"పనులేవీ లేవు కదమ్మా, ఇంట్లో తిని కూర్చుంటే డబ్బులన్నీ అయిపోతున్నాయి. ఆటో బాడుగలు లేవు. ఈ జబ్బు ఎప్పుడు తగ్గుతుందో తెలియదు. దానికి తోడు ఖాళీగా ఉండి తాగుడు మొదలుపెట్టాడు. అయినా పనులు లేక చస్తుంటే ఈ బ్రాందీ షాపులేంటమ్మా? ఊళ్ళో మా వాళ్ళంతా వచ్చెయ్యమంటున్నారు. ఇప్పుడు బస్సులు తిరుగుతున్నాయంట గదా అందుకే వెళ్ళిపోతున్నామమ్మా"

"ఊళ్ళో మాత్రం ఏం పనులున్నాయి?"

"ఏవే లేవమ్మా, పొలం పనులు మొదలయితే కూలికి వెళతాం" దిగులుగా చెప్పింది కళ. దాదాపు పదేళ్ళకు పైగా పట్నంలో అలవాటు పడ్డారు. మొగుడు ఆటో తోలుతూ, కళ నాలుగిళ్ళల్లో పనిచేస్తూ డబ్బు దాచిపెట్టి ఊళ్ళో ఒక చిన్న ఇల్లుకూడా కట్టుకున్నారు.

"ఈసారి వెళితే ఇంక రామమ్మ. కలో గంజో, చావో బ్రతుకో ఇక అక్కడే అందుకే చెపుదామని వచ్చా"

"మరి రాజు చదువో?" గభాల్న అడిగాడు రాహుల్. కళావతి కొడుకు పదవ తరగతి చదువుతున్నాడు, రాహుల్ వాళ్ళతో అప్పుడప్పుడు క్రికెట్ ఆడటానికి వస్తాడు.

"ఇంకేం చదువు బాబు, ఆడూ కూలికే"

ఇన్నాళ్ళూ తాను పట్టించుకోని సమస్యలను చూస్తున్నాడు రాహుల్.

"అమ్మా మనం ఏదో ఒకటి చెయ్యాలి. రాజు ఎంత బాగా చదువుతాడు, చదువు మానేస్తే ఎలా? అసోసియేషన్ అంకుల్ వాళ్ళతో మాట్లాడి ఏదైనా హెల్ప్ చెయ్యాలి. ప్లీజ్"

"ఒక్క వారం రోజులు ఆగు కళా. అందరితో మాట్లాడి ఏ విషయం చెపుతాను"

"అట్టాగేలేమ్మా" అంటూ వెళ్ళిపోయింది కళ.

అమ్మ అప్పుడప్పుడు వలస కూలీల కష్టాలు, ఎంత ఇబ్బంది పడుతున్నారో చెపితే, పెద్ద పట్టించుకోని రాహుల్, తన చిన్నప్పటి నుండి చూస్తున్న కళ, రాజు అదే పరిస్థితిలో ఉండటంతో వాళ్ళ కష్టం మనసుకు నాటుకుంది.

"అమ్మ, నేను మా ఫ్రెండ్స్ అందరికీ మెసేజ్ చేస్తాను. అందరి ఇళ్ళల్లోనూ పనిచేసిన మెయిడ్స్‌కి ఇదే ప్రాబ్లం కదా. మనందరం ఏదో ఒకటి చెయ్యాలమ్మా. ఇన్నాళ్ళు వాళ్ళు మనకు హెల్ప్ చేశారు కదా. నువ్వు ఆఫీసునుండి రావటం లేట్ అయ్యి కళకు ఫోన్ చేస్తే రాజును పంపేది మాకు తోడుగా ఉండటానికి. మనం కూడా రిటర్న్ హెల్ప్ చెయ్యాలి కదా"

దాదాపు సంవత్సరంగా స్తబ్దుగా ఉన్న రాహుల్‌లో ఓ కదలిక. మంచి పరిణామం. రాహుల్ మదిలో రకరకాల ఆలోచనలు.

జీతానికి కదా పనిచేస్తున్నారు అనే అనుకుంటారు కానీ అందరూ ఇన్ని కష్టాలు పడుతుంటే తక్కువ స్థాయిలో ఉన్న సాటి మనుష్యుల గురించి ఆలోచించని తల్లిదండ్రులందరి మీద కోపం వచ్చింది.

"అమ్మా మనం సెల్ఫిష్‌గా ఉండకూడదని నువ్వే చెపుతావు కదా. మరి మన ఇంట్లో పని చేసే వాళ్ళ ప్రోబ్లమ్స్ మనవే కదా"

రాహుల్‌లోని అసహనం, ఒకరి బాధలో పాలుపంచుకోవాలన్న తాపత్రయం చూస్తే పావనికి ముచ్చటేసింది.

"నేను అసోసియేషన్ వాళ్ళకు ఈ మెయిల్ పంపి, సాయంత్రం జూమ్ మీటింగ్ పెట్టుకుంటాం."

రాహుల్ వెంటనే కాలనీలోని తన ఫ్రెండ్స్ అందరికి మెసేజ్ చేసి, తమకు తెలిసిన పిల్లలను కూడా గ్రూపులు కలుపుకున్నాడు. దాదాపు వంద ఇళ్ళు ఉన్న ఈ చిన్న కాలనీలో, పదమూడేళ్ళకు పైబడిన పిల్లలు ఓ ముప్పైమంది ఉన్నారు. అందరూ వీలైనంత సాయం చెయ్యటానికి ఒప్పుకున్నారు. వారి పాకెట్ మనీ అంతా ఇచ్చేస్తామన్నారు.

ఒక పసి హృదయపు ఆవేదన, ఆలోచన అందరిని తాకింది. ఈ కాలనీలో పనిచేసే పనిమనుషులు, తోటపనివాళ్ళు ఎంతమంది ఉన్నారు అని లెక్కలు వేశారు. వీళ్ళల్లో ఆడవాళ్ళు ఇళ్ళల్లో పాచిపని చేస్తుంటే మగవాళ్ళు ఆటోడ్రైవర్లుగానో, తాపీ పనులో చేసేవారు. కోవిడ్ భయంతో పనులు లేక వీళ్ళందరూ పల్లెలకు వెళ్ళిపోయి ఈ కష్టకాలంలో పట్నంలో తమనెవ్వరూ ఆదుకోలేదని తిరిగి రాకుంటే? షార్టేజ్ ఆఫ్ మాన్ పవర్.

ఇది ఒక వాదన, ఇంకోరకంగా ఆలోచిస్తే చిన్న పటిక బెల్లం ముక్క చూసిన చీమ కూడా తన తోటి వంద చీమలతో పంచుకుంటుంది. కానీ స్వార్థంగా తాను ఒక్కటే తినదు. చీమలన్నీ సమిష్టిగా ఆ బరువైన పటిక బెల్లంను మోస్తూ పంచుకుంటాయి. బుద్ధిజీవులం. ఇంత పురోగమించాం, ఈ కష్టకాలంలో ఉన్నదేదో పంచుకుంటూ ఒకరికొకరు తోడుగా మానవత్వంతో ఉండలేమా?

పావని, రాహుల్ వినిపించిన ఈ వాదనలు అందరిని తమ పరిధి దాటి ఆలోచించేలా చేశాయి. నాలుగు రోజుల తర్జన భర్జనల తరువాత కాలనీలో పని మాన్పించిన అందరికీ ఏవో పని కల్పించి, వ్యక్తిగత దూరం పాటిస్తూ చేసే పనులు కేటాయించి వారికి జీతం ఇవ్వాలని ఉచితంగా వచ్చే డబ్బుకు ఆశించకుండా ఖాళీగా ఉన్న మగవాళ్ళకు కమ్యునిటీ ఖాళీ స్థలంలో కూరగాయలు పండించేపని అప్పచెప్పారు.

"అమ్మ నీతో మాట్లాడాలి" యధావిధిగా ప్రొద్దున్నే కలిసి నడుస్తున్నారు ఇద్దరూ. జులై నెల వచ్చింది. రాత్రి పడిన వర్షానికి తడిచిన చెట్లు ఆనందంగా తలలూపుతున్నాయి.

"చెప్పు కన్నా!"

"నా బిహేవియర్‌తో నిన్ను చాలా సతాయించాను కదా! కానీ నా కంట్రోల్లో ఏమీ లేనట్లుగా ఉండేది. ఏం తక్కువ చేశాను. వీడికి అని నువ్వు అనుకోవచ్చు. కానీ ఎందుకో నాకే తెలియదమ్మా"

"ఒక్కోసారి టీనేజ్‌లో, ఒక్కోసారి పెద్దవాళ్ళలో కూడా కెమికల్ ఇన్‌బాలెన్సెస్ అవుతాయి. ఒక్కోసారి కారణం కూడా పెద్దగా లేకున్నా డిప్రెషన్‌కు లోనవుతారు. చూసేవాళ్ళకు చిన్న ప్రాబ్లం, అనుభవించేవాళ్ళకు పెద్దదిగా ఉండొచ్చు. ఈ విషయాలు నేను కూడా చదివి తెలుసుకుంటున్నా కన్నా!" ఓదార్పుగా అన్నది పావని.

చెల్లిని, నన్ను మీరు చాలాబాగా చూసుకుంటారు, సేఫ్‌గా ఉంచారు. డబ్బులు గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఈ కోవిడ్ టైంలో అందరి కష్టాలు చూశాక, రాజుతో మాట్లాడినప్పుడు, ఇన్నాళ్ళూ నాకు తెలియని ప్రపంచం, పెద్ద పెద్ద సమస్యలు చాలా ఉన్నాయి అని అర్థం అయ్యింది. మా అందరి పాకెట్ మనీతో రాజు వాళ్ళు ఉండే పేటలో పిల్లలకు రోజూ ఫుడ్ పెట్టమని హోటల్ వాళ్ళతో మాట్లాడాం కదా! ఆ పిల్లలు ఎంత హేపీగా ఉన్నారో. కేవలం ఫుడ్, ఇంటికి సోప్స్, మాస్కులు ఇచ్చాం. అంతేకదా! నేను కష్టపడతానమ్మా, ఈ ఏంగ్జయిటీ డిప్రెషన్ నుండి బైటపడతాను" ధృఢంగా అన్నాడు రాహుల్.

"ఇది నీ ఒక్కడి సమస్య కాదు కన్నా! మనం అంతా ఫ్యామిలీ కదా. అందరం అందరికోసం ఉండాలి. ఏ చిన్న బాధను మనస్సులో బంధించకు. సినిసిజం, నిరాశలాంటి నెగెటివ్ ఎనర్జీని నీ దగ్గరకు రానీయకు. దెబ్బ తగిలిందని సైకిల్ నేర్చుకోవటం మానేస్తామా? జాగ్రత్తగా నేర్చుకుంటాం కదా"

"ఈ కోవిడ్ సమస్య చూడు. సైంటిస్టులు కష్టపడి వాక్సిన్ కనిపెడుతున్నారు, డాక్టర్లు నర్సులు జబ్బుపడిన వారిని శాయశక్తులా రక్షిస్తున్నారు, మనం మన జాగ్రత్తలు తీసుకుంటే ఇలా అనుకోకుండా వచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నువ్వు మళ్ళీ వయొలిన్ వాయిస్తున్నావు కదా. ఈ కోవిడ్ వలన చాలామంది నేర్చుకున్న పాఠం ఏంటంటే జీవితంలో వేటికి నిజమైన ప్రాముఖ్యత ఇవ్వాలి అని. ఒకరకంగా మంచే చేసిందేమో ఈ కోవిడ్ ప్రపంచాన్ని కాలుష్యరహితంగా మార్చింది. గంగానది స్వచ్ఛంగా పారుతుంది, మానవత్వాన్ని తట్టి లేపుతుంది" నవ్వుతూ రాహుల్‌ను హత్తుకుంది పావని.

# అంత్యఘట్టం

సింగీతం శ్రీనివాసరావు


*1956 వ సంవత్సరం నవంబరులో మద్రాసు సెంటు జోసెఫ్స్ హాల్లో జరిగిన అంతర్ కళాశాల నాటికలపోటీలో లా కాలేజివారిచే ప్రదర్శింపబడి ప్రథమ బహుమతి పొందినది. భారతి మాసపత్రిక 1957 మే సంచికనుంచి పునర్ముద్రితం*

పాత్రలు:రాజు

డైరక్టరు సత్యారావు

రంగయ్య

శంకరబాబు




సబ్ఇన్స్పెక్టరు

ఇద్దరు పోలీసులు

నౌకరు

C*1* - ముందు కర్టెను.

C*2* - స్టేసులోని కర్టెను.

S*1* - C*2* పి,క్యూ ల ముందుండే సైడ్ కర్టెన్లు, M వైపుకు తిప్పబడి ఉన్నాయి.

P, Q, R, S, Tలు *ఊరికే సదుపాయం కోసం ఏర్పర్చుకున్న స్థలాలు.*

*స్టేజిముందు తెర* (C*1*) *వేసి ఉంటుంది. ఉన్నట్టుండి, తెరవెనుకనుంచి ఇంకా సరిగ్గా చెప్పాలంటే లోన ఎడమవైపు* (M) *నుంచి చప్పట్లు వినబడతాయి. చప్పట్లు కొన్ని వందలమంది కొట్టినట్టుగా ఉంది.*

ఒకగొంతు: మహాశయులారా: (చప్పట్లు నిలువలేదు) (గట్టిగా) మహాశయులారా (చప్పట్లు కొద్దికొద్దిగా త్వరగా తగ్గిపోతాయి - ముందు తెర (c1) ఇప్పుడు తీయబడ్తుంది.

తెర తీస్తుంటే, రాజు స్టేజి మధ్య R దగ్గర వ్రేలాడ కట్టబడిన మైక్ దగ్గర నిలబడి, ఎడమవైపుకు, అంటే (M) వైపుకు తిరిగి మాట్లాడుతున్నాడు. అక్కడ ఒక తెర (C2) వేయబడి ఉంది. అంటే ఆ తెర వెనకనుంచి చప్పట్లు వినబడుతున్నాయన్నమాట. తెరవెనుక ఉన్న ప్రేక్షకులకు (ప్రేక్షకులు కనబడరు. వారి అరుపులు మాత్రం వినబడతాయి.) రాజు మైక్‌లో చెబుతున్నాడు. ఇవికాక (C2) అనే తెర ప్రక్క రెండు సైడ్ కర్టెన్లు (S1, S2) ఉన్నాయి. వీటిపైన బొమ్మలవేవో అటువైపుకు ఉన్నాయిగాని, మనకు వాటి వెనుకభాగం మాత్రం కనబడుతుంది.

రాజు: మ-హా-శయు-లా-రా! (అంతా నిశ్శబ్దం) ఈరోజు మేము ప్రదర్శించబూనుకున్న "అంత్యఘట్టం" అనే నాటకంలోని నాలుగు అంకాలు అతి శ్రద్ధతో, అతి ఉత్సాహంతో మీరందరూ చూచారు. ఇకమీరు దేనికోసం అయితే నిరీక్షిస్తున్నారో, ఆ ఆఖరు అంకం ఈ "అంత్యఘట్టం" అనే నాటకంలోని అంత్యఘట్టం, ఇంకొక కొద్ది నిముషాల్లో మొదలెడ్తాం. (తెర C2 వెనకనుంచి చప్పట్లు) కాస్త ఓపికపట్టమని ప్రార్ధన. (చప్పట్లు - దూరం నుంచి "అలాగేలేవోయ్" అనే కేక) (రాజు తనమాటలు ముగియగానే త్వరగా S2 వైపుకు పరుగెత్తి) - కానియ్యండి, కానియ్యండి. ఆలస్యం అయిందంటే ఒకటే గోలపెడ్తారు.

డైరెక్టరు సత్యారావు: (ప్రవేశించి స్టేజిలో సామాన్లు సర్దుతూ) ఊఁ - త్వరగా - త్వరగా.

రాజు: ఆ మూడు కుర్చీలు చాలవూ?

డైర: చాలు, చాలు.


రాజు: ఈ రేడియో పొజిషన్ సరిగ్గా ఉందా?

డైర: ..........

రాజు: ఓ డైరక్టరుగారూ!

# అంత్యఘట్టం

శ్రీ శింగీతం శ్రీనివాసరావు




పాత్రలు:

రాజు
డైరక్టరు సత్యారావు
రంగయ్య
శంకరబాబు
సబ్ఇన్స్పెక్టరు
ఇద్దరు పోలీసులు
నౌకరు

$C_1$ - ముందు కర్టను.
$C_2$ - స్టేజిలోని కర్టను.
$S_1$ - $S_2$ - } P, Q ల ముందుండే సైడ్ కర్టన్లు, M వైపుకు తిప్పబడి ఉన్నాయి.

P, Q, R, S, T లు ఊరికే సదుపాయం కోసం ఏర్పర్చుకున్న స్థలాలు.

* * స్టేజిముందు తెర ($C_1$) వేసి ఉంటుంది. ఉన్నట్టుండి, తెర వెనుకనుంచి— ఇంకా సరిగ్గా చెప్పాలంటే—లోన ఎడమవైపు (M) నుంచి చప్పట్లు వినబడతై. చప్పట్లు కొన్ని వందల మంది కొట్టినట్టుగా ఉండ.

* 1956 వ సం॥ నవంబరులో మద్రాసు సెంటు జోసెఫ్సహాల్లో జరిగిన అంతర్ కళాశాల నాటికలపోటీలో లాకాలేజివారిచే ప్రదర్శింపబడి ప్రథమ బహుమతి పొందినది.

డైర: ఆ!

రాజు: ఈ రేడియో పొజిషన్ సరిగ్గా

డైర: ఆ - ఆ కొద్దిగా ఆ మూలగా పెట్టు. తరువాత, రాజూ రేడియో 'ఆన్' చెయ్యగానే కొన్ని క్షణాలు ఆగి

రాజు: రేడియోకు వేడి ఎక్కినట్టుగా.

డైర: అవును. కొన్ని క్షణాలు ఆగి నువ్వుపాట మొదలు పెట్టాలి.

(రంగయ్య ప్రవేశం)

ఏం రంగయ్యా? కానీ, కానీ. ఏం? మేకప్ సరిగ్గా ఉందా?

రంగ: (మీసాలు సర్దుకుంటూ) - చూడండి.

డైర: ఆ ఏదీ - కొద్దిగా - ఆ -ఆ అంతే (ఆగి) అసలు శంకరబాబు ఏడి?

రంగ: గ్రీన్ రూమ్‌లోకి వెళ్ళాడేమో?

డైర: ష్- అబ్బబ్బ: (గట్టిగా పిలుస్తూ) - శంకరబాబూ - శంకర

రంగ: ఒచ్చేస్తాడు లెండి. ఆ ఇందాకటి సీను ఎలా ఉంది?

డైర: ఒకటోరకంగా వుంది, శంకరబాబు నటన మాంచి రక్తి కట్టింది. అందుకే రంగయ్యా! ఈ ఆఖరు అంకం - భద్రం. ఇందకటి అంకం కంటే ఏ మాత్రం నాసిగా ఉన్నా -

రాజు: ఈ టేబుల్ ఇంకా మూలకు లాగాలా?

డైరె: ఎందుకు? - అలాగే బాగుంది.

బయట చప్పట్లు

రాజు: అబ్బబ్బ ఇంకా ఎందుకు ఆలస్యం

డైరె: శంకరబాబు -

రాజు: (లోపలికి టి ద్వారా పరుగెడుతూ) నేను పిలుచుకొస్తా. అక్కడ బయట అందరూ (అంటూ వెళ్ళిపోతాడు)

డైరె: రంగయ్యా నే చెప్పింది జ్ఞాపకం ఉందికదూ? ఇదుగో, మరి క్లైమాక్సు సీను కదా! నాటకం అంతా దీనిమీద ఆధారపడుంది.

రంగ: ఆ, శంకరబాబు ఆత్మహత్య చేసుకునేటప్పుడు -

రంగ: (శ్రద్ధగా) ఆ, ఆ -

డైరె: ఇలా కత్తితీసినప్పుడు, కేకవద్దు. ఏదో అర్థంకానట్లు భావం చూపించు. ఆ,ఆ అలాగే తరువాత కత్తి తీసి ఆత్మహత్య చేసుకోగానే ఒక్క క్షణం ఆగి గట్టిగా కేకవేయి. అందరూ అదిరిపోవాలి.

రంగ: (గట్టిగా కేక వేసినట్లు నోరు తెరచి, ముఖం మీద ఆ భావం ప్రకటిస్తాడు)

డైరె: ఆ - ఆ ఎందుకంటున్నానంటే

రంగ: అంత్యఘట్టం.

డైరె: అంత్యఘట్టం సరే ఇంకొకటి

రంగ : క్లైమాక్సు.

డైరె: క్లైమాక్సూ సరే నే చెప్పేది వినూ. ఇందాకటి సీనులో శంకరబాబు తన భార్యను హత్యచేసిన ఘట్టం బ్రహ్మాండంగా ఉంది. ఇప్పుడు దానిమీద ఈ ఆత్మహత్య ఘట్టం ఇంకా ఒక మెట్టు ఎక్కువగా తయారైతేనే రక్తి కట్టుంది. లేకపోతే అసలు నాటకం అంతా పేలవంగా తయారవుతుంది.

రంగ: కాదు మరీ - అమ్మో (మీసాలు సర్దుకుంటాడు)

రాజు: (ప్రవేశిస్తూ) ఏం మీరంతా సిద్ధంగా వున్నట్టేనా?

డైరె: "మీరంతా" ఏవిటి? ఇప్పుడిక ఏక్టు చేసేవారు ఇద్దరే. శంకరబాబు రంగయ్య, శంకరబాబు ఏడి?

రాజు: వస్తున్నాడు. ఆ పోయిన హత్యసీనులో ఏమైందో ఏమో తల తిరిగిందట. పోయి లోపల పడుకున్నాడు. వస్తాడు. ఆ, ఈ కుర్చీ ఇక్కడ ఇలా ఉండాలా?

డైరె: ఆ! తరువాత చాలా ముఖ్యం డ్రాయర్‌లో కత్తి పెట్టావా?

రాజు: (డ్రాయర్‌లో నుంచి కత్తి బయటకు తీసి చూపెడ్తూ) ఇదుగో.

డైరె: అది లేకపోతే ఈ అంకమే లేదు. అదుగో శంకరబాబు.

(శంకరబాబు లోపలికి వస్తాడు. మేకప్‌లో ఉన్నాడు. అంటే మేకప్‌లో అతని వయస్సు (నిజంగా అతని వయస్సుకూడా అంతే) ముప్ఫై సంవత్సరాలు. గడ్డం కూడా కొద్దిగా పెరిగినట్టుంది. తల వెంట్రుకలు బాగా పెరిగి ఉన్నాయి. ముంగురులు ఒకటి రెండు నుదురు మీదికి వచ్చి వ్యక్తికి ప్రత్యేకతనిస్తున్నాయి. వేసుకున్న జుబ్బా (చాలా ఖరీదైంది) వదులుగా ఉండడం వల్ల మనిషి ఇంకా భారీగా అగుపడుతున్నాడు)

డైరె: ఏం, శంకరబాబు. ఒంట్లో బాగోలేదా?

శం: ఏ-మీ-లే-దు.

డైరె: (శంకరబాబు చెంపమీద చెయ్యివేసి ఉష్ణాన్ని చూస్తూ ధైర్యంగా) జ్వరం లేదు.

శం: ఉందికాని ఫరవాలేదు. ఇక ఒక్క అంకమేగా మిగిలి ఉంది?

డైరె: ఒక్కటే.

శం: ఒక్కటే

డైరె: ఇదికూడా అంతా సక్రమంగా సాగిపోతే

శం: సాగిపోతే.

డైరె: ఏమిటి శంకరబాబు ఏమిటా మాటలు?

రాజు: అబ్బ, ఏమిటి శంకరబాబు ఈ రోజు నీలో ఏదో అసాధారణంగా.

డైరె: ష్ –( రాజును ఊరుకోమని సైగచేస్తూ) ఏమీలేదు. అసాధారణం ఏవిటి? ఇంత సీరియస్ సీన్లు వేస్తే ఎవ్వరికైనా తలతిరుగుతుంది. అలాంటప్పుడు శంకరబాబు పాత్రలో లీనమై తనే ఆ పాత్ర అయి, ఆ స్థితిలో జీవించినట్టు

శం: నిజం ఆ పాత్ర అయి, ఆ స్థితిలో జీవించేటట్టు.

డైరె: మరి అలా నటిస్తే

శం: "నటిస్తే"

డైరె: అవును. అంతమహత్తరంగా నటిస్తే ఆవేశం రాదూ? అది రసావేశం. అంతే. శంకరబాబు. ఈ అంత్యఘట్టంలో మనం ఊహించిన ఆ అంతస్తు అందుకున్నామంటే నా సంతోషం, ప్రజల సంతోషం అలా ఉంచు – నీ సంతోషం (శంకరబాబు ముఖం మీద ఒక చిరునవ్వు) అవును, నీ సంతోషం. నిన్ను మళ్ళీ మాలో వానిగా చేస్తుంది. (భుజం మీద తట్టూ) జ్వరంలేదు, ఏమీలేదు. ఏం రెడీనా? మొదలెడ్దామా?

(బయట అరుపులు – శంకరబాబు తల ఊపుతాడు)

డైరె: భలే రాజు రెడీ? రంగయ్యా?

రంగ: ఆ – ఆ, రెడీ.

(రాజు పరుగెత్తి అవతలి వైపు సైడ్ కర్టెన్ S2 దగ్గరకు పోయి Q దగ్గర నిలబడతాడు. డైరెక్టరు త్వరగా ఒక పర్యాయం స్టేజిలో సామాన్లంతా చూచి, తృప్తిపడి, రంగయ్య, శంకరబాబులతో P దగ్గరకు వచ్చి నిలబడ్డారు. డైరెక్టరు నాటకం పుస్తకం తీసి 'ప్రాంప్ట్' చెయ్యడానికి సిద్ధం అవుతాడు. డైరెక్టరు రెడీ అన్నట్టుగా చెయ్యి చూపడంతో అటువైపు రాజు తాడు పట్టుకుని లాగుతాడు. కర్టెను C2 తెరవబడుతుంది. దాని వెనుక ఉన్న దీపాలు (ఫుట్ లైట్స్) వెలగడంతో స్టేజి కాంతి వంతం అవుతుంది. అంటే M దగ్గర ఉండే ప్రేక్షకులకు వీరెవ్వరూ కనబడటంలేదు. ఖాళీ స్టేజీతప్ప. ప్రేక్షకులు అంతా నిశ్శబ్దంగా అయినారని తెలుసుకుని శంకరబాబు చిన్నగా ఆలోచిస్తూ, క్రిందకి చూస్తూ, ఏదో మనోవికారాన్ని వెల్లడిస్తూ, రెండు చేతులు వెనుక కట్టుకుని P నుంచి R వైపుకు నడుస్తాడు. అంతా నిశ్శబ్దం.)

శం: చేతిగడియారం చూచుకుని) ఇంకా రాలేదు రామం, రామం.

డైరె: (అందిస్తూ) ఎంతపని..

శం: (అందుకుని) ఎంతపని చేసావు? కాదు నా చేత ఎంతపని చేయించావు.

డైరె: శాంతి..

శం: శాంతి. శాంతి దూరం అయిపోయింది. ఆ పని నేనే చేసానా?

డైరె: ఈ చేతుల్తో.

శం: ఈ చేతులతో నేనే చేసానా? ఏ విధంగానూ అనుమానించలేని శాంతిని చంపి ఇంకా నేను బ్రతికే వున్నాను.

డైరె: బ్రతికి చేసిన...

శం: బ్రతికి, చేసిన తప్పుకు పరితపించటం శిక్షలలో ఘోరమైన శిక్ష. శాంతి ప్రపంచంలో లేదు. కాదు శాంతిస్వరూపం నాలో ఉండి నాలో శాంతిని నాశనం చేసింది.

డైరె: ఏమిటీ మాటలు?

శం: ఏ-మి-టీ-మా-ట-లు

(అర్థం లేకుండా అవీ ఇవి చూస్తూ ఆ వస్తువూ ఈ వస్తువూ ముట్టుకుంటూ, అవ్యక్తంగా దగ్గర ఉన్న రేడియోను 'ఆన్' చేస్తాడు. రేడియోలో నుంచి వచ్చేపాట వింటూ మౌనంగా కుర్చీలో కూలబడ్తాడు.

రేడియోలో నుంచి పాట వచ్చినట్టుగా Q దగ్గర నిలబడ్డ రాజు పాడ్తాడు. అంటే రాజు పాడటం మనకు స్పష్టంగా కనబడుతుంది. కానీ M దగ్గర ఉండే ప్రేక్షకులకు అది రేడియోలో నుంచి వచ్చే పాట.)

రాజు: (పాడ్తూ)

స్వప్నంలో నూత్న శకం

యత్నంతో కొత్త రకం

మూల విరాట్ వలకం

కాలంలో లోలకం.

శం: (తనలో) ఎవడో పాడే వాడికీ నాలాగే జీవితోద్దేశ్యం అర్థం కావటంలేదు. (పాట వింటూంటాడు)

(ఉన్నట్టుండి కుడివైపునుంచి T నుంచి ఒక నౌకరు కుర్రవాడు చాలా ఆతురతతో P దగ్గర ఉన్న డైరెక్టరు దగ్గరకు వచ్చి)

నౌకరు: (చిన్నగా, భయంగా) సార్, సార్. మీ కోసం ఒక సబ్ ఇన్స్పెక్టర్ ఇద్దరు పోలీసులు వచ్చారు.

డైరె: (ఆశ్చర్యంగా) నా కోసమా? సబ్ ఇన్స్పెక్టరు

నౌకరు: అవును సార్, అరుగో ఇక్కడికే వచ్చేసారు.

(సబ్ఇన్స్పెక్టరు, ఇద్దరు పోలీసులు T నుంచి ప్రవేశిస్తారు)

రాజు: (పాట)అ -ఆ-లలో అరాజకం

ఆదిలోన అవివేకం -

డైరె: (సబ్ ఇన్స్పెక్టర్ దగ్గరకు వెళ్తూ) ఏమిటండీ?

సబ్: (గట్టిగా - అటు స్టేజిలో మైకులు ఉన్నాయనే సంగతి జ్ఞాపకం లేక) ఎవరండి? ఈ నాటకానికి డైరెక్టరైన సత్యారావు

డైర: ష్, చిన్నగా (దగ్గరకు వచ్చి) నేనేనండి. నేనే, ఏమన్నా -

సబ్: (తన మాములు ధోరణిలో బిగ్గరగా) మీరేనా ఈ నాటకం -

డైరె: ష్ చిన్నగా మైక్‌లో అందరికి వినబడ్తుంది

రాజు: పాట)

అంతులేని నాటకం

అంకంలో ఆటంకం -

డైరె: అదుగో అప్పుడే "అంకంలో ఆటంకం"

సబ్: (కోపంగా) ఆటంకం.

డైరె: అబ్బెబ్బె, నాటకం అంతవరకు వచ్చిందంటున్నా.

సబ్: మీ నాటకంలో వేషం వేసే శంకరబాబుగారు ఎక్కడున్నారు?

డైరె: ఎందుకు?

సబ్: ఎక్కడున్నారండి? వారిని పిలిపించండి, పనుంది.

డైరె: ఆ!

సబ్: అవును.

డైరె: అదెలాగండి? నాటకం అంత్యఘట్టంలో

సబ్: అంత్యఘట్టం అయితే మాకేమండీ.

డైరె: ష్, చిన్నగా? (ఒకరినొకరు తేరిపార చూచుకుంటారు)

(ఆతురతతో) ఏవండీ, మరేం ప్రమాదం

సబ్: బయటకు పిలిపించండి.

డైరె: ఆ!

రాజు: (పాట)

విశ్వపుటంచులకు బాట

విజ్ఞానుల భజన పాట

డైరె: రంగయ్య! రంగయ్య మరి ఎలా చేస్తాం? ఉన్నట్టుండి కారణం లేకుండా అతను ఇలా వచ్చేస్తే

సబ్: కారణం లేకుండా ఏవిటి?

డైరె: ప్రేక్షకుల కండి. వారికి కారణం ఎలా తెలుస్తుంది? ఏం, రంగయ్య ఈ విషయం ప్రేక్షకులకేమాత్రం తెలియకుండా అంతా నాటకంలోలాగే, నువ్వు రంగయ్యా నువ్వు స్టేజిలోకి పోయినట్టు పోయి

రంగ: ఇప్పుడు నా 'ఎంట్రెన్సు' కాదే అతని 'స్పీచ్' ఒకటుంది.

సబ్: ఇదుగో, మీరు చెయ్యకపోతే మేమే

డైరె: ఒద్దండి, ఒద్దండి. రంగయ్యా, ఎలాగో ఓ లాగు, నీదే 'ఎంట్రెన్స్' అనిపిచ్చు, మాటల మధ్యలో చినన్గా, శంకరబాబుకు ఈ సంగతి చెప్పేయి. త్వరగా

రంగ: నాటకం ఎలా తయారవుతుందో, అంత్య ఘట్టం.

(స్టేజిలోకి వెళ్ళినట్టుగా P నుంచి R వైపుకు వెళ్తాడు.)

రాజు: (పాట)

భవిష్యత్తు లేని చోట

భావకవుల గాలిమూట -

(రంగయ్య ప్రవేశించగానే అటు దగ్గర నిలబడి పాడుతున్న రాజుకు ఏం అర్థం కావటంలేదు. రంగయ్య ఎందుకు ప్రవేశించాడా అని శంకరబాబుకు కూడా అర్థం కాక పోయినా, తన మానసిక స్థితిలో ఇవి ఏవీ అతనికి తట్టడంలేదు.)

శం: (రంగయ్యను, అంటే నాటకంలో "రాము"ను చూచి లేస్తూ) ఎవరు? రాము. ఆ, రాము, నిన్ను గురించే ఆలోచిస్తున్నా. (రేడియోను ఆపేస్తాడు. రాజు పాట నిలిపేస్తాడు.)రంగ: నన్ను గురించా?

శం: అవును నిన్నుగురించి ఆలోచిస్తూ పిచ్చివానిలా ఆ రేడియో వెయ్యగానే నాలాంటి పిచ్చివాడు నా భావాలే పాడుతున్నాడు. లోకం అంతా పిచ్చి. ఇదేవేళప్పుడు, ఆ రోజు నేను శాంతిని.

రంగ: బాబు. అంతా మరచిపో, హృదయంలో శాంతాన్ని

శం: (తనలో నవ్వుకుంటూ) శాంతాన్ని. శాంతి చనిపోయింది. నీకు తెలీదు కాబోలు.

రంగ: అంతా తెలిసింది. (దగ్గరకు వచ్చి) మరచిపోబాబు (అని దగ్గరకు వెళ్ళి భుజం మీద చెయ్యివేసి ఎం దగ్గర ప్రేక్షకులకు తెలియకుండా, (మనకందరికి బాగానే కనబడేటట్టు, శూన్యంగా చూస్తున్న శంకరబాబు చెవిలో పోలీసులు వచ్చిన సంగతి ఊదుతాడు.)

శం: (ఆశ్చర్యంగా) ఆ! (చిన్నగా అయోమయంగా P వైపుకు నడుస్తాడు.)

రంగ: (నటన అనిపిస్తూ) బాబూ! ఎక్కడికి? ఆవేశం వద్దు (శంకరబాబు P దగ్గరకు వచ్చేస్తాడు. చేసేది లేక రంగయ్య కుర్చీమీద కూర్చుని మళ్ళీ రేడియో 'ఆన్' చేస్తాడు.)

రాజు: (పాట)

సర్వజ్ఞుల కలం అటూ

సామాన్యుల బలం ఇటూ

శం: (చిన్నగా) పిలిచారా?

సబ్: మీరేనా శంకరబాబు?

శం: అ-వు-ను.

సబ్: మీమీద నేరం -

శం: తె-లు-సు. (శూన్యంగా, విషాదంగా పైకి చూస్తాడు.)

డైరె: ఏమిటి, శంకరబాబు ఏమిటిదంతా?

సబ్: మూడు సంవత్సరాల వెనుక మీరు మీ భార్యను ఖూనీచేశారు.

డైరె: ఆ!

సబ్: అప్పుడు మీ పేరు సురేష్. ఖూనీ చేసింది మీరని పోలీసులకు తెలియగానే వారికి చిక్కకుండా పారిపోయారు. అప్పట్నుంచీ మిమ్మల్ని వెంటాడుతూ-

శం: ఇన్స్పెక్టరుగారూ ఈ మూడు సంవత్సరాల్లో మనిషి మారటానికి వీల్లేదా?

సబ్: (ఆ మాటలు చెవికెక్కించుకోక) అప్పట్నుంచీ మిమ్మల్ని వెంటాడుతూ ఈ రోజుకు ఆ సురేష్, శంకరబాబు పేరుతో ఈ "అంత్యఘట్టం"లో నటించే మీరు ఒక్కరే అనే తార్కాణాలు దొరికాయి.

శం: నాదొక్కమాట. (చిన్నగా) మీరే శిక్ష అయినా విధించుకోవచ్చు. కానీ, చేసిన పనికి ప్రాయశ్చిత్తం ఎప్పుడో అనుభవించాను. జీవించి, పరితపించి, కుళ్ళిపోవడం ఇంకా -

డైరె: శంకరబాబు.

క్షమించండి. డైరెక్టరుగారు, నాకెందుకో అనిపించింది ఈ రోజు అంత్యఘట్టం అని. వెళ్ళకతప్పదు. మరొక్క క్షణం నాలో నేనే కుమిలిపోయి బాధపడలేను (సబ్ ఇన్స్పెక్టరుతో) మీ ఇష్టం.

డైరె: శంకరబాబు, నాటకం సంగతి. ఇక నన్ను బ్రతకనియ్యరు. యిదే యింక కొన్ని క్షణాలు - అంత్యఘట్టం.

శం: అంత్యఘట్టం?

సబ్: ఏం? ఎక్కడికీ పారిపోవడానికి వీలుండదులెండి. అంతా బందోబస్తు చేసాం.

శం: ఇక పారిపోవాలనిలేదులెండి.

డైరె: (ప్రాధేయపడ్తూ) శంకరబాబు. ఏదో విధంగా ఈ అంకం పూర్తిచేసి నన్ను కాపాడండి. ఇదంతా ఎందుకో అయోమయంగా ఉంది.

శం: .....

సబ్: ఏమిటీ ఆలస్యం?

డైరె: శంకరబాబు.

రాజు: (పాట)

ఆర్భాటపు ఆటుపోటు అటా ఇటా వెళ్ళేదెటు?

(ఈ ఆఖరు చరణం 'అటా ఇటా వెళ్ళేదెటు' పలమారు పోను పోను త్వర త్వరగా పాడటం మూలాన, అప్పటికప్పటికే ఒక మానసిక స్థితిలో ఉన్న శంకరబాబులో మరింత సంచలనం కలిగిస్తుంది. అతనికేమీ అర్థంకాదు. పాట చరణం సాగుతూనే ఉంటుంది)

శం: (ఇక ఆపుకోలేక, అరుస్తూ) ఆపండి, ఆ పాట (అంటూ స్టేజీలోకి పరుగెత్తి రేడియో 'ఆఫ్' చేస్తాడు. రాజు వెంటనే పాట నిలిపేస్తాడు. సబ్‌ఇన్‌స్పెక్టరుకు శంకరబాబు ఉన్నట్టుండి వెళ్ళడం అనుకోకుండా జరిగింది. తను వెంటాడబోయేటప్పటికి జరిగింది తను వెంటాడబోయేటప్పటికి అతన్ని డైరక్టరు వెనక్కులాగి బలవంతాన Pదగ్గరనే ఒక కుర్చీలో కూర్చోబెడతాడు)

రం: ఏమిటి బాబు. ఆవేశంతో ఎక్కడికో వెళ్ళిపోతే దిగులుతో ప్రతిక్షణం యుగంగా గడిపా.

శం: అవును - (కూర్చుంటాడు)

సబ్: డైరెక్టరుగారూ

డైరె: కాస్త కనికరించండి. ఇది కానియ్యండి, మా కోసం, మా ప్రాణం కోసం.

సబ్: మాకు టైము లేదండీ

డైరె: ష్, చిన్నగా.

(సబ్ ఇన్‌స్పెక్టరు పళ్ళు కొరుకుతాడు. అతను, ఇద్దరు పోలీసులు శంకరబాబు ప్రతి అడుగును తదేక దృష్టితో చూస్తుంటారు.)

డైరె: (నాటకం పుస్తకం త్వరగా తీసి, అందిస్తూ) బాబు, జరిగిపోయింది.

రంగ: (అందుకుని) బాబు జరిగిపోయింది ఏదో జరిగిపోయింది, మళ్ళీ

డైరె: దాన్ని జ్ఞప్తికి -

రంగ: (ఏం చెప్పాలో అర్థంకాక) అ.హ నువ్వే నేరమూ చెయ్యలేదనుకో.

శం: చేసి చెయ్యలేదని ఎలా అనుకోమంటావు? అంతా గాలిమాటలు. చేసింది జ్ఞప్తికి తెచ్చుకుని కుమిలిపొమ్మని ఏ శాస్త్రం చెప్పిందని అడిగావు. అడిగావా? కుమిలిపోకుండా చెయ్యటానికి ఏకైకమార్గం ఏ శాస్త్రం చెప్పింది?

(డైరెక్టరుకు పూర్తిగా ఆశపోయింది. శంకరబాబు తన కిచ్చవచ్చినట్టు మాట్లాడుతున్నాడని తెలుసుకుని, పుస్తకం మూసి, అంతా మంచిగా కానీ అని కోరుతూ ఊరకే ఆతురతతో నిలబడతాడు.)

శం: మరచిపోదాం అనుకున్నా లాభం లేదు. కానీ ప్రయత్నం మీద కొంత మరచిపోయినా ఈ రోజు మళ్ళీ నా నేరం నా కళ్ళముందు బాకుల్లా వచ్చి నిలబడ్డాయి. నేరం చెయ్యలేదనుకుని సంతోషపడదామనుకున్న "నన్ను" నేరస్థుణ్ణి చేసారు.

రంగ:ఆ!

శం: చేసిన హత్య చేసాను. మరచి పొమ్మంటావా? గతించింది జ్ఞాపకం తెచ్చుకుని చేసిందానికి చింతిస్తే అదొక ఆనందం. అదొక తృప్తి పరితపించడం శాంతించడం కోసం. అందుకే పరితపిస్తున్నాను. శాంతి దొరుకుతుందని, శా-ం-తి( చిన్నగా డ్రాయరు దగ్గరకు వెళ్ళి కత్తి తీస్తాడు. సబ్ ఇన్స్పెక్టరుకు దిగులు పడుతుంది. డైరెక్టరు భయాన్ని అణుచుకోటానికి ప్రయత్నిస్తాడు.)

శం: ఇదుగో, దీన్ని చూచినప్పుడల్లా ఇందులో క్షణానికి ఒక ప్రతిబింబం అగుపడ్తుంది. భ్రమ అంటావా? నే చెప్పేదంతా నాటకంలోని మో స్తరుగా వున్నదంటావా? అయితే నీకర్థంకాలేదు. నాలో రేగుతున్న భావాలు అలాంటివి. ఆఖరుసారి అవి ఇక్కడ చెబుదాం అనుకున్నా.

రం: బాబు.

శం: అవును - విను (రంగయ్య లేవబోతూంటే) కూర్చో, ఎవ్వరూ లేవనక్కరలేదు. శాంతికోసం, నా మనశ్శాంతి కోసం నేను చెప్పవలసిన మాటలు సంతోషంగానే వినవచ్చు. (ఆగి) ఆ రోజు శాంతి ఏకాంతంగా కూర్చుని ఉంది. అప్పటిదాకా నాకు శాంతిమీద అసూయ ఉందనే సంగతి నాకు తెలీదు. అసలు అందరి ఉద్దేశ్యం తెలుసా? నేను శాంతిని హత్యచేసింది అనుమానంతో అని అందరి అభిప్రాయం.

"అనుమానంతో ఛీ!ఛీ అనుమానం, ధనాపేక్ష, స్వలాభం ఇలాంటి కారణాలకు హత్యలు చేసేవాళ్ళు క్షుద్రులు. అది విజ్ఞాన సంపన్నులు, 'ఇంటలెక్చ్యుయల్సు' చెయ్యవలసిన హత్యకాదు. (విషాదంగా) ఈ భావాలు అప్పటివి. ఇప్పటివి కాదు. నేను 'పైకి' నా కోసం, సంఘం కోసం ఎలాంటి మాటలాడుతున్నప్పటికీ నా హృదయాంతరంలో ఉన్న ఆవేశం వేరు. పైకి స్త్రీకి సమాన హక్కులు ఉండాలన్నా, లోపల మాత్రం నాకు కావలసింది నాకన్నా మేధాశక్తిలో ప్రతిభలో తక్కువై నేనే ఎక్కువ అని నాకు తృప్తి కలిగించే స్త్రీ. నీతినియమాలను గురించి బాహ్యంగా నేను ఎన్ని స్వచ్ఛమైన విప్లవభావాలను వెల్లడించినా, మనస్సులో దాక్కున్నవన్నీ పుచ్చిపోయిన పాత ఉద్దేశ్యాలే. ఒక్క ముక్కలో పైకి మేధావిలా అగుపడాలన్నా, లోపల అజ్ఞానంతో నిండిన బూటక వ్యాపారస్తుణ్ణి. ఈ సంగతి ఇప్పుడు తెలుసు కానీ అప్పుడు శాంతికి ఉన్న స్వేచ్ఛ, శాంతి విజ్ఞానం, శాంతి చూపిన అధికారం, శాంతి అందుకున్న శిఖరం చూస్తూ, దాన్ని చూసి మురిసిపోవడము పోనిచ్చి, అసూయపడ్డా. ప్రక్కనే నా చిన్న ఆకారం అద్దంలో చూచుకున్నట్టు కనబడేటప్పటికి కృంగిపోయా. గాయపడ్డా. మనస్సులో ఎక్కడలేని రోషం వచ్చింది.

మానవనైజం. నేను తక్కువ. శాంతి ఎక్కువ అని చెప్పుకోటానికి నోరు ఆడలేదు, మనస్సు రాలేదు సరికదా! నాదే అగ్రస్థానం అనిపించాలని ఆవేశం నాలో నిండింది. నాలో చెలరేగే ఈ ఆటుపోటులేవీ శాంతికి తెలియవు.

(సబ్ ఇన్స్పెక్టరు ఎందుకో చిరునవ్వు నవ్వాడు)

నాకు శాంతిమీద ప్రబలద్వేషం బయలుదేరింది. దాంతో శాంతి అంటే భయం. అందుమీద నేను జీవించాలంటే శాంతి ఉండకూడదనే చెప్పరాని మనోవికారం. ఆ రోజు శాంతి పదింతలు భయానకంగా అగుపడింది. ఎందుకో, చెప్పలేను. అది నా మనోవికారం కావచ్చు. కానీ అలా అగుపడింది సత్యం. ఆఖరుకు అడగవలసిన ప్రశ్న శాంతిని అడిగాను.

"నీకు జీవించాలని ఇష్టం ఉందా?" అని. పెద్ద ప్రశ్న (ఆగి) ఏం చెపుతుంది?

"ఉండకపోతే మానవులమా? కిరాతులం" అంది. ఆ నా ప్రశ్నతో నన్నే సుడిగుండంలో తోసింది. హృదయాంతరంలో కూరుకున్న రోషం ఒక్కసారి పైకి ఉబికి నా కళ్ళు తిరిగినై. ఆ తరువాత ఏమైందో నాకు తెలీదు. అంతా తెరకప్పినట్టుగా తోచింది. ఏదో ఒక గద్గద స్వరం ఏదో అరుపు, ఏదో ఆపలేని సంచలనం తేరుకుని కళ్ళు తెరచి చూచేటప్పటికి నా ముందు శాంతి లేదు. శాంతికి బదులు, ప్రజ్ఞ, మేథాశక్తి అధికారం గల శాంతికి బదులు స్వాతంత్ర్యం పోయి, శక్తిలేక నిర్జీవంగా పడున్న శాంతి భౌతిక దేహం నేలమీద పడుంది. శాంతి. శాంతి!!

(సోఫామీద కూలబడ్తాడు. సబ్‌ఇన్‌స్పెక్టరు ఒక్క అడుగు ముందుకు వేస్తాడు. కానీ డైరెక్టరు అతన్ని వెనక్కు లాగుతాడు.)

శం: అదీ నే చేసిన తప్పు. అంతా మరచిపోదాం అనుకున్నా. శాంతిని మరచిపోయి శాంతి సంపాదించడం. ఎలా సాధ్యం? ఇప్పుడు నా భావాలు వేరు. మనిషిని మారాను. అనుభవం సంపాదించి విజ్ఞానం కన్నా ముఖ్యమైన జ్ఞానంవల్ల తప్పును మనస్సులో అంతర్భాగానికి నెట్టి మంచిగా జీవిస్తున్నా. కానీ

రం: కానీ - కానీ చెడుగా ఉన్నప్పుడు నేరస్తుణ్ణి పట్టుకుని బాగు చెయ్యలేని పోలీసులు బాగుపడ్డ తరువాత పట్టుకోటానికి వచ్చారు. (సబ్‌ఇన్‌స్పెక్టరు కళ్ళెర్ర చేస్తాడు) బయటనే ఉన్నారు నేనిప్పుడు బాగుపడ్డానంటే ఒప్పుకోరు. నన్ను ఖైదు చేసి మళ్ళీ రాతిగుండె వాణ్ణిగా చెయ్యటమే వాళ్ళ ప్రస్తుత ధర్మం. లేదు, మళ్ళీ దుర్మార్గానికి వెళ్ళలేను.

తెలిసి తెలిసి వెళ్ళలేను. వెళ్ళను. జీవించి శాంతిని సంపాదించలేము. అందుకని ఇక ఒకటే మార్గం, ఒక్కటే ఒక్కటే.

రంగ: బాబూ

శం: (కత్తిని ఝుళిపించి) నన్నెవ్వరూ అడ్డుపెట్టకండి.

రంగ: బాబూ!

శం: ఇది నా స్వాతంత్ర్యం. నా జీవితం నాకోసం నా శాంతికోసం శాంతి శాంతి

(రంగయ్య శంకరం బాబును గట్టిగా పట్టుకుంటాడు)

రంగ: వద్దు, వద్దు

డైరె: (భయం, ఆవేశంతో) ఆ!

శంక: వదలండి

సబ్: (డైరెక్టరును వదిలించుకుని, ఆవేశంతో విజిల్ వేస్తూ ఆగండి, ఆగండి (స్టేజిలోకి దూకుతాడు. ఇద్దరు పోలీసులు కూడా దూకి పొడుచుకోబోయే శంకరబాబును గట్టిగా పట్టుకుంటారు)

శం: (విదిలించుకోవటానికి అన్ని విధాలా ప్రయత్నిస్తు) వదిలి పెట్టండి, నన్ను వదిలి పెట్టండి. నా శాంతి కోసం నేను చేసే కార్యానికి స్వాతత్ర్యం ఇవ్వండి. స్వాతంత్ర్యం నాకోసం

(శంకరబాబు అరుస్తుంటే ఇద్దరు పోలీసులు అతన్ని పట్టుకుని Rనుండి పికి, అక్కడ నుంచి T ద్వారా తీసుకుని వెళ్ళిపోతారు. పోలీసులు పి చేరగానే డైరెక్టరు ఆవేశంతో చేసిన సంజ్ఞ ప్రకారం, రాజు C2 అనే కర్టెన్ వేసేస్తాడు. వెంటనే ఆ వెనకనుంచి

ఉత్సాహపూరితంగా చప్పట్లు వినిపించుతాయి. చప్పట్ల మధ్యలో "శంకరబాబు స్టేజిమీదకు రావాలి" అనే అరుపులు వినబడతాయి. శంకరబాబు పోతూ పోతూ ఈ మాట విని విషాదంగా చిరునవ్వు నవ్వి వెళ్ళిపోతాడు.)

రాజు: (అర్ధంకాక, డైరెక్టరుదగ్గరకు పరుగెడుతూ డైరెక్టరుగారు ఏమిటిదంతా? పోలీసులు -

డైరె: అవును. శంకరబాబును అరెస్టు చేసారు.

రం: చూసారా? పాపం జనం, ఇదంతా నాటకమే అనుకుంటున్నారు.

రాజు: అదెలా?

డైరె: ఎందుకనుకోరూ? పాపం శంకరబాబు కథ, నాటకంలో తను వేసే పాత్రకథ అంతా ఒకటే అయింది. అందుకని శంకరబాబు తన కథ చెప్పినా, అది నాటకానికీ, తనకు అంత్యఘట్టం అయింది. (ఆగి, ఆలోచించి) ఇప్పుడర్థం అయింది.

రాజు: ఏవిటి?

డైరె: శంకరబాబు చెప్పిన మత పెద్ద స్పీచ్ నాటకంలో వాస్తవికత అనిపించుకుంటుందా? కానీ మనకు తెలుసుగా. అది అక్షరాలా వాస్తవమని.

రాజు: అవును, అయితే.

డైరె: అయితే, ఇంతే మనకింకా నాటకంలో వాస్తవికత అంటే ఏమిటో అర్థకాలేదని.

రాజు: ఏవిటో, మరి జనం అద్భుతంగా నటించిన శంకరబాబును

రం: నటించిన

రాజు: ఆ శంకరబాబును చూడాలని గోలపెడ్తున్నారు. ఏం చేద్దాం?

డైరె: ఇంకా తప్పట్లు కొడ్తూనే ఉన్నారు. రాజు నిజం చెప్పక తప్పదు. ఈ సంగతి మైక్‌లో చెప్తావా?

(రాజు తల ఊపి, చిన్నగా మైక్ దగ్గిరకు వెళ్ళి అంకం ప్రారంభంలో ఎలా నిలబడ్డాడో అదే విధంగా నిలబడి మాట్లాడతాడు. లోపల నుంచి చప్పట్లు కొట్తూనే ఉన్నారు.)

రాజు: మహాశయులారా - (ఇంకా చప్పట్లు) మ-హా-శ-యు-లా-రా (చప్పట్లు తగ్గిపోతాయి) ఒక చిన్న మనవి. ఈ రోజు అంత్య ఘట్టంలో (వాక్యం మొదలుపెట్టేటప్పటికి ముందు తెర లాగబడి, రాజు మాట్లాడుతుంటే నెమ్మదిగా మూసుకుంటుంది.)

# పూలపల్లి విత్తనాలు

వారణాసి నాగలక్ష్మి

అన్నయ్య డ్రైవింగ్ లో ఆడీ కారు వేగంగా పూలపల్లి వైపు సాగిపోతోంది.

లోపల ఏసీ చల్లదనం, బయట దారికటూ ఇటూ పరుచుకున్న పచ్చదనం ఆహ్లాదకరంగా ఉన్నా మనసు మాత్రం కల్లోలంగా ఉంది. నా మనసులో ఉన్నది ఎలా బయట పెట్టాలా అనీ, బయట పెట్టాక అక్కడెలాంటి కల్లోలం ఎదురవుతుందో అనీ కొంత గాభరా.

పూలపల్లిలో బాబాయి సంవత్సరీకాలు రేపటినుంచి. పిల్లలకి పరీక్షలుండడంతో రవి రావడానికి కుదర్లేదు. వదిన కూడా అదే కారణం వల్ల రాలేకపోయింది. మూడురోజుల క్రితం అమ్మా అన్నయ్యా మాత్రమే వచ్చారు, కాలిఫోర్నియా నించీ. మా కార్లో ముగ్గురం బయల్దేరాం. ఏటా ఇండియా వస్తూండే అన్నయ్యకి మన రోడ్ల మీద డ్రైవింగ్ అలవాటే.

ఇంట్లో పిల్లల స్కూళ్లూ, రవి వర్క్ ఫ్రమ్ హోమ్ ఏర్పాటులో ఉండడం వల్ల అన్నయ్యతో అనుకున్నవేవీ మాట్లాడలేకపోయాను. పూలపల్లి చేరేలోగా ఈ విషయం వాడితో మాట్లాడి తేల్చుకోవాలి... వాడేమంటాడో.

“అన్నయ్యా” అన్నాను పాటలు వింటూ డ్రైవ్ చేస్తున్న అన్నయ్యతో.

చెప్పమన్నట్టు ఓ చూపు నా వైపు పారేశాడు.

ఒక్క క్షణం తటపటాయించి “తాతగారి ఆస్తి పూర్తిగా బాబాయికి ఇచ్చేయడం న్యాయమేనా అన్నయ్యా? నాన్నకి ఏమీ ఇవ్వకుండా?” అన్నాను.

ఒక నిట్టూర్పు విడిచి, “సుజీ.. ఇదివరకు కూడా నువ్విది అడిగావు....తాతగారలాంటి విల్లేమీ రాయలేదని నీకూ తెలుసు కదా” అన్నాడు.

“అదేలే... తాతగారు విల్లు రాయకపోయినా ఆయన పోగానే నాన్న తనంతట తనే అలా డిసైడ్ చేసుకుని చెప్పేయడం కరక్టేనా? ఆయనలా అనగానే అత్తలిద్దరూ కూడా ఒప్పేసుకుని, నీకూ నాకూ ఏమీ ఇవ్వకుండా నాన్నకి వంత పాడడం సరైనదేనా?”

అన్నయ్య మౌనంగా డ్రైవ్ చేస్తూండిపోయాడు. రెండు నిముషాలు గడిచాయి.

"అయితే ఏమిటంటావు?" అన్నాడు.

"నోటిమాటగా నాన్న ఏదో అన్నారు. మనం అక్కడ లేనపుడు ఏం జరిగిందో. ఇపుడు అందులో మనకీ వాటా కావాలని అడగచ్చు కదా?" అన్నాను.

"సుజీ!" అన్నయ్య అదోలా చూశాడు నావైపు.

వెనక నించి అమ్మ "కిషోర్, నీకు డబ్బుకిబ్బంది లేదు గనక అలా అంటున్నావు. రవికి బిజినెస్ లో చాలా నష్టం వచ్చిందనీ, ఫైనాన్సెస్ కొంత ఇబ్బందిగా ఉందనీ తెలుసు కదా? దానికి నీకన్నా అవసరాలెక్కువున్నాయి. ఎవరికైనా తన్ను మాలిన ధర్మం ఉండదు. నాన్న అలా చెయ్యడం నాకూ నచ్చలేదు" అంది.

"అమ్మా! అంతంత ఆర్ధిక ఇబ్బందులు దానికి మాత్రం ఏమున్నాయి? దాని పెళ్లి టైమ్ లో నాన్న ఒక అపార్ట్మెంట్ గిఫ్ట్ గా ఇచ్చారు. దానిమీద మంచి అద్దె వస్తోంది. శిరీష్ పుట్టినపుడు గేటెడ్ కమ్యూనిటీలో అయిదొందల గజాల స్థలం కొని బహుమతిగా ఇచ్చారు. దాని ధర పెరుగుతోంది. ఇంకేం కావాలమ్మా? అతని బిజినెస్ లో నష్టాలొస్తాయంటే వాటిని పూలపల్లి పొలం అమ్మి తీర్చడం సరైనది కాదు. బిజినెస్ లో పెట్టుబడులు ఆచి తూచి చేసుకోవాలి. ఆ సమయస్ఫూర్తి లేకపోతే తాతల ఆస్తులు కూడా కరిగిపోతాయి. అతని బిజినెస్ ఎలా ఉన్నా సుజీ తన స్త్రీ ధనం ఫ్యూచర్ కోసం జాగ్రత్తపెట్టుకోవాలి గాని, నాన్న మాటకి విలువ లేకుండా చెయ్యచ్చా? ఇంట్లో కూర్చుని టీవీ చూసే బదులు అది కూడా ఏదైనా పార్ట్ టైమ్ జాబ్ చెయ్యచ్చు కదా" అన్నాడు.

నాకు మండిపోయింది. ఉక్రోషంతో కళ్ల నీళ్లు వచ్చాయి. బలవంతాన ఆపుకున్నా.

అన్నయ్య తన చెయ్యి చాచి నా చేతిని నొక్కి వదులుతూ, "సుజీ, నా మాటలు నీకు కఠినంగా కనపడచ్చు. తీరుబాటుగా ఆలోచించి చూడు. నీకే అర్ధమవుతుంది. ఒకసారా రెండుసార్లా? ప్రతి ఏడూ పెద్దలూ పిల్లలూ అంతా వెళ్లి తాతగారింట్లో పడిపోయేవాళ్లం. ఎంత మందికి ఆతిథ్యం ఇచ్చారు బాబాయీ, పిన్నీ? ఇపుడు మనింటికి ఒక్క గెస్ట్ వస్తాడంటే ఒకరోజా రెండు రోజులా అని లెక్కలేసుకుంటాం. ఇన్నేళ్ల తర్వాత ఆ ప్రాపర్టీ మాది కూడా అనడం నాకు నచ్చలేదు" అన్నాడు.

మౌనంగా నేనూ మనసులోనే తర్కించుకున్నాను. నా అభిప్రాయం నేను చెప్తాను. వాడి అభిప్రాయం వాడిది. నన్ను శాసించే అధికారం వాడికి లేదు.

ముభావంగా కిటికీలోంచి చూస్తూ కూర్చున్నా. పచ్చని పొలాలు పరుగెత్తి పోతుంటే అక్కడక్కడ దారి పక్కగా కొబ్బరి బోండాలో, పనస తొనలో, వేరుసెనగలో అమ్మకానికి పెట్టుకున్న ముసలి వాళ్లు కనపడ్డారు. ఆలోచనల్లో ఉండగా కారు స్లో అయి రోడ్డు పక్కగా ఆగింది. పక్కనే బుట్టల్లో ఆకుల మధ్య దోరగా పండి లేతాకుపచ్చరంగులో పెద్ద పెద్ద జామకాయలు కనపడ్డాయి. వాటిని చూడగానే నోరూరింది.

అన్నయ్య కారు దిగి "దా.. మంచి కాయలు కాసిని ఏరుదువు గాని" అన్నాడు. నేనూ దిగాను.

ఒక డజను కాయలు ఏరి తీసుకుని కారెక్క బోతుంటే, పక్కన కొంత దూరంలో చెట్టు కింద నిలుచున్న పాతికేళ్ల ఆడమనిషి కారు దగ్గరకొచ్చి 'ఇయాల బస్సులెవ్వు తల్లే. యాడైనా ఆటో వస్తదేమో అంటే ఒక్కటీ కాళీగా రావట్లేదు. కూసంత దూరం నన్ను మీ కార్లో తీసుకెల్తారా ? పెద్ద గూడెం దాకా? చూస్తా ఉంటే చీకడడిపోయేలాగుంది' అంది. కొత్తవాళ్లం, ఒంటరి ఆడమనిషి. ఎక్కడా బెదురు లేదు! కళ్లలో ఏదో ధీమా.

అన్నయ్య అమ్మనడిగాడు. వెనక సీట్లో కూర్చున్న అమ్మ ఆ అమ్మాయి వైపు చూసి 'పొద్దు వాలుతోంది కదా...పాపం బస్సు దొరక్కపోతే కష్టమే' అంది. 'నీ పక్కనే కూర్చుంటే ఇబ్బంది లేదా' అనడిగాడు. అమ్మ 'పర్లేదులే' అనడంతో సరేనన్నట్టు ఆమె వైపు తలూపి చేత్తో కారు డోర్ వైపు చూపించాడు.

'అవ్వా ఎల్లొత్తా' అంటూ జామకాయలమ్మికి చెప్పి రెండు బుట్టలూ, ఒక సంచీ పుచ్చుకుని వచ్చింది. ఒక బుట్టలో వేరు సెనగ కాయలున్నాయి. రెండో దాంట్లో కూరగాయలు. .. బీర కాయలూ, మొక్కజొన్నపొత్తులూ, పండు మెరపకాయలూ నవనవలాడిపోతూ కనిపించాయి. చేతిసంచిలో ఏవో బట్టలు. తను కారెక్కగానే తలుపేసి నేనూ ముందు సీట్లో కూర్చున్నా.

మాటల్లో చెప్పింది, చెల్లి పెళ్లిచూపులంటే పుట్టింటికొచ్చిందిట. రోజూ వచ్చే బస్సుకోసం కూర్చుంటే ఇప్పుడే తెలిసిందిట బస్సులు నడవడం లేదని. వాళ్ల నాన్నది వ్యవసాయం. విత్తన పంటలేస్తాడుట.

"విత్తన పంటలా? అంటే ఏమి"టనడిగాను.

"మీ బస్తీవోళ్లకి బియ్యం ఎక్కణ్ణుంచొస్తయ్యో కూడా తెలవదుగా తల్లే" అంది. అన్నయ్య ఓరగా నావైపు చూసి నవ్వాడు.

'మేమూ పండగల్లో తాతగారింటికి వచ్చి పొలాల్లో తిరిగిన వాళ్లమే తల్లే... అంత తెలీకుండా లేం లే' అనుకున్నా.

"కూరగాయలైనా, పప్పు బియ్యాలైనా పండిస్తేనేగా తల్లే గింజలు బజార్లోకీ, అన్నంముద్ద నోటికాడికీ వొచ్చేది. ఏ పంట పండాలన్నా ఇత్తనాలుండాలగా" అంది.

"తెలుసులే, పంటలోంచి కొంత పక్కకి తీసి విత్తనాలకి అట్టేపెడతారుగా? మరి విత్తన పంటలేంటి? అలా వేరుగా పండిస్తారా?" అన్నా.

"ఇప్పుడట్టా మామూలు పంటల్లోంచి తీసి పక్కన పెట్టినయ్యి ఎవురూ కొనుక్కోరమ్మా. ఇత్తనాల సాపుల్లో సీలు ఏసున్న సంచులే కొనుక్కుంటారు. అట్టా కొనుక్కోని పంటలేసుకుంటారు. ఇత్తనం నాణెమైందైతే పంట మంచిగా దిగుద్ది" అంటూ తన బుట్టలోంచి వేరుసెనగ కాయలు నాలుగు తీసి నాకిచ్చింది.

"నేనిట్టా వొచ్చినపుడల్లా మా నాయన పండినవన్నీ కొద్ది కొద్దిగా ఇత్తాడు. కాయెట్టా ఉందో సూడు. ఇత్తు బలంగా ఉంటే పంటా అట్టాగే వొస్తది. అబ్బో దీనికి సానా యెవహారం ఉందిలే. ఇత్తులు ఆళ్లే ఇస్తారు. పంట కోసే లోపు మూణ్నాలుగు తడవలు సార్లొచ్చి పంట తనిఖీ సేత్తారు. పంటొచ్చినాక ఆళ్లే కొనుక్కుంటారు. ఇది మొదలెట్టాకే మా నాన్న అప్పులన్నీ తీర్సుకున్నాడు" అంది.

చేతిలో కాయలవైపు చూశాను. సైజు పెద్దగా ఉన్నాయి. తెరిచి లోపల చూస్తే, లేత గులాబి రంగులో రెండు గింజలు బలంగా నిండుగా కనబడ్డాయి. నోట్లో వేసుకున్నాను. పచ్చిగా ఉన్నాయి గాని రుచి బావుంది.

అమ్మక్కూడా ఇచ్చి, 'సారు కారు తోలతన్నారు గా'అంది, అందుకే ఇవ్వలేదని సూచిస్తూ.

"ఇంత పెద్దగా ఉన్నాయి కదా ఈ గింజలు. అన్నీ ఇలాగే ఉంటాయా" అనడిగా, అన్నయ్య కి రెండు గింజలు అందిస్తూ. చిన్న తనంలో బాబాయింట్లో గుట్టలుగా పోసిన వేరు సెనగ కాయల రాశులు గుర్తొచ్చాయి. వాటిల్లో పెద్దా చిన్నా ఉండేవి. కొన్ని గింజలు ముడతలు పడి సన్నగా ఉండేవి. ఉన్న వాటిల్లో బావున్నవి కొన్ని తీసి తర్వాతి పంటకి అట్టిపెట్టేవాడు బాబాయ్.

"మామూలు పంటల్లోంచి తీసి పక్కనెట్టినవే ఇత్తనాలుగా తీసుకుంటే తర్వాతొచ్చే పంట నాణెంగా ఉండదమ్మా. ఇత్తనాలకి పచ్చేకం పండిచ్చాల. అట్టా పండిచ్చే వాళ్లు ముందుగా రెజిస్టరీ చేపిచ్చుకోవాల...మా నాయన అట్టా రెజిస్టర్ చేపిచ్చుకుని పండిత్తాడు" అంది. అన్ని రంగాల్లో వచ్చినట్టే ఈ రంగంలోనూ ఎన్నో మార్పులొచ్చినట్టున్నాయి అనుకున్నా.

ఉన్నంతసేపు గలగలా మాట్లాడి పూలపల్లి ఇంకా అయిదారు కిలోమీటర్ల దూరం ఉందనగా చిన్న బస్తీ దగ్గర కారాపమని దిగిపోయింది.

సన్నగా వినిపిస్తున్న పాటల నేపథ్యంలో మళ్లీ నా ఆలోచనలు సాగాయి.

తాతగారు పోయినపుడు వచ్చి వెనక్కెళ్లగానే అమ్మకీ నాన్నకీ మధ్య జరిగిన గొడవ తేలిగ్గా మర్చిపోయేది కాదు. తాతగారి ఆస్తిలో తనకి వాటా వద్దని నాన్నగారు డిక్లేర్ చెయ్యడం అమ్మకి ఎంతమాత్రం నచ్చలేదు.

'పిల్లలిద్దరికీ మంచి సంబంధాలు కుదిరి పెళ్లిళ్లు అయిపోయాయి. రెండు వైపులా వియ్యాలవారు స్థితిపరులే. మనక్కావలసింది మనకి సరిపడా ఉంది. ఇంకేం కావాలి సంధ్యా?' అని నాన్నగారడగడం, 'పిత్రార్జితం మీ ఒక్కరి ఇష్టం కాదు వద్దనడానికి, మన పిల్లలకి కూడా అందులో హక్కుంది' అని అమ్మ దెబ్బలాడడం మాముందే జరిగాయి.

"కని పెంచి విద్యాబుద్ధులు చెప్పించిన అమ్మా నాన్నగార్ల మంచి చెడులేవీ నేను చూడనే లేదు. చివరి వరకూ అన్నీ తమ్ముడే చూసుకున్నాడు. ఎప్పుడు వెళ్లినా శారద మనందరినీ ప్రేమతో చూసింది. బాధ్యతలు వదిలేసి ఆస్తులు కావాలని ఎలా అంటావు?" అంటూ నాన్న అమ్మవైపు తీక్షణంగా చూసిన చూపు నాకింకా గుర్తే.

"బాధ్యతలేం వదిలేశాం? అతి వృష్టికీ అనావృష్టికీ పంటలు పోతే పొలం మీద అయిన అప్పులు తీర్చలేదా మీరు?" అని అమ్మ నిలదీసింది.

"ఇలా అణా పైసలతో సహా లెక్కలు పెట్టుకోవాలని నేననుకోలేదు. నేను తీర్చిన అప్పుల కన్నా వాడు తలకెత్తుకున్న బాధ్యతలు చాలా పెద్దవి" అని నాన్న అమ్మని ఈసడించుకున్నారు. తర్వాత చాలారోజులు ఇద్దరి మధ్యా కోల్డ్ వార్ నడిచింది. అయితే అప్పట్లో నాకిదంతా అంత పెద్ద విషయం గా తోచలేదు కానీ, ఆరేళ్ల క్రితం నాన్న హఠాన్మరణం, మా ఇద్దరు పిల్లలూ హైస్కూలు చదువులకి వచ్చేసరికి రవి చేస్తున్న వ్యాపారంలో అనుకోని నష్టాలు రావడం.... ఈ రెండూ నా ఆలోచనల్లో మార్పుకి కారణమయ్యాయి. అన్నయ్యా వదినా ఇద్దరూ సంపాదనాపరులు. వెనక బోలెడు ఆస్తి. వాడికీ ఆస్తి అక్కర్లేకపోవచ్చు.

నాన్నకి ఉద్యోగరీత్యా ప్రతి రెండు మూడేళ్లకీ ఒక బదిలీ ఉండేది. పూలపల్లిలో తాతగారూ బామ్మలతోటే బాబాయి కుటుంబం ఉండేది. పదెకరాల పొలంలో సేద్యం చేస్తూ, ఊళ్లో ఉన్న ఏకైక పాఠశాలలో టీచర్ గా పని చేసేవాడు బాబాయి. ఆయనకిద్దరు ఆడ పిల్లలు.

చిన్నప్పటి నుంచి మాకూ వాళ్లకీ ఆర్థికంగా చాలా వ్యత్యాసం ఉండేది. నాన్న హోదాకి తగినట్టుగా మాకు ఇంటినిండా నౌకర్లూ, కారూ డ్రైవరూ లాంటి హంగులూ ఉండేవి.

పూలపల్లిలో జీవితం చాలా సాదాగా, చిన్న చిన్న ఆర్థిక ఇబ్బందుల మధ్య నడిచేది. నాకు చిన్నవైన గౌన్లూ పరికిణీలూ అమ్మ వాళ్లకి పంపించేది. పిన్ని కుట్టు మిషన్ మీద వాటిని రిపెయిర్ చేసి ఆడపిల్లలిద్దరికీ వేసేది. వేసవి సెలవుల్లోనూ, దసరా సంక్రాంతి సెలవులకీ, నాన్నా అమ్మా పూలపల్లి వచ్చి మమ్మల్ని వదిలి వెనక్కి వెళ్లేవారు. మాతో పాటుగా బోలెడు తినుబండారాలూ, ఆడపిల్లలకి బొమ్మలూ, ఇంటిల్లిపాదికీ కొత్తబట్టలూ వచ్చేవి. తాతగారూ బామ్మలతో పాటే బాబాయీ పిన్నీ కూడా మమ్మల్ని అపురూపంగా చూసేవారు. రంజనీ, రాగిణీ 'అన్నా, అక్కా' అంటూ మా వెంట వెంట తిరిగేవారు. సెలవులైపోయేటప్పటికి బాబాయో, తాతగారో మమ్మల్ని మళ్లీ వెనక్కి తీసుకెళ్లి, నాన్న ఉద్యోగపుటూరులో దింపేవారు.

నాన్నకీ బాబాయికీ పదేళ్లపైగా తేడా వయసులో. ఇద్దరికీ మధ్య పెద్దత్తా చిన్నత్తా. అలాగే నాకూ రంజనికీ మధ్య పన్నెండేళ్ల తేడా. నా పెళ్లి నాటికి దానికి పదేళ్లు. తోడపెళ్ళి కూతురిగా దాన్నే కూర్చోపెట్టారు. అమ్మ కుట్టించిన పరికిణీలూ జాకెట్లూ తప్ప వాళ్లకి మంచి బట్టలే లేవు. ఎనిమిదేళ్ల రాగిణి అయితే పొద్దున్న వేసుకున్న పట్టు పరికిణీ రాత్రైనా విప్పనని పేచీ. ఐస్ క్రీమ్ ఆశపెట్టి దాన్ని ఒప్పించి పూల ఫ్రాకు తొడిగింది శారద పిన్ని!

ఆలోచనల్లో ఉండగానే కారు పూలపల్లి లోకి ప్రవేశించింది. "అమ్మా నిద్ర పోతున్నావా? దగ్గరికొచ్చేశాం" అన్నాడు అన్నయ్య.

"చిన్న కునుకు పట్టిందిరా" అంటూ లేచి జుట్టూ, చీరా సవరించుకుంది అమ్మ.

సాయంత్రపు వెలుగుల్లో చెక్కగేటు బయట కారాపి లోపలికి వెళ్తుంటే, ఎర్రటిపూలతో తురాయి చెట్టు ఒకవైపూ, సన్నని సువాసనతో పున్నాగ రెండో వైపూ నిలబడి స్వాగతం చెప్పాయి. విస్తరించిన శాఖలతో నిండుగా ఉన్న మామిడి చెట్టూ, పెద్ద పెద్ద ఆకులతో అక్కడక్కడ పూలతో నిటారుగా ఎదిగిన సింహాచలం సంపెంగ చెట్టూ, గంపెడుపిల్లల్ని దగ్గరగా పొదువుకున్న తల్లిలా కాండం దగ్గర పెద్దా చిన్నా బోలెడు పిందెలతో పనస చెట్టూ నవ్వుమొహాలతో మమ్మల్ని పలకరించాయి. ఇంటి ముందున్న విశాలమైన ఆవరణలో ఎన్నో చెట్లూ, తీగలూ, పూల మొక్కలూ . ఇంటి వెనక్కూడా కరివేప, నిమ్మ, బొప్పాయి లాంటి చెట్లూ, కూరపాదులూ ఉండేవి. చిన్నపుడు కోతుల్లా ఈ చెట్ల మధ్య ఆడుతూ ఎలా గడిపామో!

ఈ విశాల హరిత ప్రాంగణంలో మాదంటూ ఏమీ లేదా అనిపించి చివుక్కుమనిపించింది.

పెంకులు కప్పిన ఇంటి వరండాలోకి అడుగు పెట్టగానే చల్లగా, హాయిగా అనిపించింది. అరుగు మీద వాలు కుర్చీలో తాతగారు కూర్చుని నవ్వుతున్నట్టూ, కచ్చాపోసిన చీరకట్టులో బామ్మ గుమ్మంలో నిలబడి, చేతులు చాచినట్టూ భ్రమ.

వరండా అరుగుల మీద జంపఖానాలు పరిచి ఉన్నాయి. అరుగుల ముందు కొన్ని ప్లాస్టిక్ కుర్చీలు. అప్పటికే వచ్చేసిన దగ్గరి చుట్టాలు అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. లోపల్నించి ట్రే లో టీలు తీసుకొస్తూ రంజని, తన వెనకే చిన్నత్తా కనపడ్డారు. రంజని ట్రే పక్కన పెట్టి దగ్గరకొచ్చి అమ్మని కావలించుకుంది. అన్నయ్య కుడి చెయ్యి చాస్తే ఆ వంపులో ఒదిగి వాడి భుజం మీద తలాన్చింది. ఈ లోగా చిన్నత్త పలకరించి 'పిల్లలెలా ఉన్నారే?' అనడుగుతూ హత్తుకుంది నన్ను.

"రాగిణేదీ?" అడిగాడు అన్నయ్య .

"వచ్చేస్తుందన్నయ్యా, సామాన్లేవో తేవాలంటే స్కూటీ మీద వెళ్లింది" అంటూ మా సామాను అందుకుని లోపలికి దారి తీసింది రంజని. వెనక గదిలో ఉన్న పిన్నినీ, వాళ్లమ్మ గారినీ పలకరించి మొహాలు కడుక్కుని వచ్చాం. "అక్కా, టీ తీసుకో" అంటూ కప్పు అందించింది.

గోడవారగా ఉన్న మంచం మీద నడుంవాల్చిన పెద్దత్త అప్పుడే లేస్తోంది. రంజని నుంచి కప్పు అందుకుంటూ "అష్టైశ్వర్యాలతో వెయ్యేళ్లు వర్ధిల్లవే బంగారు తల్లీ! రోజూ చేసే పూజలకి వరాలిస్తాడో లేదో ఆ పైవాడు. అడక్కుండానే కళ్లు విప్పేసరికల్లా పొద్దున్నైతే కాఫీ, సాయంత్రమైతే టీ పట్టుకుని ప్రత్యక్షమవుతుంది మా వరాల చిట్టితల్లి!" అంది.

"చెట్టంత ఎదిగిన దాన్ని చిట్టి అని నువ్వే అనాలి" నవ్వుతూ వెళ్లిపోయిందది.

చిన్నత్త అందుకుంటూ "నిజమేనే.. వచ్చినప్పటి నుంచి చూస్తున్నా... అలసటన్నది లేకుండా అలా చేస్తూనే ఉన్నారు అక్కచెల్లెళ్లిద్దరూ" అంది. నాతో ఎప్పుడైనా అలా మాట్లాడారా చిన్నత్త గానీ పెద్దత్త గానీ?

రాత్రి భోజనాలయేసరికి పక్కలు ఏర్పాటు చేశారు రంజనీ రాగిణీ. అటూ ఇటూ రెండు మంచాలున్న గదిలో అత్తలకీ నాకూ పడక. ఒక మంచం కాస్త వెడల్పుగా ఉంది. సర్దుకుంటే ఇద్దరు పడుకోవచ్చని పెద్దత్త అంది గాని అలా నాకు అలవాటు లేదు. మంచాల మీద అత్తలిద్దరూ పడుకుంటే మధ్యలో చాప పరిచి పల్చటి పరుపు వేసింది రంజని నా కోసం. గదుల్లో కొందరూ, హాల్లో కొందరూ సర్దుకున్నారు. రంజని స్నేహితుడొకతను వచ్చాడు హైదరాబాద్ నించి. అతనూ అన్నయ్యా మామయ్యలిద్దరూ మడత మంచాల మీద ఒక గదిలో పడుకున్నారు. అమ్మకీ, పిన్నికీ, పిన్నివాళ్లమ్మ గారికీ ఒక గది. మిగిలిన చుట్టాలూ, రంజనీ, రాగిణీ హాల్లో వరసగా పక్కలు పరుచుకుని సర్దుకుని పడుకున్నారు.

పడుకున్న కాసేపటికే గాఢంగా నిద్ర పట్టింది నాకు. మధ్య రాత్రి మెలకువ వచ్చేసరికి పెద్దత్త బాత్రూం కి వెళ్లొచ్చి పక్కమీద వాలుతోంది. చిన్నత్త కదులుతూండడం చూసి "నడుం నెప్పి సర్దుకుందిటే సుశీ?" అంటూ అడిగింది.

ఇద్దరూ లోగొంతుతో మాటల్లో పడ్డారు. నాకు అటూ ఇటూ ఉండడం వల్ల వాళ్ల మాటలు స్పష్టంగా నా చెవుల్లో పడ్డాయి.

"ఇద్దరికిద్దరూ పుత్తడి బొమ్మలేనే. ఆ కుర్రాడు చక్కగా ఉన్నాడు చూశావా... మంచి కుటుంబం. స్థితిపరులే. పిల్ల నచ్చకేం? విచ్చిన పూలకొమ్మ. ఎవరికి నచ్చదూ?"

"పెద్దది చామంతీ, చిన్నది జాజి మొగ్గా. రూపాలు కాదే. ప్రవర్తన! మేలిమి బంగారం!"

"ఆ అబ్బాయి తండ్రి... హైదరాబాదులో సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ అని ఏదో ఉందనీ అందులో ఏదో పెద్ద పొజిషన్ లో ఉన్నాడనీ చెప్పానా? పెద్దబ్బాయి కూడా హైదరాబాద్ లోనే ఉంటాట్ట. శారద చెప్పింది. కుటుంబ వివరాలన్నీ బావున్నాయే. ఈ పిల్లాడు అగ్రికల్చర్ కాలేజీలో రంజనికి సీనియరనీ, రెండేళ్లుగా దీన్ని చేసుకోవాలని ఎదురుచూస్తున్నాడనీ చెప్పింది. ఇక్కడన్నీ పూర్తయ్యాక మనవాళ్లు వెళ్లి, పెళ్లి ముహూర్తాలు పెట్టించుకుని రావాలి. శ్రావణ మాసానికల్లా పెళ్లి చేసేయాలి" అంది పెద్దత్త.

"అవును శారద చెప్పింది. చిన్నదానిక్కూడా మంచి సంబంధం కుదిరి, ఇద్దరికీ పెళ్లిళ్ళై వాళ్లు సుఖంగా ఉంటే తమ్ముడి ఆత్మ శాంతిస్తుందే" అంది చిన్నత్త.

"కుందనపు బొమ్మల్లా ఇద్దరు పిల్లలుంటే ఒక్కత్తె పెళ్లైనా చూసుకోకుండానే వెళ్లిపోయాడు వాడు..."

"మనందరి ఇళ్లలో శుభకార్యాలన్నిటికీ అన్నీ తానే అయి చేశాడు. శారద మాత్రం? ఒక్కర్తీ పదిమంది పెట్టు. ఎంత కార్యమైనా కొండంత అండ"

"ఇద్దరూ ఇద్దరే. ఎప్పుడొచ్చినా రెండు చేతులా ఆహ్వానించేవారు! మనకి వీలవక వెళ్లిపోవడమే గాని ఎన్నాళ్లున్నా ఇంకా ఉండమనే అనే వారు. అమ్మనీ నాన్నగారినీ నెత్తిన పెట్టుకుని చూసుకున్నారు."

"ఎప్పుడు వాళ్లని చూడాలనిపించినా బస్సెక్కి వచ్చేసే వాళ్లం కదే! గుమ్మంలోకొచ్చేసరికి లక్ష్మీ దేవిలా నవ్వుమొహంతో ఎదురొచ్చేది శారద. యాభయ్యేళ్లకే దాని కుంకుమ తుడిచేశాడు భగవంతుడు. ఆడపిల్లల పెళ్లిళ్లు భర్తతో పాటు సంతోషంగా నిర్వహించుకునే యోగం లేకపోయింది దానికి"

"ఏ మాటకామాట అక్కయ్యా! నాన్న పోయినపుడు అన్నయ్య కూడా తన పెద్దరికం నిలుపుకున్నాడు, ఔదార్యం చూపించుకున్నాడు. కరణం గారు ఆస్తి పంపకాల మాటెత్తగానే తనకేం వద్దు, అంతా తమ్ముడికే అని చెప్పేశాడు"

"వాడికి చదువవుతూనే మంచి ఉద్యోగం వచ్చింది. పేరూ హోదా తో పాటు చక్కగా సంపాదించుకున్నాడు. ఇంట్లో కావలసిన కార్యాలన్నీ సమయానికి తగినట్టు నిర్వహించుకున్నాడు. వాడి పిల్లల పెళ్లిళ్లకి తాతా బామ్మల ఆశీస్సులు దొరికాయి. రెండేళ్లకో బదిలీ గా దేశమంతా తిరిగే వాడి ఉద్యోగానికి ఇలా అన్నీ సజావుగా సాగడం అదృష్టమనాలా? పిల్లలు సుఖ సంతోషాలూ, మనవల ఎదుగుదల చూసుకోకుండా అకాలంగా వెళ్లిపోవడం దురదృష్టమనాలా? అన్నయ్యకి అన్నయ్యా, తమ్ముడికి తమ్ముడూ ఇద్దరూ ఇలా వెళ్ళిపోయారేమిటే?"

"అన్నీ అనుభవించే యోగాన్ని బట్టేజరుగుతాయే అక్కయ్యా. వాడలా దేశమంతా తిరుగుతున్నపుడు తమ్ముడిక్కడ అమ్మా నాన్నగార్లతో ఉండబట్టే మనకిలా పుట్టింటి సౌఖ్యం దొరికింది! వాడి పంచన అమ్మా నాన్నగార్ల జీవితాలు హాయిగా వెళ్లమారాయి"

"అన్నయ్యది అంత దొడ్డ మనసు గనకే తనకి అస్తి వద్దన్నా మనకి చెరో ఎకరం మాత్రం ఇవ్వమని చెప్పాడు. అమ్మ వాడికలా చెప్పిందిట. నాన్నగారు నా పిల్లలు రామ లక్ష్మణులు అనేవారు. రాతకోతలేవీ అవసరమనుకోలేదు, పట్టించుకోలేదు. ఆయన నమ్మకాన్ని వీళ్లు నిలబెట్టుకున్నారు"

"అంతేనా, ఇల్లు సంగతి? అమ్మా నాన్నగార్ల తర్వాత ఇల్లు రెండు ముక్కలవకుండా వెయ్యి గజాల స్థలంలో ముందూ వెనకా ఫల వృక్షాలు, పూలతీగెలు, కూర పాదులు, తులసి కోట ...అంతా అలాగే ఈనాటికీ నిలిచి ఉందంటే అన్నయ్య చలవే".

"నిజమేనే.... తమ్ముడు పాపం 'ఇల్లంతా పాతబడిపోయింది. పంట సొమ్ము వస్తే రిపెయిర్లు చేయించాలనుకుంటున్నా'నని చెప్పాడు. తర్వాత మూణ్నెల్లకే వాడికి నూరేళ్లూ నిండిపోయాయి" నిట్టూర్చింది చిన్నత్త.

నిద్రపోతున్నట్టుగా నిశ్శబ్దంగా పడుకున్న నాకు ఏమిటో అస్థిమితంగా అసంతృప్తిగా అనిపించింది. నాన్న గురించీ, బాబాయి గురించీ, పిన్ని గురించీ అంత పొగుడుకున్న వాళ్లు అమ్మ గురించి ఒక్క మాట కూడా అనలేదు. రంజనీ రాగిణీ అంటూ మురిసిపోయారే గాని అన్నయ్య గురించి గాని, నా గురించి గాని ఒక్క మాటైనా మాట్లాడలేదు.

నాన్న ఆస్తి వద్దన్నారని చెప్పుకుని ఆనందిస్తున్నారు గాని ఆయన తన భార్యని సంప్రదించకుండా అంతా బాబాయికిచ్చేయమనడం సబబేనా? 'మీ ఆవిడని అడిగావుట్రా' అని అడగద్దా? నీ పిల్లలక్కూడా ఉన్న హక్కు ఇది, నిర్ణయాధికారం నీది కాదు అని చెప్పద్దా?

ఇప్పటికీ అమ్మ అంటూ ఉంటుంది, మాటల ద్వారా కాకపోతే కోర్టు ద్వారా అయినా సాధించుకోవచ్చని. నాన్న నోటి మాటకి ఆయనే లేనపుడు అంత విలువేముంది?

నిజానికి చిన్నపుడు రంజనీ రాగిణిలని చూస్తే నాకెంతో ప్రేమగా ఉండేది, కొంచెం జాలిగా కూడా. నాకు చిన్నవైపోయిన బట్టలేసుకుని, మేం తెచ్చిచ్చిన ఆటవస్తువులతో ఆడుకుంటూ, మేం వచ్చినపుడు కళ్లింతింత చేసుకుని మా కబుర్లు వింటూ ఉండే వాళ్ల పట్ల ఆపేక్షతో పాటు కొంత చులకన భావం కూడా ఉండేదేమో.

ఇపుడు వాళ్లు సీదా సాదా బట్టల్లో కూడా మెరిసిపోయే నవ్వు మొహాలతో నాకన్నా అందంగా ఉన్నారు. చదువుల్లో రాణించి ఉద్యోగాలు తెచ్చుకున్నారు. చురుకుగా తెలివిగా స్మార్ట్ గా ఉన్న ఆ అబ్బాయి సందీప్ దీన్ని ఇష్టపడి దీని కోసం ఏడాదిగా నిరీక్షిస్తూ బాబాయి సంవత్సరీకాలకి కూడా వచ్చాడు?

ఒక్కసారిగా మా ఈక్వేషన్ ఇలా మారిపోయిందేమిటి? ఇప్పుడు నా లోలోపల ఉడికించేస్తున్న ఈ భావం ఏమిటి? అసూయా?

అత్తల మాటలు వింటూ లోలోపల కుళ్లుతున్న నాకు కాలిమీద ఏదో పాకినట్టైంది. అప్రయత్నంగా కెవ్వుమన్నాను. అత్త మంచం పక్కనే స్విచ్ ఉండడంతో 'ఏమిటే' అంటూ కంగారుగా లైట్ వేసింది.

గది మూలగా ఉన్న తూములోకి పోతూ చిన్న ఎలక!

"అయ్యో..దీని మొహం మండా. పిల్ల బెదిరిపోయింది" అంటూ "అమ్మలూ, ఇలా మంచం మీద నా పక్కన పడుకోవే. నేల మీద ఏవో పాకుతూ ఉంటాయి. ముందే చెప్పాను కదా. నాకేదో ఇబ్బంది అనుకున్నావు... దామ్మా దా" అంటూ పిలిచింది పెద్దత్త. బిత్తరపోయి చూస్తున్న నేను అమాంతం మంచమెక్కేసి అత్త పక్కనే పడుకున్నా. బెదురు తగ్గడానికి కొంతసేపు పట్టింది.

అత్త నా వీపు నిమిరి "పిచ్చి తల్లి.. భయం లేదులే" అంది. ముప్పై నాలుగేళ్ల నన్ను అలా అంటుంటే నాలోపల ఎవరో పసిపిల్ల నిద్ర లేచినట్టైంది. అత్తవైపు తిరిగి తన నడుం మీద చెయ్యేసి పడుకున్నాను.

రేపు నేను చెప్పాలనుకున్నవి చెప్పలేనేమో అనిపించింది.

మనసులో ఒత్తిడికి బీపీ పెరిగిందో ఏమో...గుండె దడ. పాల్పిటేషన్... అమ్మ ఇచ్చిన 'ఆస్తి' అది! రోగాలూ ఆస్తుల్లాగే వారసత్వంగా వస్తాయి!

ఆస్తుల్లానా? అబ్బే కాదు కాదు. కావాలంటే పుచ్చుకోడానికీ, వద్దంటే వదిలేయడానికీ కుదరదుగా. పిత్రార్జితమైన ఆస్తి వద్దని నాన్న వదిలేసినట్టు అమ్మ తన జీన్స్ లో పట్టుకొచ్చి ఇచ్చిన బీపీని నేను వదిలేసే వీల్లేదే!

★

సంవత్సరీకాలు యధావిధిగా పూర్తయ్యాయి.

వచ్చిన చుట్టాలంతా వెళ్లిపోయారు. పదకొండు గంటల వేళ ఊరి కరణం సీతా రామయ్య గారు వచ్చారు. అంతకు ముందే ఆ సమయానికి అంతా స్నానాలూ, టిఫిన్లూ పూర్తి చేసి హాల్లో సమావేశమవాలని మామయ్యచెప్పడంతో అందరం హాల్లో తయారుగా ఉన్నాం. నాలో ఏదో ఆశ కలిగింది, బాబాయి నాన్న మాటలు సరికాదని చెపుతూ మాకూ వాటా ఇచ్చాడేమో అని.

వస్తూనే ఆయన తాతగారి ఆస్తి వివరాలు చదివారు. తర్వాత తాతగారి మరణానంతరం నాన్నగారు తనకు ఆస్తి వద్దనీ, ఉద్యోగరీత్యా తాను దేశమంతా బదిలీలతో తిరుగుతూ ఉంటే తల్లి దండ్రులని శ్రద్ధగా చూసుకున్నదీ, చెల్లెళ్లిద్దరికీ పుట్టింటి అండదండలని ఇచ్చిందీ తమ్ముడే కనక పిత్రార్జితం లో తనకు వాటా వద్దని అన్నారనీ చెప్పారు. అంతే కాక, పదెకరాల్లో అత్తలిద్దరికీ చెరో ఎకరం ఇవ్వమన్నారని చెప్పారు.

"అదంతా స్పష్టంగా రాసి రెజిస్టర్ చేయించాలని మూడు నాలుగు సార్లు చెప్పానమ్మా... అయినా ఆ విషయం వాయిదా వేస్తూ వచ్చాడే గాని శ్రద్ధ పట్టలేదు. అనుకోని విధంగా ఆయనే గతించాడు. అందువల్ల విల్లు లేకుండా నోటి మాట ప్రకారమే చేయాల్సి వస్తోంది. ఆడపిల్లలిద్దరూ ..అంటే జానకమ్మా సుశీలమ్మా... తమకి ఆ ఎకరం పొలం వద్దనీ, చిన్న తమ్ముడికి తమ బహుమతి అనుకుని పొలమంతా అఖండంగా అతనికే ఉంచమనీ చెప్పారు. అయితే ఏడాదికోసారి పుట్టింటి కి వచ్చి అమ్మా నాన్నలని మనసారా తలచుకునే అవకాశం తమకు జీవితాంతం ఉండాలని కోరారు. ఇదంతా మీ అందరికీ తెలిసిన విషయమే."అంటూ అందర్నీ పరికించి చూశారు.

"ఇలాంటి కుటుంబాన్ని నేనెక్కడా చూడలేదు. అన్నకీ అక్కలకీ తమ్ముడి మీద ఇంత ప్రేమ ఉండడం, తమ్ముడికి అక్కలిద్దరూ పుట్టింటికి వచ్చిపోతూ ఉండాలనే కోరిక ఉండడం, ఆస్తి కావాలని ఎవరూ కోరకపోగా డబ్బుకన్నా అనుబంధాలే ముఖ్యమని అనుకోవడం నాకు ఎంతో ముచ్చటగానూ, అంతకు మించి ఆశ్చర్యం గానూ అనిపిస్తోంది. నిన్ననే ఆస్తి తగాదాల్లో కత్తులు దూసుకున్న అన్నదమ్ముల్ని చూసి వస్తున్న నాకిది మహా అపురూపంగా కనిపిస్తోంది" అన్నారు.

కూర్చుని వింటున్న నాకు ఎంత అసహనం కలిగిందో చెప్పలేను.

పక్కన పెట్టిన లోటాలోంచి కాసిని మంచినీళ్లు తాగి, అందర్నీ కలయజూస్తూ "నేను చెప్పిన దానికి భిన్నంగా ఏదైనా ఉంటే ఇపుడు మీరు చెప్పాలి. మీ అందరి ఏకాభిప్రాయం ఏదైతే అదే చేద్దాం" అన్నారు.

"సుశీల వైపు నుంచీ, నా వైపు నుంచీ మీరు చెప్పినదానికి భిన్నంగా ఏమీ లేదండి మామయ్యగారూ! ఇక శారద ముందున్న బాధ్యతల విషయం మాట్లాడాల్సి ఉంది. ఎంత లేదన్నా పిల్లల పెళ్ళిళ్లకి కొంత పొలమైనా అమ్మాల్సి వస్తుంది కదా. ఇపుడు ధరలెలా ఉన్నాయో..?" అంది పెద్దత్త.

"పూలపల్లి పొలాలకి అంత పెద్ద ధరలు లేవమ్మా. మీకు తెలియనిదేముంది, ప్రభుత్వం మారిన తర్వాత పూర్వం ఉన్న ధరలు కూడా పడిపోయాయి. ఎకరా పది లక్షలు ఉండవచ్చమ్మా. ఇల్లు పాతదయింది కనుక స్థలంతో సహా ఇంటినమ్మితే పది లక్షలు రావచ్చు" అన్నారు .

అపుడు రాగిణి లేచి, "తాతగారూ, పెద నాన్న తనకి వాటా వద్దనడం ఆయన సహృదయం. కానీ నాన్న ఎప్పుడూ అలా అనుకోలేదు. దొడ్డమ్మ వద్దన్నా, తనకి సగం వాటా ఇవ్వడమే అమ్మ అభిమతం. అపుడే అమ్మకి సంతోషంగా ఉంటుంది." అంది. పిన్ని మౌనంగానే అవునన్నట్టు తలాడించింది.

అమ్మ"మామయ్య గారూ, నాకే ఆస్తీ అక్కర్లేదండీ. ఆయన మాటే నా మాట. అయితే శారదా పిల్లలూ అందుకు ఒప్పుకోకపోతే కిషోరూ, సుజాతా ఎలా అంటే అలా చెయ్యండి" అంది.

అన్నయ్య "నాకు ఒక్కా పైసా కూడా వద్దు తాతగారూ! మా తాతగారు వాడిన వాలు కుర్చీ ఒకటీ నాకు ఇవ్వగలిగితే సంతోషిస్తాను" అన్నాడు.

"ఓరినీ.. నీకూ మీ నాన్న పోలికే వచ్చిందిరా!" అంది చిన్నత్త.

"చూశారా మామయ్యా? విత్తు నాణ్యతని బట్టే ఫలసాయం! అన్నయ్య కొడుకు ఇంకోలా ఎలా ఉంటాడు? " అని "కిషోరూ, తాతగారి కుర్చీ కావాలిట్రా? నిజమే మరి, నాన్నగారి వారసుడు కదా, ఆ కుర్చీలోనే కూర్చోవాలి! ఇంత కుర్చీని అమెరికా ఎలా పట్టుకెళ్తావురా?"అంటూ పెద్దత్త మురిసిపోయింది.

"ఇళ్లూ, పొలాలూ మాత్రమే ఆస్తులు కావు తల్లీ. నైతికతా, ఔదార్యం, తనకున్నది నలుగురితో పంచుకుతినే అలవాటూ....ఈ లక్షణాలు కూడా పెద్దల నించీ పిల్లలకి వచ్చే ఆస్తులే. పసి పిల్లల మనసులు సారవంతమైన నేలల్లాంటివి. వాటిలో ఆపేక్ష, ఔదార్యం లాంటి మంచి విత్తనాలు నాటాలి. మీ నాన్నగారు చేసిందదే. ఆయన పిల్లలు నలుగురిదీ అదే సంస్కారం. జానకమ్మ అన్నట్టు విత్తుని బట్టే ఫలసాయం! మంచి మాట అన్నావు తల్లీ!" అని అత్తని మెచ్చుకుని, మావైపు చూస్తూ

"మీ అత్త అన్న మాట మీకు అర్థమైందర్రా? విత్తనానికీ, గింజకీ తేడా మీకు తెలుసునా?" అనడిగారు. అన్నయ్యా నేనూ మొహాలు చూసుకున్నాం. విత్తనం ఏమిటి, గింజ ఏమిటి? రెండూ ఒకటే కదా!

మా మనసుల్ని చదివినట్టు "కాదు. రెండూ ఒకటే కాదు. విత్తనంలో మొలకెత్తే శక్తి ఉండాలి. ఆహారంగా వాడే గింజల్లో అది అక్కర్లేదు. పంటగా వేసేటపుడు విత్తనాలన్నీ ఒకే రకానికి చెందిన కల్తీలేని మేలు రకానికి చెందినవై

ఉండాలి. అలా కాకపోతే పంట నాణ్యత దెబ్బతింటుంది. మూడో విషయం ఏమిటంటే, ఆ విత్తనాల మూలం ఏదో తెలిసి ఉండాలి! పుట్టబోయే ముందుతరాలు ఆరోగ్యంగా ఉండాలని పూర్వం పెళ్లి సంబంధాలకి ఏడు తరాల వరకు వెనక్కి వెళ్లి తెలుసుకునే వారు కదా! సరిగ్గా అలాగే. విత్తన పంటలకి ఈ జాగ్రత్తలన్నీ చాలా అవసరం..." అని తననుకున్నది ఎలా చెప్పాలా అన్నట్టు ఆలోచిస్తూ ఒక క్షణం ఆగారు. తర్వాత నెమ్మదిగా స్పష్టంగా

"ఇక్కడ, ఈ ఇంట్లో అందర్నీ చూస్తుంటే ఎవరికి వారే ఇంత ఉన్నతంగా ఆలోచించడానికి కారణం వారి జన్మగతమైన సంస్కారమే అనిపిస్తుంది. అక్కడ అన్నదమ్ములు కత్తులు దూసుకోవడమేమిటి ? ఇక్కడ ఒకరికొకరు ఇంత విలువైన ఆస్తులు బహుమతులిచ్చుకోవడమేమిటి? మీ తాతగారూ, మామ్మగారూ గొప్ప సంస్కారులు. ఇద్దరికిద్దరూ ప్రేమ మూర్తులూ, ఉదార హృదయులూ! పిల్లల సారవంతమైన పసి మనసుల్లో చిన్నప్పటి నుంచి అవే విలువల్ని కల్తీలేని విత్తనాలుగా నాటి, పెంచి పోషించారు! అదే ఇవాళ్టి మీ ఐక్యతకీ, అనుబంధాలకీ కారణం! గొప్ప పెంపకం!" అని అన్నయ్య వైపు తిరిగి,

"కిషోరూ! మీ అత్త అన్నదేమిటంటే ఏ విత్తనం నాటితే ఆ మొక్కే మొలకెత్తి అదే రకమైన, అదే నాణ్యత ఉన్న ఫలాన్నిస్తుంది కదా. మీ నాన్న ఔదార్యమే నీకూ అలా సహజంగా వచ్చిందని అందన్నమాట!" అన్నారు సీతా రామయ్య గారు.

అంతా నాకు పెద్ద నాటకంలా చిరాగ్గా అనిపించింది. అన్నయ్యని చూస్తే చిరచిరలాడిపోయింది. అమ్మ మాత్రం ..? అంతా తను మంచిదనుకోవాలి. నేను చెడ్డదాన్నైనా పర్లేదు.

వంటింటి గుమ్మానికి కాస్త ఇవతలగా చిన్న స్టూలు మీద కూర్చున్న పిన్ని వైపు చూశారు సీతారామయ్య గారు.

"బాబాయి గారూ, మీకు తెలియనిదేముంది? ఆస్తి విషయం ఆయన నాతో మాట్లాడినపుడు తన వాటా నాలుగెకరాలే అనీ అంతకన్నా ఎక్కువ తను తీసుకోలేననీ చెప్పారు. బావగారి వాటా కూడా సాగు చేస్తూ వచ్చారే గాని, అది అక్కయ్యకీ, కిషోరూ సుజాతలకి చెందిన ఆస్తిగానే ఆయన భావించారు. ఆయన అనుకున్నది మీతోనూ, అక్కయ్యతోనూ వివరంగా చెప్పే సందర్భం వచ్చేలోగానే విధి ఆయన్ని తీసుకుపోయి నన్ను ఒంటరిదాన్ని చేసింది" గొంతులో సన్నని జీర సవరించుకుంటూ చిన్నగా దగ్గి,

"అయినా పిల్లలిద్దరూ చక్కగా చదువుకున్నారు. రాగిణికి బీటెక్ కావడంతో చదువు రంజనితో పాటే అయిపోయింది. కాంపస్ సెలక్షన్ లో ఉద్యోగం వచ్చేసింది. ఆర్భాటపు పెళ్లిళ్లు వద్దనీ, నిరాడంబరంగా చేసుకోవాలనీ పిల్లలిద్దరూ నిర్ణయించుకున్నారు. రంజని కాబోయే భర్తగా సందీప్ కూడా మన మాటల్లో పాల్గొంటే బావుంటుందని అతన్ని నేనే ఆగమన్నాను, అందరితో పాటూ వెళ్లిపోకుండా.

"పెళ్లి మన ఊరి కోవెలలో జరగాలని అతని కోరిక. అతని తల్లిదండ్రులు కూడా అందుకు అభ్యంతరం లేదన్నారు. నిరాడంబరంగా చేసుకుందామనీ, తమది ఆర్గానిక్ లివింగ్ అనీ, ఆర్భాటపు జీవితం ఇష్టం లేదనీ, తమకి ఇద్దరూ అబ్బాయిలే కనుక ఈ పెళ్లి ఖర్చు ఇద్దరం సమంగా పెట్టుకుందామనీ అన్నారు.

"ఈ ఇల్లు ఇలా మాకివ్వడం బావగారి ఔదార్యం. దీనికి ధర కట్టిస్తే సగం డబ్బు అక్కయ్యకిచ్చి ఇల్లంతా ఇలాగే ఉంచుకోవాలనుంది. వదినలిద్దరి కుటుంబాలూ, బావగారి కుటుంబం ఇలాగే ఎప్పుడూ ఈ ఇంటికి వచ్చిపోతూ ఉండాలని నాఆశ. అదే ఆయన కోరిక కూడా. పొలం నాలుగెకరాలు మాకు చాలు. ఇపుడంతా సజావుగా ఉంది. ఎవరి వాటా ప్రకారం వాళ్లు పంచుకోవడం వల్ల భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలూ రాకుండా ఉంటాయి. నామీద దయ ఉంచి ఇది మాత్రం ఆయన అభీష్టం ప్రకారం చేయమని అక్కయ్యనీ, వదినలిద్దర్నీ కోరుతున్నాను" అంది పిన్ని.

నేను విస్తుపోయి చూస్తుంటే సందీప్ లేచి నిలుచుని అందరికీ నమస్కారం చెప్పి,

"అందరూ ముందే వినేసిన విషయమే... కాలేజీ రోజుల్లోనే రంజనిని నేను ఇష్టపడ్డాను. పెళ్లి చేసుకోవాలని చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను. మా అమ్మకీ నాన్నగారికీ కూడా తను చాలా నచ్చింది. నాకెప్పటినుంచో కోరిక, కొత్త సాంకేతికతని వాడుతూ సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చెయ్యాలని. అందుకే అగ్రికల్చర్లో ఎమ్మెస్సీ చేశాను. రెండేళ్లుగా నాన్నగారి స్నేహితుడి దగ్గర ఆర్గానిక్ ఫామింగ్ లో అసిస్ట్ చేస్తూ వచ్చాను, రంజని చదువైపోయే లోపు ఇందులో కొంత అనుభవం సంపాదించాలని.

"ఇపుడు ఇక్కడే రంజనితో కలిసి వ్యవసాయం చేయాలని అనుకుంటున్నాను. దీనికి మా అమ్మా నాన్నగార్ల సపోర్ట్ ఉంది. మీకిష్టమైతే మీ పొలాలు కూడా కౌలుకి తీసుకుని పండిస్తాం. లేదు అమ్మేయాలనుకుంటే దానికి మార్కెట్ ధర చెల్లించి తీసుకోవాలని ఉంది. మొదటిసారి ఇక్కడికి వచ్చినపుడు మామయ్యగారితో పొలానికి వెళ్లాను. అపుడు నా భవిష్యత్తు ఈ పొలం లోనే అనిపించింది! సీతారామయ్య తాతగారు చెప్పినట్టు అలాంటి ఇంట్లో పుట్టి పెరిగిన రంజని నన్ను అంగీకరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అన్నాడు. అతని చూపు రంజని మీద క్షణ మాత్రం నిలిచి పిన్ని వైపు మళ్లింది.

"మామయ్యగారు ఉండగానే రంజని పట్ల నా కున్న అభిప్రాయాన్ని ఆయనకి చెప్పలేకపోయానని ఇప్పటికీ బాధనిపిస్తుంది. మా అమ్మా నాన్నలకి నేను చిన్నకొడుకుని గాని, ఈ కుటుంబానికి పెద్ద కొడుకులాగే ఉండాలనీ, ఆంటీ నన్నలా యాక్సెప్ట్ చెయ్యాలనీ కోరుకుంటున్నాను" అన్నాడు. రంజనితో ఇదంతా ముందే చెప్పినట్టున్నాడు. అది కళ్లు వాల్చుకుని వింటూ కూర్చుంది.

అన్నయ్య లేచి వెళ్లి "సందీప్, మై లిటిల్ బావా" అంటూ అతన్ని గాఢంగా హత్తుకున్నాడు.

అక్కడంతా సంతోషపు వర్షమేదో కురిసినట్టు అందరి మొహాలూ విచ్చుకున్నాయి. పిన్ని తడికళ్లతో అతన్ని చూస్తూ ఉండిపోయింది. నాకెందుకో శరీరం గగుర్పొడిచినట్టైంది.

"పదెకరాల్లో ఏమంత సంపాదిస్తావు సందీప్, మీ కుటుంబం ఖర్చులకి ఈ వ్యవసాయపు రాబడి ఏం సరిపోతుంది? మీ పుట్టబోయే పిల్లల చదువులకి మంచి స్కూళ్లూ కాలేజీలూ వద్దా?" అడిగాడు అన్నయ్య.

"విత్తన పంటలు వేస్తాం బావా! వాటికిపుడు చాలా డిమాండ్ ఉంది. నాదీ రంజనిదీ అదే ఫీల్డ్ కదా! చుట్టుపక్కల పొలాలు అమ్మకానికి వస్తే వాటి గురించి కూడా ఆలోచిస్తాం. హైదరాబాద్ లో నాకొక ఆర్గానిక్ ఔట్లెట్ ఉంది. ఇప్పటిదాకా ఆహారధాన్యాలూ, పప్పులూ, ఖాదీ సబ్బులూ, షాంపూలూ ఇలాంటివే అమ్ముతున్నాం. మెల్లిగా అందులో కూరగాయలు కూడా మొదలుపెడతాం. ఇక్కణ్నించీ... ఇట్స్ జస్ట్ ఫోర్ ఆర్స్ జర్నీ!

"హైద్రాబాద్ లో అన్నయ్యా వదినలకి ఒక ఆర్గానిక్ రెస్టారంట్ ఉంది. వదిన దాన్ని మానేజ్ చేస్తోంది. హెల్త్ ఫ్రీక్స్ చాలామంది అక్కడికి వస్తారు. వాళ్లకి మేమే సప్లై చెయ్యచ్చు. సేంద్రియ పంటలూ, విత్తన పంటలతో జీవితానికి సరిపడా సంపాదించుకోవచ్చు బావా! ఆరోగ్యంగా జీవించచ్చు. విజయవాడ పెరుగుతోంది. మా సంసారం పెరిగేటప్పటికి అటు హైదరాబాద్, ఇటు విజయవాడా రెండూ పూలపల్లికింకా దగ్గర్లోకి వస్తాయి. పిల్లల చదువులకి ఏ ఇబ్బందీ ఉండదు. ఈ పురుగుమందుల ఆహారం మేం తినం, వాళ్లకి పెట్టం" మెరిసే కళ్లతో అతను చెప్తుంటే అవాక్కై వింటూ ఉండిపోయా.

దాదాపు అందరిదీ అదే స్థితి. కొంత సేపాగి, పిన్ని ముందు మోకాళ్ల మీద కూర్చుని క్ష్"ఆంటీ! మీరు మాతో ఉండి గైడ్ చేస్తుంటే, నేనూ రంజనీ అనుకున్నవన్నీ సాధించ గలుగుతాం!" నెమ్మదిగా, ఆర్తిగా అన్నాడు.

అప్పటిదాకా గంభీరంగా ఉన్న పిన్ని "ఆడపిల్లలిద్దరూ ఇంక పెళ్లిళ్లై వెళ్లిపోతారని ఒంటరిగా బతకడానికి సిద్ధపడుతున్న నన్ను... ఎందుకయ్యా మళ్లీ ఇంత ఆప్యాయత చూపించి ఆశ పెడుతున్నావు?" అంటూ అతని చేతుల్లో తల పెట్టుకుని ఏడ్చేసింది.

'పిన్నీ' అంటూ అన్నయ్యా, 'అదేంటమ్మా శారదా?' అంటూ అమ్మా దగ్గరగా వెళ్లారు. అత్తలిద్దరూ కళ్లు తుడుచుకుంటూంటే నాకూ ఏడుపొచ్చింది.

చిన్నపుడు నాకు తలంటిపోసి, నెప్పెట్టకుండా చిక్కులు తీసి జడలల్లి, అలిగితే వెంటపడి బతిమాలి, నోట్లో ముద్దలు పెట్టిన పిన్నిరూపం హఠాత్తుగా కళ్లముందు కదిలింది. పిన్ని ముందున్న చోటంతా వీళ్లందరితో నిండిపోవడంతో వెళ్లి తన వెనక కూర్చుని నడుంచుట్టూ చేతులేసి 'పిన్నీ' అంటూ కావలించుకున్నాను.

# రక్తపుదివిటీ

నిర్మల్ ప్రవీణ్ లింగిశెట్టి

"ఏం పెద్దయ్యా... ఈ లారీ స్టీరింగ్ ఇంత గట్టిగ ఉన్యాదీ. సినిమాల్లో ఇట్ల తిప్పితే అట్ల తిరిగిపోతాది కదా" అన్నాడు 15 ఏళ్ల ఓబులేసు.

"అది సినిమారా అబ్బీ. వాళ్ళు చెప్పేవి మనం సూసేవి అన్ని సత్తు ఎవారాలే. స్కూలుకు పోకుండా అవే సూస్తావుంటే ఇద్దో... నాలా డ్రైవర్ అయిపోతావు" అన్నాడు కిష్టప్ప.

"స్కూల్లో ఏమీ ఉండదు పెద్దయ్య. నాయిన చనిపోయిన తర్వాత డబ్బులే లేవంటే, ఇంక యాడో మార్కాపురంలో ఉండే స్కూలుకు ఎట్లా పోయేది చెప్పు"

తన పెద్దయ్య కిష్టప్ప లారిలో డ్రైవింగ్ నేర్చుకున్నాడు ఓబులేసు. డ్రైవింగ్, మైనింగ్ తప్ప వేరే బతుకు తెరువు తెలీదు వాళ్ళ ఊరుకి. ఆ ఊరిపేరు రాయుడోరిపాలెం. నల్లమల ఫారెస్ట్ అంచుల్లో ఉంటుందది. ఊరి వాళ్ళందరూ పనిచేసేది భూపతి ట్రాన్స్పోర్ట్ కంపెనీ కింద.

ఓబులేసు తండ్రి చనిపోయినపుడు, ఓబులేసుకి డ్రైవర్ ఉద్యోగం ఇచ్చి వాళ్ళ కుటుంబాన్ని ఆదుకున్నాడు భూపతి ట్రాన్స్పోర్ట్ కంపెనీ ఓనర్, భూపతి రాయుడు. అందుకే ఓబులేసు అదే కంపెనీలో పనిచేస్తున్న, తన పెదనాన్న కిష్టప్ప బండ్లో డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడు.

"సర్లే... చూస్కుని తోలు, సీకటి పడినాది. అసలే ఇదంత మంచి రూటు కాదు."

అంటుండగానే దూరంగా రోడ్డుకి పక్కన ఉన్న సీనాకాయల తోట ముందు తెల్లటి బట్టలు వేసుకున్న ఒకమ్మాయి చెయ్యి ఊపుతోంది.

"పెద్దయ్యా... ఆడెవరో అమ్మాయి చెయ్యి ఊపుతాంది పెద్దయ్య" అని భయంగా అన్నాడు ఓబులేసు.

"అది గాలిరా ఓబులేసా... అటువైపు చూడమాకు. రోడ్డువైపే చూస్తా స్పీడుగా పోనీ."

ఓబుసుకు చెమటలు పట్టాయి. స్పీడుగా సీనాతోటని దాటుకుని వెళ్లిపోయారు. అద్దంలో వెనక్కి చూస్తే ఇందాక ఆ అమ్మాయి ఉన్న స్థలంలో ఎవరూ లేరు. గుండెదడ పెరిగిపోయింది ఓబులేసుకు.

"ఏందిది పెద్దయ్య?"

"ఈ సీనాతోటలో ఎంతో మంది చచ్చిపోయార్రా. కొందరు ఆత్మహత్య చేసుకున్నారు. కొందరు మర్డర్ అయినారు. వాళ్ళ ఆత్మలే రాత్రిపూట ఈడ కనపడుతూ ఉంటాయ్. ఎవడు సీనాతోట ముందు బండి ఆపినా, తర్వాత రోజు ఈడనే రక్తం కక్కుకుని చచ్చిపోతారు. నువ్వు ఎప్పుడు ఈ రూట్లో వచ్చినా ఈడ మాత్రం బండి ఆపొద్దు."

ఒక్కసారిగా వళ్ళు జలదరించింది బండి కొత్తగా నేర్చుకుంటున్న ఓబులేసుకు. స్టీరింగుని పట్టుకున్న చేతులు వణుకుతున్నాయి.

ఒక ఫర్లాంగు దూరం వెళ్ళాక... "బండి కొంచెం స్లో చేయారా ఓబులేసా" అని రోడ్డు వైపు చూస్తూ చిన్నగా గొణిగాడు కిష్టప్ప.

ఉలిక్కిపడ్డాడు ఓబులేసు. ముందుకు చూస్తే ఈసారి ఉంది పోలీసు చెక్ పోస్టు. పోలీసు కానిస్టేబుల్ లైట్లు చేతిలో పట్టుకుని ఆపమంటూ ఊపుతున్నాడు. కిష్టప్పకు చెమటలు పడుతున్నాయి. ఎందుకంటే బండిలో ఉన్నది మామూలు సరుకు కాదు. దొరికితే 7 ఏళ్ల జైలు శిక్ష. ఈ దారిలో పోలీసు చెక్ పోస్టు ఎప్పుడో ఒక్కసారి పెడతారు. అది అనుకోకుండా ఈరోజే అయింది. ఓబులేసుకు ఆ సరుకు గురించి కానీ 7 ఏళ్ల జైలు శిక్ష గురించి కానీ తెలీదు.

బండి స్లో చేశాడు ఓబులేసు. ఖచ్చితంగా బండి పోలీసు చెక్ పోస్టు ముందు ఆగబోతోంది. ఉన్న ఒక్క కానిస్టేబుల్, బండి వెనక్కి లైట్ వేసుకుని యథాలాపంగా చెకింగ్ కి వెళ్ళాడు.

"యాక్సిలేటర్ తొక్కరా ఓబులేసు"

"పెద్దయ్యా..." అంటూ అర్థం కానట్టు చూశాడు ఓబులేసు.

"తొక్కమన్నానా..." అని అరిచాడు కిష్టప్ప.

యాక్సిలేటర్ బలంగా తొక్కాడు. లారీ ఒక్కసారి దూసుకుని ముందుకు చెక్ పోస్టు ను పగలగొట్టుకుంటూ వెళ్ళిపోయింది. కానిస్టేబుల్ భయపడి వెనక్కిపడ్డాడు.

ఉలిక్కిపడి లేచాడు ఓబులేసు. 2 సంవత్సరాల క్రితం జరిగిన ఈ సంఘటన ఓబులేసు కి ఇంకా గుర్తొస్తోంది. ఎందుకంటే కిష్టప్ప తో తాను మాట్లాడిన చివరి మాటలు అవే. ఈ సంఘటన జరిగిన 2 రోజుల తర్వాత కిష్టప్ప సీనాతోట దగ్గర రక్తం కక్కుకు చనిపోయాడు. అందరూ కిష్టప్ప తోటలోకి వెళ్ళాడు అందుకే దెయ్యం చంపేసింది అన్నారు.

★★★

ఈరోజు ఓబులేసు పుట్టినరోజు. లారీలో కంపెనీ వాళ్ళ లోడ్ వేసుకుని చాలా ఆనందంగా పాటలు పాడుకుంటూ వస్తున్నాడు. సాయంత్రం 7.30 అవుతోంది. సరిగ్గా సీనాతోట దగ్గరకి వచ్చాడు... ఎవరో అమ్మాయి రోడ్డుకి

పక్కన ఉంది. బట్టలు తెల్లగా మెరిసి పోతూ ఉన్నాయి. ఖచ్చితంగా కిష్టప్ప చనిపోయే ముందు కనపడింది. మళ్లీ ఇప్పుడు కనపడింది దెయ్యం.

ఈ రెండు సంవత్సరాల్లో సీనాతోట గురించి ఎన్నో విన్నాడు. రాత్రిళ్ళు తెల్లగా ఉండే ఎవరో తిరుగుతూ ఉంటారని, వాళ్ళ చేతుల్లో పెద్ద దివిటీలు ఉంటాయని. ఎవరు వాళ్ళని చూసినా... ఎవ్వరు ఆ తోటలోకి వెళ్ళినా ప్రాణాలతో మిగలరు అని ఎన్నో విన్నాడు.

తనకు కూడా ఏదో చెడు జరగబోతోంది అని అర్థమయ్యింది. భయపడుతూ బండి స్పీడ్ గా పోనించాడు. అకస్మాత్తుగా రోడ్డు పక్కన నిలబడిన దెయ్యం, రోడ్డు మీదకు వచ్చింది. ఓబులేసు బండికి అడ్డంగా వస్తోంది. స్టీరింగ్ మీద చెయ్యి నిలబడ్డంలేదు ఓబులేసుకి. అరచేతిలో పట్టిన చెమటకు జారిపోతోంది. గట్టిగా స్టీరింగ్ పట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. బ్రేకులు వేద్దామనుకున్నాడు కానీ మళ్ళీ ఎక్కడ దెయ్యం ఎక్కేస్తుందో అన్న భయంతో వేగంగా దెయ్యం మీదకు ఒక్కసారిగా ఎక్కించేసాడు. లారీ కుదుపుకు లోనయ్యింది. ఏం అర్థం కాలేదు ఓబులేసుకి. వెనక్కి చూడకుండా వేగంగా ఒక మూడు ఫర్లాంగులు వచ్చేశాడు.

కానీ ఇప్పుడు మాత్రం బ్రేకులు పడక తప్పలేదు. ముగ్గురు పోలీసులతో చెక్ పోస్టు పెట్టారు. 2 ఏళ్ల క్రితం చూసిన చెక్ పోస్ట్ తనకు ఇంకా గుర్తొస్తోంది. అప్పుడు పెద్దయ్య ఎందుకు చెక్ పోస్టు బద్దలుకొట్టి ముందుకు తిస్కెళ్ళాడో ఇప్పటికీ తెలీదు ఓబులేసుకి. ఇప్పుడు మాత్రం చిన్నగా బండిని స్లో చేసి ఆపేశాడు. ఒక కానిస్టేబుల్ ముందు ఉన్నాడు. ఎస్ఐ, కానిస్టేబుల్ వెనక్కి వెళ్లారు.

"ఏయ్ దిగు దిగు... యెనక్కి రా. ఈ పట్టలు ఎత్తు చెక్కల మీద"

ఓబులేసు వెనక్కి వెళ్లి లారీలో వేసిన చెక్కల మీద ఉన్న పరదాలు ఎత్తాడు. పరీక్షగా చూసిన ఎస్ఐ, ఒక దుంగని బయటకి లాగాడు. దాని మధ్యలో ఎర్రగా ఉంది.

"ఇదేంది రా..."

"నాకు తెలీదు సార్. మా కంపెనీలో లోడ్ వేస్తారు. మేము వేసుకుని వచ్చేస్తాం అంతే సార్."

"నీయబ్బ... ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తూ. నాకు తెలీదు సార్... అంటూ నంగి నాటకాలు ఆడతావేంట్రా" అంటూ చెంప మీద లాగిపెట్టి కొట్టాడు.

కుర్చోరా కింద కూర్చో అంటూ షర్ట్ లాగేసాడు. చేతులు వెనక్కిపెట్టరా అంటూ లాఠీతో కొట్టాడు.

"కానిస్టేబుల్... లోడులో ఉన్న మొత్తం ఎర్ర చందనం కిందకి దించు"

ఆరోజు కిష్టప్ప ఎందుకు ఆ చెక్ పోస్టు బద్దలుకొట్టి వెళ్లిపోయాడో మెల్లగా అర్దమవుతుంది ఓబులేసుకు.

"నీ వయసెంతరా?"

"20 సార్"

"నీ మొహం చూస్తే అట్ట లేదురా. లైసెన్స్ ఉందా?"

... (ఓబులేసు మౌనం)

"మాట్లాడవేంటిరా దివాన్?" అంటూ లాఠీతో ఇంకో దెబ్బ వేసాడు.

"ఉంది సార్ ఉంది"

"యాడ"

"లారీ క్యాబిన్లో"

ముందుకు వెళ్ళిన కానిస్టేబుల్ "క్యాబిన్లో యాడా?" అంటూ అరిశాడు.

"స్టీరింగ్ పక్కన బాక్స్ లో సార్"

"కనపడ్డం లేదు సార్ ఈడ" అన్నాడు కానిస్టేబుల్.

రేయ్ చూపించు నువ్వు అంటూ క్యాబిన్ దగ్గరకు ఓబులేసుని తిస్కెళ్ళాడు ఎస్ఐ.

"ఇద్దో సార్... ఇక్కడే" అంటూ క్యాబిన్ లోపలకి ఎక్కాడు ఓబులేసు.

క్యాబిన్ పక్కన బాక్స్ తీస్తూ... క్యాబిన్ లోపల కూర్చున్న కానిస్టేబుల్ ని కాలుతో తన్నాడు. కానిస్టేబుల్ ఎగిరి ఎస్ఐ మీద పడ్డాడు. లారీ స్టార్ట్ చేసి ఒక్కసారిగా చెక్ పోస్టును బద్దలు కొట్టుకుని ముందుకెళ్ళి పోయాడు.

★★★

2 సంవత్సరాల క్రితం కిష్టప్ప చెక్ పోస్టు బద్దలు కొట్టుకుని వచ్చాక లారీని ఊరి బయట తుప్పల్లో ఆపి. ఓబులేసును ఇంటికి పంపేశాడు.

ఓబులేసు కూడా లారీని తీస్కుని సరాసరి రాయుడోరిపాలెంకి వచ్చాడు. ఊరి బయట తుప్పల్లో లారీని ఆపి, ఇంటికి వచ్చి బయట ఉన్న నులక మంచం మీద కూలబడ్డాడు. కళ్ళు తిరుగుతున్నాయి ఓబులేసుకి. ఆయాసం వస్తోంది. పుట్టినరోజు నాడు గడచిన గంటలో జరిగిన సంఘటనలు తన గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఈ ఎర్ర చందనం ఏంటో... ఏం జరుగుతుందో అర్ధం కాక మదనపడిపోతున్నాడు. ఇంతలో ఇంట్లోచి అమ్మ వచ్చింది.

"ఏమిరా ఓబులేసా... ఏదో రందిలో ఉన్యావేమి. ఏమైనాది?"

"లోడేస్కుని వస్తాంటే పోలీసులు ఆపినారమ్మా. వాళ్ళు చూస్తే లారీలో ఎర్ర చందనం చెక్కలున్నాయి. వాళ్ళని కొట్టి పారిపోయి వచ్చేసిన అమ్మ"

"నువ్వు ఊరు విడిసి వెళ్ళిపోరా ఓబులేసు. ఆ కిష్టప్పకి కూడా ఇట్లే అయినాదిరా. తర్వాత 2 రోజుల్లో ఆ దెయ్యం తోట దగ్గర రక్తం కక్కుకు చనిపోయాడు. వెళ్లిపోరా ఓబులేసు"

"మిమ్మల్ని వదిలేసి యాడికి పోవాలమ్మ నేను"

"యాడికో ఒక తూరికి పోరా ఓబులేసు. ఈడ మాత్రం ఉండబాకు." అంటూ భయపడుతూ చెప్పింది.

ఇంతలో నాలుగు దిక్కుల నుంచి నలుగురు పోలీసులు వచ్చి ఒక్కొక్కరు ఓబులేసు కాళ్ళు చేతులు తల పట్టుకున్నారు. బేడీలు వేసి పోలీసులు లాక్కెళ్లి పోతున్నారు.

"పారిపోరా ఓబులేసా పారిపో" అంటూ వాళ్ళమ్మ గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. ఎందుకంటే జరగబోయేది ఆమెకు తెలుసు కాబట్టి.

ఓబులేసుని తీస్కెళ్ళి 2 రోజులు విపరీతంగా కొట్టారు. నీకు ఆ ఎర్ర చందనం ఎక్కడిది అని. కంపెనీ వాళ్ళు లోడ్ వేసారు సార్ అని తను చెప్తూనే ఉన్నాడు. రేపు కోర్టులో సబ్మిట్ చేస్తారు అనగా.. ఈరోజు సాయంత్రం బెయిల్ వచ్చింది. కుంటుకుంటూ బయటకు వచ్చాడు ఓబులేసు. పోలీసు స్టేషన్ మెట్ల బయట భూపతి కారు ఉంది.

"రేయ్... ఓబులేసు. నీకు అయ్యగారే బెయిల్ ఇచ్చింది. వెళ్లి దండాలు పెట్టు"

కార్లో కూర్చున్న భూపతికి దండం పెట్టాడు.

"ఏరా... ఎట్లున్నాది ఇప్పుడు" అని గంభీరంగా అడిగాడు భూపతి

"బానే ఉన్యాది సామి" అని పోలీసు దెబ్బల నొప్పితో వణుకుతూ చెప్పాడు.

"దా కార్లో కూసో. నిన్ను ఇంటికి తీస్కెళ్లి ఆ దెబ్బలకు కాపడం పెట్టిస్తా".

కార్లో కూర్చున్నాడు ఓబులేసు. కారు భూపతి ఇంటి దగ్గర ఆగింది. ఇంటి చావడిలో భూపతి పనిమనుషులు ఓబులేసు కి కాపడం పెడుతున్నారు. చావడిలోకి వచ్చి తన వాలు కుర్చీలో కూర్చున్నాడు భూపతి.

"ఏంపా ఏమంటున్యారు పోలీసులు" అని ఓబులేసుని అడిగాడు భూపతి.

"రేపు కోర్టులో కంపెనీ మీద సాచ్చం చెప్పమంటునారు సామి."

"అబ్బా... ఏం చేస్దామనుకుంటున్యావు మరి"

"జరిగిందే చెప్పేద్దామనుకుంటున్నా సామి. కంపెనీ లోడ్ ఎక్కిచింది. నేను తెచ్చేసా. అంతకు మించి నాకు ఏం తెలీదు అని"

వెంటనే ఓబులేసు కి కాపడం పెడ్తున్న పనిమనిషి ఒకడు, తన చేతిలోని గుడ్డ విసిరేసి. ఫడేల్ మని ఓబులేసు నెత్తిన కొట్టి

"రేయ్ లేకినాయాల... మీ అయ్యి చచ్చినంక... నీకు ఉద్యోగం ఇచ్చి ఆదుకుంటే... ఇట్లనేరా చేసేది?" అన్నాడు

"రేయ్ ఆడ్ని కొట్టొద్దు"

"మా అమ్మ నాకోసమే ఉన్యాది సామి. నేను రేపు ఈ నేరం నా మీద వేసుకుని జైలుకి వెళ్తే. మా అమ్మ ఎట్లా సామి. మా పెద్దయ్య కూతురు చిన్ని పెళ్లి కూడా నేనే చేయాలి సామి"

"లాస్ట్ మాట... ఏమంటావురా అబ్బి"

... (ఓబులేసు మౌనం)

"ఈ కంపెనీ ఎవరు పెట్టారో తెల్సునా... వంద ఏళ్ల క్రితం మా తాత కొండారాయుడు.

మీలాంటి తుకాసి నాయాళ్ళకి తిండి లేకపోతే, జాలి పడి మీకు డ్రైవర్లు క్లీనర్లు ఉద్యోగాలిచ్చి పెట్టినాడు మా తాత. ఈరోజు మీ నోటికి ఇంత తిండి వస్త్యాందంటే అది మా తాత వేసిన బిచ్చ. ఈరోజు నువ్వొచ్చి సాచ్చం ఇచ్చి ఈ కంపెనీ మూసేపిస్తే, నాదేముందబ్బ మూడు నాళ్ళల్లో జైలు నుంచి వచ్చేసి బెంగుళూరుకు పోయి వేరే బిజినెస్ పెట్టుకుంటా. మరి దీని మీదే బతుకుతున్న 378 మంది మీవోళ్ళ సంగతేంటి. వాళ్ళెట్ల తింటరు, ఎటుబోతారు. ఆలోచించుకుని చెప్పు ఓబులేసా"

"నాకియ్యన్ని తెలీదు సామి. నాకు మా అమ్మ, చిన్నియే కావాలి. కావాలంటే అడుక్కుని బ్రతుకుతాం" అని చెప్దామనుకున్నాడు. కానీ గొంతు పెగల్లేదు.

"వెళ్ళొస్తాను సామి" అని దండం పెట్టి వచ్చేశాడు.

ఊరికి నడుస్తూ కూడా ఇదే ఆలోచిస్తూ ఉన్నాడు. ఇంటి దగ్గరకు వెళ్ళాక పెద్దయ్య వాళ్ళ ఇంటి ముందు టెంట్ వేసి ఉండడం చూసాడు.

ఓబులేసుని చూసి తల్లి ఇంటిలోంచి వచ్చింది.

"వచ్చేసావా ఓబులేసా... ఇంక సర్దుకుని ఊరులోంచి వెళ్లిపోరా" అంటూ ఉండగా

"అమ్మా... పెద్దయ్య ఇంటి ముందు ఆ టెంట్ ఏంటి"

"చిన్ని చచ్చిపోయినాది ఓబులేశా. నువ్వు అరెస్టయిన రోజే... సాయంత్రం దెయ్యం తోట ముందు ఏదో లారీ గుద్దేసి ఆపకుండా వెళ్లిపోయిందట" అంటూ ఏడ్వసాగింది.

హతాశుడయ్యాడు. గుండె పగిలిపోయింది. ఇంక తల్లి చెప్పే మాటలేవీ చెవిలో పడటంలేదు.

తెలీకుండానే కాళ్ళు పెద్దయ్య ఇంటివైపు పడ్డాయి. టెంట్ ఉన్న ఇంటిలోపల చీకటిలో దీపం మాత్రమే వెలుగుతూ ఉంది. చిన్ని తల్లి మరియు పెద్దయ్య భార్య అయిన, పెద్దమ్మ మౌనంగా కూర్చుని ఉంది.

★★★

"పెద్దమ్మా..." అంటూ ఏడుస్తూ వెళ్లి పెద్దమ్మ కాళ్ళ దగ్గర పడ్డాడు.

"ఏమిరా ఓబులేసు... బెయిల్ ఇచినారా?" అని శూన్యంలోకి చూస్తూ అడిగింది పెద్దమ్మ.

అవును అన్నట్టు తల ఊపాడు.

"నిన్ను చంపేస్తారురా ఓబులేసు. వెళ్ళిపో ఈడ నుంచి. నాకు చచ్చిపోయిన నా కూతురి మీద ఆలోచన లేదురా. బతికున్న నువ్వే నాకు ముఖ్యం వెళ్ళిపో ఈడ నుంచి"

"ఏమి జరిగింది పెద్దమ్మా. ఎందుకు అందరూ నాకు ఇలా చెప్తున్నారు. "

నిర్వేదంతో నవ్వింది పెద్దమ్మ...

పక్కనే ఉన్న కిష్టప్ప పెద్దయ్య ఫోటో చేతిలోకి తీసుకుని తుడుస్తూ...

"భూపతి... ఒక కోటాను కోట్ల అధిపతి, ఆయనకి ఎర్ర చందనం స్మగ్లింగ్ తో పాటు ఇనుప గనులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆ గనులు ఉన్న వెయ్యి ఎకరాలు ఎవరివో కాదురా ఓబులేసు, మన ఊరివే.

మన నేలలో ఇనుప రజను ఉందని తెలిసి,

'మీ ఎర్ర నేలల్లో మట్టే తప్ప వరి పండదు,

మీకు నా ట్రాన్స్పోర్ట్ కంపెనీలో ఉద్యోగాలు ఇస్తా' అని చెప్పి

ఆ పొలాలన్నీ తన పేర రాయించుకున్నాడు భూపతి తాత కొండారాయుడు.

మన ఊరి వాళ్ళని డ్రైవర్ల పేరుతో స్మగ్లింగ్ కంపెనీలో ట్రాన్స్పోర్టర్లుగా చేశాడు.

మిగిలిన వాళ్ళని మైనింగ్ కంపెనీకి పట్టుకునిపోయాడు.

**మన రక్తంతో వెలిగించిన దివిటీల వెలుతురుతో వాళ్ళ కుటుంబం వెలుగుతోంది.**

వచ్చిన డబ్బుతో ఆ కుటుంబం రాజకీయాల్లోకి పోయింది. మైనింగ్ లో కానీ స్మగ్లింగ్ లో కానీ ఎవరు ఎదురు తిరిగినా గుట్టు చప్పుడు కాకుండా చంపేసేవాళ్లు. శవాల్ని సీనా తోట దగ్గర పడేసి, దాన్ని దెయ్యం తోట చేశారు.

రోగం వస్తే... మందు కాదు, ఆ దేవుడే నయం చేస్తాడు అనుకునే పిచ్చి మనుషులు మన జనం. ఇంక ఆ చావులకి కారణం దెయ్యమే అని నమ్మారు తప్ప మన ఊరికి పట్టిన దెయ్యం ఆ భూపతి అని తెలుసుకోలేక పోయారు."

"పెద్దయ్య కూడా నాలా స్మగ్లింగ్ లో దొరికిపోయి పోలీసులకి చెప్పేస్తానందుకే చంపేశారా పెద్దమ్మా?"

"కాదురా ఓబులేసు. మీ నాయన దొరికిపోయాడు. భూపతి ట్రాన్స్పోర్ట్ లో ఎర్ర చందనం స్మగ్లింగ్ తో దొరికిపోయిన మొట్ట మొదటి మనిషి మీ నాన్న. మీ నాయన కూడా నీలానే అప్రూవర్ గా మారిపోతాను అని చెప్పాడు. భూపతి వదల్లేదు. వెంటబడి వెంటబడి మనోళ్ళతోనే చంపించాడు. చంపాక శవాన్ని ఆ సీనా తోట దగ్గర పడేపించాడు. "

కళ్ళు ఎరుపెక్కాయి ఓబులేసుకి, ఆవేశంతో పిడికిలి బిగించాడు.

"ఎవరు పెద్దమ్మా... ఎవడు ఆ భూపతి మాట విని మా నాయన్ని చంపింది. వాణ్ణి, ఆ భూపతిని నరికిపారేస్తా"

"భూపతి మాట విని చంపింది మీ పెద్దయ్యేరా"

ఒక్క క్షణం భూమి స్తంభించిపోయింది ఓబులేసుకి. గుండె మీద వేయి పిడుగులు పడినట్లు అనిపించింది.

"మా నాయన తర్వాత నాయనలా చూసుకున్న పెద్దయ్య చంపడం ఏంది పెద్దమ్మ?"

"ఆ భూపతి మనకు ఉపాధి కల్పిస్తున్నాడు అని నమ్మినోల్లు ఆ కుటుంబాన్ని పూజించేవారు.

వాళ్ళకి ప్రతి పూట మందు పోయించేవాడు, హత్యలు చేయించేవాడు.

పండగలకి వెయ్యి రూపాయలు ఇచ్చేవాడు, ఏదో బండి కింద మందుపాతర పెట్టించేవాడు.

మీ పెద్దయ్య కిష్టప్ప కూడా స్మగ్లింగ్ చేశాడు, ఎన్నో హత్యలూ చేశాడు. నీ తమ్ముడు సాక్ష్యం చెప్తే ఈ కంపెనీ మూతపడుతుంది. మీ జనంకి తిండి ఉండదు అని తాగించి పురమాయించాడు భూపతి. మత్తు దిగాక, తమ్ముడ్ని చంపేశాక... తమ్ముడి కుటుంబం గుర్తొచ్చింది నా పెనివిటికి. అందుకే పశ్చాతాపంతో మీ కుటుంబానికి సహాయం చేసేవాడు. "

"మరి పెద్దయ్య ఎలా చనిపోయాడు పెద్దమ్మ?"

"అంత విశ్వాసంగా ఉన్నా తన దగ్గర పనిచేసే పనోళ్ళ కూతుళ్ళని కూడా వదల్లేదు ఆ భూపతి. అలానే చిన్నిని కూడా వదల్లేదు. చిన్ని జీవితాన్ని ఎందుకు నాశనం చేశావ్ అని నిలదీసినందుకు మీ పెద్దయ్యని చంపేశాడు. చిన్నిని కూడా ఆ భూపతే చంపేసి ఉంటాడు. చనిపోయేటప్పటికి చిన్ని 3 నెలల గర్భవతిరా ఓబులేసు." అంటూ కన్నీరు పెట్టింది సూరమ్మ

మాటలు ముగించే లోపే అలికిడికి వెనక్కి తిరిగి చూసింది. ఇంట్లో పడి ఉన్న వేట కొడవలిని పట్టుకుని తుఫాను వేగంతో వెళ్తున్నాడు ఓబులేసు.

వేట కొడవలిని బండిలో వేసి లారీని ముందుకు లంఘించాడు. భూపతి ఇంటికి వెళ్లి ఒక్క పెట్టున తల నరికి, దాన్ని భూపతి బంగ్లాకి తగిలించాలని బలంగా సంకల్పించుకున్నాడు. లారీలో ఉన్న కల్లు తాగుతూ, వేగంగా వెళ్తూ

మధ్యలో దెయ్యం తోటని చూసాడు.

ఒక్కసారిగా తన తండ్రి, కిష్టప్ప, చిన్ని గుర్తొచ్చారు. వారందరూ చనిపోయిన స్థలం ఇదే అని గుర్తొచ్చింది. కళ్ళలోంచి నీళ్ళు ధారగా వచ్చేస్తున్నాయ్. మనసు నడిపే రోడ్డు మీద నిలబడడంలేదు. చిన్నగా బండిని స్లో చేసి దెయ్యం తోట పక్కనే ఆపేశాడు.

అలా తోటలోకి అనాలోచితంగా చూస్తూ ఉన్నాడు.

ఇంతలో ఎవరో 13 ఏళ్ల అమ్మాయి తెల్ల బట్టలు వేసుకుని సీనా తోట లోపల పరిగెడుతూ కనపడింది. ఆ అమ్మాయి వెనకే ఎవరో మనిషి పరిగెడుతున్నారు. కాపాడండి కాపాడండి అంటూ అరుపులు వినపడ్డాయి. ఈ సీనా తోటలో ఇంకో చావు ఉండనే ఉండకూడదు అంటూ వేట కొడవలి తీసి తోటలోకి ఉరికాడు. గేటు దాటి లోపలికి వచ్చాడు.

★★★

అప్పుడు సమయం సాయంత్రం 6.30. బయట నుంచి చిన్నగా కనపడే సీనాతోట, లోపల వంద ఎకరాల విస్తీర్ణంలో ఉంది. తోటలో చెట్ల కింద గుబురుగా ఏవో పూలు పూసిన మొక్కలు ఉన్నాయి. వాటి నుంచి మత్తుగా వాసన వస్తోంది, అవి గంజాయి పూలు అని ఓబులేసుకు తెలీదు. తోట అంతా పరికించి చూస్తున్నాడు.

ఇంతలో అక్కడే ఆ పరిగెడుతున్న అమ్మాయి పడిపోయింది ఆ అమ్మాయి మొహం చూశాడు. అది అచ్చం చిన్నిలానే ఉంది. చిన్నిలా కాదు, చిన్నినే అది. గుండె చల్లగా అయిపోయింది. కళ్ళు పెద్దవి అయిపోయాయి ఓబులేసుకి. చిన్ని వెనుక వెంబడిస్తున్నవాడు వచ్చి, చిన్ని మీదకు దూకాడు. దెయ్యం పట్టిన వాడిలా పెనుగులాడుతున్నాడు.

తను చూసేది నమ్మలేకపోతున్నాడు ఓబులేసు. మూడు రోజుల క్రితం చనిపోయిన చిన్ని ఇక్కడ ఉండడం ఏంటో అర్థం కావట్లేదు. మెదడు చచ్చుబడినట్లు అయిపోతోంది.

"అన్నయ్యా... కాపాడు అన్నయ్యా" అంటూ ఏడుస్తూ పిలుస్తోంది చిన్ని.

ముందుకు వెళ్దామని అడుగు వేయబోయాడు కానీ కాలు ముందుకు కదలడం లేదు.

ఇంతలో తన కళ్ల ముందే చిన్ని తన మీద పడిన వాడి నుంచి తప్పించుకుని రోడ్డు మీదకు పరిగెత్తింది. ఎదురుగా వస్తున్న లారీని ఆపండి ఆపండి అరవసాగింది. ఆ లారీని నడుపుతున్నది ఓబులేసే. కానీ వేగంగా వచ్చిన ఆ లారీ చిన్నిని గుద్ది వెళ్లిపోయింది. ఆరోజు దెయ్యం అనుకుని తాను లారీ ఎక్కించి వెళ్ళిపోయింది... ఆపదలో ఉన్న చిన్ని మీదే అని తెలిసి కొయ్యబారిపోయాడు. చేతిలోంచి వేటకొడవలి జారి కింద పడింది. అప్రయత్నంగా కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి.

ఇంతలో కిష్టప్ప ఏడుస్తూ, తోటలోకి తూలుతూ వచ్చాడు.

"తమ్ముడూ... ఎట్ల చంపుకున్ననురా నిన్నూ. ఆ దుర్మార్గుడు భూపతి మాట విని నిన్ను చంపుకున్నా. కానీ వాడు ఇప్పుడు నా కూతురు బ్రతుకు నాశనం చేశాడురా. ఈడనే కదా... ఈడనే కదరా నిన్ను చంపుకున్నా. నేను ఇయ్యాలా బ్రతక కూడదురా." అంటూ పురుగుల మందు తీస్కున్నాడు.

నోటికాడ పెట్టుకున్నాడు. తాగలేననుకున్నాడో ఏమో తీసేసాడు. లేచి వెళ్ళిపోతున్నాడు.

హఠాత్తుగా పూనకం వచ్చినట్టు కిష్టప్ప కుడి చెయ్యి పురుగుల మందు బాటిల్ మీద పడింది. ఇంకో చేత్తో ఆ చేతిని ఆపుతున్నా బలంగా పురుగుల మందు తాగేస్తున్నాడు. తను ఆపలేకపోతున్నాడు. ఖాళీ అయిన మందు డబ్బా పక్కన పడేశాడు. అల్లంత దూరం వెళ్లి తోట బయట రక్తం కక్కుకుంటూ పడిపోయాడు.

అంటే పెద్దమ్మ చెప్పినట్టు చిన్ని చావుకు, కిష్టప్ప చావుకు భూపతి కారణం కాదు.

చిన్నితో అక్రమ సంబంధం పెట్టుకున్నందుకు కోపంతో... చిన్నిని, కిష్టప్పని కూడా భూపతే చంపించి ఉంటాడని అనుకుంటోంది పెద్దమ్మ అని అర్థమయింది ఓబులేసుకు.

తోట గురించి మెల్లగా అర్థమవుతుంది... దూరంగా చెట్ల మీద ఏవో తెల్లటి ఆకారాలు ఉన్నాయి. వాటి చేతుల్లో ఎర్రటి దివిటీలు ఉన్నాయి. అవి నెత్తురు ఉన్నంత ఎర్రగా ఉన్నాయి. ఆ ఎర్రటి వెలుతురు దగ్గరగా వస్తోంది.

భయపడి వెనక్కి వెళ్తున్నాడు ఓబులేసు. ఇంతలో కిష్టప్ప, ఓబులేసు తండ్రి తోటలోకి వచ్చారు. ఇద్దరు తాగున్నారు. ఓబులేసు తండ్రికి తనతో తెచ్చుకున్న ఇంకో మందు సీసా తాగమని ఇచ్చాడు కిష్టప్ప. అతను తాగుతుండగ, కిష్టప్ప తన బొడ్డు దగ్గరి కత్తి బయటకు తీసాడు. వెనక నుంచి పొడుద్దాం అనుకున్నాడు. కానీ పొడవలేకపోయాడు.

కానీ ఒక్కసారిగా దెయ్యం పట్టినవాడిలా తమ్ముడిని 6 పోట్లు వెనక నుంచి పొడిచాడు. వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. "కాపాడండి కాపాడండి" అంటూ అరుస్తూ తోట బయటకు వెళ్లి రక్తం మడుగులో పడిపోయాడు ఓబులేసు తండ్రి.

ఇది చూసి కూలబడిపోయాడు ఓబులేసు. నాన్న అంటూ ఏడవ సాగాడు. ముందుకు వెళ్దాం అన్నా వెళ్ళలేకున్నాడు. ఇంతలో వెనక ఏదో అలికిడి అయింది, చూస్తే ఎర్రటి దివిటీల వెలుతురు దగ్గరగా వచ్చింది.

తాను కింద పడవేసిన వేట కొడవలి గాల్లోకి లేచింది. వాయు వేగంతో ఒక్కసారిగా ఓబులేసు తలని తెగ్గొట్టడానికి వస్తోంది. ఇంతలో ఎవరో ఓబులేసు చొక్కా పట్టుకుని బలంగా లాక్కొని బయటకు తీసుకొచ్చి పడేసారు.

“లేయ్... ఏం తిక్కపని చేస్తాన్యావ్.నీ కొడవలితో నువ్వే మెడ తెగ్గోసుకుంటున్నావ్”

మైకంలోంచి బయటకు వచ్చాడు ఓబులేసు. ఎదురుగా ఉంది భూపతి.

"అయ్యా... అక్కడేదో ఉన్యాది. ఏదో నా మీదకు వచ్చినాది" అంటూ చెమటలతో నిండిన ఓబులేసు తత్తరపడుతూ చెప్పాడు.

"అందుకే ఈ తోటలోకి ఎవ్వర్ని పోవద్దు అంటారబ్బీ.  పో ఈడ నుంచి త్వరగా" అని పంపిచేసాడు.

# విద్యాదానం

పాణిని జన్నాభట్ల

అదిరిపడ్డాడు రామనాధం మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ చెప్పిన మాట విని. గుండె వేగంగా కొట్టుకోవడం మొదలైంది. ఈ స్కూలే అతని జీవనాధారం. జీవితం గడవటానికి కాదు. జీవించి ఉండటానికి. ఆ ఆఫీసర్ మాత్రం ఇవేమీ పట్టనట్టుగా ఒక చేత్తో టీ తాగుతూ, ఇంకో చేత్తో ఆ రోజు పేపర్ తిరగేస్తూ తాపీగా చెప్పుకుపోతున్నాడు. “పిల్లలు బొత్తిగా క్లాసుల్లో కనపడట్లేదు రామనాథం గారూ. మీకు తెలిసిందే. నేను పై వాళ్లకి సమాధానం చెప్పాల్సి వస్తుంది. తక్కువ సంఖ్య వున్న స్కూల్స్ వలల్ ప్రభుత్వానికి చాలా నష్టం. వచ్చే సంవత్సరం ఇలానే ఉంటే ఈ స్కూల్ ని మూసేసి ఇక్కడి టీచర్లని, పిల్లలని దగ్గరలో వున్న రెంటచింతలకి మారుస్తాము!".

"కానీ చాలా ఎళ్లనుంచి బాగానే నడుస్తోంది ఈ స్కూలు. ఈ ఏడాదే ఇలా తగ్గారు స్టూడెంట్స్. రెంటచింతల ఇక్కడికి చాలాదూరం. టీచర్లు ఏదోవిధంగా ప్రయత్నించినా, పిల్లలు ఇబ్బంది పడతారు. చాలా మంది చదువులు ఆపేస్తారు." ఆఖరి ప్రయత్నంగా చెప్పాడు రామనాధం. రెండు గంటల నుంచి జరుగుతున్న ఈ సంభాషణతో విసుగెత్తిన ఆ ఆఫీసర్ "మీరేం బాధపడకండి. ఇవన్నీ మామూలే మాకు. మీ ట్రాక్ అంతా బానే ఉంది. మిమ్మల్ని మాచర్ల హైస్కూల్ కి మారేలా చూస్తాను. ఈ స్కూలు గురించి మర్చిపోండి" అని ఒకక్ ఉదుటన అనేసి, ఇంకా అక్కడే ఉంటే ఎక్కడ మంచివాడి కింద మార్చేస్తారో అన్న భయంతో వెంటనే అక్కడినుంచి బయల్దేరాడు ఆ ఆఫీసరు.

అది రెంటాల గ్రామం. షుమారు వెయ్యి గడపలు వున్నాయి ఆ ఊళ్లో. రామనాధశాస్త్రి అక్కడి ఎయిడెడ్ హైస్కూలు హెడ్మాస్టారు. మనిషి ఆరడుగులు, చామన చాయ, సాత్వికమైన ముఖం. ఎప్పుడూ తెల్లటి ధోవతీ, పైన లాల్చీతోనే వెళ్తాడు బైటికి. సిటీలో కొడుకు దగ్గరకు వెళ్లినప్పుడు మాత్రం పాంటూ షర్టూ వేస్తాడు. కొడుకు కోసం. యాభైఏడేళ్లు పైబడ్డా తన పనులన్నీ చక్కగా చేస్కోగలడు. భార్య సుశీల ఐదెళ్లక్రితం లోకాన్నీ, తననీ విడిచి వెళ్లిపోయింది.

మనోవ్యాధితో రెండేళ్ళు పోరాడింది కానీ గెలవలేక పోయింది. ఆమె పోయిన రోజు ఊర్లో కర్ఫ్యూ వాతావరణం. చిన్నకొడుకు పట్నం నించి వచ్చాడు. పెద్దవాడు రాలేదు. రాకూడదు అనుకున్నారు అందరూ, రామనాథంతో సహా!

ఆఫీసరు వెళ్లగానే, తను కూడా ఇంటికి బయల్దేరాడు. అక్కడ ఉంటే అవే ఆలోచనలు. ఆ స్కూలుకి తను పదిహేనేళల్ క్రితం వచ్చాడు విజయవాడ నుంచి. మొదట్లో ఇంట్లో వారెవరికీ నచ్చలేదు ఆ పల్లెటూరి వాతావరణం, మనుషులూ. పెద్దకొడుకు సుధాకర్ డిగ్రీకి వచ్చాడు. దగ్గర్లో మాచర్లలో తెలిసిన కాలేజీ ఉండటంతో, అక్కడ చేర్పించాడు. జీవితంలో కొన్ని సంఘటనలు మొదట మామూలుగా కనపడచ్చు కానీ అవి తర్వాత సమాజాన్ని ఎంత ప్రభావితం చేస్తాయో ఊహించడం కష్టం. పృధ్వీరాజు ఘోరీని క్షమించి వదిలెయ్యటం కూడా అలాంటిదే. మాచరల్ డిగ్రీ కాలేజీలో సుధాకర్ చేరటం కూడా అలాంటిదే.

మెల్లగా అందరూ ఊరికి అలవాటు పడ్డారు, తర్వాత ఇష్టపడ్డారు. ఐదేళ్ళు గడిచాక రామనాధం, సుశీలలు ఇంకెక్కడా ఉండలేం అని తీర్మానించారు! మనిషి స్వభావమే అది. చిననకొడుకు రమేష్, ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంజినీరింగ్ హైదరాబాద్‌లో చేసి అక్కడే ఒక చిన్న కంపెనీలో చేస్తున్నాడు. తనతోనే ఉండమని చాలాసార్లు అడిగాడు తండ్రిని. ఒప్పుకోలేదు రామనాధం.

ఈ ఊరిని విడిచి ఎలా? ఆలోచిస్తూ నడుస్తున్నాడు ఇంటికి. ఈ స్కూలు, ఊరు తను కేవలం పని చేస్తూ, ఉంటున్న స్థలాలు కావు. తన ఉనికి. అదే తనని నడిపిస్తోంది. ఒంటరిగా ఉన్నా, అది తన నీడలా ఉంటుంది. కొన్నిసార్లు ముందుకి తోస్తుంది, ధైర్యం చెప్తుంది, దారిని చెప్తుంది. జీవించే ఉన్నాననటానికి ఆ ఉనికి కావాలి. కొడుకు అడిగినా, ఆఫీసరు బెదిరించినా తను కదలడు, తన ఉనికిని వదులుకోడు. అతని కళ్లు ఎరుపెక్కాయి, పిడికిలి బిగిసింది. స్కూలుకి పూర్వవైభవం రావాలి. స్టూడెంట్స్ సంఖ్యనిపెంచితే, ఇలాంటి ఆఫీసర్లు కిక్కురుమనరు. కానీ ఎలా?

వెంటనే సుందరయ్య గుర్తుకు వచ్చాడు తనకి. సుందరయ్య వ్యాపారస్తుడు, ఊర్లో పండిన కూరగాయల్ని పట్నంలోని షాపులకి అమ్మటం చేస్తుంటాడు. ఊర్లో ఒక హోటల్ కూడా ఉంది. పొట్టిగా ఉంటాడు, బట్టతల. మాట కరుకు. నిక్కచ్చిగా ఉంటాడు. వయసులో ఐదేళ్ళు చిన్నవాడైనా రామనాధానికి మంచి మిత్రుడు. సామాజిక, రాజకీయ విషయాల మీద ఎప్పుడూ సుదీర్ఘంగా మాట్లాడుకూంటూ ఉంటారు ఇద్దరూ.

సాయంత్రం ఆరు తర్వాత ఆ ఊరి దేవుడైన వేణుగోపాలస్వామి గుడిలో దైవ దర్శనం చేసుకొని పక్కనే ఉన్న చిన్న మండపంలో కూర్చొని మాట్లాడుకునేవారు. అక్కడికి వచ్చే ఇతరులు కూడా ఆసక్తిగా చుట్టూ చేరి వింటూ ఉండేవారు. తర్వాత్తర్వాత అదే టైంలో టీవీలు ప్రైమ్‌టైమ్ షోలతో హోరెత్తించడంతో జనాలు పల్చబడ్డారు. మనిషి విచిత్రమైన జీవి. అన్నీ జయించి టీవీకి బానిసయ్యాడు. ఒక సీరియల్ చూసి ఏడుస్తాడు, వెంటనే వచ్చే వార్తలలో లోకం పాడైపోతోందని బాధపడ్తాడు, తర్వాతి కామెడీ షో చూసి పగలబడి నవ్వి అంతా బానే ఉందని భ్రమపడి ముసుగుతన్ని నిద్రపోతాడు. మర్నాడు షరా మామూలే. ఎంటర్ టైన్మెంట్ కావాలి. తనని తాను మర్చిపోవాలి. దానికీ తాగుడికీ పెద్ద తేడా ఏమీ లేదు. రెండూ కష్టాలు తీర్చేవే – ఆ రోజుకి.

జనాలు తగ్గినా ఇంకా కొంతమంది దేవుడి మీద భక్తితో రోజూ గుడికి వస్తూ ఉండేవారు కానీ అక్కడ వినేవారికంటే, మాట్లాడాలనుకునేవాళ్లు ఎక్కువయ్యారు. 24 గంటలూ టీవీ చూస్తున్నవాళ్లకి కొత్తగా ఏంచెప్పాలి? నాకే అన్నీ తెలుసు పక్క వాడికి తెలీదు అనే తత్వం. ఇలా కాదని సుందరయ్య రామనాథానికి తెలిసిన రామాయణ మహాభారతాలు ఏమన్నా చెప్పమని సలహా ఇచ్చాడు. ఆలోచన నచ్చి చిన్నప్పుడు చదువుకున్న రామాయణం మళ్లీ చదివి, గుడిలో చెప్పటం మొదలెట్టాడు రామనాథం. ప్రవచనకారులంత పాండిత్యం లేకపోయినా తనదైన శైలిలో చెప్పే అతని రామాయణం వినటానికి రోజూ తప్పక ఇరవై ముప్పై మందిదాకా వస్తూంటారు. అతనికి అదొక సంతృప్తి. జనానికి ఏదో కొత్త విషయం తెలుసుకుంటున్నామని సంతోషం.

సుశీల పోయిన తర్వాత ఇంకాస్త దగ్గరయ్యాడు సుందరయ్య. కానీ ఎన్నడూ ఎక్కువ చనువు తీసుకోవడం కానీ, మాట తూలటం కానీ చెయ్యలేదు అతను. అంత గౌరవం. అతనికే కాదు ఊరంతా రామనాథమంటే గౌరవం, అభిమానం. అదే చనువుతో తెల్లవారుఝామునే గుడికి వెళుతూ సుందరయ్య ఇంటి ముందర ఆగి కేక వేసారు "ఒకసారి గుడికి రాగలవా, నీతో మాట్లాడాలి" అని. సాయంత్రం దాకా కూడా ఆగలేని విషయం అంటే ఏదో అర్జెంటే అయ్యి ఉంటుంది అని చొక్కా వేస్కోని కదిలాడు సుందరయ్య.

దారంతా వడిగా, మౌనంగా నడిచారు ఇద్దరూ. దైవదర్శనం అయ్యాక కొంచెం మనస్సు నెమ్మదించటంతో నిన్న స్కూల్లో జరిగిన విషయమంతా చెప్పాడు రామనాథం.

"ఇది జనవరి. నాలుగు నెలల్లో స్కూలుకి సెలవలు. మళ్లీ జులై, ఆగస్టుల్లో అధికారులు వచ్చి చూసేటప్పటికి పిల్లల సంఖ్య తక్కువ ఉంటే, స్కూలు మూతపడుతుంది" అన్నాడు. సుందరయ్య తన కళ్ళలోకి చూసాడు.

ఎర్రగా వున్నాయి. నిద్ర పోలేదని తెలుస్తోంది. లేదు నిద్ర పట్టలేదు. మాటల్లో హృదయాన్ని తొలిచేస్తున్న బాధ వినపడుతోంది. మాష్టారికి స్కూలే ప్రపంచం అని అతనికి బాగా తెలుసు. ఎప్పుడూ దానినెలా బాగుచెయ్యాలి అన్న ఆలోచనలే. భార్య పోయాక మరీ ఎక్కువయ్యాయి. విషయం అర్థమైంది తనకి. "పోయిన ఏటినుంచి వర్షాలు బాగా పెరగడంతో, ఒక పంట పెంచారు ఊర్లో రైతులు. పనులు పెరగటం, కూలీలు దొరక్కపోవటంతో సొంత పిల్లల్నే పొలం పనులకి తీస్కెల్తున్నట్టున్నారు." తన అభిప్రాయం చెప్పాడు.

"కానీ పిల్లలు చదువులు నష్టపోతున్నారని అందరికీ తెలుసు కదా"

"అవును మాష్టారూ, ఎప్పుడో ఏదో ఇస్తుందని, ఇస్తుందో లేదో తెలీని చదువు కంటే ఇప్పుడు కడుపు నింపే పొలాన్ని నమ్ముకుంటున్నారు రైతులు" ఇష్టం వుండదని తెలిసినా చెప్పాడు సుందరయ్య. మాటని దాచుకొనే తత్వం కాదు అతనిది.

"అన్నీ తెలిసి ఏంటి సుందరయ్యా నువ్వు కూడా" అన్నాడు రామనాథం మందలింపు స్వరంతో.

"ఇది నా అభిప్రాయం కాదు రైతులది. అదే మీరు మార్చాలి. ఒక ఆలోచన – కోతలు దగ్గర పడుతున్నాయి. ధాన్యం తూకాలకి దాదాపు అందరూ వస్తారు. మీరు అప్పుడు వాళ్లని కూర్చోపెట్టి చెప్తే ప్రయోజనం ఉండచ్చు. నేను కూడా సహాయంగా వస్తాను" అన్నాడు సుందరయ్య. అద్భుతం. సమస్యకి పరిష్కారాలెన్నో కానీ సమయానికి పనికొచ్చేసలహా చెప్పే వాళ్ళు అరుదు. సంతోషంగా తూకాలరోజు వెళ్దామని నిశ్చయించుకున్నారు.

ఆ రోజు రానే వచ్చింది. పొద్దున్నే వెళ్తే అక్కడ రైతులు తమ పనులతో తీరిక లేకుండా ఉంటారు కాబట్టి ఇద్దరూ మధ్యాహ్నం దాటాక బయల్దేరారు. అక్కడికి చేరాక సుందరయ్య తనకు తెలిసిన రైతులతో విషయం చెప్పి వీలైనంత మందిని పిలవమన్నాడు. రామనాథం కొంచెం ఎత్తుగా ఉన్న బస్తాలమీద నిలబడ్డాడు. అక్కడున్న వ్యాపారులు మాస్టారుని అక్కడ చూసి ఆశ్చర్యపోయినా నమస్కరించి తమ పని చేసుకోసాగారు. వెళ్ళిన రైతులు ఇంకో పదిమందిని వెంటపెట్టుకొచ్చారు. "చాలా మంది ఇంకా పనుంది రావటానికి కుదరదన్నారయ్యా" చెప్పాడొక సన్నకారు రైతు. మొత్తం ఇరవై మందే. నిరాశ పడ్డాడు తను. ఇది సరిపోదు. సుందరయ్య మాస్టారి మొహాన్ని చూసాడు. "పర్లేదు, మొదలెట్టండి" అని సైగ చేసాడు.

"మీరందరూ వచ్చినందుకు చాలా సంతోషం. మీలో చాలా మంది పిల్లల్ని బడికి పంపించట్లేదు. చదువంటే రాయికి సానపెట్టినట్లు జాగ్రత్తగా, మెల్లగా జరుగుతుంది. సమయం పడుతుంది కానీ దానివల్ల రత్నాలు బైటపడతాయి. వాళ్ళతో పొలం పనులు చేయిస్తే తాత్కాలిక లాభం ఉండచ్చుగాక కానీ అది వాళ్ళ భవిష్యత్తుని

దెబ్బతీస్తుంది. దయచేసి అందరూ పిల్లల్ని మనస్కూలుకి పంపండి" అని చెప్పి ఆగాడు రామనాథం. మెచ్చుకుంటున్నట్లు చూసాడు సుందరయ్య కళ్ళతో. చాలామంది "అవును" అన్నట్లు తలూపుతున్నారు. మళ్ళీ ఏదో చెప్పబోయేసరికి, వెనకనుంచి ఆడగొంతు "మీ పిల్లోడి బవిస్యత్తే మీరు సక్క దిద్దలేక పొయ్యారు, మా పిల్లల్నేం బాగు సేత్తారయ్యా". రామనాథం గుండె ముక్కలైంది. కళ్ళు చెమ్మగిల్లాయి. ఉలిక్కిపడి చూసాడు సుందరయ్య. ఆ మాటన్నది రమణమ్మ. అందరూ తిట్టారు అంతమాటన్నందుకు. "నిజం సెప్తే నిష్టూరం ఈడ" అని ఈసడించుకుంటూ బైటికెళ్ళిపోయింది తను. తనతో పాటు మరో పదిమంది వెళ్ళారు. తనొక చిన్నపాటి రైతుకూలీ నాయకురాలు. ఒక పది పదిహేను మందికి పనులిప్పిస్తూ, సాయం చేస్తూ ఉంటుంది. మాట దురుసు చాలా ఎక్కువ. ఎదుటివాడు ఎవరు అని పట్టించుకోదు. మొగుడు తాగి సంసారాన్ని నాశనం చేస్తుంటే, తనే పొలంలో కష్టపడి ఈ స్థాయికి వచ్చింది. కడుపు నిండిన వాళ్ళు చెప్పే విషయాలంటే ఒళ్ళు మంట.

రామనాథం ఇంక అక్కడ ఉండలేక పోయాడు. అందరికీ నమస్కరించి, తొందరగా అడుగులేస్కుంటూ ఊరివైపు బయల్దేరాడు. కళ్ళనీళ్ళు బైటికి రాకుండా పంచె తో తుడుచుకున్నాడు. సుందరయ్య అనుసరించలేదు. మాస్టారికి ఒంటరితనం అవసరం అనుకున్నాడు.

ఆలోచనల్లో మునిగాడు రామనాథం. పెద్దబ్బాయి సుధాకర్. తను కన గలిగాడు కానీ తలరాత రాయలేడు. ఇంటర్మీడియెట్ లో కాలేజీ ఫస్ట్ వచ్చిన కొడుకుని చూసి పొంగిపొయ్యారు దంపతులిద్దరూ. డిగ్రీకీ వెళ్ళాక సంవత్సరంలో ఒక్కసారి వచ్చేవాడు. అప్పుడు కూడా ఏవో పుస్తకాలు చదువు తూ, రాసుకుంటూ ఉండేవాడు. చదువులో బిజీగా వున్నాడని భావించేవారు భార్యాభర్తలిద్దరూ. చివరి సంవత్సరం ఇంటికి రాలేదు. ఒకరోజు ఫోన్ చేసాడు "నాన్నగారూ, ఈ కుళ్ళిన, దోపిడీవ్యవస్థ మీద నాకు అసహ్యం వేస్తోంది". తెలిసిన పదాలే అయినా తన కొడుకు నోటినుంచి వస్తుంటే కొత్తగా అనిపించాయి. "సరే రా ఏంచేద్దామనుకుంటున్నావ్?" సూటి ప్రశ్న. "యుద్ధం చేస్తాను. ఇక్కడ ఒక అన్న మార్గం చూపాడు. గెరిల్లా దళంలో చేరుతున్నా. కొడుకుగా మీరనుకున్నట్లు అన్నీ దిగమింగి ఈ సమాజంలో బతకలేను. నన్ను క్షమించండి. నా గురించి వెతకకండి. అమ్మకీ, తమ్ముడికీ నా వీడ్కోలు చెప్పండి". అవతలనుంచి లైన్ పెట్టేసిన శబ్దం. ఫోన్ రిసీవర్ బరువుగా అనిపించింది. ఏం జరిగిందో అర్థం కాలేదు, విన్నది తన కొడుకు మాటలేనా? అటూ ఇటూ చూసాడు. అది కల కాదు. మెల్లగా అక్కడున్న మంచంమీద కూలబడ్డాడు. తేరుకొని, ఆలోచనలు రావటానికి ఒక గంట పట్టింది. "ఎందుకిలా జరిగింది?, తనేమన్నా తప్పుచేసాడా? పిల్లాడ్ని పట్టించుకోలేదా?, ఏంచెయ్యాలి?". పెద్దగా ఏడవాలనిపించింది, వల్ల కాలేదు. కంటినుండి ధారలు కారుతున్నాయి.

ఇది జరిగి ఏడేళ్ళు. మళ్ళీ మామూలు మనిషవ్వటానికి రెండేళ్ళు పట్టింది. ఈ విషయం భార్యకి చెప్పటానికి చాలా కష్టపడ్డాడు. తెలిసాక సుశీల గుండె పగిలింది. ఆ బాధతోనే చివరికి కన్నుమూసింది. ఆ రోజు పోలీసులు రకరకాల మారువేషాల్లో తిరిగారు ఊర్లో, సుధాకర్ వస్తాడేమోనని. అందరూ ఉగ్గబట్టుకోని చూసారు. చివరికి అతను రాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వర్తమానంలోకి వచ్చాడు. ఈ సమస్య, మాటలు తనూహించినవే కానీ నిజంగా అన్నప్పుడు కలిగే బాధని ఊహించలేదు. పోయిన వాళ్ళమీద కోపం ఉన్నవాళ్ళ మీద చూపిస్తుంది లోకం. అలా అని గతం తరుముతుంటే ఎప్పుడూ పారిపోతూ ఉండ లేదు. అది కూడా తన తప్పేమీ లేనప్పుడు. ఎదిరించాలి. తను ఇంతకు ముందు సిద్ధంగా లేదు. ఇప్పుడు కావాలి. ఇంట్లో తనను తాను బంధించుకున్నాడు. రమణమ్మ, కొడుకు, ఆ ఆఫీసర్, తన స్కూలు అన్నీ గిర్రున తిరుగుతున్నాయి ఆలోచనల్లో. చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు.

అదే సమయంలో సుందరయ్య తలుపు కొట్టాడు. లోపలికి వస్తూ "పాలవాడు రెండ్రోజులుగా తలుపు తెరవట్లేదని చెప్పాడు. మీరు ఆరోగ్యం నిర్లక్ష్యం చెయ్యటం మంచిది కాదు" అన్నాడు. ఇద్దరూ ఐదు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు. మౌనాన్ని చీలుస్తూ "సుందరయ్యా, నా చిన్న కొడుకుని కొన్నాళ్ళు సెలవ పెట్టి రమ్మంటాను. ఇంకొక మీటింగ్ పెట్టి ఊళ్ళో వాళ్ళని పిలుద్దాం. ఈ సారి గట్టిగా ప్రయత్నిద్దాం" అన్నాడు రామనాథం. కుర్చీలో అసహనంగా కదిలాడు సుందరయ్య. తనకి నమ్మకం కుదరట్లేదు. "మాస్టారూ, మొన్నటి లాంటి ప్రశ్నలు మళ్ళీ వస్తాయి. జనాల నోటికి అదుపు లేదు. మీ దగ్గర సమాధానాలు ఉంటేనే ముందుకు వెళ్దాం". ఆ ప్రశ్నకి తన దగ్గర సమాధానం లేదు. "ప్రాంతీయ పాఠశాలలో చదువుకున్న నా చినన్‌కొడుకు విజయాన్ని చూపిద్దాం, బైటి ప్రపంచం గురించి వాడు కూడా తెలిసింది చెప్తాడు. పెద్దకొడుకు మీద ప్రశ్నలకి ఏదోవిధంగా జవాబు చెబ్దాం". " ఈసారి ముందులా పారిపోను" అని ధ్వనించేటట్లు అన్నాడు రామనాథం. సుందరయ్య సహకారం అవసరం తనకి.

" సరే అలాగే. రిపబ్లిక్ డే ఆదివారం అయింది. ఆ రోజు మనగుళ్ళో స్వామివారికి పూజ జరుగుతుంది. చాలామంది వస్తారు. పూజ తర్వాత మీ ఉపన్యాసం, ఆ తర్వాత అన్నదానం ఏర్పాటు చేయిస్తాను. మీరు చెప్పింది వినేంత వరకు ఎవ్వరూ కదలరు" అన్నాడతను. చాలా ధైర్యం వచ్చింది రామనాథానికి. లౌక్యం తెలిసిన వాడు దగ్గర ఉంటే ఏదైనా సాధించచ్చు.

ఇంకా పది రోజులుంది రిపబ్లిక్ డేకి.

కుదుటపడ్డ మనసుతో తరువాతి రోజు పొద్దున్నే యథాతథంగా స్కూలుకి బయల్దేరాడు. అసలే రెండ్రోజులుగా వెళ్ళలేదు. ఎన్ని పనులాగాయో? చిన్న గ్రామం కాబట్టి ఎక్కువ నడకతోనే వెళ్తారు. అక్కడక్కడా సైకిళ్ళు, బైకులు. తన ఇంటి సందు తిరిగాడో లేదో ఇద్దరు పిల్లలు యునిఫామ్ వేస్కోని పరుగెడుతూ ఎదురొచ్చారు. అందులో ఒకడు "సార్ స్కూల్ లేదు సార్. తాళం వేసుంది. వీరిగాడున్నాడు" నవ్వుతూ చెప్పాడు. స్కూలు లేకపోతే ఆడుకోవచ్చని వాడి ఆశ. పిల్లలకి ఆనందాన్నిచ్చే చదువుని చెప్పే స్కూల్స్ కనపడవు. హడావిడిగా స్కూలుకి చేరాడు. వాళ్ళు చెప్పినట్టుగానే తలుపు తాళంవేసి ఉంది. వీర్రాజు బైటే వున్నాడు. కొంతమంది టీచర్స్ కూడా వున్నారు, కొందరు ఇళ్ళకి వెళ్ళిపొయ్యారు.

"వీర్రాజు ఏంటి ఇదంతా? మళ్ళీ అద్దె అందలేదా?" అడిగాడు కోపంగా.

వీర్రాజుకి తనంటే భయం. ఎందుకో తెలీదు. మంచి అంటే కొందరికి భయం. "అవునయ్యా, రెండ్రొజుల్నించీ తిరగతా ఉన్నాను. రేపూ మాపూ అని తిప్పించుకుంటున్నారే గానీ సర్దలేదండీ" తాగిన మైకం ఇంకా దిగలేదనుకుంటా, తడబడుతూ చెప్పాడు.

"నా మాట విను. ఐదు రోజుల్లో నీఅద్దె ఇస్తాను. ఇలా స్కూలు మొయ్యటం తప్పు. పిల్లలు ఇబ్బంది పడతారు"

వాడు తలగోక్కుంటూ "అయ్యా మీరంటన్నారు కాబట్టి తీస్తానండి. కానీ ఆదివారం లోగా వచ్చేలా సూడండి" అంటూ తాళం తీసి గొణుగుతూ వెళ్ళిపొయ్యాడు.

వీర్రాజు ఆ గ్రామంలో మోతుబరి రైతు. బాగా సంపాదించాడు. పాత మునసబు కాలంచెయ్యగానే అతని భార్య రత్నమ్మ ఆస్తుల్ని కాపాడుకొవటనికి ఒక మగ దిక్కుకోసం చూసింది. వీర్రాజుని దగ్గర పెట్టుకుంది. కొన్నాళ్ళకి పెళ్ళిచేస్కున్నారని అంటారు. ఎవరికీ తెలీదు సరిగ్గా. ఆమె అన్ని వ్యవహారాలూ వీడికి అప్పగించి అంతఃపురంలో ఉంటుంది. అక్కడ్నించి వీరిగాడు వీర్రాజు అయ్యాడు. గౌరవం పెరిగింది. మునసబు చాలా ఆస్తులు సంపాదించాడు ఊళ్ళో. మేడలూ, పొలాలూ, రైసుమిల్లూ. గుళ్ళో ధర్మకరతగూడా. అవన్నీ ఇప్పుడు వీర్రాజు అనుభవిస్తున్నాడు. రాత్రంతా తాగుతాడు. పొద్దున్నే ఊరిమీద బడి వసూళ్ళు, గొడవలూ చేస్తుంటాడు. జనాలు భరించడం తప్ప ఏమీ చెయ్యలేరు. స్కూలు బిల్డింగ్ కూడా అతనికిందే ఉంది.

స్కూలు లోపలికి వెళ్ళి క్లాసులు మొదలెట్టాక ఫోన్ చేసాడు మండలాఫీసుకి రామనాధం. ఈ నెలకూడా ఫండ్స్ లేట్ అవుతాయి అని వాళ్ళ సమాధానం. ఇక్కడి కష్టాలు వాళ్ళు ఎప్పుడు పట్టించుకున్నారు కనక. నిట్టూర్చి చేసెదేమీ లేక లంచ్ టైంలో స్టాఫ్ రూమ్‌కెళ్ళి అదే చెప్పాడు. అందరూ ఆలోచించారు. అందరూ చినన్‌ఉద్యోగులే, చిన్నజీతాలే. తమ జేబుల్లోంచి సర్దలేమన్న నిస్సహాయత. కొడుకు ఇంజినీరింగ్ లోన్ ఇంకా కడ్తున్నాడు రామనాధం. వాడికి చెప్పలేదు బాధపడతాడని. తనదగ్గర బొటాబోటీగా సరిపోతుంటాయి. "ఎలా తేవాలి?" సుందరయ్యని అడగచ్చు. కానీ అభిమానం అడ్డొచ్చింది. పైపెచ్చు ఇలాంటి సహాయాలు తనెంతో చేసాడూ స్కూలుకి ఇదివరకు. వేరే మార్గం చూడాలి. "మీరేమనుకోనంటే ఒక ఐడియా సార్" చెప్పాడు రాయడు. దగ్గరలోనే ఉన్న ఇంకో గ్రామం నుంచి వచ్చాడు. బాగా చదువుకుని హైస్కూలు టీచర్ అయ్యాడు. తల వూపాడు చెప్పమన్నట్టు. "మిరపపంట ఈ ఏడు బాగా పండింది. చేతులు చాలా కావాలి సహాయానికి, మనం చెయ్యగలిగితే.." అంటూ ఆపేశాడు. అందరూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు. "టీచర్ ఉద్యోగం చేస్తూ, పొలాల్లో పనిచెయ్యటం ఎంటి?, ఒకసారైతే పర్లేదు ఇలా ఎప్పుడూ చెయ్యాలంటే?, గవర్నమెంట్ బాధ్యతారాహిత్యానికి మనం బలి కావాలా?" రకరకాల ప్రశ్నలు అడిగారు. వేటికీ సమాధానం లేదు తనదగ్గర. ఒకటే మాట – "స్కూలుని కాపాడాలంటే ఇంతకన్నా మార్గం లేదు ఇప్పుడు. నేను తర్వాత అధికారులతో మాట్లాడతాను. ఇప్పుడు నాకు మీ సహకారం కావాలి. ఆడవాళ్ళని ఇబ్బంది పెట్టను. మీ ఇష్టం. రాయడూ, ఆదివారం రాగలం అని చెప్పు"

తర్వాత రోజు ఊరంతా పాకింది ఈవిషయం. కొంతమంది కూలీలు స్కూలుకివచ్చి మేముకూడా వస్తామని భరోసా ఇచ్చారు. 9, 10 తరగతి పిల్లలు కొంతమంది "మా స్కూలు గురించి మేమూ ఎంతో చేస్తాం" అన్నారు. ఎవరినీ నిరాకరించలేదు. ఇదంతా విద్యకోసమే, సరస్వతీ పూజే అని భావించాడు. ఆదివారం వచ్చింది. అందరూ వచ్చారు. రైతుకూలీలు ముందుండి ఎలా చెయ్యాలో చెప్పారు, సాయంత్రానికి మిరపసాగు బళ్ళకెత్తారు. అందరి మొహాలూ ఎర్రగా కందాయి. చెమటలు, ఆనందం.

అక్కడే పనిచేస్తున్న రమణమ్మకి ఈ విషయం తెలిసి పరుగున తన జనాలతో వచ్చింది. మాస్టారిని చూసి కన్నీళ్ళు పెట్టుకుంది. ముందు నానామాటలూ అన్నందుకు తనను తన్ను తిట్టుకుంది. దేవుడు మాపొలాలకి వచ్చాడంది. నవ్వాడు రామనాధం. గుండెల్లో భారం తగ్గింది. డబ్బులిచ్చి వీర్రాజు గొడవ వదిలించారు.

రిపబ్లిక్ డే వచ్చింది. దేవుడికి పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. రామనాధం, సుందరయ్య, రమేష్ లు మండపంలో వున్నారు. చాలామంది చిన్న, పెద్ద రైతులు, కూలీలు, వ్యాపారులూ వచ్చారు. రామనాధం అందరికీ నమస్కరించాడు. చదువుకు ఉన్న ప్రాముఖ్యం వివరించాడు. దూరదృష్టితోచూస్తే చదువువల్లే ఎక్కువ లాభముందన్నాడు వ్యాపారులని చూస్తూ. రమేష్ కూడా తన అనుభవం, విద్యావేత్తలు చేస్తున్న కొత్త ఆవిష్కరణల గురించి చెప్పాడు. సుందరయ్య పిల్లలని పనిలో పెట్టకుండా పొలంపనులు నడిపే మార్గాలు సూచించాడు. రమణమ్మ కూడా వచ్చింది. వెనకాలే వుంది. ప్రశన్లు వెయ్యలేదు. చివరికి పెద్దగా అరిచింది "మన పిల్లల కోసరం ఈ సార్లు కలలు కంటన్నారు. మనమేందండీ ఈడ నించోని ఆలోసిత్తన్నాం. ఆళ్ళు మన ఆస్తులడగట్లా, మన పిల్లలకీ బతుకులొద్దని సెప్తన్నారు", చెంప చెళ్ళుమంది అక్కడి వాళ్ళకి. "ఎవరి కోసం ఇదంతా? తమ పిల్లల కోసమే".

రామనాధాన్ని ఎవరూ అడగలేదు ఐనా చెప్పాడు "నా పెద్దకొడుకు సమాజవ్యతిరేక దారిలో నడుస్తున్నప్పుడు సరిఅయిన దారి చెప్పే మాస్టారెవరూ ముందుకు రాలేదు, మీ పిల్లల విషయంలో అలా జరగనివ్వను". అంతా చప్పట్లు. "పిల్లలు బడికి వస్తారు మాస్టారూ, మీ అంత గొప్పవాళ్ళని చెయ్యాలి" - ఎవరో అరిచారు.

# పుత్రోత్సాహము

జయంతి ప్రకాశశర్మ

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు, జనులా
పుత్రుని గనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ

రఘురామయ్యకి ఆ పద్యం ప్రతిరోజు జ్ఞాపకం వస్తుంది. వచ్చినప్పుడల్లా మనసు కకావికలం అయిపోతుంది. తనకీ జన్మలో ఆ ఉత్సహాం వచ్చే అదృష్టం లేదని గట్టిగా నిట్టూర్పు విడుస్తుంటాడు.

ఆ మధ్య వరకు, తాను ఎక్కడ కనబడినా చేతులెత్తి "మాష్టారు నమస్కారం!" అంటూ అభిమానంగా పలకరించే మనుషులు.. ఇప్పుడు మొహం చాటేసుకుని వెళ్ళిపోతున్నారు. కొంతమంది "ఏవిటి మాష్టారు, మీ అబ్బాయి అలా తయారయాడేమిటి!" అంటూ మొహం మీదే అడిగిస్తున్నారు. తన దగ్గర సమాధానం లేకపోవడంతో, తల దించుకోవలసిన పరిస్థితి వచ్చేసింది.

ఆ పరిస్థితికి కారణం తన కొడుకే!

"ఏది ఏమైనా మనకు తప్పదుగా! కన్నందుకు ఈ కష్టాల్ని కూడా అనుభవించాలి! ఆ పోలీసాఫీసరుగారు మీకు బాగా తెలుసుగా, ఓసారి వెళ్లి, ఆయన్ని కలిసి ఈసారికి సహాయం చేయమనండి! వసుదేవుడు వంటి వాడికే తప్పలేదు.. మనమెంతా!!" అంటూ భార్య శారద చెప్పే మాటలు తనకు కొత్తకావు. భార్య కన్నీటితో తడిసిన ఇలాంటి మాటలు వినడం రఘురామయ్యకి అలవాటై పోయింది. పోతే.. ఇటు వసుదేవుడుగా తన పాత్ర మారటం లేదు, అటు జీవరాసులే మారుతున్నాయి. అందులో సాధుజంతువుల నుంచి క్రూరమృగాల వరకు అన్ని జంతుజాలాలు ఉంటాయి. ఆత్మగౌరవాన్ని చంపుకుని ఆ జంతుజాలం ఎదుట నిలబడి 'సహాయం చేయమని' యాచించడం రఘురామయ్యకి అలవాటైపోయింది. చేతుల్ని లయబద్ధంగా ఆడిస్తూ, పాఠాలు చెప్పే రోజులు పోయి, చేతులు కట్టుకుని వాళ్లు చెప్పే పాఠాలు వినే రోజులు తనకి వచ్చేసాయి. గడిచిన పది రోజులు కొంచెం స్థిమితంగా ఉన్నారేమో.. తిరిగి సమస్య మళ్ళీ ఎదురైయింది.

రెండ్రోజుల్నుంచి కొడుకు ఇంటికి రావడం లేదు!

అలా జరగడం కొత్త కాదు. రోడ్డు మీద అమ్మాయిల్ని అల్లరి చేయటం, బారుల్లో చిత్తుగా తాగి కొట్టుకోవడం, రోడ్డు మీద అడ్డదిడ్డంగా మోటరు సైకిలు నడిపి పోలీసుల చేత దెబ్బలు తినడం... ఒకటేమిటి పుత్రరత్నం చేయని అకృత్యాలు లేవు.

రఘురామయ్య దంపతులకు ఏకైక సంతనమే ఆ పుత్ర రత్నం. ఉన్నదాంట్లో వాడ్ని అపురూపంగానే పెంచారు. పెద్దగా ఆర్థిక పరమైన ఇబ్బందులు లేకపోవడంతో, వాడికి డొనేషన్ కట్టి ఇంజనీరింగ్ చదివించారు. అప్పటికే వాడి నడవడిక అంత బాగా లేకపోయినా, ఒక్కగా ఒక్క కొడుకు కావడంతో 'అవే సర్దుకుంటాయిలే' అని సరిపెట్టుకుంటూ వచ్చారు. ఇంజనీరింగు నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి గాని, డిగ్రీ మాత్రం రాలేదు. చెడు సావాసాలు, వ్యసనాలు మూటకట్టుకుని కాలేజీ నుండి బయట పడేసరికే, చాలా ఎత్తుకు ఎదిగిపోయాడు. ఇంట్లో చిన్న చిన్న దొంగతనాల్నుంచి మొదలై, పేపర్లల్లో నేరాలు ఘోరాల పేజీలో వాడి పేరు చోటు చేసుకునే స్థాయికి వచ్చిసాడు.

ఇలా ఒకట్రెండు రోజులు కొడుకు ఇంటికి  రాకపోవడం అలవాటే. కాని వాడు చేసే ఆఘాయిత్యాలు తెలిసేవి. వెంటనే, ఏ  పెద్దవాళ్లనో కలిసి, ఆ గండం నుంచి బయటపడే మార్గాల అన్వేషణలో వుండేవారు రఘురామయ్య. 'ఎప్పటికైనా వాడిలో మార్పు వస్తుందని' ఆశగా ఎదురు చూడటం వారిరువురిని అలవాటై పోయింది.   వాడి వాలనన పుత్రోత్సాహము కలగటం లేదు సరి కదా, పుత్రుడంటే భయం పట్టుకుంది.

ఈసారి వాడేం చేసాడో  తెలియలేదు. కొడుకుని వెతకడానికి కూడా ఎటు వెళ్ళాలో తోచలేదు.

"వాడు ఇంటికి వచ్చి రెండ్రోజులయింది. ఏ అఘాయిత్యం చేసాడో.. ఓసారి.." తెల్లారి లేవకుండానే వినబడ్డ భార్య మాటలతో, ఒక్కుదుటన  బయటకి పరిగెత్తి, వాకిట్లో పడున్న పేపరు తీసుకుని, కంగారుగా లోపల పేజీల్లో వార్తలు చూడసాగాడు.

"మద్యం తాగి బైకు నడుపుతున్న యువకులకు  తీవ్ర గాయాలు..!"

"ఎటియమ్లొ దొంగతనం!"

"రెండు వర్గాల మధ్య పోట్లాట, ఒకరి మృతి!"

ఈ వార్తలతో పాటు మరో వార్త రఘురామయ్యకి కలవరం రేపింది.

ఆ ఊరి శివారు ప్రాంతంలో, ముందు రోజు రాత్రి ఒంటరిగా వెళ్తున్న ఓ అమ్మాయిని నలుగురు అబ్బాయిలు అపహరించి, అతి కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసారు. ఆ సంఘటన దేశంలో చాలా సంచలనం సృష్టించింది. ఆ హంతకుల్ని ఎన్‌కౌంటర్ చేయాలనే  డిమాండ్ల పరంపరంలతో, పేపరంతా అదే వార్త చోటుచేసుకుంది. వెంటనే టివి పెట్టాడు. ఏ చానల్ చూసినా ఆ వార్త కథనాలతోనే హోరెత్తిస్తున్నారు.

భార్యాభర్తలు ఆత్రుతగా చూస్తున్నారు. ఆ హంతకుల్లో కొడుకు పేరు వినబడుతుందేమో అనే ఆందోళన వారిలో ఎక్కువైంది. అప్పటికింకా ఆ హంతకులు దొరకలేదు! వారి కోసం రాష్ట్రం అంతటా పోలీసులు జల్లెడ వేసి వెతుకుతున్నారు. వారిని పట్టుకున్నా, కోర్టు వరకు కేసు వస్తుందనే నమ్మకం కనబడలేదు రఘురామయ్యకి.

ఆ ఆలోచన రాగానే.. ఏం చేయాలో పాలుపోలేదు.  ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది.  కచ్చితంగా ఎన్కౌంటర్ చేసేస్తారు.   ఎదురుగా భార్య కనబడేసరికి, దుఃఖాన్ని దిగమింగుకుని 'ఇప్పుడే వస్తానంటూ' బయటకి వచ్చిసాడు రఘురామయ్య.

కాని ఎవరి కాళ్లు పట్టుకోవాలి?  ఆ హంతకుల్లో తన కొడుకు ఉంటే..  వాడ్ని రక్షించమని ఎలా అడగ్గలడు?

ఎటు వెళ్లాలో, ఏం చెయ్యాలో తెలియటం లేదు!

టివిలో చూసిన ఆ సంఘటన కళ్ల ముందు మెదిలింది.  డమ్మీ వేషాలతో ఆ సంఘటనని ఉదయం నుంచి అలా చూపెడుతునే ఉన్నారు.  ఆ అమ్మాయిని ఎంత హింస పెట్టారో.. తలుచుకుంటేనే, గుండె తరుక్కుపోతుంది.   ఆ

దారుణకాండలో తన కొడుకు లేకపోతే, వాళ్లని ఎన్కౌంటర్ చేయ్యాలని తాను అందరిలా కోరుకునేవాడు. ఏమిటో 'తనదాకా వస్తే గాని తెలియదని..' అంటారు. తన పరిస్థితి అలాగే వుంది!

తనమీద ఎంత గౌరవం ఉన్న వ్యక్తైనా సరే, ఈ సంఘటనలో తన కొడుకుని రక్షించమని అడిగితే, అతడెం చేయగలడు! అసలు తాను ఎలా అడగ్గలడు? ఆలోచిస్తూ నడుస్తున్న రఘురామయ్యకి ఏం చెయ్యాలో పాలు పోవడం లేదు.

క్రిందటి నెలలో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

సాక్షాత్తు పోలీసాఫీసరు కూతుర్నే రోడ్డు మీద అల్లరి చేస్తూ, దొరికిపోయాడు. వీడితో పాటు మరో నలుగురు. ఆ వార్త బయటకు పొక్కలేదు గాని, వాళ్లని పోలీసు స్టేషన్లో పడిసారు. విషయం తెలియగానే రఘురామయ్యకి దిక్కుతోచక, స్థానిక ఎమ్.యల్.ఎ. ఇంటికి వెళ్లాడు. అతను తన దగ్గర చదువుకున్నవాడే.

"మాష్టారు దగ్గర సదువుకుని, ఇంతవాడ్ని అయ్యాను!" అని అతను అందరి ముందు తన గురించి మాట్లాడుతుంటే, రఘురామయ్యకి ఇబ్బందిగా ఉండేది. హైస్కూల్ స్థాయిలోనే చదువు మానేసి, ఏవో దాందాలు చేసి రాజకీయాల్లో స్థిరపడ్డాడతను. రాజకీయాలలో అందరికి ఉంటున్న పేరే అతనికీ ఉంది. రోజు వార్తల్లో ఉంటాడు. తాను చెప్పిన చదువుల వలననే అతను అలా ఎదిగాడా.. అని రఘురామయ్యకి గిల్టీగా ఉండేది.

"ఏం మాష్టారు.. మల్లా మీ అబ్బాయేం పిడతపని సేసాడా!" అంటూ నవ్వుతూనే పలకరించాడు.

ఆ పలకరింపుకు, అతని చూట్టూ ఉన్న మనుషుల్లో ఒక్కసారి నవ్వులు పులుమున్నాయి.

రఘురామయ్య మౌనంగా తలూపాడు. అవును తానిప్పుడు వసుదేవుడు అవతారంలో ఉన్నాడు. ఏం చేయలేడు!

"మాష్టారు.. నాలాంటాళ్లకి బుద్ది నేర్పారు గాని, స్వయానా ఆళ్ల అబ్బాయికి సెప్పలేక పోయారు! పెరటిసేట్టు మందుకు పనికి రాదుగా!" అంటూ ఆయన చూట్టూ ఉన్న వాళ్ల వైపు చూసాడు. వాళ్ళందరూ 'అవును కదూ' అన్నట్టు రఘురామయ్య వైపు చూసారు.

తాను అందరికి ఒకేలా పాఠాలు చెప్పేవాడు. అందులో తన కొడుకులాగే, ఈ ఎమ్.యల్.ఏ. లాగా తయారైన వాళ్లూ ఉన్నారు, నీతి నిజాయితలతో పెద్ద ఆఫీసర్లగా పేరు గడించిన వాళ్లూ ఉన్నారు. అయితే.. వాళ్ళని తోసి రాజంటూ, వాళ్లని చెప్పుచేతల్లో పెట్టుకుని, యావత్ ప్రజాస్వామ్య వ్యవస్థని శాసించే రాజ్యానికి, చక్రవర్తులుగా వీరు తయారయ్యారు!

ఆలోచనలతో రఘురామయ్య మాటలు వెతుక్కుంటూ "సార్.. మావాడి స్నేహితులు అమ్మాయిలని అల్లరి పెడుతున్నారని, మా వాడ్ని కూడా వాళ్లతో పాటు పోలీసు స్టేషనులో ఉంచిసారు సార్! వాడి ప్రమేయం ఏం లేదు సార్! ఈ ఒక్కసారికి కొంచెం వాడ్ని గట్టుమీద పడేయ్యండి సార్! మళ్ళీ వాడేం తప్పు చేయకుండా చూస్తాను సార్!" ప్రాదేయపడుతూ అడిగాడు.

"తోటకూరనాడు సెప్పనేదురా కొడకా.. అని కథలు మాకు సెప్పావు, కాని మీ అబ్బాయికి సెప్పనేదా మాష్టారు?" అంటూ వికృతంగా నవ్వాడు ఎమ్.యల్.ఎ.

తానేం మాట్లాడకుండా అలా శిలాప్రతిమలా నిలబడిపోయాడు.

"సూడండి మాష్టారు! క్రితం సారి రచ్చించినందుకే, పేపరోళ్లు నామీద నానా కూతలు రాసిసారు. మల్లా ఎలచ్చన్లల్లో నిలబడాలి కదా!" ఎం.యల్.ఏ. అన్నాడు.

"మా ఆవిడ బెంగ పెట్టుకొని, మంచం పట్టిసింది సార్. ఒక్కడే అబ్బాయి...!" అంతకంటే మాటలు రావాడం లేదు రఘురామయ్య!

అరగంట వరకు అలా అక్కడే నిలబడిపోయాడు.

చివరికి 'ఇదిగో మాష్టారు.. ఇదే ఆఖరి సారి! మళ్ళీ నా వద్దకు రావద్దు!' అంటూ వార్నింగు ఇచ్చి, పోలీసు స్టేషన్ కి ఫోన్ చేసి, ఆ కేసు నుంచి బయట పడిసాడు.

కాని ఈసారి .. అతని దగ్గరకి వెళ్లిన ప్రయోజనం ఉండదు. ఇంతకీ వాడు ఏంచేశాడో తెలియదు. ఆలోచిస్తూ, రఘురామయ్య నేరుగా పోలీసు స్టేషనుకి వెళ్లాడు. బయటంతా టివివాళ్లతో హడవిడిగా ఉంది. క్రితం రోజు జరిగిన అమ్మాయి అత్యాచారం, హత్య కేసులో నేరస్థుల్ని పట్టుకున్నారుట, ఆ విషయం చెప్పడానికి పత్రికా ప్రతినిధులు సమావేశం ఉందిట. అదే ఆ హడవిడి. ఆ జనంలో ఓ పక్కన నిలబడ్డాడు రఘురామయ్య. ఆ నేరస్థుల్ని వెనక నించో పెట్టి, కమీషనర్ గారు కాస్సేపు కేసు వివరాలు మాట్లాడారు. ఆ నలుగురు మోహాలు మాస్కుతో కప్పబడి ఉన్నాయి. రఘురామయ్య వాళ్ళందరిని పరీక్షించి చూసాడు. గుండె ఒక్కసారి ఆగి, కొట్టుకోవడం జరిగింది. ఆ నలుగురిలో తన కొడుకు లేడు. గుండె నిండా ఊపిరి పీల్చుకుని, అక్కడ్నుంచి బయటపడ్డాడు రఘురామయ్య. ఆ క్షణమే సెల్‌ఫోన్ మ్రోగింది. అత్రుతగా ఆన్ చేసాడు.

"సార్.. అదిత్య మీ అబ్బాయేనా?"

"అవును...!"

"మీ అబ్బాయికి యాక్సిడెంట్ అయింది. సీరియస్‌గా ఉంది, మీరు అర్జంటుగా మా ఆసుపత్రికి రండి!" అంటూ అడ్రసు చెప్పి ఫోన్ పెట్టిసాడు అవతల వ్యక్తి.

రఘురామయ్య ఒక్కసారిగా షాక్ గురయ్యాడు. గబగబా అక్కడుంచి ఆటోలో అసుపత్రికి బయలుదేరాడు.

"రాత్రి మోటరు సైకిలు యాక్సిడెంట్ జరిగి, ఇద్దరికి చాలా పెద్ద దెబ్బలు తగిలాయి. తెల్లారయేవరకు ఎవరు చూసినట్టు లేదు. ఓ గంటముందే పోలీసులు వచ్చి జాయిన్ చేసారు. చాల సీరియస్ గా ఉంది. నో హొప్!" అంటూ అక్కడ డాక్టర్లు ఉన్న విషయం రఘురామయ్యకి చెప్పిసారు.

ఆ మాటలు వింటూనే, రఘురామయ్య అక్కడే కూర్చిలో కూలబడిపోయాడు. దుఃఖం ముంచుకోచ్చింది. చుట్టుపక్కల వాళ్ళు కొంచెం మంచినీళ్లు ఇచ్చి, ధైర్యం చెపుతున్నారు.

తనంత దురదృష్టవంతుడు ఎవడు ఉండడు! ఉన్న ఒక్క కొడుకు అర్ధాంతరంగా ఇలా అయిపోయాడు! పరిపరి విధాల ఆలోచనలతో రఘురామయ్య ఏం చెయ్యాలో తోచటం లేదు. భార్యకి ఈ విషయం చెప్పాలి. ఎలాచెప్పాలి? చెపితే తట్టుకోగలదా? తన మెదడే గడ్డ కట్టుకుపోయింది. వడి వడిగా అడుగులు వేసుకుంటూ ఐసి రూమ్ దగ్గరికి వెళ్లి, అద్దాల్లోంచి లోనికి చూసాడు. ఆదిత్య తలాంతా కట్టుతో ఉంది. వెంటిలేటర్ అమర్చి ఉంది. అచేతనంగా మంచం మీద పడుకున్న కొడుకుని చూడలేక బయటకొచ్చిసాడు. బయట హాల్లో కుర్చీలో కూర్చున్నాడేగాని, దుఃఖంతో బతుకంతా అంధకారంగా కనిపించింది. పావుగంట గడిచింది. ఇప్పుడు ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. ఇంటికి వెళ్ళి, ముందు తన భార్యకి మెల్లగా విషయం చెప్పాలి. తర్వాత జరగవలసిన కార్యక్రమం గురించి ఆలోచించాలి.

"సార్.. మిమ్మల్ని డాక్టరుగారు పిలుస్తున్నారు!" అంటూ పిలుపు విని, అక్కడే ఉన్న డాక్టర్ రూములోకి వెళ్లాడు. అక్కడ ముగ్గురు డాక్టర్లు కూర్చుని ఉన్నారు.

"సారీ అండి. మా ప్రయత్నాలన్ని మేం చేసాం. ఆయనకి తలమీద బలంగా దెబ్బ తగిలింది. కాని ప్రాణాలను కాపాడలేక పోయాం. హీ ఇజ్ బ్రెయిన్ డెడ్! వెంటిలేటర్ మీద మిగతా ఆర్గాన్స్ ని నడుపుతున్నాం! మీరు ధైర్యం ఉండండి..!" అంటూ ఓ డాక్టరుగారు విషయాలు చెప్పాడు

వాళ్ల మాటలు వింటున్న రఘురామయ్యకి నోటంట మాట రావడం లేదు. సున్యంలోకి చూస్తున్న, రఘురామయ్యకి ఎదురుగా గోడమీద ఉన్న పోస్టరు కనబడింది.

"ఓ నలుగురు ప్రాణాలు నిలబట్టెండి..! మీ ఆప్తులను వారిలో చూసుకొండి!!"

ఒక్కసారిగా తేరుకుని, నిర్ణయం తీసుకోవడంలో రఘురామయ్య ఆలస్యం చేయలేదు.

"డాక్టరుగారు.. ఇప్పుడు మీరూ, నేను చేయడానికి ఏం మిగల్లేదు. మా తలరాత అలా ఉంది. ఏం చేయలేం. అయితే ..!" ఒక్కసారిగా దుఃఖం ఉబికి వచ్చి మాట్లాడ లేకపోయాడు. రెండు నిమిషాలు పోయాక దుఃఖాన్ని దిగమింగుకుని, తన ఆలోచనని వారికి చెప్పాడు. ఒక్కసారిగా ఆశ్చర్యపోయిన డాక్టర్లు, చేయవలసిన ఫార్మాలిటీస్ ప్రకారం కాగితాలమీద రఘురామయ్య సంతకాలు తీసుకుని.. "మీరు ఇంటికి వెళ్లండి మాష్టారు. మిగతా పనులన్నీ

జరగడానికి టైము పడుతుంది! అవి అవగానే మా అంబులెన్స్ లోనే బాడిని మీ ఇంటికి పంపుతాం!" అంటూ ఆసుపత్రి కారులో రఘురామయ్యని ఇంటికి పంపిసారు.

ఇంటికి వెళ్ళి, భార్యకి మెల్లగా అసలు విషయం చెప్పాడు. ఉప్పెనలా వచ్చే ఆమె దుఃఖన్ని ఓదార్చడానికి ప్రయత్నం చేస్తున్నాడు. అప్పటికి విషయం తెలిసిన, చుట్టు పక్కల వాళ్ళు అక్కడకి చేరి, రఘురామయ్యకి సానుభూతి తెలుపుతున్నారు.

అంతలో.. టివి కెమెరాలు పట్టుకుని విలేఖర్లు ఇంట్లోకి వచ్చారు. ఒక్కసారిగా ఆ ఇల్లు జనంతో నిండిపోయింది. అందరు రఘురామయ్య చూట్టూ చేరారు. ఆ జనంలోంచి ఒకామె రఘురామయ్య కాళ్లమీద పడి.."మీరు పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా, నా భర్త ప్రాణాలు కాపాడారు. మీకు ఏఁవిచ్చి ఋణం తీర్చుకోగలం చెప్పండి! మీ అబ్బాయి మా ఇంటికి వెలుగును ప్రసాదించాడు!" అని అంటూంటే, రఘురామయ్యకి వాళ్లందరు అక్కడికి ఎందుకొచ్చారో అర్ధమయింది!

"విధివశాత్తు ఎదిగొచ్చిన కొడుకుని కోల్పోయిన రఘురామయ్య గారు , కొడుకు అవయవాల్ని దానం చేసి, ఈ రోజు నలుగురికి తిరిగి జీవితాలను ప్రసాదించారు. ఇదో అపూర్వమైన విషయమని, పలువురు రఘురామయ్యగారి నిర్ణయాన్ని మనసారా అభినందిస్తూన్నారు. మరణించిన తర్వాత కూడా ఓ నలుగురికి ప్రాణదానం చేసి అదిత్య చరితార్ధుడు అయ్యాడు. అలాంటి కొడుకుని కన్న తల్లితండ్రులను మనం కలవబోతున్నాం.." అంటూ టివి యాంకర్లు కెమెరాల ముందు మాట్లాడుతున్నారు.

ఆ మాటలు వింటున్న రఘురామయ్యకి పుత్రోత్సాహం పద్యం గుర్తుకు వచ్చింది. ఇప్పుడు అతనికి దుఃఖం రాలేదు.... ఉబికి వచ్చిన కన్నీరు ఆనందబాష్పాలై ఉరకలేస్తూ పెదవులపై మీదకు పొరిగాయి!!

## వాళ్ళిద్దరికీ మధ్య

సూర్యకుమారి ఉపాధ్యాయుల

" వచ్చేటప్పుడూ.. సికింద్రాబాదు స్టేషన్ లో తియ్య ద్రాక్షపళ్ళు, గింజలు లేనివి చూసి తీసుకురా ఒక రెండు కేజీలు." మూడోసారో నాలుగోసారో ఇది నాన్నగారు నాకు గుర్తు చేయటం.

"అలాగే, మీరు అటూ ఇటూ తిరిగి మరీ హైరానా పడిపోకండి. నేను వచ్చాక చూద్దాం ఆ భోజనాల కాంట్రాక్ట్ గురించి" నేనూ చెప్పిందే మళ్ళీ చెప్పాను.. ఎంతైనా ఆ తండ్రి కూతుర్ని కదా!

"సామాన్లు అక్కడ ఎవరో ఒకళ్ళు తీసిపెడతారులే. నువ్వు ఎత్తక ఆ బరువులు. మొద్దులా నిద్రపోక.. దిగిన వాళ్ళు చీకట్లో అదీ ఒకోసారి ఒకళ్ళ సామాన్లు ఒకళ్ళు తీసుకెళ్ళిపోతారు. ఓ కన్ను వేసి ఉంచు. మళ్ళీ ఓ పట్టాన రావు సామాన్లు తారుమారు గానీ అయ్యాయంటే" నాన్నగారి జాగర్తలు అలా చెపుతూనే ఉండేవారు. కానీ, డ్రైవరు వచ్చి సీట్లో కూర్చుని హార్న్ కొట్టడం తో, మరో సారి జాగర్తలు, వీడుకోలూ చెప్పి బస్సు ఎక్కాను.

నేను ఉండేది దుబాయిలో. ఇంకో వారం రోజుల్లో కాకినాడ లో మా చెల్లాయి గోదావరి సీమంతం. మా వారు సెలవ లేదంటే, అమ్మకి సాయం చేయటం కోసం, నా స్నేహితురాలి పెళ్ళికి కూడా వెళ్ళటానికని నేను ఒక్కదానినీ వచ్చాను. ప్రస్తుతం వెళ్తున్నది హైదరాబాదు లో నా స్నేహితురాలి పెళ్ళికి. పెళ్ళిళ్ళ సీజన్ కావటం తో హైదరాబాదు వెళ్ళటానికి రైల్వే రిజర్వేషన్ దొరకలేదు. చాలా రోజుల తరువాత హైదరాబాదు బస్ లో ప్రయాణం చేస్తున్నాను. దిగబెట్టడానికి నాన్నగారు బస్ స్టాప్ కి వచ్చినప్పటి సీన్ ఇది.

★ ★ ★

బస్ బయలుదేరింది. నాకయితే కిటికీ ప్రక్కన సీట్ ఇష్టం. కానీ దానిలో అప్పటికే ఎవరో ఒకాయన కూర్చుని ఉన్నారు. పోనీ రిక్వెస్ట్ చేద్దాం అంటే నిద్రపోతున్నట్టున్నారు.. మొఖం మీద "ఇండియా టుడే" పెట్టుకుని కదలకుండా ఉన్నారు.

"ఇంకా ఏడన్నా కాకుండా అప్పుడే నిద్రేమిటో!" అనుకున్నాను నా సీట్ ని కూడా వెనక్కి పెట్టుకొని రిలాక్స్ అవుతూ. రాజమండ్రీ వచ్చేసరికి నాక్కూడా తెలీకుండానే కన్ను మూత పడింది.

బస్ ఏదో పెద్ద గుంట లో పడటం తో నేనూ, నాతో పాటు నా ప్రక్క సీట్ లో అతనూ కూడా నిద్రల్లోంచి లేచి, అయోమయం గా ఒకళ్ళవైపు ఒకళ్ళం చూసుకున్నాము. మా ముందు సీట్ అతను లైట్ వేసి ఏదో చదువుకుంటుండటం తో ఆ వెలుగు లో నా ప్రక్క సీట్ అతన్ని గుర్తు పట్టాను. తను.. మా ప్రక్కింటబ్బాయి శ్యామ్యూల్!

"శాం!! బాగున్నావా? గుర్తుపట్టావా నన్ను? నేను.. మంజు.. అదే, మంజీర ని" పలకరించాను.

"బాగున్నావా.. బాగున్నారా? చూసాను ఇందాకా మీ నాన్నగారు వచ్చారు కదా స్టాండ్ కి" పరిచితమైన తళుక్కుమని మెరిసే కళ్ళతో, చిన్న పెదవి వంపుతో నవ్వుతూ అన్నాడు. బహుశా.. ఆ నవ్వు నాన్నగారు నాకు చెప్పిన జాగర్తలకేమో!

మరి నాన్నగారిని ఎందుకు పలకరించలేదు అని నేను అడగక్కర్లేదు. రెండు కుటుంబాల మధ్యా ఏవో గొడవలు! ప్రస్తుతం వాళ్ళు మా ఇంటి ప్రక్కన ఉండటం లేదు. ఇన్నీసుపేట దగ్గర ఇల్లు కట్టుకొని అక్కడకి వెళ్ళిపోయారు. మా ఇంటి దగ్గర ఉన్న ఆ ఇంటికి అద్దె కి ఇచ్చేసారు.

"సింహాచలం గారి ఆరోగ్యం ఎలా ఉంది?" యధాలాపం గా తన పాత పేరుతో అడిగాను. సింహాచలం అంటే, శాం వాళ్ళ అమ్మగారు. మా చిన్నప్పుడు మతం పుచ్చుకున్నప్పుడు "దైవదర్శనం" అని పేరు మార్చుకున్నారు. కానీ అమ్మ మాత్రం ఏదో పట్టుదల.. తను ఆమెని ఎప్పుడూ ఆవిడ పాత పేరు "సింహాచలం" అనే పిలిచేది. మాకూ అదే అలవాటు.

"అలానే ఉంది. ఇంట్లోనే ఉంటోంది. ఈ నెలాఖరుకి హోం కి వెళ్ళిపోతుంది" చెప్పాడు శాం ఒకింత బాధగా.

మౌనంగా కొంత సేపు ఉండిపోయాము ఇద్దరమూ. ఇద్దరం పాతికేళ్ళు ప్రక్క పక్క ఇళ్ళల్లో ఉన్నాము. ఎన్నో జ్ఞాపకాలు! కొన్ని తీయనివి, కొన్ని తలచుకుంటేనే కోపం తో ఒళ్ళంతా భగ భగమండేలా చేసేవి. శాం పేరు కూడా అసలుకి శ్యామశంకర్. దానిని శామ్యూల్ అని మార్చుకున్నాడు. చిన్నప్పుడు మాకు సైకిల్ తనే నేర్పించాడు. తనే చెప్పాడు..

"నేను పేరు మార్చుకుంటున్నాను. నా పేరు ఇకనుండీ శాం" అని.

అప్పుడు నాకు కూడా పేరు మార్చుకోవాలని ఎంతో అనిపించింది. ఇంట్లో అన్నట్టు కూడా గుర్తు.. "మనం కూడా మతం పుచ్చుకుందాము. ఇంచక్కా పేరు మార్చుకోవచ్చు!" అని.

దానికి నాన్నగారు మాకు మతం పుచ్చుకోవటం అంటే ఏమిటో చెప్పి, అది మనకి తప్పు అని చెప్పారు. కానీ మా చిన్ని బుర్రలకి శాం వాళ్ళు పుచ్చుకోగా లేని తప్పు మేము పుచ్చుకుంటే ఎందుకు అవుతుందో అర్థం కాలేదు. చిన్నప్పుడు మాకు

అర్థం కాని విషయాల్లో అదొకటి!

★ ★ ★

"నాకు చిన్నప్పుడు సైకిల్ నువ్వే నేర్పించావు. గుర్తుందా?" చిన్నప్పటి జ్ఞాపకాల నుండి బయటకి వస్తూ అన్నాను.

"గోదావరి కి కూడా నేనే నేర్పించాను" గుర్తు చేసాడు.

నిజమే, నా చెల్లెలు గోదావరి కి కూడా తనే సైకిల్ నడపటం నేర్పించాడు. అప్పుడే మొదటి సారి మాకూ వాళ్ళకీ చెడింది.

దానికి ఒక రకం గా కారణం నేనే..

★ ★ ★

నాతో నవ్వుతూ మాట్లాడే శాం కాలేజ్ లో నన్ను ఏడిపించే చేతన్ తో కలిసి తిరగటం నాకు మింగుడు పడలేదు. చేతన్, శాం ఒకే కాలేజ్. వాళ్ళు డిగ్రీ సెకండియర్, నేను వాళ్ళ కాలేజ్ కే అనుబంధం గా ఉన్న జూనియర్ కాలేజ్ లో ఇంటర్ ఫస్టియర్ లో ఉండేదాన్ని.

"ఎందుకలా చేస్తున్నావ్?" అని నిలదీయలేను. "అదేమిటీ? శాం కి తెలీదా వాడు నన్ను కాలేజ్ లో ఏడిపిస్తున్నాడని? అయినా వాడితో వీడికి స్నేహం ఏమిటీ?" అని తర్జన భర్జనలు పడేదాన్ని.

పుండు మీద కారం జల్లినట్టు వాడు వీళ్ళింటికి రావటం, నేను ఎప్పుడైనా ఆ సమయం లో బయట నుండి రావటం కానీ, బయటకి వెళ్ళటం కానీ జరిగినప్పుడు వాళ్ళు కానీ నవ్వుతున్నా, నాకు వినీ వినిపించనట్టు మాట్లాడుకుంటున్నా, ఏదో నన్ను చూసే నవ్వుకుంటున్నారేమో అని రగిలిపోయేదాన్ని.

కాళ్ళు వణుకు వచ్చేవి. ఆవేశం లో ఒళ్ళు తెలిసేది కాదు. ఇంట్లో ఇవన్నీ చెప్పలేను. కాలేజ్ లో ఎవడో వెంట పడి

ఏడిపిస్తున్నాడు అంటే "ఏమని ఏడిపిస్తున్నాడు?" అని వంద ప్రశ్నలు వేస్తారు. ఒకవేళ "నీదే ఏదో తప్పు ఉండి ఉంటుంది" అని అనేస్తే!?

అప్పటికి ఎనిమిదో క్లాసు లో ఉన్న గోదావరి పట్ల శాం అనుచితం గా ప్రవర్తిస్తున్నాడన్నట్టు మా అమ్మ కి అనుమానం వచ్చేలా చేసి, అమ్మ గోదావరి జోరు కి అడ్డుకట్ట వేసేట్టు చేసాను.

★ ★ ★

"గోదావరి కి డెలివరీ అయిందా? ఆ మధ్య ఏదో సినిమా కి వెళ్ళినప్పుడు వాళ్ళాయనతో కనపడింది" శాం ప్రశ్న తో ఈ లోకం లోకి వచ్చాను.

"లేదు. రేపు శుక్రవారం దానికి సీమంతం" చెప్పాను.

"ఏమిటో! అస్తమానూ ఏడుస్తూ ఉండేది. కేరమ్స్ ఆడుతుంటే, ఎవరికైనా రెడ్ పడితే, బోర్డు కలిపేసేది. అలాంటిది పెళ్ళయి, పిల్లలతో.. తలచుకుంటుంటే నవ్వు వస్తోంది" గోదావరి గురించి గుర్తు చేస్తుంటే, నాకూ ఒక్క క్షణం ఆ రోజులు గుర్తొచ్చి నవ్వు వచ్చింది.

"నువ్వు మాత్రం? అమ్మాయిల వెంట తిరిగేవాడివి. పెళ్ళి చేసుకున్నావంటే విచిత్రం కాదూ?!"

"నేనా? అమ్మాయిల వెనకాల తిరిగేవాడినా? ఎవరి వెనకాల తిరిగానూ?" దబాయించబోయాడు.

"రెడ్డమ్మ గారి మాటేమిటి? ప్రశ్నించాను.

"సునందినా? ఆవిడ మాటేమిటి?" ఏం తెలియనట్టు ప్రశ్నించాడు.

"చూడు మరి! మా ఇంట్లో అద్దెకి ఉన్నా, ఆవిడ పేరు కూడా నాకు జ్ఞాపకం లేదు. నేకెలా టక్కున నోటి చివరన ఉందో

ఆవిడ పేరు!" వెక్కిరించాను.

"మరి ఆవిడకీ, నాకూ లింక్ పెట్టారు కదా! ఎలా మర్చిపోతాను?"

ఆ లింకు పెట్టింది.. నేనేనా??

★ ★ ★

మా ఊర్లోని విమెన్స్ కాలేజ్ లో కంప్యూటర్స్ లేదని, రాజమండ్రీ కాలేజీ లో చేరాను. అక్కడ ఉండి, అబ్బాయిలు అమ్మాయిలకి లైన్ వెయ్యటం అంటే ఏమిటి? దాని కోసం వాళ్ళు చేసే పనులు ఏమిటి? ఇద్దరి మధ్యా ఏమన్నా ఉంటే, దానిని కనిపెట్టడం ఎలా? ఇలాంటి విషయాలు ఎన్నో తెలుసుకున్నాను.

సెలవలకి ఇంటికి వచ్చినప్పుడు ఎప్పటికప్పుడు ఎవరి జీవితాలు ఎలాగ మారాయి అనేది గమనిస్తూ ఉండేదాన్ని. ఆడపిల్లల కాలేజ్ లో చదవటం వలన అనుకుంటా ఇలాంటి విషయాల గురించి బోలెడంత అవగాహన ఉండేది. నా పరిజ్ఞానం అంతా ఇక్కడ వాళ్ళ మీద ఉపయోగించటానికి ప్రయత్నించేదాన్ని.

ఒక రోజు ఏదో సినిమాకి వెళ్ళాము నేనూ, గోదావరి. అక్కడ థియేటర్ లో ఇంటర్వెల్ అప్పుడు చూస్తే, నాలుగు వరుసల వెనకాల శాం, అతని స్నేహితులూ ఉన్నారు. వాళ్ళందరి చూపులూ ఉన్న వైపు చూస్తే ఎవరో కాలేజీ అమ్మాయిలు! చాలా పోష్ గా ఉన్నారు. ప్రపంచం లెక్కే లేనట్టు తుళ్ళిపోతున్నారు.

నా చూపులు ఉన్న దిక్కు చూసి, "మా కాలేజే. మా సీనియర్. వీడూ, వీడి గాంగ్ ఆ అమ్మాయి కోసం రోజూ కాలేజ్ చుట్టూ కుక్కల్లా ప్రదక్షిణాలు చేస్తుంటారు" నవ్వుతూ అంది గోదావరి.

"కుక్కలు ఎన్ని ప్రదక్షిణాలు చేసినా ప్రయోజనం ఏముంటుందే?!"

★ ★ ★

మాస్టర్స్ చేయటానికి నేను వైజాగ్ వెళ్ళాను. ఒక శెలవలకి ఇంటికి వచ్చేసరికి మా ఇంట్లో రెడ్డిగారి కుటుంబం అద్దెకి ఉండేవారు. వాళ్ళకి ఇద్దరు పిల్లలు. ఆవిడకి నగల పిచ్చి, చీరల పిచ్చి. ఉన్నట్టుండి ఈ మధ్య ఆవిడ కొత్తగా అన్నీ కొత్త చీరలు కట్టుకోవటం, కొత్త నగలు ప్రదర్శించటం చేస్తోంది అని మా అమ్మ, అమ్మలక్కల మాటల ద్వారా తెలిసింది. వాళ్ళకి ఎవరికీ ఆవిడకి ఈ సడన్ అదృష్టం ఎక్కడ నుండి వస్తోందో తెలీక కొట్టుకుంటున్నారు.

శాం అప్పటికి ఉద్యోగం చేస్తున్నాడు. ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ లో ఉద్యోగం. బానే సంపాదిస్తున్నాడు ఆదాయం తో పాటు పై ఆదాయం తోడుగా ఉంది అని విన్నాను.

నేను పైన బాల్కనీ మీద ఏదో పుస్తకం పట్టుకొని ఒక రోజు కూర్చుండగా, క్రింద వాళ్ళింట్లో స్నానానికి వెళ్తూ చిన్న తుండు గుడ్డ మొలకి కట్టుకున్న శాం కనపడ్డాడు.

మరి అతన్నే చూస్తున్నట్టున్నాను! నాకు అలా కళ్ళప్పగించి చూసే ఉద్దేశం లేకపోయినా, కొన్ని కొన్ని రెఫ్లెక్స్ లు చూడండి.. మనకి తెలీకుండా జరిగిపోతూ ఉంటాయి.

అలాంటి సమయం లో, ఒక్కసారి తలెత్తి నా వైపు చూసాడు శాం! దొరికిపోయిన దొంగ లా గబుక్కున కళ్ళు తిప్పుకున్నాను.

ఏదో అప్పట్లో పాప్యులర్ పాట ని ఈల వేయటం మొదలెట్టాడు శాం. ఒక నిమిషం తరువాత తలెత్తి ఎటువైపు ఉన్నాడో అని దొంగ చూపులు చూస్తే, వాళ్ళ దొడ్లో ఉన్నాడు.

వాళ్ళ ఇంటికీ, మా ఇంటికీ మధ్య చిన్న గోడ ఉండేది. మంచి పొడగరి అయిన శాం కి మా ఇంట్లో తంతులు గమనించటానికి ఆ చిట్టి గోడ ఒక అడ్డు కాదు. కానీ, నా దృష్టి ని ఆకర్షించినది ఇటు వైపు అరుగు మీద నుంచుని ఏవో సైగలు చేస్తున్న సునందిని!

ఆమె ఎవరికి సైగలు చేస్తోందో నాకు అర్థం కాకపోయినా, అటువైపు అర్థనగ్నం గా శరీర ప్రదర్శన పెట్టిన శాం ని చూసే

అని నిర్ధారణ కి వచ్చేసాను. ఈ లోగా నా కుర్చీ చేసిన చప్పుడు కి అనుకుంటా ఆవిడ తలెత్తి బాల్కనీ లో ఉన్న నన్ను చూసి నవ్వింది. శాం వాళ్ళ ఇంటి తరువాత మేడ మీద ఉన్న సీత గారితో "వంటయిందాండీ?" అంటూ కబుర్లు మొదలెట్టింది.

సీత గారు అసలు ఇటు వైపే చూడటం లేదు. అలాంటిది సునందిని పలకరించేసరికి ఎదురుగా నన్నూ, క్రింద అర్ధనగ్న సుందరాంగుడు శాం నీ, మా ఇంట్లో కింద ఉన్న సునందిని నీ చూసి, ఏదో ఆలోచిస్తున్నట్టు సాలోచన గా "లేదు, మా భాస్కర్ ని కూరలు తెమ్మని పంపించాను. ఎక్కడ ఆటల్లో పడ్డాడో! వెధవ కి ఇంకా ఇల్లు కనిపించలేదు" అని జవాబు ఇచ్చారు.

నేను బహుశా నా మీద ఎలాంటి ఆలోచనలూ రాకూడదు అని ఖంగారు లో అనుకుంటా ఆ రాత్రి భోజనాలు అయి, గోరింటాకు పెట్టుకుంటుండగా మా గోదావరి తో "సునందిని ఏమిటీ.. శాం గాడికి లైన్ వేస్తున్నట్టుందీ?" అని విషపు బీజం నాటాను.

నాటేసి, నేను నా శలవలు అవగానే వైజాగ్ వెళ్ళిపోయాను. కానీ, మళ్ళీ శలవలకి తిరిగి వచ్చేసరికి వాళ్ళ మధ్య సంబంధం ఖాయం చేసేసారు మా చుట్టుపక్క అమ్మలక్కలు. అది నిజమే అయి ఉంటుందని నేను కూడా నా గిల్టీ ఫీలింగ్ ని చంపేసాను.

★ ★ ★

"మరి సునందిని కీ.. నీకూ..?" మధ్యలో ఆగిపోయాను పూర్తి చేసే ధైర్యం లేక.

"ఎప్పుడు పుట్టిందో తెలీదు. మా అమ్మ కూడా అదే నిజం అనుకుంది. కానీ ఆవిడ దేవాలయం వీధికి తెగ వెళ్ళేవారు. నీకు తెలిసి ఉండదులే" అన్నాడు నవ్వుతూ.

"మీ ఆయన సంగతి ఏమిటీ? ఏం చేస్తుంటారు?" మాట మార్చాడు.

తరువాత ఇద్దరం ఎవరి కుటుంబ విషయాలు వాళ్ళు చెప్పుకున్నాము. అప్పట్లో మా చుట్టు ప్రక్కల ఉన్న వాళ్ళ గురించిన

విషయాలు మాట్లాడుకున్నాము. శాం కొత్తగా కడుతున్న ఇంటి గురించి చెప్పాడు. నేను దుబాయ్ లో నా జీవితం గురించి చెప్పాను. గెజిటెడ్ ఆఫీసర్ అయ్యాడట! బానే పైకొచ్చాడు! వాళ్ళ అమ్మగారు ఆ రోజుల్లో అందరికీ వాళ్ళు చౌదరీలమని చెప్పేవారు. కానీ మాకు తెలుసు వాళ్ళు చౌదరీలు కాదని. ఈ రకమైన అబద్ధాలంటే అసహ్యించుకునే అమ్మ దానితోనే వాళ్ళు అంటే కొంచెం తక్కువ భావం ఏర్పరుచుకుంది.

తరువాత ఏవో స్థలం గొడవలు వచ్చాయి. ఇద్దరి ఇంటి మధ్యా ఉన్న గోడ ఎత్తు పెంచుదామని నాన్నగారు ప్రయత్నిస్తే, వాళ్ళ ఇంటి వాస్తు కి అది మంచిది కాదు అని ఎవరో చెప్పారు అని శాం, వాళ్ళ ఇంట్లో అందరూ నాన్నగారితో పోట్లాట కి వచ్చారు. మన మతమే వద్దని వేరే మతం లోకి మారిన వాళ్ళకి మన మతం ప్రకారం ఏర్పరచిన వాస్తు మీద నమ్మకమా అని వెటకారాలు చేసారుట మా వాళ్ళు. ఆ సమయం లో నాన్నగారిని కొంచమైనా గౌరవం లేకుండా చాలా మాటలు అన్నారుట.

ఆ గొడవ తో ఇంక మళ్ళీ మా మధ్య మంచి సంబంధాలు ఏర్పడలేదు. ఎవరి జీవితాల్లో వాళ్ళు పడిపోయాము.

మాటలూ, ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్ర పోయానో తెలీదు. మధ్య లో మెళకువ వచ్చి చూస్తే, పక్కన శాం కూడా నిద్ర పోతున్నాడు. తననే పరిశీలించి చూస్తూ, అతనికి నేను ఏమన్నా సారీ చెప్పాలా? అని ఆలోచించాను. ఎవరికీ ఏమీ నష్టం కలగలేదు. కనుక నేను నోరు మూసుకొని వెళ్ళిపోవచ్చు. ఇవాళ బస్సు దిగితే, మళ్ళీ ఒకళ్ళ మొఖం ఒకళ్ళం చూసుకోకపోవచ్చు. కానీ అది నా పద్ధతి కాదు! ఏదన్నా పురుగు మనసు లో దూరింది అంటే, దాని అంతు చూస్తే కానీ అది తొలచటం ఆపదు!

హైదరాబాదు శివార్ల లో బస్సు ఉండగా అందరూ నిద్రలు లేచారు. బస్సు అస్తమానూ ఆగుతూ, ఆగినప్పుడల్లా జనాలు సామాన్లు తీసుకోవటం కోసం లైట్లు వేస్తూ ఉండటం తో అందరితో పాటు మేము కూడా నిద్ర లేచి, నిద్ర కి నలిగిన బట్టలు సర్దుకొని కూర్చున్నాం.

"ఎక్కడ దిగాలి?" అడిగాడు శాం.

"దిల్షుక్ నగర్" చెప్పాను.

"ఇంకో పది నిమిషాల్లో వచ్చేస్తుంది" కిటికీ లోంచి బయటకి చూస్తూ చెప్పాడు శాం.

"శాం.. నీకొక విషయం చెప్పాలి. అదే, సునందిని తో నీకు.. ఉందో లేదో తెలీదు కానీ, ఆ మాట మొదలెట్టింది నేనే అనుకుంటా. ఆ రోజు.. నేను పైన ఉన్నాను. నువ్వు స్నానానికి వెళ్తున్నావు.."

షూ లేస్ బిగించుకోవటానికి క్రిందకి వంగిన శాం నేనన్నది విని, చేస్తున్న పని మధ్య లో ఆపి, తల వంచుకుని కూర్చున్న నా మొఖం కనిపించటానికి అన్నట్టు కొంచెం వంగి నా మొఖం లోకి చూస్తూ అన్నాడు..

"విజిల్.." ఆ సందర్భం గుర్తు తెచ్చుకోవటానికి ఒక్క క్షణం ఆగాడు. ఆ రోజు నేను చెప్తున్న సందర్భం గుర్తొచ్చి అన్నాడు..

"ఆ విజిల్ వేసింది సునందిని ని చూసి వేసాను అనుకున్నావు కదూ?"

అవునన్నట్టు తలూపాను.

తన మొఖం లో భావాలు నాకు కనిపించకూడదు అన్నట్టు తల వంచుకొని శ్రద్ధ గా షూ లేస్ బిగించుకోవటం కొనసాగిస్తూ, "ఆరోజు.. అసలు నేను.." ఏదో చెప్పబోయాడు.

కానీ ఇంతలో బస్సు ఆగి, కండక్టర్ గట్టిగా "దిల్షుక్ నగర్.. దిల్షుక్ నగర్.." అంటూ అరిచాడు.

శాం ఏం చెప్తాడో వినాలనే ఆసక్తి నాకు ఉన్నా, చెప్పాలనే ఆలోచన తనలో మాయం అయింది.

"సరేలే, వెళ్ళు" నా కాళ్ళ దగ్గర పెట్టిన నా బేగ్ తీసి నా చేతికి అందిస్తూ, ఆ విషయం అక్కడకి ముగిసిందన్నట్టు అన్నాడు!

## కిటికీ అవతల

కె.విరాజ్

తలనొప్పిగావుంటే సంగీత విభావరి ఇంకా మిగిలుండగానే హాల్లోంచి బయటికొచ్చాను. లాబీలో ఒకావిడ చుట్టూ నలుగురు ఆడవాళ్లు గుమిగూడి కనిపించడంతో యధాలాపంగా అటుచూస్తే ఆమధ్యలోవున్నది శారద.

అప్పుడే ఆమె కూడా నన్ను చూసి నవ్వి నా దగ్గరికి వచ్చింది.

"మనిద్దరం యీవూర్లోనేవున్నా చాలారోజులైంది నిన్నుచూసి. మీ ఆవిడ, పిల్లలూ బావున్నారా?" అని అడిగింది.

నేను సమాధానాలు చెప్పాక "రేపు సెలవేగా, మాయింటికి రాకూడదూ. మనోహర్ యింట్లోనే వుంటాడు. పాతరోజుల గురించి మాట్లాడుకుందాం" అంది నవ్వుతూ.

“మా ఆవిడ, పిల్లలూ వూరెళ్లారు. రేపు మధ్యాన్నంపైన ఖాళీయే. నాలుగ్గం టలకొస్తాను” అన్నాను.

"ఐతే డిన్నర్ చేసివెళ్లు" అని మళ్లీ ఆ గుంపులోకెళ్లింది.

ఆమెను చూసి నాలుగైదేళ్లై వుంటుంది. పెళ్లై ఇరవైయేళ్లైనా ఆమె చక్కదనం తగ్గలేదు. కానీ ఆమె నవ్వుతున్న కళ్ల వెనక ఏదో నిరాశ కనిపించింది.

యూనివర్సిటీరోజుల్లో శారద మాకు జూనియర్. సాంస్కృతిక కార్యక్రమాల్లో మేం డ్రామాలు వేసేవాళ్లం. మాట్రూపులోనేవుండి ఆమె లలితగీతాలు పాడేది. అలా మాతో మంచి స్నేహమేర్పడింది. చక్కని గొంతు. మరో ‘రావు బాలసరస్వతి’ అనేవాళ్లు.

చదువైపోయాక కూడా పాటల కార్యక్రమాల్లో పాల్గొనేది. హైదరాబాదులో అలాంటి ఓ సందర్భంలో పారిశ్రామికవేత్త మనోహర్ తో పరిచయమై తరువాత అతన్నే పెళ్లిచేసుకుంది. పెళ్లయ్యాక ఆమెస్థాయి పెరగడంతో ఆమె స్వయంగా పాడ్డం తగ్గించి ఓ సంస్థ ప్రారంభించి సంగీతకార్యక్రమాలను నిర్వహి స్తోంది.

నేనెక్కిన క్యాబ్ సాయంత్రం నాలుగూపదికి బంజారాహిల్స్ లోపల ఒక కాలనిలో విశాలమైన రెండస్తుల ఊదారంగు భవనం ముందు ఆగింది. ముందున్న పూలతోటను, లాన్ మధ్యలో ‘నిశ్చల జలపాతంలా నీళ్లు జారుతున్న’ ఫౌంటెన్ ను దాటి లోపలికెళ్లగానే పోర్టికోలో నిలబడి ‘కుండీల్లోని మొక్కల సంరక్షణ’ పనిని పర్యవేక్షిస్తున్న శారద చిరునవ్వుతో ఆహ్వానించి నన్ను డ్రాయింగ్ రూంలోకి తీసుకెళ్లింది. పోచంపల్లి కాటన్ చీరలో హుందాగా ఉంది.

కుశలప్రశ్నలయ్యాక డైనింగ్ హాలుకి తీసుకెళ్తూ "మనోహర్ కి అనుకోకుండా అర్జెంటు పనితగిలి పొద్దున్నే వెళ్లిపోయాడు. సాయంత్రం యేడుదాటాక గాని రాలేనని యిప్పుడే ఫోన్ చేసాడు. నీకు సారి చెప్పమన్నాడు" అంది.

ఎత్తుగా, విశాలంగావున్న హాలు సాధారణంగా ఉంది. వాళ్ల స్థాయిని చూపే ఆర్భాటాలేవీ లేవు.

ఉపాహారం తిని, టీ తాగుతూ యూనివర్సిటీ రోజులగురించి చాలాసేపు మాట్లాడుకున్నాం. అప్పట్లో అంత పరిచయంలేని మనుషుల్ని, ముఖ్యంకాని సంఘటల్నికూడా యెంతో జ్ఞాపకంగా ప్రస్తావించింది. ‘వర్తమానం తో ఏదైనా గొడవున్నప్పుడు గతం గురించి ఎక్కువగా ప్రస్తావిస్తారని’ ఎక్కడో చదివినట్టు గుర్తొచ్చింది.

"యీ మధ్య నీ సంగీతకార్యక్రమాలు తగ్గిపోయినట్టున్నాయి. కంపెనీపనుల్లో బిజీ అయ్యావా?” నేనే అడిగాను.

“మనోహర్ నన్నూ బిజీ చేసేసాడు. కంపెని సియెస్సార్ నిధులకు నన్ను డైరెక్టర్ గా పెట్టినప్పట్నుంచి స్కూళ్లు, ఆసుపత్రుల రిపేర్లు, కొత్తవి కట్టించడం, పేదవిద్యార్థుల స్కాలర్షిప్పులు యిలాంటి సేవాకార్యక్రమాలకే నా సమయాన్నంతా వెచ్చించాల్సొస్తోంది” అంది అసంతృప్తిగా.

“అన్నీ మంచిపనులేగా ” అన్నాను, ఆమె అసంతృప్తిని కొంచెం తగ్గిద్దామని.

“నిజమే నాకూ యిష్టమే. కానీ పేదల సేవ, ప్రకృతియాత్రలపట్ల చూపించిన వుత్సాహం నా సంగీత కార్యక్రమాల పట్ల చూపించడం లేదు మనోహర్. యేమాత్రం ఖాళీ దొరికినా నన్నెక్కడికన్నా టూర్ కి తీసుకెళ్లడమో, పిల్లలతో గడపడమో, సేవాకార్యక్రమాల్లో పాల్గొనడమో చేస్తుంటాడు. తరచుగా సాహితీమిత్రులతో ప్రకృతి సమావేశాలకు, కొండల్లో సాహసయాత్రలకు వెళ్తూంటాడు. ఫండ్స్ కి కొరతలేకపోయినా తను నా కార్యక్రమాలను పట్టించుకోకపోవడం కష్టంగావుంది. నాకూ ఆసక్తితగ్గి నా అభిరుచులకు దూరమౌతున్నాను”

"అతని లిబరల్ వ్యక్తిత్వాన్ని, సేవాకార్యక్రమాలను చూసి యిష్టపడేగదా నువ్వతన్ని పెళ్లి చేసుకున్నావు?"

ఆమె మొహం కొంచెం ఎర్రబడింది, వెంటనే తమాయించుకుంది.

“మనోహర్ లైబ్రరిరూం చూద్దువుగాని పద" అంది లేచి. ఆమె వెనకాల వెళ్లాను.

హాలుకి యెడమపక్కనున్న లైబ్రరి తలుపుతెరిచి లోపలికి తీసుకెళ్లింది. లోపల కరెంటు లేదు, వెల్తురు తక్కువగా ఉంది. మనోహర్ సెక్రటరి రాబర్ట్ పర్యవేక్షణలో ఒక ఎలెక్ట్రీషియన్ స్విచ్ బోర్డు విప్పదీసి రిపేరు చేస్తున్నాడు.

"రిపేరు యింకా ఐపోలేదా?" అంది శారద గదిమధ్యలో సోఫాలో కూర్చుంటూ.

"అయిపోయింది మేడం" అన్నాడు రాబర్ట్. ఎలెక్ట్రీషియన్ బోర్డు బిగించడం ప్రారంభించాడు.

నిలబడే చుట్టూ చూసాను. విశాలమైన గది. ఎదురుగోడకు గాగిన్ చిత్రం ‘వేర్ ఫ్రం వుయ్ కం’ ఉంది. ఎడమవైపు పుస్తకాల అల్మరాలున్నాయి. కుడివైపు గోడకు ఒకే పెద్ద పెయింటింగ్ ఉంది.

బోర్డుబిగించి స్విచ్చేసాక ఒక్కసారిగా లైట్లు వెలిగాయి. వెల్తురులో ఎలెక్ట్రీషియన్ తదేకంగా ఆ కుడివైపున్న పెద్ద పెయింటింగునే చూస్తున్నాడు. అతను నాకు తెలిసినవాడే, లక్ష్మణ్. మా కాలనీవెనక బస్తీలోవుంటాడు. మాయింటికి అతనే ఎలెక్ట్రీషియన్. సన్నగా, ఎండిపోయినట్టుగా కళ్లజోడుతో ఉంటాడు.

"యేం లక్ష్మణ్, నువ్వింతదూరం వచ్చి రిపేర్లు చేస్తావా?" అనడిగాను.

అతను నన్నక్కడ చూసి తొట్రుపడి "లేదుసారు, యీ యేరియాలో మా ఫ్రెండు చేస్తాడు, అతనూర్లో లేనప్పుడు నేనొచ్చి చేస్తావుంటాను" అని తలొంచుకుని సామాన్లు సర్దుకొన్నాడు. ఇద్దరూ వెళ్లిపోయారు. ‘అతన్నా పెయింటింగులో అంతగా ఆకర్షించిందేంటా’ అని దానివైపు నిశితంగా చూసాను. ఆ ల్యాండ్ స్కేప్ పెయింటింగ్ గొప్పగావుంది.

'నిలువు ఊచలున్న పాతకాలపు చెక్కకిటికీలోంచి బయట దూరంగా కనిపిస్తున్న పచ్చని పొలాలు, ఆవెనక సన్నటి పాయలుగా పారుతున్న ఏరు, ఆపైన పచ్చని కొండలు, యేట్లో ఆడుతున్న ముగ్గరు పిల్లలు'.

దగ్గరగావున్న కిటికీ, పొలాలు క్లాసికల్ పద్ధతిలో స్పష్టంగాను, దూరంగా యేట్లోఆడుకుంటున్న పిల్లలమొహాలు, ఆవెనక కొండలు ఇంప్రెషెనిస్టిక్ పద్ధతిలో అస్పష్టంగానూ ఉన్నాయి. ఈ రెండిట్నీ మధ్యలో ఒకక్రమంలో నైపుణ్యంగా కలిపారు.

"చాలాబావుంది పెయింటింగ్" అన్నాను. శారద పెయింటింగ్ వైపు చూసింది.

"ఆ పెయింటింగ్ వెనక పెద్ద కథవుంది. చెప్తా వోపిగ్గా విను. మనోహర్ రావడానికి యింకాటైముంది" అంది శారద.

నేనూ సోఫాలో కూర్చుని "చెప్పు" అన్నా.

"మనోహర్ వాళ్లది మారుమూల పల్లెటూరు భూపతిపాలెం. పెద్ద భూస్వామ్య కుటుంబం. మనోహర్ తాత భూషయ్య వ్యవసాయమేకాక వడ్డీవ్యాపారం చేసి, గ్రామీణ పరిశ్రమలు పెట్టి ఆస్తిని యింకా విస్తరించాడు. వూర్లో ముప్పావుభాగం పొలాలూ, పెత్తనము వాళ్లవే. వాళ్ల బంగళా వూరిచివరుంటుంది. మా మామయ్య పురుషోత్తంగారు మిత్రులతోకలసి బెంగుళూరుదగ్గర్లో పరిశ్రమపెట్టి వృద్ధిచేసి యిండస్ట్రియలిస్టయ్యారు. యిద్దరాడపిల్లల తరువాత చాలారోజులకు మనోహర్ పుట్టాడు. అతనికి ఆరేళ్లొచ్చే దాకా యెక్కువగా నానమ్మ, తాతల దగ్గర ఆవూళ్లోనే వుండేవాడు"

"గారాబంగా పెరిగాడన్నమాట" అన్నా

"అంతేకాదు, అతనికేదో జలగండముందని యింట్లోంచి బయటికి పంపేవారుకాదట. అతను గంటలతరబడి మేడమీది గదిలో కిటికీ దగ్గర నుంచుని దూరంగా కనపడే పొలాల్ని, యేటిని, కొండల్ని చూస్తూ అసంతృప్తిగా గడిపేవాడు. మనోహర్ కి ఐదేళ్లు దాటాక వాళ్లింట్లో పనిచేసేవాళ్ల పిల్లల్ని యిద్దర్నిమాత్రం అతనితో ఆడుకోవడానికి అనుమతించారు. వాళ్లు యెనిమిదేళ్ల దాసు, యేడేళ్ల సోము అని మనోహర్ చెప్తూంటాడు. వాళ్లు ఆ కాంపౌండులోనే ఆడుకోవాలితప్ప బయటకు వెళ్లకూడదనే నిబంధన వుండేది.

ఆ డిసెంబరునెలలో వోరోజు మధ్యాహ్నం దాసు, సోము యేటిపక్కన పొలంలోకివెళ్లి మోసులొచ్చిన గెన్నుగడ్డలు తవ్వుకుని తినిరావాలని వెళ్తూంటే మనోహర్ యెవరికీ తెలియకుండా వెనకాలే వెళ్లాడు. సగందూరం వెళ్లాక వాళ్లితన్ని చూసారు, వాపసు వెళ్లిపోదామని బతిమాలారు. మనోహర్ ససేమిరా అని మొండికేసాడు. యిక తప్పక ముందుకే వెళ్లారు. పొలాల గట్లవెంబడీ, పంటకాలవల్లో నడుస్తూ దారిలోవచ్చిన గంగరేగుచెట్టు దగ్గర పళ్లు తిని, కపిలబావులు, నీటికుంటలు చూసుకుంటూ యేటిదగ్గరకు చేరారు. మధ్యలో పసరిక పాముల్ని, నీటిపాముల్ని చూసి

మనోహర్ భయపడితే వాళ్లు పాముల్ని చేతుల్లోకి తీసుకుని చూపించి ధైర్యం చెప్పారు. పొలంలో మోసులొచ్చిన గెన్సుగడ్డల్ని తవ్వుకుని యేట్లో కడుక్కుని తిన్నారు. అవి 'మహారుచిగా అనిపించా'యట మనోహర్ కి.

ప్రకృతిమధ్యన, పారుతున్న యేటినీళ్లలో మొదటిసారి స్వేచ్ఛగా ఆడుకుంటూన్న మనోహర్ కి ఆనందంలో యెంతటైము గడిచిందో తెలియలేదు. యెర్రగా మెరుస్తూ యేటివెనక కొండల్లోకి దిగిపోతున్న సూర్యుణ్ణిచూస్తూ మైమరచిపోయాడు. పరిసరాల్లో వొక్కసారిగా వెలుతురు తగ్గడంతో వాళ్లు స్పృహలోకొచ్చారు. మసకచీకట్లో ఎలాగో కష్టపడి పూర్తిగా చీకటిపడే లోపలే యింటికి చేరారట.

అదీ కథ! తన తొలి అడ్వెంచర్ కి గుర్తుగా దీన్ని వేయించాడనుకుంటా" అని దీర్ఘంగా ఊపిరి పీల్చుకుంది.

ఇంట్లోపనిచేసే అతనొచ్చి 'మనోహర్ వచ్చా'డని చెప్పాడు. 'ఇప్పుడే వస్తా' అని వెళ్లింది. నేను ఆ పెయింటింగ్ ని పరిశీలనగా చూసాను. 'అతని వ్యక్తిత్వరహస్యం ఇందులోగాని దాగివుందా?' అనిపించింది.

కాస్సేపు తరువాత శారద, మనోహర్ కలసివచ్చారు. సన్నగా, పొడవుగా, వెనక్కి దువ్విన జుట్టుతో, గోల్డ్ ఫ్రేమ్ కళ్లద్దాలతో, తెల్లటి ఫుల్ హ్యాండ్స్ షర్ట్ తో హుందాగా, సింపుల్ గా ఉన్నాడు మనోహర్. పారిశ్రామికవేత్తగా కంటే యూనివర్సిటి ప్రొఫెసర్ లాగున్నాడు. రాగానే షేక్ హ్యాండిచ్చి ఆదరంగా మాట్లాడి తను లేకపోయినందుకు క్షమాపణలు చెప్పాడు.

"మీగురించే అనుకుంటూంటుంది శారద. మనమిదేవూర్లో వున్నా ఎక్కువసార్లు కలుసుకోలేకపోయాం" అన్నాడు మనోహర్.

ముగ్గరం మాటల్లో పడిపోయాం. మనోహర్ కొద్దిసేపు తన సాహితీమిత్రుల గురించి, తమ కంపెని విషయాలు, సామాజిక సేవకోసం వాళ్లు చేసిన సర్వేల విశేషాలు చెప్పాడు. తర్వాత తన ప్రకృతి సాహసయాత్రలగురించి చెప్పడం మొదలుపెట్టాడు.

"మీరెప్పుడూ మాతో రాలేదుగాని మా సాహసయాత్రలు యెంతో థ్రిల్లింగ్ గా వుంటాయి. ఆమధ్య నల్లమలకొండల్లోని లోయలో వుధృతంగా ప్రవహిస్తున్న వాగులో యెదురుప్రవాహంలో రెండుపడవల్లో పదిమైళ్లు వెళ్లాం. క్షణక్షణం ప్రమాదంతో వొళ్లు జలదరించిన ఆ ప్రయాణం అద్భుతమనుకోండి. ఆరాత్రి ఫారెస్ట్ గెస్ట్ హౌస్ దగ్గర నెగళ్ల చుట్టూ అక్కడి ఆదివాసులు చేసిన డ్యాన్సును మాటల్లో వర్ణించలేం. యిన్స్పైర్ అయి మేమూ డ్యాన్స్ చేసాం. మొన్న సరిగ్గా దానికి వ్యతిరేకంగా పాపికొండల్లో గోదావరిలో లంగరేసిన పడవపైన పున్నమి వెన్నెల్లో నిశ్చలంగా రాత్రంతా గడపడం అంతే గొప్పగావుంది" అంటూ వాటిగురించి వివరించాడు. అతని అభివక్తిలో సాంఘికహోదాకంటే విభిన్నధ్రువాలు కలసిపోయిన ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం ప్రతిఫలిస్తోంది.

“ప్రమాదాల గురించి అస్సలు పట్టించుకోదు, నాకేమో యిక్కడ చచ్చేంత భయం" అంది శారద నిష్టూరంగా.

"యిండస్ట్రియలిస్టై తీరికలేని పనుల్లోకూడా మీరు యీ యాత్రలు చేయడం విశేషం" అన్నాను.

"ఆమాటకొస్తే జె.ఆర్.డి. టాటాగారు వృద్ధ్యాప్యంలో విమానం నడపలేదా? అసలు మనిషి రోజులో కొంతసేపు తన్ను తాను మరచిపోతేగాని మనిషిగా గడిపినట్టు కాదనుకుంటాను. దానికి యిలాంటి థ్రిల్లింగ్ యాత్రలు వొక చక్కటి మార్గం" అన్నాడు మనోహర్.

"యీ పెయింటింగ్ చాలా గొప్పగా వేయించారు. దానివెనకాలున్న థ్రిల్లింగ్ కథంతా చెప్పింది శారద" అన్నాను, గోడకున్న పెయింటింగ్ ని చూపిస్తూ.

“ఆ కథ చివర కొంత విషాదంకూడావుంది. అది శారద మీకు చెప్పుండదు" అన్నాడు.

“అది మీరే చెప్పండి” అంది శారద.

అతని మొహంలో విచారం అలుముకుంది. "మేము తడిసిన తలల్తో యేటినించి తిరిగొచ్చి యింటి కాంపౌండులోకి ప్రవేశించేసరికి అక్కడ పరిస్థితి గంభీరంగా వుంది. మా తాతగారు వరండాలో అటుయిటు తిరుగుతూ కోపంగా అందరిమీద అరుస్తున్నారు. ఆవరణలో చాలామంది పోగైవున్నారు. అందులో దాసు, సోముల నాన్నలు చేతులుకట్టుకుని ఓపక్కగా వున్నారు. మమ్మల్ని వెతకడానికి టార్చిలైట్లు, పెట్రొమాక్సు లైట్లతో పదిమంది మనుషులు రెడీగావున్నారు.

మమ్మల్ని చూడగానే "అదిగో చిన్నయ్యగారు వచ్చారు” అని యెవరో అరిచారు. వొకరు నన్ను యెత్తుకుని హాల్లో మంచంమీద పడుకుని యేడుస్తున్న మా నాన్నమ్మ దగ్గరికి తీసుకెళ్లారు.

మా నాన్నమ్మ లేచి నన్ను గట్టిగాహత్తుకుని వొళ్లో కూర్చోబెట్టుకుంది. నేను ఆమెకు జరిగిందంతా చెపుతున్నాను. యింతలో బయట పెద్దగా అరుపులు, యేడుపులు వినిపించాయి. నేను బయటికివచ్చాను. మా తాతగారు యింకా కోపంగానే వున్నారు. నాస్నేహితుల్ని వాళ్లనాన్నలు బరికెలతో వీపుమీద బాదుతున్నారు.

ఆ శిక్ష చాలదని వాళ్లిద్దర్నీ మా వరండాలో కొబ్బరితాడుకట్టి కోదండాలకు వేలాడదీశారు. నేనది చూడలేక మానాన్నమ్మ దగ్గరికి పరిగెత్తి ఆమెను లాక్కొచ్చాను. ఆమె చెప్పడంతో వాళ్లను దించారు.

ఆరోజు తరువాత నా స్నేహితులిద్దరూ నాకెప్పుడూ కనపడలేదు. వారంరోజుల్లోనే నన్నూ, బెంగుళూరులోవున్న మా అమ్మానాన్నల దగ్గరకు తీసుకొచ్చి నన్నక్కడ స్కూల్లో చేర్పించారు" అని ముగించాడు మనోహర్.

"మీరు పెద్దయ్యాక వాళ్లనెప్పుడూ కలవడానికి ప్రయత్నించలేదా?" అడిగాను.

"కాలేజిరోజుల్లో సెలవులకెళ్లినప్పుడు ప్రయత్నించాను, కానీ ఆ సంఘటనజరిగిన కొన్నినెలలకే వాళ్లు వూరొదిలి వెళ్లిపోయారని చెప్పారు. ఆతరువాత యిక్కడ ఆధునిక పరిశ్రమ ప్రారంభించి మేమూ బెంగుళూరునించి యిటువైపు వచ్చేసాము. వాళ్లెక్కడున్నారో యిప్పటికీ తెలియదు" అన్నాడతను విచారంగా.

శారద లేచి "డిన్నర్ కి టైమైంది రండి" అని హాల్లోకి వెళ్లింది.

అతను లేచి పెయింటింగ్ దగ్గరికెళ్లి "నిజమైన జీవితమంటే 'కిటికీలోంచి చూసే దృశ్యంకాదు, తలుపుగుండా బయటికివెళ్లి లీనమై అనుభవించేది' అని నాకారోజే తెలిసింది. వాళ్లిద్దరికీ నేనెంతో రుణపడివున్నాను. ఆ రుణమెలా తీర్చుకోవాలో తెలియడంలేదు. ఐనా అది అంత సులభంగా తీరేది కాదులేండి" అన్నాడు.

డిన్నరయ్యాక ఇంటికొచ్చేసాను. ఆరాత్రి నాకు చాలాసేపు నిద్ర పట్టలేదు. అతను చివరగా చెప్పిందాంట్లోకూడా అతని ప్రవర్తనకుచెందిన రహస్యం ఉన్నట్టుగా బోధపడింది.

మరుసటిరోజు శారదకు ఫోన్ చేసి ధన్యవాదాలు చెప్పి "మనోహర్ చిన్నప్పుడు జరిగిన సంఘటనపట్ల యింకా అపరాధభావనతో బాధపడుతున్నట్టుంది" అన్నాను.

"నాకూ వొక్కోసారి అలాగే అనిపిస్తుంది. యిది పోవడమెలా మరి?" అనడిగింది.

"యేముంది యెంతకష్టమైనా దాసు, సోములను వెతికిపట్టుకుని వాళ్ల మంచిచెడ్డలు విచారించి అవసరమైతే సహాయం చేయడమే" అన్నాను.

శారద దీర్ఘంగా నిట్టూర్చినట్టు అవతల్నుంచి వినపడింది.

నెలరోజుల తర్వాత మాయింట్లో కరెంటుమోటార్ కాలిపోతే కొత్తది వెయ్యడానికి ఎలెక్ట్రీషియన్ లక్ష్మణ్ వచ్చాడు. పనైపోయి అతను వెళ్లేముందు టీ తాగుతూ కూర్చున్నాం. ప్రతిసిప్పుకి ఊదుకుని టీతాగడం అతని అలవాటు. అతనలా తాగుతుండగా ఇదివరకెప్పుడో అతనలా తాగుతూ తమవూరు 'భూపతిపాలెం' అని చెప్పడం చప్పున గుర్తొచ్చింది.

"లక్ష్మణ్ మీది భూపతిపాలెంగదా, నీకు మనోహర్ వాళ్లు తెలిసేవుండాలే?" అన్నా.

అతను తత్తరపడి " నాచిన్నప్పుడే మేమావూరు వొదిలేసాం. ఐనా వాళ్లు జమిందార్లు సార్!" అన్నాడు, తనకేం సంబంధంలేనట్టు. ఆవెంటనే అతను వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయాక లక్ష్మణ్ పూర్తిపేరు 'లక్ష్మణదాసు' అని గుర్తొచ్చింది. ఇదివరకూ చెక్కుమీద పేరు అలాగే రాయించుకునేవాడు. యీ లక్ష్మణే మనోహర్ చిన్నప్పటి ఫ్రెండైన 'దాసు' అయ్యుంటాడని స్ఫురించింది. 'కానీ ఎందుకో అతను ఆ విషయం బయటపెట్టదల్చుకోలేదు', ఎలాగైనా అతన్ని ఒప్పించి మనోహర్ దగ్గరికి తీసుకెళ్లాలనుకున్నాను.

ఆ మరుసటిరోజు సాయంత్రం మా వెనకనున్న బస్తీలోని లక్ష్మణ్ ఇంటికెళ్లాను. ముందుగదిలో అతను కొడుకును, కూతుర్ని కూర్చోబెట్టుకుని చదివిస్తున్నాడు. నన్ను చూసిన వెంటనే లేచి "ఫోన్ చేస్తే నేనే వచ్చేవాణ్ణిగదా సార్" అంటూనే నాకు మర్యాద చేసి కూర్చోబెట్టాడు.

నేను పిల్లల్ని, అతని భార్యని పలకరించి, ఆమె చేసిచ్చిన టీ తాగాక "నీతో మాట్లాడేదుంది, పార్కులో కూర్చుందాం రా" అన్నాను. అతను మౌనంగా నన్ననుసరించాడు.

నేను మనోహర్ ఇంట్లో జరిగిందంతా చెప్పి "మనోహర్ తో చిన్నప్పుడు యేటిదగ్గరకి వెళ్లిన దాసువి నువ్వేనని నాకు అర్థమైంది" అన్నాను పార్కులో బెంచిమీద కూర్చున్నాక.

"మీరనుకుంటావున్నది నిజమే. రెణ్ణెల్లకింద తొలిసారి రిపేరుపనిమీద వాళ్లింటికెళ్లినప్పుడే వాళ్లెవురో తెలిసింది. అప్పుడే మనోహరుసారు యీ కథ యెవురికో చెప్తావుంటే నేను విన్నాను. ఆ రూములో పని మిగిలిపోవడంవల్ల రెండోసారి వెళ్లకతప్పలేదు. ఆ రోజే మీరొచ్చినారు" అన్నాడు లక్ష్మణ్

"మరెందుకు నువ్వెవరో మనోహర్కి చెప్పలేదు?" అన్నా.

"యేంచెప్తాం సార్. ఆ కథ అక్కడతో ఐపోలేదు, యింగా కొన్నాళ్లు నడిచింది. అది ఆయనగ్గూడా తెల్సుండదు. అ రోజు మా తప్పులేకపోయినా మమ్మల్ని బాగా కొట్టినారు. మాకు వొళ్లంతా వాతలుతేలి జొరాలొచ్చినాయి. మా పెద్దోళ్లను బంగ్లాలో పనిలోంచి తీసేసి పొలాల్లో పనులకు పంపించినారు. బాగ చదువుకునే పిల్లలమనే వుద్దేశంతోనే నన్నూ, సోమూను ఆ కాంపౌండులేకి రానిచ్చినారు. కానీ అది జరిగినాక యెప్పుడూ బయం బయంగా వుండేవాళ్లం. స్కూల్లో మా పరిస్థితి మారింది" అని ఆగాడు లక్ష్మణ్.

"అంతపని జరిగిందా?" అన్నాను అసంకల్పితంగా

"తప్పంతా వాళ్లదే అనలేం. అదంతా మొత్తంగా వొక ముళ్లకంప సార్. మధ్యలోవుండేవాళ్లు సామాన్యులా? 'మనోహరు యేట్లో కొట్టుకొని పోవాల్సినోడని మావల్లే అంతపెద్ద గండంలో యిరుక్కున్నాడని, అతని నాయనమ్మ చేసిన పూజలవల్ల కొంచెంలో తప్పించుకొని బయటపడినాడని' కొందరు పెద్దమనుషులు తీర్మానించినారు. కొన్నాళ్లకు యీ విషయాన్ని మనోహరుసారు వాళ్లు మర్చిపోయినా యింగ అక్కడవుండడానికి బుద్ధిపుట్టక మాకుటుంబాలే వూరిడిచి చెరోదిక్కు వెళ్లిపోయినాయి సార్"

"మీ ప్రమేయంలేకుండా జరిగిందానికి అంత పెద్ద శిక్షా?" అన్నాను ఆశ్చర్యపోతూ. "అసలు మేంగూడా వొకప్పుడు భూపతిపాలెంలో రైతులంసార్. మనోహరుసారు తాతకు మా భూములు వడ్డీకింద జమైపోయినాక తలొంచుకోని మేంవాళ్లింట్లో పనివాళ్లమైపోయినాం. మానాయనకెప్పుడూ ఆ బాధవుండేది. వెళ్లిపోవడానికి అదిగూడా

కారణమనుకుంటాను. సోము జబ్బుచేసి చనిపోయినాడని కొన్నాళ్లతర్వాత తెలిసింది. యిప్పుడు వాళ్లెక్కడున్నారో నాకు నిజంగా తెలీదు సార్" అని ముగించాడు లక్ష్మణ్.

అతను చెప్పింది విన్నాక తలంతా బరువైనట్టనిపించింది. పెత్తందారీవ్యవస్థ ఆగ్రహానికి గురైతే అంతకుమించిన శాపంలేదు. ఐతే ఆతరువాత మనోహర్ నగరజీవితానికి వెళ్లి ఆధునికతరం పారిశ్రామికవేత్తగా మారాడు. వ్యక్తిగతంగా అతనిలో పాతవ్యవస్థ లక్షణాలు కనిపించడం లేదు.

"మీ తప్పు లేకపోయినా మీకు కీడు జరిగిందన్నది వాస్తవమే. కానీ నాకు తెలిసినంతవరకు మనోహర్ మంచివాడు, అతనికి తెలియని వయసులో జరిగిందైనా లోలోపల యిప్పటికీ బాధపడుతున్నాడు. మీకు సహాయంచేసి న్యాయం జరిగితేగాని అతనికి తృప్తి వుండదు. నీకూ యీ కష్టాలు తప్పుతాయి" అనునయంగా అన్నాను.

“మనోహరు సారు నిజంగానే మంచాయనసార్” అని లేచి నిలబడి “ఆలస్యమైంది, మిమ్మల్నింటిదగ్గర దింపి పోతాను, పదండి” అన్నాడు.

నేనూ లేచాను. ఇద్దరం నడవడం మొదలుపెట్టాము

“వూరొదిలేసినాకగూడా శానాకాలం మానాయన దిగులుతోనే వున్నాడు. ‘నేనెవురికిందా పనిజెయ్యకుండా బతకాలని’ మానాయన వొక కరెంటాయన్ను బతిమాల్తే ఆయన్నాకీ పని నేర్పించినాడు. మా అమ్మా అంతే. ఆమె బతికున్నన్నాళ్లు మళ్లా నేనెప్పుడూ గొప్పోళ్లదగ్గరికి వెళ్లగూడదని నాచేత వొట్టేయించుకుంది సార్" అన్నాడు లక్ష్మణ్.

“ఆమె యిప్పుడు లేదుగా, యిక అభ్యంతరమేముంది?” అన్నాను అతని స్థిరచిత్తానికి ఆశ్చర్యపోతూ.

"మనిషి పోయినా మాట మాటే సార్. పైగా సోము కుటుంబ మెక్కడుందో తెలీదు, నేనొక్కణ్ణే యెట్లా వస్తాను?” అన్నాడు.

ఆ చేదుజ్ఞాపకాన్ని లక్ష్మణ్ ఇంకా మర్చిపోలేదా? లేక, మనోహరు మంచివాడని తెలిసినా అతను కొత్తవ్యవస్థనుకూడా నమ్మడంలేదా? అతనికి వస్తున్న ఆహ్వానం తలుపునుంచి కాకుండా ‘కిటికి’నుంచి అనుకుంటున్నాడా? ఈ విషయం అంత తేలికైందికాదని నాకు బోధపడింది. ఆదేకాక ‘నిజాయతీగా, కష్టించి సంపదను సృష్టించే మనుషులు అనాయాసంగావచ్చే బహుమానాలను స్వీకరించరేమో’ అనుకున్నాను. ఐనా అతనికి జరిగిన అన్యాయాన్నెలాగైనా సరిదిద్దాలనే కోరిక నన్నొదలలేదు.

మా యింటిదగ్గరికొచ్చాము.

"వస్తా సార్” అని లక్ష్మణ్ రెండడుగులు ముందుకేసాడు.

"ఆరోజు మీతో బయటికెళ్లడంవల్లే నిజంగా జీవితాన్ని తెలుసుకున్నానని మనోహరంటున్నాడు. అతను ఎంతో సంఘసేవ చేస్తున్నాడు. పోనీ నువ్వొక్కసారి కనిపించి బాగానేవున్నానని చెప్పు. అతను సంతోషించి యింకా యెక్కువ సేవచేస్తాడు" అన్నాను ఆఖరి ప్రయత్నంగా.

లక్ష్మణ్ వెనక్కి తిరిగి చిన్నగానవ్వి "యిప్పుడు మనోహరుసారు సేవవల్ల యెంతోమందికి మంచి జరుగుతావుంది. నేను కనబడినాక ఆయన సేవ తగ్గిస్తే?" అని ముందుకు నడిచాడు.

అతని అంతరంగాన్ని అర్ధంచేసుకోవడానికి ప్రయత్నిస్తూ చీకటివెల్తుర్లలో వెళ్తున్న అతనివైపే చూస్తూ అక్కడే నిలబడ్డాను.

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

## కర్మయోగి

శ్రీధర్ రెడ్డి బిల్లా (Cupertino, CA)

"రేపు మీ నానది సంవత్సరీకం బిడ్డా ! గుడికి బోయి అయ్యగారికి దక్షిణియ్యాలె!" ఎప్పుడో బొంగురు పోయిన గొంతుతో అమ్మ అంటున్న మాటలతో టి.వి ముందు కూర్చున్నడాక్టరు రమేష్ రెడ్డికి గతమంతా ఒక్కసారి కళ్ళముందు కదలాడ సాగింది. రమేష్ రెడ్డి అమెరికాలోని ఓ స్థానిక హాస్పిటల్లో మంచి పేరు గడించిన డాక్టరు.

సుమారు ముప్పై ఏళ్ళ క్రిందట.. తాను ఇంటర్ చదువుతోన్న రోజులవి. కరీంనగర్ జిల్లా లోని ఒక మారుమూల పల్లె. తనతో పాటు ఊర్లోనే చదువుకున్న చాలా మంది పదో తరగతి తప్పి అప్పటికే ఉధృతంగా సాగుతోన్న నక్సలైట్ల ఉద్యమంలో కలిసిపోయారు.

తాను మాత్రం ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై, మండల కేంద్రంలో ఇంటర్ చదువుతున్నాడు. ఒకరోజు కాలేజీ అయిపోయాక సాయంత్రం బస్సుదిగి ఇంటికి వస్తుండగా.. దారి మధ్యలో తన పదోతరగతి క్లాసుమేటు వెంకటయ్య కలిసి ప్రక్కకు తీసుకెళ్లాడు. తనకు మాత్రమే వినబడేట్టుగా "ఏం రమేషు! అన్నలు జండాలు బాతినంక సుతం మీ నాన భూమిల అడుగుబెట్టి దున్నుతాండట నేను గూడ దళంల పనిజేత్తాన కాబట్టి జెప్తాన. కస మీ నానకు జెప్పుకో. అన్నలు జెండాలు బాతినంక సుతం ఆ భూమిలకు పోతే ఇగ గంతే! "

"ఇప్పటికే దీని మీద దళంల చానా చర్చ జరిగింది. మీ నానకు సుతం ఓ సారి వార్నింగ్ ఇచ్చిరు.. గి దీంట్లే నాదేతె ఏం లేదు..పైన కొంరన్న దళకమాండర్. గా అన్న ఎట్లంటె గట్లనే అయితది. ఐనా గని .. గాలి, నీళ్లు, భూమి ఒకళ సొత్తేం గాదు. సమాజంల అందరి సొత్తు.

అందరికి సమానంగ బంచాలె. పంచితీరుతం. గందుకే నేను దళంల జేరిన భూసాముల దోపిడి సాగదిగ.. మీ పటేల్ గిరీలు జేసినంత కాలం జేసిర్రు..సాగినంత కాలం సాగింది.. గవన్నీ ఇగనుంచి సాగై...!

ఇగబోతె.. ఓ వారం కింద.. ఊరంత జూత్తాంటె.. జెండాగద్దె కాడ.. గా బాల్రెడ్డి మీద, మేం యాక్షను దీసుకుంటానం! టెలిఫోన్లు జేయబట్టే పోలీసోళ్ళకు మా గురించి తెల్తాంది.. గందుకే ఎవ్వళు గూడ ఫోన్లు పెట్టుకోద్దని ముందే సాటింపు ఏయించినంక సుతం.. ఫోన్ లైను గావాల్నని పట్నం బోయి.. అప్లికేషను పెట్టుకుండట.. గా బాల్రెడ్డి.. గందుకే వాణ్ణి జెండాకు గట్టేసి కొడతానం!

గక్కడ మీ నాన సుతం ఉన్నడు.. ఉట్టిగ జూడలె గద .. 'గిది అన్నాయం .. గట్ల గొడ్తరా..' అనెటాళకు.. కొందరు మా మీదనే తిరగబడ్డంత పనిజేసిర్రు.. మేం యాక్షన్ దీసుకుంటాంటే మీ నాన జనాలను రెచ్చగొట్టి నట్లైయింది. గక్కడ గంతమందున్నరు.. ఎవడన్నమాట్లాడిండా..? మీ నానకెందుకు?..అన్నల మీదనె తిరగబడతడా..?..మేం ఉన్నదే అందరికి నాయం జేయనీకి... ఉన్నోడు, లేనోడని లేకుంట అందరికి సమానంగ బంచనీకి.

గది ఇగ వదిలిపెట్టు గని..జెండాలు బాతిన భూమిలకు మాత్రం బోవొద్దని జెప్పు..లేకుంటే.." చెప్పుకుంటూ పోతున్నాడు.

అంతా విన్నాక, మౌనంగా నడుచుకుంటూ ఇంటికెళ్ళాడు. నాన్న ఇంట్లోనే కూర్చొని ఉన్నాడు. వెంకటయ్య చెప్పిన మాటలన్నీ నాన్నకు వివరించాక నాన్న మొదలుబెట్టాడు .

"మేమైదుగురం అన్నదమ్ములం బిడ్డా..! అందరం పంచుకోంగ నా భాగాని కొచ్చింది ఇరవై ఎకరాల భూమి... దాంట్లె పదియేను ఎకరాలు జెండాలు పాతిర్రు.. మంచిగా ఏపు కొచ్చిన పత్తి.. ఇప్పుడొచ్చిబెదిరితార్రు..పత్తి బుగ్గలు ఏరొద్దట.. ఎవడో పోయి లేనిపోనియి ఎక్కిచ్చి జెప్తె .. ఆళ్ళు మన భూమిలకే మనల్ని పోవొద్దంటే భయపడతార్ర?.. గీ భయపడుకుంట బతుకుడు గూడ.. ఓ బతుకేనార..? గందుకే ఊళ్లె జెండాలు బాతిన భూములోళ్ళందరికి ధైర్యం జెప్తాన...!" చెప్పుకుంటూ పోతున్న నాన్న మాటలకు ఏమీ ఎదురు చెప్పలేదు.

అంతా వింటున్న అమ్మ.. "వాళ్ళతోని బెట్టుకోవద్దని ఎంత జెప్పినా మీ నాన ఇంటలేదు బిడ్డా.! గీ భూమి పాడుగాను! మనలాంటోళ్ళు చాన మంది పట్నం పోయిర్రు. ఎదో ఒకటి జేసుకొని బతుకుతార్రు . మనం కూడా ఏడికైనా బోదాం..పా.. అంటాంటె.. మీ నాన వింటలేదు బిడ్డా.. ఏమన్నైతే ఇంకేమన్న ఉన్నదా ఇగ.. నువ్వు, ఇద్దరు చెల్లెళ్ళు, అందరం..ఆగమైపోతం బిడ్డా..ఆళ్ళు పిడాత పాణం దీశే రకాలు.."అంటూ కన్నీళ్లు కొంగుతో తుడుచుకుంటోంది!

నాలుగు రోజుల తర్వాత , ఓ రోజు రాత్రి పదకొండు దాటిందనుకుంటా.. చినుకులు పడుతూ ఉన్నాయి. తలుపు నెట్టుకుంటూ వచ్చాడో మనిషి. ఇంకో నలుగురు తలుపు బైటే ఉండిపోయారు. తలుపు బయట ఉన్నవాళ్లలో ఒకడు వెంకటయ్య.

లోపలికి వచ్చిన మనిషి, బల్ల మీద కూర్చొన్నాక తన పిస్తోలును బొడ్లో నుంచి తీసి బల్లమీద పక్కనే పెట్టుకున్నాడు. నాన్నను కూడా కూర్చోమన్నాడు. "నా పేరు కొంరన్న! వినే ఉంటవు గనీ.. మండల దళ కమిటీకి కమాండరును. మా మీదనే తిరుగబడమని పూళ్ళె రెచ్చగొడ్తానవు గద? భూమి నేవన్న.. పుట్టినప్పుడు నీ పేరు మీద రాసుకొచ్చినవా? జెండాలు బాతిన భూమిలకు పోనీకి నీకెంత ధైర్యం?"

నాన్న బదులు చెప్తూ, "కష్టపడి సంపాదించేటోనికి.. తిని కూసునేటోనికి సమానంగ బంచుతె నడుత్తదా..? పట్నంల బొచ్చెడు మంది దగ్గర బొచ్చెడు పైసల్ ఉన్నై! గవన్ని గూడ పంచుతర మరి?........" కొంరన్న మధ్యలోనే ఆపి "ఎమో బాగ మాట్లాడుతనవూ? బైటికి పా జెండా గద్దె కాడికి. ..అక్కడ మాట్లాడదం పా..!" అంటూ నాన్నని బయటకు తీసుకుపోతున్నారు.

అమ్మ ఏడుస్తూ, "అన్నా!. నేను జెప్పుకుంట అన్న.. ఆయనతోటి ! ఈ ఒక్కసారికి వొదిలేయ్రన్నా... మేమే ఏడికైన బోయి బతుకుతుకమన్న!.. ముగ్గురు పిలగాండ్లు , నేను దిక్కులేనోల్లం అయిపోతమన్నా..!" అంటూ కాళ్ళు పట్టుకొని బతిలాడుతోంది.. తనతో, ఇద్దరు చెల్లెళ్లతో దండాలు పెట్టిస్తోంది..

"లేదక్కా! ఏం జేయం గనీ.. కొంచెం మాట్లాడి పంపిత్తం.. గంతే.! మీరు లోపలికి పోండ్రి!" అంటూ నాన్నని బయటకు తీసుకెళ్లారు ఐదుగురు కలిసి.

అన్నలు.. జెండా గద్దె కాడ నాన్నను కాల్చి చంపేసి... "ఎవరు ఎదురు తిరిగినా గిదే గతి..." అంటూ హెచ్చరించారన్న మాట విని అమ్మ కుప్పకూలిపోయింది.

నాన్న కాష్టం చుట్టు తిరుగుతూ..ఆ ఐదుగురినీ చంపేదాక తల వెంట్రికలు, గడ్డం తీయనని బాబాయ్ శపథం జేసినట్టు ఊరంతా అనుకున్నారు. అదే రోజు ఆ విషయం అమ్మకు తెలిసి.. బాబాయిని గుంజుకొచ్చి.. వాళ్ళ జోలికి అసలే పోనని పిల్లలందరి మీద ప్రమాణం చేయమని పట్టుబట్టింది ఏడుస్తూనే! బాబాయి పెద్ద పెద్ద బొట్లు పెట్టుకొని ఊగిపోతున్నాడు.. ఎవరికీ ఆగట్లేదు! చివరికి అమ్మే.. బాబాయి రెండుకాళ్ళ మీదపడి ఏడుస్తూ బ్రతిలాడడంతో.. పిల్లలందరి మీదా ఒట్టు వేశాడు, 'అన్నల జోలికి వెళ్లనని'! ఇది చాలామంది చూడడంతో.. ఊర్లో అందరికీ ఈ విషయం తెలిసింది!

ఆ తర్వాత కొన్నిరోజులకు..మేనమామ వచ్చి అమ్మను,తనను,చెల్లెళ్లను తనతో పాటు వాళ్ళ ఊరికి తీసుకుపోయి తన ఇంట్లోనే ఉంచుకొన్నాడు. ఎన్నేండ్ల పాటు ఏడ్చి ఏడ్చి అమ్మ గొంతు బొంగురు పోయిందో..!

ఓ నాలుగేళ్ల తర్వాత.. ఓ రోజు పేపరులో చూశాడు.. కొంరన్న దళంలో అందరూ..ఊరి చెరువుగట్టు మీద పోలీసుల ఎన్ కౌంటర్లో చనిపోయారు. కానీ కొంరన్న తప్పించుకున్నాడు.

అదే రోజు మామయ్య అమ్మతో మాట్లాడుతుండగా విన్నాడు. "అక్కా! పోలీసులల్ల ఓ పెద్ద చెయ్యికి, లచ్చ రూపాయలిచ్చినం గదా! ఎంకౌంటర్ల అందర్ని లేపేశిన్రు గని...ఒక్కడు..అసలోడే.. తప్పిచ్చుకున్నడట...ఇంకా వెతుకుతాన్రట.. కానీ వాని ఫోటువ ఎవరి దగ్గర లేదట! ఎట్లుంటడో .. ఎక్కడుంటాడో గూడ తెల్వదట! ఏడిదాంక బోతడో సూద్దాం..!"

కొన్నేళ్ళకు చెల్లెళ్ళపెళ్లిళ్లు చెయ్యటం..తాను ఎం.బి.బి.స్, ఎం.డి చదివి..అమెరికాకు వచ్చి స్థిరపడటం, మంచి డాక్టరుగా పేరు తెచ్చుకోటం, అమ్మకు కూడా గ్రీన్ కార్డు రావటంతో తమతో పాటే ఉండటం.. అన్నీ మననం చేసుకుంటుండగ ఇంతలోనే హాస్పిటల్ నుంచి ఫోను..ఒక ఎమర్జెన్సీ కేసు కోసం వెంటనే రావాలని..

కారేసుకొని బయలుదేరి హాస్పిటల్ వెళ్ళాడు. ఎమర్జెన్సీ రూము బయట ఓ కుర్రాడు కూర్చొనున్నాడు. ముప్పై ఏళ్ళు ఉంటాయేమో.. తెలుగోని లాగే ఉన్నాడు.. చూడగానే లేచి నిల్చున్నాడు. పక్కనే అతని తల్లి అనుకుంటా..చేతులు జోడిస్తోంది కాపాడమన్నట్టుగా.

బహుశా పేషంటు...కుర్రోని తండ్రి అయి ఉంటాడని అనుకున్నాడు. డ్యూటీ నర్సు ఇచ్చిన ఫారంలో పేషంటు పేరు "నాగేశ్వర్ రావు" వయసు డెబ్భై ఐదు సంవత్సరాలు, చిరునామా వైజాగ్ అని ఉంది.

రెండుగంటల శ్రమ తర్వాత పేషంటు స్పృహలోకి వచ్చాడు. కళ్ళు తెరుచి నెమ్మదిగా మాట్లాడుతున్నాడు. ఇక బయటకొచ్చి "ఏం పర్లేదు! ఇప్పుడిక అంతా బాగానే ఉంది. ఇపుడు మాట్లాడుతున్నాడు. రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేయొచ్చు! మీరు కూడా లోపలికొచ్చి చూడొచ్చు." అంటూ కుర్రోణ్ణి, వాళ్ళ అమ్మను ఎమర్జెన్సీ రూము లోపలికి తీసుకెళ్లాడు.

ఓ అరగంట అక్కడే ఉన్న తర్వాత, " నేనిక వెళ్తాను. నర్సు, డ్యూటీ డాక్టరు వాళ్ళు చూసుకుంటారు, అవసరమైతే నన్ను పిలుస్తారు..నౌ హి ఈజ్ ఫైన్.." అంటూ బయటకు నడుస్తుండగా.. వాళ్ళ అమ్మ దండాలు పెడుతూనే ఉంది.

బయటకెళ్ళడానికి డోరు తెరిచేటప్పుడు ఓసారి పిలిచాడు. "కొంరన్నా..!"... ఆ పిలుపు విన్నాక తలతిప్పి తననే చూస్తున్నాడు పేషంటు! కుర్రోనికి, వాళ్ళ అమ్మకు ఏమీ అర్థం కాలేదు!

ముప్పైఏళ్ళ కింద ఆరోజు రాత్రి చూసిన అతని ముఖం. అమ్మ,తనూ,చెల్లెళ్ళు దండాలు పెడుతూ చూసినప్పటి ముఖం..ఇప్పుడు కొంత మారిపోయినా, ఆపరేషను చేస్తున్నపుడు తనకొచ్చిన అనుమానం ఇప్పుడు నిజమైంది!

తిరిగి కారులో ఇంటికి బయలుదేరాడు. కారు స్పీకరులో పరమాత్ముని శ్లోకం.. "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన..మా కర్మఫలహేతుర్భూః మాతే సంగోస్త్వకర్మణి.." శ్రావ్యంగా ఘంటశాల గొంతులో మోగుతోంటే, తన్మయత్వంతో రెండు కన్నీటి చుక్కలు రాలాయి.

ఇంటికొచ్చి స్నానం చేసి టి.వి ముందు సోఫాలో కూర్చున్నాడు. అమ్మ వచ్చి పక్కనే కూర్చున్నది. "రేపు మీ నాన మాష్కం గద బిడ్డా.. మీ బాబాయి ఫోన్ జేసి మాట్లాడిండు. నీ పేరు మీద భూమి పాసుబుక్కులు తెప్పిచ్చిండట. ఇంకేదో కౌల విషయం గూడ మాట్లాడాలన్నాడు.

మీ మావయ్య గూడ ఫోన్ జేసిండు. ఆ ఎన్ కౌంటర్ల దప్పిచ్చుకున్నోడు ఏడికి బోయిండో, వాళ్ళ ఊరోళ్లకు , వాళ్ళ సుట్టాలకు గూడ తెల్వదట.. ఒక్కసారి గూడ ఊళ్ళెకు రాలేదట.. వాళ్ళ అవ్వ, అయ్య సచ్చినప్పుడు గూడ ఊళ్ళెకు రాలేదట.. ఏడికి పారిపోయిండో... ఎంతెతికినా దొరకకపాయె! అనుకుంట బాధపడ్డడు...." కన్నీళ్లను కొంగుతో అద్దుకుంటూ చెప్పుకుంటూ పోతోంది.

అమ్మ చెప్తున్నదంతా వినీ.. విననట్టుగానే, టి.వి.చూస్తుండిపోయాడా... 'నిష్కామ కర్మయోగి'!

***

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

## "మిలియన్ డాలర్ బేరం"

శర్మ దంతుర్తి (Elizabethtown, KY)

**మిన్నియాపోలిస్** డౌన్ టౌన్ ఆఫీసులో మీటింగ్. వచ్చే నెలలో ఇండియా వెళ్ళడానికి పర్మిషన్, తాను ఆఫీసులో లేనప్పుడు తన పని ఎవరు చేస్తారో వగైరా అన్నీ మాట్లాడ్డం అయ్యాక వెనక్కి వస్తున్నప్పుడు తన క్యూబ్ లో డెస్క్ మీద ఫోన్ మోగడం గమనించి ఎత్తి చెప్పాడు గంగాధరం "గంగా హియర్."

“ఇది అమెజాన్ ఆఫీసునుంచి చేసే ఫోను. మీ అమెజాన్ ప్రైమ్ అకౌంట్ ఎవరో హాక్ చేసినట్టు మాకు సమాచారం అందింది. అది సరి చేయకపోతే మీకే నష్టం. దాని గురించి ఇప్పుడు మాట్లాడ్డం కుదురుతుందా లేకపోతే కాసేపు ఉండి చేయమంటారా?”

గంగాధరానికి చటుక్కున నవ్వు వచ్చింది. తనకి ప్రైమ్ అకౌంట్ ఉన్న మాట నిజమే కానీ దానికీ ఇప్పుడు వచ్చిన ఈ ఆఫీసు ఫోను నెంబర్ కీ ఏమీ సంబంధం లేదు. మట్లాడేవాడి యాస చూస్తే ఇండియన్ అని తెలుస్తోంది. అమెజాన్ ప్రతీసారీ తమకి చెప్పే విషయం – వాళ్ళెప్పుడూ ఇలా ఫోన్ చేసి అకౌంట్ గురించి అడగరు. ఈ ఫోనులన్నీ వచ్చేవి హాకర్స్ దగ్గిరనుంచి. అదీ వీళ్ళుండేది హైద్రాబాద్, గుర్గాం, ఢిల్లీ అనే ఇండియన్ సిటీలనుంచి. అవతల కుర్రాడు మాట్లాడుతూంటే రాబోయే నవ్వు నొక్కి పెట్టి చెప్పేడు గంగాధరం, “కుదురుతుంది కానీ నేను మీతో మాట్లాడను. నా అకౌంట్ నిజంగా హేక్ చేసినట్టు నాకూ తెల్సింది నిన్ననే; మీ మేనేజర్ ఉంటే ఆయన్ని పిలవండి. ఓ అరగంట పోయాక ఈ ప్రైవేట్ సెల్ ఫోన్ నెంబర్ కి చేస్తే చెప్తా. ఇష్టం లేకపోతే సరే.”

“తప్పకుండా చేస్తామండి. మా మానేజర్ చేస్తాడు.”

“ఆయన పేరేమిటో చెప్పండి, నేను సిద్ధంగా ఉంటా ఆయన చేసే కాల్ కోసం.”

“మేనేజర్లు ఓ పాతిక మంది ఉన్నారు, ఎవరికి ఖాళీ ఉంటే వాళ్ళే చేస్తారు. అందువల్ల పేరు చెప్పలేం. మీ పేరు గంగాధరం అని తెలుసు కనక ఎవరో ఒకరు అరగంటలోపులే చేస్తారు లెండి.”

“పోనీ నీ పేరు చెప్పవయ్యా, నువ్వు చూడబోతే నాకు మల్లే ఇండియన్ లాగే ఉన్నావు కదా మాటా అదీను. మనలో మనకేమిటి రహస్యం?”

“మాకు అసలు పేర్లు ఒకటీ కంపెనీలో మారుపేరు ఒకటీ ఉన్నాయండి. ఎవరైనా ఫోన్ చేస్తే, నా పేరు న్యూటన్. అదే పేరు చెప్పండి మేనేజర్ ఫోన్ చేసినప్పుడు. ఐడి అడిగితే 095745839.”

❦❦❦

“హలో, ఇది గంగాధరం గారేనాండీ?”

“అవును, చెప్పు ఏమిటి విశేషం?”

“మీ అమెజాన్ అకౌంట్ హాక్ చేసారు అని మా కుర్రాడు న్యూటన్ చెప్పాడు కదా, దాని గురించి మీరు మేనేజర్ తో మాట్లాడతానన్నార్ట. నేనే ఆ మేనేజర్ ని. పేరు జేమీ. మీ ఐడి ఇస్తే ఎప్పుడు హాక్ చేసారో అదీ చెప్పి మీ పాస్ వర్డ్ మారుస్తాను పాతది ఇస్తే.”

“గొప్పపని చేస్తావుగానీ, కొంతకాలం క్రితం ఇన్ కం టేక్స్ వాళ్ళమని చెప్పుకుంటూ ఫోన్ చేసేవారు ఇప్పుడేమో అమెజాన్ అని మొదలెట్టారా? ఈ మోసం తెలిసిపోతోంది, ఇది పనిచేసేది కాదు కానీ నేను మరో డబ్బులొచ్చే మార్గం చెప్తాను ఇష్టమైతే చెప్పు.”

“నేను నిజంగా అమెజాన్ నుంచి ఫోన్ చేస్తున్నానండీ. అలా అంటారేమిటి సార్?”

“నువ్వు అమెజాన్ నుంచి చేయట్లేదని తెలుస్తూనే ఉంది. చల్లకొచ్చి ముంత దాచడం ఎందుకోయ్, నేను చెప్పినట్టు చేస్తే మిలియన్ డాలర్లు సంపాదించవచ్చు. చేస్తావా లేదా? ఇష్టం లేకపోతే నాకు బోల్డు మందున్నారు పని చేయడానికి.”

మిలియన్ డాలర్లనేసరికి నోరూరిన మేనేజర్ అడిగేడు, “ఏం చేయాలండి దీనికి?”

“మామూలు పనే. ఫోను మీద కూర్చోవడం నేనిచ్చే నెంబర్లన్నీ పిలిచి మీకు ఫలానా యాభై డాలర్ల మాస్టర్ లేదా వీసా కార్డు గిఫ్ట్ పంపుతున్నాం. అది మీకు జేరాక దాన్ని ఏక్టివేట్ చేయడానికి ఇరవై డాలర్లు చెల్లించాలి. ఆ కార్డు ఎక్కడైనా వాడుకోవచ్చు. అని చెప్పి వాళ్ళ

ఎడ్రస్ సంపాదించాలి. అలా ఎడ్రస్ ఇచ్చిన వాళ్లకి ఓ చీప్ ప్లాస్టిక్ కార్డు పంపడం. అది జేరాక వాళ్ళు మనకో ఇరవై డాలర్లు వెబ్ సైట్ మీద చెల్లించాలి. అప్పుడు మీకు పంపిన కార్డు పనిచేస్తోందోహో అని ఓ మెసేజ్ పెట్టడమే."

"ఇరవై పుచ్చుకుని యాభై ఇవ్వడం నష్టం కాదా, ఏమిటి మీరు చెప్పొచ్చే లాభం ఇందులో?" మేనేజర్ అడిగేడు కాస్త అసహనంగా.

గంగాధరం పెళ్ళున నవ్వేడు, "ఇరవై పుచ్చుకుని వెబ్ సైట్ మీద మీకు పంపిన కార్డులో యాభై ఉంది అని మెసేజ్ పెడతాం, అంతవరకే. నిజంగా యాభై ఎవరు ఇస్తారు? ఆ కార్డు వాళ్ళు పట్టుకుని ఎక్కడో ప్రయత్నం చేస్తారు. అది పనిచేస్తే కదా? అప్పటికి మీ ఇరవై మీకు వచ్చేస్తాయి."

"పనిచేయకపోతే మళ్ళీ మాకు ఫోన్ చేసి అడగరా?"

"ఫోన్ చేసి అడిగితే వెయిట్ చేయమని కూర్చోబెట్టడం, ఓ ఇరవై నిముషాల తర్వాత ఎవరూ సమాధానం చెప్పకుండా క్లిక్ మనిపించడమూను. రెండుమూడు సార్లు చేసి గొణుక్కుంటారు, అది కూడా చెప్పాలా?"

"యాభై ఎందుకు పంపుతున్నారు అని అడిగితే?"

"మేము కొత్తగా పెట్టే ఇంటర్నెట్ కంపెనీకి ప్రమోషన్ కోసం అలా పంపుతున్నాం. మాకు ప్రకటనలు ఇచ్చే పెద్ద పెద్ద కంపెనీలు డబ్బులిస్తారు; మీరు ఫలానా ఝూడీగా అని తెలియడానికి ఎడ్రస్ ఇరవై ఇవ్వాలని చెప్పండి. ఆ ఎడ్రస్ కి మీకు డిస్కౌంట్ కూపాన్ లు కూడా పంపుతారు; మీకు ఇందులో పోయేదేమీ లేదు, కావాలిస్తే ఈ ఫేసు బుక్కు పేజీ చూసుకోండి అని కూడా చెప్పండి. పనిలో పనిగా ఓ ఫేసుబుక్కు పేజీ తయారు చేసి ఉంచండి. ఆ మాత్రం చిన్న చిన్న విషయాలు గ్రహించలేరా?"

"ఇందులో మీరు మాకు చేసే సహాయం ఏమిటి?"

"నేను ఎవరికి ఫోన్ చేయాలో చెప్తాను. నేనిచ్చే పేర్లూ, ఫోన్ నెంబర్లూ మీదగ్గిర ప్రస్తుతం ఉన్న అల్లాటప్పా జనాలవి కాదు; బాగా ఈజీగా బుట్టలో పడే అమెరికా జనాలవి. అందువల్ల మీకు ఆదాయం గారంటీ. ఇలా పంపినందుకు నా వాటా ఇరవై శాతం. ఇష్టం ఉంటే మిగతా విషయాలు మాట్లాడదాం."

"ఎన్ని నెంబర్లు ఉన్నాయండి మీ దగ్గిర మాకు ఇవ్వడానికి?"

"లక్ష నుండి మూడు లక్షల దాకా ఉన్నై. ఇరవై శాతం వాటాకి లక్ష, ఎక్కువ కావాలంటే ముప్పై శాతం వాటా. ఇదంతా మనం మనం కాయితం మీద ఎగ్రిమెంటు రాసుకోవాలి. ఇష్టమైతే చెప్పండి."

"ఫోన్ చేసిన అందరూ ఒప్పుకోరు కదా ఇటువంటివి?"

"అందుకేనయ్యా రెండు లక్షల నెంబర్లు తీసుకోండి. సగం మంది ఒప్పుకున్నా డబ్బులొచ్చేస్తాయి కదా?"

"ఇది మా ఓనర్ తో మాట్లాడి చెప్పాలండి. రెండు రోజులు టైమ్ ఇవ్వగలరా?"

"నేను వచ్చేనెల ఇండియా వస్తున్నాను నాలుగో తారీఖుకి. అప్పుడు మనందరం కలుసుకోవడం కుదురుతుందా? అప్పట్లోగా కనుక్కుని చెప్పండి."

నాలుగు రోజులు పోయేక ఫోనొచ్చింది గంగాధరానికి. న్యూటన్ పనిచేసే కంపెనీ నుంచి; వాళ్లకి ఇష్టమే. వాళ్ళుండేది ఢిల్లీ దగ్గిర ఒక చిన్న ఊరిలో. గంగాధరం కనక ఇండియా వచ్చినప్పుడు ఢిల్లీ వస్తే అన్నీ తీరిగ్గా మాట్లాడుకోవచ్చు. అయితే గంగాధరానికి దారి ఖర్చులు

మాత్రం ఇచ్చుకోలేరు ప్రస్తుతానికి. గంగాధరం చెప్పేడు, "ఏం ఫర్లేదు, నేను పెట్టుకుంటాను దారి ఖర్చులు. బిజినెస్ లో ఆ మాత్రం పెట్టుబడి పెట్టాలి కదా నా వంతు?"

తర్వాత వాళ్ళిచ్చిన ఈమెయిల్ కి గంగాధరం తాను ఇండియా వచ్చే తేదీ అవీ పంపించి తన సూపర్వైజర్ గదిలోకి నడిచాడు ఈ విషయం మాట్లాడ్డానికి. ఉపోద్ఘాతం అదీ లేకుండా చెప్పిన విషయం ఏమిటంటే – గంగాధరానికి ఇండియా వెళ్ళేటపుడు ఓ నకిలీ బేంక్ ఎకౌంట్, అందులో డబ్బులున్నట్టు ఓ కాయితం, తన ఫోటో పెట్టి నకిలీ పేరుతో ఓ పాస్ పోర్టు, వగైరాలు కావాలి. ఈ ఢిల్లీ కుర్రాళ్లతో మాట్లాడ్డానికీ, ఎగ్రిమెంట్ అదీ కుదుర్చుకోవడానికీను.

సూపర్ వైజర్ గంగాధరం చెప్పినవన్నీ విన్నాక అతనికి ఇండియా వెళ్ళడానికి దారి ఖర్చులు ఎలాగా ఇవ్వక్కర్లేదని తెలిసి ఈ బేంక్ కాయితాలు, నకిలీ పాస్ పార్ట్ తయారు చేయించాడు; వీటికన్నింటికీ మరో మూడు రోజులు పట్టింది. ఇండియా వెళ్ళడానికి తన స్వంత పాస్ పోర్టు వాడతాడు గంగాధరం. అక్కడ ఢిల్లీలో ఈ నకిలీ పాస్ పోర్టూ, బేంక్ లో డబ్బులున్నట్టు నకిలీ కాయితాలు హేకర్ కంపెనీకి చూపించి బిజినెస్సులోకి దించడానికి పనికొస్తాయి.

హైద్రాబాదులో దిగిన గంగాధరం రెండ్రోజులు ఆగి ఢిల్లీ కుర్రాళ్ళకి ఫోన్ చేసాడు ఢిల్లీ వస్తున్నట్టూ, ఫలానా రోజున ఫలానా హొటల్లో కల్సుకుంటారు ఎవరికీ అనుమానం రాకుండా. ఢిల్లీ వెళ్ళిన గంగాధరం హేకర్స్ ని కలిసాక ఓ ఎగ్రిమెంటు కాయితం తీసాడు చూపించడానికి. ఈ కాయితం చూసిన అటు వైపు కంపెనీ కాస్త కంగారు పడింది. ఈ ఎగ్రిమెంట్ అంటూ తమకి చూపించిన కాయితంలో ఆయన పేరు గంగాధరం అని లేదు. ఎవరో సుధీర్ గొల్లపూడి అని ఉంది. ఆ విషయం అడిగినప్పుడు గంగాధరం చెప్పాడు, "మొదటగా చెప్పాల్సిన విషయం, నా అసలు పేరు గంగాధరం కాదు. అమెరికాలో ఫోన్ అలా గంగాధరం అనే రెండో పేరుతో రిజిస్ట్రేషన్ చేసి పెట్టాను, లేకపోతే ఏదైనా పీకల మీదకి వస్తే లా అండ్ ఆర్డర్ తో తంటా కదా? అసలు పేరు సుధీర్ గొల్లపూడి; దానికి ప్రూఫ్ కావాలంటే ఇదిగో పాస్ పోర్టు, బేంక్ ఎకౌంట్ ఉన్న కాయితం," నకిలీ అమెరికన్ పాస్ పోర్టు, బేంక్ కాయితాలు బయటకి తీసి చూపించేడు గంగా.

రెండో విషయం, ఈ సుధీర్ గొల్లపూడి అనే పేరూ, బేంక్ ఎకౌంట్, ఇంటి ఎడ్రస్సూ ఉన్న సరైన చోటూ అన్నీ కావాలిస్తే గూగిల్ మీద వెతికి చూసుకోవచ్చు. మొత్తానికి చెప్పేది ఏమిటంటే అవతల కంపెనీ వారు – గంగాధరం వాళ్ళకి ఇచ్చినట్టుగానే – వాళ్ళ ఎడ్రస్, వాళ్ళు తనకి ఇవ్వబోయే డబ్బులు ఏ బేంక్ ద్వారా ఇస్తారో దాని పేరు, బేంక్ వివరాలు, సంతకం పెట్టిన ఎగ్రిమెంటూ ఇవ్వకుండా గంగాధరం మిగతా డిటైల్స్ ఇవ్వడు. అలా అన్ని కాయితాలూ చేతిలోకి రాకుండా మిగతావన్నీ ఇచ్చేస్తే వాళ్ళు గంగాధరానికి టోకరా ఇవ్వొచ్చు కదా?

ఓ రెండు గంటలు వాదోపవాదాలతో అటూ ఇటూ గింజుకున్నాక, గూగిల్ మీద ఎడ్రస్ అదీ వెరిఫై చేసుకుని గంగాధరం కూడా తమలాంటివాడే అని పూర్తిగా నిర్ధారించుకున్నాక అవతల కంపెనీ తమ ఎడ్రస్సూ బేంక్ పేరూ అవీ కూడా గంగాధరానికి ఇచ్చారు. అయితే ఎగ్రిమెంటూ అవీ మర్నాడు మధ్యాహ్నానికి సంతకం పెడతారుట; ఏవో వివరాలు కనుక్కున్నాక. మిలయన్ డాలర్లు ఎవరికి చేదు? అయితే ఈ మీటింగ్ జరిగినంతసేపూ గంగాధరం హైద్రాబాదులో కొన్న చిన్న సైజు చవకరకం రెండో సెల్ ఫోన్ తన జేబులో ఉంచుకుని ఈ మీటింగ్ సంబంధించిన అందరూ మాట్లాడే మాటలన్నీ రికార్డ్ చేసాడని ఆ కంపెనీకి తెలియలేదు. హొటల్లో మీటింగ్ అంటే ఈజీ అనుకోవడం సహజం కదా? అదీగాక వచ్చినవాడు అమెరికన్ పాస్ పోర్టు, బేంకు కాయితాలూ చూపిస్తూంటే ఇంకా ఏమిటి సందేహం? కానీ ఈ ఎగ్రిమెంట్ మీద హేకర్ కంపెనీ సంతకం చేసేదాకా గంగాధరం ఢిల్లీలో మరో రెండు రోజులు ఉండాల్సి వచ్చింది.

ఆ రెండు రోజులనీ గంగాధరం మరో విధంగా వాడుకున్నాడు.

వాళ్ళు సుధీర్ గొల్లపూడి అనే మనిషి వివరాలు వాళ్లకి తోచిన విధంగా ఇంటర్నెట్ మీదా మరోచోటా వెతికి చూసుకుంటూంటే గంగాధరం వాళ్ళని వదిలేసి, వాళ్ళ కంపెనీని, వాళ్లకున్న బేంక్ ఎకౌంట్లనీ తనిఖీ చేయడానికి బయల్దేరాడు. అయితే ఈ కంపెనీ వివరాలు, ఎడ్రస్సూ అవీ గూగిల్ మీద చూడ్డం అంత సులభంగా దొరకలేదు అనుకున్నట్టుగానే. తర్వాత పని ఆ కంపెనీ వారు ఇచ్చిన బేంక్ కి ఫోన్ చేసి ఎకౌంట్ వివరాలు కనుక్కోవడం; ఈ బేంక్ విషయాలు కూడా అంత తొందరగా అడిగిన అందరికీ ఇచ్చేయరు కనక కొంతమంది హితులకీ, స్నేహితులకీ, తెలుసున్న గవర్నమెంట్ అధికారులతో, బేంక్ మేనేజర్లకి ఫోన్లు కొట్టించాల్సి వచ్చింది. మొత్తానికి హేకర్ కంపెనీకి బేంకులో ఎకౌంట్ ఎవరి పేరు మీద ఉందీ, ఎడ్రస్సూ, ఫోటో ఐడితో సహా బేంక్ వారి దగ్గిర్నుంచి సంపాదించాడు. అలా తెల్సిన విషయాల ప్రకారం ఆ కంపెనీ బేంక్ ఎకౌంట్ కొత్తగా ఓపెన్ చేసారు ఈ ఏడాదిలోనే. ఎకౌంట్ ఓనర్ గారి పేరు గంగాధరం మొదట విన్నదే – న్యూటన్. తాను అమెరికాలో నకిలీ పేరుతో పాస్ పోర్టు, బేంక్ అకౌంట్లు ఓపెన్ చేసినట్టూ ఈ కంపెనీ కూడా వేరు పేరుతో తనతో నాటకం ఆడడానికి తయారౌతోందని తెలిసి గంగాధరం నవ్వుకున్నాడు.

ఈ రెండు రోజుల్లో అనేకసార్లు గంగాధరం చెప్పిన విషయాలన్నీ సరిగ్గా చూసి, ఇండియాలోనూ, అమెరికాలోనూ తెలుసున్న వాళ్లకీ ఫోన్లు కొట్టి, ఇంటర్నెట్లో, గూగిల్ మీదా వెరిఫై చేసుకుని, అతను చూపించిన అతని పాస్ పోర్ట్, బేంక్ కాయితాలూ కాపీలు తీసుకున్నాక ఇంక సందేహాలన్నీ కట్టిపెట్టి హేకర్ కంపెనీ గంగా అడిగిన బిజినెస్ డీల్ ప్రకారం చేయబోయే ప్రతీ విషయం సరిగ్గా రాసారు ఎగ్రిమెంటులో. యాభై డాలర్లకి ఎర, ఒక ఫేసుబుక్కు పేజీ తయారు చేయడం, కస్టమర్లు ఇరవై డాలర్లు ఇస్తే యాభై కి కార్డు పంపించడం, ఆ యాభై కార్డుని ఓ పనికిరాని వెబ్ సైట్ లో చూసుకోవడం వగైరా. ఈ కార్డులూ, ఫేసుబుక్కు పేజీ, వెబ్ సైటూ అవీ అవడానికి రెండు మూడు వారాలు పడుతుంది. అవన్నీ సిద్ధంగా ఉన్నట్టు మెయిల్ పంపగానే గంగాధరం – అదే సుధీర్ గొల్లపూడి, అక్కడ అమెరికానుంచి అన్నీ టెస్ట్ చేసి సరే అన్నాక ప్రోజక్ట్ మొదలౌతుంది. ఆ తర్వాత డబ్బులే డబ్బులు.

ఇరువైపువారూ సంతకం చేసిన కాయితాల కాపీ వాళ్ళకి ఒకటి ఇచ్చి, ఒకటి తన చేతిలోకి వచ్చాక గంగాధరం వాళ్ళు చేయాల్సిన పని చెప్పేడు, "ముందు కస్టమర్లకి పంపబోయే యాభై డాలర్ల కార్డులన్నీ సిద్ధం చేసుకోండి. కస్టమర్లని కంటాక్ట్ చేయడానికి మరో కొంతమంది సిబ్బంది అవసరం. వాళ్ళకి అమెరికన్ ఏక్సెంట్ లో మాట్లాడే భాష వచ్చి ఉండాలి," వగైరా వగైరా. అవన్నీ సిద్ధంగా ఉన్నాయని వార్త తనకి రాగానే గంగాధరం ఉరఫ్ సుధీర్ గొల్లపూడి తర్వాత మొదటి విడతగా యాభైవేల పేర్లూ, ఫోను నెంబర్లూ ఈమెయిల్లో పంపిస్తాడు.

ఢిల్లీ వదిలేసి హైద్రాబాద్ వచ్చేసిన గంగాధరం ఇండియాలో రెండువారాల శెలవు అయిపోయాక మిన్నియాపోలిస్ వచ్చి రంగంలోకి దిగేడు. అప్పటికే హేకర్ కంపెనీ వెబ్ సైటూ అన్నీ రడీగా ఉన్నై. తనకి హేకర్ కంపెనీ ముందే ఇచ్చిన ఒక జంక్ కార్డుతో వెబ్ సైటూ అవీ టెస్ట్ చేసాడు. అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఇంక మిగిలినది హేకర్ కంపెనీకి గంగాధరం ఫోను నెంబర్లు పంపడం ఒకటే.

ఇంత జరిగాక తాను సేకరించిన వివరాలనన్నింటినీ ఫైల్లో పెట్టి గంగాధరం తన బాసు గదిలోకి నడిచేడు. తర్వాత గంట మీటింగులో గంగాధరం చెప్పినదంతా విని బాసు నోరు వెళ్లబెట్టాడు. వెంటనే ఓ అరడజను ఫోన్లు కొట్టి ఏం చేయాలో అవతల పార్టీలకి చెప్పాక ఆయన గంగాధరంతో చెప్పేడు "ఇది కనక మనం అనుకున్నట్టూ అయితే నీ రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే. నువ్వు ఏమి అడిగినా ఇవ్వడానికి నేను సిద్ధం."

అన్నీ సిద్ధంగా ఉన్నాయని చెప్పిన వారం రోజులకి కూడా గంగాధరం దగ్గిర్నుంచి ఏమీ సమాధానం రాకపోయేసరికి కాస్త అనుమానం వచ్చి ఫోను మీద ఫోను కొట్టడం మొదలుపెట్టారు అటువైపునుంచి హాకర్ కంపెనీ వారు దేశం నుంచి. వాళ్లని కాస్త ఎగరనిచ్చాక

గంగాధరం చెప్పేడు, “నాకు జెట్ లాగ్ వల్ల వంట్లో బాగాలేక అలా ఆలస్యం అయింది, సోమవారం పొద్దున్నకి అన్నీ సిద్ధంగా ఉంచుకోండి. నేను ఈ అదివారం పొద్దున్నే – అంటే మీకు ఆదివారం రాత్రికి, అన్నీ పంపుతున్నాను. మనం మిలియన్లు సంపాదించబోతున్నాం.”

ఇండియాలో ఆదివారం రాత్రి న్యూటన్ కంప్యూటర్ దగ్గిర కాసుకుని కూర్చుని గంగా పంపించే మెయిల్ కోసం చూస్తున్నప్పుడు ఆయన ఇంటి తలుపు తట్టేరెవరో. ఆ తలుపు తట్టినాయన సుధీర్ గొల్లపూడి గారి తమ్ముడి బావమరిదిట. తాను సుధీర్ తాలూకా అని నమ్మడానికి ముందు హేకర్ కంపెనీ, గంగాధరం కలిపి రాసుకున్న ఎగ్రిమెంటు కాయితం కాపీ కూడా చూపించాడు. న్యూటన్ గారు పనిచేసే సదరు కంపెనీ ఫలానాయేనా, ఆయన పేరుమీద బేంక్ లో ఉన్న ఎకౌంట్ ఇదేనా, సుధీర్ గారు ఆదివారం ఈమెయిల్లో పంపిన ఫోను నెంబర్లూ అవీ వచ్చాయా లేదా కనుక్కోవడానికొచ్చేడుట.

న్యూటన్ గారు సుధీర్ గొల్లపూడి సంతకం చేసిన కాయితం చూసాక తన మేనేజర్ జేమీ కి ఫోన్ మీద వీడియో కాల్ చేసి కనుక్కున్నాడు ఇలా తన ఇంటికి వచ్చిన పెద్దమనిషికి ఈ వివరాలన్నీ ఇవ్వవచ్చో, కూడదో. వీడియో ఫోనులో లో వీళ్ళనిద్దర్నీ, ఎగ్రిమెంటు కాపీనీ చూసిన జేమీ గారు అన్నీ నిజమే, ఎగ్రిమెంటు మీద సంతకం అవీ తాము పెట్టినవే అని ధృవపరిచాడు. ఈ వీడియో కాల్ అయిపోయాక న్యూటన్ ఫోన్ ఆఫ్ చేసినప్పుడు వచ్చిన బావమరిది తన జేబులోంచి ఐడి బయటకి తీసి చూపించేడు.

సిబిఐ వారి డిటెక్టివ్ ట ఆ వచ్చినాయిన. గంగాధరం, ఆయన బాసూ పంపిస్తే ఇండియన్ గవర్నమెంట్ వారి తరుపున వచ్చేడు; ఈ కూపీ అంతా లాగడానికి. ఇంటి బయట ఏరియాలో ఓ మూడు జీపులనిండా పోలీసులూ మందీ మార్బలం రహస్యంగా దాక్కుని ఉన్నారు. వెర్రి వెర్రి వేషాలు వేస్తే అక్కడికక్కడే కాల్చడానికి ఆర్డర్లు ఉన్నై.

తర్వాత విషయాలు అతి మామూలుగా జరిగిపోయేయి, ఒకరిద్దరు రిపోర్టర్లూ, జర్నలిస్ట్ లు ఫోటోలు తీస్తుంటే. బేంక్ ఎకౌంట్ స్వంతదారు అయిన ఈ న్యూటన్ గారు ఇచ్చిన సమాధానాలని బట్టి ఆయనే మొదట్లో గంగాధరానికి ఫోన్ చేసిన మనిషి. ఆయన్ని పట్టుకుని, ఆయన పైవాళ్ళనీ, ఆ పైవాళ్ళనీ మొత్తం కంపెనీని మూడు రోజుల్లో పట్టుకున్నారు సిబిఐ వారు. దొరికిన ఆధారాల్లో యాభై డాలర్లకి ముద్రించిన గిఫ్ట్ కార్డులూ, అంతకుముందు అమెరికన్లకి ఫోన్ చేసి అమెజాన్ అకౌంట్ల గురించి మాట్లాడబోయే విషయాలు, దానికి రాసుకున్న ఎగ్రిమెంటూ, ఫేసుబుక్కులో పెట్టిన పేజీ వగైరాలు అన్నీ బయటకి లాగారు. వీటికి తోడు గంగాధరం వాళ్ళని ఢిల్లీలో కలిసినప్పుడు తన దగ్గిరున్న సెల్ ఫోనులో రికార్డ్ చేసిన సంభాషణ కూడా ఉంది. ఆదివారం రాత్రి ఇలా మొదలైన కథ బుధవారానికి సుఖాంతమైంది, ఓ పాతికమందిని జైల్లో పెట్టడం ద్వారా, వాళ్ల ఆస్తులు జప్తు చేయడం ద్వారా. ఇదంతా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న గంగాధరం ఆయన బాసూ నవ్వుకున్నారు.

మర్నాడు ఆఫీసుకెళ్ళిన గంగాధరాన్ని బాసు పిల్చి చెప్పేడు, “మొత్తానికి సాధించావోయ్, ఇటువంటి కేసులు తలనెప్పిగా తయారౌతున్నాయి ఈ మధ్యన. ఇప్పుడు చెప్పు ఏం కావాలి నీకు?”

“పెద్దవాణ్ణి అవుతున్నాను అదీగాక అసలే ఇండియా నుంచి వచ్చినవాణ్ణి ఈ మిన్నెసోటా రాష్ట్రంలో చలికి తట్టుకోలేకపోతున్నాం. ఫ్లోరిడాకి ట్రాన్స్ఫర్ ఇవ్వగలరా?” నవ్వుతూ అడిగేడు గంగాధరం.

“నాలుగు రోజుల క్రితమే వార్త పంపించారు ఎఫ్ బి ఐ హెడ్ ఆఫీసు వాషింగ్టన్ నుంచి. ఒర్లాండోలో కొత్తగా ఓ సైబర్ డివిజన్ ఓపెన్ చేస్తున్నాం. ఎవరైనా అక్కడకి వచ్చేవాళ్ళుంటే చూడండి అంటూ. ఈ కేసు సాల్వ్ చేసినందుకు నీకు ప్రమోషన్ మీద ట్రాన్స్ఫర్ ఇవ్వమని రికమెండ్ చేసి చెప్తాను. కానీ ఎప్పుడైనా నాకు నీ సహాయం కావాలిస్తే ఇక్కడకి వస్తూ ఉండాలి సుమా?” ఎఫ్ బి ఐ మిన్నెసోటా బ్రాంచ్ ఆఫీసు ఛీఫ్ చెప్పేడు.

"నేను ఎఫ్ బి ఐ లో చేరి నాలుగేళ్ళూ, అమెరికా వచ్చి ఇరవై ఏళ్ళూ అయింది. ఎప్పుడు ఇటువంటి కేస్ దొరుకుతుందా అని చూస్తూనే ఉన్నాను. నన్ను ఈ ఉచ్చులోకి లాగుదామని వాళ్ళే ఫోన్ చేసారు. అసలు వీళ్లకి అవతల ఫోన్ ఎత్తేది ఎవరూ అనే స్పృహ కూడా ఉన్నట్టు లేదు. కేసు ఇంత సులభంగా పూర్తి అవుతుందని అనుకోలేదు. ఎప్పుడైనా రెండు మూడు వారాలకి ఇక్కడకి రావడానికీ, మీకు సహాయం చేయడానికీ ఎటువంటి అభ్యంతరం లేదు. ప్రతీ ఏడూ నవంబర్ నుంచి ఏప్రిల్ దాకా పడే ముప్పై నలభై అంగుళాల మంచులో కూరుకుపోతూ అది తప్పుకోవడానికే పెద్ద ఇబ్బంది," నవ్వుతూ చెప్పేడు ఎఫ్ బి ఐ సైబర్ క్రైం స్పెషలిస్ట్ గంగాధరం.

గంగాధరం బాసు లేచి చేయి కలిపి నవ్వుతూ చెప్పేడు, "ఫ్లోరిడాలో ఆల్ ద బెస్ట్. నీకు ఏమి కావాల్సినా నేను ఉన్నానని మర్చిపోకు."

తొజాకలం: ఆ మధ్య ఫేసుబుక్కులో నారాయణస్వామి శంకగిరి గారు హేకర్స్ దగ్గర్నుంచి తనకో ఫోన్ కాల్ వచ్చిందనీ దానిని ఎలా డీల్ చేసారో హాస్యంగా చెప్పారు. దానిమీద కొంత డిస్కషన్ అవుతూంటే, నేను పనిచేసే సైబర్ సెక్యూరిటీ, దానికోసం పాస్ అయిన ఒక సర్టిఫికేషన్ (CISSP), దానిమీద రాసిన పుస్తకం (https://www.amazon.com/Tips-Tricks-Mastering-CISSP-Exam/dp/1484262247) అనేవన్నీ కలుపుకుంటే వచ్చిన ఆలోచనే ఈ కథకి ప్రేరణ.

****

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

## "శ్రీలక్ష్మి"

శ్యామలాదేవి దశిక (Monmouth Junction, New Jersey)

**హరిమూర్తికి** జీవితం ఒక్కసారిగా ఆగిపోయినట్టుంది. తన ఇల్లులాగే, మనసంతా ఖాళీగా బోసిగా ఉంది. ఏదో చెప్పలేని దిగులు, బాధా వాటివెనకాల తప్పు చేసానన్న పశ్చాత్తాపం హరిమూర్తిని వెంటాడుతున్నాయి. భార్య పోయిన దుఖం కన్నా ఆమె రాసిన ఉత్తరం హరిమూర్తి గుండెల్లో ఎక్కడో కలచివేస్తోంది. శ్రీలక్ష్మి చనిపోయిన తర్వాత గాని శ్రీలక్ష్మి విలువేమిటో..ఆమె చేసిన పనులేమిటో ...ఆమె ఎంతమందికి ఆత్మీయురాలో హరిమూర్తికి తెలిసి రాలేదు. నలభై ఐదేళ్ళ దాంపత్య జీవితంలో శ్రీలక్ష్మి ఎన్నడూ భర్తకు ఎదురుచెప్పలేదు. ఎప్పుడూ హరిమూర్తి మాటే చెల్లేది. అడగవలసిన అవసరం లేకుండా అతనికి కావాల్సినవన్నీ అమరుస్తూ, అతన్ని మౌనంగా భరిస్తూ శ్రీలక్ష్మి తనకు ఇష్టమైన ప్రపంచాన్ని సృష్టించుకుని, ఆ ప్రపంచంలో తనదంటూ ఓ ముద్రవేసి వెళ్ళింది.

ఏడాది కిందట మైల్డ్ గా హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు శ్రీలక్ష్మి విషయంలో కాస్త శ్రద్ధ తీసుకుని బుద్ధిగా ఉన్నా, ఆ తర్వాత ఆమె కోలుకుని మాములుగా తిరుగుతుంటే హరిమూర్తి తన బాధ్యత తీరిపోయిందనుకుని మళ్ళీ మామూలు

అయిపోయాడు. కానీ ఇంత త్వరగా తనని వదిలి వెళ్లిపోతుందని ఊహించలేదు. రాత్రి ఎంతో పొద్దుపోతే కాని నిద్రపోని హరిమూర్తి... అలాగే బారెడు పొద్దెక్కితే కాని నిద్ర లేవని హరిమూర్తి ఆరోజు కూడా తన మామూలు టైముకు లేచి కిందకొచ్చాడు. కిందకు రాగానే వంటింట్లో నుంచి వంట తాలూకు కమ్మని వాసనలు, పూజ గదిలోనుంచి వచ్చే అగరుబత్తి పరిమళం హరిమూర్తికి బాగా అలవాటు. అటువంటిది ఆ రోజు ఏ వాసనలు, ఎటువంటి అలికిడి లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది హరిమూర్తికి. శ్రీలక్ష్మి కోసం లివింగ్ రూములో...అక్కడ కనిపించక టీవీ రూములో...అక్కడా లేకపోవడంతో ఏ మొక్కలమధ్యో ఉండి ఉంటుందని బ్యాక్ యార్డ్ లోకి వెళ్ళి చూసాడు. శ్రీలక్ష్మి కారు గరాజ్ లోనే ఉండటంతో, పైన ఏ గదిలోనో కూర్చుని ఫోన్ లో పుట్టింటి వాళ్ళతో కబుర్లు పెట్టుకుని ఉంటుందని పైకి వచ్చాడు హరి మూర్తి. పైన ఉన్న గదులన్నీ వెతుకుతూ చివరకు భార్య తరచు పడుకునే బెడ్ రూము తలుపు తెరిచాడు. అర్ధరాత్రి దాకా టీవీ చూసే భర్తని ఏమి అనలేక పక్కగదిలోకి వెళ్ళి పడుకోటం శ్రీలక్ష్మి కి మామూలే. తొమ్మిది గంటలైనా భార్య ఇంకా పక్కమీదే ఉండటం చూసి హరిమూర్తి ఆశ్చర్యపోతూ దగ్గరకు వెళ్ళాడు. చదువుతున్న పుస్తకం పక్కనే ఉండటంతో రాత్రంతా చదువుతూ ఏ తెల్లవారుజామునో పడుకుని ఉంటుందనుకున్నాడు. "సరే...పడుకోనీలే" అని ఒక క్షణం అనిపించింది కానీ, లేవగానే కాఫీ తాగందే హరిమూర్తికి అడుగు ముందుకు పడదు. పోనీ కిచన్ లోకి వెళ్ళి చేసుకుందామా అంటే చేతకాదు. అందులో నిన్న రాత్రి కాస్త మందు ఎక్కువైందేమో, తలంతా దిమ్ముగా ఉంది. పైగా ఈ రోజు ముఖ్యమైన క్లయింటుని కలవాలి. శ్రీలక్ష్మి ఇచ్చే కమ్మటి స్ట్రాంగ్ కాఫీ పడితేగాని "హేన్ గోవర్" తాలూకు తలనొప్పి పోదు. అందుకే భార్యను లేపటానికే నిశ్చయించుకున్నాడు. ఆమెను తాకి తట్టి లేపుతున్నప్పుడు చేతికి చల్లగా మంచుముద్దలా అనిపించి హరిమూర్తి షాక్ తిన్నాడు. ఒక్క క్షణం అతని మనస్సు స్తంభించి పోయింది.

సదా తన మనసెరిగి ప్రవర్తిస్తూ తన అలవాట్లను..తన బలహీనతల్ని..తన అహంకారాన్నీ..దురుసుతనాన్నీ భరిస్తూ వచ్చిన శ్రీలక్ష్మి , తనను వదిలి వెళ్ళిపోయి అప్పుడే పన్నెండు రోజులైంది అంటే హరిమూర్తి కి నమ్మశక్యంగా లేదు. శ్రీలక్ష్మి ఇక లేదు అన్న సత్యాన్ని, ఆమె సంపాదించుకున్న పేరును ఈ రెంటిని హరిమూర్తి జీర్ణించుకోలేక పోతున్నాడు. ఫ్యూనరల్ టైములో శ్రీలక్ష్మి పట్ల అందరూ చూపించిన గౌరవం, ప్రేమ, దుఖం చూసి అతను ఆశ్చర్యపోయాడు. ఎప్పుడు చూసినా వంట చేసుకుంటూ..పుస్తకాలు చదువుకుంటూ....మొక్కలమధ్య తిరుగుతూ....అల్లుకుంటూ...ఫోనులో మాట్లాడుతూ కనిపించే శ్రీలక్ష్మి కి ఇంతమంది తెలుసునని, ఆమెకు ఇంత బలగం ఉందని హరిమూర్తికి అప్పుడే తెలిసింది. ఇంట్లో అందరి అవసరాలు చూసాక అక్కడికీ ఇక్కడికీ వెళ్తుందని తెలుసు గాని, ఇన్నేళ్ళుగా సమాజానికి ఆమె ఎన్నో రకాలుగా సేవ చేస్తోందన్న విషయం శ్రీలక్ష్మి పోయిన తర్వాత గాని హరిమూర్తికి తెలీలేదు. ఎందుకంటే హరి మూర్తికి ఎప్పుడూ బిజినెస్..డబ్బు సంపాదన...డిన్నర్లు..క్లబ్బులు ముఖ్యం కనుక.

శ్రీలక్ష్మి కి “భర్తగా” ఆమె కనివిని ఎరుగని జీవితాన్ని, హోదాని ఇచ్చానని గర్వపడే హరిమూర్తి ఆమెను పోగొట్టుకున్న రోజున తెలుసుకున్నాడు శ్రీలక్ష్మి కి బయట ఎంత గుర్తింపు, పేరు ఉందో. ఎంతోమంది ఫోన్లు చేసి, ఈ మెయిల్స్ పంపించి ఆమె హటాత్ మరణానికి విచారం వ్యక్తం చేస్తూ తనకు తెలియని శ్రీలక్ష్మి గురించి చెప్పారు. ఆమె గొప్పతనాన్ని, మంచితనాన్ని పొగిడారు. ఫ్యూనరల్ రోజున ఆమెకు శ్రద్ధాంజలి ఘటించటానికి వచ్చిన వాళ్ళను చూసి ఆశ్చర్యపోయాడు హరిమూర్తి. లోకల్ హాస్పిటల్ నుంచి...సూప్ కిచన్ నుంచి...రెడ్ క్రాస్ నుంచి ఇండియన్ అసోసియేషన్ తరుపునుంచి...దేవాలయం నుంచి వచ్చిన వాళ్ళందరూ శ్రీలక్ష్మి తో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు.

అప్పుడే పుట్టిన పసికందులకి స్వెట్టర్లు, టోపీలు అల్లి ఇస్తుందని, వారానికి రెండు రోజులు సూప్ కిచన్ కు వెళ్తుందని...వాళ్ళ కోసం కూరలు పండించి ఇస్తూ ఉంటుందని...రెగ్యులర్ బ్లడ్ డోనర్ అని...లోకల్ కాన్సర్ ఫౌండేషన్ కు హెల్ప్ చేస్తుందని అందరూ అంటుంటే ఆ విషయాలన్నీ ఆరోజే తెలుసుకున్నాడు హరిమూర్తి. తన పిల్లలు పెద్ద కాలేజీలకు వెళ్ళటానికి, వాళ్ళు వృద్ధిలోకి రావడానికి తను, తన సంపాదన కారణం అనుకునే హరిమూర్తికి, పిల్లలు కూడా కంగు తినిపించారు. ఆమె నిష్కల్మషమైన ప్రేమ గురించి ..తల్లి వ్యక్తిత్వాన్నిగురించి...ఆమె సహనం గురించి....చదువు పట్ల తల్లికి ఉన్న ఇష్టం గురించి పిల్లలు ముగ్గురు గొప్పగా మాట్లాడారు. తాము తప్పుదోవలు పట్టకుండా ఎలా కాపాడిందో, తమ అభిరుచులను గుర్తించి ఎలా ప్రోత్సహించిందో...తమ శక్తిసామర్ధ్యాలను ఎలా వెలికి తీసిందో, పెద్ద చదువులు చదువుకోకపోయినా తల్లి ఎంత విజ్ఞానవంతురాలో అందరితో చెప్పుకున్నారు. పెద్దవాడు సుహాస్ తను పీడియాట్రిక్ అంకాలజిస్టు అవడానికి కారణం తల్లే అని, స్పెషల్ ఎడ్యుకేషన్ లో పీ ఎచ్ డి చెయ్యమని తల్లే తనను ప్రోత్సహించిందని కూతురు సునీత గుర్తుచేసుకున్నారు. చిన్నవాడు సుధీర్ తల్లిమీద ఇంగ్లీషులో కవిత రాసి తన ప్రేమను చాటుకున్నాడు.

హరిమూర్తి నలభై ఏళ్ళ కిందట పీ ఎచ్ డి పేరుతో అమెరికా వచ్చాడు. గవర్నమెంట్ కాలేజీలో చేస్తున్న ఉద్యోగం వదులుకుని ఎక్కడో దేశం కాని దేశం వెళ్లటం హరిమూర్తి తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇష్టం లేదు. ఎప్పుడూ ఎవరి మాట వినని హరిమూర్తి అప్పుడు కూడా తల్లిదండ్రుల మాట వినకుండా అమెరికా వచ్చాడు. తల్లిదండ్రుల మాటే వినని వాడు అత్తమామల మాటేం వింటాడని శ్రీలక్ష్మి అమ్మానాన్న ఏం మాట్లాడలేదు. హరిమూర్తి బయలుదేరే రోజు, శ్రీలక్ష్మి ఎలాగో గొంతు పెగల్చుకుని “నన్నూ మీతో తీసికెళ్ళండి” అని అడిగింది. తన ఆశయం ఏమిటో, అమెరికా వెళ్లటం వల్ల ఉపయోగం ఏమిటో లాంటి విషయాలు వివరించి చెప్పకపోయినా, ఆమెను వంటరిగా వదిలి వెళ్తున్నాని, ప్రేమగా మాట్లాడి ఆమెకు ధైర్యం ఇవ్వాలని అతని లెక్కల బుర్రకు తట్టలేదు. “తర్వాత వద్దువులే” అంటూ ఒక్క మాటలో సమాధానం చెప్పి విమానం ఎక్కేసాడు హరిమూర్తి.

హరిమూర్తి యూనివర్సిటీ లో ఎం ఎ మొదటి సంవత్సరం లో ఉన్నప్పుడు శ్రీలక్ష్మి తో పెళ్లయిపోయింది. దానధర్మాలతో ఆర్ధికంగా చితికిపోయిన తన చిన్ననాటి స్నేహితుడు, ఆఖరి కూతురు పెళ్ళి కోసం చెప్పులరిగేలా

తిరుగుతుంటే, లక్ష్మి కళ ఉట్టిపడుతున్న ఆ పిల్లను తమ ఇంటి కోడలిగా చేసుకుంటే అన్నివిధాల బావుంటుందని హరిమూర్తి తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం అది. పెళ్ళికి వచ్చిన ఫ్రెండ్స్ అందరూ పెళ్ళి కూతురు చాలా అందంగా ఉందని కామెంట్ చేసినప్పుడు గర్వంగా ఫీల్ అయ్యాడు కానీ, అమెరికా వచ్చాక శ్రీలక్ష్మి ఉట్టి పల్లెటూరి గబ్బిలాయి అని తన చదువుకు , స్టేటస్ కు, తన అభిరుచికి తగిన భార్య కాదన్న అసంతృప్తి హరిమూర్తికి బాగా ఉండిపోయింది.

తనని ఓ దైవంలా ఆరాధిస్తూ తన మాటకు ఎదురు చెప్పకుండా, అణకువగా అన్నీ అమర్చే శ్రీలక్ష్మి ని చూసి లోలోపల సంతోషపడే వాడు కానీ, పైకి మాత్రం ఎప్పుడూ అసలైన మొగుడి లాగే బిహేవ్ చేసేవాడు. శ్రీలక్ష్మి కి చీరలు కొన్నా, నగలు చేయించినా, అత్తవారికి సహాయం చేసినా అందులో ప్రేమ కన్నా ఆడంబరం, అహంభావమే ఎక్కువగా ఉండేది. శ్రీలక్ష్మి మాత్రం ఇవేవి పట్టించుకోకుండా ఎప్పుడూ సంతోషంగానే ఉండేది. అతని మనస్తత్వాన్ని అర్థం చేసుకున్న శ్రీలక్ష్మి , హరిమూర్తి తన మీద ఎంత దాష్టీకం చెలాయించినా, పీకల దాకా తాగి వచ్చినా, పిల్లల్ని గడగడ లాడించినా అన్నింటినీ భరిస్తూ, సమర్థించుకుంటూ తనపని తాను చేసుకుంటూ పోయేది. పిల్లలు స్కూళ్ళ కెళ్ళటం మొదలు పెట్టాక ఓ కంపెనీలో కొన్నాళ్ళు డేటా ఎంట్రీ ఉద్యోగం చేసింది. శ్రీలక్ష్మి పని చేసినన్నాళ్ళు హరిమూర్తి ఆమెను గేలి చేస్తూనే ఉన్నాడు. “బూబు సంపాదన కుట్టుపూలకు సరి!” అన్నట్టు మా ఆవిడ సంపాదన కారులో గాస్ కు, పిల్లల బేబీ సిట్టింగ్ కు సరిపోతుంది!” అంటూ అందరి ముందు అనేవాడు! భర్త ఎప్పుడూ క్లైయిన్ట్స్ ..బిజినెస్ ట్రిప్పులు...క్లబ్బులు..డిన్నర్లు అంటూ ఇంటిపట్టున ఉండకపోవడం, పిల్లల్ని పట్టించుకోక పోవడం చూసి శ్రీలక్ష్మే ఉద్యోగం మానేసింది.

ఇల్లునిర్వహణ..పిల్లల ఆలనాపాలనా... చదువులు..అనారోగ్యాలు..ఆటలు, పాటలు..ఎక్స్ట్రా యాక్టివిటీస్..కాలేజీ చదువులు వీటన్నిటి కారణంగా శ్రీలక్ష్మి ఎన్నో నేర్చుకుంటూ ఎన్నెన్నోవిషయాలు తెలుసుకుంది. ఈ ప్రక్రియలో శ్రీలక్ష్మి కి రకరకాల వారితో పరిచయాలు, స్నేహాలు ఏర్పడ్డాయి. ఎన్ని రకాల సమస్యలు ఉన్నా ఎన్ని ఇబ్బందులు వచ్చినా, వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్ళే వారిని ఎంతో మందిని చూసింది. అప్పుడే శ్రీలక్ష్మి కి తను ఏం చెయ్యొచ్చో, సమాజానికి తను ఎలా ఉపయోగపడచ్చో, తన సమయాన్ని ఎలా వినియోగించుకోవచ్చో తెలిసింది. “మానవ సేవే మాధవ సేవ” అంటూ అప్పుచేసి మరీ ఎందరికో సహాయం చేసిన తండ్రి ఆమెకు గుర్తుకొచ్చాడు. పిల్లలు చదువులు ముగించుకుని వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడటం మొదలు పెట్టాక శ్రీలక్ష్మి ఎక్కువ సమయం వాలంటీర్ సర్వీస్ చేస్తూ నలుగురికీ సహాయపడుతూ వచ్చింది.

అన్ని కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వెళ్ళే ముందు, పిల్లలు తమ దగ్గరకు వచ్చి ఉండమని తండ్రిని అడిగారు. అల్లుడు, కోడలు కూడా అడిగి చూసారు. హరిమూర్తి ఎక్కడికీ రానన్నాడు. రోజు రోజుకు శ్రీలక్ష్మి లేని లోటు కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఇన్నాళ్ళు ఆమె ఉనికిని అంతగా పట్టించుకోని హరిమూర్తికి, ఇప్పుడు ఇంట్లో ఎక్కడి కెళ్ళినా, ఏం చూసినా శ్రిలక్ష్మే కనిపిస్తోంది. ఆమె చేతి వంట, ఆ కమ్మటి కాఫీ ఇక తనకు లేవనుకుంటే బాధగా ఉంది. హరిమూర్తికి ఏం

చెయ్యాలో తోచడం లేదు..పిచ్చెక్కినట్టుగా ఉంది. ఆరోజు మరింత స్ట్రాంగ్ డోస్ పడితేగాని లాభం లేదని లిక్కర్ కాబినెట్ తెరిచి స్పెషల్ అకేషన్స్ కోసం తను ప్రత్యేకంగా వెనకగా దాచుకునే విస్కీ బాటిల్ అందుకోబోయాడు హరిమూర్తి. అప్పుడే శ్రీలక్ష్మి రాసి పెట్టిన ఉత్తరం చూసాడు. ఆ లిక్కర్ కాబినెట్ హరిమూర్తి తప్ప ఇంకెవ్వరు ముట్టుకోరు, ముట్టుకోడానికి వీల్లేదు కూడా. శ్రీ లక్ష్మి అయితే ఈ చాయలకే రాదు. అలాంటిది ఈ కవరు ఇక్కడకెలా వచ్చింది? అక్కడెలా పెట్టింది? అనుకుంటూ గ్లాసులోకి విస్కీ వొంపుకుని సోఫాలో కూర్చుని కవర్ ఓపెన్ చేసి చూసాడు.

అది శ్రీలక్ష్మి కొద్ది రోజులకిందట హరి మూర్తికి రాసిన ఉత్తరం. అందులో కొన్ని ముఖ్యమైన వస్తువులు ఇంట్లో ఎక్కడ పెట్టిందీ...తనకు తెలియని పిల్లల సంగతులు కొన్ని...తన ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని రాస్తూ చివరిగా ముత్యాల్లాంటి పిల్లల్ని, ఇంతటి సౌభాగ్యాన్ని పొందిన తను ఎంతో అదృష్టవంతు రాలినని... హరిమూర్తి కారణంగా అమెరికా దేశం వచ్చి బయట ప్రపంచాన్ని చూడగలిగానని....తన మనసుకు ఇష్టమైన పనులు చేసే గొప్ప అవకాశం తనకు దొరికిందని రాస్తూ...భగవంతుడు ఇచ్చిన ఈ జీవితాన్ని సార్ధకం చేసుకున్నాననే తృప్తి–ఆనందం తనకు ఉన్నాయని "నా గుండెల్లో నిండుగా ఉన్న ఈ సంతోషాన్ని మీకు తెలియచెయ్యాలని ఈ ఉత్తరం రాస్తున్నాను" అంటూ ముగించింది.

అహంభావంతో ఆమె వ్యక్తిత్వాన్ని తను నొక్కేయాలని చూసినా, ఆమెకు ఇవ్వవలసిన గౌరవాన్ని తను ఇవ్వకపోయినా, ఎక్కడా తనను తప్పుపట్టకుండా...నిందించకుండా పైపెచ్చు మీ వలనే నాకెంతో మేలు జరిగింది అంటూ తనను అందలం ఎక్కించింది శ్రీలక్ష్మి .

తనకెంతో ఇష్టమైన విస్కీ గొంతులోకి నెమ్మదిగా జారుతున్నప్పుడు, మధ్య మధ్యలో సిగరెట్ దమ్ము లాగుతున్నప్పుడు, ఎప్పుడూ ఉండే "కిక్" ఆ రోజున హరిమూర్తికి రాలేదు. తన జీవితంలో అసలైన కిక్ భార్య "శ్రీలక్ష్మి " అని ఆరోజే తెలుసుకున్న హరిమూర్తి, సీసాలో ఉన్న విస్కీని సింకులో వొంపేసి...సిగరెట్లు గార్బేజ్ లో పడేసి లోపలికి వెళ్ళిపోయాడు.

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం – ప్రశంసా పత్రం

# "మరోమారు"

రాధిక నోరి,( Tallahassee, FL)

**కాలింగ్ బెల్ మోగితే** లేచి తలుపు తీసాడు బాలాజీ.

"నమస్కారం సార్" అన్నాడు ఎదురుగా వున్న ఒక యువకుడు.

"ఆ... ఆ... నమస్కారం. రావోయ్ లోపలికి. నువ్వే కదూ నిన్న ఫోను చేసావు?" అన్నాడు బాలాజీ.

"అవునండి. నేనే. నా పేరు సారథి అండీ" అన్నాడు అతను లోపలికి వచ్చి వినయంగా.

"సారీనయ్యా, నిన్న నీతో వివరంగా మాట్లాడలేకపోయాను. నిన్న వెంకట్ చనిపోయిన తిథి. సరిగ్గా భోక్తలు భోజనం ముగించి లేవబోతున్నారు, అప్పుడే నువ్వు ఫోను చేసావు. అందుకని నువ్వేం అడిగావో, నేనేం చెప్పానో అసలు నాకు గుర్తే లేదు" అన్నాడు బాలాజీ. "ఇవాళ నువ్వు వస్తావని మాత్రం గుర్తుంది" అన్నాడు మళ్ళీ.

"ఫరవాలేదు సార్. అంత పనిలో కూడా నాతో మాట్లాడారు. ఇవాళ నన్ను రమ్మని పిలిచారని గుర్తు పెట్టుకున్నారు. ఇంక అంతకంటే ఏం కావాలి సార్" అన్నాడు సారథి.

"రా, రా, లోపలికి రా. ఇదుగో, ఇలా కూర్చో" అన్నాడు బాలాజీ లివింగ్ రూములో సోఫా చూపిస్తూ.

"ఫరవాలేదు. థాంక్యూ సార్" అన్నాడు సారథి కూర్చుంటూ. బేగ్ లోంచి తన రికార్డర్ బయటకు తీసాడు.

బాలాజీకి అప్పుడు గుర్తొచ్చింది అసలు సారథి ఎందుకు వచ్చాడో.

"అవునయ్యా, నాకు ఒక విషయం అర్థం కాలేదు. నిన్న హడావిడిలో నేను అడగలేకపోయాను. అతి సామాన్యులమైన మమ్మల్ని ఇంటర్వ్యూ చెయ్యాలని అసలు ఎందుకు అనుకుంటున్నావు? మాలో ఏ ప్రత్యేకతలూ లేవు కదా!" అని అడిగాడు బాలాజీ.

'భలేవారు సార్. మీ దంపతులిద్దరూ ఎంత స్పెషలో మా అందరికీ తెలుసు సార్. మొన్న మీ వివాహ వార్షికోత్సవానికి వచ్చాను. కానీ మిమ్మల్ని కలవలేకపోయాను. హాలంతా జనంతో కిటకిటలాడుతోంటే ఎక్కువసేపు వుండలేక వెళ్ళిపోవలిసివచ్చింది. మేడం గారిని కూడా పిలవండి సార్" అన్నాడు అతను.

బాలాజీ నవ్వుతూ 'పద్మా, ఓ పద్మా, ఒకసారి ఇలా రా" అంటూ పిలిచారు.

లోపలినుండి ఒకావిడ బయటకు వచ్చింది. ఆవిడని చూడగానే సారథి అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు. "నమస్కారం అమ్మా" అన్నాడు చేతులు జోడిస్తూ.

ఆవిడ నవ్వుతూ బాలాజీ పక్కన కూర్చుంది. "అంత ఇంటర్వ్యూ చేయాల్సినంత ప్రత్యేకతలేమున్నాయి మాలో?" అని అడిగింది ఆవిడ కూడా కుతూహలంగా.

"అలా అనకండమ్మా. మీరు ఎంత ప్రత్యేకమైన దంపతులో మా అందరికీ తెలుసు" అన్నాడు సారథి.

"అవును పద్మా, ఈ వయసులో మనం మళ్ళీ పెళ్ళి చేసుకోవటమే కాకుండా పదేళ్ల వార్షికోత్సవం కూడా పెద్ద ఎత్తున జరుపుకున్నాం కదా. అందుకని అలా అంటున్నాడనుకుంటాను" అన్నాడు బాలాజీ.

కుండ బద్దలు కొట్టినట్లు బాలాజీ అలా అనేసరికి సారథికి ఏం అనాలో తెలీలేదు. కొంచెం ఇబ్బందిగా వారివైపు చూసాడు. కానీ పద్మావతి ముఖం లో కూడా చిరునవ్వు చెదరకపోయేసరికి కొంచెం ధైర్యం తెచ్చుకున్నాడు. అతనిలో వున్న సంకోచం కొంచెం తగ్గింది. వారిద్దరి స్పోర్టివ్ స్వభావం చూస్తే అతనికి ముచ్చటేసింది.

"అలాగా. సరే, మేమిద్దరం అంత స్పెషల్ గా కనిపిస్తే మంచిదే మరి. సరే, అడుగు, ఏం అడగాలనుకున్నావో" అంది ఆవిడ నవ్వుతూ.

ఒక్కక్షణం పాటు సారథి ఆగాడు. మనసులో ఇంకా ఎక్కడినుండో అలజడి రేపుతోన్న సంకోచాన్ని కొంచెం పక్కకు తోసి మెల్లిగా అడిగాడు, "ధన్యవాదాలమ్మా. నా మొదటిప్రశ్న. మీరిద్దరూ మీ పెళ్ళికి ముందే ఒకరికొకరు తెలుసా? అసలు ఒకరికొకరు మీరు ఎలా పరిచయం అయ్యారు?".

ఈసారి మౌనం వహించటం బాలాజీ, పద్మావతిల వంతు అయింది. కొన్ని సెకన్ల తర్వాత ముందుగా బాలాజీ నోరు విప్పాడు. "సారథీ, నువ్వు నీ ప్రశ్నతో ఒక్కసారి మమ్మల్నిద్దరిని ఒక్క క్షణం పాటు మా గతం లోకి తీసుకెళ్లిపోయావయ్యా. మా పెళ్ళికి ముందు మేమిద్దరమూ పూర్తిగా అపరిచితులం. నీకు తెలుసనుకుంటాను, మా పెళ్ళి అయ్యేసరికి మా ఇద్దరికీ వృద్ధ్యాప్యం వచ్చేసింది. నాకు 70 ఏళ్ళు, పద్మకి 65 ఏళ్ళు. నా భార్య అలివేలుమంగ హఠాత్తుగా పోవటంతో నేను చాలా ఒంటరివాడినైపోయాను. పిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు అయిపోయి దూరాన వున్నారు. వాళ్ళ పిల్లలు, సంసారాలతో వాళ్లకి వూపిరి తీసుకోవటానికి కూడా సమయం లేదు. మంగ లేని ఒంటరితనం నామీద చాలా ప్రభావాన్ని చూపించింది. మానసికంగా చాలా కృంగిపోయాను. శారీరకంగా జబ్బు పడ్డాను. పిల్లలు భయపడ్డారు. సెలవలు పెట్టుకుని వచ్చారు. అందరినీ చూడగానే నాకు కాస్త బలం వచ్చింది. నాకు కాస్త నయం అవగానే వాళ్ళ పిల్లలకి చదువులు పోతున్నాయని వెళ్ళిపోయారు. నాకు మళ్ళీ గుబులు మొదలయింది. ఎవరి జీవితాలు వారివి, తమ పిల్లలు, సంసారాలని వదిలేసి నాదగ్గర శాశ్వతంగా ఎవరు వుండిపోరు. ఈ విషయం నాకు బాగా తెలుసు. అయినా నేను బెంగతో డిప్రెషన్ లోకి వెళ్ళిపోయాను. పిల్లల బాధ్యతలు తీరిపోయాయి. నా అవసరం ఎవరికిలేదు. ఇంక తోడుగా మంగ లేనప్పుడు నేనెవరికోసం జీవించాలి? నేను లేకపోతే మాత్రం నష్టం ఎవరికి అనిపించేది. ఇంకొన్నాళ్ళు అలాగే గడిపితే ఇంకా ఎక్కువ డిప్రెషన్ లోకి కూరుకుపోతానని, దానిలో నుండి బయటకు రావటం కష్టం అని నాకు తెలుసు. అందుకే ఒక మానసిక వైద్యుడి దగ్గరకు వెళ్ళాను. ఎందుకంటే నా సమస్య ఏమిటో నాకు బాగా తెలుసు. నాకు శారీరకమైన ఎలాంటి రుగ్మతలు లేవు. అందుకనే అంత వయసున్నట్లు నేను కనిపించను. కానీ ఏం లాభం మానసిక ఆరోగ్యం సరిగ్గా లేకపోతే? అందుకే

ఇంక అశ్రద్ధ చేయలేదు. ఆ సైకియాట్రిస్ట్ నన్ను పరీక్ష చేసి నా శారీరక ఆరోగ్యం చాలా బాగుందని, నాకు కేవలం జీవితంలో ఒక తోడు అవసరం అని, ఒంటరితనమే నా జబ్బుకి కారణం అని చెప్పాడు. జననమరణాలు మన చేతుల్లో లేవు. నా బాధ్యతలు తీరిపోయాయి కాబట్టి ఇంక నేను చచ్చిపోయినా ఫరవాలేదు అని ఆలోచించటం తప్పు. భగవంతుడు జీవితాన్ని ఈ అర్థంలేని ఆలోచనలలో వ్యర్థం చేయకుండా సంతోషంగా జీవించటం కోసమే ఇచ్చాడు అని ఆయన వివరించి చెప్పాడు. ఆయన మాటలని నేను బాగా అర్థం చేసుకున్నాను. బాగా ఆలోచించాను కూడా. ఆ తర్వాత నేను మళ్ళీ పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నాను. ఎందుకంటే ఒంటరితనానికి శాశ్వతమైన మందు పెళ్ళి ఒక్కటే. ఇది నాకు బాగా తెలుసు. పిల్లలిద్దరూ నా ఈ నిర్ణయాన్ని ఆమోదించారు. నన్ను ఉత్సాహపరిచారు. కానీ ఆ వయసులో నన్ను చేసుకోవటానికి ఎవరు సిద్ధం అవుతారు? మన దేశంలో ఇలాంటివి చాలా అరుదు కదా! ఇంతలో ఒకరోజు మా అమ్మాయి పద్మను నాకు పరిచయం చేసింది. మా అమ్మాయి, పద్మ కోడలు ఒకే లేబ్ లో కలిసి పనిచేసేవారు. వారిద్దరూ స్నేహితులు. ఆ సమయంలో పద్మ కూడా నాలాంటి పరిస్థితిలోనే వుండటం వలన తన ప్రయత్నం ఫలించే అవకాశం వుందని మా అమ్మాయికి అనిపించిందట" తాను చెప్పటం కొంచెం ఆపి పద్మావతి వైపు చూసాడు బాలాజీ. పద్మావతికి అర్థం అయింది బాలాజీ తనవైపు ఎందుకు చూశాడో. మెల్లిగా గొంతు సవరించుకొని చెప్పటం మొదలెట్టింది.

"నాకథ కూడా ఇంచుమించు ఇలాంటిదే. నా ఒంటరితనం చూసి మా పిల్లలు నా వెనకాల పడ్డారు, మళ్ళీ పెళ్ళి చేసుకోమని. లేకపోతే వాళ్ళ దగ్గర వుండమన్నారు. ఎవరింట్లో వారికి స్వతంత్రం, స్వేచ్ఛ. ఎంత సొంత కొడుకులైనా వాళ్ళింట్లో నాకేం స్వతంత్రం వుంటుంది? అందుకే అది నాకస్సలు ఇష్టం లేదు. అదీకాక ఇద్దరు కొడుకులు, కోడళ్ళు చక్కగా కాపురాలు చేసుకొంటున్నారు. కోడళ్ళతో నాకున్న మంచి సంబంధబాంధవ్యాలని వాళ్ళతో కలిసివుండి పాడు చేసుకోవటం నాకిష్టం లేదు. అందుకే నేను వాళ్ళ ఇళ్ళల్లో వుండనన్నాను. అయితే మళ్ళీ పెళ్ళి అన్నా చేసుకుతీరాలని ఒత్తిడి చేశారు. నిదానంగా ఆలోచిస్తే నాకు దాంట్లో తప్పేమీ లేదనిపించింది. అందుకే సరే అనుకున్నాను. కానీ ఎవరు, ఎలా, లాంటి అనేక ప్రశ్నలు మనసును బాగా వేధించాయి. సరిగ్గా అప్పుడే మా కోడలు బాలాజీని నాకు పరిచయం చేసింది. అలా మేమిద్దరం కలుసుకున్నాం" అంటూ ఆగింది కాస్సేపు పద్మావతి. "అదృష్టం కొద్దీ మా ఇద్దరికీ సాంగత్యం బాగా కుదిరింది" అంది మళ్ళీ మెల్లిగా.

సారథి వీళ్ళు చెప్పినదంతా జాగ్రత్తగా రికార్డు చేసుకుంటున్నాడు. "ఆ తర్వాత? ఆ తర్వాత ఏమైంది? మీ ఇద్దరినీ మీ పిల్లలే పరిచయం చేసారు కాబట్టి మీ ఇద్దరికీ కుటుంబ సమ్మతి తేలికగానే లభించింది. అంటే ఇంక ఇంట్లో సమస్యలేవీ లేనట్లేగా?" అన్నాడు సారథి.

"అవును, మాకెప్పుడూ సమస్యలు కుటుంబాలతో రాలేదు. ఎందుకంటే మా ఇద్దరి పిల్లలు కూడా మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అలా చేసుకుంటే వాళ్ళ మీద మా ప్రేమ తగ్గిపోతుందేమో అని కొంచెం కూడా

భయపడలేదు. మా ఇద్దరికీ ఒకరికొకరి తోడు దొరుకుతుందని సంతోషించారు. ఎందుకంటే ఇప్పుడీ వయసులో మా ఇద్దరికీ కావలిసినది ఒక్క తోడు మాత్రమే. అందుకే మేమిద్దరమూ ఒకరికొకరు తోడు వున్నామన్న దిలాసాతో వాళ్ళు కూడా ఎంతో హాయిగా, రిలాక్సుడుగా వున్నారు. అసలు వాళ్ళ ఈ ప్రేమలకి, ఆలోచనలకి మా ఇద్దరికీ వాళ్ళమీద ప్రేమ ఇంకా పెరిగిందే కానీ కొంచెం కూడా తగ్గలేదు" బాలాజీనే కలగజేసుకుని అన్నాడు.

"జనాలు చెవులు కొరుక్కున్నారు. వింతగా చూసారు. వీళ్ళకేమన్నా పిచ్చిపట్టిందా అని అనుమానపడ్డారు. ఈ వయసులో పెళ్ళేమిటి అని అబ్బురపడ్డారు. ఇంత బరితెగింపా అని కొంతమంది అసహ్యించుకున్నారు కూడాను. మరీ దగ్గర అనుకున్నవారు ధైర్యం చేసి ముఖాన్నే అడిగేసారు కూడా. కానీ మేమిద్దరం ఎవరికీ, దేనికి జంకలేదు, లొంగలేదు. మేము చేసేదానిలో తప్పు లేనప్పుడు ఎందుకు భయం అనుకున్నాము. ఆ తర్వాత ఇలా విమర్శించినవారే మమ్మల్ని చూసి నోళ్ళు మూసుకున్నారు. మా ఆనందకరమైన జీవనాన్ని చూసి మంచి నిర్ణయం తీసుకున్నామని మెచ్చుకున్నారు " అన్నది మెల్లిగా పద్మావతి.

సారథి అంతా శ్రద్ధగా వింటూ రికార్డు చేసుకుంటున్నాడు. "సార్, ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి. విలేఖరిని కదా, మొహమాటం, సంకోచం లేకుండా అన్నీ అడగాలి మరి. ఆస్తి పంపకాలలాంటి విషయాలలో కూడా ఇంట్లో ఏమీ టెన్షన్స్ రాలేదా?" అని అడిగాడు.

సారథి ఆశ్చర్యపోయేలా బాలాజీ గట్టిగా నవ్వాడు. పద్మావతి కూడా చిరునవ్వు నవ్వింది.

"నీ ఇల్లు బంగారం కానూ! అంత పోట్లాడుకునేంత ఆస్తులేవీ లేవయ్యా మాకు. ఉన్నదేదో మా పెళ్ళికి ముందే మాపిల్లలికి సమానంగా పంచేసి, ఏదో, మా జరుగుదలకి మాత్రం సరిపోయేంత కొంచెం మాకని వుంచుకున్నాము. దానితో ఇద్దరం తృప్తిగా, హాయిగా వున్నాం. ఆశకి అంతెక్కడ వుంది చెప్పు? కానీ తృప్తికి మాత్రం అంతు వుంది. అవునా? ఏదో, అవసరాలన్నీ తీరిపోతున్నాయి, దీనికి లోటు లేదు. ఇంకా ఇంతకన్నా ఎవరికీ మాత్రం ఏం కావాలి? బంగారాలు తింటామా ఏమిటి?" అన్నాడు బాలాజీ నవ్వుతూనే. "ఆస్తుల విషయంలో పిల్లలతో మాకెప్పుడూ ఎటువంటి మనస్పర్థలూ రాలేదు, రానివ్వలేదు మేము" అన్నాడు మళ్ళీ ఇంకా నవ్వుతూనే.

"సార్, అమ్మా, అందరూ మీలాగా, మీ పిల్లల లాగా ఆలోచిస్తే ఈ ప్రపంచంలో ఇంక కుటుంబ కలహాలు, ఆస్తి గొడవలనేవే వుండవు. ఎంత గొప్ప ఆలోచనా విధానం మీది, మీ పిల్లలదీను" అన్నాడు సారథి మనస్ఫూర్తిగా.

ఈసారి పద్మావతి నోరు విప్పింది. "మా ప్రేమే వాళ్లకు తగ్గిపోతుందేమో అన్న భయం లేనివాళ్లు మా ఆస్తి వాళ్ళకు దక్కదేమో అని ఎందుకు అనుమానపడతారు? పైగా మేమివ్వబోయే ఈ కాస్త ఆస్తి కోసం వారెందుకు ఆశ పడతారయ్యా? మా ఇద్దరి పిల్లలు, వాళ్ళ జీవిత భాగస్వాములు అందరూ బాగా చదువుకుని పెద్ద పెద్ద పదవులలో వున్న ప్రొఫెషనల్సు.

చక్కగా రెండు చేతులతో సంపాదిస్తూ ఎంతో సుఖంగా వున్నారు. మేం ఇచ్చిన ఈ ఇళ్ళు, వాకిళ్ళు లేకపోయినా వాళ్ళ సిరిసంపదలకేమీ కొంచెం కూడా కొరత లేదు" అన్నది అతి శాంతంగా.

అవునన్నట్లు సారథి తలూపాడు.

"పద్మా, ఇంక మాటలు కాస్త ఆపి అతనికి తినటానికి ఏమైనా తీసుకురా" అన్నాడు బాలాజీ.

"నాకేం వద్దు సార్. ఏమీ ఫరవాలేదు, మీరు లేవకండమ్మా" అంటూ సారథి అంటున్నా కూడా వినిపించుకోకుండా పద్మావతి "అలాగే" అంటూ లేచి వంటింట్లోకి వెళ్ళింది.

" సారథీ, నీకు పెళ్ళయిందిటోయ్?" కబుర్లాడుతూ అడిగాడు బాలాజీ సారథిని.

"లేదు సార్" అన్నాడు సారథి మెల్లిగా, సిగ్గుపడుతూ.

"ఏం? ఎందుకని? మరీ ఆలస్యం చేయకు. ఏ వయసుకా ముచ్చట. మా పిల్లల పెళ్ళిళ్ళు చకచకా సరైన వయసులో చేసేసాను కాబట్టే ఇప్పుడు ఏ బాదరబందీ లేని జీవితాన్ని గడుపుతున్నాను" అన్నాడు ఆయన.

సారథి ఏదో సమాధానం చెప్పేలోగా పద్మావతి వేడివేడి ఉప్మా ప్లేట్లతో, ఘుమఘుమలాడే టీ తో వచ్చింది అక్కడికి. "ఉప్మా చాలా బాగుందమ్మా" తింటూ అన్నాడు సారథి.

"మంగ ఉప్మా అచ్చం ఇలాగే చేసేది. ఉప్మా ఇలా ఉంటేనే నాకిష్టం. అందుకే పద్మకి ఉప్మా ఇలా చేయటం నేనే నేర్పించాను" అన్నాడు బాలాజీ. సారథి ఒక్కసారి ఉలిక్కిపడి చటుక్కున పద్మావతి వైపు చూసాడు. ఆమె ముఖం చాలా ప్రశాంతంగా వుంది. "ఇలా చేసి చేసి అసలు ఇంతకు ముందు ఎలా చేసేదాన్నో మర్చిపోయాను" అన్నది ఆవిడ.

"ఆహా! టీ కూడా అమోఘం అమ్మా. ఏలకుల ఘుమఘుమలు ముక్కులకు తగులుతోంటే, అబ్బా, ఎంత బాగుందో, ఇలాంటి టీ ఎన్నిసార్లయినా తాగచ్చు" అన్నాడు సారథి టీ తాగుతూ, తన్మయత్వంగా. పద్మావతి నవ్వుతూ బాలాజీ వైపు చూసింది.

"give and take principle నీకు మా ఇంట్లో దొరికినంతగా ఇంక ఎక్కడా దొరకదోయ్. నేను నాకు నచ్చినట్లుగా ఉప్మా తనకి నేర్పిస్తే. పద్మ తనకి నచ్చిన టీ ని నాకు నేర్పించింది, బాగా అలవాటు చేసింది" అన్నాడు బాలాజీ. "నాకు నచ్చిన టీ కాదు. వెంకట్ కి ఇష్టం, టీ ఇలా చేస్తే" అంది పద్మావతి.

"ఆ.. ఆ... వెంకట్ కే ఇష్టం, టీ ఇలా చేస్తే. కానీ నేర్పించింది నువ్వే కదా. అందుకని అలా అన్నాను" అన్నాడు బాలాజీ.

ఈ వెంకట్ ఎవరో అనుకున్నాడు సారథి. ఇందాక వెంకట్ తద్దినం అని బాలాజీ అనటం అతనికి గుర్తొచ్చింది. ఏదో ఊహ మనసులోకి రాగానే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. అతనికి ఇందాక సగం మతి పోతే, ఆ మిగిలిన కాస్తా ఇప్పుడు

పూర్తిగా పోయింది. "బాబోయ్, ఇలాంటి మనుషులు కూడా వుంటారా ఈ భూప్రపంచంలో" అనుకుంటున్నాడు మాటిమాటికీ మనసులో.

"సార్, మీరిద్దరూ ఇలా ఒకరి అలవాట్లు ఇంకోరు సొంతం చేసేసుకుని ఇద్దరూ ఒకరే అన్న తీరులో ఇంత అన్యోన్యంగా వున్నారు. ఇదెలా సాధ్యం సార్?" ఇంకా ఆశ్చర్యం లోంచి బయటకు రాకుండానే అడిగాడు సారథి.

"లోతుగా ఆలోచిస్తే అదేమంత కష్టం కాదయ్యా. ఏ దంపతుల మధ్య అయినా ముందుగా కావల్సినది ఒకరంటే ఒకరికి పరస్పర గౌరవం. ఆ తర్వాత ప్రేమ. ఈ రెండూ వుంటే ఎవరి మధ్య అయినా సరే, అసలు పొరపొచ్చాలే రావు. ఒకరి కోసం ఇంకొకరు ఎవరూ అడగక్కర లేకుండానే, వారికి తెలీకుండానే మారిపోతారు ఆనందంగా. ఒకవేళ మారకపోయినా ఫరవాలేదు. మనమే అడ్జస్ట్ అయిపోతాము" అన్నాడు బాలాజీ.

"నాకు, మంగకి కూడా అసలు ఎప్పుడూ పోట్లాటలే వచ్చేవి కావు. ఇప్పుడు పద్మతో కూడా అంతే. పద్మా, నువ్వు చెప్పు. మనిద్దరి మధ్యా ఎప్పుడైనా పోట్లాటలు వచ్చాయా?" అన్నాడు బాలాజీ.

ఆవిడ నవ్వుతూ "ఉహు, లేదు, సరదాకి పోట్లాడదామన్నా ఆ అవకాశం ఇచ్చారా ఎప్పుడన్నా? నేను అలగటం, మీరు అలకతీర్చి నాకు దగ్గరవటం, ఊః .. ఆ ముచ్చట తీరనే లేదు" అంది ముద్దుగా.

"చూసారా, మాలో ఏ ప్రత్యేకతలు వున్నాయి? మమ్మల్ని ఎందుకు ఇంటర్వ్యూ చేస్తున్నారు? అని అడిగారు నన్ను. ఇప్పుడు తెలిసిందా అమ్మా, మిమ్మల్ని స్పెషల్ అని ఎందుకు అన్నానో? ఆనందంగా జీవితాన్ని పూర్తిగా ఎలా జీవించాలో మీ ఇద్దరిని చూసే నేర్చుకోవాలమ్మా. అరవై ఏళ్ళు దాటిన తర్వాత మనవలు, మనవరాళ్ళు వున్న వయసులో మళ్ళీ పెళ్ళి చేసుకోవటమే కాక, పది వసంతాలు అతి సంతోషంగా వైవాహిక జీవితం పూర్తి చేసుకొన్న శుభసందర్భంలో పెద్ద పండుగ చేసి, మీ ఆనందాన్ని అందరికీ పంచారు. మీడియా లో ఇది ఒక పెద్ద సంచలనాన్ని రేకెత్తించింది. అందుకే నేను కూడా ఒక జర్నలిష్టుగా ఆ సంబరాలకు వచ్చాను. కానీ అబ్బబ్బ, ఎంత జనమో! ఏదో ఒక పెళ్ళి లాగా అనిపించింది నాకు. ఇంక ఇలా కాదు, ఇంకో రోజు నిదానంగా మిమ్మల్ని కలవచ్చని ఆ రోజు వెళ్ళిపోయాను" అన్నాడు సారథి.

"అవునవును, అందరూ వచ్చారు కదా, హౌస్ ఫుల్ అయివుంటుంది. నిన్న మొన్నటిదాకా అందరితోనూ ఇల్లంతా సందడిగానే వుంది" అన్నాడు బాలాజీ. "సారథీ, ఒక్క విషయం చెప్తాను, గుర్తు పెట్టుకోవయ్యా, అసలు పెళ్ళి అవసరం, జీవితంలో ఒక తోడు వుండాలి అన్న అవసరం మనిషికి ఎప్పుడూ వుంటుంది. వృద్ధాప్యంలో ఇంకొంచెం ఎక్కువ వుంటుంది కూడాను., తెలుసా? ఎందుకంటే యవ్వనంలో ఒంట్లో శక్తి వుంటుంది. అన్నిటి మీద ఆసక్తి వుంటుంది. ఉద్యోగం, సంపాదన, శృంగారం, పెళ్ళి, పిల్లలు, సంసారం, స్నేహితులు, వీటన్నిటితో రోజులు పరిగెడతాయి. దేని గురించి కనీసం ఆలోచించటానికి కూడా సమయం వుండదు. కానీ వృద్ధాప్యం లో అలా కాదు. రెక్కలొచ్చిన పక్షులు వాళ్ళ గూటికి వాళ్ళు ఎగిరి వెళ్ళిపోతారు. ఇంక మిగిలేది మొగుడికి పెళ్ళాం, పెళ్ళానికి మొగుడు మాత్రమే. అవునా? అప్పుడు

మరి ఆ ఇద్దరిలో ఒకరు దూరం అయితే ఇంక మిగిలినవారి జీవితం దుర్భరమే. సారథీ, మనిషికి ఒంటరితనం ఒక శాపమయ్యా! ఆ శాపం లోంచి తప్పించుకోవాలని ఎవరైనా కోరుకుంటే అది తప్పు కాదు. మొదటివారి మీద ప్రేమ లేదు అని కూడా అసలే కాదు. మంగ పోయిన తర్వాత నేను ఒక ఏడాది పాటు ఒంటరిగానే వున్నాను. నరకం అంటే ఏమిటో ఈ భూమ్మీదే అనుభవించాను. పురుషుడు లేకుండా, స్త్రీ నిభాయించినంత తెలివిగా, స్త్రీ లేకుండా పురుషుడు నిభాయించలేడయ్యా. వెంకట్ పోయిన తర్వాత పద్మ మరీ నా అంత ఘోరంగా లేదేమో! కానీ నేనైతే మాత్రం తలక్రిందులైపోయాను. డిప్రెషన్ లోకి వెళ్ళిపోయాను. ఇంక పూర్తిగా దానిలో మునిగిపోకముందే తెలివిగా మేలుకుని సరైన నిర్ణయం తీసుకున్నాను. అదృష్టవశాత్తు పద్మ నాకు దొరికింది. ఇప్పుడు చూడు, ఎంత ఆనందంగా వున్నానో. చూస్తూ వుండు. ఇంకో ఇరవై ఏళ్ళు ఈజీగా బతికేసి సెంచరీ కొట్టేస్తాను. అసలు నన్ను చూసినవారెవరూ నా వయసు చెప్తే తప్ప నమ్మరు. కనీసం ఒక ఇరవై ఏళ్ళన్నా తక్కువగా కనిపిస్తాను నేను" అన్నాడు బాలాజీ మళ్ళీ.

సారథి సంతోషంతో చప్పట్లు కొట్టాడు. "సార్, మీ గురించి ఏం అనాలో తెలియటంలేదు. అవును సార్, చాలా సత్యం చెప్పారు. మిమ్మల్ని చూస్తే మీ వయసు అస్సలు తెలీదు సార్. నలభైలలో వున్నవారికి కూడా మీకున్న శక్తి, సకారాత్మకత వుండవు. మీకు మీరే సాటి సార్" అన్నాడు సారథి ఆవేశంగా.

"బాలాజీ, స్త్రీ శక్తిని మీరు బాగానే అర్థం చేసుకున్నారు. కానీ తోడు కావాలని స్త్రీకి కూడా అనిపిస్తుంది. కానీ తేడా ఏమిటంటే సంసార బాధ్యతలని పురుషుడు దులపరించుకున్నంత తేలికగా స్త్రీ వదిలించుకోలేదు. పిల్లలకి పెళ్ళిళ్ళు అయి ఎవరి ఇళ్ళకి వాళ్ళు వెళ్ళినా, వాళ్ళ పిల్లలు, వాళ్ళ చదువులు, అవీ, ఇవీ అంటూ ఆ తాపత్రయాలు స్త్రీకి కొంచెం ఎక్కువే. ఇంక నా విషయానికొస్తే డిప్రెషన్ లోకి వెళ్ళకుండా అస్తమానూ ఏదో ఒక వ్యాపకాన్ని కల్పించుకొనేదాన్ని. కానీ ఒకటి మాత్రం నిజం చెప్తాను. కల్పించుకున్న పనులతో ఎంత బిజీగా వున్నా, వెంకట్ పోయిన తర్వాత ఒంటరి జీవితం గడిపినపుడు కంటే ఇప్పుడు నేను చాలా ఆనందంగా, తృప్తిగా వున్నాను. ఇది నాకు రెండో జీవితం. మొదటి జీవితం ఆ దేవుడు ఇస్తే, ఈ రెండో జీవితాన్ని బాలాజీ ఇచ్చారు" అంది పద్మావతి బాలాజీ వైపు ప్రేమగా చూస్తూ.

వీరిద్దరినీ చూస్తుంటే సారథికి తెగ ముచ్చటగా వుంది. "సార్, ఒక్క అనుమానం. మీ ఇద్దరి పిల్లలు వాళ్ళలో వాళ్ళు ఎలా వుంటారు సార్? బాగా కలిసిపోయి వుంటారా? లేక ...." సారథి ఇంకా ప్రశ్న పూర్తి చేయక మునుపే "చక్కగా వుంటారు. నాకు కొడుకుల లోపం, పద్మకి కూతుళ్ళ లోపం ఇలా తీరింది. మమ్మల్ని పెళ్ళి చేసుకోమని వీళ్ళందరూ ప్రోత్సహిస్తున్నపుడు నేను, పద్మ ఆ ఒక్క షరతే పెట్టాము, మీలో మీరు పోట్లాడుకోకూడదని. షరతుల వల్ల ఏమీ కాదు కానీ అసలు వాళ్ళు స్వభావసిద్ధంగానే సొంత అన్నాచెల్లెళ్ళలాగా వుంటారు. వాళ్ళతో పాటు కోడళ్ళు, అల్లుళ్ళు కూడా అంతే. అందరూ ఎంత బాగా కలిసిపోయారంటే ఇంక అందరూ కలిసినప్పుడు ఒక పండగే! నీ నా అన్న బేధభావాలే

అసలు కనిపించవు, అనిపించవు. ఇదంతా ఆ దేవుని వరం. పిల్లలకి మంగ, పద్మ ఇచ్చిన సుసంస్కారం" అన్నాడు బాలాజీ పద్మావతి వైపు మెచ్చుకోలుగా చూస్తూ.

"మన పిల్లలందరూ సహజంగానే సంస్కారవంతులు. నాదేమీలేదు" అంది పద్మావతి.

"చూసాను సార్, మొన్న ఆ పార్టీలో నేనున్న ఆ కాస్సేపటిలోను మీ పిల్లలందరి మధ్య వున్న ఐకమత్యాన్ని చూసి ముచ్చటపడిపోయాననుకోండి. ఒక్క నేనే కాదు, పార్టీ కొచ్చిన ప్రతివాళ్ళు అనుకోవటమే, మీ పిల్లల స్నేహస్వభావాలని పొగడటమే. ఎంత అదృష్టం వుండాలి ఇంత మంచి కుటుంబం దొరకాలంటే అని అందరూ వేనోళ్ళ పొగిడారు సార్" అన్నాడు సారథి. పద్మావతి, బాలాజీ పెద్దగా నవ్వారు.

"అమ్మా, ఇంకో విషయానికి కూడా అందరూ మిమ్మల్ని బాగా పొగిడారమ్మా" అన్నాడు సారథి పద్మావతి వైపు చూస్తూ.

"అవునా? ఏమిటది" అడిగింది పద్మావతి కుతూహలంగా.

"మిమ్మల్ని చూసినవారందరూ మీరిద్దరూ సాక్షాత్తూ ఆ ఆదిదంపతులలాగా వున్నారని ఒకటే పొగిడారు. అక్షరాలా సత్యవచనాలు పలికారమ్మా. నిజంగా మీరిద్దరూ అలాగే వున్నారమ్మా" అన్నాడు సారథి మనస్ఫూర్తిగా.

" ఆ, నాదేముందయ్యా, ఏదో పంచ, లాల్చీ, ఉత్తరీయం వేసుకున్నాను. పట్టుచీర, ఆభరణాలతో సాక్షాత్తూ ఆ పార్వతీదేవి లాగా మెరిసిపోతూ కనిపించింది, ఇదుగో, ఈవిడే. ఒక్క త్రిశులమే తక్కువనుకో " అన్నాడు బాలాజీ పద్మావతి వైపు చూస్తూ నవ్వుతూ.

బాలాజీ హాస్యానికి అందరూ నవ్వారు.

"అలా అనకండి సార్. ఆ సిల్కు బట్టల్లో మీరు కూడా మెరిసిపోయారంటే నమ్మండి. ఇంక అమ్మ అయితే చెప్పనే అక్కరలేదు. మీరన్నట్లుగా అచ్చం ఆ పార్వతిదేవి రూపమే అనుకోండి" అన్నాడు సారథి.

పద్మావతి పెద్దగా నవ్వింది.

"ఇదుగో, అసలు రహస్యం అంతా ఆ చీరలో వుంది. ఆ చీర వల్లే నీకు అంత అందం, వెలుగు వచ్చాయి" అన్నాడు బాలాజీ పద్మావతితో అల్లరిగా.

సారథికి తెలిసిపోయింది ఆ చీర కొన్నది బాలాజీ అని.

"మరి సెలక్షన్ మీది కదా సార్" అన్నాడు సారథి వెంటనే. పద్మావతి మురిపెంగా నవ్వింది.

"సారథీ, ఆ చీర గురించి నీకో ఆసక్తికరమైన విషయం చెప్తానయ్యా. నేనా చీర మంగ కోసం కొన్నాను. మంగకి కలనేత రంగులు చాలా ఇష్టం. ఆకుపచ్చ, పసుపుపచ్చ కలిసిన కలనేత రంగులో వున్న ఆ చీర ఎంతో మక్కువతో కొన్నాను నేను. కానీ అది కట్టుకోకుండానే ఆమె కనుమూసింది. పిల్లలెందుకో ఆ చీరని తీసుకోలేదు, అలాగే వదిలేసారు.

తర్వాత పద్మకి ఆ చీర ఇచ్చి ఈ కథంతా చెప్పాను. అప్పటినుండి మా ప్రతి వివాహ వార్షికోత్సవం రోజున పద్మ ఆ చీరే కట్టుకుంటుంది" అన్నాడు బాలాజీ ప్రేమగా పద్మావతి వైపు చూస్తూ.

"ఆయన అంత మక్కువతో కొన్న చీర. ఎంతో అందమైన చీర కూడాను. అది కట్టుకుంటే ఆయన చాలా సంతోషిస్తారు. నాకు బాగా తెలుసు. అందుకే ఆ చీరని చాలా జాగ్రత్తగా దాచుకుని ప్రతి ఏడాది మా పెళ్ళి రోజున కట్టుకుంటాను. చూడండి. ఒకే దెబ్బతో రెండు పిట్టలను కొట్టినట్లు మీకు డబ్బు కూడా ఎంత ఆదా చేస్తున్నానో ఒక్కసారి లెక్క వేసుకోండి" అన్నది నవ్వుతూ పద్మావతి.

సారథి ఇంక ఆగలేకపోయాడు. "సార్, అమ్మా, ఒక విలేఖరిగా ఈ ప్రశ్నను అడుగుతున్నాను. కొంచెం వ్యక్తిగతమైన ప్రశ్నయే అనుకోండి. దీనికి మీరివ్వబోయే సమాధానం మీలాంటి పరిస్థితులలో వున్నవారికి మార్గదర్శకత్వం చూపిస్తుంది. అందుకని మీరు పెద్ద మనసుతో నన్ను క్షమించాలి ఈ ప్రశ్న అడుగుతున్నందుకు. నేను వచ్చినప్పటి నుండీ చూస్తున్నాను. మీరిద్దరూ ఇలా మీ సంభాషణలలో మీ పూర్వపు జీవితభాగస్వామిని మాటిమాటికీ తలుచుకుంటున్నారు. ఈర్ష్య అన్నది మానవ సహజమైన ఫీలింగు. దాన్ని మీరు జయించారా? మీ ఎదుటనే పాతవారిని పొగుడుతూంటే మీకేమీ అనిపించిందా? మీరు ఎలా సహించగలుగుతున్నారు? ఎంత ఆలోచించినా నాకీ విషయం మాత్రం ఏమాత్రం అంతు చిక్కడం లేదు" అన్నాడు సారథి చాలా నెమ్మదిగా.

బాలాజీ, పద్మావతి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. కొన్ని సెకన్లపాటు మౌనం వహించారు. ముందుగా బాలాజీనే చెప్పటం మొదలెట్టాడు. "సారథీ, పద్మ మౌనంగా వుంది కాబట్టి నేనే చెప్తాను ముందుగా నీ ప్రశ్నకి సమాధానం. అన్నేళ్ళు దాంపత్య జీవితం గడిపిన తర్వాత మొగుడు పెళ్ళాలు ఇద్దరుగా కాదయ్యా, ఒకరుగానే మిగులుతారు. ఒకరి లోపాలు ఇంకొకరు క్షమించేసి, వారిలో మంచితనం మాత్రమే చూస్తారు. ఏకారణం వల్లనైనా ఒకరు దూరం అయితే, ఒకవేళ ఆ మిగిలినవారు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే దాని అర్థం వాళ్ళని మర్చిపోయారని కాదు. అన్నేళ్ల వైవాహిక జీవితంలో శరీరంలో ఒక భాగంగా మారిన తర్వాత హఠాత్తుగా వారి జ్ఞాపకాలను పూర్తిగా తొలగించటం ఎలా సాధ్యం? అందుకని వారి జీవితంలోకి వచ్చిన ఆ కొత్తవారు వీరు ఆ పాతవారిని మర్చిపోవాలని ఆశించటం కూడా న్యాయం కాదు. ప్రాక్టికల్ అంతకంటే కాదు. అలా అని అస్తమానూ వారినే తలుస్తూ మనసు చెడగొట్టుకుని చింతిస్తూవుంటే అది తప్పు. అలాగే వారితో పోల్చి ఎదుటనున్నవారిని కించపరిస్తే అది కూడా చాలా పెద్ద తప్పు. మా విషయంలో మేమిద్దరమూ అలా చేయము. నేను మంగని, పద్మ వెంకట్ ని ఏదన్నా ప్రస్తావన వచ్చినపుడు మాట వరసకి గుర్తు చేసుకుంటాం, కానీ వారితో పోల్చి ఎదుటివారిని చిన్నచూపు చూడటం లాంటి తప్పు అస్సలు చెయ్యము. అందుకే మాకు ఈర్ష్య అన్నది కొంచెం కూడా అనిపించదు. ఇంతకు మించిన పెద్ద కిటుకేదీ లేదు దీనిలో" అన్నాడు బాలాజీ.

"మంగకని కొన్న చీర పద్మ కట్టుకున్నప్పుడు కూడా ఆ చీరలో పద్మ బాగుందని పొగుడుతానే తప్ప అసలు మంగ ప్రసక్తే రాదు" అన్నాడు మళ్ళీ. పద్మావతి కూడా అవునన్నట్లు తలూపింది. "అందుకే మా సంభాషణలలో అప్పుడప్పుడు వారి ప్రసక్తి వచ్చినా అది చాలా సర్వసాధారణమైన విషయం లాగా వుంటుంది, కానీ ఎబ్బెట్టుగా కానీ లేకపోతే కోపం తెచ్చుకోవాల్సిన విషయం లాగా కానీ అనిపించదు" అన్నది పద్మావతి.

సారథి చాలా శ్రద్ధగా విన్నాడు. చాలా ఆశ్చర్యపోయాడు కూడాను. ఇదా కిటుకు అనుకున్నాడు. "సార్, మీ మాటలు వింటూంటే ఎటువంటి పరిస్థితులలోనైనా జీవితం ఆనందమయం చేసుకోవటానికి కావలిసిన చిట్కాలన్నీ మీ ఇద్దరి దగ్గర పుష్కలంగా వున్నాయి అనిపిస్తోంది" అన్నాడు. బాలాజీ, పద్మావతి ఇద్దరూ నవ్వేశారు.

"సార్, మీలాంటి పరిస్థితులలోనే వుండి ఈ వయసులో ఇంక ఇప్పుడు మళ్ళీ పెళ్ళి ఏమిటి అని రకరకాల సంకోచాలతో ఆ ఒంటరితనంలోనే కృంగే అనేకమందికి మీరేం చెప్పదలచుకున్నారు?" అని అడిగాడు సారథి. "అమ్మా, మీరు కూడా చెప్పండమ్మా. మీ అభిప్రాయం, మీ సందేశం కూడా చాలా ముఖ్యం" అన్నాడు పద్మావతితో.

ఈసారి కూడా ముందు బాలాజీనే మొదలుపెట్టాడు. "ఇలాంటి విషయాలు చాలావరకు చాలా వ్యక్తిగతంగా వుంటాయి. జనరల్ గా చెప్పాలంటే కష్టం. అయినా నువ్వు అడుగుతున్నావు కాబట్టి చెప్తున్నాను. అన్నిటికంటే ముఖ్యం ఆరోగ్యం అని చెప్పాలి. అనారోగ్యంగా వుండి వివాహం విషయం ఆలోచించం కదా. దాని వలన ఇంకొకరి జీవితాన్ని ఇబ్బందులపాలు చేసినట్లవుతుంది. ఆరోగ్యంతో ఆనందం, ఆనందంతో జీవితం, జీవితం వుంటే ఏదైనా సరే, ఆఖరికి వివాహం అయినా సరే, వుంటుంది. ఆతర్వాత జీవించాలనే కోరిక, జీవితాన్ని అనుభవించాలనే కోరిక కూడా చాలా ముఖ్యం. సమాజం ఏమనుకుంటుంది, లేకపోతే ఇతరులు ఏమనుకుంటారు అన్న సంకోచాలు మనసులోంచి తీసేయండి. ఎందుకంటే అలా వేలెత్తి చూపించి మిమ్మల్ని తప్పు పట్టేవాళ్ళు మీ ఒంటరితనం దూరం చెయ్యటానికి, వేలెడంత సహాయం కూడా చేయరు. ఆ తర్వాత మీ పిల్లల సమ్మతి తీసుకోండి. ఇది చాలా అవసరం. ఎందుకంటే మీరు తోడు కోసం వివాహం చేసుకుంటే ఆ తోడు మీకు సంతోషాన్ని ఇవ్వగలగాలి కానీ కుటుంబ కలహాలతో మీ ఇద్దరి జీవితాలను అశాంతిపాలు చేయకూడదు. నేను ముందు చెప్పినట్లు మీ మొదటి జీవిత భాగస్వామిని పూర్తిగా మర్చిపోవక్కరలేదు, వారిని ఎప్పుడైనా, ఏదన్నా సందర్భం వచ్చినవుడు గుర్తు చేసుకుంటే తప్పు లేదు కానీ అస్తమానూ వారినే మనసులో వుంచుకుని వారి గురించే ఆలోచించకండి. వారితో ఇప్పుడున్నవారిని ఎప్పుడూ పోల్చకండి. ఎవరి స్వభావాలు, ఎవరి ప్రత్యేకతలు వారివే. ఎక్కువ తక్కువల ప్రసక్తి అస్సలు రానీయకండి. జీవితంలోని ఈ రెండో ఇన్నింగ్స్ లో సాధ్యమైనన్ని పరుగులు తీయటానికి ప్రయత్నించండి. సర్దుకుపోవటం, వున్నంతలో సంతోషంగా వుండటం, ఇవన్నీ మన చేతుల్లో వున్నవే కదా" అన్నాడు బాలాజీ.

సారథి అవునన్నట్లు తలూపుతూ బాలాజీ వైపు చూసాడు. ఆతర్వాత పద్మావతి వైపు చూసి "అమ్మా, ఇప్పుడు మీరు కూడా ఏదన్నా చెప్పండమ్మా" అన్నాడు. పద్మావతి మెల్లిగా చిరునవ్వు నవ్వింది. "ఈయన అంతా చెప్పేసారు. నాకింక చెప్పటానికేమీ మిగల్చలేదు. ఏ వయసులో పెళ్లి చేసుకున్నా భార్యాభర్తల మధ్య స్నేహం, అనురాగం, పరస్పర అవగాహన వుండాలి. నీది, నాది అన్న తేడాలు లేకుండా అందరూ మనవారే, అంతా మనదే అన్న భావం వుండటం చాలా ముఖ్యం. బాలాజీతో నా పెళ్ళి అయిన తర్వాత నాకు ఒక్క విషయం బాగా అర్థం అయింది. జీవిత భాగస్వామి తోడు, అవసరం వయసులో వున్నప్పుడు ఎంత వుంటుందో వయసు మళ్ళిన తర్వాత కూడా అంతే వుంటుంది. అసలు ఆ మాటకొస్తే ఇంకా ఎక్కువ వుంటుంది కూడాను. ఆ తోడు మీకు కావాలి అని అనిపిస్తే, దానికి తగినవారు మీకు తారసపడితే, ఇదేమన్నా తప్పేమో, ఎవరన్నా ఏమన్నా అనుకుంటారేమో, ఈ వయసులో మళ్ళీ పెళ్ళేమిటి అని సందేహించకండి. ఇదేమీ సిగ్గు పడాల్సిన విషయం కాదు. దేవుడు మనకిచ్చిన ఈ ఒకే ఒక్క జీవితాన్ని ఆనందంగా గడిపే హక్కు అందరికీ వుంది. దానికి వయసుతో సంబంధం లేదు. సరైన తోడు, సరైనవారి సాహచర్యం మన ఆయువుని ఇంకా పెంచుతుంది" అంది మెల్లిగా పద్మావతి.

సారథి తదేకంగా వారిద్దరివైపు కొన్ని సెకన్లపాటు చూసాడు. "చాలా ధన్యవాదాలమ్మా. చాలా థేంక్స్ సార్. మీ ఇద్దరి సందేశం విని, మీ ఇంటర్వ్యూ చదివి, మీలాంటి పరిస్థితులలో వుండి, ఏ నిర్ణయమూ తీసుకోలేక, ఎటూ తేల్చుకోలేక సతమతమయ్యే చాలామంది తమ మనసు మార్చుకుంటారని, తమ ఒంటరితనానికి ఇంక స్వస్తి పలుకుతారని ఆశిస్తున్నాను" అన్నాడు. తన రికార్డర్ ఆపు చేసి, జాగ్రత్తగా లోపల పెట్టుకున్నాడు. ఇంతలో పద్మావతి ఏదో గుర్తొచ్చినట్లు గబగబా లోపలి వెళ్ళి ఏదో స్వీటు తీసుకొచ్చింది. సారథి అది తింటూ "పాలకోవా చాలా బాగుందమ్మా. దీనిలాగా మీ జీవితం కూడా ఇంకా తియ్యగా, ఇంకా ఎక్కువ ఆనందంగా గడవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తాను. ఆ దేవుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలి" అన్నాడు మనస్ఫూర్తిగా.

"సార్, మీ ఇద్దరితో మాట్లాడిన తర్వాత అసలు భార్యాభర్తలు ఎందుకు పోట్లాడుకుంటారో తెలియటం లేదు సార్. వైవాహిక జీవితాన్ని ఆనందమయం చేసుకోవటం ఇంత తేలికా అనిపిస్తోంది" అన్నాడు బాలాజీ వైపు తిరిగి.

"ఈ ఇంటర్వ్యూ ఇచ్చినందుకు, మీ విలువైన సమయాన్ని నాకోసం వెచ్చించినందుకు చాలా ధన్యవాదాలు సార్" తన సరంజామా అంతా సద్దుకుని, ఇంక వెళ్ళటానికి లేస్తూ అన్నాడు సారథి. "మిమ్మల్ని ఇద్దరిని చూసిన తర్వాత పెళ్ళిని ఇంక ఏమాత్రమూ వాయిదా వేయకూడదని అనిపిస్తోంది నాకు సార్" అన్నాడు సారథి నవ్వుతూ.

"చాలా సంతోషం. శుభస్య శ్రీఘ్రం" అంటూ బాలాజీ, పద్మావతులు అతని నవ్వులో నవ్వు కలిపారు.

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో బహుమతి పొందిన కథ

## "ఇంత సౌఖ్యమని నే చెప్పజాల" రవి మంత్రిప్రగడ (Dublin, Ireland)

'ఈ మనసు మహా మొండిది సుమా!

యాంత్రికంగా బ్రతకడానికి మనుషుల్ని ఒప్పించినంత సులువు కాదు,ఈ మనసుని ఒప్పించడం.

ఊహల్లోనే ఉంటా అంటుంది,గతంలోనే తన ఉనికి అంటుంది.

కృత్రిమంగా ఉన్న మన ఎడారి జీవితంలోకి ఒక చల్లని మేఘాన్నిపరిచయం చేస్తుంది,

అది యాదృచ్ఛికం అని నమ్మబలుకుతుంది.

తన గుర్తుల మరీచికలని మిగిల్చి,రెప్ప పాటులో కరిగిపోతుంది ఆ మేఘం.

మనసు మాత్రం ఆ మేఘం తెచ్చిన చిరుజల్లులతో తనని తాను క్షణకాలం మర్చిపోతుంది.

మనుషుల్ని మళ్ళీ కొత్తగా పుట్టేలా చేస్తుంది.

మనం మరికొన్ని రోజులు బ్రతకడానికి సిద్ధం చేస్తుంది.

జీవితం మారదు.కానీ మనకే తెలియని ఉత్సాహాన్ని,ధైర్యాన్ని ఇస్తుంది!!!'

'ప్రయాణీకులకు విజ్ఞప్తి...రైలు నంబరు 12728,హైదరాబాద్ నుండి ఖాజీపేట్,విజయవాడ మీదుగా విశాఖపట్టణం వెళ్ళవలసిన గోదావరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఒకటవ నంబరు ప్లాట్ ఫామ్ నుండి బయలుదేరుటకు సిద్ధంగా ఉన్నది.' మీరు విన్నా వినకపోయినా చెప్పడం నా బాధ్యత అన్నట్టు మూడు భాషల్లోనూ వరసగా అరిచి చెప్పింది ఆటోమేటెడ్ రైల్వే అనౌన్సర్.

'త్వరగా నడువ్...మొద్దూ. రైలు కదిలిపోతుంది.'ఆమెని లాక్కెళుతున్నట్టు పెద్ద పెద్ద అంగలతో వేగంగా నడుస్తున్నాడు భర్త.

'కొంచెం మెల్లగా నడవండీ...' కాళ్లకి అడ్డుపడుతున్న చీరని పైకి లాక్కుంటూ అతని వెనక పరిగెడుతున్నట్టు నడుస్తోంది ఆమె.

'ప్రయాణాల్లో కూడా ఈ వెధవ చీరలెందుకు?'ఏ పంజాబీ డ్రెస్సో వేసుకుని చావక..'విసుక్కున్నాడు.

'అత్తయ్యగారికి నచ్చదు కదండీ..'అంది పుస్తకాల కొట్టు వైపు చూస్తూ,అడిగితే మళ్ళీ ఎక్కడ తిడతాడో అనుకుని.

'వీటికేం తక్కువ లేదు.ఆ కాడికి మేమంటే ఏదో పెద్ద భయమున్నట్టు.బస్సులో వెళ్లి ఏడవమంటే వాంతులు అదీ ఇదీ అని వంకలు.' వచ్చే పోయే జనాల్ని తప్పించుకుంటూ కాస్త ఖాళీగా ఉన్న బోగీ కోసం వెతుకుతున్నాడు.

'జనరల్ ఇటు పక్క అనుకుంటా అండీ..'వెనకకు చూపించింది,జారిపోతున్న బ్యాగ్ ని భుజం మీదకి లాక్కుంటూ.

'నాకు తెలీదా? చూసావా ఎంత జనమో? నువ్వెళ్ళి జనరల్ లో కూచుంటే ఏ దొంగ వెధవో అర్ధరాత్రి వేళ ఆ మెళ్ళో ఉన్న సూత్రాలతాడు కాస్తా లాక్కెళ్లిపోతాడు.నీకసలే పడుకుంటే ఒళ్ళు తెలీదు.'

'ఈ బోగీ కొంచెం ఖాళీగా ఉన్నట్టుందండీ..'వినిపించుకోలేదతను.

'అందులో బొత్తిగా ఆడవాళ్లు లేరు.ఇదిగో ఇందులో ఎక్కు.త్వరగా.'ట్రైను తలుపు దగ్గర కంబీని పట్టుకుని, రిజర్వేషన్ బోగీలో ఆమెని ఎక్కించేసాడు.రైలు మెల్లగా కదిలింది.

'ఏవండీ పిల్లలు జాగ్రత్త.చిన్నది నిద్రలో పక్క తడిపితే విసుక్కోకండి.'చేతిని పట్టుకుంది.

'ఎన్నిసార్లు చెప్తావ్?వెధవ నస.టీసీ వస్తే అత్యవసరం ఉండి బయల్దేరాను,సీటు దొరకలేదని చెప్పు.ఫైన్ కట్టమంటే వచ్చే స్టేషన్లో దిగిపోతా అని చెప్పు.ఆడవాళ్లే కాబట్టి ఏవనరు.'సీటు దొరికితే నిద్రపోకు.బండి ఎక్కడా ఎక్కువ సేపు ఆగదు.' కంబీని వదిలేస్తూ ఆమె చేతిని కూడా విడిపించుకున్నాడు.

'ఫోన్ చేస్తూ ఉండండీ.'

'ఉద్యోగం మానేసి వచ్చేయమంటావా పోనీ?' కోపంగా గసిరి వెనక్కి తిరిగాడు.

'ఏవండీ...టిక్కెట్టు మీ జేబులో ఉండిపోయింది.'గట్టిగా అరిచింది.అప్పటికే రైలు ప్లాట్ఫారం దాటేసింది.

నాంపల్లిలో ఓ మాదిరి జనాలతో బయల్దేరిన రైలు సికింద్రాబాద్ వచ్చేసరికి ప్రయాణీకుల యాత్రాబస్సులా నిండిపోయింది.

'నాకెప్పుడూ సెకండ్ ఏసీ లో వెళ్లడం అలవాటండీ.ఏదో తప్పక ఇలా స్లీపర్ ఎక్కాను.వేసవికాలంలో ప్రయాణం చాలా విసుగండీ బాబూ..' కూలింగ్ గ్లాసు తీసి చెమటను తుడుచుకుంటూ చెప్తున్నాడు ఒకాయన.

'ఈ బండి నా పెళ్ళైన కొత్తల్లో మొదలెట్టారు తెలుసా?మొదటి పెళ్లిరోజునాడు రైల్లో ఇసాపట్నం తీసుకెళ్లాడు మీ తాత.' మురిపెంగా చెప్తోంది ఒక పెద్దావిడ.

'ఈ సీట్లో ఎవరైనా ఉన్నారాండీ?'ఖాళీ సీటుకోసం వెతుక్కుంటూ వచ్చి అడిగింది ఆమె.

'....'పైకి వేలు చూపించాడు అతను.మొహం మీద తడి తువ్వాలు కప్పుకుని గురక పెట్టి పడుకున్నాడో మనిషి.

'ఓహ్..'నిరుత్సాహంగా కిక్కిరిసిన కంపార్ట్మెంట్ అంతా మళ్ళీ వెతికింది చోటు కోసం.

'ఆయన ఇప్పట్లో లేచేలా లేడు.మీరు కావాలంటే కూర్చోండి.'మరోసారి పైకి చూసి నిర్ధారించుకున్నట్టు చెప్పాడు.

'థాంక్స్..'బ్యాగ్ ని సీటు కింద పెట్టి కూర్చుంది.

గ్రీష్మ తాపం ఇంకా చల్లారలేదు.కిటికీలోంచి బైటికి చూస్తోంది.అలసట వలనో,ఆలోచనల బరువువలనో గానీ ముఖం వాడినట్టు తెలుస్తోంది.సంధ్య సూరీడు వెళ్ళడానికి మొరాయిస్తూ ఆమె ముఖం పై చురుక్కుమని చల్లని నిప్పులు కురిపిస్తున్నాడు. ఆమె కళ్ళలో సన్నని కన్నీటి పొర.చాలా సేపటి నుండి ఇది చూస్తున్న అతను,తను చదువుతున్న పుస్తకాన్ని యధాలాపంగా ఎండకి అడ్డుపెట్టాడు. కసురుకుంటూ వెనుదిరిగాడు సూరీడు.ఆమె గమనించే స్థితిలో లేదు.

'వాటర్ బాటిల్....అక్కా..వాటర్ బాటిల్ కావాలా?'మొహం మీద బాటిల్ పెట్టి అడిగాడు కుర్రాడు.ఈ లోకం నుండి వచ్చిన ఆమె వద్దని చేత్తో సైగ చేసింది.ఏదో గుర్తొచ్చినట్టు ఫోన్ తీసి చూసుకుంది.ఏడు మిస్డ్ కాల్స్ ఉన్నాయి.ఖంగారుగా కాల్ చేసింది.

'హలో...చెప్పండి.ఫోన్ సైలెంట్ లో ఉంది చూస్కోలేదండీ.'

'...'అవతల గొంతు అరుస్తున్నాడో తిడుతున్నాడో గానీ గొంతు గట్టిగానే వినిపిస్తోంది.

'మీరే కదండీ టికెట్ నా దగ్గరుంటే పడేస్తా అని,రైలెక్కే ముందు గుర్తు చెయ్యమన్నారు?' నెమ్మదిగా అంది, ఫోన్ వాల్యూమ్ తక్కువ ఉందో లేదో అని మరోసారి చూసుకుంటూ.

'...'ఏదో అరిచి ఫోన్ పెట్టేసింది అవతలి గొంతు. నిట్టూర్చి ఫోన్ బ్యాగ్ లో పెట్టేసింది,స్విచ్ ఆఫ్ చేస్తూ. ఒంటరి ప్రయాణాలు కొన్ని సార్లు భారంగా ఉంటాయి.ఈ సారి ఆ భారానికి భయం తోడైంది.బోగీ అంతా ఒకటే గోల గోలగా ఉంది.

'ఈ పుస్తకం మీరు చదివేస్తే ఇస్తారా?'

'ఆ..తీస్కోండి.'

'థాంక్యూ.'గబగబా పేజీలు తిప్పి ఆఖరి పేజీ దగ్గర ఆగింది ,'పెన్ను ఇస్తారా?' సైగ చేసింది అతని జేబుని చూపిస్తూ.పెన్ను ఇచ్చాడు ఫోన్లో పాటలు వింటున్న అతను.

'టీసీ వస్తే ఏం చెప్తారు?' ఇంకాసేపట్లో ఏదో స్టేషన్ వస్తుందనగా అడిగాడు.

'...'మీకెలా తెలుసు అన్నట్టు చురుక్కుమని చూసింది.

'సారీ..మీరు ట్రైన్ ఎక్కినపుడు ఎవరినో అడుగుతున్నారు కదా?నేను ఇటు వైపు తలుపు దగ్గర ఉన్నాను.'

'మ్..మా ఆయన...టికెట్ ఇవ్వడం మర్చిపోయాడు.'

'మరిప్పుడెలా?ఫైన్ కట్టేస్తారా?'

'సీటు ఇస్తా అంటే ఆలోచిస్తాను.అయినా ఏమైతే అదే అవుతుంది.చూద్దాం.ఏదో నమ్మకం అంతే.'పజిల్ సగం సగం గడులు నింపేసి పెన్నుని అతనికి ఇచ్చేసింది.

'మీకు ధైర్యం ఎక్కువే.'అన్నాడు జేబులో పెట్టుకుంటూ.

'ధైర్యానికి డబ్బులు అక్కర్లేదు కదండీ.' మొదటిసారి నవ్వింది.

రైలు ఖాజీపేట దాటింది.

'కుదరదయ్యా.నేనేం చెయ్యలేను.రిజర్వేషన్ లేకపోతే వచ్చే స్టేషన్ లో దిగి జనరల్ లోకి వెళ్లిపో.మళ్ళీ నిన్ను ఇక్కడ చూస్తే ఫైన్ రాసేస్తాను...సార్ మీ టికెట్.'రుసరుసలాడి పోతున్నాడు టీసీ.అతని వెనక నలుగురైదుగురు కుర్రాళ్లు,సీటు కోసం వెంటపడుతుంటే విసుక్కుంటూ టిక్కెట్లు చెక్ చేస్తున్నాడు.

'సైడ్ లోయర్ అండీ..'టికెట్ చూపించాడు అతను.

'మ్..అమ్మా మీది?బాబూ లేవండి టికెట్ చూపించండి...'పైన పడుకున్న మనిషిని తట్టి లేపాడు.

'....'తనని కాదన్నట్టు బయటకు చూస్తున్న ఆమె ఏం చేస్తుందా అని ఆత్రంగా చూస్తున్నాడు అతను.

'అమ్మా...'గట్టిగా పిలిచాడు టీసీ.ఆమెలో చలనంలేదు.

'ఆవిడ ...'ఏదో చెప్పబోయాడు అతను.

'సార్..మీ వైఫా? కళ్ళు తెరిచి నిద్రపోతున్నట్టున్నారు.RAC యా?సీట్లు లేవు.మీరిద్దరూ సద్దుకుంటా అంటే నాకేం అభ్యంతరం లేదు.'చెప్పేసి వెళిపోయాడు టీసీ.కాసేపు నిశ్శబ్దం.కొంగు నోటికి అడ్డుపెట్టుకుని వస్తున్న నవ్వుని ఆపుకుటోంది ఆమె.

'అలా ఎలా కూర్చున్నారు?మీకు భయం వెయ్యలేదా?'టీసీ వెళ్ళాడో లేదో అని చూసుకుంటూ అడిగాడు.

'వెయ్యలేదా?రైలు చప్పుడు కన్నా గట్టిగా కొట్టుకుంది నా గుండె...'

'ఇందాకే ధైర్యం,డబ్బులు అని ఏదో అన్నారు?'

'వాటన్నిటికన్నా చెడ్డది ఒకటి ఉంది.పరువు అని,కనిపించని బరువు.ఎందుకు మోస్తామో తెలీదు.'

'పోనీలెండి.గండం గట్టెక్కింది.'

'ఏమీ అనుకోకండి.సారి.సిగ్గుగా ఉంది నాకు.కానీ మరో దారి లేదు.'

'ఫరవాలేదు.'

❦❦❦

ఖమ్మంలో రెండు నిమిషాలు ఆగినప్పుడు దిగి ఏదైనా తినడానికి కొనుక్కుందాం అని వెతికాడు అతను.కానీ అతనికి కావాల్సింది దొరకలేదు.

'మీ భోజనం?'అడిగింది,తన తెచ్చిన చపాతీల పొట్లం తెరుస్తూ.

'ఇక్కడేం బాలేదండీ.విజయవాడ లో చూస్తాను.'

'ఎందుకు?నేను ఎక్కువ తెచ్చాను.'అతనిచ్చిన పుస్తకం మధ్యపేజీ చించి రెండు చపాతీలు వేసింది.కొద్దిగా మాడి అట్టల్లా ఉన్నాయి అవి. కూర డబ్బా తెరవగానే గుప్పుమంది వాసన.

'థాంక్యూ...'అందుకోబోయాడు.

'అయ్యో....వేడిగా ఉన్నప్పుడు ఖంగారులో మూత పెట్టేసాను.కూర పాడైపోయింది.ఈ పూట నాక్కూడా పస్తే.'జాలిగా అతని వంక చూసింది.

'....'కళ్ళు పెద్దవి చేస్తూ భుజాలెగరేసాడు.

తెచ్చిన భోజనం చెత్తకుప్పలో పడేసింది.ఫోన్ స్విచ్ ఆన్ చేసి,రెండు నిముషాలు అలోచించి డయల్ చేసింది.

'ఏవండీ...పిల్లలేం చేస్తున్నారు?తిన్నారా?నేను లేనని ఏమైనా బెంగ పెట్టుకున్నారా?'

'...'ఏదో వెటకారంగా మాట్లాడుతున్నట్టు కొద్దిగా వినిపిస్తోంది అవతలి గొంతు.

'అత్తయ్య ఏమైనా ఫోన్ చేశారా?కాలు ఎలా ఉందిట?సిమెంటు కట్టు కట్టారంటనా?నేను చేస్తే తియ్యలేదు ఫోను.'

'...'పొడిపొడిగా వినిపిస్తున్నాయి అవతలి మాటలు.

'సరే.ఎక్కువ సేపు టీవీ దగ్గర కూర్చోకుండా తొందరగా పడుకోండి.పక్కన ఎవరూ లేకపోతే పిల్లలు మధ్యలో లేచి ఏడుస్తారు.టీసీ ఏం అనలేదు...'

'...'ఫోన్ కట్ అయిపోయింది.

❦❦❦

అర్ధరాత్రి దాటింది.హ్యాండ్ బాగ్ మీద తల వాల్చుకుని,చీరని గుండెల నిండా కప్పుకుని పడుకోడానికి ప్రయత్నిస్తోంది ఆమె.రెండ్రోజుల్లో పౌర్ణమి.అటూ ఇటూ  కదిలినప్పుడు చప్పుడు చేస్తున్న పట్టీలు,కిటికీ లోంచి వస్తున్న వెలుగుకి మెరుస్తున్నాయి.మసక మసకగా ఉన్న వెన్నెల వెలుతురులో ఆమెని గమనించాడు అతను.పొందిగ్గా కట్టుకున్న కలంకారీ కాటన్ చీర,ముఖం మీద పడుతున్న జుత్తు,మూసినా కూడా పూర్తిగా రెప్ప సరిపోనంత పెద్ద కళ్ళు. అతన్ని చూస్తోందేమో అని భయపడ్డాడు.

బాత్రూం దగ్గర లైటు మిణుకు మిణుకుమని వెలుగుతూ ఆరుతూ విసుగు పుట్టిస్తోంది.పక్కనుండి వేగంగా వెళ్లిన రైలు చప్పుడుకి ఉలిక్కిపడి లేచింది ఆమె. ఎదురుగా అతను కనిపించలేదు.మళ్ళీ నిద్రపోవడానికి ప్రయత్నించింది.పక్క బెర్త్ లో పిల్లాడు గుక్క పట్టి ఏడుస్తున్నాడు.సాయంత్రం నుంచి పడుకునే ఉన్న మనిషి ఆపకుండా గురక పెడుతున్నాడు.ఎదురుగా పైన ఎవరో కుర్ర జంట.ఊసులు చెప్పుకుంటూ గుసగుసలాడుకుంటున్నారు.లేచి అతని కోసం వెతికింది.తలుపు దగ్గర కూర్చుని ఏదో రాయడానికి ప్రయత్నిస్తున్నాడు.డైరీ కాబోలు.

ఇవతల ఇద్దరు ఆడవాళ్ళూ మాట్లాడుకుంటున్నారు.పళ్ళు అమ్ముకునే వాళ్లేమో.పక్కనే గంపలు ఉన్నాయి.

'వెళ్లే రైల్లో రాయడం అంటే..ఇసుకలో పిచ్చి గీతలు గీసినట్టే.నా రాతలా వంకర టింకరగా తయారవుతాయి.' ఎదురుగా కూర్చోబోయింది,కొంచెం దూరంగా.

'అయ్యో ఇక్కడ కూచుంటున్నారేంటి?' ఖాళీ జామపళ్ళ బుట్టలో ఉన్న పాత దిన పత్రికని అడిగి తీసుకుని ఆమెకిచ్చాడు.

'నాకు తలుపు దగ్గర కూచోడం ఇష్టం అండీ.కానీ మా ఆయనకి ఇష్టం ఉండదు.మీకు పెళ్లైందా?'దినపత్రికని పరిచి దానిపై కూచుంది.

'హా..చేశారు.'

'..'అర్థం కానట్టు చూసింది.

'నా మరదలే...'బైటికి చూసాడు.

'అదృష్టవంతులు.పెద్ద వాళ్ళు చేసిన పెళ్లిళ్లే ఉత్తమం.అందునా వరసైన వాళ్ళైతే గొడవే లేదు.'

'ఆ గొడవలే ఇక చాలని, తెంచేసుకుని తిరిగి వెళుతున్నా.'పుస్తకం మూసాడు,అప్పటి వరకూ తను రాసుకుంటున్న పేజీని చివర మడత పెడుతూ.

'మ్..'

'చిన్న చిన్న గొడవలండీ..మేనల్లుడినని మా అత్తామామకి లోకువ.తనకేమో వాళ్ళ గారాబం.చిన్నప్పటి నుండి కలిసే పెరిగాం. ప్రత్యేకంగా ప్రేమ ఎలా చూపిస్తాను?రోజూ నరకం.ఒకళ్ళకి ఒకళ్ళం ఇష్టంలేని బంధం అన్నట్టుంది మా పరిస్థితి.'

'మీ తప్పేం లేదా?'అతను సమాధానం చెప్పలేదు.

ఊళ్ళని,చెట్లని పలకరిస్తూ దాటుకుంటూ పోతోంది. రైలు తలుపునుండి ప్రపంచాన్ని చూస్తుంటే జీవితంలా అనిపిస్తోంది.అందరూ వచ్చి వెళ్లిపోయేవారే అన్నట్టు తోస్తోంది. చందమామ మాత్రం చివరివరకు వస్తా అన్నట్టు రైలుతో పాటే పరిగెడుతున్నాడు.ఫక్కున నవ్వింది, ఉదయం రాబోయే సూర్యుడు గుర్తొచ్చి.

'...'ఏంటి అన్నట్టు కళ్ళెగరేసాడు.

'...'ఏమీ లేదన్నట్టు నవ్వింది.

'ఎవరైనా గుర్తొచ్చారా?మీ వారా?'

'అలాంటిదే.'జుత్తుని చెవుల వెనక్కి తోసింది.

'మీది ప్రేమ వివాహమా?చాలా చనువుగా కనిపించారు మీరిద్దరూ..'

'...'ఆమె ఏమీ మాట్లాడలేదు.అనవసరంగా అడిగా అనుకున్నాడు అతను.

'ఏదో ఊరకనే అడిగాను.'

'పదిహేడేళ్ళకి ప్రేమే అనిపించింది.ఇంట్లోంచి పారిపోయే ధైర్యం ఇస్తే గొప్పనిపించింది.'

'మరిప్పుడు?'

'నలుగురు మనుషులుండే మూడు గదుల ఇంట్లో,వారం పది రోజులకి ఒకసారి ఏ అర్ధరాత్రి పూటో హఠాత్తుగా ప్రేమ గుర్తొస్తుంది మా ఆయనకి.తొలికోడి కూసే లోపు ఆ చాప మీదే నలిగి నశించిపోతుంది,ఆ కాస్త ప్రేమ.'

'సారీ..మనం దీని గురించి మాట్లాడుకోకుండా ఉండాల్సింది.'

'అన్నీ బావున్నప్పుడు సరే గానీ,లేనప్పుడే...ఎటు తిరిగి ఎటు వచ్చినా గతంలో చేసిన తప్పు దగ్గరికే వెళ్లి నిల్చుంటాం.గతంలోని మనం వర్తమానంలోని మన జీవితానికి ఎప్పటికీ సమాధానంలేని ప్రశ్నలమే.'

'ప్రేమ వివాహం అంటే ముందు నుండి అన్నీ తెలిసే చేసుకుంటారు కదా? ఏదైనా సమస్య ఉంటే మీరు,మీ వారు కూర్చుని మాట్లాడుకుంటే...'

'నేను మీ కాపురం గురించి ఏమైనా సలహా ఇచ్చానా?ఒక్కసారి మీ అత్తా మామలతో కాకుండా, ఆమె మనసులో ఏం ఉందో కనుక్కోమని చెప్పానా? లేదు కదా?ఏదో సందర్భం వచ్చింది అని ఆపుకోలేక బయటకి చెప్పేసాను.ప్రతీవాడికీ తనకన్నా పక్కవాడి బ్రతుకే బావుందనిపిస్తుంది.వాడి సమస్యలు వీడికి ఇదిగో, ఈ రైలు పట్టాల మధ్య ఉన్న రాళ్ళలా పనికిరానివిగానే కనిపిస్తాయి.నిజానికి రైలు సాఫీగా నడవాలంటే ఆ రాళ్లెంత ముఖ్యమో సంసారానికి చిన్న చిన్న సమస్యలు కూడా అంతే ముఖ్యం.ఆ రాళ్ల విలువ రైలు ప్రయాణం చేయాలనుకునే వాడికి తెలుస్తుంది.తెంచుకుని వచ్చేసిన మీకేం తెలుస్తుంది?'

'..'చురుక్కున చూసాడు ఆమె వంక.

'నేను బాత్రూమ్ కి వెళ్ళాలి.'కోపంగా లేచింది. అతనికి ఇంకేం రాయాలనిపించలేదు.ఫోను చూసుకున్నాడు. ఛార్జింగ్ అయిపోవచ్చింది.

చాలాసేపటివరకూ ఆ సీటు ఖాళీగా ఉండేసరికి ,ఎవరో ఒకామె తన పిల్లని పెట్టుకుని పడుకుంది. లేపాలనిపించలేదు. తన పిల్లలు గుర్తొచ్చారు.ఫోన్ తీసి టైం చూసుకుంది.ఇంకా మూడుగంటల ప్రయాణం. మళ్ళీ తలుపు దగ్గరికి వచ్చింది.అతను అలా శూన్యంలోకి చూస్తున్నాడు.వచ్చి కూర్చుంది.కాళ్ళని మడిచి పెట్టుకుని మెట్లని వేలిచుట్టూ తిప్పుతూ కిందకి చూస్తోంది.అక్కడ గంపలతో కూర్చున్న ఆడవాళ్ళు మాత్రం ఆగకుండా వాగుతున్నారు.

'అయినా ఒదినీ..నీ అల్లుడు మంచోడే కదంటే?'

'మంచోడని సిన్నగా అంటావేటే? బంగారం.పైసా కట్నం లేకుండా సేసుకున్నాడు నా కూతుర్ని.'

'మరింకెందుకే నీకీ అద్దరేత్తిరి వరకా దూటీలు?సుబ్బరంగా ఏ సాయంకాలం బండికో కొంపకి పోక?'

'నా కూతురు అల్లుడూ కూడా ఇదే మాటంటారొదినీ.కానీ సిన్న పిల్లలు కదా.కొంపలో నేను లేపోతే కాంత సరదాగా ఉంటారని.'

'బాగానే ఉంది.సెట్టెనకాతల నుండి సందమామ తొంగి తొంగి సూత్తన్నాడని,గుడిసెనకాల కోడి గుడ్డెట్టనందంట.అలా ఉంది నీ వరస.'

అతను,ఆమె పగలబడి నవ్వుకున్నారు ఆ అమాయకపు ఆడవాళ్ళ మాటలకి.

'సారీ..'ఒకేసారి చెప్పుకున్నారు ఇద్దరూ.

'సాయంత్రం నుండి ఇదే మీరు నవ్వగా చూట్టం నేను.మరోలా అనుకోవద్దు.మీరు నవ్వితే పడే సొట్టలు బావున్నాయి. మగవారికి అరుదుగా ఉంటాయి.సొట్టలు పడితే అదృష్టం అంటారు.'

'మ్..ముఖం కడుక్కుని వచ్చినట్టుంది.కాటుక కొద్దిగా చెదిరింది.

'ఇంతకీ,మీరు ఏ ఉద్యోగం చేస్తారు?'

'చిన్న వ్యాపారం.అప్పుడప్పుడు పత్రికలకి కథలు రాస్తుంటాను..'

'నాకు పుస్తకాలు చదివే అలవాటు పెద్దగా లేదు.ఏమనుకోవద్దు.నా చదువు మధ్యలోనే ఆగిపోయిందని ఉక్రోషం.వివాహం విద్యానాశాయ అంటారు కదా అలా..'

'జీవితమే పెద్ద పుస్తకం.అది చదివినట్టున్నారు మీరు.చాలు.ఇంతకీ మీరేం చేస్తుంటారు?'

'ఇద్దరు పిల్లల తల్లిని,ఒక దిగువ మధ్యతరగతి భార్యని.బహుశా నా ఉనికిని వెతుక్కుంటున్నాను అనుకుంటా.ఉద్యోగం చెయ్యడం మా వారికి ఇష్టం లేదు..'

'నా మరదలికి ఉద్యోగం చెయ్యాలని ఆశ.నాకన్నా కూడా చాలా తెలివైంది తను.కానీ ఇప్పుడు..'

'ఆశలు పడటమే మనిషి చేయగలిగేది..'.

'మీ మాటలు,గొంతు చాలా బావున్నాయి.నేను కాదు,మీరు రాయాలి కథలు..'

'కొద్దిగా సంగీత జ్ఞానం ఉంది లెండి.ప్రేమించుకునే రోజుల్లో అనేవాడు మా ఆయన.నాతో సినిమాల్లో పాటలు పాడిస్తా అని..ఇప్పుడు జోలపాట పాడినా విసుక్కుంటాడు.'చీర కొంగుని దగ్గరగా చుట్టుకుంటూ.

'ఈ విసుగుకీ ప్రేమకీ చాలా దగ్గర సమ్మంధం ఉందండోయ్.మెత్తగా ఉంటే చులకనైపోతా అని విసుగు నటిస్తా నేను...'

'విసుగు మొహం చూస్తేనే దగ్గరకి వెళ్లాలనిపించదు నాకు.అందుకే కాస్త విసుక్కోగానే ఏడుపు వచ్చేస్తుంది'.

'అసలు నాకు తెలియక అడుగుతాను,ఏం చెప్పినా నీ కోసం,మన కోసం అని ఎందుకు ఆలోచించవు?'

'ప్రేమగా చెప్తే ఎందుకు వినను?బుజ్జగించాల్సిన అవసరం లేదు.కానీ నా అభిప్రాయాలకి కూడా విలువిస్తున్నారు అని నాకు నమ్మకం కలగాలి కదా?'

'అందరిలా ప్రేమని పైకి చూపించలేను.అర్ధం చేసుకునే మనసుంటే నా ప్రతీ చేష్టలో నీకు ప్రేమ కనిపిస్తుంది.అయినా అన్నాళ్ళు కాపురం చేసాక కూడా,నేనిలాంటి వాడిని అని తెలుసుకోలేకపోతే ఇంక మన బంధానికి అర్ధం ఏం ఉంది?'

'పెళ్ళికి ముందు నువ్వు,పెళ్లయ్యాక మీరు గా మారిపోయావు.ఇద్దరు పిల్లలతో ఇంట్లో కూచోపెట్టావు.'

'మన మధ్యన ఉన్న దగ్గరితనం బయటి వాళ్ళ ముందు చూపించాల్సిన అవసరం ఏం ఉంది?బయట పని చెయ్యడం అంటే ఎన్నో ఒత్తిళ్ళని తట్టుకోవాలి.ఆ కష్టం నీకెందుకు అని...అయినా నా కన్నా నువ్వు తెలివైన దానివని సిగ్గు లేకుండా ఎన్నో సార్లు ఒప్పుకున్నాను.'

'సరే ఇకనుండి నువ్వు ఆ విసుగనే ముసుగు వేసుకోకుండా ఉండు అయితే..నా కోసం. '

'నువ్వు అన్నిటికీ ఆ ఏడుపు ముసుగు వేసుకోకు అయితే..ఇది నా కోసం..' ఈ సారి ఆమె చూపులు అతని చూపులకి కలిసాయి.

'సార్..ఇక్కడ కూర్చోకూడదు.వెళ్లి లోపల కూర్చోండి..మేడం పదండమ్మా'వెనకనుండి రైల్వే పోలీసు లాఠీ తో తలుపు మీద తట్టి వెళ్తూ చెప్పాడు.

అందమైన కలల కొలనులో రాయి పడి చెదిరినట్టనిపించింది. ఎందుకో ఇబ్బందిగా అనిపించింది ఇద్దరికీ. కాసేపు ఏమీ మాట్లాడుకోలేదు.

రైలు బ్రిడ్జి మీద నుండి వెళ్తోంది...

'గోదావరా??'అప్పటిదాకా ఎదురుగా కుదురుగా ఉన్న ఆమె వచ్చి పక్కన కూచుంది.అతను ఊహించలేదు. గాలి వారి ఇద్దరి మధ్యనుండి కొంచెం కష్టపడి తప్పించుకు వెళ్తోంది.

'జాగ్రత్త...పడతారు.'తన చేతిని ఆమె కాళ్ళకి  అడ్డుపెడుతూ కంబీని పట్టుకున్నాడు.

'చిల్లరుంటే ఇస్తారూ?నా బ్యాగ్ అక్కడ వదిలేసాను.'

'మ్..'

'గోదారమ్మని చూస్తే భయం ఎందుకండీ..నా తల్లి..'దణ్ణం పెట్టుకుని చిల్లర వేసింది.

చల్లని గాలి మనసుని,ఆలోచనల్ని కూడా శుద్ధి చేస్తున్నట్లుంది.

'ఇదిగో,టీసీ అడిగితే ఈ టిక్కెట్టు చూపించండి.విజయవాడలో దిగినప్పుడు తీసుకున్నాను.మీరు మంచి నిద్రలో ఉన్నారు ఇద్దామంటే.'

'మొద్దు నిద్ర నాది.థాంక్యూ...మీకు నేను నూట ముప్పై ఆరు రూపాయలు బాకీ..ఇందాకిచ్చిన చిల్లరతో కలిపి.'టిక్కెట్టు తీసుకుంటూ గమనించింది,అతని చేతి మీద హృదయాకారంలో చిన్న పచ్చబొట్టు.అతని భార్య పేరు కావొచ్చు.

రాజమండ్రి దాటింది.మాటల్లో మునిగిపోయారు.తనని పట్టించుకోవట్లేదని చందమామ అలిగి మబ్బుల వెనక దాక్కుని మధ్య మధ్య వచ్చి గమనిస్తున్నాడు. చలం సాహిత్యం నుండి,రఫీ పాటల మీదుగా,కోఠీ లో చవగ్గా దొరికే చిన్నా చితకా వస్తువులని దాటుకుని,హుస్సేన్ సాగర్ లో బుద్ధుడిని పలకరించి భీమిలి బీచ్ లో రాళ్లతో ఆడుకుంటూ...సంభాషణ చాలాసేపు సాగింది.

అలాగే కూర్చున్నారు ఇద్దరూ.శరీరాలు తగలట్లేదు.కానీ అక్కడినుండి వెళ్లాలనిపించలేదు.చాలాసేపు మౌనం.అప్పుడప్పుడు ఆమె జుత్తు అతని ముఖం మీద పడుతోంది. ఇద్దరికీ మనసు చాలా తేలిగ్గా ఉంది.ఆ రోజు వరకు ఉన్న చిన్న చిన్న చింతలన్నీ తీరిపోయినంత ఆనందం.రేపటికి జవాబుగా ఏదో భరోసా దొరికిన భావన. ఒక పాత స్నేహితుడిని కలిసినట్టుంది.మన తప్పొప్పుల్ని వివరించి చెప్పే ఒక ఆత్మీయ నేస్తం తారసపడినట్లు...

ముఖం కడుక్కుంటూ అద్దంలో తనని తాను చూసుకున్నాడు.ఏదో కొత్తగా మళ్ళీ పుట్టినట్టు అనిపిస్తోంది. అద్దంలో దూరంగా అతని వెనక ఆమె..వెళ్లాల్సిన చోటు దగ్గరవడంతో బ్యాగ్ సర్దుకుంటోంది.ఉన్నట్టుండి గుర్తొచ్చింది,ఆమె పేరైనా అడగలేదు అని ..బండి ఆగింది.

దిగి నడుస్తోంది.వెనక్కి తిరిగి చూడలేదు లేదు ఆమె.వర్షం పడినట్టుంది.నీటిగుంటలో ఆమె ప్రతిరూపం చూసుకుంది.

'ఇంత సౌఖ్యమని నేఁ జెప్పజాల...ఎంతో యేమో యెవరికిఁ దెలుసునో?' అన్నవరం స్టేషన్లో టీ కొట్లోంచి పాట వినిపిస్తోంది.వింటున్న ఆమెలో తృప్తితో కూడిన చిన్న చిరునవ్వు.

బండి ఆగాల్సిన దానికన్నా ఎక్కువ సేపు ఆగింది ఆ స్టేషన్లో.అతని మరదలికి ఫోన్ చేసాడు.లేచినట్టు లేదు ఇంకా.

పుస్తకం తెరిచాడు,రెండు వంద నోట్లు.బాకీ తీర్చేసింది కాబోలు.

ఆమె సగం పూర్తి చేసిన పజిల్ పూర్తి చెయ్యడం ప్రారంభించాడు అతను.రైలు కదిలేసరికి ఆఖరు గడి పూర్తయింది..'సీత' అన్న అక్షరాలతో...బహుశా అతని తర్వాత కథ కావచ్చు.మెల్లగా ఆమె కనుమరుగైంది!!!!

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

## "హృదయ స్పందన"

కల్యాణి నల్లాన్ చక్రవర్తుల (Sunnyvale, CA)

"**అమ్మా!** మీకు జరిగింది అన్యాయమే కాదనను, కానీ..."

"ఏమిటయ్యా! ఒకసారి చెప్తే అర్ధం కాదా! మా బాధలో మేమున్నాము. మమ్మల్ని ఇబ్బంది పెట్టకు. వెళ్ళు!"

"అదికాదండీ..ఒక్కసారి నేను చెప్పేది పూర్తి గా వినండి.."

"ఏది కాదయ్యా! అసలు మేమే ఊహించని ప్రమాదం తో తీరని దుఃఖంలో ఉన్నాము. మధ్యలో నీ గోల ఏమిటీ..! మేమలాంటి పనులు చేయలేం.." ఏడుస్తూనే గట్టిగా కసిరాడు రాఘవ.

"డాక్టర్ గారు..! మరొక్కసారి వాడిని చూడండి..! నా బంగారు కొండ వాడు..! ఇంతలో నాకింత అన్యాయం చేయడు. నిన్ననే చెప్పాడు 'అమ్మా నాకు టాప్ యూనివర్సిటీ లో సీట్ వస్తుంది చూడు..నేను డాక్టర్ అవుతానమ్మా, ఎంతో మందికి వైద్యం చేస్తాను. జీవితాన్నిస్తాను' అని, ఎంతో భవిష్యత్తు ఉన్నవాడు, ఇంతలో అలా ఎలా వెళ్లిపోతాడు.."

పెద్దగా రోదిస్తూ అంది లక్ష్మి రాజ్యం.

"అయాం సారీ! అమ్మా!.. అతనికి తలకు తగిలిన దెబ్బ చిన్నది కాదు. కోలుకునే అవకాశం ఏమాత్రం ఉన్నా నేనిలా చెప్పను. నేనింతకంటే ఇంకేమి చెప్పలేను మీ ఏర్పాట్లు మీరు చేసుకోండి..." చిన్నగా అయినా గట్టిగా చెప్పి అక్కడ నుండి వెళ్లి పోయాడు డాక్టర్.

ట్వెల్త్ గ్రేడ్ పూర్తి కాగానే, ఎంబిబిఎస్ కోసం అన్ని యూనివర్సిటీ లకు అప్లై చేసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాడు ప్రకాష్.

వీకెండ్ నలుగురు స్నేహితులతో కలిసి కారులో బిక్సర్ బీచ్ కి వెళ్తూండగా,

మధ్యలో లేన్ మారుతూ, అనుకోకుండా స్టీరింగ్ కంట్రోల్ తప్పి పక్కనే ఉన్న పల్లంలోకి కారు దూసుకుపోయి, స్పీడ్ గా వెళ్లి చెట్టుకు కొట్టుకుంది. డ్రైవర్ సీట్ పక్కన కూర్చున్న ప్రకాష్ సీట్ బెల్ట్ తొలగించి పెట్టుకోవడం మరిచిపోయాడు. అనుకోకుండా కారు అదుపుతప్పి, చెట్టుకు గుద్దుకుని, డోర్ తెరుచుకోవడం వల్ల ప్రకాష్ ఎగిరి బైటకి పడి, డైరెక్ట్ గా వెళ్లి తల చెట్టుకి గుద్దుకుంది.

మిగతా వారు లోపలే ఉన్నారు, కనుక చిన్న దెబ్బలు తగిలాయి. వెంటనే 911 కి కాల్ చేశారు.

అంబులెన్స్ సహాయం తో ప్రకాష్ ని హాస్పిటల్ కి తరలించినా మెదడులో ముఖ్య నరాలు చిట్లి, విపరీతమైన రక్తస్రావం కావడం తో బ్రెయిన్ డెడ్ అయిపోయింది. డాక్టర్లు తీవ్రంగా ప్రయత్నించి చేతులెత్తేశారు.

ఇంక లాభం లేదు! ఇంటికి తీసుకెళ్లి పొమ్మని చెప్పారు. తల్లి తండ్రులు ఆ క్షోభ భరించలేక ఏదో విధంగా తమ బిడ్డని రక్షించమని, రాత్రి నుండి బతిమాలుతూనే ఉన్నారు.

ప్రమాదంలో కాలు విరిగి హాస్పిటల్ లో ఉన్న స్నేహితుడిని చూడడానికి వచ్చిన హరీష్ ఇదంతా గమనించి, విషయం అర్ధం చేసుకున్నాడు.

ఆ తల్లి తండ్రుల బాధ చూసి, తన బాధ గుర్తుకువచ్చి, కంట నీరు ధారాపాతంగా కారుతుంటే తుడుచుకోవడం కూడా మరిచిపోయి మూడు గంటల నుండి అక్కడే కూర్చుండి పోయాడు.

ఆ వేదన ఎంత భయంకరంగా ఉంటుందో తనకి తెలిసినా, తన ధ్యేయం గుర్తుకు వచ్చి, వారి ఆవేదన కాస్త నెమ్మదించే వరకు ఉండి, ధైర్యం చేసి వారిని అడగాలని ప్రయత్నం చేస్తున్నాడు.

మొదట రాఘవ, బంధువులు అతను అడుగుతున్న విషయానికి కోపం వచ్చి, గట్టిగా అరిచి విసుక్కున్నా, తరువాత 'మా ఆచారం ప్రకారం అలా చేయకూడదు. మనిషి కి మరుజన్మ ఉంటుందని నమ్ముతాము. మేమలా చేయము దయచేసి వెళ్ళమ'ని కోపంగా చెప్పారు.

అయినా పట్టు వదలక వారిని బతిమాలి అయినా సరే, విషయం అర్ధమయ్యేలా చెప్పి, ఆ పని వారితో చేయించాలని గట్టి నిర్ణయంతో వారితో మళ్లీ మళ్లీ మాట్లాడే ప్రయత్నం చేశాడు.

వెంటిలేషన్ మీద ఉన్న తమ కొడుకు శ్వాసను చేతులారా ఆపమనలేక, జరగబోతున్న అనర్థాన్ని ఆపలేక, అక్కడే కుర్చీల్లో చతికిలబడి దుఃఖిస్తున్న ఆ తల్లితండ్రులు, మిత్రుల వద్దకు చివరి ప్రయత్నంగా వెళ్ళాడు హరీష్.

"సర్! దయచేసి నన్ను అపార్థం చేసుకోకండి. మీ మంచికే చెప్తున్నాను..."

అంటూ పక్కన ఉన్న మిత్రుల వైపు తిరిగి,

"సార్! మీరైనా ఒప్పించండి వారిని. మీ అబ్బాయి అంత చిన్న వయసులో అర్ధాంతరంగా పోవడం ఆ తల్లి తండ్రులకే కాదు, నాకూ చాలా బాధగా ఉంది. వారి దుఃఖం తీర్చడం ఎవరి వల్లా కాదు కానీ, కొంచెం సంయమనంగా ఆలోచిస్తే, పోగొట్టుకున్న వారి అబ్బాయిని ఎంతో మంది జీవితాలలో చూసుకోవచ్చు. అబ్బాయి డాక్టర్ కావాలనుకున్నాడు అంటున్నారు. అతనే డాక్టర్ అయి ఉంటే భవిష్యత్ లో ఎందరు ప్రాణాలను కాపాడి ఉండేవాడు.

ఇప్పుడు అతనికి ఆ అవకాశం వచ్చిందని అనుకోండి. మనిషిగా తను దేహత్యాగం చేస్తూ, సాటి మనుషులకు జీవితాన్ని ఇవ్వగలిగే జీవిత సార్థకత ఎంతమందికి వస్తుంది. అతని జీవితాశయం వృధా అవకూడదు. అతని ఆశయం అతని మరణం లోనూ వీడకుండా మీరు చేయవచ్చు.

అతని కళ్ళు, గుండె, లివర్, కిడ్నీలు, దాదాపు అన్ని భాగాలు చక్కగా పనిచేస్తూనే ఉండి ఉంటాయి. అతని చివరి శ్వాస ఆగే లోగా మీరు మంచి నిర్ణయం తీసుకుంటే జీవితాంతం మీకొడుకు ఏదో రూపంలో ఎక్కడో ఒకచోట ఉన్నాడన్న తృప్తి మిగులుతుంది. అంత మందికి జీవనదానం చేసిన పుణ్యం మీ అబ్బాయికి దక్కుతుంది.

నేనూ ఊరికే చెప్పడం లేదు సార్! నేను నా ఆరేళ్ల కొడుకుని పోగొట్టుకున్న బాధను అనుభవించిన వాడినే. పుత్రశోకం ఎంత భయంకరంగా ఉంటుందో నాకూ తెలుసండీ!

ఒకరోజు ఉన్నట్టుండి స్కూల్ లో స్పృహ తప్పి పడిపోయిన నా కొడుకును పరీక్ష చేసిన డాక్టర్లు గుండె కవాటాలు బలహీనంగా ఉన్నాయి. వయసు పెరిగినా కొద్ది మరింత బలహీనమవుతాయని వాటిని మార్చకపోతే పిల్లవాడు దక్కడని, డోనార్ లు ఉంటే ప్రయత్నించమని చెప్పారు. ఏడాది పాటు ఎంతగానో ప్రయత్నించాను.

ఎన్నో సంస్థలలో ఆర్గాన్ డొనేషన్ చేసిన వారిని ఎంక్వైరీ చేసి, అందుబాటులో ఉంటే చెప్పమని అర్జి పెట్టాను. కానీ బ్రతికున్న మనిషి నుండి తీయలేనివి కాబట్టి అంత సులభంగా దొరకవు. మరొకరి మరణం కోసం చూడడమంత దుర్భర పరిస్థితి మరొకరికి రాకూడదు. నా బాబు కంటే ముందు నుండి ఎదురు చూస్తున్న ఎంతోమంది అభాగ్యులను దాటి నావరకూ రాలేదు. నా కొడుకు నన్ను వీడి వెళ్ళిపోయాడు.

అప్పుడే నేను, నా భార్య మా తదనంతరం మా శరీరంలో ఉపయోగపడే ఏ భాగమైన నిరభ్యంతరంగా మరొకరికి చేర్చమని రిజిస్టర్ చేసుకున్నాము.

ఇప్పుడు కూడా నేను మిమ్మల్ని ఏమీ కోరడం లేదు. ఎలాగూ తిరిగి రాని లోకాలకు పయనమవుతున్న మీ అబ్బాయి ఆత్మ కు ఒక మంచి పని చేస్తూ లోకాన్ని వీడానన్న తృప్తి, శాంతి కలిగే విధంగా మీరు ఈ నిర్ణయం తీసుకుంటే బావుంటుంది.

దయచేసి మీరైనా వారిని ఒప్పించండి సర్!

ఏటా.. అవయవదానం కోసం చిన్న చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకు లక్షల మంది ఎదురు చూస్తున్నారు.

దాతలు గా ఉన్నవారు వందల్లో ఉంటున్నారు. నావంతుగా నేను ఒక్కరిని అందులో చేర్చగలిగినా సంతోషమే అన్న ఉద్దేశ్యంతో, నావంటి తండ్రికి ఒక్కరికైన మీరు ఆనందాన్ని పంచగలరేమో అని ఆశతో కోరుతున్నాను.

నూతన జీవాన్ని పొందిన వారి ఆశీస్సులు జీవనదాత గా మీ అబ్బాయికి అందుతాయి. మంచి నిర్ణయం తీసుకోండి సర్!

అంటూ కన్నీళ్ళతో ప్రార్థించాడు.

తన మాటలతో లక్ష్మి  రాజ్యం, రాఘవ కొంత కన్విన్స్ అయినట్టు అనిపించారు.

"మీరు ఒప్పుకొనెట్టు అయితే డాక్టర్ తో మాట్లాడండి. వారు ఎటువంటి నిర్ణయము త్వరగా తీసుకుంటారు ప్లీజ్.." అంటూ అభ్యర్థించాడు.

ఇండియా లో పేరెన్నికగన్న పెద్ద హాస్పిటల్.

రెండు రోజులు గా రాఘవ కి గుండె నొప్పిగా ఉందని ఎందుకైనా మంచిది అన్నివైద్య పరీక్షలు చేయిస్తే మంచిదన్న భార్య భయం, ఫ్యామిలీ డాక్టరు సలహాతో హాస్పిటల్ లో జాయిన్ అయ్యాడు. డాక్టర్లు అతన్ని రెండు రోజులు అబ్జర్వేషన్ లో ఉంచారు.

అన్ని టెస్టులు చేశారు.

కార్డియాలజిస్ట్ డాక్టర్ రాబర్ట్ వచ్చి అన్ని రిపోర్ట్స్ పరిశీలించాడు.

అతన్ని చూడగానే ఏదో ప్రసన్నంగా అనిపించింది రాఘవకు.

" ఎలా ఉన్నారంటూ" రాఘవ ను పలకరించి, రిపోర్ట్స్ అన్ని బాగానే ఉన్నాయని, గుండె కొంచెం బలహీనంగా ఉందని,

కాస్త కొలెస్ట్రాల్ లెవెల్స్ కూడా ఎక్కువ గా ఉన్నాయి. జాగ్రత్తగా డైయట్ పాటిస్తూ, వత్తిడి తగ్గించుకుంటే మంచిదని సూచించి, బీపీ కి మందులు మార్చి రాసిస్తూ, మీరిక ఇంటికి వెళ్ళవచ్చునన్నాడు.

అతన్ని చూస్తుంటే రాఘవకి ఏదో తెలియని ప్రశాంతత.

మరీ కాసేపు ఉంటే బాగుండునన్న భావన.

రాబర్ట్ చాలా నెమ్మదిగా, మృదువుగా అన్ని విషయాలు వివరించాడు.

కావలసిన మెడిసిన్స్ అన్నీ రాసిచ్చి, టేక్ కేర్ అంటూ మృదువుగా రాఘవ చేయి నొక్కి వెళ్లబోతూ....

ఏదో మరిచిపోయిన గా వెనక్కి వచ్చిన రాబర్ట్,

రాఘవ దగ్గరగా వచ్చి మెల్లిగా అతన్ని కౌగలించుకున్నాడు.

అతని స్పర్శ తో తో రాఘవ లో ఏదో తెలియని ఆత్మీయతా భావం సముద్రపు అలలా బలంగా తాకింది.

లోపలెక్కడో గుండెలో దాగి అణగారిన పుత్ర వాత్సల్యం పెల్లుబికింది. అప్రయత్నంగా రాఘవ కూడా రాబర్ట్ ని గట్టిగా పట్టుకున్నాడు. అతని గుండె లయ తనకేదో చెప్తున్నట్టు గా తోచింది.

ఐదు నిముషాల పాటు అలాగే గట్టిగా పట్టుకొని మెల్లిగా వదిలేసి బై చెప్తూ వెళ్ళిపోయాడు రాబర్ట్.

అర్దం కాని అయోమయం తో తనకు కలిగిన ఆ ఫీలింగ్ ఎందుకో! ఏమిటో! అర్దం కాక అలాగే ఉండి పోయాడు రాఘవ.

లక్ష్మి రాజ్యం కూడా తనలో ఏదో కలవర పాటును గుర్తించింది. ఎవరా డాక్టర్!? అతన్ని చూస్తే ఎందుకింతగా మనసును మెలి పెట్టిన బాధ, అంతలో ఏదో సంతోషం అనుకున్నారు.

కాసేపు ఏమీ మాట్లాడకుండా, ఒక రకమైన భావనలో ఉండి పోయారు ఇద్దరూ.

ఎందుకో మరొక్కసారి రాబర్ట్ ని కలవాలని అనిపించింది ఇద్దరికీ. అదే విషయం అక్కడి మేల్ నర్స్ తో చెప్పి అతని వివరాలు అడిగారు.

రాబర్ట్ అక్కడి కార్డియాలజీవిభాగంలో ప్రముఖ సర్జన్ అని, గత మూడేళ్లుగా పనిచేస్తున్నారని, కానీ ఉన్నట్టుండి ఎందుకో ఇక్కడ మానేసి వెళ్ళిపోతున్నాడని. ఎక్కడికి వెళ్తున్నారో తెలియదని అతనిక్కడ చూసిన చివరి పేషెంట్ మీరేనంటు వివరాలు చెప్పాడు.

అతన్నెలాగైనా ఒక్కసారి చూడాలని ఇద్దరూ బతిమిలాడడం తో రాబర్ట్ వారి గదికి వచ్చాడు.

అతన్ని చూడగానే దగ్గరగా వెళ్లి, తన మనసులో ఆరాటాన్ని వివరించాడు రాఘవ. ఎందుకు తనకిలా అనిపిస్తుందని. అతని గుండె చప్పుడు తనలో ఏదో తెలియని వాత్సల్యాన్ని కలిగిస్తుందని అడిగాడు.

రాబర్ట్ నవ్వి ఇద్దరి మధ్య కూర్చొని లక్ష్మి రాజ్యం, రాఘవ దంపతుల చేతులు పట్టుకొని,

"మీ ఈ కలవరానికి కారణం మీ అబ్బాయి గుండె నాలో ఉండడమే.

ఆరెళ్ళ క్రితం ఏక్సిడెంట్ లో గాయపడిన మీ అబ్బాయి ఆర్గాన్స్ డొనేట్ చేద్దామని నిర్ణయం తీసుకోగానే, అదే హాస్పిటల్లో గత రెండేళ్ళుగా గుండె మార్పిడి కోసం ఎదురు చూస్తున్న మెడికల్ విద్యార్థి నైన నాకు ఆ గుండెను ట్రాన్స్ ప్లాంట్ చేశారు.

హాస్పిటల్ నియమాల ప్రకారం అవి ఎవరికి అమరుస్తారో ఆ వివరాలు డొనేట్ చేసిన వారికి, రిసిపైంట్ కి తెలియనివ్వరు.

కానీ నన్ను సర్జరీ రూం కి తరలిస్తూ ఉండగా మిమ్మల్ని చూసాను. మీరు మరొక డాక్టర్ తో మాట్లాడడం విన్నాను. మీరు మీ బాధలో ఉన్నారు. నాకు విషయం అర్థమైంది. మీరు నన్ను చూడలేదు.

అక్కడే చేతులెత్తి మీకు నమస్కరించాను. సర్జరీ తరువాత నేను ఇంటికి వెళ్ళిపోయాను. కానీ అదే హాస్పిటల్ లో పనిచేస్తే, మిమ్మల్ని మళ్లీ ఎదుర్కుంటానేమో బలహీన పడతానని అనుకున్నాను.

ముఖ్యమైన కాన్ఫరెన్స్ పని మీద ఇక్కడికి వచ్చిన నేను మిత్రుల కోరిక మేరకు ఈ హాస్పిటల్ లో నా వైద్య సేవలు అందిస్తూ ఉన్నాను.

నిన్న ఇక్కడ మిమ్మల్ని చూసాక, నన్ను నేను సంభాళించుకొలేక పోయాను. ఒకసారి మిమ్మల్ని హగ్ చేసుకొని నా కృతజ్ఞత తెలుపుకోవాలని అనుకున్నా, కానీ మీరు మీ అబ్బాయి హృదయాన్ని ఇంత త్వరగా గుర్తిస్తారని ఊహించలేదు. మీకిక్కడ హాస్పిటల్ లో ఫ్యామిలీ డాక్టర్స్ ఉన్నారని, మీకే ఇబ్బంది ఉన్నా ఇక్కడికే వస్తారని తెలిసింది.

ఇక్కడే ఉంటే మీకు కనిపించి, నేనెవరో తెలిస్తే మీకింకా బాధ కలిగించిన వాడిని అవుతానని వేరే హాస్పిటల్ కి వెళ్ళిపోవాలని అనుకున్నాను.

మీ అబ్బాయి ద్వారా మీరు నాకు అందించిన ఈ కొత్త జీవితానికి సార్థకత కలిగేలా జీవించాలని నన్ను ఆశీర్వదించండి. టేక్ కేర్!" అంటూ, వడి వడి గా బైటికి వెళ్ళిపోయాడు.

లక్ష్మి రాజ్యం, రాఘవ దంపతులకు ఆనందాశృవులతో కన్నులు నిండిపోగా..

తమ కొడుకు ప్రకాష్ ఈ రూపంగా బతికే ఉన్నాడు...వాడికి ఇష్టమైన డాక్టర్ వృత్తిలో ఆ గుండెలో ఒదిగి ఉన్నాడని తెలిసి ఉద్వేగానికి గురయ్యారు.

ఆరోజు ఆ ఆవేదనలో ఆవేశంలో ఆ నిర్ణయం తీసుకోకపోయి ఉంటే ఈరోజు ఇంత తృప్తి పొంది ఉండే వారం కాదని,

ఆనాడు తమని బతిమిలాడి ఒప్పించిన హరీష్ కి మనసారా కృతజ్ఞతలు తెలియజేసుకుంటు, తృప్తి నిండిన హృదయాలతో ఇంటికి బయలుదేరారు.

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

## "మత్స్య గంధి"

– రామ్ నాథ్ బొడ్డపాటి (Danbury CT)

**తూరుపు తెల్లారిందా** అన్నట్టు ఆకాశం అంతా కన్నె పిల్ల సిగ్గు పడిన బుగ్గ ల్లా ఎర్ర బారింది. విశాఖ తెన్నేటి పార్క్ అంతా పక్షుల కిలకిలారావాలా తో సందడి గా మారుతొంది.

రత్తాలు వడివడి గా అడుగు లేస్తోంది . " ఇవాళ అమ్మ గారు సింహాచలం వెళతాను, ఒక అడుగు ముందే రమ్మన్నారు ".. అనుకుంటూ పక్కకి చూసింది.

" అమ్మ.. చచ్చినోడు మీసాలు దువ్వు కుంటూ నన్నే చూస్తున్నాడు. వీడి కంటికి కళ్ళ కలక రాను.!" అని తిట్టుకుంటూ జోడు గుళ్ల పాలెం నుంచి దయాళ్ నగర్ మలుపు తిరిగింది..

రత్తాలు "మత్స్య గంధి " లా మత్తు ఎక్కించేలా ఉంటుంది. రంగు నలుపే గానీ, కళగా ఉంటుంది. కళ్ళు " కామక్షి అమ్మ " వారిలా ఉంటాయి. పొడుగాటి తలకట్టు ఏమో, జడ వేస్తే నడుం దాటాలసిందే. తలంటి నపుడు చూడాలి దాని సొగసు.. దొరికిన పూలన్నీ దండకట్టి పెట్టుకుంటుంది..అది

నడిచి వస్తుంటే ఏ మగాడైనా ఆగి చూడాల్సిందే. అంత ఆకర్షణ, అందం దాని సొంతం..

"అమ్మగారూ", విసురుగా గేట్ తోసుకుంటూ వొచ్చింది. వొస్తూనే ముగ్గు డబ్బా అందుకుని, వాకిలి కడిగి, ఏదో గొణుక్కుంటూ, ముగ్గేసింది.

పదో క్లాసు దాకా చదివిందేమో అది ముగ్గేసినా అందమే. అంత తీరుగా ఉంటుంది దాని గీత, మాట..!

ఇంత లో రాజులమ్మ ఇందుమతి బయటికి నవ్వుకుంటూ బయటికి వొచ్చి, "ఏమైందే, అంతలా గొణుక్కుంటున్నావు..? "అంది.

అక్కడే వున్న ఆవిడ అత్త గారు నారాయణమ్మ గారు పూలు కోస్తూ, " ఆ ఏముంది, ఎవడో మళ్ళీ ఏదో కూత కూసింటాడు దీన్ని చూసి " అని కిసిక్కున నవ్వింది..

" పెద్దమ్మ గారు, మీకు మరీ ఎకసెక్కాలు ఎక్కువండీ.. వాడెవడో

రోజుకో రకంగా సతాయిస్తున్నాడండి.. ఓరోజు పందుంపుల్ల పట్టుకొని ఉంటాడు. మరో రోజూ వల అల్లుతూ కనిపిస్తాడు.. ఇంకో రోజూ పడవ దగ్గర ఏదో పని చేస్తున్నట్టు నా వంకే ఓరగా చూస్తూ నవ్వుతాడు.. నేను కోరగా ఓ చూపు విసిరి మరీ వస్తాను.. అయినా పొద్దున్న మళ్ళీ మామూలే.. మా అయ్యా తో చెప్పాలోసారి ఈడీ సంగతి. మక్కెలిరగొడతాడు నా జోలికి రాకుండా.. " అంటూ ఆ పూల బుట్ట లాక్కొంది. "నేను కోస్తాగా మీరెందుకమ్మా కోయడం" అంటూ..!

ఈ లోపల ఆవిడ కూతురు సీతమ్మ గేట్ లోపలికి నవ్వుతూ వస్తూ, "ఏమో, రత్తి , ఆవంక తో వాడేవిడినో ఇంకో సారి చూడాలనా"? అంది ఏడిపిస్తూ..

" చిన్నమ్మగారు, మీరుండండి.. మరీను " అంటూ చిరు అలకతో అటు తిరిగింది ముసి ముసి నవ్వులు పూయిస్తూ..

" అమ్మయి గారు, దీనికి తొందరగా పెళ్ళి చేయాలని మన నర్సిగాడితో చెప్పాలి. పెళ్లాడే వయసొచ్చింది దీనికి "అంటూ మేలమాడింది సీతమ్మ.

"పొండమ్మా, నేనెళ్ళిపోతే మా అయ్యా కి కూడేలాగా..? ఎవరెడతారు..? "

దానికి ఆవిడ దగ్గర బాగా చనువెక్కువ. అవిడ పెళ్ళికి చిన్న పిల్ల.. నర్సి గాడు పందిరి వేస్తూ, పెళ్ళి పనులు చేస్తూ తిరుగుతుంటే, ఇంతింత కళ్ళేసుకుని చూస్తూ, వాడికి అడిగినవి అందిస్తూ, సాయం చేస్తూ ఉండేది.

తల్లి పురిటి లోనే పోతే, ఎంతో ప్రేమగా పెంచాడు తండ్రి దాన్ని.. గారాబం చేసినా చదువు కోవాలని చెప్పి బడి లో పది వరకూ చదివించాడు. ఈ లోపల ఈడేరిందని, పరీక్షలు రాయలేక పోయింది.

"పొనీలేరా, మాకు ఆ పని, ఈ పనిసాయం చేస్తూ ఉంటుంది. నువు చేపల వేట కెళ్ళినా భయం ఉండదు " పెద్దమ్మ గారు అంటే అప్పటినుంచి ఈ రాజులింటిలో పనులు చేస్తూ తలలో నాలిక లా కల్సి పోయింది. ఇంట్లో మనిషి లా "పద్దతి" గా ఉంటుంది.. మగవాళ్ళు వస్తే తప్పుకు తిరుగుతూ, తల ఎత్తకుండా పని చేసుకుపోతుంది. వాళ్ళు బయటికి వెళితే మాత్రం దీనికి ఆడింది ఆట, పాడింది పాట.. ఇల్లంతా తిరుగుతు టుంది.

పెద్ద రాజు గారు ముద్దుగా దీన్ని " కత్తిరి పిట్టా " అని పిలుస్తారు.

" పెద్ద అమ్మ గారూ", అంటూ అరుస్తూ వచ్చాడు నర్సిగాడు చేతిలో చేపల గుత్తి తో..

" ఎంట్రోయ్, పొద్దున్నే ఇలా వచ్చావ్..? " గుబురు మీసాలు దువ్వు కుంటూ పెద్ద రాజు గారు , భార్య బయటకు వచ్చారు. రాజు గారు నిజంగా రాజు గారే.. సంపద లోను, దాన గుణం లోను.. !

"ఆది దంపతుల్లా " అనిపించారు వాడి కళ్ళకి..

గబుక్కన తల కి కట్టు కున్న గుడ్డ తీసి,భుజం కింద పెట్టుకుని " దండాలయ్యా , "అంటూ, "పెద్ద అమ్మ గారూ, మన రత్తాలుకి పెళ్ళి సంబంధం వొచ్చింది. వాళ్ళు మాకు దూరపు చుట్టాలే. మా రాముల క్కకి నా చిన్నప్పుడే రాజముండ్రి సంబంధం వస్తే చేసేసారు కుఱ్ఱాడు కుదురువున్నోడు, మంచోడని.. మా పెద్దాళ్ళు అంతా పోవడం తో రాక పోకలు తగ్గాయి. వాళ్ళ కొడుకే అయ్యా, "ముత్యాలరాజు". మా రాములక్కకి నేనంటే అభిమానం అమ్మా.. తల్లి లేని పిల్లని తన కొడుక్కి చేసుకోంటానని కబురెట్టింది తన కొడుకు తో..

వాడికి మన ' రత్తి 'అంటే మా చెడ్డ ఇష్టం.. నాతో విషయం చెపుతూ," పెళ్ళి చూపులు అవీ వొద్దు. నేనే చూసుకుంటా. నువు కూడా చెప్పద్దు మావ", అంటూ మాట తీసుకున్నాడు . కొంచం తుంటరోడే ..."మన రత్తి " తిక్క"కి ముక్కు తాడు వేసే వాడు వీడే" అంటూ చెప్పుకొచ్చాడు. నిన్న సాయంత్రం ఇంటి కోచ్చాడు నా కోసం.. అంతే, మన రత్తాలు "ఇంటికి కూడా వచ్చేవా "? అంటూ తెడ్డు తీసింది ఎవరో ఏడిపిస్తూన్నాడనుకొని... నేను అడ్డం పడక పోతే ఆడి పని అయ్యేది . "మావోయ్, నీ కూతురు చంపేస్తోంది.. తొందరగా రారోయి..!" అని ఒకటే పరుగులు.. అందరూ ఒకటే నవ్వు.. ఇక లాభం లేదు. ఇద్దరికీ ముడేసిడమే రైటు అనిపించి ఇలా వచ్చానమ్మా " ..

"మరి పంతులు గారితో మాట్లాడావా ముహూర్తం గట్రా చూడమని..? "అన్నారు పెద్దాయన . "అయ్యా, చెప్పా నండయ్యా. వారం రోజుల్లోనే వుంది..తరవాత మూఢం, గోదారి పుష్కరాలు గట్రా వున్నాయి అన్నారయ్యా.. మీతో ఓ మాట చెప్పి పోదామని ఇలా వొచ్చానయ్యా ", అనగానే సరే, అలాగే చెయ్యరా.. మా ఇంట్లో పెరిగిన పిల్ల. దానికి సారే, చీర మేమే ఇస్తాం..అమ్మగార్లు చూస్తారులే అవన్నీ ", అంటూ బయటకి నడిచారు.

" అయ్, అలాగేనయ్యా, మీలాంటి ధర్మ ప్రభువులుంటే నాకేటి బెంగ".. !అంటూ తను వెనుకనే వెళ్లాడు నర్సిగాడు.

వాళ్లటు వెళ్ళగానే పిల్లి లా లోపలికి వొచ్చింది రత్తాలు..అది చూసి ఆడాళ్లు అంతా ఆట పట్టించేరు దాన్ని.

" ఏమే, తెడ్డుతో కొట్టేయ్యమే వాణ్ణి ..?" మరి ఇప్పుడేలా కట్టు కుంటావే వాణ్ణి ..? " అంటూ.. వీరికి తోడు పక్కఇంట్లోనే వున్న సీతమ్మ తోడైంది.. ఇక నవ్వులే నవ్వులు అక్కడ అంతా..

ఆవిడ పెళ్ళికి ఇది చిన్న పిల్ల.. నర్సి గాడి తో పెళ్ళి పనులకు కూడా వచ్చేది.. అవీ ఇవీ అందిస్తూ వాడి వెనకాలే ఇంత లేసి కళ్ళు వేసుకుని అన్నీ చూస్తూ ఉండేది. ఆలా అలవాటు అయి బడి లోకి వెళ్లినా, రాగానే వీరి ఇంట్లో పిల్ల లా మసిలేది.. తల్లి లేని పిల్లని అంతా గారంగా చూసుకునే వారు. ఆలా పెరుగుతూ, వారందరికీ "తల్లో నాలిక" లా మెలిగేది. మగవాళ్ళు ఉన్నప్పుడు తలోంచు కొని, వినయం గా తప్పుకు తిరిగేది. వాళ్ళు విజయనగరం పొలం, తోటల పని మీద బయటకు వెళితే రెండు, మూడు రోజులు వచ్చేవారు కాదు. ఇంక ఇది FM రేడియో లా వాగుతూ, లల్లాయి పదాలు పాడుతూ పనులు చేస్తూ ఉండేది.. ఈడేరిందని పదో తరగతి పరీక్షలు రాయడం అవలేదు దానికి.. ఇంకేలాగా పెళ్ళి చేయలని నర్సి గాడు పట్టించుకోలేదు. వాడు వేట కెళ్ళినా దిగులు లేదు.. రాజులమ్మలు చూసుకునే వారు దాన్ని..

మొత్తానికి వారం రోజుల్లోనే తోటి బెస్త వారి సాయం తో "రత్తాలు, ముత్యాల రాజు " ఒక ఇంటి వారయి పోయారు . పెళ్ళి బట్టల్లో చూడ ముచ్చటైన జంట అనిపించింది అందరికి. భూపతి రాజు కుటుంబం వారి ఆశీస్సులు కోసం నర్సి గాడు కొత్త జంట ని వారింటికి తీసుకొచ్చాడు. వారి దీవెనల తో పాటు చీర , సారె, మంచం, కుర్చీలు, వంట సామాను అన్నీ అందించారు పెద్ద మనసు తో.. ఇక అమ్మ గార్లు అయితే ఎంతో సరదాగా మూడు నిద్రలు వారి ఇంటి లోనే జరిపిస్తామన్నారు. నర్సి గాడు, కొత్త జంట అయితే కాదన లేక పోయారు.

అవును మరి.. లంక అంత ఇల్లు. పిల్లలు చదువులు, ఉద్యోగాల నిమిత్తం వేరే వేరే ఊర్లలో వున్నారు. ఊరినుంచి వచ్చే రైతులు , పని వాళ్ళ కోసం "ఔట్ హౌస్ " ఒకటి కట్టించారు రాజు గారు అన్ని వసతులతో.. అది చక్కగా అలంకరణ చేసి వుంచారు తోటి బెస్త వనితలు ..

ఇక సాయంత్రం అవగానే ఇద్దరికీ స్నానం అది చేయించి, తెల్ల బట్టలు కట్టి, పసందైన విందు భోజనం పెట్టి గది లోకి నెట్టారు కిల కిల నవ్వుతూ అమ్మ లక్కలు. రత్తాలుకి ఎక్కడ లేని సిగ్గు ముంచు కొచ్చింది. వొంచిన తల ఎత్తదే..

మల్లె పూల పరిమళాలు ఒక పక్క, అగరొత్తుల గుబాళింపు ఇంకో పక్క.. ఇంతకీ బావ అలికిడి లేక తల ఎత్తిన రత్తాలుకి ఏదో వెతుకుతున్న ముత్యాల రాజు కనిపించాడు.

ఆశ్చర్యం గా కళ్ళు పెద్దవిగా చేసుకుని మరీ చూసింది రత్తాలు..

" ఏంటి బావ వెతుకుతున్నావ్..? " అనగానే,

“ఎందుకైనా మంచిదని తెడ్డు ఎక్కడైనా దాసినావేమోనని సూస్తన్నా” అన్నాడు వెక్కిరిస్తూ..

అప్పుడు వినిపించిన రత్తాలు నవ్వులకి బయట చెవులు రిక్కించి కొత్త జంటల కబుర్లు వింటున్న బెస్తల నవ్వులు తోడై రాజుగారింటికే కొత్త సోయగమొచ్చింది.

" పిచ్చి రత్తాలు, ఇక్కడ నుంచి బయట పడే దారి చూస్తున్నా" అనగానే, " ఛ వొద్దు బావ, తెలిస్తే అమ్మగార్లు బాధ పడతారు "..

"నా పిచ్చి రత్తీ, అది కాదు. నాకు ఇక్కడ ఊపిరి ఆడటం లేదు.. స్వేచ్చగా ఎగిరే పిట్టని పంజరం లో పెట్టి నట్టు వుంది "అన్నాడు ముత్యాలరాజు..

అవును వాడి బాధ వాడిది.. గోదారి లంకల్లో లాంచీ నడుపుతూ, పాపి కొండల యాత్రికులను యాత్ర చేయిస్తూ, సినిమా షూటింగ్ కి అన్ని రకాల హంగులు, అలంకరణలు అమర్చేవాడు.. కడియపు లంక నుండి పూలు, పళ్ళు తెప్పించి తనే స్వయంగా సెట్టింగులు అవీ వేయించేవాడు. అలాంటి వాడికి "గదిలో శోభనం "అంటే మా చెడ్డ ఇబ్బందే మరి.

రాత్రి సద్దు మణగంగానే నెమ్మదిగా, శబ్దం రాకుండా తలుపు ఘడియ తీసి రత్తాలిని ఒక చేత్తో, పంచె ఇంకో చేత్తో పట్టు కొని ఒకటే పరుగు.. పక్కనే వున్న పార్క్ ఆనుకుని వున్న గుడి మెట్ల మీదుగా సముద్రం దగ్గరికి పరిగెత్తారు ఇద్దరూ..

రాత్రి మసక వెన్నెల లేమో రోడ్డు మీద ఎవరూ కనిపించడం లేదు వారికి.. ఆఖరికి పోలీసులు కూడా డ్యూటీ టైం అయిపోవడం తో ఇళ్ళకి వెళ్ళి నట్టు వుంది.. రాత్రి కాపలా వాళ్ళు అక్కడక్కడా వున్నా నిద్రకి గట్ల మీద జోగుతున్నారు.

పడుతూ, లేస్తూ ఇసుక తిన్నెలు మధ్యకి చేరుకున్నారు. ఆ పరుగు తో ఇద్దరి గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి. ఆ దగ్గరి తనానికి ఒకరి గుండె చప్పుడు ఇంకొకరికి వినిపిస్తోంది .. ఒకరినొకరిని ఆనుకొని అలుపు తీరే వరకూ కొద్ది సేపు అలానే ఉండిపోయారు. అలల సందడి తప్ప ఇంకేమి వినిపించనంత ప్రశాంతం గా వుంది అక్కడ..

ఎక్కడో దూరంగా కుక్కలు అరవడం తో నెమ్మదిగా ఈ ప్రపంచం లోకి వచ్చారు ఇద్దరూ.. ఒకరినొకరు ఇష్టంగా, ప్రేమగా ఇరు కళ్ళలోకి చూసుకుంటూ, మొదట చూసుకున్న చూపులు, అలకలు, తెడ్డు ఎత్తడాలు అన్నీ గుర్తు వచ్చి కిసుక్కున మొదలెట్టి, హాయిగా నవ్వుకున్నారు.

"అవునే రత్తీ, నీకోసం ఇంటికొస్తే ఆలా కొట్టేయడమేనా..? పో బావా, నువు నువు నా అత్త కొడుకు వని కల గన్నానా, ఏంటి..? ఎవరో పోకిరోడు అనుకున్నా ".. నా తప్పేం లేదులే అన్నట్టు చూసింది.

"అవునా పోకిరోన్నే , వుండు చూపిస్తా ".. అని రత్తీ ని జడ పట్టి ఒక్క లాగు లాగాడు.

"జల్లో మల్లె చెండు వొళ్ళో కి జారి నట్టు" . ఆదాటున వాడి వోళ్లో పడింది రత్తీ..

అలాగే వెనక్కి వాలి సున్నితంగా పక్కకి వాలాడు. వాడి చేయి రత్తి తల దిండుగా మారింది. వాడి వెచ్చని ఊపిరి దాని బుగ్గలకి తగల గానే కళ్ళు మూతలు పడ్డాయి దానికి చిరు సిగ్గుతో.

దాని సిగ్గు చూసి వాడి లో ఆత్రం పెరిగింది చిత్రంగా .. నెమ్మదిగా వేలి కొసలతో చిలిపిగా దాని పొట్ట మీద గీయగానే రత్తి లో వీణ తీగలు మీటి నట్టయింది...

వాడి 'పోకిరీ 'తనాన్ని ఆహ్వానిస్తున్నాట్టు గా వీలుగా వెనక్కి వాలి పోయింది ఎప్పుడో తనకి తెలియకుండానే..

నెమ్మదిగా పిల్ల గోస్తనీ..సంద్రం లో కలిసి పోయింది.. సంద్రమే మరి చోటు చేసుకుంటూ, కలిసి, కరిగి పోయిందేమో ..

అలాగే నిద్ర లోకి జారు కున్నారు ఇద్దరూ.. తెల్లారుతుండగా దూరం గా మసీదు మైక్ లో సాయిబు "అల్లాహో అక్బర్ " అని గట్టిగా వినిపిస్తుండటం రత్తి కి మెలుకువ వచ్చింది.. చెదిరిన దుస్తులు ముంగురులు సవరించుకొని,నును సిగ్గుతో " లే బావా, లే తెల్లారుతోంది.. ఎవరైనా చూస్తే బాగుండదు.. అమ్మగార్ల కి తెలిస్తే నిన్ను, నన్ను కలిపి ఏడిపిస్తారు" .. అంది గోముగా..

" అబ్బా, పోవే, నువ్వు నీ అమ్మ గార్లు, నీకే వున్నారులే పెద్ద..!" అని పక్కకి తిరిగి పడుకున్నాడు..

"ఆ మాటనకు, బావా ఎప్పుడూ, వాళ్ళ అమ్మ కన్నా ఎక్కువ నాకు.". అంటూ

వాడి జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి.. నెమ్మది గా తిప్పుతూ , " బావా, నీతో ఓ మాట చెప్పాలి.. అమ్మ గార్లు చెప్పామన్నారు."

"అబ్బా చెప్పు , ఏంటే అది?

అదే బావ, నిన్ను పదహారు రోజుల దాకా చేపల వేటకి పోవద్దన్నారు, ఎందుకో మరి " అంది. దెబ్బతో వాడికి నిద్ర మత్తు వొదిలింది.

"అవునా, నాకు తెలుసులే ఎందుకో."

" ఏం తెలుసు నీకు. తొందరగా చెప్పు, అవతల తెల్లారుతోంది "

"వుండు చెపుతా".. అని పక్కకి ఒత్తిగిల్లి,

" అయినా రత్తి, నీ పిచ్చి గానీ , నా చేపలన్నీ నీలోనే ఉంటే నేను వేట కెందుకు వెళతానే.. నిన్నే నా వేటనుకుంటే పోలా.?

ఇదిగో ఈ మొహం వుందే , ఇది వంజరం, ఈ కళ్ళు రెండు కొర్ర మీనులు, ఈ రెండు చెవులు కోనాలు, మూతి మాత్రం ముంజె కాయ,ఇక వీపేమో టేకి చేప, ఈ వోళ్లేమో సందువా, ఈ చేతులు రెండూ మట్ట గిడిసెలు , ఆ చేతి వేళ్లు రొయ్యలు, మరి ఆ రెండూ కాళ్లు జెల్లలు, అయితే ఈ మోచిప్పలున్నా యే , ఇవి మాత్రం ఎంద్ర కాయలు, ఇక కాలి వేళ్ళు అయితే మెత్తని నెత్తళ్లు, మొత్తానికి నువ్వే నా పులస చేపవి " అంటూ చిటుక్కున దాని వేలు కొరికాడు..

అదేం తక్కువ తిందా.. వాడి చెవిని కిసుక్కున కొరికింది కొంచం సుతారంగా..అంతలోనే "మొగుడని " గుర్తొచ్చి , సిగ్గుల మొగ్గయింది. . అంతే, వాడు దాన్ని కదల కుండా పట్టుకుని అలాగే దగ్గరికి లాక్కున్నాడు. కళ్ళల్లోకి చూస్తూ, నవ్వుతూ అలాగే మెత్తగా అల్లుకుపోయాడు మళ్ళీ, మళ్ళీ...

దూరంగా ఈసారి షిప్పు హారను కొంచం గట్టిగా వినిపించింది. "సరసాలు చాలు. గుట్టుగా ఇక ఇంటికెళ్ళండి బాబూ అన్నట్టుగా..

దానికి తోడు దగ్గర లోని జోడు గుళ్ళ పాలెం గుళ్లో జే గంటలు గణ గణ మంటూ దీవించాయి ఇద్దరినీ..!

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా

## "పరిచితులు"

– శ్రీనాథ్ వాడపల్లి (New Jersey, USA)

# వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో 'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

**వర్షం వెలిసిన** ఉదయం తెలుస్తోంది. తడిసిన దిన పత్రిక ఫేస్ పేజీలో 'ప్రముఖ రచయిత సముద్రం ఒడ్డున....'

మరి చదవలేక పోయాను. ఐనప్పటికీ మొదటి లైన్ అప్రయత్నంగా నా మస్తకంలోకి చొచ్చుకుపోయింది. ఏదో intuition మెదడులోంచి అప్రయత్నంగా నా ప్రాణ స్నేహితుడి వైపు ఆలోచింపచేస్తూ ఈ కల్పన.

{ఇందులో పాత్రలు రెండు. ఒక ఆడ ఒక మగ. ఒకరికొకరు పరిచయం లేదు. వయసు ప్రశ్న లేదు. ఇద్దరిదీ రైలు పట్టాల మాదిరి చెరో రహదారి. కానీ వారి స్వప్నాలు చేరువ. ఆమె నిత్య అన్వేషి – అతను సదా పదాన్వేషకుడు., ప్రకృతి నేపథ్యం }

ఒకానొక శ్రావణంలో

నిండు పున్నమి.

ఎదురుగా సముద్రం.

మేఘాల మాటున ఉన్న అతనిని ఆమె మీటింది.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం మాటలు.

ఆమె: మీరేనా ఆ చంద్రుడు?

అతడు: ఎవరు – "ఆ" ?

ఆమె: గుర్తులేదా..?....వెన్నెల... సముద్రం.......రాత్రి...... ప్రతిబింబం..... రంగుల మబ్బులు. నా చంద్రుడివే నువ్వు. నటించకు.

అతడు: రంగుల మబ్బులు?

ఆమె: అవును. తెల్లని ధనుస్సు

అతడు: నీ మాటలు సొగసు.

ఆమె: ఇన్నాళ్లు ఏమైపోయేవు? వెతుకుతూ ఉన్నాను.

అతడు: నేనిక్కడే. ఎదురుచూపుల్లో.

ఆమె: నన్ను గుర్తు పట్టినట్టు లేదు. సంగీతం కావాలి. ఆకలేస్తోంది. నేను నేల మీదకి రాలేను. కాఫీ తెస్తావా?

అతడు: నా దగ్గిర ముఖేశ్ ఉన్నాడు. సారంగా తేరి యాద్ మే ..

ఆమె: అది ఆ గుడిమెట్ల కింద టీ బడ్డీ వానిది.

అతడు: గుడిలో దేవుడెవరు? ఇదుగో బషీర్.

ఆమె: గోడలు మన మధ్య లేవు

అతడు: జడలో పాయలుండేవి?

ఆమె: ఉండు. నక్షత్రాల్ని చూడాలి.

అతడు: చంద్రుణ్ణి చూడు, వెన్నెల పలకరిస్తుంది.

ఆమె: నేను మాట్లాడను.

✻✻✻

మౌనం.

పెదవులు మెదలడం లేదు.

మౌనం.

ఆకులు చాపుకొన్న కొబ్బరి నిలువుగా.

అక్కడక్కడా ఎండిన మట్టల రాపిడి శబ్దం.

ఇసక మీద పల్చగా పరుచుకొంటున్న కెరటాల మెత్తని సద్దు.

పదేసి కాళ్ళతో

అటూ ఇటూ హడావిడిగా ఎండ్రపీతల పరుగుల చప్పుడు.

✻✻✻

ఆమె: బెంగగా ఉంటోంది ఈ మధ్య. చీకటంటే భయం. నన్నంటి ఉంటావు కదూ. చుక్కల నింగి కప్పుకొందాం. పెదాలు అప్పుడైనా కదుపుతావా.

అతడు: ఆల్పనా గుర్తొస్తోంది.

ఆమె: కొబ్బరి మొవ్వులో పడిన వెన్నెల ఆకుల నునుపుల మీంచి జారి

దిగూనున్న పచ్చగడ్డి పై పడి తుళ్లుతోంది.

వెన్నెల నీడలతో కూర్చున్న జాగా అంతా మోడరన్ మొజాయిక్ ఫ్లోరింగ్ డిజైన్ లా ఉంది.

అరిటాకుల ఉగిసలాటతో మా వైపు తిరగబోయిన గాలి –

సంపెంగ గుబురులో ఇరుక్కొని

విరజాజి పొదమీదా

మల్లెమొక్క మీదా

తూలీ సోలీ మరీ మమ్మల్ని తాకుతోంది..

దూరంగా ఇంటి పెరటిగోడ వారనున్న

కూరగాయల మళ్ళలో నీటి వంకాయల మీది నిగారింపులో

వెన్నెల వింతగా మెరుస్తోంది.

పెరటి మధ్యనున్న సాల పైకప్పు

వెన్నెట్లో కిరీటంలా ఉంది.

అతడు: నువ్వు అల్పనావి. నిన్ను అలానే పిలుచుకొంటాను. ప్రేమించొచ్చా?

ఆమె: ప్రేమించగలవా? ప్రేమించడం వొచ్చా? ప్రేమించేవా?

అతడు: లేఖలు, కథలు, కవిత్వం అన్నింట్లోనూ ఉన్నాను. ప్రేమికులకు నేను ఆదర్శం.

ఆమె: నీ రాతలంటే నాకు పిచ్చి. నువ్వు ప్రేమికుడివి.

ఇదుగో చూడు నా బంతిపూల జడ.

నా హృదయం నిండా పరిమళం.

నాకు పూలంటే ప్రేమ.

నేను ప్రేమని.

నా ఫలకం సినీవాలి

పాయల వాలు జడ చూడు. కెరటాల నడుము మీంచి ఎలా ప్రవహిస్తోందో.

......

నిశ్శబ్దం

ఆకాశంలో వన్నెల వెన్నెల గూడు కట్టుకొంది.

ఊదా రంగు మబ్బులు నెమ్మదిగా నల్లరంగులోకి మారుతూ నక్షత్రాల్ని కనిపించనీయడం లేదు. మాటలన్నీ మౌనం వైపు పరిగెడుతున్నాయి.

ఆమె: నీకు మౌనం నచ్చుతుందా? నిశ్శబ్దం నచ్చుతుందా?

హఠాత్తుగా

ఒక చినుకు ఆమె బుగ్గ మీద పడి హృదయంలోకి జారుకొంది. దూరంగా ఆకాశం మధ్యలోకి చీల్చినట్టు మెరుపు.

ఆమె: హత్తుకో నన్ను. ప్రేమించు. ప్రేమను తెలుసుకో. నువ్వు ప్రేమికుడివని నిరూపించుకో.

వెలిసిన వర్షంలో, పేపర్ని చేతిలో చుట్టగా చుట్టి – అటు సముద్రం దిక్కు మనుషులు గుమిగూడిన చోట పోలీసుల మధ్యలోంచి వెళ్లి మిత్రుణ్ణి ఆఖరు సారి చూసుకున్నాను.

అతగాడి మొహం మీద నేను మునుపు చూడని ఒక కొత్త చెదరని చిరునవ్వు.. మరణంలో.

దగ్గర్లోని గుడిసెలో అతను రాత్రి చీకట్లో తూలుతో వర్షంలో రోడ్ దాటుతోంటే చూసేట్ట .. పంచానామాలో బహుశా అదే ఖరారు కావొచ్చు.

నేను కొండమీది గుడిలో ఏ దేముదున్నాడో చూడ్డానికి ఒక్కొక్కమెట్టూ ఎక్కడం ప్రారంభించేను.

(నాన్నకి, కుప్పిలి పద్మ కు కృతజ్ఞతలతో)

*"The ancient Greeks called love “the madness of the gods.”*
*Modern psychologists define it as the strong desire for emotional union with another person.*
*But what, actually, is love.?*
*It means so many different things to different people."*

***

# గురుదేవో మహేశ్వరః....అట

కృపాకర్ పోతుల

నిర్విరామంగా మోగుతున్న ఫోను గోలకి మెలుకువ వచ్చింది పూర్ణచంద్రరావు మాస్టారికి. తెల్లగా తెల్లవారిపోయింది. గోడనున్న గడియారంవేపు చూసారు. టైం ఆరున్నర కావొస్తోంది.

“ఎప్పుడూ లేనిది ఇంత మొద్దు నిద్ర పట్టిందేంటీరోజు. మెలుకువే రాలేదు” విసుగ్గా అనుకుంటూ మోగుతున్న మొబైల్ ఆన్సర్ చేసారు.

“హలో ద గ్రేట్ పూర్ణ మాస్టారేనా, నేను సార్, “పారాయణ” స్కూల్ ప్రిన్సిపాల్ని మాట్లాడుతున్నాను. పేపర్ చూసేరా... అయ్యో ఇంకా చూడలేదా. అర్జెంటుగా చూడండి సార్...ఎందుకా, చూడండి సా.....ర్ మీకే తెలుస్తుంది. తెలుసుకున్నాక పోన్ చేయ్యండి. మీరెలాగూ చెయ్యరుగాని, నేనే చేస్తానులెండి. అప్పుడు మాట్లాడుకుందాం వివరంగా. సరేనా’ వేళాకోళంగా నవ్వుతూ ఫోన్ కట్ చేసాడాయన.

మూగబోయిన ఫోన్ వేపు సాలోచనగా చూస్తూ నిలబడిపోయిన మాస్టారికి అకస్మాత్తుగా గుర్తొచ్చింది ఆ రోజు పదవతరగతి పరీక్షా ఫలితాలు వెలువడే రోజని. హడావిడిగా తలుపు తెరుచుకొని, వరండాలో పడిఉన్న పేపర్ చేతిలోకి తీసుకున్నారు. ఆతృతగా తెరిచి చూసారు. చూసిన మరుక్షణం చేష్టలుడిగి, శిలాప్రతిమలా నిలబడిపోయారు.

“పదవతరగతి పరీక్షల్లో విజయఢంకా మోగించిన ‘పారాయణా’ పాఠశాల. వందశాతం ప్రథమశ్రేణీ ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిన పచ్చలపతకం ‘పారాయణ’.

మాస్టారిని వెక్కిరిస్తూ కనిపించాయి తాటికాయంత అక్షరాలు. ఒక్కసారిగా నిస్సత్తువ ఆవహించి, పక్కనే ఉన్న స్టూలుపై చతికిలబడిపోయారాయన నిస్త్రాణగా.

రెండు నెలల క్రితం, సరిగ్గా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావడానికి రెండురోజుల ముందు జరిగిన సంఘటన పూర్ణమాస్టారి కళ్ళ ముందు కదలాడింది.

--0--

రాత్రి ఏడుగంటలైంది. అప్పుడే స్కూల్ నుండి వచ్చిన పూర్ణచంద్రరావు మాస్టారు విశ్రాంతిగా కూర్చొని, మనవరాలు ‘సుష్మ’ చెప్తున్న కబుర్లువింటూ, టీ త్రాగుతున్నారు. ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. “ఈ సమయంలో ఎవరొచ్చుంటారబ్బా” అనుకుంటూ త్రాగుతున్న టీ రెండు గుక్కల్లో పూర్తిచేసి తలుపు తెరిచిన మాస్టారికి “నమస్కారం మాస్టారూ” అంటూ వినయంగా నమస్కరిస్తూ నిలబడ్డ అపచరిత వ్యక్తి దర్శనమిచ్చాడు. ప్రతి నమస్కారం చేస్తూ “మీరూ....” అంటూ సందిగ్దంగా ఆగిపోయారు మాస్టారు.

”నా పేరు ‘శ్రీక్రిష్ణ’ మాస్టారూ. ఇక్కడే “పారయణ” హైస్కూల్ ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నాను. మీతో కొంచెం మాట్లాడేపనుండి వచ్చానుసార్“ అన్నాడు పరిచయం చేసుకుంటూ. ““లోపటికి దయచేయండి. కూర్చొని మాట్లాడుకుందాం” అంటూ ఇంట్లోకి ఆహ్వానించి తనుకూడా కూర్చుంటూ, “చెప్పండి మాస్టారూ. ఏం పనిమీద వచ్చారు?” అని అడిగారు గౌరవంగా.

మాస్టారి ప్రశ్నవిని ఎదురుగా కూర్చున్న ఆగంతకుడు సోఫాలో ఇబ్బందిగా కదులుతూ "ఎల్లుండి నుండి పదవతరగతి పరీక్షలు మొదలవుతున్నాయి కదా మాస్టారూ. ఆ విషయం గురించి తమతో కొంచెం మాట్లాడాలనీ" అన్నాడు వాక్యం పూర్తి చెయ్యకుండా నీళ్ళు నములుతూ.

"పదవతరగతి పరీక్షల గురించా. ఏం మాట్లాడదామనీ?" అడిగారు మాస్టారు చిన్నగా నవ్వుతూ.

మాస్టారి చిరునవ్వు చూసి ధైర్యం తెచ్చుకున్న పారయణ హెడ్మాస్టర్ "మాస్టారూ మాస్కూలు విషయం మీకు తెలియనిది కాదు. పూర్తిగా వ్యాపారపంథాలో నడపబడే విద్యాసంస్థ మాది. వందశాతం ఉత్తీర్ణత, అది కూడా అన్నీ ఫస్టుక్లాసులే మా మేనేజ్మెంట్ ధ్యేయం. రిజల్ట్స్ కొంచెం తగ్గినా నిర్దాక్షిణ్యంగా మా సేలరీస్ కట్ చేసేస్తారు. అయితే, మేము ఎంత కష్టపడినా, ఆదివారాలూ శెలవులూ ఏమీ లేకుండా, ఆటాపాటా వాళ్ళ కలలోకి కూడా రానివ్వకుండా రోజంతా స్కూల్లోనే కూర్చోబెట్టి తోమేసినా, అక్షరంముక్క రాని మొద్దువెధవలు యాభైశాతం మందైనా ఉంటారు మాదగ్గర."

"ఇంతకు ముందు పరీక్షలు ఎవరి స్కూల్లో వాళ్ళే రాసేవారు గాబట్టి ఇబ్బంది ఉండేది కాదు సార్. అన్నీ మేమే మేనేజ్ చేసుకునే వాళ్ళం. ఇప్పుడలా కాదు కదా. ఈ సంవత్సరం మా విద్యార్థులు మీ స్కూల్లో పరీక్షలు రాస్తారు సార్."

"మీ దగ్గర పరీక్షలు చాలా కఠినంగా జరుగుతాయనేది జిల్లా మొత్తం తెలిసిన విషయం. మీరంత స్ట్రిక్టుగా పరీక్షలు నిర్వహిస్తే మావాళ్ళు కనీసం సగంమందైనా ఫెయిల్ అయిపోవడం ఖాయం. అందుకే తమరు పెద్దమనసు చేసుకొని ఇన్విజిలేషన్లో కొంచెం ఉదారంగా ఉంటే ఈ సంవత్సరానికి ఎలాగోలా గట్టెక్కిపోతాం సార్. ఆ విషయమే తమర్ని రెక్వెస్ట్ చేయమన్నారు సార్ మా ఎమ్డీ గారు" అన్నాడాయన వినయంగా.

వింటున్న మాస్టారి భృకుటి ముడిపడింది. "ఉదారంగానా? అంటే " అన్నారు కొంచెం వాడిగా.

"అదే మాస్టారూ. మాటీచర్లు పరీక్షహాలులోకి ప్రవేశించి మావాళ్ళకి జవాబులు తెలియని ప్రశ్నలకి సమాధానాలు చెప్పడానికీ, చిట్టీలు తెచ్చుకుంటే అవి చూసి రాసుకోవడానికీ ఎలాంటి ఇబ్బందీ కలిగించకపోతే చాలు సార్. అంతకంటే ఎక్కువేమీ అక్కరలేదు" అన్నాడాయన మాస్టారివేపు ఆశగా చూస్తూ.

అంతవరకూ ప్రశాంతంగా ఉన్న మాస్టారి మొహం కోపంతో జేవురించుకుపోయింది. కూర్చున్న సోఫానుండి విసురుగా లేచి నిలబడి, "నడవండి బయటకి. పవిత్రమైన ఉపాధ్యాయవృత్తిలో ఉంటూ ఇలాంటి నీతిమాలిన ప్రతిపాదనొకటి పట్టుకొని, తోటి ఉపాధ్యాయుని దగ్గరకు రావడానికి సిగ్గుగాలేదూ మీకు?" అంటూ విరుచుకు పడిపోయారు అతనిమీద.

మాస్టారి కోపం చూసి కంగుతిన్న ఆయన కూర్చున్న దగ్గర్నుండి నెమ్మదిగా లేచి నిలుచున్నాడు. నిలుచున్నాక, ఆయనవేపు సూటిగా చూస్తూ

"అనవసరంగా నోరు పారేసుకోకండి పూర్ణచంద్రరావుగారూ. మీ కేకలకి బెదిరిపోయే కుందేళ్ళేవీ లేవిక్కడ. ఒకటే చెప్పమన్నారు మా సారు. అడ్డుచెప్పకుండా మేం అడిగినదానికి సరేనంటే మూడోకంటికి తెలియకుండా, నిశ్శబ్దంగా మా పని చేసుకొని వెళిపోతాం. అన్నట్టు ఈపని మీరు ఊరికినే చెయ్యక్కరలేదు. ఇవిగో లక్షరూపాయలు. పరీక్షలైపోయాక ఇంకో లక్షిస్తామని చెప్పమన్నారు. చాలవంటే చెప్పండి, ఎన్ని లక్షలైనా పడేస్తాం. అంతేగాని, అలాంటివేమీ కుదరవ్. నా చాదస్తాలు పట్టుకొనే నేను వేలాడతానంటే మీ ఇష్టం. ఆలోచించుకోండి." అని హెచ్చరించి బయటకు నడిచాడా ఉపాధ్యాయుడు విసురుగా.

--00—

ఆ ఊరికే కాదు, జిల్లా మొత్తానికే పెద్దదైన ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రరావు మాస్టారు. "పూర్ణమాస్టారని" అందరితో గౌరవంగా పిలవబడే ఆయన జిల్లాలోని ఉపాధ్యాయవర్గాల్లో మంచి గౌరవాభిమానాలు చూరగొన్న వ్యక్తి. 'బతకలేక బడిపంతులు' అనే లోకోక్తిని అబద్దంచేస్తూ, ముప్పైఐదు సంవత్సరాల క్రితమే ఏరికోరీ ఉపాధ్యాయవృత్తిని స్వీకరించారాయన.

వ్యవసాయం ముఖ్యవృత్తిగా గల మాస్టారి కుటుంబంలో ఆయన తాతగారే మొట్టమొదటి అక్షరాస్యుడు. వాళ్ళ ఊరిలో క్రైస్తవమిషనరీలు కొత్తగా ప్రారంభించిన బడిలో ఎనిమిదో తరగతి వరకు చదువుకున్న వాళ్ళ తాతగారు, "హైయ్యర్ గ్రేడ్" శిక్షణపొంది, అదే బడిలో ఉపాధ్యాయుడిగా పనిచేసారు. స్కూలైఫైనల్ పాసయ్యాక సెకండరీగ్రేడ్ పూర్తిచేసి ఉపాధ్యాయవృత్తినే స్వీకరించిన మాస్టారి నాన్నగారు ఎలిమెంటరీస్కూలు ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేసారు.

ఇక మాస్టారి విషయానికొస్తే, ఇంటర్మీడియెట్ జిల్లా మొత్తానికి ప్రధముడిగా ఉత్తీర్ణులైన పూర్ణచంద్రరావుగారు కావాలనుకుంటే, సునాయాసంగా డాక్టర్ అయ్యుండేవారే. వాళ్ళ నాన్నకూడా ఆ మాటే చెప్తూ, ఎంట్రెన్స్ పరీక్ష రాయి పూర్ణా. తల తాకట్టు పెట్టైనా మెడిసిన్ చదివిస్తాను" అని అంటే మాస్టారు చిన్నగా నవ్వి

"నాకు కూడా నీలాగే టీచర్ అవ్వాలనే ఉంది నాన్నా. డిగ్రీ చేసి, ఆ తరవాత బి.ఎడ్ చేస్తాను" అన్నారట.

"మా రోజులు వేరు. అప్పుడు మేం చదివినదే గొప్ప చదువు. ఇప్పుడలా కాదు కదా. నువ్వు కూడా ఏదో అత్తెసరు మార్కులతో పాసైయ్యుంటే ఇలా చెప్పేవాడ్ని కాదు. జిల్లాకే ఫస్టొచ్చావాయె. మెడిసిన్ చదివితే సమాజంలో హోదాకి హోదా, డబ్బుకు డబ్బూ రెండూ, నీతిగా ఉంటూ సంపాదించుకోవచ్చు కదా" అని ఆయనంటే

"మన ఊర్లో నీ గౌరవానికీ హోదాకీ ఏం తక్కువైందో చెప్పు నాన్నా. మన ఊర్లో నీముందు కూర్చొని మాట్లాడతారా ఎవరైనా? నిలబడేకదా. ఇక డబ్బుల సంగతంటావా, ఇప్పటివరకూ నువ్వు నాకేమైనా తక్కువ చేసావా. ఏదడిగినా లేదనకుండా ఇస్తూనే ఉన్నావుకదా. అయినా నీకు చెప్పాలా నాన్నా. ఉపాధ్యాయుడనేవాడు వృత్తిమీద గౌరవం కలిగి. నిబద్ధతతో తనపని తను చేసుకుపోయేవాడైతే కలక్టరంతటి వాడైనా, అతని ముందు గౌరవంగా తలవొంచాల్సిందేనని నువ్వే అంటావు కదా. కనుక....నేను డాక్టర్ కాదు నాన్నా, టీచర్నే అవుతాను. కాదనకు" అనిచెప్పి వాళ్ళ నాన్నతో వాదించి మరీ బి.ఎడ్. చేసారట.

ఆ విషయం ఎంత గర్వంగా చెప్పుకుంటారో ఆయన.

ఇష్టపడి ఎంచుకున్న వృత్తికావడంతో సర్వశక్తులూ దానిమీదే కేంద్రీకరించి నిజాయితీగా పనిచేయడంతో, అనతికాలంలోనే పూర్ణమాస్టారు మంచి ఉపాధ్యాయుడనీ, ఆయన దగ్గర చదివిన పిల్లల భవిష్యత్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదనీ గట్టి నమ్మకం ఏర్పడింది. దానితో ఆయన పనిచేసే బడిలోనూ, ఆయన బోధించే క్లాసులోనూ తమ పిల్లల్ని జాయిన్ చెయ్యడంకోసం స్కూలు ముందు ప్రజలు బారులు తీరేవారంటే అతిశయోక్తికాదు.

ఇటువంటి ఉన్నతమైన విలువలతో కూడిన నిర్విరామకృషి ఫలితంగా మాస్టారు తనని అమితంగా అభిమానించే అసంఖ్యామైన శిష్యకోటిని సంపాదించుకోవడంలో ఆశ్చర్యపడాల్సినదేమీలేదు. కాలక్రమేణా హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన మాస్టారి ఖాతాలో ఇక మూడేళ్ళ సర్వీసు మాత్రమే మిగిలిఉంది.

అయితే గత కొన్నేళ్ళుగా పూర్ణమాస్టారు అమితమైన ఆందోళనకూ కలచివేతకు లోనౌతున్న మాట మాత్రం నిజం. అందుకు కారణాలనేకం.

విద్య లాభాలార్జించే వ్యాపారవస్తువుగా రూపాంతరంచెంది, ప్రైవేటువ్యాపారుల కబంధహస్తాల్లో బందీగా చిక్కుకుపోవడం, ప్రభుత్వపాఠశాలలు రోజురోజుకూ కునారిల్లి పోతుండడంతో పాటూ, విద్యావ్యవస్థలో విలువలు అంతరించిపోవడం వంటి వాస్తవాలు ఆయన ఆందోళనకి ముఖ్యకారణాలు.

--00--

రెండురోజుల్లో ప్రారంభం కాబోతున్న పదవతరగతి పరీక్షల నిర్వహణకి కావలసిన ఏర్పాట్లు చేయడంలో అలసిపోయి ఇంటికి వచ్చిన పూర్ణమాస్టారికి ఆరోజు ఎదురైన చేదు అనుభవం ఆయనని చాలా అశాంతికి గురిచేసింది. "ఎటుపోతోంది విద్యావ్యవస్థ? ఈ హానికరమైన ధోరణి ఇలాగే కొనసాగితే విద్యార్థులమీదా దేశభవిష్యత్తుమీదా ఇదెలాంటి దుష్ప్రభావం చూపిస్తుంది!" అని మధనపడుతూ అశాంతిగా గడిపారా రాత్రి చాలాసేపు.

తెల్లవారింది. యధావిధిగా స్కూలుకి చేరుకున్న పూర్ణమాస్టారు స్కూలంతా ఒకసారి రౌండ్ వేసి, ఏర్పాట్లు సంతృప్తికరంగా చేయబడినట్టు మరొకమారు నిర్ధారించుకొని వచ్చి తన సీట్లో ఇలా కూర్చున్నారో లేదో అలా ఫోను మోగింది.

"నమస్కారం పూర్ణమాస్టారూ. నేను ఎమ్మెల్యే మోహనరావుని మాట్లాడుతున్నాను. బావున్నారా" అంటూ అభిమానంగా పలకరించాడాయన మాస్టారిని.

"బాగున్నాను సార్. మీరు క్షేమమే కదా. పెద్దవారు తమరేంటి ఇలా ఫోను చేసారు?" అని అడిగారు గౌరవంగా.

"డైరక్టుగా విషయానికొచ్చేస్తాను మాస్టారూ. రేపట్నుండీ మీస్కూల్లో పదవతరగతి పరీక్షలు జరుగుతున్నాయికదా. పరీక్షల్లో మీరు చాలా స్ట్రిక్టుగా ఉంటారన్నది జగమెరిగిన సత్యం. అందుకే మీదగ్గర పరీక్షలంటేనే వణికిపోతున్నారండీ పిల్లలు. ఇక తల్లిదండ్రులైతే కాస్త చూసీ చూడనట్టు పోయేటట్టుగా మాస్టారినెలాగైనా మీరే ఒప్పించాలి సార్ అంటూ ఒకటే గొడవ. సరే అని మాటిచ్చేంతవరకూ వదిలిపెట్టలేదంటే నమ్మండి. గనుక మాస్టారూ, కాస్త పెద్దమనసు చేసుకొని ఈసారికి ఇన్విజిలేషన్ కాస్త లిబరల్గా కానిచ్చెయ్యండి. ఈ చిన్నసాయం చేసిపెట్టండి చాలు. మీ పేరు చెప్పుకుంటారందరూ" అంటూ మనవిచేసారు.

ఎమ్మెల్యే విన్నపం విన్న మాస్టారికి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు ఓ క్షణం. వెంటనే తేరుకొని "నా విషయం మీకు తెలియనిదికాదు కదు సార్. ఎంత కష్టపడి విద్యాబోధన చేసి, చేయిస్తానో, పరీక్షలు కూడా అంత నిజాయితీగానూ నిర్వహిస్తాను. గత ముప్పైఐదు సంవత్సరాలుగా నా పద్ధతి ఇదే సార్. అలాంటిది, ఈ వయసులో దానికి తిలోదకాలిచ్చి, మీరడిగినట్టు పరీక్షలు నిర్వహించడం నా వల్లయ్యేపని కాదు సర్. క్షమించాలి తమరు" అన్నారు ప్రతీపదాన్నీ వత్తి పలుకుతూ.

అంతే. దెబ్బతో ఎమ్ఎల్ఏ గారిలో అంతర్లీనంగా ఉన్న "అపరిచితుడు" రంగప్రవేశం చేసి, 'మాస్టారూ, మీరూ" లాంటి బహువచనప్రయోగాలు తీసవతల పారేసి "ఏమనుకుంటున్నావయ్యా నీ గురించి నువ్వు. మహాత్మాగాంధీ బామ్మర్దిననుకుంటున్నావా. రేపు నీ స్కూల్లో పరీక్ష రాసేదెవరో తెలుసా? "పారయణ" స్కూలుపిల్లలు. ఆ స్కూలెవరిదో తెలుసుకదా. ఆయన తలచుకుంటే నిన్ను శంకరగిరిమాన్యాలు పట్టించడమే కాదు, ఉద్యోగంలో లేకుండా కూడా చెయ్యగలడు జాగర్త ఏమనుకుంటున్నావో. ఏదో వయసులో పెద్దాడివని మర్యాదగాచెప్తుంటే నీతికబుర్లు వల్లిస్తున్నావే. మర్యాదగా చెప్పినట్టుచెయ్. లేదా....." అంటూ హెచ్చరించి ఫోను పెట్టేసాడా ప్రజాప్రతినిధి.

నిర్ఘాంతపోయారు పూర్ణమాస్టారు. పరీక్షలు నిష్పాక్షికంగానూ, నిజాయితీగానూ నిర్వహించినందుకు ప్రజలనుండీ, అధికారులనుండీ ప్రశంశలందుకున్న గతం గుర్తొచ్చి గుండె బరువెక్కింది. రాష్ట్రస్థాయిలో గవర్నరు

చేతులమీదుగానూ, జాతీయస్థాయిలో రాష్ట్రపతి చేతులమీదుగానూ ఉత్తమఉపాధ్యాయపురస్కారం అందుకున్న బంగారుక్షణాలొకసారి గుర్తొచ్చాయి. “ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు” అనుకుంటూ నిట్టూర్చారు బాధగా.

పరీక్షలు మొదలయ్యాయి. పరీక్షరాయడానికి వచ్చిన విద్యార్ధులని క్షుణ్ణంగా తనిఖీచేసి దొరికిన చిట్టీలూ వగైరా చెత్తబుట్టల్లో పడేసిగాని హాల్లోకి అడుగుపెట్టనీయలేదు పూర్ణమాస్టారు. సెల్ఫోనుల్లాంటి పరికరాలు చుట్టుపక్కల ఎక్కడా కనబడకుండా కఠినచర్యలు తీసుకున్నారు. పరీక్షల్లో ఏవిధమైన అవతకవలు జరిగినా సహించేదిలేదని ఇన్విజిలేటర్లనీ, ఇతర సిబ్బందినీ గట్టిగా హెచ్చరించారు. ‘పారాయణ’ స్కూలు టీచర్లు కొంతమంది సెంటర్లోకి ప్రవేశించే అవకాశం దొరుకుతుందేమోనని “గోతికాడనక్కల్లా” అటూఇటూ తచ్చాడి, వాళ్ళ ఆటలక్కడ సాగవని గ్రహించి, తిరిగి వెళ్ళిపోయారు.

మొదటిరోజు పరీక్ష ఏవిధమైన ఒడిదుడుకులూ లేకుండా నిర్విఘ్నంగా జరిగిపోయింది. “హమ్మయ్య” అని నిట్టూర్చారందరూ. రెండవరోజు కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పరీక్ష జరిగిపోవడంతో “మీ దగ్గర వాళ్ళ పప్పులుడకవని అర్ధమైందిసార్ వాళ్ళకి. ఇక మీ జోలికి రారు చూడండి” అంటూ హర్షం వెలిబుచ్చారు ఉపాధ్యాయులూ సిబ్బందీ. ఇక ఆతరవాత పరీక్షలన్నీ సజావుగా జరిగిపోవడంతో, తలమీద నుంచి పెద్దబరువు దించినట్టయింది పూర్ణమాస్టారికి.

పరీక్షలైపోయాక మిగలిన సెలవులన్నీ తనకిష్టమైన ‘వివేకానందుని’ రచనలు చదువుకుంటూ తీరికగా గడిపేసారు పూర్ణమాస్టారు. చూస్తుండగానే రోజులు గడచిపోయాయి. పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి.

తొంభైశాతం ఉత్తీర్ణతతో మాస్టారి స్కూలు ఎప్పటిలాగనే జిల్లాలోని ప్రభుత్వపాఠశాలలన్నిటిలోనూ ప్రథమస్థానంలో నిలిచింది. కాని ‘పారాయణ’ వందశాతం ఉత్తీర్ణత సాధించడం చూసాక ఆ ఆనందంకాస్తా ఆవిరైపోయింది. కాస్త ఆలోచించాక, ఆ విజయం ఎలా సాధ్యమయ్యంటుందో అర్ధమయ్యాక మాత్రం ఆయన మనసు మాటల్లో వర్ణించశక్యంకాని ఆవేదనతో నిండిపోయింది.

అంతలోనే ‘పారాయణ’ స్కూలు ప్రిన్సిపాల్ దగ్గరనుండి మళ్ళీ ఫోను.

“దిమ్మదిరిగి మైండ్ బ్లాకయ్యిందా పూర్ణచంద్రరావుగారూ!? నేనారోజే చెప్పలేదూ మా సారేంటో ఆయన పవరేంటో. ఎంత సొమ్మైనా పడేస్తాం. కాస్త కళ్ళు మూసుక్కూర్చోండి మాస్టారూ అని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. వినిపించుకున్నారా!?. అబ్బే... విలువలూ వంకాయలూ అంటూ...ఓ.... నీతివాక్యాలు వల్లించేరు. చూసారుగా ఏం జరిగిందో. అందుకే, ఇప్పటికైనా కళ్ళు తెరిచి, కాస్త లౌక్యంగా బ్రతకడం నేర్చుకోండి సార్. మీమంచికోరి చెప్తున్నాను” అంటూ జ్ఞానోపదేశంగావించి, ఫోన్ పెట్టేసాడు.

అతని మాటలు విన్న పూర్ణమాస్టారి మనసు మరింత కలతచెందింది. విలువలు మృగ్యమైన ఇలాంటి వ్యవస్థలో పనిచేయడానికి 'అవసరమైన అర్హతలు' తనకు లేవు గనుక ఉద్యోగానికి రాజీనామా చేసి, రెండేళ్ళ సర్వీసు త్యాగంచేసి, గౌరవంగా నిష్క్రమిస్తేనో, అన్న ఆలోచన వచ్చిందే తడవు...ఆయనలోని అంతరాత్మ దెబ్బతిన్న నాగుబాములా బుసలుకొడుతూ తలెత్తింది. 'భీరువులా పారిపోదామనుకుంటున్నావా, సిగ్గులేదూ' అంటూ కఠినంగా ప్రశ్నించింది.

ఎటూ నిర్ణయించుకోలేని సంకటస్థితిలో రోజంతా, తిండికూడా తినకుండా ఆలోచిస్తూ గడిపారాయన. కంటిమీద కునుకులేకుండా అశాంతిగా అటూఇటూ తిరుగుతూనే ఉన్నారు రాత్రంతా. గంటలు గడిచిపోతున్నాయి గాని, ఒక నిర్ణయానికి మాత్రం రాలేకపోతున్నారు.

రాత్రంగా భారంగా గడిచిపోయింది. ఇంకా కొద్ది సేపట్లో తెల్లవారబోతోంది. సరిగ్గా ఆసమయానికి, ఎట్టకేలకు, మాస్టారి మస్తిష్కంలో చెలరేగుతున్న అంత:స్సంఘర్షణ ఒక కొలిక్కి వచ్చింది. పూర్ణమాస్టారు ఒక స్థిరమైన నిర్ణయం తీసుకున్నారు. అలా నిర్ణయం తీసుకున్న తరవాత కొద్దిక్షణాల్లోనే, దూదిపింజలా తేలికైన హృదయంతో, మంచంమీద వాలారు. మండుతున్న కళ్ళు మూసుకున్నారు అలసటగా.

శుభసూచకంగా తన బంగరుకిరణాల్ని నలువేపులా వెదజల్లుతూ, సదాగతి దర్శనమిచ్చాడు తూరుపుదిక్కున...లోకమంతా కొత్తవెలుగులు నింపుతూ.

"ఠంగ్ ఠంగ్' మంటూ జేగంటలు మోగించింది గోడనున్న గడియారం మాస్టారిని 'విజయోస్తు' అంటూ ఆశీర్వదిస్తున్నట్టుగా.

# నందివర్ధనాలు

జయంతి సత్య శీల యాజి

"మా కేలరా విచారమూ" గది లోంచి జానకి పాట వినిపిస్తోంది. హాల్లో కూర్చున్న విశ్వనాధం గారు అంత విచారంలోనూ ఇంకొక సారి అనుకొన్నారు "ఎంత బాగ పాడుతుంది జానకి" అని. వంటిట్లో ఉన్న అన్నపూర్ణమ్మ గారికి

వసారాలో పడక కుర్చీలో ముందుకి వాలి దిగులుగా కూర్చున్న విశ్వనాధంగారు కనిపిస్తున్నారు. "ఎంత అమాయకులో ఈయన" అంత హడవిడిలోను ఇంకొక సారి అనుకొన్నారు అన్నపూర్ణమ్మ గారు.

సమయం మధ్యాహ్నం రెండు కావస్తోంది. ఇంకొంచెం సేపట్లో ఆమెరికా క్లాసికల్ మ్యూసిక్ ఫౌండేషన్ వాళ్ళ ప్రతినిధి వచ్చే వేళయింది. అతని పేరు రఘు. పొద్దున్నే ఫోన్ చేసి "అంకుల్, నేను రెండింటికి మీ ఇంటికి వస్తాను. మిమ్మల్ని కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది" అని చెప్పాడు. విశ్వనాధంగారి ప్రాణ స్నేహితుడు చంద్రశేఖరం గారు పొద్దున్నించీ ఒక పది సార్లు ఫొన్ చేసి ఉంటారు "అంతా బాగానే వుంది కదా" అనుకుంటూ. మళ్ళీమళ్ళీ చెప్పారు "ఒరే విస్సూ, రఘు నా స్టూడెంట్, చాలా మంచివాడు. వర్రీ అవకు" అని. ఇన్ని సార్లు చెప్పినా విశ్వనాధం గారి దిగులు మట్టుకు పోలేదు. ఆ రఘు గురించే ఇప్పుడీ వైటింగ్. “సమయానికి చందు ఊళ్ళో లేకుండా పొయాడు” ఇంకొకసారి అనుకున్నారు విశ్వనాధం గారు. కొంచెం నేపథ్యం లోకి వెళితే...

విశ్వనాధం గారు వృత్తి రీత్యా ఎలెమెంటరీ స్కూల్ టీచర్. కొంచెం కాలం క్రితమే రిటైర్ అయ్యారు. వృత్తి రీత్యా టీచర్ అయినా ప్రవృత్తి మాత్రం క్లాసికల్ మ్యూసిక్. తరతరాలుగా వంశ సాంప్రదాయం సంగీతం. సంగీతం నేర్పించడం కచేరీలు చెయ్యడంలోనే జీవితం గడిచిపోయింది. ఒకే ఒక సంతానం జానకి. పెళ్ళీడుకి వచ్చింది. “ముత్యం లాంటి పిల్ల, ఎంత అదృష్టం ఉండాలి వచ్చేవాడికి” అనుకున్నారు విశ్వనాధం గారు చాలా కాలం వరకు. సంబంధాలు చూడ్డం మొదలుపెట్టిన తరువాత తెలిసింది ఇప్పటి కాలం కొలమానం వేరు అని. చివరికి కట్నం ఇవ్వడానికి రాజీ పడ్డారు. ఈమధ్యనే జానక్కి పెళ్ళి కుదిరింది. చేతిలో డబ్బు లేదు అడిగినంత ఇవ్వడానికి. ఇల్లు తాకట్టు పెట్టి కట్నం ఇచ్చేద్దామని నిర్ణయించుకున్నారు విశ్వనాధం గారు. చాలాకాలంగా చంద్రశేఖరం గారు చెప్తున్నారు “ఓరే, అమెరికాలో ఫౌండేషన్ ఉందిరా, వాళ్ళు క్లాసికల్ టీచర్స్ కి ఆర్థిక సహాయం చేస్తున్నారు. దానికి అప్ప్లై చేద్దాము. ఆది వస్తే జానకి పెళ్ళి సులువుగా చెయ్యచ్చు” అని. ఇది కొంతకాలంగా నడుస్తున్న చర్చ. ఎంతటి అర్థిక ఇబ్బంది అయినా తట్టుకునే విశ్వనాధం గారు స్నెహితుడి మాట కాదనలేక ఈమధ్యనే సహయానికి అప్ప్లై చేసారు కాని విశ్వనాధం గారు జీవితంలో ఎప్పుడూ ఎవరినీ చెయ్యి చాచి అడగలేదు. మొదటి సారి చేయి చాచ వలిసి వచ్చింది. ఈ కాలంలో కూడా కట్నాలు ఇవ్వవలసి రావడానికి, దాని వలన ఒకళ్ళ ముందు తల వంచ వలసి వచ్చినందుకు మనసు విచారం గాను, దిగులు గాను ఉంది విశ్వనాధం గారికి. గడియారం కేసి చూస్తూండగానే ఇంటి ముందు కారు ఆగింది. “అతను వచ్చినట్లున్నాడే” అనుకుంటూ వీధి లోకి వెళ్ళారు విశ్వనాధం గారు.

“విశ్వనాధం గారంటే మీరేనా సార్” కారు దిగి నమస్కారం పెడుతూ అడిగాడు రఘు. “అవును బాబూ, లోపలికి వెళ్దాం రండి” విశ్వనాధం గారు ఆహ్వానించారు. “నన్ను మీరనకండి సార్, మీ కన్నా ఎంతో చిన్నవాణ్ణి”

నవ్వుతూ అన్నాడు రఘు. "ఎంతకాలం అయ్యిందో ఎత్తరుగుల ఇల్లు చూసి. మా తాతగారింటికి చిన్నప్పుడు సెలవలకి వెళ్ళినప్పుడు చూసాను" ఇంట్లోకి వస్తూ అన్నాడు రఘు. "ఏదో పాతకాలం ఇల్లు, మా నాన్న గారు కట్టించారు ఎన్నో ఎళ్ళ క్రితం" విశ్వనాధం గారు అన్నారు. విశ్వనాధం గారి ఇల్లు ఎత్తరుగుల ఇల్లు. వీధి గుమ్మం నించి చూస్తే పెరటిలో కనిపించే తులసి కోట. మధ్యలో చిన్న హాల్, పక్కనే గది. వెనకాల వంట గది, భోజనల గది, పక్కనే పూజ రూం. మెట్లు దిగితే విశాలమైన పెరడు. పెరట్లోంచి వచ్చే ఫ్రెష్ గాలి చాలా ఆహ్లాదకరంగా ఉంది.

రఘు తన గురించి, ఫౌండేషన్ గురించి చెప్పాడు. రఘు తండ్రి చిన్నప్పుడే పోతే తల్లి కష్టపడి చదివించారు. ఇప్పుడు కుటుంబ బాధ్యత అంతా రఘు మీదే ఉంది. కొంతకాలం అమెరికాలో ఉండి కుటుంబం నిలబడిన తరువాత ఇండియా వచ్చేస్తానని, అప్పటిదాకా పెళ్ళి చేసుకునే ఉద్దేశం లేదని చెప్పాడు రఘు.

తరువాత ఫౌండేషన్ గురించి వివరించాడు. క్లాసికల్ సంగీతం ఉపాధిగా పెట్టుకున్న పేదవారికి ఆర్ధిక సహాయం చెయ్యడం ఫౌండేషన్ ఉద్దేశం. అలా ఉన్న వారి దగ్గర్నించి అప్లికేషన్లు తీసుకుని వాళ్ళకి వీలయినంత సహాయం చేస్తారు. ఇప్పటికే చాలా మందికి సహాయం చేసారు. రఘు సెలవులకి ఇండియా వచ్చాడు. ఈ ప్రాంతంలో ఉన్న కొంత మంది టీచర్స్ ని కలుస్తూ విశ్వనాధం గారింటికి వచ్చాడు.

"నాకు మ్యూసిక్ రాదు సార్, ఓన్లీ విని ఎంజాయ్ చెయ్యడం అంతే. చిన్నప్పుడు నేర్పించే వాళ్ళు ఎవరూ దొరకలేదు. మీ అమ్మాయిగారు లక్కీ. మీ దగ్గర చిన్నప్పడి నించి నేర్చుకుని ఉండి ఉండాలి" రఘు అన్నాడు.

రఘు మర్యాద చూసి కొంచెం తేలిక పడింది విశ్వనాధం గారి మనసు. సంగీతం గురించి, విశ్వనాధం గారి జీవితం గురించి కొంచెం సేపు సంభాషణ గడిచింది. జానకి పోస్ట్ గ్రాడ్యుఏట్ అయ్యి ఈ వుళ్ళోనే టీచర్ ఉద్యోగం చెస్తోందని, పెళ్ళి సంబంధాలు చూస్తున్నామని, పెళ్ళి చెయ్యడానికి ఆర్ధిక అవసరం గురించి ఎప్ప్లై చేసామని చెప్పారు విశ్వనాధం గారు.

"మిమ్మల్ని పాట పాడమని అడగడానికి ఎంత సంగీతం రావాలి, సార్ ?" చిన్నగా నవ్వుతూ అడిగాడు రఘు.

"సంగీతం రావక్కర లేదు, బాబూ, విని ఆనందించే మనసు ఉంటే చాలు, పాడు జానకీ.." అన్నారు విశ్వనాధం గారు.

జానకి "భజరే శ్రీరామం" రామదాసు కీర్తన పాడింది.

అ చిన్న ఇంట్లో జానకి పాట వింటుంటే ఎంతో ప్రశాంతంగా అనిపించింది రఘుకి. పెళ్ళి చూపుల్లో ఎప్పుడూ తల దించుకొని కూర్చోడానికి విసుగు అనిపించిన జానక్కి, రఘుతో సంభాషణ చాలా రిలాక్సింగ్ గా అనిపించింది. రఘు ఇంట్లో ఉన్న బుక్స్ కలెక్షన్ చూసి అశ్చర్యపోయాడు.

జానకి అంది "నాన్న గారికి పుస్తకాలంటే ఎంతొ ఇష్టం. అది నాక్కూడా చిన్నపటినించీ అలవాటు చేసారు" అని.

సాహిత్యం గురించి కొంత సేపు చర్చ జరిగింది. అ మాటల్లో జానక్కి కొత్త పోయింది. రఘు మంచి స్నేహితుడి లాగ అనిపించాడు ఆ కుటుంబానికి. టిఫిన్ల కార్యక్రమం అయ్యాక,

"మీ ఇల్లు చూడాలని ఉంది సార్, లోపలికి వెళ్ళచ్చా " అడిగాడు రఘు.

"తప్పకుండ, ప్లీజ్, చూసిరా" అని రఘు తెచ్చిన ఫైల్ చూసి "మీ ఫౌండేషన్ విషయాలా, ఒక సారి చూడొచ్చా" అని అడిగారు విశ్వనాథం గారు.

"చూడండి సార్, ఇందులో మా ఫౌండేషన్ కి వచ్చిన ఇంకొన్ని అప్లికేషన్లు ఉన్నాయి" అన్నాడు రఘు.

ఫైల్ తీసుకుని చూడ్డం మొదలుపెట్టారు విశ్వనాథం గారు.

రఘు కాఫీ కప్పు ఇవ్వడానికి వంటిట్లొకి వెళ్ళాడు. కప్పు ఇస్తూ అన్నాడు "టిఫిన్ చాలా బావుంది ఆంటీ. మళ్ళీ తినాలని అనిపించిది. చాల థాంక్స్. మిమ్మల్ని చూస్తుంటే మా అమ్మగారిని చూసినట్లే ఉంది. కొంచెం సేపు కూర్చోవచ్చా?" అని పీట వెసుకును అక్కడే కూర్చుని అన్నపూర్ణమ్మ గారితో కబుర్లలో పడ్డాడు రఘు.

జానకి పెరట్లో కి వెళ్ళింది. రఘు ఆప్యాయత చూసి, అన్నపూర్ణమ్మ గారికి అతనితో మనసు విప్పి మాట్లాడాలనిపించింది.

"ముప్పై ఏళ్ళ క్రితం ఈ ఇంటికి వచ్చాను రఘు, అప్పటినించి ఇక్కడే జీవితం. ఈ ఇల్లు మా జీవితం లో ఒక భాగం. ఇప్పుడు పెళ్ళి గురించి ఈ ఇల్లు తాకట్టు పెట్టే అవసరం వచ్చింది. ఎంతో అభిమానంగా బ్రతికేం. ఇప్పుడు తాకట్టు పెట్టాలంటే బాధ గా ఉంది. ఆ రాముణ్ణే నమ్ముకున్నారు ఆయన. ఆ రాముడే ఏదో దారి చూపిస్తాడు అని నా నమ్మకం. అన్నట్లు పెరడు చూస్తాన్నావు కదా, చూడు బాబూ" అన్నారు అన్నపూర్ణమ్మ గారు.

రఘు పెరట్లో కి వెళ్ళాడు. ఎదురుగా తులసి కోట, చుట్టూ ముగ్గులు, తులసి కోట పక్కన నందివర్ధనం చెట్టూ, దాని పక్కనే మందారం చెట్టూ, ఆ వెనకాల ప్రహారి గోడ, గోడ మీద పాకిన మల్లె చెట్టూ. గోడ అంచున చిన్న బావి. తులసి కోటకి రెండో పక్కన ఉసిరి చెట్టు. నేల మీద పడిన నందివర్ధనం పూవులతో పెరడూ ఎంతో అందంగా ఉంది. పెరట్లో ఉన్న ప్రశాంతతని అనుభవిస్తూ అలాగే కొంచెం సేపు ఉండిపోయాడు రఘు.

"మా పెరడు అంత నచ్చిందా?" నవ్వుతూ అడిగింది జానకి.

"ఏబ్సొల్యూట్లీ, ఇక్కడే వుండి పోవాలని అనిపిస్తోంది" రఘు అన్నాడు.

"రండి చూపిస్తాను, ఈ నందివర్ధనాలంటె నాన్న గారికి ప్రాణం. రోజు పొద్దున్నే పూవులు కోసి నాన్న పూజకి పెట్టడం నా డ్యూటీ. నేను, ఈ పువ్వులు, నాన్న ముగ్గురం కలిసి రోజూ పూజ చెస్తాం. ఎన్నో ఏళ్ళనించి ఉన్న అనుబంధం. సింపిల్ జీవితాలు కూడా స్పిరిట్యువల్గా ఉండొచ్చు అంటే నమ్ముతారా?" జానకి అంది.

"అవును. ఇక్కడ ఉంటే పరుగెట్టి పరుగెట్టి కాలం అలసిపోయి శ్వాస తీసుకోవడానికి ఆగింది అనిపిస్తోంది. " రఘు

"చిన్నప్పటినించి ఈ చెట్ల మధ్యే పెరిగాను. ఈ చెట్లు ఇలాగే ఉన్నాయి, నాకు అప్పుడే పెళ్ళికి లేటయిపోయింది అంటున్నారు" జానకి నవ్వుతూ అంది.

"కంగ్రాచ్యులేషన్స్, మీకు మేచ్ సెటిల్ అయ్యేలా ఉందిట కదా, ఎక్సైటింగ్ గా ఉందా?" అడిగేడు రఘు.

"ఎక్సైటింగ్ అంటారా!?" నవ్వింది జానకి. "పెళ్ళి చూపులకి వచ్చినప్పుడు పెరడు చూస్తానని వచ్చాడు అతను. ఆ రోజు నాకింకా గుర్తు. మధ్యాహ్నం కొంచెం వాన పడింది. సాయంత్రం పెరట్లోకి వెళ్ళగానే ఎప్పుడూ చూసే నాకే పెరడు ఎంతో అందంగా కనిపించింది. పువ్వుల మీదా, ఆకుల మీదా నీటి బొట్లు అలానే ఉన్నాయి. అలా నీటిలో తడిసిన అ ప్రకృతి మధ్యలో మైమరిచిపోయి అలా నించుండిపొయాను. చాలా ప్రశాంతంగ ఉన్న నిశ్శబ్దం మధ్యలో అతను సడెన్ గా ఒక ప్రశ్న అడిగేడు. ఉహించగలరా" అడిగింది జానకి. "బీట్స్ మి. తెలియదు. మీరే చెప్పండి"

"ఈ ప్లాట్ సైజ్ ఎంత, ఇక్కడ రేట్ ఎంత ఉంటుంది ? అని అడిగాడు ".

"రియల్లీ, థట్స్ ఫన్నీ" అశ్చర్యం అపుకోలేకపోయాడు రఘు. "మీరేమన్నారు?"

"నాకేం చెప్పాలో తెలియలేదు. పెళ్ళికి ముందే క్షమించడం మొదలుపెట్టేసాను" ఇద్దరూ కలిసి హాయిగా నవ్వుకున్నారు. తరువాత అంది జానకి.

"అతనికి ఈ నందివర్ధనాలు, మందారాలు కనబడలేదు. రేపు నేను కూడా కనబడను, కట్నం మాత్రమే కనబడుతుందనుకుంటా. అలాంటి మనిషి తోటి జీవితం పంచుకోవాలంటే ఎక్సైటింగా ఎలా వుంటుంది ?"

"మీకీ పెళ్ళి ఇష్టం లేదా"

"నాకిష్టం లేదని చెప్తే నాన్న బాధ పడతారు. నా గురించి నాకు బాధ లేదు. అలాంటి మనిషి గురించి దేవాలయంలాంటి ఇల్లు తాకట్టు పెడుతున్నారంటే బాధగా వుంటుంది". నెమ్మదిగా అంది జానకి.

మాటల్లోనే గుమ్మం దాకా వచ్చేసారు. "అయ్యో, మర్చిపోయాను, కొన్ని నందివర్ధనాలు ఇస్తాను. అమ్మగారికి ఇవ్వండి" ప్లాస్టిక్ బేగ్లొ పువ్వులు కట్టి ఇచ్చింది.

"థాంక్స్ అండి" అని తీసుకున్నాడు రఘు.

"ఇంక బయలుదేరే టైం అయ్యింది. మళ్ళీ కలుద్దాం. ఆల్ ది బెస్ట్ విత్ యువర్ మేరేజ్" అని చెప్పాడు రఘు.

"వచ్చినందుకు మీకు మేము థేంక్స్ చెప్పాలి" అంది జానకి.

రఘు జానకి మాటలు వంటిట్లో ఉన్న అన్నపూర్ణమ్మ గారికి కొంచెం వినిపిస్తున్నాయి. కిటికీలోంచి చూసారు. జానకి మనసారా హాయిగా నవ్వుతూ కనిపించింది.

"ఎంత కాలం అయ్యిందో ఈ నవ్వు విని " అనుకున్నారు.

అప్పుడే వంటింట్లోకి వచ్చిన విశ్వనాధం గారికి కూడా వాళ్ళిద్దరు అలా హాయిగా కబుర్లు చెప్పుకోవడం కనిపించింది. పెళ్ళి చూపుల్లో జానకి ఎంత ఉదాసీనంగా ఉందో కూడా గుర్తొచ్చింది విశ్వనాధం గారికి.

అన్నపూర్ణమ్మ గారు "ఈ పెళ్ళి చేసి మనం తప్పు చేస్తున్నామేమో. ఇప్పటికయినా మించిపోయింది లేదు. మళ్ళి ఒక సారి ఆలోచిస్తే బావుంటుంది" అన్నారు.

విశ్వనాధం గారు బదులు చెప్పలేదు. మెల్లిగా పూజ గదిలోకి వెళ్ళి మందిరం ముందు కొంచెం సేపు నిల్చున్నారు. తరువాత హాల్లోకివెళ్ళిపోయారు.

రఘు అందరి దగ్గరా సెలవు తీసుకున్నాడు. అన్నపూర్ణమ్మ గారు జానకితో "రఘూకి తీర్ధం ఇవ్వమ్మా" అన్నారు. జానకి రఘూని పుజ గదిలోకి తీసుకుని వెళ్ళి తీర్ధం ఇచ్చింది. తీర్ధం తీసుకుంటుంటే రఘుకి జానకి మాటలు గుర్తు వచ్చాయి. "అవును, ఇది నిజంగా దేవాలయమే "మనసులో అనుకున్నాడు రఘు. బయలుదేరుతుంటే, విశ్వనాధం గారు అతనితో బయటికి వచ్చారు. కారు దగ్గిరికి వచ్చిన తరువాత, "కొంచెం సేపు నడుద్దామా బాబూ" విశ్వనాధం గారు అడిగారు. "తప్పకుండా సార్" అని ఫైల్స్ కార్లో వదలి, విశ్వనాధం గారితో నడవడం మొదలు పెట్టాడు రఘు.

"నువ్వు తెచ్చిన ఫైల్ చూసాను రఘు, చాలా ఆలోచించాను. నాకన్నా ఇంకా ఎక్కువ కష్టాల్లో చాలా మంది ఉన్నారు. మీరు వాళ్ళకి సహాయం చెయ్యండి. దయచేసి నాకు ఈ సహాయం వద్దు" నెమ్మదిగా ప్రశాంతంగా అన్నారు విశ్వనాధం గారు. సడెన్ గా ఆ మాట విని రఘు చాలా ఆశ్చర్యపోయాడు. "అదేంటి సార్, మీ ఇల్లు తాకట్టు పెడతారా, వద్దు సార్, అలా చెయ్యొద్దు. మీ ఇల్లు ఒక దేవాలయంలా అనిపించింది. అది వదలుకోకండి. నేను వీలైనంత సహాయం చేస్తాను" రఘు అవేశంగా అన్నాడు.

"ఇల్లు తాకట్టు పెట్టను రఘూ. ఇవ్వాళ ఒకటి అర్ధమయింది. జానకి నందివర్ధనం పువ్వు లాంటిది. ఆ పువ్వు దేవుడి దగ్గిర ఉండడానికి పుట్టింది. పువ్వుకి తెలీదు, దానిలో ఎన్ని తరాల సంప్రదాయాలు, సంస్కారాలు నిండి ఉన్నాయో. అది మనకి తెలియాలి. ఆ పువ్వుని దేవుని దగ్గరకి తీసుకెళ్ళడం మన బాధ్యత. అ పువ్వుని దేవుడి దగ్గరకి

తీసుకెళ్ళాలి కాని, అంగట్లో అమ్మేసి మన బాధ్యత అయిపోయిందని చేతులు కడిగేసుకోకూడదు. సంస్కారం లేని మనుషులకిచ్చి నా తల్లి  పెళ్ళి చెయ్యను. ఎప్పుడయితే దానికి తగినవాడు వస్తాడో, అప్పుడే దాని పెళ్ళి అవుతుంది.అప్పడి దాకా వేచి చూస్తాను" విశ్వనాధం గారి మాట చాలా ప్రశాంతంగా ఉంది. రఘుకి జానకి మాటలు గుర్తు వచ్చాయి. విశ్వనాధం గారి మాటలతో ఏకీభవించకుండా ఉండలేకపోయాడు.

"మీరు తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. జానకి గారి పెళ్ళి అవదేమో అని భయపడుతున్నరేమో అనుకున్నాను" అన్నాడు రఘు.

"అవును. నిజంగానే భయపడ్డాను. వయసు వస్తున్న కొద్దీ చిన్నప్పట్నించి తోడుగా ఉన్న  స్నేహితులు వెళ్ళిపోతారు. అది కనిపించే నష్టం. తెలియకుండానే దేవుడి మీద, మంచితనం మీద ఉండే నమ్మకాలు కూడా వెళ్ళిపోతాయి. అది కనిపించని నష్టం. కేవలం భయం మాత్రమే మిగులుతుంది. నేనూ లోకంతో కొంత కాలం పోరాడి చివరికి లొంగి పోయాను. ఇవాళ నిన్ను చూస్తే అనిపించింది, మంచితనం ఇంకా పోలేదని, దేవుడు తప్పకుండా ఉన్నాడని. ఇంకెప్పుడూ పిరికితనానికి తల వంచను. ఏదో ఒక రోజు ఒక మంచి వరుడు జానక్కి వస్తాడు. అప్పుడిదాకా వెదుకుతాను"

"మీ నిర్ణయం విని చాలా ఆనందంగా వుంది సార్. అల్ ది బెస్ట్" మనస్ఫూర్తిగా అన్నాడు రఘు.

"మ ఇంటికి వచ్చినందుకు, నాకు వెన్ను తట్టి ధైర్యం చెప్పినందుకు థాంక్స్. నువ్వు ఇద్దామనుకున్న డబ్బు కన్న, ఇచ్చిన విశ్వాసం ఎక్కువ విలువైంది. ఇంక బయలుదేరు. లేట్ అవుతుంది. గాడ్ బ్లెస్ యు" అని నమస్కారం చేసి వెళ్ళిపోయారు విశ్వనాధం గారు.

మర్నాడు పొద్దున్నే ఊర్నించి వచ్చిన చంద్రశేఖరంగారు విశ్వనాధం గారి తలుపు తట్టారు.

"ఓరె విస్సు, తలుపు తీస్తావా" అంటూ.

తలుపు తియ్యగానే నేరుగా హాల్లోకి వచ్చి కుర్చుని "వదినా,  కొంచెం కాఫీ ఇస్తావా ? నువ్వూ ఒకసారి ఇలారా" అన్నారు.

పక్కనే కూర్చున్న విశ్వనాధం గారిని పట్టించుకోకుండా "వదినా,  ఈ అమెరికా ఎయిడ్ మనకి రావట్లేదు. ఎందుకో తెలుసా ? మన విస్సు మనకి వాళ్ళ సహాయం అఖరలేదు అని చెప్పాడట. ఇంకెవరికైనా ఇచ్చెయ్యమని ఉచిత సలహా కుడా ఇచ్చాడట. అంతేకాదు. ఈ పెళ్ళి కూడా చెయ్యనని, జానక్కి ఒక మంచివాణ్ణి తీసుకొచ్చి పెళ్ళి చేస్తానని చెప్పాడట. ఇలాంటిదేదో జరుగుతుందని భయపడ్డాను సుమీ. భయపడ్డట్టే అయ్యింది. మళ్ళీ కధ మొదటికొచ్చింది. ఈ సంబంధం కూడా వెళ్ళింది. ఇలా అయితే జానక్కి ఎప్పుడు పెళ్ళవుతుందో నాకు తెలీదు. మళ్ళీ వేట మొదలు "

ఆ మాట వినగానే జానక్కి, అన్నపూర్ణమ్మ గారికి ఎంతొ తేలికగా అనిపించింది. అన్నపూర్ణమ్మ గారికి తెలుసు. ఆవిడ విశ్వనాథంగారితో అన్న మాటలు ఆయన మనసు మార్చేయని. విశ్వనాథం గారు నిన్న దేవుడి గదిలోకి వెళ్ళినప్పుడే అనుకున్నారు అవిడ, ఆయన ఏదో నిర్ణయం తీసుకున్నారని.

"అయినా నాన్నకి ఇష్టం లేకుండా చెయ్యలేరు కదా బాబయ్యా" జానకి నెమ్మదిగా అంది.

"అవున్లే నువ్వెప్పుడు మీ నాన్నకి మద్దతు, తండ్రి కూతుర్లు ఇద్దరు ఈ పెళ్ళీ కూడ అపేసారు " చంద్రశేఖరం గారు కోపంగా అన్నారు.

విశ్వనాథం గారు తల దించుకుని సైలెంట్ గా కూర్చున్నారు. "ఏరా, ఎమైనా మట్లాడేది ఉందా, ఇక ఇంతేనా? ఎంత కష్ట పడ్డానో, ఈ ఎయిడ్ వస్తుందేమోనని. నీ కసలు పట్టినట్టేలేదు. పెళ్ళి వద్దన్నావు సరే. వాళ్ళ ఎయిడ్ ఎందుకు వద్దన్నావు ? రేపు వేరే పెళ్ళయినా కావాలి కదా ? మాట్లాడితే తాకట్టు పెడతానంటావు. విడిపించడం ఎంత కష్టమో తెలుసా ? నీకెలాచెప్తే అర్ధం అవుతుంది ? " మళ్ళీ కోపంగా అన్నారు చంద్రశేఖరం గారు.

మెల్లిగా తలెత్తి అన్నారు విశ్వనాథం గారు "మనం జానకి పెళ్ళి గురించి వర్రీ అవుతున్నాము. కాని ఈ ఫౌండేషన్ కి అప్ప్లై చేసిన వాళ్ళల్లో రేపు ఎలాగడుస్తుందొ తెలియని వాళ్ళు ఉన్నార్రా. వాళ్ళకి వద్దు, మనకి ఇవ్వమని ఎలా అడుగుతామురా ? మనసు రాలేదురా. నన్ను క్షమించు" ఆ భావోద్వేగానికి ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అది చూడగానే చంద్రశేఖరం గారి కోపం మంచులా కరిగిపోయింది. వెంటనే లేచి విశ్వనాథం గారి దగ్గరకి వెళ్ళి ఆయన చేతులు పట్టుకుని అన్నారు "ఓరే, ఏదో కోపంలో అన్నాను గాని, నీ మనసు నాకు తెలీదురా ? చిన్నపటినించీ ఆదర్శంగా బతికేవు. అప్పుడప్పుడు అనిపించేది, నేనే నిన్ను పిరికివాణ్ణి చేస్తున్నానని. కాని, మనం ఇలాగే ఉంటే జానకి పెళ్ళి అవదేమో అని భయం వేసేదిరా. ఈ కష్టంలో కూడా నీ విలువల్ని పోగొట్టుకోలేదు నువ్వు. నిన్న మాట్లడుతూ రఘు ఒక మాట అన్నాడురా. అతను అమెరికాలో చాలా మంది డబ్బున్న పేదవాళ్ళని చూసాడట. సంపద అంటే డబ్బు కాదు మాస్టారు, సంపద అంటే విలువలు, సాంప్రదాయాలు సంస్కారాలు అని నా ఉద్దేశం. అవి విశ్వనాథం గారింట్లో పుష్కలంగా వున్నయి సార్ అన్నాడురా. విని ఎంత ఆనందం వేసిందో తెలుసా? నువ్వు మనసు చిన్నబుచ్చుకోకు నేనేదో అన్నానని. వెదుకుదాం. మంచివాడు వస్తాడు మన జానక్కి."

కొంచెం సేపు అందరూ మౌనం వహించారు. అన్నపూర్ణమ్మ గారికి వయసు మీదకొస్తున్నా ఇన్ని భయాల మధ్య కూడా, తన ఆదర్శాన్ని వదలని భర్త మీద ప్రేమ వెల్లువలా పొంగింది. "ఎంత మంచివారు ఈయన" అనుకున్నారు.

మౌనాన్ని చీలుస్తూ చంద్రశేఖరం గారి ఫొన్ మోగింది.

చంద్రశేఖరం గారు ఫొన్ ఎత్తి "హలో " అన్నారు.

"మాస్టారు, నేను రఘుని, మట్లాడవచ్చా కొంచెం సేపు ? " అడిగాడు రఘు.

"చెప్పు రఘు, తప్పకుండా" అన్నారు చంద్రశేఖరం గారు.

"మాస్టారూ.., ఒక విషయం మట్లాడదామని ఫోన్ చేసాను. నిన్ననే మాట్లడదామనుకున్నా, కాని ముందు మా అమ్మగారితో మాట్లాడాలని అగాను. నేను చాలా అలోచించాను మాస్టారు. నాకు జానకి లాంటి భార్య దొరకదు అని అనిపించింది. నా మనసు మార్చుకున్నా మాస్టారు, జానకిని నేను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నా. మా అమ్మ గారికి పూర్తిగా సమ్మతం. అంకుల్ కి ఇష్టమెమో కనుక్కుని చెప్పండి. ఉంటాను" అని ఫోన్ పెట్టేసాడు రఘు.

ఫోన్ పెట్టేసి చంద్రశేఖరం గారు కొంచెం సేపు మౌనంగా ఉండిపోయారు. వెళ్ళి విశ్వనాధం గారిని గట్టిగా కౌగలించుకున్నారు. తరువాత నెమ్మదిగా "ఒరేయ్ జానక్కి ఇంక సంబంధాలు వెతకక్కరలేదురా, దాని గురించి రాముడే స్వయంగా వచ్చాడురా " అన్నారు.

ఎవరికీ అర్ధం కాలేదు చంద్రశేఖరం గారు ఏమంటున్నారో. ఆయనే మళ్ళీ అన్నారు "అవునురా, రఘు మనసు మార్చుకున్నాడురా, జానకిని పెళ్ళి చేసుకుంటాడట, జానకిని వదులుకుంటే అంత మంచి భార్య దొరకదు మాస్టారు అన్నాడురా. నీ కిష్టమో కాదో కనుక్కోమన్నాడు", ఆ మాట వినగానే అంత వరకు దిగులుగా ఉన్న విశ్వనాధం గారి మనసంతా అనందంతో నిండి పోయింది. కళ్ళల్లొ నీళ్ళు తిరిగాయి. వాళ్ళిద్దరు ఆప్యాయంగా కౌగిలించుకున్నారు.

"వదినా, రఘూకి కట్నం కావాలట, వేయి నందివర్ధనాలు అడుగుతున్నాడు" నవ్వుతూ అన్నారు చంద్రశేఖరం గారు.

"మళ్ళి ఏ ఫౌండషన్ నో వెదకాలేమో బాబయ్యా నువ్వు" అంది జానకి నవ్వుతూ..

"ఈసారి వీడి దగ్గిరకి మటుకు పంపించను వదినొయ్. అవి కూడా ఎవరికో ఇచ్చెయ్య మంటాడు వీడు" విశ్వనాధం గారిని పట్టుకుని నవ్వుతూ అన్నారు చంద్రశేఖరం గారు. అందరు హాయిగా నవ్వుకున్నారు.

ఆ నవ్వుల మధ్యలో విశ్వనాధంగారు అన్నపూర్ణమ్మగారి కేసి చూసారు. అ చూపులో కొన్ని దశాబ్దాల నించి లోపల నిండి ఉన్న ప్రేమ, తగిన సమయంలో ఇచ్చిన సలహా గురించి కృతజ్ఞత నిండి ఉన్నాయి. అన్నపూర్ణమ్మ గారు అది చూడనట్లే "అంతా రాముడి దయ" అని చంద్రశేఖరం గారు తాగిన కప్పు తీసుకుని లోపలికి వెళ్ళిపోయారు.

# బిడియస్తుడు

బోడపాటి రమేష్

అతను చిన్నతనం నుంచీ చాలా బిడియస్తుడు. నలుగురి ఎదుట మాట్లాడలేడు ఆడవాళ్ళతో అయితే అస్సలు మాట్లాడలేడు.కారణం పైన చెప్పినదే. అట్లా అని ఆడవాళ్ళని చూడగానే ఖంగారు పడటం , మాట తడబడటం లాటి అనవసరమైన లక్షణాలేమీ లేవు. (నీ కెలా తెలుసు అంటారేమో.అదంతే). అతను కల్పించుకుని వాళ్ళతో సంభాషణ పెంచుకోడు.ఏదో అడిగిన దానికి ముక్తసరిగా సమాధానం చెప్పటం , అవతలికి వెళ్ళిపోవటం జరుగుతుంది.

స్కూల్లో పిల్లలు అతన్ని ఈ విషయంలో ఆట పట్టిస్తూ ఉండేవారు. ఆడపిల్లలయితే వచ్చీరాని పమిటల మాటున నవ్వులు దాచుకునేవాళ్లు.ఒక రకంగా ఇది అతని మంచికే ఉపయోగపడింది.

“మీ అబ్బాయి కేమమ్మా నిక్షేపంగా ఉంటాడు. శ్రద్ధగా చదువుకుంటాడు. ఈకాలం(?) పిల్లలలాగా ఆడపిల్లలతో పోచుకోలు కబుర్లు పెట్టుకోడు.”టూకీగా ఇది అతన్నిగమనించిన ఆడవాళ్ళు ఇచ్చిన సర్టిఫికేట్.

తల్లి ఆ మాటలు విని మెచ్చుకోలుగా కొడుకుని చూసి మురిసిపోయేది.

దానితో అతనికి ఒక రకమయిన అభిప్రాయం ఏర్పడింది. ఆడవారితో మాట్లాడటం , తిరగటం లాంటివి చేస్తే తన చదువు గట్రా పాడయి పోతాయి. ఈ అభిప్రాయం వయసుతో పాటు పెరిగిపోయి ముదిరిపోయింది.

కాలేజీలో చదువుకునే రోజుల్లో కూడా అదే ధోరణి కొనసాగించాడు.వయసుతో పాటు వచ్చే చిలిపి భావాలు అతనిలో కలిగినా వాటిని అణచి వేసేవాడు. అతనితో మాట్లాడాలని కొందరు ఆడవాళ్ళు ప్రయత్నించేవాళ్లు.మొదట్లో సరదాగా తీసుకున్నా కొన్నాళ్లు పోయిన తర్వాత అది పట్టుదలగా మారింది, ముఖ్యంగా అతని సహాధ్యాయి లలితకి.కలవారి అమ్మాయి. తొలిచూపులోనే ప్రేమించేయకపోయినా క్రమేపీ ఇతనిమీద మంచి అభిప్రాయం ఏర్పరచుకుంది. ఒకటి,రెండు ప్రేమలేఖల్లాంటివి కూడా మంచి రోజు(?) చూసుకుని వ్రాసేసింది.అయినా అతనిలో చలనం లేదు.

ఒకరోజు కాలేజి కాంటీన్లో అతన్ని నిలదీసి,”ఏమండీ నా ఉత్తరాలు అందాయా?”ఆతృతగా ప్రశ్నించింది లలిత.

‘ ఆ... ఊ’ అన్నాడేకానీ సరయిన సమాధానం ఇవ్వలేదు.

"ఏమండీ. నాతో మాట్లాడాలని అనిపించటం లేదా?"

" అబ్బే అదేం కాదు" తడబడ్డాడు.

"మరి" అని ఆమె రెట్టించటంతో అతనికి ఏం మాట్లాడాలో తెలీలేదు.

"ఓ నాకు తెలిసింది లెండి. నాతో మాట్లాడితే నోటి ముత్యాలు రాలిపోతాయని " గలగలా నవ్వేసింది.

"మీరట్లా అనటం బాగాలేదు.అయినా నాకు ఆడవాళ్ళతో మాట్లాడాలనిపించదు."

"హార్మోన్డఫిషియన్సీ"అతనికి వినబడీ వినబడకుండా అన్నది, కిసుక్కున నవ్వుతూ.

"ఏమిటంటున్నారు?" అన్నాడతను ఒకింత ఖంగారుగా.

"నా ఉత్తరాలకి సమాధానం రాయలేదేం?"

"మీరట్లా అడిగితే నేనేమీ చెప్పలేను అయినా ఆడపిల్లలు అట్లా ఉత్తరాలు రాస్తారా?"

"ఈ కాలం మగపిల్లలు ఊత్తరాలతో ఆగుతారా?" అన్నది కొంటెగా.

"ఏమయినా నాకు మీ వరస నచ్చలేదు".

"నాకూ మీ వరస నచ్చలేదు. చూస్తే ఈ శతాబ్దం ప్రవరాఖ్యుడిలా ఉన్నారు."

"................."

"ఇంతకీ ఏమిటంటారూ?"అన్నది ఒకింత విసుగు చూపిస్తూ .

బిక్కమొగమే సమాధానం.

"సరే ఇంతవరకూ ఏమీ అనలేదు.నే ఒకటే అడుగుతాను సూటిగా నా కళ్లలోకి చూసి చెప్పండి, నేనంటే మీకు ఇష్టమేనా?"

ఆమె కళ్లలోకి చూడలేక ఇష్టమేనన్నట్లు తల ఊపాడు.

సిగ్నల్ రెక్క వంగింది, ఆమె పట్టుదల, ఇరువైపు పెద్దల అంగీకారం తో వారిద్దరూ ఒకటయారు. ఇద్దరు ఆడపిల్లలు. మామగారి పరపతితో ఉద్యోగం లో చేరాడు.

పెళ్లి అయినా తర్వాత కూడా అతని అభిప్రాయం లో (ఆడవారి విషయం లో) మార్పు రాలేదు. లలిత అతని అమాయకత్వాన్ని చూసి వరించిందేమో భర్త నడవడిక మీద ఆమెకు కొండంత నమ్మకం ఉండేది. అందువల్లే పురిటికి రెండు సార్లు పుట్టింటికి వెళ్లినప్పుడు అటు మూడు నెలలు ,ఇటు మూడు నెలలు వెరసి ఆరేసి నెలలు పుట్టింట్లోనే ఉండేది. పైగా ఆడవాళ్ళతో మాట్లాడితేనే అపార్థాలకు దారితీస్తోందేమోననే అతని మనస్తత్వాన్ని చూసి" మీరు భలేవారేనండి"అని పైకి గలగలా నవ్వినా మనసు ప్రశాంతంగా ఉండేది.

అందుకు ఒక దృష్టాంతం పెళ్ళయిన కొత్తలోనే జరిగింది.

లలిత స్నేహితురాలు శ్యామల వీళ్ళింటికి వచ్చింది."నమస్కారం మోహన్ గారూ" అంటూ అప్పుడే ఆఫీసు నుండి వస్తున్న లలిత భర్తను పలకరించింది.

" నమస్కారం"అని తడబడుతూ ప్రతి నమస్కారం చేసి అవతలి గదిలోకి వెళ్ళిపోయాడు.

"అదేమిటే మీ ఆయన ఉలుకుపలుకు లేకుండా వెళ్ళిపోయాడు. సిగ్గా ,భయమా లేక నువ్వు ఆయన్ని ..."అంటూ ప్రారంభించింది.

"అబ్బే అదేం కాదే. ఆఫీసు నుండి అలసటగా వచ్చారు. నిన్నెప్పుడో మా పెళ్లి లో చూడటమే కదా. సరిగా గుర్తు పట్టుండరు" అని సర్ది చెప్పి భర్త గదిలోకి వెళ్ళి

"మా శ్యాము వచ్చిందండీ" అన్నది,రుసరుసలాడుతూ

"ఆ " అని ఊరుకున్నాడు

"అదేమిటి మా శ్యామలతో మాట్లాడరా!".

"ఇది మరి బాగుంది. ఆవిడతో నాకేం మాటలుంటాయి?"

"మాట్లాడాలంటే బోలెడుంటాయి. కనీసం వాళ్ళ కుటుంబం గురించయినా అడగవచ్చు కదా. సినిమాలు, టివి కార్యక్రమాలు.... మాట్లాడాలంటే విషయాలే ఉండవా?"

"అవన్నీ ఆవిడతో ఎందుకు,నా కిష్టం ఉండదు."

"అవును లెండి. అదే మీ ఆఫీసులో ఆడవాళ్ళతో అయితే గంటల తరబడి మాట్లాడతారు" అన్నది భారతనారిలాగా ముక్కు తుడుచుకుంటూ.

స్నేహితురాలు ముందు తల కొట్టేసినట్లుగా ఉంది ఆమెకు.

"భలే దానివోయ్ నేను నీతోనూ, మా అమ్మతోనూ తప్ప మరెవరితోనయినా మాట్లాడటం నువ్వు ఎప్పుడయినా చూశావా!"

'హార్మోన్ డెఫీషియన్సీ' అంటూ నవ్వేసింది. అంతకు మించి ఇంకేమీ చేయలేకపోయింది. ఈ సంఘటనతో భర్త మీద ఆమెకు ఉన్న అభిప్రాయం ఇంకా బలపడిపోయింది. అది మార్చుకునే సందర్భం కానీ, అవసరం కానీ ఆమెకు రాలేదు.ఈ రోజుల్లో 'ఇంకా ఇలాంటి వారు ఉన్నారా! ఉంటారు, నూటికో కోటికో ఒక్కరు ఇంకొక ఆడదాన్ని కనీసం కన్నెత్తయినా చూడనివాళ్లు, మా ఆయనలాగా' అని మురిసిపోయేది.

వాళ్ళ ఇద్దరు పిల్లలు పెద్ద వాళ్లవుతున్నారు. గౌను,స్కర్టు స్థాయి నుంచి నిలిచీ నిలవని చున్ని కాలేజీ స్థాయికి వచ్చేశారు. తమ వయసు పిల్లలతో స్నేహాలు, ఒకళ్ల ఇంటికి ఒకళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. వయసు తెచ్చిన మార్పుతో మోహన్ కు ఇదివరకు లాగా మాట్లాడాలంటే బెరుకుతనం పోయి , ఇక మాట్లాడినా తప్పులేదు అని క్రమేపీ

అనుకోవటం, అమలు చేయటం ప్రారంభించాడు. దానికి తోడు వచ్చే పిల్లలు కూడా అంకుల్ అంటూ మాట్లాడుతూ ఉండేవారు వాళ్ళ కాలేజీ సంగతులు,స్నేహితుల గురించి చెపుతుండేవారు.

కానీ ఈ మధ్య తమ తండ్రి వాలకం మోహన్ పెద్ద అమ్మాయికి నచ్చటం లేదు.

ఆ అమ్మాయి' మా నాన్న ఇదివరకే నయం ఎవరితోనూ మాట్లాడకుండా ఉండేవాడు. ఇప్పుడేమిటో వచ్చిన ప్రతివాళ్లతోనూ మాట్లాడేస్తున్నారు. ముఖ్యంగా మా ప్రమీలయితే మరీనూ చున్ని జారిపోయినా పట్టించుకోదు, సర్దుకోదు' అనుకోవటం ప్రారంభించింది.

ఒక రోజు ఉండబట్టలేక తన తల్లి దగ్గర ఈ ప్రస్తావన తెచ్చింది.

"అమ్మా నాన్నగారేమిటే ఇలా తయారయ్యారు?" అంటూ.

విషయం అర్థం కాని లలితమ్మ తెల్లబోయి చూసింది.

"నాన్న ఇదివరకే నయం.చక్కగా తన గదిలో కూర్చుని ఆయన పనులేమిటో చేసుకునేవారు. ఇప్పుడేమో మా ఫ్రెండ్సుతో మాట్లాడేస్తున్నారు. ఆ ప్రమీలయితే మరీనూ. నాన్న మీదపడి మాట్లాడేస్తుంది. నాన్న మారిపోతున్నారమ్మా. ఇదివరకు లాగా కాదు అందరు ఆడవాళ్ళతోనూ మాట్లాడేస్తున్నారు.నాన్న వరసేమీ బాగాలేదు" అని ఖచ్చితంగా చెప్పేసింది.

తల్లి తెల్లబోయింది. కొంతసేపటికి తేరుకుని,

" ఛ నాన్న చాలా మంచివారు. అటువంటివేమీ మనసులో పెట్టుకోకు. అయినా వాళ్ళనీ తన పిల్లలనుకుంటారు. మీ అందరిదీ ఒకే వయసుకదా" అని సర్దిచెప్పినా భర్త మీద తన అభిప్రాయం తో పాటు పిల్లలకు కూడా అభిప్రాయం ఏర్పడే వయసు వచ్చిందని అవగతమయింది.

## అమ్మకి ఏమయ్యింది? ఆర్.సి.కృష్ణ స్వామి రాజు

శేషాచలం కొండలు వెండి రంగులో మెరిసిపోతున్నాయి. చల్లటి చిరుగాలులు చిన్న చిన్నగా వీస్తున్నాయి. ఆకాశంలో, పున్నమి చంద్రుడు నిండు గర్భిణీలా కదలలేక కదులుతున్నాడు.

అపార్టుమెంట్ ఆరవ అంతస్తులోని పెంట్ హౌస్ ముందర, అమ్మా కొడుకులు వెన్నెలలో కూర్చుని వున్నారు. కోడలు హాల్ లో కూర్చుని టీవీ సీరియల్ చూస్తోంది.

అమ్మ అంజలి ఊరి నుంచి తెచ్చిన పనస తొనలు ఒక్కొక్కటి, కొడుకు నోటికి అందిస్తోంది. తియ్య తియ్యటి పనస తొనలు తృప్తిగా తింటున్నాడు.

"అమ్మా! అవ్వాతాతలు నీకు అంజలి అనే మంచి పేరు పెట్టినారు. నిన్ను చూస్తే పాత సినిమాలలో తల్లి పాత్రలో నటించే అంజలీ దేవి గుర్తుకొస్తుంది" అని అన్నాడు.

ఆమె ముసిముసిగా నవ్వింది.

xxxxxx

తిరుమల తిరుపతి దేవస్థానంలో సివిల్ ఇంజనీర్ గా పని చేస్తున్నాడు నాగరాజు. అతడి భార్య నళిని గవర్నమెంట్ స్కూల్ లో తెలుగు టీచర్ గా పని చేస్తోంది. వారిది కడప జిల్లా పాపిరెడ్డిపల్లి అనే గ్రామమైతే, ఉద్యోగ రీత్యా తిరుపతిలో కాపురముంటున్నారు. పెళ్ళై, కొడుకు కాపురం పెట్టిన మూడేళ్ళకి కానీ, అమ్మ తిరుపతికి రాలేదు. మూడు వారాలు ఉండి పోవాలని ఇప్పుడు వచ్చింది.

అమ్మ వచ్చిన మూడవరోజు–

అమ్మ పడక నుంచి ఇంకా లేవ లేదు. "అమ్మా, ఉదయిస్తున్న సూర్యుడిని చూడు, కమలాపండులా ఎలా మెరిసిపోతున్నాడో"అని నిద్ర లేపాడు.

"మన ఊరి గుట్టల సందున పుట్టే సూర్యుడిని చూస్తేనే, నాకు సూర్యుడు పుట్టినట్లుగా అనిపిస్తుందిరా నాగరాజా" అని బదులిచ్చింది. 'జిహ్వ కొక రుచి, పుర్రెకో బుద్ధి' కదా అని అనుకుంది కోడలు.

పడక నుంచి లేయాలని చూసిన అమ్మ, భరించలేని ఒళ్ళు నొప్పులు ఉండడంతో కాసేపు అలాగే పడుకుని నిదానంగా లేచి కూర్చుంది. అడుగు తీసి అడుగు పెట్టాలంటే పెట్టలేకపోతున్నానని, నొప్పులు ఎక్కువగా ఉన్నాయని బాధపడింది. జ్వరం ఉందేమోనని చూశాడు. అలాంటిదేమీ లేదు. 'వేడి నీళ్లు తాగితే తగ్గిపోతుందిలే' అని గమ్మున వుండి పోయాడు. గంటగంటకీ నొప్పులు పెరిగాయి కానీ, కొంచెం కూడా తగ్గలేదు.

డాక్టరు దగ్గరికి వెళదామని అడిగాడు. "వైద్యుడు రోగాలు కోరు, వ్యాపారి కరువు కోరు అనే సామెత తెలిసిందే కదా. ఆ టెస్టులూ, ఈ టెస్టులూ అని నీకు గుండు కొట్టిస్తారురా నాయనా. రోగాలు మనుషులకు కాక, మాకులకు వస్తాయా, వచ్చిన రోగం వచ్చినట్లే పోతుందిలే" అని కొడుక్కి సర్ది చెప్పింది.

విషయం తెలిసిన అపార్ట్మెంట్ మిత్రులు ఒత్తిడి చేయడంతో అమ్మ అంగీకరించింది. రాముల వారి గుడికాడ వున్న ప్రఖ్యాత ఆయుర్వేద డాక్టరును కలిశారు. నాలుక, కళ్ళు, నాడి పరీక్ష చేశాడు. "చక్కర, రక్తపోటు, ఉబ్బసం లాంటి వ్యాధులేమైనా ఉన్నాయా" అని ప్రశ్నించాడు. రుతు క్రమం వివరాలు తెలుసుకున్నాడు. భయం లేదని చెప్పి రెండు చూర్ణాలు రాసి ఇచ్చి తేనెలో కానీ, ఆవు నెయ్యిలో కానీ, కలిపి మూడు పూటలా వాడమన్నాడు.

వాడడం ప్రారంభించి మూడు రోజులైనా అమ్మ ఒళ్ళు నొప్పులు తగ్గలేదు. చుట్టుకుని చుట్టుకుని పడుకోసాగింది. బలం తగ్గిందేమోనని కువైట్ ఖర్జూరాలు, బాదం, పిస్తా, జీడి పప్పు, చుక్క అరటి పండ్లు పెట్టసాగారు. కాచిన వేడినీళ్ళే వాడసాగారు.

సమయానికి అన్నం తినమని కోడలు బతిమాలాడితే "మల్ల తింటాను, ఇప్పుడు ఆకలి కావడం లేదు" అని బదులిచ్చేది. ఆరు పదులు నిండిన అత్త కదా "వేళకి తిండి తింటే ఆరోగ్యం, వేళ తప్పి తింటే అనారోగ్యం" అని చెప్పి బతిమలాడి తినిపించేది.

ఒక రోజు కోడలు బాదం పాలు అత్తకి ఇస్తూ, శేషాచలం కొండల్ని చూస్తూ "అత్తకి జరుగరానిది జరిగితే, కోడలినే కదా అందరూ ఆడి పోసుకుంటారు. కోడలు వచ్చిన వేళ, కోడెలు వచ్చిన వేళ అని పల్లెలలో అనుకోవడం మాములే కదా. నాకు అలాంటి నింద రానివ్వవద్దు స్వామీ" అని గోవిందుడికి మొక్కుకుంది.

విషయం తెలిసిన కొలీగ్స్ "ఆయుర్వేద వైద్యం పని చేయడం లేదేమో, గోవింద రాజుస్వామి గుడి పక్కనున్న సందులో పెద్ద పేరున్న హోమియో వైద్యుడి సలహా తీసుకోమన్నారు. అమ్మని జాగ్రత్తగా టూ వీలర్ లో కూర్చోబెట్టుకుని హోమియో వైద్యశాలకు వెళ్ళాడు.

డాక్టరు, బాల్యం నుంచి ఆమె ఆహారపు అలవాట్లు, ఏవి ఒంటికి పడతాయి, ఏవి పడవు అనే వివరాలు, సరిపడే వాతావరణం, దినచర్యలు, ఆలోచనా సరళి, ఇలాంటివి గంట సేపు విచారించి అడిగి ఫైలులో రికార్డు చేసాడు. వయస్సు రీత్యా వచ్చే బడలిక, బలహీనం వల్ల ఒళ్ళు నొప్పులు వస్తున్నాయన్నాడు. తెల్లటి గుళికలు బాటిల్ లో వేసి ఇచ్చి, మూడు పూటలా భోజనానికి ముందు చప్పరించమన్నాడు. మరో రకం డ్రాప్స్ ఇస్తూ రాత్రిలో పడుకునే ముందు నీళ్లలో కలిపి తాగమన్నాడు. క్రమశిక్షణ కలిగిన విద్యార్థిలాగా పూట తప్పకుండా మందులు వాడసాగింది. అయినా అమ్మ ఒళ్ళు నొప్పులు ఆవ గింజంత కూడా తగ్గలేదు.

సమాచారం తెలుసుకున్న బంధువులు కొందరు " రేణిగుంట రోడ్డు లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వుంది కదా,మొత్తం బాడీ అంతా జనరల్ చెక్ అప్ చేయించరాదా " అని సలహా ఇచ్చినారు.

వన్ ఫైన్ మార్నింగ్, ఖాళీ కడుపుతో జనరల్ చెక్ అప్ చేయించడానికని అమ్మని తీసుకుని బయలుదేరాడు. లేకలేక కొడుకు ఇంటికి అత్త గారు వస్తే ఒళ్ళు బాగా లేకుండా వచ్చింది, కోడలు సరిగా చూసిందో లేదో అని తెలిసిన వాళ్ళు, ఊర్లో వాళ్ళు చెవులు కొరుక్కుంటారేమోనని కోడలు టెన్షన్ పడింది. స్కూల్ కు లీవ్ పెట్టి తను కూడా హాస్పిటల్ కి వస్తానని చెప్పి భర్తతో పాటు కారులో కూర్చుంది.

"నన్నెందుకురా నాయనా పెద్ద పెద్ద ఆసుపత్రులకు తిప్పుతావు? చేతిలో వున్నదంతా ఖర్చు పెడతావు? పెద్ద ఆసుపత్రుల వాళ్ళు కొండను తవ్వి ఎలుకను పట్టే మాదిరి. అదీ ఇదీ చెప్పి మనల్ని భయపెడుతారురా" అని అమ్మ బాధ పడింది. ఆమెను ఎలాగోలా ఒప్పించి చిన్నగా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

హాస్పిటల్ లో రెసెప్షన్ వారు నవ్వుతూ పలకరించారు.

నర్సులు కొత్త ఫైలు ఓపెన్ చేసి హైట్, వెయిట్, పల్స్, బ్లడ్ ప్రెషర్ లు రికార్డు చేసి రక్త పరీక్షలు ప్రారంభించినారు.

అక్కడే వైద్యం కోసం వచ్చిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు "అదేందక్కా ,ఒక డాక్టరు ఏమో తిండి బాగా తినమంటాడు,ఇంకో డాక్టరు ఏమో తిండి బాగా తగ్గించమంటాడు. ఎవరి మాట వినాలక్కా" అని మాట్లాడుకోవడం విని అమ్మ నవ్వుకుంది.

ఒక గది నుంచి మరొక గదికి గిరగిరా మూడు గంటలు తిప్పి, ఇ.సి.జి.,అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎముక, కంటి, దంత పరీక్షలు కూడా చేసినారు. చివరిగా రిపోర్టులన్నీ ఫైలు చేసి, పెద్ద డాక్టరు దగ్గరికి తీసుకుపోయినారు.

ఆయన అన్ని రిపోర్టులూ సంపూర్ణంగా చూసి," రిపోర్టులన్నీ బాగానే ఉన్నాయి. ఎక్కడా ఇబ్బంది లేదు. మానసిక ఒత్తిడికి గురైతే కూడా ఇలా నొప్పులు రావచ్చని చెప్పి, చిన్నచిన్నయోగాసనాలు, ప్రాణయామములు చేయండి " అని సలహా ఇచ్చి పంపినాడు.

మొగుడూ పిల్లలిద్దరూ అమ్మకి ఆరోగ్యసమస్య ఏమీ లేదని సంతోషించినా, 'ఒళ్ళు నొప్పులు తగ్గేదెట్లబ్బా' అని ఆలోచిస్తూ కారులో ఇంటికి బయలుదేరినారు.

లీలా మహల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటూ ఇటూ చూస్తున్న నాగరాజుకు రోడ్డు పక్కన వున్న ఆర్.ఎమ్.పి డాక్టరు వైద్యశాల కనిపించింది. జనాలు గిజగిజ వున్నారు. వారిలో చదువుకోని వారు, చదువుకున్న వారు, పిల్లలు, పెద్దలు వున్నారు. వారందరినీ చూసి, పెద్దపెద్ద చదువులు చదివిన డాక్టర్లు ఎంతోమంది పట్టణంలో వుండగా, ఆర్.ఎమ్.పి. డాక్టర్ల దగ్గర వైద్యం కోసం వచ్చిన వారిని చూసి మొగుడూ పెళ్ళాలు ఆశ్చర్యపోయారు. కడుపు నొప్పి మొదలుకుని క్యాన్సర్ వరకు అన్నిటికీ తను వైద్యం చేయగలనని పెట్టి వున్న బోర్డును చూసి ముక్కు మీద వేలు వేసుకున్నారు. రోగులందరినీ డాక్టరు నవ్వుతూ పలకరిస్తున్నాడు. ఒకరిద్దరికి ఇంజెక్షన్ లు వేసాడు. మందులు అలా వాడాలి ,ఇలా వాడాలి అని సలహాలు ఇస్తున్నాడు.

అమ్మ మౌనంగా డాక్టరు వైపే శ్రద్ధగా చూడసాగింది. ఇంతలో ట్రాఫిక్ కదలడంతో కారులో బుర్రున ఇంటికి చేరినారు

బాగా అలసిపోయి ఉండడంతో అందరూ గబగబా తినేసి కాసేపు రిలాక్స్ అవుదామని నడుము వాల్చారు.

xxxxxx

సాయంత్రం అయిదు గంటలయ్యింది. నిద్ర లేచి చూసిన మొగుడూ పెళ్ళానికి అమ్మ అగుపించలేదు. అపార్ట్ మెంట్ అంతా వెదికారు. ఎక్కడా కనిపించలేదు. 'అమ్మకు తెలిసిన వారెవరూ ఇక్కడ లేరు కదా,ఎక్కడి కెళ్ళిందో' అని భయపడ్డారు.

" అయినా,అమ్మకి తిరుపతిలోని వీధులేవీ సరిగా తెలియదు కదా. ఎక్కడికని వెళ్ళింది? ఎందుకింత సాహసం చేసింది? ఊరు కాని ఊరు. ఆమెకు జరగరానిది జరిగితే ఎట్లబ్బా? భగవంతుడా, మాకు కొండంత కష్టాలు పెట్టావేమి! ఇబ్బంది లేకుండా చేయి స్వామీ" అని శేషాచలం కొండలకు మొక్కుకున్నారు.

ఇంట్లో పొద్దు పోక, పట్టణంలోకి వెళ్ళిందేమోనని అనుమానమేసి నాగరాజు ఒక మోటార్ సైకిల్ తీసుకుని బయలుదేరాడు. గుండె డభీ,డభీమని కొట్టుకుంటూ ఉండడంతో నళిని కూడా తన స్కూటీ తీసుకుని అత్తను వెదకడానికి బయలుదేరింది

నాగరాజు డుర్రు డుర్రున బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, త్యాగరాజమండపం, మహతి ఆడిటోరియంలు వెదికాడు. అమ్మ ఎక్కడా కనిపించలేదు. నళిని సర్రుసర్రున బండిలో వెళ్లి బొంతాలమ్మ గుడి, రాములవారి గుడి, , అలిపిరి, కపిల తీర్థంలు చుట్టి నిరాశగా ఇంటికి బయలుదేరింది.

ఇద్దరూ లీలా మహల్ జంక్షన్ వద్దకు చేరారు. బండ్లు రోడ్డు పక్కన నిలబెట్టి ఎక్కడెక్కడ వెదికిందీ మాట్లాడుతూ ఉన్నారు.

దూరం నుంచి " నాయనా, నాగరాజా!" అనే అమ్మ పిలుపు వినిపించింది. ఇద్దరూ ఒకేసారి తల తిప్పి చూశారు.

ఆర్.ఎమ్.పి. డాక్టరు హాస్పిటల్ వద్ద నిలబడి ఉన్న అమ్మ ముఖం నిండు పున్నమి చంద్రుడిలా వెలిగిపోతోంది. పక్కనే అమ్మ భుజానికి ఇంజెక్షన్ వేస్తున్న డాక్టరు కనిపించాడు. అమ్మ చిరు నవ్వులు చిందిస్తూ కుడి చేయి ఊపింది.

అక్కడ, అమ్మను చూసిన మొగుడూ పెళ్ళాలిద్దరూ ఆశ్చర్యంగా ముక్కు మీద వేలేసుకున్నారు. గబగబా అమ్మ దగ్గరికి వెళ్లి గట్టిగా కౌగిలించుకున్నారు.

"నాగరాజా, నాకు జ్వరం వచ్చినా, జలుబు వచ్చినా మన ఊరి ఆర్.ఎమ్.పి. డాక్టరు శంకర నారాయణ దగ్గర ఒక్క ఇంజెక్షన్ వేయించుకున్నానంటే చాలు, పది నిమిషాల్లో తగ్గిపోతుంది. గొప్ప గొప్ప డాక్టర్లు చూసినా, పెద్ద పెద్ద ఆసుపత్రులలో నన్ను చూపించినా, నాకు తృప్తి వుండదు. వారు వ్రాసి ఇచ్చిన మాత్రలు, మందులు ఎన్ని మింగినా జబ్బు

తగ్గదు. అలవాటు అయిన ప్రాణం కదా. ఒక్క ఇంజెక్షన్ కి మాత్రమే నాకు జబ్బు తగ్గుతుంది. అందుకని మీకు చెప్పకుండా ఇంజెక్షన్ ఒకటి వేయించుకుందామని వచ్చినానురా" అని చెప్పింది.

"సరే ఇంటికి పోదాం... రా, అమ్మా" అన్నాడు.

"మీరు బండ్లలో వెళ్ళండి. నేను నడిచి వస్తాను" అని బదులిచ్చింది.

"బండిలో వెళదాం. మన ఇల్లు మైలు దూరంలో ఉంది. నీకు, ఒళ్ళు నొప్పులు కదా" అన్నాడు.

"నొప్పులు ఇంకా ఎక్కడ ఉన్నాయి. ఇంజెక్షన్ దెబ్బకి ఇరవై మైళ్ళ దూరానికి పారిపోయి ఉంటాయి" అని చెబుతూ జింక లెక్కన ఇంటి వైపుకి పరుగు నడకతో బయలుదేరింది.

'కొండను తల కింద పెట్టుకుని రాళ్ళ కోసం వెదికినట్లు ఉంది మన వ్యవహారం' అనుకున్నారు మొగుడూ పెళ్ళా లు.

శేషాచలం కొండలలోని నామాల స్వామి ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు.

# ఆరుపదుల్లో అలజడులు

గోవిందరాజు మాధురి

'మీరు తీసుకున్న నిర్ణయం ఏమిటో చెప్పలేదు. అది కరెక్టు అనిపించిందా? మరో మాటు ఆలోచిస్తారా?' అని పడుకోబోతున్న మా ఆయన హరిని భయంతో, చిన్నగా అడిగాను.

అటు నుంచి జవాబు రాలేదు. నాకే నవ్వొచ్చింది. మూడు దశాబ్దాలు దాటిన మా వైవాహిక జీవితంలో ఎన్నో అలజడులు ఎదుర్కొన్న సమయాలలో కూడా ఇదేమాట ధైర్యంగా, పెద్దగా అడిగేదాన్ని. ఇప్పుడు అదే మాట అడగటానికి జంకుతున్నానంటే, ఆ నిర్ణయం మీద చర్చించటం ఆయనకు ఇష్టంలేదని తెలుసు. అయినా, నాకు బుద్ధి మారదాయే...! నోరు కదిపాను. పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకున్నాక, పడుకునే ముందు మరోసారి గుర్తుచేసే అలవాటు చేయటం పరిపాటైంది. నిన్న ఆయన నిర్ణయం తీసుకున్నాగానీ, అదేమిటో నాకు చెప్పలేదు. మరి అలజడే కదా..! నాకు. ఆయన దగ్గర్నుంచి జవాబు రాలేదంటే మళ్లీ అడగటం దండగే అనుకున్న నేను, నిద్రకి జారుకుంటున్న సమయంలో తెలియకుండానే నా గతంలో జరిగినవి కొన్ని నా కళ్ల ముందు కదిలాయి....ఇలా......!

గుంటూరు దగ్గర చిన్న పల్లెటూరు మా ఊరు. మా చిన్నప్పుడు చదువుల కోసం గుంటూరులో వున్నాం. డిగ్రీ అవగానే పెళ్లి అవటం, ఆ తర్వాత ఆయనతో పాటు అడుగుపెట్టిన మొదటి సిటీ బెంగళూరు. పంపటానికి అమ్మ ఇష్టపడలేదు.

అమ్మ 'రేఖా! అతను ఒక ఆరునెలల్లో మద్రాసులో (ఇప్పుడు చెన్నై) ఏదో ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగంకి మారుతాడుట. నీవు మాతో పాటు వుండు లేదా అత్తగారింట్లో వుండి వంట నేర్చుకో అన్నారు.

నా మనసులో మాత్రం బెంగళూరు చూస్తే బాగుండనుకున్నాను.

మా అమ్మ, మా ఆయనతో 'బెంగళూరు ఎందుకులే బాబూ..! మద్రాసు వచ్చాక పంపుతాములే' అన్నది. అతను ఒప్పుకోలేదు.

'మళ్లీ బెంగళూరు ఎప్పుడెళతామో...! తెలియదు, తను చూసినట్లుంటుందని' చెప్పేసరికి మా వాళ్లు 'సరే..!' అని చెప్పకతప్పలేదు.

'హమ్మయ్య....!' బెంగళూరు చూడబోతున్నందుకు చాలా సంతోషం వేసింది. అతనికి 'ధ్యాంక్స్ ' చెప్పాలనిపించినా చెప్పలేదు, చాలా సిగ్గుపడ్డాను.

బెంగళూరులో ఆరు నెలలు చాలా త్వరగా గడచిపోయాయి. హరికి సమయం దొరికినప్పుడల్లా, నాకు ఊరు చూపించేవాడు. గుంటూరు నుంచి వెళ్లిన నాకు, చల్లగా వున్న ఆ ప్రదేశం చాలా నచ్చింది. ఎందుకితను బెంగళూరు నుంచి మద్రాసు వెళ్లటం అనిపించి, నిదానంగా అతన్ని అడిగాను.

'రేఖా...! నాకు అక్కడ మంచి అవకాశం వచ్చింది. మనం ఆర్ధికంగా నిలదొక్కోవాలి. మనం హాయిగా జీవించటానికి' అన్న అతని మాటలు నాకు చాలా నచ్చాయి.

నాన్న దగ్గర్నుంచి వచ్చాక మొదటిసారి డబ్బు గురించి, మాట్లాడటం, చాలా శ్రద్ధగా వినటం జరిగింది. జీవితంలో డబ్బు ఎంత ముఖ్యమో అప్పుడు అర్ధమయింది. కొత్తగా పెళైన అన్ని జంటల్లాగానే మేం కూడా చుట్టుపక్కల చక్కటి ప్రదేశాలు, గుళ్లు, మైసూర్, ఆ తర్వాత, 'టీ' ఎస్టేట్లు కూడా చూసాం. ఈ ఆరు నెలల్లో అమ్మవాళ్లు ఒకసారి వచ్చారు.

అమ్మ 'ఇంతకీ అతన్ని అర్ధం చేసుకున్నావా...?' అని అడిగితే వెంటనే

'నన్ను చక్కగా చూసుకుంటాడుట, మేమిద్దరం కలసి హాయిగా వుండాలి' అన్నాడని నేను చెప్పగానే,

అమ్మ చాలా సంతోషించింది.

' రేఖా.! అసలు పిల్లాడు మాట్లాడటం లేదని మేం భయపడ్డాం. కానీ, నీవు మంచి మాటే చెప్పావు. తల్లీ...!, నీవు అనవసరపు ఖర్చులు పెట్టి, అతన్ని ఇబ్బంది పెట్టకు. ఏదైనా సరే...జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోమని అతనికి

గుర్తుచేయటం మాత్రం నీ బాధ్యత అని చెప్పింది'. అమ్మ మమ్మల్ని చూసి చాలా సంతోషించింది. మా అత్తగారు, మావగారు కూడా చాలా సంతోషించారు మా కాపురంచూసి. హాయిగా వూరు తిరిగిరమ్మని మా అత్తగారు చక్కగా పంపేవారు కూడా. మా మొదటి అధ్యాయం బెంగళూర్‌లో మొదలయి, మద్రాసుకు జేరింది మా జీవనప్రయాణం.

అంతే, ఆ తర్వాత అతను, తన కెరీర్‌లో మునగటం, నేను మా ఇద్దరి పిల్లల బాధ్యతలతో పాటు ఇంట్లో పనులతో సతమతమవటంతో సరిపోయేది. మద్రాసు వచ్చాక నాకు చిన్నగా అర్ధమయింది, ఎందుకు బెంగళూరు నుంచి మద్రాసుకు మారేమో...! . అతనికి ప్రమోషన్ వచ్చింది, జీతం కూడా పెరిగింది. ఆఫీసులో కష్టపడితే పైకి వచ్చే అవకాశాలు ఎక్కువని అనేవారు. ఒకొక్కసారి మాత్రం అనిపించేది ' జీవితాలింతేనేమో.....! ఎప్పటికప్పుడు బాధ్యతలు... బాధ్యతలు.... పెరగటమే తప్పా.... తగ్గటంలేదని'. మళ్లీ అనుకునే వాళ్లం, పిల్లలు పెద్దయ్యేదాక సర్దుకుపోతే...., ఆ తర్వాత వాళ్లే మనకు బాటగా నిలుస్తారని సమాధాన పరుచుకునేవాళ్లం. నేను ఆయనకన్నా ఎక్కువ ఆశలు పిల్లల మీద పెట్టుకున్నాను. మా వృద్ధాప్యంలో, మా పిల్లలు ఆసరాగా నిలుస్తారని ఆశించాను.

పెద్దతనంలో మమ్మల్ని చూడటం మాట పక్కనపెడితే, మా పిల్లలు పదవ తరగతి, ఇంటర్‌మీడియట్‌లో వున్నప్పుడే, మన దేశంలో దశాబ్దాలుగా మారని కొన్ని రంగాలల్లో మార్పులు చాలా చురుగ్గా చోటుచేసుకున్నాయి. పెను తుఫానులాగా ఐ.టి. రంగంలో విస్తృతంగా అభివృద్ధి. వీటితో పాటు మిగతా రంగాలల్లోనూ సాంకేతిక అనుసంధానం., ఇంటర్నెట్ గేమ్స్ జోన్స్ అన్నీ ప్రారంభాలవటం. ఆర్ధికరంగంలో విద్యార్ధులకు విదేశీ చదువులకు బ్యాంకులు రుణాలు ఇవ్వటం, ఆ పైన, విదేశీయ కంపెనీలల్లో ఉద్యోగాలు. ఇవన్నీ మధ్యతరగతి వాళ్ల జీవనశైలిలోనే అద్భుతమైన మార్పులు వచ్చాయని గర్వం పడ్డారందరూ ఆ రోజుల్లో.

ఆ మార్పులే యుక్త వయస్సులో వున్న మా పిల్లల ఆలోచనా విధానంలోనూ పెనుమార్పులు తెచ్చాయి. వాళ్లకు ప్రపంచంలో జరుగుతున్న విద్యావిధానాలు, విదేశాల్లో చదివితే వాళ్ల భవిష్యత్తు బాగుంటుందన్న ఆలోచనలు చాలా గట్టిగా వాళ్ల మెదడులలో నాటుకు పోయాయి. నాకు మాత్రం మా ఆర్ధిక పరిస్థితుల్లో వాళ్లకి కావలసినట్లు అన్నీ చేయగలమా.. !, ఆ తర్వాత మా పరిస్థితి ఏమిటనే భయం నన్ను వెంటాడుతునే వుండేది. చాలాసార్లు అదేమాట మా వారిని అడిగేదాన్ని.

ఆయన మాత్రం 'ముందర పిల్లల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని మనం నిర్ణయాలు తీసుకోవాలే కాని, మన గురించి ఇప్పుడే ఆలోచనలు చేయవలసిన సమయం కాదని' చెప్పారు. అప్పుడే నాలో ఆందోళనలు మొదలయ్యాయి. ఆ అలజడులు క్రమంగా తలనొప్పి, గుండెదడ, బి.పి. రూపాలల్లో బయటపడింది. నా ఆరోగ్యం పాడవుతుందని, ఈయన నేను బాధపడకూడదని నవ్విస్తూ ' నాకు ఆరు పదులు దాటబోతున్నాయి త్వరలో నా వెనకే నీకు కూడా.. ! ఈ అలజడులే నీ ఆరోగ్యం పాడుచేస్తాయి కాని సమస్యలకి పరిష్కారం చూపవు. నీవు చిన్నగా ఆరుపదుల్లో పడుతున్నావని నీ మనసులో అలజడులే సంకేతం. నీవు ఆలోచనలనుంచి రిటైరవు. నేను చూసుకుంటానని చాలా చక్కగా నాకు కంగారు లేకుండా

చేసేవారు. మళ్లీ మరో రోజు, మరో కొత్త విషయం పిల్లలు చెప్పేవాళ్లు. 'బాబోయ్.... ఎలాగా...!' అని నాకు మళ్లీ మనసులో అలజడి మొదలయ్యేది.

నా మనసు బాగుండలేదని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాని, పిల్లల ఆలోచనా విధానాలు మా కాలంలో లాగా లేవని, నేను బాధ పడుతున్నంతున్నంత మాత్రానా, నా పనులన్నీ చక్కదిద్దుకొని ముందుకుపోయేదాకా నా కోసం ఏమైనా కాలచక్రం తిరగటం మానేస్తుందా......! దాని ప్రకారం అది గబగబా తిరిగేసింది. మా ఆపసోపాలకు అన్నిటికీ కాలమే జవాబు చెపుతుందన్నట్లు ముందుకు పదమంటూ దానితో పాటు మమ్మల్ని తిప్పేసింది, అలా ఇలా కాదు గిర....గిరా...గిర...గిరా... తిప్పేసింది.

అలా సంవత్సరాలు దొర్లిపోయాయి.

పిల్లలు ఇంజనీరింగ్ అవగానే మొదట పెద్దవాడు, ఆ తర్వాత అమ్మాయిని పై చదువులకు విదేశాలకు పంపాం. అలా... చూస్తుండగానే వాళ్లు పై చదువులు అవగొట్టటం ఉద్యోగాలు సంపాదించుకోవటం జరిగింది. పిల్లవాడికి అమెరికాలో ఉద్యోగం వచ్చినప్పుడు ఈయన ఆఫీసు పని మీద వేరే ఊరిలో వుండటంతో నేను ఆ ఆనందాన్ని అంతంగా ఆస్వాదించలేదు. కానీ పిల్లకి వచ్చినప్పుడు మాత్రం నేను సాయంకాలం ఈయన ఆఫీసునుంచి వచ్చాక ,

ఇద్దరం హాయిగా 'టీ' తాగుతున్నప్పుడు ఆనందంగా పిల్ల ఉద్యోగం గురించి అనర్గళంగా మాట్లాడాను. నాకు ఉద్యోగం వచ్చినంతగా ఫీలయిపోయాను చిన్నపిల్లలాగా.

ఆయన 'నా చేతిని చిన్నగా తన చేతిలోకి తీసుకుంటూ చిన్నపిల్లలాగా అంత ఆనందపడుతున్నావు. పిల్లలిద్దరూ సెటిల్ అయ్యారనే సందర్భంలో బయట హోటల్లో డిన్నర్ చేద్దామా...! 'అడిగారు. ఆనందంగా 'అలాగే...'అనేసాను.

కొత్తగా కట్టిన హోటల్, ఇంటికి ఒక కిలోమీటర్ దూరంలో వుంది. చాలా బాగుంది. ఐదు అంతస్తుల బిల్డింగ్. నాకు వాళ్ల ఆఫీసు సదస్సులు ఆ హోటల్లో ఏ ఫ్లోర్లో జరుగుతాయో ఆయన చెప్పారు.

రాత్రి ఎనిమిదింటి వరకూ ఇంకా ఏదో కంపెనీ తాలుకా మీటింగ్ జరుగుతున్న బోర్డు వుంది. మరీనూ, ఈ రోజుల్లో పగలు, రాత్రి అనే తేడాలేకుండా మీటింగులు కదండి' అన్నాను.

'అదే మరి మార్పు అంటే. ప్రపంచీకరణ జరుగుతున్న సమయం. వ్యాపారస్థులు, అన్నీ దేశాలతో సత్సంబంధాలు పెట్టుకుంటే, 24 గంటలు పని చేస్తేనే ఫలితాలు కనబడుతాయిట. ఇప్పుడు అలాంటి మల్టీనేషనల్ సంస్థలున్నాయన్నారు'.

ఇంతలో లిఫ్ట్ వచ్చింది. లిఫ్ట్ ఎక్కి రెండో ఫ్లోర్లో వున్న హోటల్లో అడుగుపెట్టాం.

చక్కగా ఆ హోటల్ అమ్మాయి మమ్మల్ని ఆహ్వానిస్తూ ఒక టేబుల్ దగ్గర కూర్చోమని చెప్పి 'మా హోటల్ వాతావరణం, సంస్కృతి మిమ్మల్ని ఎంతో ఆనందపరుస్తుందని ఆశిస్తున్నాను' అని నవ్వుతూ చెప్పి ఒక పక్కగానిల్చుంది.

కొద్దిగ సేపు మేమిద్దరం, పిల్లలు చక్కగా ఉద్యోగాలు తెచ్చుకోవటం, దేశం కాని దేశంలో పైకి రావటం గురించి మాట్లాడుకున్నాం. మధ్యలో 'అన్నీ సవ్యంగా జరిగాయి. ఇంక ఆ బ్యాంకు అప్పులు వాళ్లు తీర్చుకుంటే మనం రిటైర్ అయ్యాక ఎటువంటి బాధ్యతలు లేకుండా హాయిగా వుండొచ్చు' అన్నాను.

'పిల్లలకు చక్కగా ఉద్యోగాలొచ్చాయని ఇక్కడకి వచ్చి , నీ కావలసినవి తింటూ ఎంజాయ్ చేసుకోక, అవన్నీ గుర్తుతెచ్చుకోవటం ఎందుకు? మన వ్యవస్థలో వస్తున్న మార్పులు గమనించుకుంటూ వాటి వల్ల ఎలాంటి పరిస్థితులు మనం ఎదుర్కోవాలో అని నీకు అర్ధమయ్యేట్లు చెప్పాలని ఎప్పటికప్పుడు ట్రై చేస్తున్నాను. పిల్లలే అప్పులు తీర్చాలి అని అప్పుడు నీవు మెదడులో ఎక్కించుకుంది అలాగే పట్టుకోకూడదు. వాళ్లకి చెప్పవలసినప్పుడు అర్ధం అయ్యేటట్లు వివరిద్దాం. అప్పటి కాలమాన పరిస్థితులకి తీసుకున్న నిర్ణయాలని, ఇప్పటికాలమాన పరిస్థితిలో కూడా అలాగే అమలు పరచటానికి వీలవుతుందా...? కొంచెం మార్పులు చేయాలా.? అని మనం కూడా పరిస్థితులు తెలుసుకుంటూ ముందుకు వెళ్లాలి, ఆర్థికంగా ఎలా నిలదొక్కుకోవాలని ఆలోచించాలి అంతే' అని నన్ను ఇంక మాట్లాడనీయకుండా మా టాపిక్ వేరే వాటి మీద మళ్లించారు.

ఆయన రిటైరవక మునుపే ఆడపిల్ల పెళ్లి చేద్దాం అనుకొన్నాం. అదే వార్త ఫోనులో 'నాన్న వచ్చే ఏడాది రిటైర్ అవుతారు. అందుకని మొదట చెల్లికి పెళ్లి చేస్తాం. నీవు మాకు తోడుగా వుంటే బాగుంటుందనుకున్నాం. ఆ తర్వాత, నీకు వెతుకుతాం' అన్నాను పిల్లాడితో.

'వెతుకుతాం' అన్నమాట మాత్రం చక్కగా వినబడినట్లుంది పిల్లాడికి.

అంతే వాడు 'భలేదానివమ్మా...! నీవు వెతకనక్కర్లేదు. నేనే మీకు ఎలా చెపుదామా..!అనుకున్నాను. లక్కీగా నీవే ఎత్తావు టాపిక'న్నాడు.

అంతే, ఆ తర్వాత, నేను వినటం తప్పా మరేమి చేయలేని స్థితికి తెచ్చాడు. చెల్లెలి పెళ్లి అనేమాట నేను వాడికి చెప్పానా..! లేదా..! అనే డౌట్ చివరికి నాకే వచ్చింది. అందుకే నేను మళ్లీ ' ముందర చెల్లి పెళ్లి, తర్వాత నీది చేద్దాం అనుకున్నాం' అన్నాను కొంచెం నీరసంగానే. వా

డు ఆ చివర ముక్కే మళ్లీ పట్టుకొని 'అనుకున్నాం ఏమిటమ్మా.... ! వెతికేపని తప్పిందని చెప్తుంటే, ఆ అమ్మాయి ఇండియాలో నా క్లాస్‌మీట్ కానీ ఇక్కడకు వచ్చాక స్నేహం బాగా కుదిరింది. నా 'సోల్‌మేట్' అనిపించింది. నాన్నకు నీవే చెప్పమ్మా. మిగతా డిటైల్స్ పంపుతాను. తప్పక వాళ్లతో మాట్లాడి నాన్న రిటైర్ అయ్యేలోపల పెళ్లి చెయ్యొచ్చొ మీరనకున్నట్లే' అని ఫోను పెట్టేసాడు.

ఫోను వాడు పెట్టేసాక తెలియకుండానే నాలో అలజడి మొదలయింది. ఈయనకి మరో ఏడాదిలో రిటైర్‌మెంటు.. పిల్లకి బంగారం, ఒక జత గాజులు, గొలుసు వున్నాయి అంతే. ఆఫీసులో వాళ్లు కట్‌చేసే సేవింగ్స్ ఎంతో నాకు తెలియదు.

మా మావగారు, మా పెళ్లైన కొత్తల్లో , మా చేత బలవంతాన కొనిపించిన స్థలం, ఇల్లు ఊర్లో వున్నవి మేం వుండటానికి. తెలియకుండానే టెన్షన్ మొదలయింది. పైగా పిల్లవాడు నాన్నతో మొదలు నీవు చెప్పామ్మా..! తర్వాత నేను చూసుకుంటానని నా మీద మరో బాధ్యత వేసాడు. నాకు తెలియకుండానే నాకు పట్టిన చెమటను తుడుచుకున్నాను. ఆ మాటలన్నీ ఈయనతో చెప్పాను. పిల్లాడితో ఈయన మాట్లాడాడు. ఆ తర్వాత నేనేమడిగినా 'నీవు టెన్షన్ పడకు. ఇద్దరి పెళ్లిళ్లు చేయవలసిన బాధ్యత మనది. నేను చూసుకుంటాను' అనేసి ఆ తర్వాత స్లోగా ఆయన నిర్ణయించినట్లు చేయమనేవారు. కానీ, అంతకు ముందులాగా నిర్ణయాలకు వివరణ ఇవ్వటం మానేసారు.

ఒకసారి ఈయనతో చెప్పకుండా ధైర్యంగా నేను పిల్లలితో బ్యాంకు అప్పులు గురించి అడిగాను. దానికి వాడు 'అదేముందిలేమ్మా..! మా పెళ్లిళ్లు అయ్యాక కూడా తీర్చవచ్చు. మరీనూ నాన్న, నీవు అతిగా మేమేదో పెళ్లిళ్లు అయిపోయ్యాక మిమ్మల్ని పట్టించుకోకుండా పారిపోతామేమో..!' అన్నట్లు మాట్లాడుతున్నావన్నాడు.

ఆ మాట విన్న నాకు మనసు కలుక్కుమంది. బయట ప్రపంచం తెలియని దాన్ని. ఆయన్ని, పిల్లల్ని చూసుకోవటం తప్పా మరో వ్యాపకం లేదాయే..! ఏమి చెయ్యాలో తెలియని పరిస్థితి. ఒకరోజు ఏడ్చేసాను. ఎందుకిలా జరుగుతున్నదని. ఇంక ఆపుకోలేక జరిగినదంతా ఈయనకు చెప్పాను. 'వాళ్లు పంపమని అనలేదు. నీవెందుకు బాధ పడతావు. అన్నీ నేను చూసుకుంటానని' సర్దిచెప్పారు.కొంచెం అలజడి తగ్గింది.

ఆ తర్వాత, పిల్లలకి పెళ్లి చేసి పంపాము. ఆ తర్వాతే అన్నీ తారుమారయ్యాయి అనిపించింది నాకు. నా ఆవేదన బ్యాంకు రుణం ఒకటే కాదు. పిల్లలు చిన్నగా మాతో మాట్లాడటం తగ్గించారు. ఏదైనా నేను వాళ్లని అడిగితే 'నాన్నే అన్నీ చూసుకుంటాన్నాడని' చెప్పాడుగా అనేయటం మొదలెట్టారు. కొత్తగా వచ్చిన కోడలు, అల్లుడు ముందు మాట్లాడలన్నా కొంచెం ఇబ్బందితో ఇంక ఆ విషయాలు మాట్లాడటం చిన్నగా నేనే మానేసాను. వాళ్లకే వాళ్లు ఎప్పుడైనా ఒకసారి డబ్బు పంపటం, తర్వాత 'కొంచెం నువ్వు సర్దు నాన్నా ..! నీ రిటైర్మెంట్ డబ్బుతో ఇన్‌స్టాల్‌మెంటు కట్టండి మళ్లీ మేం వేస్తాననటం' నేను చాలా సార్లు విన్నాను. మరి ఇన్ని సంగతులు ఆలోచిస్తే, చిన్నగా మొదలయిన అలజడి రోజు రోజుకీ ఎక్కువైపోయింది. ఒంటరిగా ఇలా ఎన్నేళ్లు మా వారు బాధ్యతలు మోయగలరానే భయం నాలో పెరిగింది.

నా ప్రశ్నలకి జవాబులు ఏమి చెప్పకుండానే, ఆయన 'పెద్ద నిర్ణయం తీసుకున్నారు. ఊరెళ్లాక చెప్తానన్న మనిషి ఊరుకి వచ్చి నెల అయినా ఇంకా చెప్పలేదు. అసహనం నాలో పెరిగియి, ఇహ లాభంలేదని, ఆయన్ని గట్టిగానే అడిగేద్దామని నిశ్చయించుకన్నాను.. అందుకే సమయం చూసుకొని ఆయనతో, 'మీరు తీసుకున్న నిర్ణయం నా దగ్గర దాయటం పెద్ద అన్యాయం. మీరు చెప్పాల్సిందే... మీరు చెప్పాల్సిందే...' అని గట్టిగా అడిగేసాక, హమ్మయ్య...!' అని ఊపిరి తీసుకొని ఆయన ఏమి జవాబు చెప్తారో అని ఎదురు చూస్తున్న సమయంలో నన్ను గట్టిగా తట్టిలేపినట్లనిపించింది. టక్కున మేలుకువచ్చి చూస్తే ' ఇలా కలలో నన్ను నిలదీయకుండా నిజంగానే 'మనం ఇలా చేద్దాం...అలా చేద్దాం అని

సలహాలు ఇవ్వచ్చుగా...! .' అని చక్కగా నవ్వుతూ లేవమని చేయ్యందించారు. ఆశ్చర్యంగా చూసాను ఆయన వంక.

'ఎందుకలా ఆశ్చర్యంగా చూస్తున్నావు? త్వరగా తెమిలొస్తే అన్నీ చెప్తాను. కొంచెం సర్‌ప్రైజ్ చేద్దామనుకుంటే ఆ ఛాన్స్ ఇవ్వకుండా పెద్దగా కలలో నన్ను నిలదీస్తున్నావు. టూమచ్ అనిపిస్తున్నది. అందుకే ఆరుపదుల్లో ఇంతింత అలజడులు పడకూడదు.' టిఫిన్ కూడా తెప్పించాను. చూడు ఎప్పుడూ త్వరగా లేచి చకచకా పనులు చేసేదానివి ఇవ్వాళ ఇలా వున్నావన్నారు మళ్లీ నవ్వుతూ.

నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ, 'ఈ రోజు నుంచి ముఖ్యంగా, మన ఆర్ధిక పరిస్థితులు గురించి, మనం ఎలా వుండాలో ఈ మారుతున్న ప్రపంచంలో అని భయపడటం, మనల్ని ఎవరు చూస్తారూ... ! పిల్లలు పెళ్లైయ్యాక సరిగ్గా మాట్లాడటం లేదు' అంటూ నన్ను లేపి ప్రశ్నలడగటాలు మానేసి, త్వరగా నీవు మారాలి' అన్నారు. నేను ఆయన వంకే చూస్తో శ్రద్ధగా వింటున్నాను.

ఇది వరకు ఒకసారి చెప్పాను మర్చిపోయావా...! 'ఆ నాడు తీసుకున్న నిర్ణయాలు, ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తీసుకున్నాం. దశాబ్ధాల తర్వాత మారిన పరిస్థితులకు అనుగుణంగా ఈరోజు ఆనాటి నిర్ణయాలను ఈ నాటికి తగ్గట్టుగా మార్పులు చేయాలి, వాటిని ఎలా అధిగమించి, మనమెవ్వరం ఇబ్బంది, బాధలు పడకుండా ఎలా బయటకి రావాలా అని ఆలోచించవలసిన సమయం. మన ఆలోచనా విధానంలో మార్పు తెచ్చుకోవాలి. పిల్లల ఆలోచనల్లోనూ మార్పు తేవటానికి ప్రయత్నించాలన్నారు'.

అందుకని మీరు తీసుకున్న నిర్ణయం నాకు చెప్పటం మానేస్తారా..? చిరాకుగా అడిగాను.

'చిరాకు ఎందుకు...! చిన్నగా చెపుదామనుకున్నాను నీ ఆందోళనలు నేను తట్టుకోలేక' అని నవ్వుతూ చెప్పారు.

ఆ మాట నిజం. అంతాయింతా సతాయింపు కాదునాది అని మనసులో అనుకొని, చిరాకు పోయి, ఒక చిరునవ్వు వచ్చింది నా పెదవి మీద.

'హమ్మయ్య' అంటూ 'కొత్త తరం వాళ్లు ప్రతి రంగంలోనూ ఆధునికంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో ముందడగు వేస్తున్నారు. దేశం కాని దేశంలో, చిన్న వయసులోనే, వాళ్ల భవిష్యత్తు కోసం ఎన్నో ఆశలతో వెళ్తున్నారు. ఇలా అన్ని రంగాల్లోనూ పెను మార్పుల వస్తున్న సమయంలో మన ఆలోచనల్లో కూడా మార్పు తెచ్చుకోవాలి. పాత పద్ధతులను, విలువలను అవలంబిస్తోనే, కొత్త మార్పులని ఆహ్వానించాలి. మన వంతు మనం ఈ వ్యవస్థలో మార్పులను అర్ధం చేసుకుంటూ ఎవరికైనా మన వంతు సాయం చేస్తూ మన జీవనశైలిలో మార్పు తెచ్చుకోవాల్సిందే అనేది నా వ్యక్తిగత అభిప్రాయం.'

ఇంకో విషయం, నా స్నేహితుడు కృష్ణ, నాకు వాళ్ల ఆఫీసులో ఉద్యోగం ఇచ్చాడు. ఈ రోజే నేను జేరుతున్నాను.

ఇకపోతే 'మన స్థలంలో సగభాగం మాత్రం బేరంకి పెట్టాను. కొత్తగా వచ్చిన కోడలు, అల్లుడు ముందర పిల్లల్ని తొందర పెట్టటం నాకు కష్టంగా వుంది. అది అమ్ముడు పోగానే బ్యాంకు లోను తీరుద్దాం. తర్వాత నిదానంగా వాళ్లు మనల్ని అర్థం చేసుకుంటారు.' అని చెప్పి నా వంక చూసి 'ఇప్పుడ్నించి ఆందోళనలు లేకుండా ఆనందంగా వుంటావా.. ఏవి నేను నీ దగ్గర దాచలేదు. ఈ భారమంత ఒంటరిగా మోయలేనని, నీవు మరో ఆందోళనలో నా గురించి చెందుతున్నావని గ్రహించి అన్నిటినీ సరిచేసుకొని చెప్పుదామని ఆగాన'న్నారు.

ఆయన చెప్పిన మాటులు విన్న నాకు అది మంచి నిర్ణయంగానే కనిపించింది. కొంచెం అలజడి తగ్గి 'హమ్మయ్య పోనీలేండి. ఎవ్వర్ని ఇబ్బంది పెట్టకుండా, మనం బాధపడకుండా బయటపడితే, మనందరికీ మంచిదే అన్నాను.

ఇంకపోతే, రేపట్నుంచి నీవు కూడా పొద్దున రెండు, మూడు గంటలు ఉద్యోగం చేయాలి. కాకపోతే నీకు డబ్బులు రావు. కానీ మనశ్శాంతి కావలసినంత వచ్చే ఉద్యోగం' అన్నారు.

'నా తెలివికి, ఈ వయసులో నాకేమి ఉద్యోగం వస్తుంది. నా ఆందోళనలకి అందరూ అక్కడ కంగారు పడి, జేరిన మొదటిరోజే నా ఉద్యోగానికి ఉద్వాసన పలికించరూ...!. . మీరు మరీనూ...! నా ముందర కాళ్లకి బంధం వేస్తున్నారేమో...! మీరు మళ్లీ ఆఫీసుకి వెళ్తే నాకు తోచదంటానని ఇలా చెప్తున్నారు, లేకపోతే నన్ను పిలిచి ఉద్యోగం ఇచ్చేదెవరన్నాను.'

కృష్ణ భార్య సైకాలజిస్టు. ఆవిడ వాళ్ల స్నేహితురాలు నడుపుతున్న 'ట్రస్టు' ద్వారా ఉచితంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఇలా ఆధునిక ప్రపంచంలో పెనుమార్పులు వస్తున్న ఈ సమయంలో, పిల్లలు మాకు సాయం చేయటంలేదనో, సరిగ్గా చూడటంలేదనో, వాళ్లతో హాయిగా గడపలేకపోతున్నాం, ఈ కాలం పిల్లలు, పెద్దవాళ్లని పట్టికోవటం లేదని బాధ పడుతూ మానసికంగా ఒత్తిడికి గురౌవుతున్న పెద్దవాళ్ల కోసమే ఈ సంస్థ పనిచేస్తున్నది. వారికి మానసిక ప్రశాంతత కోసం, పెద్ద మానసిక డాక్టర్లచేత వాళ్లకి సలహాలిపిస్తూ, ఒత్తిడ్లు లేకుండా ప్రశాంతంగా జీవితం ఎలా గడపాలో అవగాహన కార్యక్రమాలు పెడ్తారు. మనలాంటి మధ్య తరగతి వాళ్లకి చాలా ఉపయోగం. నీవు ముందర అలాంటి అవగాహన కార్యక్రమంలో జేరి తర్వాత వాళ్ల కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యి నీ వంతు సహాయం, నీలాగా అలజడులు పడే వాళ్లకి ధైర్యం ఇస్తూ మంచి సేవాకార్యక్రమాలు చేయాలి. ఇంక ఆనందంగా నీవు ఏమి చేయదల్చుకున్నావో చేస్తో జీవితం గడవాలి' అన్నారు.

ఎంత మంచి మాట చెప్పారో. నాకు చాలా నచ్చింది. నాలాంటి మధ్య తరగతిలోనే కొంతమంది ఇలా అలజడలకు గురై ఆరోగ్యాలు పాడుచేసుకుంటూ ఆనందం అనే మాట చిన్నగా మరచిపోతున్నాం. అవును దానికి నేనే ఓ పెద్ద ఉదాహరణనుకున్నాను.

'అయితే, ఇంకోసారి ఆలోచించవలసిన అవసరం లేకుండా మంచి నిర్ణయం కరెక్టుగా తీసుకున్నాను' అన్నారు నన్ను ఆటపట్టిస్తూ.. 'తీసుకున్నారనే అనుకుంటున్నాను. ఏమైనా ఒకసారి నేను నిదానంగా ఆలోచించి, మీరు తీసుకున్నది

కరెక్టుగా వున్నదో లేదో తర్వాత చెప్తానులేండి' అన్నాను అలజడులన్నీ మాయమైన ఆనందంలో నేనూ ఆయన్ని ఆటపట్టిస్తూ . చాలా...చాలా... ఏళ్ల తర్వాత ఇద్దరం హాయిగా నవ్వుకున్నాం.

# సమయం రవి కొప్పరపు

అన్ని సంఘటనలు ఒకేసారి జరగకుండా ఆపేదే...... 'సమయం'

–విశ్వం

★★★★★★★

సాయంత్రం దాటి చీకటి పడుతోంది. సూర్యుడు దాదాపు అస్తమించి, 'ఇంక సెలవు ఇవాల్టికి ' అనేలా మెల్లగా కనుమరుగౌతున్నాడు. నేను పొడుగు కుర్చీలో కాళ్ళు జాపి కూర్చొని కనుచూపు మేర వరకు నా చుట్టూ ఉన్న విశాలమైన భూమిని చూస్తున్నా. ఎక్కడా చెట్లుగాని, పొదలు గాని లేవు. అంతా పరుచుకుని ఉన్న గడ్డి మైదానం...మైళ్ళ కొద్దీ..అంతా శూన్యమే, నా మెదడులులో లాగ.

నా పదేళ్ళ కొడుకు, నా అశ్వని, చనిపోయి రెండు నెలలైంది. ఇంకా కళ్ళముందు ముందు ఉన్నట్టే అనిపిస్తోంది. అసలు ఇంత జరిగాక నేను తట్టుకొని ఇంకా ఎలా బ్రతికున్నానో, ఎందుకు బ్రతకాలో తెలియట్లేదు. ఎప్పుడూ అమాయకత్వమైన మొహంతో, నా చుట్టూ తిరిగే, నా చిన్న ప్రాణం...నా అజాగ్రత్త వల్ల, నా మూలంగా కళ్ళముందే నీటిలో మునిగిపోతున్నప్పుడు 'అమ్మా ' అని అరుస్తూ ...

"కల్పనా, ఇంకా ఇక్కడే కూర్చున్నావా? కిందకు వెళ్దామా, భోజనం చేసి అలా ఊళ్ళోకి వెళ్ళొద్దాం" అన్నారాయన. నేనేమీ సమాధానం చెప్పలేదు. చెప్పదలుచుకోలేదు, చెప్పడానికీ ఏమీ లేదు. నా దగ్గరకొచ్చి మెల్లగా నాభుజం మీద చెయ్యేసారు. అయినా నాలో చలనం లేదు. మోకాళ్ళ మీద కూర్చుని నా చెవి దగ్గరకొచ్చి "పద, బయటకెళ్తే కాస్తయిన ఆలోచనల నుండి మార్పుంటుంది" . తల తిప్పి చూసాను. కళ్ళ నుండి జల జలా నీళ్ళు. నన్ను దగ్గర తీసుకొని హత్తుకున్నారు. కొద్ది క్షణాలయిన తరువాత మళ్ళీ "పద, నాతో రా. మరీ ఇలా ఏడిపించను లే" కొంచెం పరిహాసం చేసారు. మెల్లగా లేచి ఆయనతో పాటు వెళ్ళాను.

★★★★★★★★

నేను జెనీవాలో లార్జ్ హ్యాడ్రాన్ కొల్లైడర్ లో సీనియర్ భౌతిక శాస్త్రవేత్తగా పని చేస్తుండగా, ఆ సంస్థ డైరెక్టరు, దాని బోర్డు మెంబర్లు నా పని నచ్చి నన్ను డిప్యుటీ డైరెక్టరు గా నియమించారు. చాలా పెద్ద ప్రమోషను. అ స్థానం కోసం ఎందరో ఉద్ధండులు పోటీ పడితే చివరకు అనూహ్యంగా నాకు దక్కింది. ఇక నుండి ఆ కొల్లైడర్ దినసరి వ్యవహారాలు, ఎలాంటి ప్రయోగాలు చెయ్యాలో, ఎప్పుడు చెయ్యాలో ఇవన్నీ నా కనుసన్నల్లోనే జరుగుతాయి. మీరు వినే ఉంటారు దీని గురుంచి. 2013 లో 'హిగ్గ్స్ ' బోసాన్ అనే సూక్ష్మమైన పధార్థాన్ని మా ప్రయోగం కనుక్కుందని నోబెల్ బహుమతి ఇచ్చారు. అప్పట్లో చాలా గొడవే జరిగింది ఈ ప్రయోగం గురుంచి. ఇది చేస్తే భూమి అంతమైపోతుందని, వినాశనం వస్తుందని, ఏదేదో అన్నారు. దురదృష్టవశాత్తు కొంతమంది ఈ భయంతో ఆత్మహత్య కూడా చేసుకున్నారు. ఇలాంటివి ఏవీ కాలేదు కాని, కొన్ని కొత్త విషయాలు తెలిసాయి. అందులో ముఖ్యమైన దేవిటంటే, మా ప్రయోగంలో కొన్ని అణువులు కాలం లో ప్రయాణించినట్టు మేము అనుకున్న దానికంటే ఒక సెకను ముందే జననించాయి. ఇంక దాని గురుంచి ఏళ్ళ తరబడి ప్రయోగాలు మొదలెట్టాం. కొత్త ప్రమోషను వచ్చిందని మా బాబు అశ్వని, మా వారు, నేను శలవలు మీద జెనీవా సరస్సు దగ్గరికి విహారయాత్ర కి వెళ్ళాం. అప్పుడే అనుకోకుండా.....

మా డైరెక్టరు నన్ను నా ఇష్టం వచ్చినప్పుడు, నా మనసు కుదురుగా ఉన్నప్పుడు నన్ను మళ్ళీ ఆఫీసుకు రమ్మన్నారు. రెండు నెలలైంది. ఇంకా తేరుకోలేదు. చివరకి మా వారు నన్ను ఎలాగోలాగ ఒప్పించి, ఇంట్లో అలానే కూర్చుని, వేరే వ్యాపకం లేకపోతే నేనిలానే కృంగిపోతానని, మా డైరెక్టరుతో మాట్లాడి ఆఫీసు పని ఇమ్మన్నారు. ఆయన కూడా నాకోసం ఎదురుచూస్తున్నారట. ఏళ్ళ తరబడి చేస్తున్న మా ప్రయోగలు ఒక కొలిక్కి వచ్చాయని, అది విశ్లేషించడానికి నా కోసం ఎదురు చూస్తున్నారని, ఎలా నన్నడగాలో తెలియక సతమతమవుతుంటే, అనుకోకుండా మా వారే ఆయన్ని కలిసారని, నేను మళ్ళీ జాయినయితే అందరికీ మంచిదని ఆయనన్నారు. నేను ముందు ఏమీ జవాబు

చెప్పలేదు. అలానే మౌనంగా కూర్చున్నా. దాదాపు రాను ఇంక అని చెప్పడానికే నిర్ణయించుకున్నా. వెళ్ళి ఏంలాభం? నేను మనసు పెట్టలేను, దానివల్ల వాళ్ళకి ఉపయోగం లేదు. అసలు ఏదైన ఇంక చేసి ఏం లాభం?

అదే చెప్పా మా డైరెక్టరుతో. ఆయన నాతో ముందు డేటా చూడమని, అప్పటికి ఆసక్తి లేకపోతే అర్థంచేసుకుంటామని చెప్పారు. అంత పెద్దాయన మరీ అడుగుతున్నారు. సరే చూద్దామనుకున్నా. కాని ఏమాత్రం నామీద నాకు నమ్మకం లేదు. అసలు ఆసక్తి ఉంటే కదా. నా ప్రాణం సగం పోయింది అశ్వనితో పాటు. మిగతావన్నీ అనవసరం. డైరెక్టరు గారి దగ్గర శెలవు తీసుకొని కింద రిసెప్షను దగ్గర నాకోసం కాచుకొని ఉన్న మావారి దగ్గరికెళ్ళా.

"సో, ఏవయ్యింది?"

నిట్టూర్చి అన్నా " నన్నేదో డేటా చూడమంటున్నారు. నాకస్సలు ఇంటరెస్టు లేదు.....నా వల్ల కాదు"

నన్ను దగ్గరగా తీసుకొని అన్నారు, " వెంటనే వద్దులే, నీ టైము నువ్వు తీసుకో".

ఇద్దరం ఇంటికి బయల్దేరాం. ఎందుకో ఆ చివరి మాటలు నా మెదడులో మళ్ళీ, మళ్ళీ వినిపిస్తున్నాయి.

★★★★★★★★★★★★ ★

మా డైరెక్టరు గారితో మాట్లాడిన వారమయ్యిన తరువాత ఇంట్లో సామాన్లు సర్దుతుంటే, డోరు బెల్లు మోగింది. వెళ్ళి చూస్తే నా టీములో పని చేసే జూనియర్ సైంటిస్టు ఫ్రాంక్. నేనంటే బాగా గౌరవం. మంచి తెలివైనవాడు. నాకున్న నమ్మకస్థుల్లో అతను ముందుంటాడు. కొంచెం సిగ్గు, మంచి మనిషి. పనిలో మాత్రం ఎలాంటి తేడాలు రానీడు. మిస్టర్ పర్ఫెక్ట్. లోపలికి రమ్మన్నాను. కూర్చున్న తరువాత పొడి, పొడి గా ఏదో మాట్లాడాడు. ఏం మాట్లాడితే ఏమనుకుంటాననేమో. రెండు నెలలుగా ఏ విధంగా నన్ను కలుసుకోవాలో తెలియక, సతమతమయ్యాడట.

"నటాషా బాగుందా?"

తలూపాడు. నిశ్శబ్దం మా ఇద్దరి మధ్య.

"మీతో ఒక విషయం చెప్పాలి"

ఏంటి అన్నట్టు చూసా.

"మీరు తొందరగా జాయిన్ అయ్యితే మంచిది. లేదంటే.....లేదంటే డైరెక్టరు గారు వేరెవర్నో మీ స్థానంలో తీసుకుంటారట, మిమ్మల్ని రిజైన్ చెయ్యమని అడగొచ్చు."

ఇదేమీ భూమి బద్దలయ్యే విషయం అనిపించలా నాకు. ఆయన పొజిషన్ నుండి చూస్తే కరక్టే కదా. ఎంతకాలం నా గురుంచి కాచుకు కూర్చుంటారు? నేనసలు ఏంచేస్తానో నాకే తెలియదు. అంతా అగమ్యగోచరంగా ఉంది. ఇంక ఆయనకేంచెప్తాను?

"మీరు ఆయనిచ్చిన డాటా చూసారా?" అడిగాడు ఫ్రాంక్.

ఒహో, అదొకటుంది కదా.. లేదని చెప్పాను.

"మీరు చూస్తానంటే మీకొక నమ్మకశ్యం కాని విషయమొకటి ఆ డాటా లో ఉంది.",

నేనర్థం కాకుండా చూసాను.

తటపటాయిస్తూ, చిన్నగా మాట్లాడుతూ అన్నాడు, "మీకు గుర్తునందే ఉంటుంది. ఇంతకుముందు మనం చేసిన ప్రయోగాల వల్ల కొన్ని అణువులు కాలం లో ప్రయాణించినట్టు కొన్ని ఆధారాలు కనిపించాయి, కదా?"

అవునన్నట్టు తలూపాను.

"ఇప్పుడు అవి కేవలం చిన్న, చిన్న సూక్ష్మ పథార్థాలకే కాదు, మనలాంటి వాళ్ళకి కూడా కాలంలో ప్రయాణించే వీలుండొచ్చని అనుకుంటున్నాము. మనమొక మషీను తయారు చేసి ఒక మనిషిని కూర్చోపెడితే అందులో, అతను లేదా ఆమె ఆ మెషీనులో కాలంలో ప్రయాణించొచ్చేమో. బయటవాళ్ళకు మామూలు సమయం గడుస్తూ ఉంటుంది కాని, అందులో కూర్చున్నవాళ్ళు ప్రయాణించి మళ్ళీ సరిగ్గా మన కాలంలోకి రావచ్చొని అనుకుంటున్నాము. "

ఇంటరెస్టింగ్. ఒకరకంగా టైం మెషీనన్నమాట.

అది సరే, ఇవన్నీ నాకెందుకు చెప్తున్నాడు ఫ్రాంక్? అదే అడిగా.

"మీరొస్తే, ఆ మెషీను తయారి ప్రారంభిస్తే మీకు పనిన్నట్టు ఉంటుంది, ప్రపంచానికీ కొత్త విషయం తెలిసినట్టు ఉంటుంది."

కొద్ది క్షణాలాగి అన్నాడు " మీరెంత బాధలో ఉన్నారో తెలుసు. మీకు ఇది చెప్పడంలో ఇంకో ఆలోచనుంది నాకు."

ఏమిటన్నట్టు చూసా.

తటపటాయిస్తూ మెల్లగా అన్నాడు, "మీ...మీ బాబు ని రక్షించుకునే అవకాశం ఉండొచ్చు"

ఒక్కసారిగా కరెంటుషాకు కొడితే ఎలా ఉంటుంది? ఆగిపోయిన గుండె ఒక్క సారిగా కొట్టుకోవడం మొదలయ్యితే?

"సాధ్యం అవుతుందో లేదో తెలియదు, కాని మన డాటా మీరు చూస్తే అందరికీ మంచిదని అనుకుంటున్నా" నా వంక చూస్తూ అన్నాడు ఫ్రాంక్.

నేను స్థాణువులాగ కూర్చుని చెప్పడానికి మాటలు రాక అతని వంకే చూస్తున్నా. అతను చెప్పింది ఏంటో వెంటనే అర్ధమయ్యింది. కాలంలో ప్రయాణించి నా బాబు ని రక్షించికునే అవకాశం. అందుకు కాదు నేను షాకయ్యింది. ఈ ఆలోచన తల్లినయిన నాకెందుకు తట్టలేదని...

"నేను నా కంప్యూటర్ లో డేటా తెచ్చాను. మీకు ఓపిక, ఆసక్తి ఉంటే ఒక సారి చూద్దాం. మరీ మీ టైము ఎక్కువ తీసుకోను" అనాడు ఫ్రాంక్.

నేను తేరుకొని తలూపాను. ఒక రకమైన ఉద్వేగం, ఆశ, సంశయం అన్నీ కలిపితే ఎలాఉంటుంది?ల్యాప్ టాప్ తీసుకొచ్చి డాటా బయటికి తీసి, ఇద్దరం చూస్తున్నాము.

చూసిన పావుగంటకే నాకర్ధమయ్యింది. ప్రాణం లేచొచ్చినట్టయింది. నేను పట్టరాని ఆనందం తో ఒక్కసారిగా లేచి నుంచుని ఎగరబోయి, ఫ్రాంక్ ని చూసి, తమాయించుకొని "చెయ్యొచ్చు" అని మెరిసే, నీళ్ళు నిండిన కళ్ళతో చూసా. ఫ్రాంక్ కి కూడా నోట మాట రావడం లేదు. కంప్యూటర్ స్క్రీన్ వంక చూస్తూ అన్నాడు.

"ఎలా ? ఆ అణువులు ఒక్క సెకను ముందరే వచ్చాయి. మనలాంటి పెద్ద 'పథార్ధాలు ' వెళ్ళాలంటే ఎంతో శక్తి ఖర్చవుతుంది. అంత శక్తి మనం తయారుచెయ్యలేము"

నేను వెంటనే అందుకున్నా " మనం తయారుచెయ్యక్కర్లేదు, హిగ్గ్స్ బోసాన్ శక్తి పరిధిలోనే పని కానియచ్చు. అసలు ముందు చిన్న, చిన్న జంతువుల్ని ఆ మషీనులో పంపి ఎంత శక్తి కావాలో అంచనా వెయ్యాలి. దానికి తగట్టు పరికరాలు తయారు చెయ్యాలి, ..." చెప్పుకుంటూ పోతున్నా.

ఎంతసేపు గడిచిందో తెలియదు కాని, తలుపు తాళం తీస్తున్న చప్పుడైతే ఎవరని చూస్తే మా వారు. టైము చూస్తే సాయంత్రమయ్యింది. అంటే కనీసం నాలుగైదు గంటలు ఈ డాటా గొడవలో పడి మేమిద్దరం టైము చూసుకోలేదు. మా వారు ఫ్రాంక్ ని పలకరించి, ఒక్క క్షణం అక్కడే నిలబడి నా వంక చూసారు. ఆయన మొఖంలో ఆశ్చర్యం. ఏదొ అనబోతుంటే, "తరువాత చెప్తా" అన్నాను. నా దగ్గర కొచ్చి నన్ను గట్టిగా కౌగిలించుకున్నారు.

ఫ్రాంక్ కూడా నటాషా ఎదురు చూస్తుందని చెప్పి శెలవు తీసుకున్నాడు. నాకెందుకో ఫ్రెష్ గా అనిపించింది. చాలా కాలం తరువాత పెద్ద బరువు దిగినట్టు భావన. లేచి డిన్నరు రెడీ చేసి ఇద్దరం తిన్నాము. ఆయనతో ఈ రోజు జరిగిన దాని గురుంచి మాట్లాడుతూనే ఉన్నా. రాత్రి పడుకోబోయేముందు అన్నారాయన.

"ఈ రోజు కొంచెం మామూలయ్యినట్టున్నావు"

నేను వెంటనే ఏమీ అనలేదు, కొద్ది సేపైన తరువాత

"నేను అశ్విని ని మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నానా?" అనడిగా.

ఆయన నా పక్కకి తిరిగి "ఛా, ఛా,...అలా అని ఎందుకనుకుంటున్నావు? "

"మరీ విషయం నాకెందు తట్టలేదు?"

"కొన్ని సార్లు మనం తీరని బాధలో ఉంటే సమస్యలకి పరిష్కారాలు దొరకవు. అసలు మనకు ఏదీ పట్టదు. అందుకే మనకు ఆసక్తి లేకపోయినా కొంచెం అందరితో కలుస్తూ ఉంటే ఏదో ఒక విషయం తోస్తుంది".

ఆలోచిస్తూ అనుకున్నా...కదిలే కాలం అన్ని గాయాల్ని నయంచేస్తుందేమో.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

తరువాత రోజు ఉదయం వెంఠనే డైరెక్టరు గారి ఆఫీసుకెళ్ళి ఈ రోజే జాయినవుతున్నానని చెప్పి, ప్రాజెక్టు వివరాలు కనుక్కోవడానికి ఫ్రాంక్ తో పాటు నా టీముని కలవాలని చెప్పాను. నేను ఫ్రాంక్ ని కలిసానని చెప్పలేదు. ఎందుకంటే ఫ్రాంక్ ఆ డేటా ని ల్యాబ్ నుండి బయటకి తీసుకురాకూడదు. తన ఉద్యోగం ఊడుతుంది. తన ఉద్యోగాన్ని పణంగా పెట్టి నా కోసం ఆ డేటా తీసుకొచ్చాడు. పైగా అతను తెచ్చింది మొత్తం కాదు, కొన్ని కీలకమైన డేటా మాత్రమే. ఇప్పుడు ల్యాబుకొచ్చాను కాబట్టి మొత్తం చూడచ్చు.

ఆ రోజు నుండి కొన్ని నెలల వరకు కాలం లో ప్రయాణించే మెషీను డిజైను వేసి, దానికి తగ్గ పరికరాలు తీసుకొచ్చి, అవన్నీ జోడించి ఒక నమూనాన్ని తయారు చేసాము. ముందర అనుకున్నట్టు ఒక చిన్న జీవిని (ఒక ఎలుకని) పంపాలని నిర్ణయించుకున్నాము. అన్ని టెస్టులు చెయ్యడానికి ఇంకో నెల పట్టింది.

ఇంక మెషీనులో ఎలుకను పెట్టే సమయమొచ్చింది, అన్ని పరీక్షలు అనుకున్నట్టే జరిగాయి. ఇంక ఆ ఎలుకని పంపడమే తరువాయి. ఇది నాకు చాలా పెద్ద విషయం. ఇది కాని సరిగ్గా జరిగితే, మనుషుల్ని పంపడం ఎంతో కాలం పట్టదు. అంటే కాలంలో ప్రయాణం చెయ్యడం చాలా వరకు సాధ్యమవ్వచ్చు. నా మటుకు నాకు ఎంత త్వరగా ఆ మనుషుల్ని పంపే మషీను తయారు చేసి, అందులో వెళ్ళి నా బాబు ని....

"కల్పనా, రెడీయేనా?" డైరక్టరుగారి మాటలకి ఈ లోకంలో పడ్డా.

"యస్, రెడీ.." అని ఫ్రాంక్ వంక చూసి తలూపాను.

ఫ్రాంక్ మీట నొక్కాడు. ఆ మషీను చిన్నగా రొదలాంటి శబ్దం చేస్తూ మొదలయ్యింది. కొంచెం సేపటికి దాని చుట్టూ తెల్లని, అత్యంత కాంతివంతమైన వెలుతురు తయారవ్వడం కనపడింది. ఆ కాంతి ఆ మషీను చుట్టూ

తిరగడం మొదలెట్టి, వేగమందుకుంది. అందులో ఉన్న ఎలుక మాత్రం ఇవేమీ పట్టనట్టు అలా కూర్చుని అటూ ఇటూ చూస్తోంది. ఎలుకతో పాటు ఒక చిన్న డిజిటల్ గడియారం కూడా పెట్టాము. ఈ ఎక్స్పెరిమెంటు అయ్యిన తరువాత ఆ గడియారాన్ని, మా ల్యాబులో ఉన్న గడియారాన్ని పోల్చి ఎంత టైము తేడా ఉందో చూసి, ఎంతకాలం ఆ ఎలుక కాలంలో (భూత కాలంలో) ప్రయాణించిందో తెలుసుకుంటాము. అదీ ఈ ప్రయోగ లక్ష్యం.

కొద్ది క్షణాలయ్యిన తరువాత, ఆ మషీను మొత్తం కాంతితో నిండిపోయింది. అలా నిండిపోయిన ఒక్క సెకను తరువాత మొత్తం కాంతి అంతా మాయమయ్యిపోయింది ఒక్కసారిగ. అంతా నిశ్శబ్దం. మషీను రొద మెల్లగా మోగుతూ తగ్గుతూ ఆగిపోయింది. మా అందరి దృష్టి ఆ ఎలుక మీదే. బ్రతికుందో లేదో నని.

అది నింపాదిగా అటూ, ఇటూ చూస్తోంది. అసలేమీ జరగనట్టు. మాకు సందేహం కలిగింది. ప్రయోగం పనిచెయ్యలేదేమో. మషీను ఒక్క సెకను తరువాత ఎందుకు ఆగిపోయింది? మేమేమీ ఆపలేదు. నాకు గుండెల్లో గుబులు. ఇంక మనుషుల్ని పంపడం సాధ్యం కాదేమో?

అందులో ఉన్న గడియారం వైపు చూసాం. అది డిజిటల్ క్లాక్. టైము తో పాటు, రోజు, నెల, సంవత్సరం అంతా చూపిస్తుంది. అది చూసి మాకర్థం కాలేదు. అందరికీ అయోమయం. ఒక్క సెకను మాత్రమే ఆ ఎలుక కాలం లో ప్రయాణిస్తే మా ల్యాబులో ఉన్న టైము, ఆ ఎలుక టైము ఒక్క సెకను అటూ ఇటూ ఉండాలి. ఒక్క సెకను లేటయ్యితే అది భూత కాలంలోకి వెళ్ళి వచ్చిందన్నమాట. ఒక్క సెకను ముందరుంటే భవిష్యత్తు కాలంలోకి వెళ్ళి వచ్చిందన్నమాట.

దాని గడియారంలో ఒక్క సెకను లేటుగా చూపిస్తోంది. అంటే భూతకాలం లోకి వెళ్ళి వచ్చుంటుంది. అది కాదు సమస్య. దాని రోజు, నెల, సంవత్సరం అన్నీ సున్నాలు చూపిస్తున్నాయి.

డిజిటల్ క్లాకు లో సున్నా నుండి తొమ్మిది వరకు అంకెలుంటాయి. చూపిస్తే ఈరోజు తేదీ, నెల, సంవత్సరం చూపించాలి. వెళ్ళేటప్పుడు అదే పెట్టి పంపించాము. మరి ఇదేంటి సున్నాలు?

తర్జనభర్జనలయ్యిన తరువాత, మళ్ళీ ప్రయోగం చేసాము. ఈ సారి అదే తంతు. తేదీ, నెల, సంవత్సరాలన్నీ సున్నాలే, ఒక సెకను తేడాతో. ఆ ఎలుక మాత్రం భేషుగ్గా ఉంది.

కొన్ని నెలల పాటు ఎంత పరిశోధన చేసినా కారణం తెలియట్లే. ఏం జరుగుతోంది? ఎలుక బానే ఉంది, ఆ మషీనులో టైము కి ఏదో జరుగుతోంది. మనం ఎన్ని పరికరాలు పెట్టినా, ఏం జరుగుతోందో ఆ ఒక్క క్షణం లో తెలియట్లే. పోనీ ఒక వీడియో కెమెరా పెట్టాము, కనీసం రికార్డు చెయ్యొచ్చని. తీరా చూస్తే ఆ రికార్డింగు డిస్కు అంతా

నిండిపోయింది ఆ ఒక్క సెకనులో. అంతా ఏదో కటిక చీకటి రికార్డింగు. దాని బ్యాటరీ కూడా ఎంతో సేపు రికార్డింగు చేసినట్టు మొత్తం పోయింది.

ఒక రోజు ఫ్రాంక్ తో మాట్లాడుతూ నిట్టూరుస్తూ అన్నా, "లాభం లేదు. మనమే వెళ్ళాలి"

"మనమంటే?"

"అంటే మనుషులు. ఈ పరికారాలు, ఎలుకలు, పిల్లులు తో పనవ్వదు. ఏం జరుగుతుందో చూడాలి" అన్నానేను.

"ప్రమాదమేమో, ఏమవుతుందో తెలియదు కదా. ఇంకొన్ని టెస్టులు చేస్తే?" అన్నాడు ఫ్రాంక్.

నేను తల విదిల్చి అన్నా, " ఆ ఎలుక బానే ఉందిగా. ఇప్పటికే ఒక పదిసార్లు పంపాము దాన్ని. ఎలుక వేరు, నేను వేరు. "

దిగ్భ్రాంతి తో నా వైపు చూసాడు ఫ్రాంక్.

"అవును ఫ్రాంక్, నేనెళ్ళాలి అందులో" అన్నా.

"ఇప్పుడు కాదు, కొంచెం ఆగండి. ఇంకొన్ని టెస్టులు..." అని ఫ్రాంకంటుంటే నేనడ్డుకొని

"ఇంకే టెస్టులు చేస్తాం? ఇన్ని నెలలు చేసిందేంటి? ఈ ప్రాజెక్టు నేను మొదలుపెట్టి సంవత్సరన్నర అయ్యింది, ఇప్పటి వరకు చేసిందేంటంటే ఒక ఎలుకని పంపించాం. అంతే"

"డైరెక్టరు గారు ఒప్పుకోరు" ఫ్రాంక్ సందేహిస్తూ అన్నాడు.

"ఆయన ఒప్పుకోవచ్చు. మన పరిశోధన లో పురోగతి లేదు. ఒక మనిషిని పంపించడం అత్యవసరమని, అదీ కేవలం ఒక్క సెకనే అని , దాని మూలంగా ప్రపంచానికి, మానవాళికీ చాలా ఉపయోగమని చెప్తా. మొదట రోదసి లోకి పంపించినప్పుడు, కోతులు, కుక్కల్ని పంపించి, చివరికి మనుషుల్ని పంపించారు. కొంత మంది దురదృష్టవశాత్తు ఆ ప్రయత్నం లో పోయారు. కాని దాని మూలంగా ఆస్ట్రోనాట్ లని పంపడం ఆపలేదు కదా? చంద్రమండలం మీద మానవుడు దిగే దాక వెళ్ళాం. ఇంకొన్ని సంవత్సరాలల్లో అంగారక గ్రహానికి కూడా వెళ్తున్నాం. ఇవన్నీ జరగడానికి ముందు మొట్టమొదటిసారి ఒక మనిషిని ధైర్యం చేసి పంపాం కదా?"

అంతా విని ఫ్రాంక్ అన్నాడు, "మీరు మానవాళి కోసమే వెళ్తున్నారా?"

ఆ ప్రశ్న ఊహించనిది కాకపోయినా, ఫ్రాంక్ అడగడం ఆశ్చర్యమేసింది. అలోచించి మెల్లగా అన్నా,

"ఆ ఒక్క సెకనులో ఏం చెయ్యగలను? చాలా తక్కువ వ్యవధి. టైము లేదు"

★★★★★★

ఇంకో ఆర్నెల్లు పట్టింది డైరెక్టరుగారిని ఒప్పించడానికి, పర్మిషన్లు తీసుకోవడానికి, గవర్నమెంటు నుండి అనుమతి తీసుకోవడానికి. ఆ మెషీను ని మనుషలకి సరిపడే విధంగా తయారుచెయ్యడానికి ఇంకో ఏడాది పైనే పట్టింది. దాదాపు రెండేళ్ళ తరువాత నేను, ఆ మషీను సిద్ధమయ్యాము.

మెషీనులో ప్రయాణించే రోజువచ్చింది. మా వారు మెల్లగా నా దగ్గరకొచ్చి నా చేతులు పట్టుకున్నారు,

" జాగ్రత్తగా ఉంటావు కదా?"

నేను చిన్నగా నవ్వి "మీరు జాగ్రత్త" అనన్నాను.

ఇద్దరం ఏమీ మాట్లాడలేదు కొన్ని క్షణాలు.

దూరం నుండి ఫ్రాంక్ నా వైపు చూసి చెయ్యి ఊపాడు. నేనూ ఊపి, మావారిని కౌగిలించుకొని మెషీను లోకి వెళ్ళాను.

మెషీను తలుపు మూసుకుంది. కొన్ని నిముషాల పాటు అంతా చెక్ చేసి, బయట కంట్రోల్ రూముతో మాట్లాడి సిద్ధమయ్యా.

మెషీను ఆన్ చేసారేమో, మెల్లగా చిన్న రొద మొదలయ్యింది. బయట ఏమీ కనిపించట్లేదు నాకు, తలుపు వేసేసారు కాబట్టి. కొద్ది క్షణాలయ్యిన తరువాత ఆ మెషీను లోపలున్న గోడ మెల్ల, మెల్లగా పారదర్శకంగా మారుతోంది. అంటే మొత్తం ఒక గాజు తో చేసిన గోడలో నుండి బయటకు చూస్తున్నట్టు ఉంది.

కొద్ది సేపటికి చుట్టూతా అంతా పారదర్శకంగా మారింది. నేను మషీను లోపల గాలిలో తేలుతున్నట్టు ఉంది. కాని చుట్టు పక్కల చూస్తున్నవి అర్థం చేసుకోవడానికి నాకు కొన్ని క్షణాలు పట్టింది.

నేనున్న మెషీను బయట కాలం చాలా వేగంగా ముందుకు నడుస్తోంది. మా ల్యాబు లో మనుషులు ఒక వీడియో రికార్డుంగు ని ఫాస్టు ఫార్వార్డు చేస్తే ఎలా నడుస్తారో అలా కదులుతున్నారు. కొంతసేపటికి ల్యాబు మాయమయ్యి, దాని ప్రదేశంలో ఏదో బిల్డింగు కనపడింది. కార్లు, వాహనాలు లాంటివి చక చకా పరిగెడుతున్నాయి. ఇంకొద్ది సేపటికీ అవి కూడా పోయి, విశాలమయిన భూమి, భూకంపాలు, నదుల ప్రవాహన కనిపిస్తున్నాయి. అవి కూడా ఏదో అర్జెంటు పని ఉన్నట్టు బరబరా కదులుతున్నాయి, మారుతున్నాయి.

నాకు అర్థం అయ్యింది, నేను ఈ మషీనులో పాత కాలంలోకి వెళ్ళడం లేదు. భవిష్యత్తు లోకి వెళ్తున్నా!! మేమింతవరకు ఈ మషీను కాలం లో వెనక్కి తీసుకెళ్తుందని అనుకున్నాము. కాని ఇది ముందుకు తీసుకెళ్తోందేంటి?? ఏదైనా తప్పు జరిగిందా మా లెక్కల్లో? అసలు తప్పు జరిగితే ఈ మషీనే పని చెయ్యకూడదుగాని, ఇలా ఒకటనుకుంటే ఇంకోటి జరగదు.

మరి ఆ ఎలుక సంగతేంటి? అది కూడా భవిష్యత్తు లోకి ప్రయాణించిందా? మరి ఒక్క సెకను మాత్రమే ఎలా పట్టింది? ఇక్కడ చూస్తేనేమో సంవత్సరాలు, యుగాలు గడిచి, చుట్టూ ఉన్న భూమి రూపు రేఖలే మారిపోతున్నాయి. అసలు నేను మళ్ళీ వెనక్కు వెళ్ళగలనా?

ఇంతలో చుట్టూ ఉన్న భూమి దృశ్యాలు పోయి అంతా ఎండబారినట్టు అయ్యింది. మరి కొద్ది సేపటికి అసలు చుట్టూ ఉన్న నేల కూడా కనిపించలేదు. అంతరిక్షంలో ఉన్నట్టున్నా, దూరంగా సూర్యుడుని అంతరిక్షంలోనుండి చూస్తే ఎలా ఉంటాడొ అలా కనిపిస్తున్నాడు. అలా కొన్ని నిముషాల తరువాత, సూర్యుడు పెద్దగా, ఎర్రగా తయారయ్యి ఒక్క సారిగా కుచుంచుకుపోయి, మిణుకు, మిణుకు మంటూ అతి చిన్న నక్షత్రం లాగా తయారయ్యాడు...ఓహో అంటే దాదాపు నాలుగు వందల కోట్ల సంవత్సరాల కాలం ముందుకు వెళుతున్నానన్న మాట. సూర్యుడు కూడా అంతమయ్యాడు.

అసలు నేను చూట్టూ చూస్తున్నవి నమ్మదగినవేనా? అసలేం జరుగుతోంది? మషీను పనిచేస్తోందో లేదో? బయట ఫ్రాంకు, మా డైరెక్టరు గారు నన్ను బయటికి లాగడానికి ప్రయత్నిస్తున్నారేమో? ఇదంతా ఏమైనా రేడియేషన్ మూలంగా వచ్చే భ్రమ అయ్యుండొచ్చు. దిగ్భ్రాంతికరంగా ఉంది. 400 కోట్ల సంవత్సరాల ముందుకు వెళ్ళడమే? నోట మాట రావడం లేదు.

ఇంతలో ఎమయ్యిందో ఏమో, ఒక్క సారిగా అంతా చీకటయిపోయింది. అలా ఎంత సేపు చూకట్లో ఉన్నానో తెలీలేదు. ఫ్రాంక్ ని, మా డైరెక్టరుని, చివరికి మా ఆయన్నీ పిలిచా...ఎక్కడా జవాబు లేదు. నా ప్రయాణం అయిపోయిందా? నేను నిద్రపోయానా? లేదా ఈ మషీను వల్ల ఏదైనా ప్రమాదం జరిగి నేను ఆసుపత్రిలో ఉన్నానా?? పిచ్చెక్కుతోంది ఏం జరుగుతోందో తెలియక..

ఇంతలో ఒక బ్రహ్మాండమైన కాంతి ఒక్క సారిగా కనపడింది. వెంఠనే దాని నుండి ఏవేవో బయటకు వస్తున్నాయి. అవి మెల్లగా రూపాలి మారి, ఒకదానికొకటి కలిసి పెద్దవయ్యి మెరుస్తున్నాయి. జరిగింది ఒక్క క్షణంలో

అర్థమయ్యింది...అవి నక్షత్రాలు! ఒకొక్కటి తయారవుతున్నాయి. ఆ నక్షత్రాలు కలిసి గెలాక్సీలు అవుతున్నాయి. కొన్ని నక్షత్రాల చుట్టూ గ్రహాలు తయారయ్యాయి. ఇంతలో ఒక్కసారిగా ఏదో గ్రహం కనపడింది. అప్పుడే తయారయ్యిందేమో, ఉల్కా పాతాలు, అగ్ని పర్వతాలు అన్నీ కనపడుతున్నాయి. ఇప్పుడు అది కూడా పోయి, పర్వతాలు, చెట్లు, చిన్న చిన్న ప్రాణులు...

ఎక్కడో ఒక చిన్న అనుమానమొచ్చింది నాకు...ఆ అనుమానం ఇంకొద్ది క్షణాల్లోనే రుజువయ్యింది. మనుషులు కనపడ్డారు. ఆది మానవులు. తరువాత నాగరికత..యుద్ధాలు...ఇప్పుడర్థమయ్యింది...నేను కాలం లోకి భూమి, సూర్యుడు, విశ్వం అంతమయ్యేవరకు ముందుకు వెళ్ళాను. కాని విశ్వం మళ్ళీ మొదలయ్యింది. అదే రూపు రేఖలతో, అదే సంఘటనలతో, అదే పరిస్థితుల్లో......ఇది మళ్ళీ, మళ్ళీ జరిగే ప్రక్రియ... అందుకే అన్నారేమో విశ్వానికి అంతం, ఆరంభం లేదని. ఒక చక్రానికి ముందు వెనక లేనట్టుగానే, విశ్వానికి కూడా లేదు.

చప్పున ఒక ఆలోచన వచ్చింది..అంతా మళ్ళీ యధాతథంగా జరిగితే, నా అశ్విని సంఘటన కూడా జరుగుతుంది..అంటే, నేను నా బాబు ని రక్షించుకునే అవకాశముంది !

నా చుట్టూ ఉన్న సంఘటనలు జాగ్రత్తగా గమినిస్తున్నా, సరైన సమయం కోసం. అదుగో, మేమందరం జెనీవా సరస్సు దగ్గర... అశ్వని సరస్సు లోకి వెళుతున్నాడు.!! నేను ఒక్క సారిగా కుర్చీనుండి లేచి అశ్వని వైపు పరిగెత్తబోయా. నా మషీను గోడను తాకగానే ఒక్క ఉదుటున ఎగిరి ఎదురు గోడ మీద పడబోయి గాలిలో తేలుతున్నా. ఏదో అయ్యింది. మషీను ఒక్క కుదుపు మీద కదిలి కొంతసేపటికి చిన్న రొద చేస్తూ ఆగిపోయినట్టు ఉంది.

ఇంతలో నా కళ్ళెదుటే అశ్వని నీళ్ళలోకి వెళ్ళడం, మునిగిపోతూ అరవడం, నేను గుండెలవిసేలా ఏడవడం అన్నీ కనపడుతున్నాయి. నేను గట్టిగా అరిచి మాళ్ళీ వెళ్ళబోయాను కాని, మళ్ళీ ఒక్కసారిగా వెనక్కి ఎగిరిపడ్డాను. పిచ్చెక్కిన దానిలా ఆ మషీను గోడ మీద గీకబోయి మళ్ళీ పడ్డాను. ఇంతలో సంఘటనలు మారిపోయాయి. నేను ఇంట్లో ఉండడం, ఫ్రాంక్ రావడం, మాళ్ళీ జాయినవ్వడం, మషీనులోకి ఎక్కడం అన్నీ కనపడుతున్నాయి...

అంటే మళ్ళీ కాలం ముందుకు వెళ్ళి, విశ్వం అంతమయ్యి, మళ్ళీ మొదలయ్యి , మళ్ళీ నా బాబు ని రక్షించుకోవచ్చేమో...ఏడుస్తున్న నా మొహం తుడుచుకుంటూ నా కుర్చీలో కూర్చుని, మళ్ళీ అదే కాల చక్రానికి సన్నద్ధమయ్యా.

ముందర నుంచీ ఒక అనుమానం ఉండేది. అసలు కాలంలో ప్రయాణించి ఇంతకుమునుపు సంఘటనలు మార్చలేమోనని. అశ్వని బ్రతికి ఉంటే నేను ఇలా కాలంలో ప్రయాణించే అవసరమే ఉండేదికాదు. కాని అది ఎంత వరకు నిజమో ఎవరికీ తెలియదు. అసలింతవరకు ఎవరూ కాలంలో ప్రయాణించలేదు. అశ్వని నాతో లేదు. అంతే! అదే నాకు ముఖ్యం. అది సరి చెయ్యాలి. అవుతుందో లేదో తెలియకపోయినా, అయ్యే కొంచెమైనా అవకాశం నేను అస్సలు వదలను.

మళ్ళీ, మళ్ళీ నా అశ్విని నీళ్ళలో చూసి తట్టుకోలేనంతవరకు ప్రయత్నిస్తూనే ఉంటా, ఎన్ని కాల చక్రాలు ముగిసినా. ఎందుకంటే అనంతమైన సమయం నా దగ్గరుంది.

## నింబం

పల్లా నరేంద్ర

“బయట ఇంత గొడవ జరుగుతోంది, సదానందం బయటికి రాడేంటబ్బా? ఏమోయ్ సదానందం! వినబడటం లేదా? తొందరగా రావయ్యా! ఇక్కడొక డోక్లాం ఘట్టం జరుగుతుంటే, నువ్వేమో నింపాదిగా చక్లం ముక్లం వేసుకొని శుక్లాంబరధరం అని పూజ మొదలు పెడతున్నావా? ముందు ఈ విఘ్నం సంగతేంటో చూడవయ్యా బాబు”.

కట్టుకున్న ధావళిని సవరించుకుంటు సదానందం బయటికి వచ్చి, తన మొదటి అంతస్తు బాల్కనీనుండి బయటకి తొంగి చూసాడు. ‘నింబం’ కింద, పక్కింటి పనిమనిషి జయమ్మకు, వాళ్ళింటి పనిమనిషి సత్తెమ్మకు మధ్య గొడవ. యాభై యేళ్లక్రితం తను పుట్టిన ఉత్తరాభాద్రా నక్షత్రానికి ప్రతీకగా సదానందం అయిదేళ్ళ క్రితం నాటిన వేపచెట్టుకి ప్రేమగా పెట్టుకున్న పేరు ‘నింబం’. నిమ్మళంగా పెరిగి నింబం ఇప్పుడు మూడంతస్తుల ఎత్తు ఎదిగింది. అందుకే అందరి కళ్ళల్లో, నోళ్లల్లో ఆ వృక్షరాజమే!.

"దిక్కుమాలిన యాప చెట్టు, ఎంత ఊకినా చెత్త వొడుస్తనేలేదు. అశ్లేష ముసురులెక్క ఆకులు రాల్తనే ఉన్నయి. చెట్టు మీ ఇంట్ల ఉంటే సగం చెత్త ఈడుంటది, ఊడ్చే చాకిరేమో నా నెత్తికి సుట్టుకుంది. సత్తెమ్మా, ఇట్లయితే కష్టం సూడు, మా అమ్మోళ్లకి చెప్పి జీతమన్నా పెంచమని మీ అమ్మోళ్ళకి చెప్పు, లేకుంటే నువ్వన్నా వొచ్చి ఊడ్చిపో. నా తోని గాదింక" జయమ్మ ఆవేశం కట్టలు తెగుతోంది.

"ఆఁ..నేనేమన్న చెట్టుకి చెవుల చెప్పిన్నా యేంది, ఆకులన్నీ మీ ఇంట్ల రాల్చి నాకేమో కమ్మగ పండ్లని రాల్చమని, ఏరుకోని చప్పరించనీకె" సత్తెమ్మ సమాధానం కదనకుతూహలంలో ఖంగుమన్నది.

ఇరువురూ చేతుల్లో చీపుర్లను ఆడిస్తూ మాటల అస్త్రాలను సంధించుకున్నారు. ఒక పావుగంట సేపు రకరకాల హావభావ ప్రకటనలతో, మధ్య మధ్య కమర్షియల్ బ్రేకులతో అలా రియాలిటీ షో సాగిపోయింది. సదానందానికి ఏమీ పాలుపోవడం లేదు. బయటికి లోపలకి తచ్చాడుతున్నాడు, సిగ్నల్ దొరకని సెల్లుఫోనులా. మాటల్లో పాలుపంచుకోవడం దేవుడెరుగు, అక్కడ కనిపించడం కూడా అతనికి రిస్కులా అనిపిస్తోంది. ఇంతలో ఎదురుగా కొత్తగా కడుతున్న అపార్ట్మెంట్ వాచ్‌మెన్ రాములు ఒక సంచితో వచ్చి ఎండిపోయిన వేపాకులని ఏరుకోవడం కనిపించింది. సదానందానికి ప్రాణం లేచొచ్చింది.

"రాములూ! అంతా బాగేనా! రాత్రిపూట దోమలు కుట్టకుండ వేపాకు పొగ బాగా పనిచేస్తుందా?" సదానందం చిద్విలాసంగా వేసిన కుశల ప్రశ్న.

"అవును సారూ, కంటి మీద గంటనో రెండు గంటలో కునుకుంటదంటే గీ ఆకుల పొగతోనే".

"ఎంత కావలెనంటే అంత తీస్కపో తాత, గీ సెత్త ఆ మున్సిపాలిటోళ్ళకు బరువే, ఆ సెత్త బండోళ్ళకు కూడ బరువే" జయమ్మ, సత్తెమ్మలు ముక్తకంఠంగా సెలవిచ్చారు.

ఇంతలో యుద్ధ వాతావరణంలో ఎంతో మార్పు సంభవించింది. వడగాడ్పులు తగ్గి చిరుజల్లులు కురవడం మొదలయ్యాయి. జయమ్మ సత్తెమ్మలు ప్రహరీ గోడకు అటొకరు, ఇటొకరు నిలబడి, ఒకరేమో కోడలి గురించి మరొకరు అల్లుడి గురించి తము పడుతున్న పాట్లు చెప్పుకోని ఒకరినొకరు ఓదార్చుకుంటున్నారు. "నీకు తెల్వనిదేముంది సత్తెమ్మా చిన్న మనవరాలికి తట్టుపోసింది కదా, ఇయ్యాల్టికి తొమ్మిదోరోజు. వేపాకు పసుపు బెట్టాలె, నీ దగ్గర అడించిన పసుపుంటే జర ఇయ్యి". జయమ్మ కొత దిగులుతో అడిగింది. అప్రయత్నంగా ఇద్దరి చూపులు ముందు వేప కొమ్మలమీద పడ్డాయి. ఆ మరుక్షణంలోనే ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకొని సన్నగా నవ్వుకున్నారు.

"అట్లంటే ఎట్లక్కా ఆ చెట్టేం పాపం చేసింది గానీ, కలిసి ఎట్లనో అట్ల ఊడ్చుకుందాం తీ. కాలానికి తగ్గట్టు అది నడుచుకుంటది. రాల్చేటప్పుడు రాలుస్తది, పూసెటప్పుడు పూస్తది. ఓపిక పడదాం. నీ మనమడినయితే పంపియ్యి,

పసుపు ఇస్త" తెంపిన నాలుగు వేప కొమ్మలు జయమ్మ చేతికి అందిస్తూ కాంప్రమైజుకి, ట్రేడాపుకి మధ్యేమార్గంగా సత్తెమ్మ స్టేట్‌మెంటు. ఊపిరి పీల్చుకొని లోపలికి వచ్చాడు సదానందం.

"బయట ఆ అల్లరేంటి?" తులసి చెట్టుకి నీళ్ళు పోసుకోవడానికి బయటికి వస్తూ సతీమణి సంధ్య ఆరా.

"ఏమీ లేదు, జయమ్మ, సత్తెమ్మల మధ్య ఏదో చిన్న గొడవ, తీరిపోయిందిలే" సదానందం సంజాయిషీ లాంటి సమాధానం.

"ఆ వేపాకు చెత్త పైనేనా తగాదా?" కొంత విసుగ్గా సంధ్య మరో ప్రశ్న.

"అయిపోయిందిలే, ఇప్పుడు అంతా ఓకే" మ్యాటర్ని క్లోజ్ చేద్దామని సదానందం ఆరాటం.

"ఓహో మీరిప్పుడు ఆ పంచాయతీ సామరస్యంగా పరిష్కరించారన్న మాట. అంత సీను సితార మీ దగ్గర లేదు కానీ, అటువైపు ఉన్న కొమ్మలని తొందరగా ఎవరితోనన్నా కొట్టించేయండి" సంధ్య సన్నాయి నొక్కులు.

"అవునురా, అదే మేలు" కోడలి గారి అత్తగారు దానికి వాద్య సహకారం.

"సరే చూద్దాం గానీ, చెట్టు ఇప్పుడే ఎదుగుతోంది కదా, దెబ్బతింటుందేమో!" మీమాంసలో సదానందం అంతర్మథనం. నీళ్ళు నములుతూ అన్యమనస్కంగా సమాధానం చెప్పాడు.

'సదా నింబ వృక్షస్య మూలాదివాసా' అంటూ సాయిబాబా ఆరతి సన్నగా దగ్గరలోని దేవాలయం నుండి వినిపిస్తోంది. సదానందం ఎదురుగా గోడపైన ఉన్న సాయిబాబా పటం వైపు అమాయకంగా చూసాడు. బాబా ముఖంలో ఏదో నవ్వు. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు. అలా కొన్ని తనకు స్ఫురిస్తుంటే, 'అపవిత్ర పవిత్రోవా' అంటూ పూజ మొదలుపెట్టాడు.

పూజ పూర్తి చేసుకొని బ్రేక్ ఫాస్ట్‌కి రెడీ అయ్యాడు సదానందం. మిల్లెట్ దోసెలని ప్లేట్లో పెట్టి సంధ్య ఇవ్వగా వాళ్ళ అమ్మగారు కరివేపాకు పొడి వడ్డించారు. "అమ్మా! మనము ఉగాది తరువాత చేసిన వేపపూత పొడి చాలా బాగుండింది, కానీ కొంచెమే చేసుకున్నాం. ఈసారి మాత్రం ఎక్కువగా చేసుకోవాలి" సదానందం తన అసంతృప్తిని వెలిబుచ్చాడు.

"లక్షణంగా చేసుకుందాం, దానికేం భాగ్యం. కానీ మనిమిద్దరమే కదా తినేది. ఎంత కావాలి? ఉగాది పచ్చడిలో వేసిన నింబకుసుమ భక్షణమే ఇంట్లో వాళ్లకి గగనం" వాళ్ళమ్మ నిట్టూర్పు శ్రుతిలో కోడలిపై పరోక్షంగా చిన్న చెణుకు. మరో దోసె వేస్తూ సంధ్యమాత్రం సదానందం అల్పసంతోషానికి ఫక్కున నవ్వింది.

"ఏ ఎందుకా నవ్వు? వేప అరోగ్యానికి చాలా మంచిది. రోజూ ఆ మాత్రం చిన్ని వేపాకు ముద్దలు తిన్నా సరే, ఎలాంటి జబ్బులూ ఉండవు, తెలుసా? " సదానందం కొంత చిరాకుతో ఉపదేశానికి పూనుకున్నాడు.

"మాకూ తెలుసు మహానుభావా. మా తాత గారు ఊర్లో ఆయుర్వేద వైద్యం చేసేవారు. చిన్నప్పుడు మేమూ చూశాము, మీ వేప మహిమలు. మీకున్నన్నంత కాకపోయినా వేపకాయంత 'జ్ఞానం' మాకూ ఉంది" సదానందాన్ని ఉడికించాలని సంధ్య డిసైడ్ అయిపోయింది.

"ఇదిగో మీలాంటి వాళ్ళు ఇలా వేపపైన లెక్చర్లిస్తూ ఇంట్లో మడిగట్టుకోని కూర్చుంటే, అక్కడ అమెరికా వాళ్ళు, యురోప్ వాళ్ళు వేప ఉత్పత్తులపైన పేటెంట్లు తీసుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. కొన్ని రోజుల తరువాత ఇంటి ముందున్న చెట్టుకి కూడా ఎవడికో డబ్బులు కట్టాల్సి వస్తుందేమో. అది చూసుకోండి ముందు" తనకున్న ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అవగాహనను తెలియబరుస్తూనే సదానందాన్ని ఎక్కడో మెలిబెడుతోంది సంధ్య.

అవధానంలో అప్రస్తుత ప్రసంగంలా అనిపించినా వేప చెట్టునుండి కల్లు కూడా గీస్తారని అమ్మ చెప్పిన విషయం కొంత కొత్తగానే అనిపించింది సదానందానికి. సదానందం సంధ్యల వాదన ముదిరి పాకాన పడకముందే సదానందం అదృష్టం బాగుండి ఫోను మ్రోగింది. సేంద్రియ వ్యవసాయంలో నిపుణుడైన తన మిత్రుడు విజయ్ వేప కషాయాలపై, వేప పిండి ఎరువుపై, వేప నూనె మొదలగు పద్ధతులపై తరువాతి వారంలో జరిగే వర్క్‌షాప్‌కి ఆహ్వానం. "వేప గొప్పదనం మీద నువ్వొక కవితో, గేయమో రాసుకు రావోయ్, బాగుంటుంది" మిత్రుడి రిక్వెస్టు. తప్పకుండా కలుస్తానని చెప్పి ఫోన్ పెట్టేసి, నిన్ననే తెచ్చిన అలోవెరా నీమ్ హ్యాండ్‌వాష్‌తో చెయ్యి కడుకున్నాడు.

"నాన్నా నింబం అంటే మీనింగ్ ఏంటి?" సదానందం చిన్నమ్మాయి శివాంగి మొబైల్ ఫోను చూసుకుంటూ తల ఎత్తకుండానే ఒక ప్రశ్న సంధించింది. పదో తరగతి చదువుతున్న శివాంగికి స్పెల్‌బీ లో మొన్ననే ఒక ప్రైజు కూడా వచ్చింది. అల్లరిని తట్టుకోలేక అమెను శివాంగి అనడంకన్నా సివంగి అనే ఎక్కువగా పిలుస్తాడు వాళ్ళ నాన్న.

కళ్లజోడు తుడుచుకుంటూ "సంస్కృతంలో నింబం అంటే..", అంటూ చెప్పబోయిన సదానందానికి శివాంగి తల గిరుక్కున తిప్పి "సాంస్క్రిట్ కాదు ఇంగ్లీష్‌లో" అని ఒక టాంటు విసిరింది.

"ఇంగ్లీషు లోనా?" సదానందం నోరెళ్ళబెట్టాడు.

"ఏమో..ఎప్పుడూ వినలేదే" అలాంటిదొకటుందా అన్నట్టు అనుమానంగా మొహం పెట్టాడు.

"ఎన్, ఐ, ఎం, బి, ఎ, ఎం నింబం అంటే To define someone as mentally retarded in a less harmful way of saying it. The boy got the easiest question in the world wrong and the class called him a Nimbam. ఒక ఎక్జాంపిల్. సివంగి విడమర్చి చెప్పింది.

ఇది హాస్యమో వ్యంగ్యమో సదానందానికి అంతుబట్టడం లేదు. శివాంగి మరో ప్రశ్న "నాన్నా, డు యు లవ్ నింబం?"

"ఐ అడోర్ నింబం అండ్ లవ్ టు బి లైక్ నింబం..ఎయిదర్ ఇన్ సాంస్క్రిట్ ఆర్ ఇన్ ఇంగ్లిష్" సదానందం కంవిక్షన్‌తో కూడిన భావాన్ని నవ్వుతూనే కొంత సీరియస్‌గా చెప్పాడు. అలా ఆలోచిస్తూ ఆఫీసుకి బయలుదేరేందుకు మెట్లు దిగాడు.

"అయ్యో పాపం సదానందం. అతనికి మనశ్శాంతి ఎప్పుడూ ప్రియమే. అస్త్రశస్త్రాలతో కింద తయారుగా ఉన్నారు కరెంటు డిపార్ట్‌మెంట్‌వాళ్ళు, తీగలకు అడ్డొస్తున్నాయని కొమ్మల్ని నరికేందుకు. నింబానికి తప్పేట్టులేదు వేటు. సదానందం ఏమ్ చేస్తాడో"

"సార్ ఈ చెట్టు కొమ్మలు కొట్టేయాలె. వైర్లకు అడ్డమొస్తున్నయి" పర్మిషన్ కోసం కాదు, ఏదో చదువుకున్నోడివని ఇలా ఇంఫర్మేషన్ ఇస్తున్నాను అన్నట్లుగా కరెంట్ ఆఫీసు వ్యక్తి ముక్తసరి పలుకులు. ఒక చేతిలో గొడ్డలితో, మరో చేతిలో సిగరెట్టుతో, నింబాన్ని ఎగాదిగా చూస్తున్నాడు, ఎటు నుండి నరకడం మొదలుపెట్టాలా అని. సదానందానికి ఒక వైపు వళ్ళు మండిపోతోంది, మరో వైపు నోరెండిపోతోంది, అక్కడున్న దృశ్యం చూడగానే.

"ఎక్కడ అడ్డమొస్తున్నయి భయ్యా? అంతా బాగానే ఉంది కదా, ఎందుకు అనవసరంగా కొట్టడం" అని ఏదో చెప్పబోయాడు కొంత తమాయించుకొని.

"ఏం బాగుంది సార్. ఏమ్ ప్రాబ్లముందో మాకు తెలుసు కదా, మా అనుభవం మాకు ఉండదా? మా పని మమ్మల్ని చేసుకుపోనియ్యండి. గీ చెట్టేమైన చెప్పినట్టు మాటిని వైర్లను తాకకుండ పెరుగుతదా? ఇయ్యాల రేపు సదువుకున్న మనుషులే మాట యింటలేరు, ఇంక చెట్టేడా? తప్పదు సార్ కొట్టేయాలె. రేప్పొద్దున బాగ గాలులొస్తే వైర్లు తెగిపోతే మీరు, మీరు గాకపోతే మీ పక్కోళ్ళు మాకే కంప్లెయింట్ ఇస్తరు". 'ఎంతమందిని చూడలేదు మీలాంటోళ్ళని' అన్నట్టుగా నిక్కచ్చిగా సమాధానం చెప్పాడు కరెంటు మనిషి. అలా తన పనిలో నిమగ్నమయిపోయాడు.

"అదిగో అక్కడవసరం లేదు, ఇదిగో ఇక్కడ కొంచెం జాగ్రత్తగా కొట్టు" అంటూ సదానందం అటూ ఇటూ తిరుగుతూ తన స్పాండిలైటిస్ మెడ ఇబ్బంది పెట్టినా సాధ్యమైనంత తక్కువగా కొమ్మలు నరికేలా చూసేందుకు తన ప్రయత్నం తాను చేస్తున్నాడు.

"మీరేం టెంషన్ పడకండి సార్. నేను అంత కలియ జూసి ఎంత అవసరమో అంతనే కట్ జేస్త. వేప కొమ్మలు గట్టివి సార్. ఆ గుల్మొహర్ లెక్క, సుబాబుల్ లెక్క పెళుసు కాదు, చిన్న గాలికే ఇరగనీకె. చిన్నప్పుడంత ఈ వేప చెట్లకిందనే పెరిగినోణ్ణి. ఇది నాకు తోబుట్టువు లెక్క సార్. ఇప్పటికి పొద్దున లెవ్వంగనే వేపపుల్లతోనే పండ్లు తోముత. చిన్నప్పుడు మాయవ్వ బయిటికి కష్టమైనా గీ పొడి నూరి ఇచ్చేది. జుట్టు రాలుతున్నా, చర్మంకేమైన రోగమొచ్చినా, ఆడోళ్ల సమస్యలొచ్చినా, ఇట్ల ఎన్నో తీర్లుగ వేప చెట్టుతోనే మందులిచ్చేది. ఇప్పుడెవరు నమ్మరు సార్." తన అనుభవ సారాన్ని రెండు నిమిషాల్లో చెప్పేసాడు కరెంటు కరీము. సదానందం మనసుకి కొంత ఉపశమనం కలిగింది.

"అలస్యమైపోయిందని ఆఫీసుకు గబగబా బయలుదేరుతూ లంచ్ బాక్స్ కాంపౌండ్‌వాల్ పైనే మరచి వెళ్ళిపోయాడు సదానందం. ఇక సాయం'సంధ్యా' ప్రదోష పూజ తప్పదుగా!".

★★★

"ప్రతిరోజు పొద్దున్నే టీకప్పు చేతిలో పట్టుకొని, మిద్దెమీదికి వెళ్ళే మెట్లపైన కొర్చొని అలా వాలుతున్న వేపకొమ్మలని నిమురుతూ, పైన కూర్చున్న పక్షుల కేరింతలను, సందడిని గమనిస్తూ, అప్పుడప్పుడు ఏదో పుస్తకం చదువుతూనో, లేదా రాస్తూనో, లేదా అలా అలోచిస్తూనో ఓ గంటో, అరగంటో కాలం గడుపుతాడు సదానందం".

అలా మెట్లమీద కూర్చోని, నిన్న కోట్టేసిన కొమ్మల్ని చూస్తూ, నింబం కొంత బోసిగా ఉండడం గమనించిన సదానందం మనసులో నొచ్చుకున్నాడు. ఎందుకో ఏదో వెలితిగా అనిపించింది. 'ఏమ్ ఫరవాలేదులే, కొమ్మలు చకచకా పెరిగిపోతాయని' భరోసా ఇస్తున్నట్టుగా నింబం సన్నగా గాలిని సదానందం ముఖానికి తగిలేట్టుగా వీచింది. అలా అలోచనల్లోకి జారిపోయాడు సదానందం.

కాసేపు కూనికిపాట్లు పడ్డాక బయట ఏవో ఘంటల శబ్దానికి జాగృదావస్థలోకి వచ్చాడు. రేలింగ్ పైనుండి తలెత్తి చూస్తే వాకిట్లో నింబం కింద ఒక ఒంటె నిలబడి ఉంది. పిల్లల్ని స్వారీ చేయించడానికి ఆ కపీశ వాహనం వీధిలోకి వచ్చింది. అలా నిలబడ్డ ఒంటె తనకు అందినంత వరకు వేపాకుల్ని పరపరా తినేస్తుంటే సదానందానికి చాలా వింతగా అనిపించింది. సదానందం, కూడా వచ్చిన వాడిని ఇంటర్వ్యూ చెయ్యడం మొదలుపెట్టాడు. ఆ ఒంటెకి తాము ముద్దుగా పెట్టుకున్న పేరు రేష్మా అట, ఏదో హిందీ సినిమాలో కూడా కనిపించిదంట. వేపాకును చాలా ప్రియంగా తింటుందంట. ఒంటె వేపాకు తినడాన్ని సదానందం అబ్బురంగా చూస్తున్నాడు. అలా చుట్టూ తిరుగుతూ మొబైల్ ఫోనులో ఫోటోలు తీస్తూ పెద్దమ్మాయి ఆనందికి పదే పదే చెబుతున్నాడు 'వేపాకు ఎలా తింటుందో' చూడు అని.

"వేపాకు తింటుంది కాబట్టే అది అంత హెల్దీగా ఉందేమో నాన్నా" ఒంటెతో సెల్ఫీ తీసుకుంటూ పెద్దామ్మాయి ఆనంది రిటార్టు.

"అవును అందుకే అది లొట్టిపిట్ట, నువ్వేమో వసపిట్ట" సదానందం ఏదో అర్థం కాని భాషలో రియాక్షన్.

'ఆ ఒంటె దగ్గర ఎంత సేపు కాలక్షేపం? ఆ ప్రహసనం ఆపి ఆఫీసుకి రెడీ అవ్వండి" పై నుండి సంధ్య కేక లాంటి పిలుపు. ఒంటెను తోలేవాడిని చేసిన ఇంటర్వ్యూలో తాను తెలుసుకున్న కొత్త విషయాలను మననం చేసుకుంటూ మెట్లెక్కడం మొదలుపెట్టాడు సదానందం. మొదటి అంతస్తు గుమ్మం దాకా చేరాడో లేదో, "సార్" అన్న పిలుపుకి మళ్ళీ కిందకి చూసాడు.

గేటుకు ఆనుకోని ఒక నలభయ్యేళ్ళ మనిషి. నుదుట పెద్ద బొట్టు పెట్టుకొని, దానికింద కొంచెం సింధూరం అద్దుకొని, కాటను ప్యాంటుపై ఒక మీడియం క్వాలిటీ ఖాదీ షర్టు వేసుకొని, మణికట్టుకి నాలుగైదు రకాల కాశీ దారాలు

చుట్టుకొని నిలబడి ఉన్నాడు. ఏమిటన్నట్టుగా సదానందం చూడగా "నమస్తే సార్" అని తన కుడిచేతిని ఛాతీపై ఉంచి తల కొద్దిగా వంచి ఆ వ్యక్తి పలకరించాడు. తానూ నమస్కారం చేసి ఏమిటో చెప్పు అన్నట్టుగా సదానందం ఆ వ్యక్తి వైపు చూసాడు.

"మన గల్లీకి సీసీ రోడ్డు సాంక్షన్ అయ్యింది సార్. అద్దం లెక్క కాంక్రీటు రోడ్డయితది. మట్టి, దుమ్ము లేకుండ మంచిగ నీటుగ ఉంటది" ఆ వ్యక్తి చెబుతూ పోతున్నాడు.

"ఇప్పుడున్న రోడ్డు బాగనే ఉంది కదా, కొంతనన్నా మట్టి కనబడకపోతే నేలకర్థం ఏముంది" సదానందం తన ధోరణిలో ఏదో చెప్పబోయాడు.

"ఈ కాలంల అందరు సిమెంటే కావాలంటున్రు సార్. మట్టెవనికి కావాలె. ఇండ్లు, చెరువులు, గుళ్ళు, రోడ్లు అన్నీ సిమెంటు తోనే నిండె. సిమెంటు లేని వాకిళ్ళు ఊర్లల్ల కూడ కరువాయె. సిటీల బస్తీలన్ని కూడ సిమెంటు రోడ్లేనాయె. మాకంటె మాకు కావాల్నని కాలనీల అందరు అడుగుతున్నరు గానీ మన గల్లీల కార్పొరేటర్ వాళ్ల బావ ఉంటడు గదా, అందుకే ఇది ముందుగాల మనకు వచ్చింది". ఆ వ్యక్తి ఒక మార్కెటింగ్ ఎక్స్పర్ట్‌లా టకటకా చెప్పేసాడు.

"సరే మనమేం చేస్తం. అట్లనే గానిద్దాం. మా ఇంటి ముందయితే ఆ వేపచెట్టు చుట్టూ ఒక జానెడు జాగా వదిలేసి రోడ్డేసుకుంటె సరిపోతది" సదానందం కండీషనల్ కంసెంటు ఇస్తున్నట్టుగా చెప్పాడు.

"అదే సార్..అది చెబ్దామనే" అంటూ తల గోక్కున్నాడు ఎదుటి వ్యక్తి.

"రోడ్డెయ్యడానికి ఈ వేప చెట్టుని కొట్టేయాలె సార్" అని పిడుగు లాంటి విషయం చెప్పనే చెప్పాడు.

తన ఊహకు కూడా అందని ఆ విషయాన్ని విని సదానందం ఓ నిముషం స్థాణువైపోయాడు. రేలింగ్‌ని పట్టుకొని మెల్లిగా కిందికి వచ్చాడు.

"నీ పేరేమన్నవు..?" అంటూ ఆ వ్యక్తితో కొంత చనువు కోసం అడిగాడు.

"నా పేరు హనుమంతు సార్, కార్పొరేటర్ సార్ దగ్గర పనిజేస్తా. రోడ్డు కాంట్రాక్టు కూడ సార్ వాళ్ళ మేనల్లునిదే. అందుకే ఈ పనులన్ని నేనే చూసుకుంట" తన ఐడెంటిటీని ఇంకొంచెం బలంగా ప్రస్తావించాడు హనుమంతు.

"రోడ్డుకీ చెట్టుకీ ఏమన్నా సంబంధం ఉన్నదంటవా హనుమంతు. దాని తిప్పలు దానిది, దీని తిప్పలు దీనిదేగదా" చిన్న విషయమే, నచ్చచెబుదామన్నట్టుగా సదానందం కొంత మంద్రంగా పలికాడు. ఎంత దాచుదామనుకున్నా అతని స్వరంలో గాద్గదికత ధ్వనించింది. అది హనుమంతు కూడా పట్టేసాడు.

"అది గాద్సార్. చెట్టు ఇంట్ల లేదు కదా. ఇంటి బయట రోడ్డుమీద మీ కాంపౌండ్ వాల్‌కి మూడు, నాలుగు ఫీట్ల దూరం ఉంది కదా. ఇవేమో గ్రామపంచాయతీ లే అవుట్లు, రోడ్లు ఇరవై ఫీట్లే పెట్టిరాయె. చెట్టు అమాంతం రోడ్డు

మీద ఉన్నట్టే గద. మీరే అలోచించుండి. తియ్యక తప్పుతదా సార్?". హనుమంతు కొంత కన్విసింగ్‌గా చెప్పే ప్రయత్నం చేసాడు.

"తరువాత కట్టుకున్నోళ్లంత ఇండ్లు పైకి కట్టుకోని, ఇంట్లోకి బండ్లు పోవడానికి రాంపులు కట్టి సగం రోడ్డు ఆక్రమిస్తున్నరు గదా. అవన్నీ ఒదిలేసి ఈ నీడనిచ్చే చెట్టు జోలికి రావడం న్యాయమంటవా హనుమంతు. పూనా లాంటి చోట్లయితే ఒక చెట్టు కొట్టాలంటే ఎంత లొల్లయితదో తెలుసా?" కొంత లా పాయింటు పట్టినట్టుగా, కొంత వేడుకోలుగా మిశ్రమ స్వరంతో సదానందం తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

"అదేం లేదు సార్. అవన్నీ కూడ తీసేయడమే. అంతెందుకు అక్కడ నాలుగిండ్లవతల కనిపించే గన్నేరు చెట్లు, క్రోటన్లు, అన్నీ తీసేసేవే. పూనాలుండేది పూనాలుంటది, మనకాడుండేది మన కాడుంటది సార్. దానిదేముంది" అంతా సమన్యాయమే, సమయోచితమే అని భరోసా కలిపిస్తున్నట్టుగా హనుమంతు మరో అడుగు ముందుకేసాడు. సదానందం లోపల తన ఉద్రేకాన్ని అణచుకొని ఉన్నాడు. అలా అని బయటికి వెళ్ళగక్కే ధైర్యమూ అతనిలో లేదిప్పుడు.

"ఇంకా నాలుగైదు రోజులు టైముంది సార్, మళ్ళీ కలుస్తా. అవసరమైతే ఫోన్ చేస్తా. నమస్తే" అంటూ హనుమంతు సదానందం మొబైల్‌కి తన మొబైల్‌తో ఒక మిస్డ్ కాల్ ఇచ్చి, నంబర్ సేవ్ చేసుకొని బయలు దేరాడు.

దీనంగా నింబం వైపు తలెత్తి చూసాడు సదానందం. ఫిబొనాచీ సిరీస్‌లో అల్లుకున్న ఆకులు, కొమ్మల మధ్యనుండి సూర్య రశ్మి తళుక్కుమంటోంది. ప్రకృతిని మించిన దైవం ఉన్నదా అని స్వగతంలో అనుకుంటూ మెల్లిగా మొదటి అంతస్తు మెట్లను ఎక్కడం మొదలు పెట్టాడు. ఒక మూడు నాలుగు రోజులపాటు సదానందానికి మనసు మనసులో లేదు. నింబం అల్లుకున్న ప్రదేశంలో శూన్యాన్ని ఊహించుకోలేక పోతున్నాడు. అటువంటి ఊహ రావడమే జీర్ణించుకోలేకపోతున్నాడు. ఇంట్లో అందరూ "ఏదో ఒకటి చేద్దాం, చెట్టు కొట్టేయకుండా చూద్దాం" అని అంటూ ఉండడం సదానందానికి అంత వ్యధ లోనూ కొంత ఊరట కలిగిస్తూనే ఉంది. ఉండబట్టలేక హనుమంతుకి రెండు సార్లు ఫోన్ చేసి ఏదో రకంగా చెట్టుని కొట్టేయకుండా చూడమని కూడా విన్నవించాడు.

నాలుగు రోజుల తరువాత హనుమంతు రానేవచ్చాడు. అతన్ని పైకి పిలిచి ఇంట్లో కూర్చోబెట్టి ఒక అరగంట సేపు మాట్లాడి నింబాన్ని రక్షించమన్నాడు సదానందం. ఎందుకో హనుమంతుకి సదానందం మాటల్లో నిజాయితి కనిపించింది. అలోచనల్లో నిర్మలత్వం కనిపించింది. 'ఆ చెట్టు కొట్టేయడం కూడా కాంట్రాక్టులో భాగం కాబట్టి, సొంత మిషిన్‌తో కొట్టేస్తే అందులోనూ కొంత మిగుల్చుకోవచ్చు కాబట్టి, కాంట్రాక్టర్ తాపత్రయం అయి ఉండవచ్చు. చెట్టు ముట్టకుండా రోడ్డు వేయడం, కాని పని ఏం కాదుగదా' అని మనసులోనే అనుకున్నాడు హనుమంతు.

"మీరు టెంషన్ పడకండి సార్. చూద్దాం. మన ప్రయత్నం మనం చేద్దాం. ఇంకో వారం రోజులు వేరేచోట పని చేసి ఇక్కడికొస్తం. ఈలోపల ఏదో ఒక దారి దొరకదా, చూద్దాం" అని హనుమంతు బయలుదేరాడు. 'నమో

దూతాయచ ప్రహితాయచ' అని రుద్రం మంత్రం వెనకాల వినవస్తూంటె సదానందం శివుడికి మనసులోనే నమస్కరించుకున్నాడు, అహిర్బుధ్న్యుడు అతడే కదా అని. హనుమంతు వెళుతూ వెళుతూ నింబం మొదలు దగ్గర ఏదో పరిశీలనగా చూసి, అక్కడ కొంత మట్టి తీసి, శుభ్రం చేసి వెళ్ళడం సదానందం గమనించాడు. హనుమంతు కింద రోడ్డు మీద చెయ్యి ఊపుతూ చిరునవ్వుతో వెళ్ళిపోయాడు.

మూడు రోజుల తరువాత నింబం కింద కొంత సందడిగా కనిపించింది. సుమారు ముప్పయి సంవత్సరాలున్న ఒక మహిళ, ఆమెతో పాటు ఒక అరవై సంవత్సరాల ముసలమ్మ, ఇద్దరూ మొహాలలో పసుపు ఛాయతో పెద్ద కుంకుమ బొట్లతో నింబం మొదలులో ఉన్న చిన్న రావి మొక్కకీ వేపచెట్టుకీ కలిపి దారాలు కట్టి పసుపు కుంకుమలతో పూజ చేస్తున్నారు. సదానందం సంధ్యను పిలిచి ఏంటో చూడమని అడిగాడు. సంధ్య కిందికి వెళ్ళి ఆరా తీయగా ఆ ముసలమ్మ చెప్పడం మొదలు పెట్టింది.

"అమ్మా ఈమె నా కోడలు. పదేండ్లు ఎంత మంది దేవుండ్లకో మొక్కంగ మూణ్ణెల్ల కింద కొడుకు పుట్టిండు. వేప చెట్టు ఇష్ణుమూర్తి స్వరూపమయితే, రావి చెట్టు లచ్మీ దేవి అని అంటరు. మాకు చానా నమ్మకం. అవి కలిసున్న చోటు చానా పవిత్రం మాకు, మా కుటుంబానికి, మా ఇంటి దేవుని లెక్క. వాటంతకి అవి మొలుస్తే అది ఇంకా పవిత్రం. ఇక్కడ కనిపించింది. అందుకే పూజ చేస్తున్నం. ఏమనుకోకు బిడ్డా" ముసలమ్మ తన్మయత్వంతో చెబుతుంటే ఆమె కోడలు చిన్న బాబుని చెట్టు మొదలు దగ్గరగా ఉంచి దండం పెట్టిస్తోంది. ముసలమ్మ ఒక దారం తీసి మనవడి చేతికి రక్ష కట్టింది.

అలా రెండు మూడు రోజులలో ఒక ఇద్దరు ముగ్గురు అక్కడ ఏదో పూజ చేయడం జరిగింది. హనుమంతు మధ్య మధ్యలో అలా వచ్చి చూసి వెళుతున్నాడు. సదానందానికి కొంత అర్థమయ్యి కొంత అర్థం కానట్టుగా ఉంది పరిస్థితి. నాలుగు రోజుల తరువాత హనుమంతు వచ్చి సదానందానికి ఒక చల్లని వార్త చెప్పాడు.

"సార్ ఈ చెట్టుని చానా మంది పవిత్రంగా చూస్తున్నరు కాబట్టి కొట్టేయకుండ రోడ్డెయ్యడానికి మా సారు ఒప్పుకున్నడు. ఇంక మీకు దిగులొద్దు సార్".

సదానందం సంతోషానికి అవధుల్లేవు. ఆనంద భాష్పాలతో అప్రయత్నంగానే హనుమంతుకి రెండు చేతులెత్తి నమస్కరించాడు. ప్రతినమస్కారం చేసిన హనుమంతు కళ్ళు కూడా చెమర్చాయి.

కర్చీఫ్ తీసి కళ్ళు అద్దుకోని "సార్ మీరు నాకొక మాటియ్యాలె" అని అన్నాడు.

"పూజ వరకైతే సరేగానీ, గుడి కట్టుడు రోడ్డు ఆక్రమించుడు జరగకుండా చూసే బాధ్యత మీదే. లేక పోతె నా మాట పోతది" వినమ్రంగా చెప్పాడు హనుమంతు.

సదానందం హనుమంతు చేతుల్లో చేతులు పెట్టి 'నీ మాట నిలబెట్టే బాధ్యత నాది' అని మాటిచ్చాడు.

“సదానందం కిటికీలోనుంచి నా వైపు కొంత జాలిగానూ, కొంత విజయగర్వంతోనూ చూసాడు. నేనూ సదానందాన్ని అభినందించకుండా ఉండలేకపోయాను. నీ ధర్మం నిన్ను గెలిపించిందయ్యా సదానందం. నువ్వు నిలిచావు, నీ నింబం నిలిచింది, చెట్టుపైనున్న నా గూడూ నిలిచింది. శభాష్! అని అనుకున్నాను”

“నేను పిట్టనైనా ఈ కథ పిట్టకథ కాదేమో. సదానందం లాంటి ఎందరో వేపచెట్టులాంటి వాళ్ళు ఈ సమాజంలో ఉన్నారు. ఒకొక్కరికి, ఒకొక్కసారి, ఒకోవిధంగా ఉపయోగపడతారు. అలా అని అందరికీ అన్ని వేళలా ప్రయోజనం ఉండదని వేప చెట్టు పనికి రానిది కాదు కదా. అలాగే జయమ్మ, సత్తెమ్మ, కరీం, హనుమంతు, ముసలమ్మ, సదానందం కుటుంబ సభ్యుల్లాగా అందరికీ అన్ని విషయాలలో ఎంతో కొంత తెలుసు. అందరిలోనూ వైరుధ్యానికి బదులు వైవిధ్యం చూడగలిగితే ఎంతో మేలు. సమయానికి అనుగుణంగా మన అవసరాలతో పాటు, అవతలి వారి మనోభావాలకి, చుట్టూ ఉండే ఇతర జీవులకీ విలువిస్తే అంతా నింబసమూహమే. అంతా ఆనందమే. మరి అందరిదీ ఆనంద మార్గాన్వేషణే. స్వస్తి!”

# నీలికళ్ళు

సుమలత దేశ్ పాండే

"అమ్మా. ఈసారి సమ్మర్ హాలిడేస్లో ఎక్కడికి వెళ్దాం?" పిల్లలు అడుగుతున్నారు.

ఒక్కసారిగా నా మనసు వెనక్కి పరుగులు తీసింది.

***

నా చిన్నప్పుడు వేసవి సెలవుల్లో మా అమ్మమ్మ వాళ్ళ ఊరు, ప్రశాంతతకు, ప్రకృతి రామణీయతకు పెట్టిన పేరయిన గంగాపురం వెళ్ళాలంటే ఒక పండుగ వచ్చినట్టే. ఎటుచూసినా పచ్చని పంటపొలాలు. పాయలుపాయలుగా నీటి కాల్వలు. వరిపొలాలపై ఎక్కడినించో వచ్చివాలిన తెల్లని కొంగలు నీరెండకు మెరుస్తూ ఆకుపచ్చని తివాచీ పై తెల్లని వెండిజరీ పూలు అద్దినట్టు కనిపిస్తే కన్నుల పండుగగా ఉండేది. పక్కనే ఉన్న సరస్సులాంటి మోట బావి ఇంజిన్ పెడితే గొట్టంలోంచి ఒక జలపాతంలా నురగలు కక్కుతూ దుమికే నీళ్ళల్లో కేరింతలు కొడుతూ ఆడుకుంటుంటె ఆ సంబరం అంతాఇంతా కాదు. ఇక సాయంత్రాలు డాబా మీద చల్లగాలికి కూర్చుని అమ్మమ్మ మాకిష్టమని చేసిన రకరకాల

అమృతంలాంటి పిండివంటలు, ఆమె మాకు కథలు చెపుతూ కొసరికొసరి వడ్డిస్తూంటే, ఇంతకన్నా స్వర్గం మరెక్కడా లేదేమో అనిపించేది.

ఆరోజుల్లో ఆవూళ్ళో ఎలెక్ట్రిసిటీ లేదు. ఆ సంధ్య వెలుగులో డాబా పిట్టగోడకానుకుని చూస్తే దూరంగా కనిపించే వేములకొండ ఊరు, నరసిమ్హస్వామి గుట్ట, వాటి అంచుల్లోంచి ఆకాశానికి కుంకుమ పులుముతూ మెల్లిమెల్లిగా అస్తమించే సూర్యుణ్ణి చూస్తూ, ప్రకృతి చీకటి దుప్పటి కప్పుకునేవరకూ అలాగే ఒక తన్మయత్వంలో ఉండేవాళ్ళం.

గుట్టపైన నరసిమ్హస్వామి స్వయంభుగా ఒక సొరికలో వెలిసాడని ప్రతీతి. గంగాపురం వెళ్ళినప్పుడల్లా ఆ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా ఉండేది మాకు. చిన్న గుడి దానిపక్కనే ఓ అయిదారు నీటి గుండాలు. వాటిల్లో పెద్దపెద్ద మీసాలతో, నామాలతో అన్ని రకాల రంగుల్లో పెద్దపెద్ద చేపలు ఈదుతూ ఉండేవి.

మేము బియ్యం వేస్తే అవి పైకొచ్చేవి. మా మామయ్య మమ్మల్ని జాగ్రత్తగా ఎత్తుకుని తీసుకెళ్ళి చూపించేవాడు. ఆతర్వాత అందరం స్వామి దర్శనం చేసుకుని ఆ గుట్టమీది రాళ్ళపై కూర్చుని మామయ్య మాకోసం తెచ్చిన చాక్లెట్లు తినేవాళ్ళం.

★★★

"అమ్మా మా ఫ్రెండ్స్ అందరూ ఇదివరకే ప్లాన్ చేసుకున్నారట మనమెప్పుడూ ఇంతే. లాస్ట్ మినిట్ వరకూ ఏ ప్లాన్ చెయ్యం. పిల్లలు చెరో చెయ్యి పట్టి లాగుతూ అల్లరి చేయడంతో బలవంతంగా గతాన్ని తెంపుకుని మనసు వర్తమానంలోకొచ్చి పడింది. ఆకాశం కనిపించని ఈ కాంక్రీట్ జంగిల్ లోని కృత్రిమ వాతావరణం, తలుపు మూసివున్నా చెవులు బ్రద్దలయ్యే ట్రాఫిక్ రణగొణ ధ్వని. టీవిలు, స్మార్ట్ ఫోన్ల ప్రపంచం. క్షణం తీరికలేని ఉరుకులపరుగుల జీవన స్రవంతి...ఈవాతావరణంలో పెరుగుతున్న పిల్లలు. ఒక్కసారిగా ఈ పిల్లలను అమాంతం ఇక్కడినుంచి తీసుకెళ్ళి ఆ ప్రశాంతమైన ప్రకృతితో, స్వచ్ఛమైన గాలితో, స్వేచ్ఛా విహంగాలతో నిండిన పల్లెవాతావరణం చూపించాలని అనిపించింది. ఏది ఏమైనా సరే ఈసారి గంగాపురం వెళ్ళాల్సిందే.

"గంగాపురం వెళ్తున్నాం." చిరునవ్వుతో చెప్పాను.

★★★

కొత్తగా సున్నం బదులు రంగులు వేసారు తప్పితే అమ్మమ్మ ఇల్లు మాత్రం ఏం మారలేదు.

ఆ డాబా ఇంటి ముందు ఇరువేపులా ఉండే గుల్మొహర్ చెట్లు ఇప్పటికీ అప్పటిలాగే ఎరుపు, గులాబీ రంగులతో విరగబూసి ఉన్నాయి.

మెట్లెక్కగానే దర్శనమిచ్చిన అమ్మమ్మా, తాతగార్ల నిలువెత్తు చిత్రపటానికి నమస్కరించాను. దర్జాగా ఇంగ్లీష్ ఫాషన్లో కుట్టించుకున్న సూట్ లో పొన్నుకర్ర ఠీవిగా పట్టుకుని, గంభీరంగా రాజసం ఉట్టిపడుతూ ఉన్న తాతయ్య పక్కన అమాయకంగా , పద్మపత్ర విశాలాక్షి అన్నట్టు పెద్ద కళ్ళు, గుండ్రని కుంకుమబొట్టు, పట్టుచీరలో అందంగా అమ్మమ్మ. ఒకపక్క వాళ్ళను తలుచుకొని ఆనందం, మరో పక్క వాళ్ళు లేని విషాదం. కళ్ళు చెమ్మగిల్లాయి.

"రండి రండి ఎన్నాళ్ళకు...ప్రయాణం కులాసాగా జరిగిందా?" ఆప్యాయంగా పలకరిస్తూ మామయ్య, ఆ వెనకే చిరునవ్వుతో అత్తయ్య. మండుటెండలో మలయమారుతంలా మనసుకు హాయినిచ్చింది వారి చెరగని ప్రేమ.

ఆమరునాడు నరసిమ్హ స్వామి గుట్టమీదికి పిక్నిక్ కి వెళ్దామని ప్లాన్ చేసారు మామయ్య. నాకెందుకో గుట్టమీద జరిగిన ఆ మార్పులూ, చేర్పులూ, ఆర్భాటాలూ నా చిన్నప్పటి అనుభూతిని తుడిచేస్తాయేమో అనిపించింది. మీరంతా వెళ్ళిరండి. నేను అత్తయ్యతొ పాటు ఇంట్లో ఉంటానని చెప్పి వాళ్ళను పంపించాను.

భోజనాలయింతర్వాత అత్తయ్య ఎవో కబుర్లు చెపుతూ అలాగే దివాన్ మీద ఒరిగి నిద్రలోకి జారుకుంది.

నాకేం తోచక చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ అలా ఒక్కొక్క గది తిరుగుతూ , ఆ కాలంలొ దివాన్ ఖానా అని పిలువబడే గదిలోకి వెళ్ళాను.

ఒక మ్యూజియంలోకడుగుపెట్టిన అనుభూతి. ఎదురుగా తాతగారు కూర్చునే కుర్చీ, రాసుకునే బల్ల, దానిపై సిరా బుడ్డి, ఇంక్ ఫిల్లర్, రెండు మూడు పాళీ కలాలు. పక్కనె పుస్తక భాండాగారం, ఒక పెద్ద చెక్క బీరువా. నగిషీలు చెక్కిన తలుపుల్లో ఒకదానికి పొదిగిన అద్దం, పూలు లతలతో, సగం కళాయి పోయి ఉంది.

కొద్దిగా పట్టిన బూజు దులిపి, ఇత్తడి హాండిల్ ను పట్టి తిప్పితే బరువుగా తెరుచుకున్నాయి తలుపులు. లోపల పై రెండు అరల్లో రామాయణ, మహాభారత సంస్కృత గ్రంధాలు. తర్వాత అరల్లో శరత్ సాహిత్యం మొదలుకొని, ప్రేంచంద్, రవీంద్రనాథ్ ఠాగూర్ కాబూలీవాలా , గోర్కీ తెలుగు అనువాదం అమ్మ, కొన్ని చారిత్రాత్మక నవలలు, జీవిత చరిత్రలు ఉన్నాయి.

ఆరోజుల్లో తాతయ్య ఇన్ని మంచి పుస్తకాలు చదివారా అని విస్మయ పడుతూ, కింది అరలో చూసాను. ఏవో కట్టలు రసీదులు, మరేవో ముఖ్యమయిన కాగితాలు. వాటిమధ్యలో ఇరుక్కుని ఉన్న ఒక నోట్ బుక్ ఆకర్షించింది నన్ను. మెల్లిగా లాగి చేతిలోకి తీసుకున్నాను. నీలి రంగు బైండింగ్ వెలిసిపోయి, అక్కడక్కడ గోధుమరంగు మచ్చలతో ఉన్న ఒక డైరీ అది.

వెలిసిపోయిన కొన్ని అక్షరాలు నీడలా మిగిలినా, నా పెదవులు కూడబలుక్కుని 'కిషన్ రావ్' అంటూ చదివాయి. ఓహో ఇది తాతయ్య డైరీనా! ఒక్కసారిగా ఏదో సంభ్రమం రేకెత్తింది నాలో. ఆపుకోలేని కుతూహలం అప్రయత్నంగానె

పేజీ తిప్పించింది నన్ను. గోధుమరంగులోకి మారిన తెల్లకాగితాలపై తేమకు కొంచెం చెదిరి వెలిసినా ముత్యాలసరాల్లాంటి సిరా అక్షరాల వెంట పరుగెత్తాయి నా కళ్ళు.

ఫిబ్రవరి 1940

గంగాపురం

రాత్రి 10.30

ప్రియమయిన డైరీ,

ఈరోజు ఉదయమే హైదరాబాదుకు ఊరి పన్ను కట్టడానికి నిజాం గారి ఆఫీసుకు వెళ్ళి వచ్చేసరికి రాత్రయిపోయింది. నాకోసం అమ్మ కళ్ళల్లో వత్తులు వేసుకుని తినకుండా ఎదురుచూస్తూంది. ఎందుకో ఆకలి లేకపోయినా అమ్మకోసం ఏదో తిన్నాననిపించాను. "బాగా అలిసిపోయినట్టున్నావు. నువ్వు ఆ పుస్తకాలు ఈ పుస్తకాలు చదవకుండా, ఆరాతలూ ఈరాతలూ రాయకుండా త్వరగా పడుకో." అంటూ హెచ్చరించింది అమ్మ. కాని కంటిమీద కునుకు రావడం లేదు. కళ్ళు మూసినా తెరిచినా ఆ అమ్మాయే కనిపిస్తూంది. ఎప్పుడూ లేంది మనసంతా ఏదో గమ్మత్తుగా ఆహ్లాదమయిన మత్తులో మునిగిపోయి ఉంది. అసలు ఈరోజు రూపేష్ ఇంటికి వెళ్ళకుండానే వచ్చేద్దామనుకున్నాను కానీ చివరి క్షణంలో, చాలా రోజులయింది వాడిని చూడక, మళ్ళీ నెల వరకూ కుదరదుకదా అని, మనసు మార్చుకుని వెళ్ళాను.

అవునూ డైరీ, అసలు నీకు రూపేష్ గురించి ఇంతవరకు చెప్పలేదు కదూ. వాడు నా చిన్నప్పటినించీ ఎఫె వరకూ క్లాస్ మేట్. వాళ్ళ నాన్నగారు ఎప్పుడో గుజరాత్ నుంచి వర్తకం చేయడానికి హైదరాబాద్ వచ్చి అక్కడే స్తిరపడి పోయారు. దుర్దృష్టవశాత్తు చిన్నప్పుడే మా నాన్నగారు పోయినా, ఎప్పుడూ గడపకూడా దాటి ఎరగని అమ్మ అన్నీ తనే అయి మమ్మల్ని చూసుకుంది. నన్ను హైదరాబాద్ పంపించి చదివించింది. ఆమె కష్టం చూడలేక నేనే ఎలాగో అమ్మను వొప్పించి చదువు మానేసి ఇంటికి వచ్చాను. నాన్నగారి జమీందారీ డ్యూటీలతో పాటు ఆయన మిగిల్చిన 200 ఎకరాలా సుక్షేత్రం, వ్యవహారాలు బరువుబాధ్యతల్లో మునిగిన నాకు ఇలాంటి ఈ హాయయిన అనుభూతి ఎప్పుడూ కలగలేదు.

అవును అసలు విషయం ఏంటంటె, నేను రూపేష్ ఇల్లు చేరి తలుపు తట్టాను. కాసేపటికి తెరుచుకుంది తలుపు. ఎదురుగా ఒక మెరుపుతీగ. నా ఎదలో ఒక వీణ మీటు. చూపు మరల్చుకోలేకపోయాను. మిగల కాచిన పాలమీగడ తరగలాంటి చాయ. తళుక్కున మెరిసే నీలి కలువ కళ్ళు, సంపంగి మొగ్గలాంటి ముక్కు, లేత గులాబీ పెదవులు. శంఖంలాంటి మెడలో ఒంటిపేట బంగారు గొలుసు ఆమె రంగుముందు వెలవెలబోతూ ఎప్పుడో ఆమె కదిలినప్పుడుమాత్రమే తళుక్కుమని నేనున్నానని చెపుతూంది. లతలాంటి ఆమె మేనిని చుట్టుకున్న ఆకుపచ్చ చీర జరీ అంచు ఆమె పసిమి పాదాలపై జీరాడుతూ, కవులు వర్ణించే కావ్య కధానాయిక ఈమేనేమో అనిపించింది.

"ఎవరు కావాలండీ?" వినిపించిన ప్రశ్నతో ఈలోకంలో పడి, నన్ను నేను సంబాళించుకుంటూ, “రూపేష్ ఉన్నాడా?” అడిగాను గొంతు పెగుల్చుకుని.

"అన్నయ్య ఇంట్లో లేరండీ," వీణ మీటినట్టు సమాధానం.

రానని మొరాయిస్తున్న మనసును అక్కడే వదిలేసిన నన్ను బలవంతంగా లాక్కొచ్చాయి నా కాళ్ళు.

సరే మరి ఇక నన్ను కలల్లో తేలిపోనీ.

శుభరాత్రి.

★★★

ఏప్రిల్ 1940

గంగాపురం

ప్రియమయిన డైరీ

అప్పుడే మెరుపుతీగను చూసి రెండు నెలలు కావస్తూంది. ఎన్నిసార్లు అనిపించిందో మళ్ళీ వెళ్ళి చూడాలని. కానీ ఎప్పుడూ ఏవో పనులు తీరికలేకుండా. అయినా మనసు నిలకడగా లేక విహంగంలా ఆమె వేపు పరుగులు తీస్తూనే ఉంది.

"ఏంటిరా అలా పరధ్యానంగా ఉంటున్నావ్? కూర అద్భుతంగా ఉందనో, పులిహోర రుచి స్వర్గాన్ని తలపిస్తుందనో, పూరీలు చందమామల్లా ఉన్నాయనో పొగిడే వాడివి. ఈమధ్య ఇలా అయిపోయావేమిటి? ఆ తిండి ఏమిటి కెలుకుతూ?" అమ్మ అంటూనే ఉంది.

అసలు నాకేమయిందో నాకే తెలియడం లేదు. పచ్చని పంట పొలాలను చూస్తే ఆకుపచ్చ చీరలో ఉన్న ఆమే రూపం వనకన్యలా దర్శనమిస్తూంది. ఆకాశంలో మేఘాల వెండి అంచులు చూస్తే ఆమె పాదాలపై జీరాడే జరీ అంచు తలపున పడుతూంది. అప్పుడే ఉదయిస్తున్న సూర్యబింబం ఆమె నుదిటిపై ఎర్రని బొట్టు గుర్తొస్తూంది. సెలయేరు గలగలల్లో ఆమె నవ్వు ప్రతిధ్వనిస్తూంది. మేఘాల మాటున చటుక్కున మెరిసి మాయమయ్యే మెరుపుతీగలా, కమనీయ స్వప్నాల తటిల్లతలా అనుక్షణం ఆమె ధ్యాసే. ఆమెను చూడాలని మనసు ఉవ్విళ్ళూరుతూంది. ఆమెతోనే బ్రతికేయాలని ఎదలో ఏదో అనూహ్యమయిన ఆరాటం.

నవ్వుతున్నావా డైరీ! అవును నేను ఉన్మాదిలా అయిపోయానేమో?

అయినా ఈ నిరీక్షణ ఇంకా ఎంతో కాలం కాదు. పన్నులు వసూలు పనులు అయిపోయాయి. రేపు హైదరాబాద్ వెళ్ళి కట్టి రావాలి. ఆమెను త్వరలో చూడబోతున్నానని తలుచుకుంటే మనసులో ఏదో పులకింత. అర్థంకాని గిలిగింత నన్ను నిద్రపోనీయడం లేదు.

సరే ఇక నన్ను కలల్లో తేలిపోనీ...

శుభరాత్రి

★★★

జూన్ 1940

ప్రియమయిన డైరీ

ఈరోజు హైదరాబాద్లో పని త్వరగా ముగించుకుని రూపేష్ వాళ్ళింటికి అఘమేఘాల మీద బయల్దేరాను. మనసు దూది పింజలా గాల్లో తేలిపోతూంది. కాళ్ళు భూమిపై నిలవడం లేదు. అరమైలు దూరం అరవై మైళ్ళదూరంలా అనిపించింది.

గేట్ తీసుకుని వెళ్ళాను. ఈసారి తలుపు ఓరగా తీసే ఉంది. ముందు హాల్లో గొలుసుల ఉయ్యాల్లో అటు తిరిగి అలవోకగా పడుకుని ఏదో పుస్తకంలో లీనమయి ఉంది మెరుపుతీగ. తెల్లని ఆకాశంలాంటి దిండుపై నల్లని మేఘాల్లా రిగులు రింగులుగా పరుచుకుని ఉంది ఆమె జుట్టు. లేత పసుపు చీర కొంగు ఉయ్యాల మీంచి జలపాతంలా కిందికి జారి నేలను తాకుతోంది. జాకెట్కూ చీరకు మధ్యనున్న సన్నని వొంపు తిరిగిన నడుము ఆమె చీర అంచు పసిడి రంగులో కలిసిపోయి కాంతులీనుతూంది. ఆమె పసిడిపాదాల మువ్వలు ఉయ్యాల చిరుకదలికకు అప్పుడప్పుడూ ఘల్లుమంటున్నాయి.

ఎంతసేపయినా ఆమెను అలాగే చూడాలనిపించింది. మౌనంగా అలాగే నిలబడిపోయాను.

"అరే కిషన్ అలా బయటనే నిలబడిపోయావేం? లోపలికి రా." పిలిచాడు రూపేష్.

కల చెదిరినట్లు ఒక్కసారే ఉలిక్కిపడ్డాను.

ఒక్క ఉదుటున లేచి తిరిగిచూసిన ఆమె కన్నుల నీలి తళుకుల్లో నన్ను గుర్తుపట్టిన ఏదో మెరుపు. పెదవులపై చిరుదరహాసం అంతలోనే ఆమె ముఖంలో ఎనలేని సిగ్గు గులాబీలు.

చేతిలో పుస్తకం అలాగే పట్టుకుని లోపలికి పారిపోయింది.

"మా ఇద్దరికీ కొంచెం టీ పెట్టమ్మా," అంటూ లోపలికి వినిపించేలా చెప్పి, నన్ను కూర్చోమని కుర్చీ చూపించాడు రూపేష్.

ఏవో కబుర్లు చెప్పుకుంటుండగా ఒక ట్రేలో టీ, బిస్కెట్లు తెచ్చి టీపాయ్ మీద ఉంచి మళ్ళీ లోపలికి పారిపోయింది ఆ తటిల్లత.

"కిషన్..." గొంతు తగ్గించాడు రూపేష్, "నా చెల్లికి సంబంధాలు చూస్తున్నాను. అమ్మా నాన్న ఉంటే ఈపాటికి ఎప్పుడో ఆమె పెళ్ళి అయిపోయేది కానీ నీకు తెలుసు కదా మాకెవరూ బంధువులు కానీ ఆప్తులు గానీ ఇక్కడెవరూ లేరు. గుజరాత్ లో ఎవరో దూరపు బంధువులున్నారు కానీ దూరం. అదీగాక పుట్టినప్పటినించీ ఇక్కడే ఉన్నాం. ఎప్పుడో చిన్నప్పుడు అమ్మతో కలిసి ఒకసారి వెళ్ళామేమో అహ్మదాబాద్ కు. నాకు సరిగా గుర్తేలేదు. కిషన్ నీకన్నా ఆప్తులు నాకీప్రపంచంలో ఎవరూ లేరు...." నా రెండు చేతులూ పట్టుకున్నాడు.

"చెప్పు రూపేష్. నేను చేయగలిగేది ఏదయినా సరే చేస్తాను." అతని చెయ్యి మీద చేయి వేస్తూ అన్నాను.

"నువ్వేం అనుకోనంటే ఒకటి అడగొచ్చా?"

"తప్పకుండా. నాదగ్గర నీకు సంకోచమా?"

"నీకూ నాలాగే అభ్యుదయ భావాలున్నాయని తెలుసు కిషన్. అందుకే అడుగుతున్నాను. నీకు అభ్యంతరం లేకుంటే నా చెల్లెల్ని పెళ్ళి చేసుకుంటావా?"

"రూపేష్..!." సంభ్రమాశ్చర్యాలలో మునిగిన నా హృదయంలోంచి పెల్లుబికిన ఆనందం నన్ను మూగవాణ్ణి చేసింది.

చివరికి ఎలాగో గొంతు పెగుల్చుకుని "అంతకన్నానా రూపేష్. అది నా భాగ్యమనుకుంటాను." అన్నాను.

"మా చెల్లి చాలా అదృష్టవంతురాలు" అంటూ కన్నీళ్ళతో నన్ను ఆలింగనం చేసుకున్నాడు రూపేష్.

"మరి అమ్మగారు ఒప్పుకుంటారా?" అంతలోనే అనుమానంగా అడిగాడు.

"నువ్వేం దిగులు పెట్టుకోకు. నేనంటే మా అమ్మకు పంచప్రాణాలు. ఇంతవరకూ నా ఇష్టం ఎప్పుడూ కాదనలేదు. తప్పకుండా ఒప్పుకుంటుంది." హామీ ఇచ్చాను.

నేను బయల్దేరే ముందు మరోసారి నీలికళ్ళు తళుక్కున మెరిసి తలుపుచాటుకు మాయమయ్యాయి. ఆ ఒక్క క్షణంలో ఆమె ముఖంలో కనిపించిన ఆరాధనా భావం నా మనసును మరింత కట్టిపడేసింది.

హృదయాన్ని ఆమె కైవసం చేసి భూమి మీద కాలు నిలువకుండా ఎలా ఇంటికి చేరానో నాకే తెలియదు.

సరే డైరీ, నా కలల రాణితో జీవిత రమ్యహర్మ్యాలను ఊహించుకోనీ.

శుభరాత్రి.

★★★

ఆగస్ట్ 1940

ప్రియమయిన డైరీ

అబ్బ ఎన్నాళ్ళయింది నా మెరుపు తీగను చూడక! ఎలా ఉందో? కళ్ళుమూసినా తెరిచినా ఆమె రూపే. రెక్కలు కట్టుకుని వాలాలని ఉంది ఆమె చెంత. రోజొక యుగంలా గడుస్తూంది. కానీ ఏం చేయను? ఊళ్ళో వ్యవహారాలు, ఎస్టేట్ పనులు. దానికితోడు విపరీతమయిన వర్షాలకు గుట్టపై గుండాలు నిండి ఒక జలపాతంలా కింది చెరువులో పడుతున్నాయి. చెరువు నీళ్ళు అంచులుదాటి పొంగి పొర్లుతున్నాయి. కట్ట ఎక్కడ తెగి పంటల్ని ముంచెత్తుతుందో అని భయం. దానికోసం నాలాలు, కాలవలు తవ్వించాల్సొచ్చింది.

ఈరోజు అమ్మ అన్నం వడ్డిస్తూ , "ఒరేయ్ కిషన్, ఎన్నిరోజులనుంచి అడుగుతున్నా సమాధానం చెప్పడం లేదేమిట్రా? ఆ బ్రాహ్మణకోడూరు సంబంధం వాళ్ళు ఉత్తరాల మీద ఉత్తరాలు రాస్తున్నారు. ఎన్ని సార్లు పెళ్ళిచూపులకు వెళ్దామన్నా నువ్వు పట్టించుకోవడం లేదు."

"నాకిప్పుడు ఎన్ని పనులున్నాయో నీకు తెలుసుకదమ్మా." అంటూ తప్పించుకోజూశాను.

"ఎప్పుడూ ఏవో కుంటిసాకులు చెప్పడం నీకలవాటయిపోయింది. నాకూ వయసు మీద పడుతూంది. నీకు పెళ్ళి చేస్తే నేను కృష్ణా రామా అనుకోవచ్చు. ఇప్పుడు వర్షాలు కాస్త తెరిపి ఇచ్చాయి కదా. ఎప్పుడు బయల్దేరి వెళ్తామో చెప్పు. సిద్ధాంతిగారినడిగి ఈ పౌర్ణమి లోగా మంచిరోజు చూసి వాళ్ళకు ఉత్తరం రాయమంటాను."

గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది నాకు. నర్మద విషయం ఎలా చెప్పాలో తెలియడం లేదు. చచ్చేంత సిగ్గుగా, మొహమాటంగా ఉంది. గ్లాస్ మంచినీళ్ళు గడగడా తాగే నెపంతో కాసేపు ఆగి, "రేపు ఆలోచించుకుని చెప్తానమ్మా" అంటూ ఇప్పటికి తప్పించుకున్నాను.

ఇక రేపు అమ్మకు నా మెరుపు తీగ విషయం ఎలా చెప్పాలా అని ఆలోచించుకోవాలి.

శుభరాత్రి.

★★★

అక్టోబర్ 1940

ప్రియమయిన డైరీ

ఈరోజు ఏమయిందో తెలుసా? ఉదయం అమ్మ వెండి కప్పులో టీ ఇస్తూ, "ఒరేయ్ కిషన్, ఇప్పటికి nela రోజులుగా చెవినిల్లు కట్టుకుని నా నోరు నొప్పి పెట్టేలా చెపుతున్నా కదరా ఆ బ్రాహ్మణకోడూరు సంబంధం గురించి. ఉలుకూ పలుకూ లేకుండా అలా బెల్లం కొట్టిన రాయిలా ఉంటే ఎలారా? మా పెదనాన్నగారి అబ్బాయి వాళ్ళ పెద్దమ్మాయి

పెళ్ళికి వెళ్ళినప్పుడు చూశాను చిన్న అమ్మాయిని, కుందనపు బొమ్మ అనుకో. పచ్చని మేలిమి బంగారు చాయ, పెద్ద కళ్ళు, పొడుగాటి జడ. అసలు రెండు కళ్ళూ చాలవనుకో. అలాంటి పిల్లను ఈ చుట్టుపక్కల ఎక్కడా చూడలేదు. వాళ్ళకు కూడా మన సంబంధం ఎంతో నచ్చింది. అసలు నిన్ను నాతో తీసుకెళ్ళాల్సింది. నువ్వు కూడా చూస్తే ఆ తతంగం ఏదో కానిచ్చి ఖాయం చేసుకునేవాళ్ళం. నేను మా అన్నయ్యకు మాటిచ్చాననుకో. కానీ నువ్వూ ఒకసారి చూస్తే..."

ఫుల్ స్టాప్, కామాలు లేకుండా అలా జాలువారుతున్న ఆమె వాగ్ధోరణి ఇక వినలేక "అమ్మా..!" అని అరిచాను.

"ఎందుకురా అలా అరిచావు? నాకు తెలుసు నువ్వు సవాలక్ష కారణాలు చెపుతావు ఇప్పుడెందుకు నీకు వీలుకాదో అని. నీకెప్పుడూ ఉండే పనులే. ఇక నువ్వేం చెప్పినా నేను వినేది లేదు. ఎల్లుండి పంచమి తిథి బాగుంది. ప్రయాణానికి ఏర్పాట్లు చూడు." అంటూ ఆజ్ఞ జారీ చేసి, నేను చెప్పేది వినిపించుకోకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మనసులో ఎంత రెహార్సు చేసినా ఎంత ధైర్యంగా నర్మద గురించి చెప్పాలనుకున్నా, అమ్మ ముందు నా ధైర్యం నీరుకారిపోతూ, నోరు పెగలడం లేదు. ఎలా? ఇప్పుడు చెప్పకుంటే ఇక ఇంతె సంగతులు అన్నంత పని చేస్తుంది అమ్మ.

మెల్లిగా నేనూ వంటింట్లోకి వెళ్ళి, "అమ్మా..." అని చిన్నగా పిలిచాను.

"ఏంటి నాయనా?" అని లాలనగా అడిగింది.

"ఏం లేదమ్మా...నీతో ఒక విషయం చెప్పాలి. ఎలా చెప్పాలో తెలియడం లేదు..." నసిగాను.

"నా దగ్గర నీకు మొహమాటం ఏంటి కిషన్. చెప్పు ఏంచెప్పాలనుకుంటున్నావో." ప్రేమగా నావేపు చూసింది అమ్మ.

"మరేం లేదమ్మా..." తడబాటుతో నా గొంతు పూడుకుపోయింది.

"ఫర్వాలేదు నాయనా చెప్పు. అమ్మదగ్గర మొహమాటం ఏమిట్రా?"

"మరేం లేదమ్మా, నా స్నేహితుడు రూపేష్ గురించి చెప్పానుకదా నీకు?"

"అవును. ఆ గుజరాతీ అబ్బాయె కదూ?"

"అవునమ్మా. మొన్న వాళ్ళింటికి వెళ్ళినప్పుడు..." మళ్ళీ తడబడ్డాను.

"ఆ వెళ్ళినప్పుడు?" అమ్మ ప్రశ్నార్థకంగా చూసింది.

"వెళ్ళినప్పుడు అతడు వాళ్ళ చెల్లి ప్రసక్తి తీసుకొచ్చాడు."

"ఏ విషయంలో?" తరుగుతున్న వంకాయ అలాగే వదిలేసి నా వెపు చూసింది.

"అదే...వాళ్ళ చెల్లికి సంబంధాలు చూస్తున్నానని, ఎక్కడా మంచి సంబంధం దొరకలేదని, నీకిష్టమయితే మన స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకోవాలని ఉందని అన్నాడమ్మా. ఆ అమ్మాయికి కూడా నేనంటే చాలా ఇష్టమని చెప్పాడు.

నేను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు రెండు మూడుసార్లు చూసాను ఆ అమ్మాయిని. చాలా అందంగా అణుకువగా ఉంటుంది. నీకు చాలా నచ్చుతుంది. నువ్వు కాదనే ఉద్దేశ్యంతో సరే అని మాటిచ్చానమ్మా." ఒక్క ఉదుటున గుక్క తిప్పుకోకుండా చెప్పేశాను.

నేను చెప్పేది ఇక వినిపించుకోనట్టుగా తల అడ్డంగా ఊపింది అమ్మ. ఆమె కళ్ళు కోపంతో ఎర్రబడడం గమనించాను. గట్టిగా ఊపిరి తీసుకుని వదిలింది. "నువ్విలాంటి పని చెస్తావని కలలో కూడా అనుకోలేదు. నేను నీకన్నా ముందే మా అన్నయ్యకు మాటిచ్చాను. పైగా వాళ్ళు గుజరాతీ వాళ్ళు. మన ఆచారాలు వేరు వాళ్ళవి వేరు. భాష, కట్టుబొట్టు అన్నీ వేరు. వాడికి బుద్ధి లేదు సరే అసలు నీకేమయిందిరా? నువు చెప్పొచ్చు కదా మనకూ వాళ్ళకూ కుదరదని? పైగా మనది నిప్పులు కడిగే వంశం. మీ నాన్నగారు ఎంత నియమనిష్టలతో ఉండేవారో తెలుసా? మన వంశ గౌరవాన్ని ఎలా కాపాడుకొచ్చారో తెలుసా? నువ్వింకా ఏదో చిన్నవాడివనుకున్నాను కానీ నువ్విలా చేస్తే మీ నాన్నగారి ఆత్మ శాంతిస్తుందనుకున్నావా?."

"అమ్మా..." ఏదో చెప్పబోయాను. కానీ చెయ్యి అడ్డం పెట్టి ఆపింది.

"పిచ్చిపిచ్చి వేషాలు కట్టబెట్టు. ఎల్లుండి పెళ్ళి చూపులకు బ్రాహ్మణకోడూరు వెళ్తున్నాం. అంతే!" ఖరాఖండిగా చెప్పి అటు తిరిగి తరిగిన వంకాయలు పోపులో పడెసింది అమ్మ.

ఎప్పుడూ ప్రేమగా మాట్లాడే అమ్మకు ఇంత కోపం వస్తుందనుకోలేదు. ఎందుకో తల గిర్రున తిరిగినట్లయింది. కాళ్ళకింద భూమి కదిలినట్లయింది. మెల్లిగా లేచి నా గదిలోకొచ్చాను. ఏం చేయాలో, రోజులు మారాయని అమ్మకు ఎలా చెప్పి ఒప్పించాలో అర్థంకాకుండా ఉంది. మళ్ళీ రేపొకసారి అమ్మను బ్రతిమాలుతాను. ఈలోపల అమ్మ కూడా ఆలోచించి మనసు మార్చుకుంటుందేమో?

శుభరాత్రి

★★★

డిసెంబర్ 1940

ప్రియమయిన డైరీ

ఈరోజు లేచినప్పటినుండీ అమ్మ ముభావంగానే ఉంది. అడగాలంటే ఏదో సంకోచం. ఎలాగయినా మాట్లాడించాలని కరివేపాకు చెట్టుకు నీళ్ళుపోస్తున్న అమ్మదగ్గరికి వెళ్ళి, "అమ్మా..." అని పిలిచాను. ఏం మాట్లాడకుండా నావేపు చిరాగ్గా చూసింది.

"అమ్మా, ఒక్కసారి నా వైపునుంచి ఆలోచించమ్మా. నాకూ ఆ అమ్మాయంటే చాలా ఇష్టం. చాలా మంచి అమ్మాయి. మన ఆచారాలన్నె నేర్చుకుని నీకు తగిన కోడలిగా ఉండడానికి ఆమె ఒప్పుకుందని రూపెష్ హామీ ఇచ్చాడమ్మా. నాకూ ఆనమ్మకం ఉంది. అదీగాక మారే రోజులతోపాటు మనం కూడా మారాలికదా. దయచేసి ఒక్కసారి ఆలోచించమ్మా."

"ఆలోచించడానికి ఏముంది నాయనా! నా ఊపిరి ఉన్నంత వరకు నేను మీ నాన్నగారి వంశానికి అప్రతిష్ట తీసుకురాలేను. పైగా గుర్నాధం అన్నయ్యకిచ్చిన మాట తప్పినదాన్నవుతాను." అంటూ పెరట్లోంచి ఇంట్లోకి విసురుగా వెళ్ళిపోయింది.

ఇంకా ఏం చెపితే అమ్మను ఒప్పించగలనో? అసలు అమెను ఒప్పించడం సాధ్యమవుతుందో లేదో? మనసంతా ఎప్పుడు కలగని ఏదో బాధ, గుబులు. భారమయిన మనసుతో అలాగే ఎంతసేపు నిల్చున్నానో తెలియదు. భోజనం వడ్డించాను అనే అమ్మపిలుపుతో ఈలోకంలోకొచ్చిపడ్డాను.

కంచం ముందు కూర్చున్నా ఒక్క ముద్ద కూడా గుంతు దిగలేదు. ఏదో అయిందనిపించి లేచాను.

"అదేంటిరా, ఏం తినకుండా చెయ్యి కడిగేసావు?"

"ఆకలి లేదమ్మా," అంటూ నా గదిలోకొచ్చి మంచంపై ఒరిగిపోయాను.

ఎంత ఒద్దనుకున్నా నా మెరుపుతీగ గుర్తుకురాక మానడం లేదు. సూర్యోదయం వేళ ఉదయభానుని లేలేత కిరణాల మెరుపులో ఆమె కళ్ళే కనిపిస్తున్నాయి. సాయంత్రపుటాకాశం లోని అరుణిమ ఆమె సిగ్గుతో కందిపోయిన బుగ్గల ఎరుపును తలపిస్తోంది. మబ్బుల చాటున దోబూచులాడుతూ, కొబ్బరి ఆకుల సందుల్లోంచి కనీకనిపించకుండా వెండి వెలుగులు నిండు జాబిల్లి లాంటి ఆమె ముఖారవిందాన్ని చూడకుండా నేను బ్రతకగలనా?

రాత్రి భోజనాలయింతర్వాత ఇక మనసాగక, ఇప్పటివరకు అమ్మ నాగురించి ఏమయినా ఆలోచించి ఏమయినా మనసు మార్చుకుని ఉంటుందేమో అనే ఆశతో అమ్మ గదిలోకి వెళ్ళేసరికి పడుకుని ఉంది. ఇంకా నిద్రపోలేదనిపించి, అమ్మా... అని పిలుస్తూ మంచం చివర కూర్చున్నాను.

"ఏంటి నాయనా ఇంత రాత్రప్పుడు వొచ్చావు?" అంది ఇటు తిరుగుతూ.

"అమ్మా..," తటపటాయించాను, "అమ్మా నిన్నెప్పుడు ఏదీ అడగకుండానే నాకన్నీ సమకూర్చి పెట్టావు. అలాగే నా మాట కాదనవనే ఉద్దేశ్యంతో రూపేష్ కు మాటిచ్చానమ్మా. ఆ అమ్మాయి కూడా నామీద చాలా ఆశలు పెట్టుకుంది. దయచెసి కాదనకమ్మా. ఈ ఒక్కవిషయంలో నన్ను అర్థం చేసుకో అమ్మా..."

ఇంకా నా మాట పూర్తికాకుండానే విసురుగా, "నీ ఇష్టం వచ్చినట్టు ఊరేగు పో!" అంటూ కోపంగా అటు తిరిగి ముసుగు పెట్టుకుంది.

చేసేదేం లేక తిరిగి నా గదిలోకొచ్చేశాను. ఇంతకు ముందెప్పుడూ ఎదురవ్వని ఇరకాట పరిస్థితి.

శివరాత్రి

★★★

జనవరి 1941

ప్రియమయిన డైరీ

కనీసం నీకు న్యూ ఇయర్ గ్రీటింగ్స్ కూడా చెప్పలేదని అనుకుంటున్నావు కదూ! ఏం చెప్పను? ఎలా చెప్పను? ఎంత బ్రతిమాలినా, నేను అలిగినా అమ్మ అస్సలు నా మాట వినడం లేదు సరికదా నాతో మాట్లాడడం కూడా మానేసింది. ఇప్పటికి పది రోజులుగా అన్నం నీళ్ళు ముట్టుకోకుండా అలాగే భీష్మించుకుని ఉంది. పస్తులతో పడుకుంటున్న అమ్మను అలా చూడాలంటే చాలా బాధగా ఉంది. నాన్నగారు పోయినప్పటినుండీ నన్ను కంటికి రెప్పలా కాపాడుతూ ఆరోప్రాణంగా పెంచిన అమ్మ ఇంతలా బాధపడడం ఇదే మొదటిసారి చూస్తున్నాను. అమ్మ అంటే నాకు ప్రాణం. అమ్మను కాదని ఏ నిర్ణయం తీసుకోలేక సతమతమవుతున్నాను.

కాదని చెప్పి రూపేష్ కి నా ముఖం ఎలా చూపించను? మా స్నేహానికున్న విలువ ఏమైపోతుంది? ఎన్నో ఆశలతో నాపై ఇష్టం పెంచుకున్న నర్మద ఏమవుతుంది? ఆమె సున్నిత హృదయం తట్టుకోగలదా? అసలు దేవుడు మనసు ఎందుకిచ్చాడు? అందులో ప్రేమ అనే అనిర్వచనీయమయిన భావం ఎందుకు పెట్టాడు? ఆమెను చూడగానే అనుకోకుండా నాలో ఈ మధుర భావం ఎలా ఉదయించి శాఖోపశాఖలుగా విస్తరించి నరనరాలలో జీర్ణించుకుపోయి, ఆమె రూపానికి హృదయంలో ప్రతిష్టాపన ఎలా జరిగింది? ప్రేమ ఎంతో మధురమనీ, ప్రేమించడం ఒక గొప్ప వరమనీ ఇన్నాళ్ళూ పుస్తకాల్లో చదివాను. అలాంటి అనుభవం నాకూ కలిగిందని మురిసిపోయాను, ఆమెను తల్చుకుని అందమయిన ఊహల్లో తేలిపోయాను. ఆమె నవ్వులో నా జీవిత సరిగమలు పలికాయనుకున్నాను. ఇప్పుడు అపశృతులు పలికే ఈజివితాన్ని ఎలా భరించగలను? ఆమెను మర్చిపోవడం సాధ్యమా? హృదయంలో చెలరేగుతున్న ఈ మంటలను ఎలా ఆర్పగలను? తుఫాను భీభత్సంలో, నడి సముద్రంలో పిడుగుల వర్షంలో చిక్కుకున్న నావలా కొట్టుమిట్టాడుతూ సుళ్ళు తిరుగుతున్న, నా ఈ మానసిక సంఘర్షణ నాలో మరణమృదంగం మ్రోగిస్తోంది.

ఒకవేపు చిక్కి శల్యమయిన అమ్మను చూస్తుంటే హృదయం ద్రవించుకుపోతూంది. ఇంకా ఆలస్యం చేస్తే అమ్మ దక్కేట్టు లేదు. కన్నతల్లి కోరిక తీర్చడం నా కనీస ధర్మం. ఈ వయసులో ఆమె మనసు కష్టపెట్టలేను.

నా మెరుపుతీగ...అలా పిలిచే అర్హత కోల్పోయాను. నర్మదకు నేను చేయబోతున్న అన్యాయం నన్ను నేను క్షమించుకోలేనిది. కానీ ఏంచెయ్యగలను? ఒక మోసగాడిలా చిరస్థాయిగా ఆమె మనసులో ఉండిపోయినా ఫర్వాలేదు కానీ

ఆమెను అర్థం చేసుకుని ఆరాధించే మరో మంచి అబ్బాయి ఆమెకు జీవిత భాగస్వామిలా రావాలనీ, ఆమె నీలి కళ్ళల్లో తళుకు మాయగూడదనీ, నీళ్ళు సుళ్ళు తిరగకూడదనీ, ఆమె గులాబీ పెదవులపై చిరుదరహాసం అలాగే నిలవాలనీ కోరుకోవడం తప్పా?

రేపే రూపేష్ కి ఉత్తరం వ్రాయాలి...నన్ను క్షమించు మిత్రమా...అంటూ....

కాళరాత్రి.

★★★

డైరీ చదువుతున్న నా కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర. అక్షరాలు మసకబారాయి. ఆత్రంగా పేజీ తిప్పిన నాకు మిగతా పేజీలన్నీ ఖాళీగా కనిపించాయి. ఆరోజుల్లో కూడా మా తాతయ్యకి ఇంత ప్రేమకధ ఉందా! అనుకుంటూ, కళ్ళు తుడుచుకున్నాను.

ఒక్కసారిగా అమ్మ ఎప్పుడూ చెపుతుండే మాటలు గుర్తొచ్చాయి, నీకు నచ్చిన అమ్మాయినే చేసుకుంటానని వాళ్ళమ్మకు మాటిచ్చి, అసలు పెళ్ళిచూపులకు కూడా వెళ్ళకుండా మా అమ్మమ్మ రత్నమాల మెళ్ళో మూడుముళ్ళూ వేసాడట తాతయ్య.

నాకు తెలిసి మా అమ్మమ్మ ఆ వయసులో కూడా చాలా అందంగా ఉండేది, కాకపోతే తనలో తనే ఏదో మాట్లాడుకుంటూ, కొన్ని సార్లు నవ్వుతూ, కొన్ని సార్లు బాధగా తన లోకంలో తను అన్నట్టుగా ఉండేది. ఆలోచిస్తే ఇప్పుడు అర్థమవుతూంది. బహుశా తాతయ్య ప్రేమించిన అమ్మాయిని మర్చిపోలేక, పెళ్ళిచేసుకున్న అమ్మాయికి దగ్గరవ్వలేక నానా యాతనా పడిఉంటాడు. మనస్ఫూర్తిగా ప్రేమించిన భర్త ప్రేమాదరణలను పూర్తిగా నోచుకోని అమ్మమ్మ మనసు కలత చెంది ఉంటుంది. అందుకే ఆమె అలా అయిపోయిందేమో?

***

"అమ్మా ఎంతసేపట్నించీ పిలుస్తున్నా, ఇక్కడున్నావా? మనం ఈరోజు హైదరాబాద్ వెళ్తున్నాం. మర్చిపోయావా? నాన్న రమ్మంటున్నారు," మా పాప మాటలకు ఈలోకంలోకి వచ్చాను.

చేతిలో ఉన్న డైరీలోంచి నీలికళ్ళు తళుక్కుమని మాయమయ్యాయి.

# నాకు నువ్వూ – నీకు నేనూ

లక్ష్మి గాయత్రి బొంతా

బద్ధకంగా కళ్లు తెరుస్తూ గోడకున్న గడియారం వైపు చూశాడు రామస్వామి. ఐదున్నర దాటింది. తన మామూలు టైమే. కాళ్లూ చేతులూ విదిలిస్తూ పక్క దిగబోయి, పక్కనే నిద్రపోతున్న సుందరమ్మని చూసి ఆశ్చర్యంతో బాటు ఆందోళన కూడా కలగగా ఒక్క క్షణం కొయ్యబారిపోయాడు.

తెల్లవారుజామున నాలుగయేసరికి లేవడం గత నలభై ఏళ్లుగా బాలాత్రిపురసుందరమ్మకి అలవాటు. అరవై ఐదేళ్ల రామస్వామి రిటైర్ అవకముందు ఐదింటికి లేచేవాడు. ఇప్పుడు ఐదున్నర ఆరూ మధ్యలో లేస్తున్నాడు. ఆయన లేచేసరికి ఆవిడ స్నానం, తులశమ్మ దగ్గరా, దేవుడి దగ్గరా దీపం పెట్టుకోవడం, పాలు కాచి, చిటికెడు పంచదార వేసి దేవుడికి నైవేద్యం పెట్టడం అయిపోతాయి. ఫ్రెష్ గా కాఫీ ఫిల్టర్ వేసి, ఆయన లేవడం కోసం చూస్తూ, లలితా సహస్రమో, విష్ణు సహస్రమో మనసులోనే వల్లించుకుంటూ ఉంటుంది. రామస్వామి లేచాక ఇద్దరికీ కాఫీ కలిపి పట్టుకొచ్చి, ఓ పావుగంట ఆయనతో ఆ కబురూ ఈ కబురూ చెప్పి, జపం చేసుకోవడానికి వెళ్లిపోతుంది.

మూడేళ్ల క్రితం, సుందరమ్మకి యాభై తొమ్మిదో ఏట రొమ్ము కేన్సర్ ఆపరేషన్ అయింది. అప్పుడు కూడా అలవాటు ప్రకారం ఆవిడకి తెల్లవారుజామున నాలుగింటికల్లా మెలకువ వచ్చేసేది. ఓ గంట అలా పడుకుని ఐదయాక నెమ్మదిగా లేచి బ్రష్ చేసుకునేది. ఆవిడతో బాటే రామస్వామి కూడా లేచి ఇద్దరికీ ఇన్ స్టంట్ కాఫీ కలిపి తెచ్చేవాడు. కాఫీ తాగి, ఆయన సహాయంతో బట్టలు మార్చుకుని, రామాయణం చదువుకుంటూ కూర్చునేది. ఏడు గంటలకి కూతురు నిద్ర లేచి టిఫిన్ వగైరాలు చూసేది. ఆపరేషన్ అయిన తర్వాత పదిహేను రోజులు కోడలూ, పదిహేను రోజులు కూతురూ ఉండి చేశారు. తర్వాత ఒక కిచెన్ అసిస్టెంట్ ని కుదిర్చి, ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. ఆరు నెలల వరకూ ఆ అసిస్టెంటే చేసింది. ఆ సరికి పుంజుకున్న సుందరమ్మ ఆ మనిషిని మానిపించేసి, తనే చేసుకోవడం ప్రారంభించింది. పది నెలలు గడిచి, ట్రీట్ మెంట్ మొత్తం పూర్తయే సరికి మళ్లీ యధాప్రకారం తన రొటీన్ లోకి వచ్చేసింది. అప్పటి నుంచీ మళ్లీ నాలుగింటికల్లా లేవడం, స్నానం, దీపం,ఫిల్టర్ కాఫీ.. అన్నీ యథాతథంగా సాగిపోతున్నాయి.

మళ్లీ ఇవాళ.. ఆరవుతున్నా సుందరమ్మ లేవకపోయేసరికి కలవరంగా, "సుందరం.. " అని పిలుస్తూ ఆవిడ భుజం మీద మృదువుగా తట్టాడు రామస్వామి. బట్ట మీద నుంచే ఒళ్లు వేడిగా తగిలింది. దాంతో ఆయన ఆందోళన పెరిగింది. నెమ్మదిగా తనని తాను నిభాయించుకుంటూ, "సుందరం.. "అంటూ బుగ్గ తట్టాడు.

"ఊఁ... " జ్వర తీవ్రతతో భారంగా కళ్లు విప్పింది సుందరమ్మ.

"జ్వరం వచ్చినట్టుంది. లేస్తావా టెంపరేచర్ చూస్తాను"

సుందరమ్మ నెమ్మదిగా లేచి కూచుంది. రామస్వామి థర్మామీటర్ తెచ్చి విదిలిస్తూ, "నిన్న రాత్రి బాగానే ఉన్నావు. ఇంతట్లోకే ఏమిటిది" అన్నాడు

"ఏమో. రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో మెలకువ వచ్చింది. ఒళ్లు నొప్పులు, తల నొప్పి. ఒళ్లు వేడిగా ఉన్నట్టు అనిపించింది. అప్పటినుంచి నిద్రే లేదు. నాలుగింటికి లేద్దామనుకున్నాను గానీ లేవలేకపోయాను. నాలుగున్నర అవుతుంటే మళ్లీ నిద్ర పట్టింది" అందావిడ

"మరి నన్ను లేపలేకపోయావా"

"ఎందుకూ... మంచి నిద్దట్లో ఉన్నారు మీరు"

రామస్వామి మాట్లాడలేదు. టెంపరేచర్ చూస్తే దాదాపు నూట రెండు ఉంది. సుందరమ్మ మొహం బాగా భారంగా ఉంది.

అమెరికాలో డాక్టర్ గా పనిచేస్తున్న కొడుక్కి మెసేజ్ పెట్టి, "నెమ్మదిగా లేచి బ్రష్ చేసుకో సుందరం. పద.. బాత్ రూం లోకి తీసుకెళ్తా" అన్నాడు.

సుందరమ్మ మంచం దిగుతూ, "నేను వెళ్లగలన్లెండి.. పర్వాలేదు" అంది

అయినా సరే భార్య వెనకాలే బాత్ రూం దాకా వెళ్లి, ఆమె తలుపు వేసుకోగానే వెనక్కి తిరిగి వంటింట్లోకి వచ్చాడు రామస్వామి. ఫ్రిజ్ లోంచి పాల ప్యాకెట్ తీసి బైట పెట్టాడు. ఇన్ స్టంట్ కాఫీ పొడర్ ఉందో లేదో?! సుందరం ఎప్పుడూ ఇన్ స్టంట్ వాడదు. తనకి ఇష్టమని తాజాగా ఫిల్టర్ డికాక్షనే తీస్తుంది. సుందరానికీ అదే ఇష్టం. ఫిల్టర్ వేస్తే సరి. అదేమంత పెద్ద పనని..?! నలభై ఏళ్ల నుంచీ తనకి ఏమరకుండా అన్నీ అమరుస్తోంది సుందరం. తనకి ఈ వృద్ధాప్యంలో ఆ మాత్రం చెయ్యలేడా?

వంటింట్లో పని చేస్తున్నాడన్న మాటే గానీ రామస్వామి మనసు పరిపరివిధాల పోతోంది. తన చిన్నతనంలో జ్వరం వస్తే అసలు పట్టించుకునేవారు కాదు. తర్వాత్తర్వాత కాస్త జాగ్రత్త పడినా, విపరీతమైన భయం, ఆందోళన ఎప్పుడూ లేవు. ఈ దరిద్రపు కరోనా వచ్చిందగ్గర నుంచీ మనిషి ప్రాణం దూదికంటే తేలిగ్గా ఎగిరిపోతోంది. మొన్న వారం కిందట తన ప్రాణ స్నేహితుడు విశ్వం ఫోన్ చేసి "రామం" అంటూ ఫోన్ లోనే భోరుమన్నాడు. వాళ్లావిడ,

రాయిలా ఉన్న మనిషి, ఉన్నట్టుండి ఆయాసంగా ఉంది అందిట. చూస్తే ఒళ్లు కూడా వేడిగా ఉందిట. ఉన్నపాటున ఆస్పత్రికి తీసికెళ్తే టెస్ట్ చేసి, కరోనా పాజిటివ్.. క్రిటికల్ గా ఉంది అన్నారట. మరో గంట గడిచేసరికి ఆవిడ పోయిందని చెప్పేసి, ఆ పై గంటకల్లా క్రిమేషన్ వీడియో వాడి సెల్ కి పంపిస్తాం పొమ్మన్నారుట. "శవాన్ని పట్టుకుని ఏడవడానిక్కూడా లేదురా" అంటూ ఏడ్చాడు విశ్వం

ఇప్పుడు సుందరానిక్కూడా కరోనాయేనా? అసలే కేన్సర్ సర్వైవర్... తట్టుకోగలుగుతుందా? ఇప్పుడు తనిచ్చే కాఫీయే ఆఖరి కాఫీయా..?!

క్షణక్షణానికీ పెరిగిపోతున్న ఆందోళనని అదుపు చేసుకుంటూ ఇద్దరికీ ఫిల్టర్ కాఫీ కలిపి తీసుకొచ్చాడు. సుందరమ్మ మంచం మీద వెనక్కి ఆనుకుని కూర్చుని ఉంది.

భర్త అందించిన కాఫీ చూసి, "ఫిల్టర్ వేశారా.. అయ్యో.. " అంటూ ఓ గుక్క తాగి, "కాఫీ చాలా బావుందండీ... నా కంటే బాగా కలిపారు" అంటూ నవ్వింది.

వాడిన పువ్వులా నవ్వుతున్న భార్యని క్షణకాలం రెప్పవాల్చకుండా చూశాడు రామస్వామి. వెంటనే తన కప్పు కింద పెట్టేసి, ఫోన్ పట్టుకొచ్చాడు.

"ఏదీ... ఇందాకటిలా నవ్వు" అంటూ ఫోన్ కెమెరా లో యాంగిల్ చూసుకున్నాడు.

"ఫోటో తీస్తారా.. బావుంది. ఈ అవతారంతో ఫోటో ఏమిటండీ"

రామస్వామి జవాబివ్వలేదు. మనసులో మాత్రం, "మరుక్షణం గురించి ఎటువంటి ఆలోచనా, భయమూ లేనప్పుడే అంత చక్కని నవ్వు వస్తుంది. ఆ నవ్వు నాక్కావాలి." అనుకున్నాడు.

వాళ్లు కాఫీలు ముగించేసరికి కొడుకు దగ్గర నుంచి మెసేజ్ వచ్చింది. కరోనా ఉధృతంగా ఉంది కాబట్టి, ఇప్పుడు వెంటనే ఏ ఆస్పత్రికీ వెళ్లొద్దని, ఫలానా మందులు వాడమని చెబుతూ, రెండు రకాల టాబ్లెట్స్, ఒక సిరప్ రాశాడు కొడుకు. తను డ్యూటీ ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లిన తర్వాత వీడియో కాల్ చేస్తానని చెప్పాడు.

"నేను వెళ్లి మందులు తీసుకొస్తాను. ఒక్కర్తివీ ఉండగలవా... లేకపోతే పనమ్మాయి వచ్చాక వెళ్లనా" అడిగాడు రామస్వామి.

"నాకేం పర్వాలేదు, మీరు వెళ్లండి. మరో అరగంటలో ఎటూ పనమ్మాయి వస్తుంది." అంటూ లేచి హాల్లోకొచ్చి కూర్చుందావిడ.

రామస్వామి లుంగీ మీదే షర్టు వేసుకుని పక్కవీధిలో మెడికల్ షాపుకి వెళ్లాడు.

అక్కడ ఆ మందులేవీ లేవు. "కరోనా కద్సార్.. మందులు అయిపోతున్నాయి" అన్నాడు వాడు. చేసేది లేక మందులు వెతుక్కుంటూ మరో రెండు వీధులు దాటి వెళ్లాడు. ఒక షాపులో మందులు ఉన్నాయి గానీ రష్ గా ఉంది

కాస్సేపు ఆగమన్నాడు. షాపు బయట నిలబడ్డ రామస్వామి షాపులో గోడగడియారం చూసి ఉలిక్కిపడ్డాడు. తను బయల్దేరి వచ్చి అరగంట దాటుతోంది. సుందరం ఎలా ఉందో.. ఏ ఆయాసమో రాలేదు గదా... సెల్ మర్చిపోయి వచ్చినందుకు తనని తను నానా తిట్లూ తిట్టుకున్నాడు. చివరికి ఆదుర్దా పట్టలేక, తన ముందు నిలబడ్డవాణ్ణి సెల్ అడిగాడు.

"సారీ సార్.. కరోనా కదా" అవతలివాడు సున్నితంగానే తిరస్కరించాడు.

ఎలాగైతేనేం మందులు తీసుకుని ఇంటికొచ్చే సరికి రామస్వామికి తన గుండె కొట్టుకునే శబ్దం తనకే తెలియడం ప్రారంభించింది.

"గుండెదడ అంటే ఇదే కాబోలు" అనుకుంటూ మరోసారి తుళ్లిపడ్డాడు. ఈ ఆదుర్దా భరించలేక ఇప్పుడు తనకేమైనా అయితే సుందరం గతి ఏమిటి... దాన్ని చూసేవాడెవడు? ఉన్న ఇద్దరు పిల్లలూ అమెరికాయే. పిలిస్తే పలికే దిక్కు లేదు తమకి. తనకి ఒక్కర్తే అక్క. తనకంటే ఆరేళ్లు పెద్దది. చనిపోయి రెండేళ్లవుతోంది. బావగారు హాయిగా పుణెలో కొడుకు, కోడలి దగ్గర కాలక్షేపం చేస్తున్నాడు. సుందరానికి ఒక అన్న, ఒక తమ్ముడు. ఇద్దరూ అప్పచెల్లెలంటే ప్రాణం పెడతారు. అయితే అన్న విజయవాడ దగ్గర పల్లెటూళ్లోనూ, తమ్ముడు లండన్ లోనూ ఉన్నారు. ఎవరి దగ్గరకీ తాము వెళ్లలేరు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. హాలు తలుపులు తీసే ఉన్నాయి. సుందరం హాల్లో సోఫాలో లేదు. దడదడలాడుతున్న గుండెలతో లోపలికి వెళ్లబోయాడు రామస్వామి. ఈలోగా అతను వచ్చిన అలికిడి విని లోపలి నుంచి పనమ్మాయి లక్ష్మి వచ్చింది.

రామస్వామిని చూస్తూనే, "అమ్మగారు నిద్రొస్తోందని పడుకున్నారు బాబూ. మీరు బెల్ కొడితే లేచిపోతారని తలుపు తీసుంచాను" అంది

బెడ్ రూం లోకి వెళ్లి భార్య ప్రశాంతంగా నిద్రపోతూండటం చూసిన తర్వాత గానీ రామస్వామి గుండెదడ తగ్గలేదు.

భార్యని లేపకుండా బెడ్ రూం తలుపులు దగ్గరగా వేసి ఇవతలికి వచ్చాడు. ఒక కప్పు కాఫీ ఇవ్వమని లక్ష్మి కి చెప్పి హాల్లో సోఫాలో చతికిలబడ్డాడు.

ఒకప్పుడు ప్రతి ఇంట్లోనూ ఇంటినిండా మనుషులు ఉండేవారు. అనారోగ్యం గానీ, మరే ఇతర సమస్యలు గానీ అంతగా బాధించేవి కావు. మనిషి శ్రమజీవిగా బతికాడు గానీ ఆలోచనల పుట్టగా ఎప్పుడూ లేడు. నానాటికీ ఆరోగ్యం దిగజారుడుగా ఉంటే ఉండొచ్చు గాక.. కరోనా లాంటి సమస్యలు మనిషి జీవితాన్ని అతలాకుతలం చేస్తూ ఉండొచ్చు గాక.. కానీ అన్నిటికంటే ఎక్కువగా మనిషిని బాధిస్తున్నవి ఆలోచనలు.. భయాలు.. బెంగలు! మానవ సంబంధాలు నానాటికీ కుచించుకుపోయి, ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక అన్న తీరున జీవితాలు సాగుతున్న

నేపథ్యంలో మనిషి మనసు ఎంత బలహీనమైపోతోందో ఎవరు గ్రహిస్తున్నారు?! వృద్ధాప్యంలో ఉన్న తమలాంటివాళ్లు భయం భయంగా బతుకుతూ ఉంటే, యువతరం ఆ భయాల నుంచి తప్పించుకోవడానికి పెడదారి పడుతోంది.

ఉన్న సమస్యలకు అదనంగా వెర్రితలలు వేస్తున్న మీడియా ఒకటి. ఈ మధ్యే ఫేస్ బుక్ లో కనిపించింది.. "మరణం ఆసన్నమవుతుండగా యమధర్మరాజు నాలుగు సంకేతాలు పంపిస్తాడట. అవేమిటో మీరూ తెలుసుకోండి.. " అని!! కామన్ మేన్ తెలుసుకోవలసిన విషయమా అది..?!

ఆలోచనల్లో పడి కొట్టుకుపోతున్న రామస్వామి "నేనెళ్తున్నా బాబూ" అన్న లక్ష్మి మాటలకి ఈ లోకంలో కొచ్చాడు.

"అమ్మగారు ఇడ్లీ పెట్టమన్నారు. పెట్టేశాను. హాట్ బాక్స్ లో పెట్టి డైనింగ్ టేబుల్ మీద పెట్టాను" అని చెప్పి లక్ష్మి వెళ్లిపోయింది.

మరో పావుగంటకి లేచింది సుందరమ్మ. ఆవిడకి ఇడ్లీ పెట్టి, మందులిచ్చేసరికి కొడుకు వీడియో కాల్ వచ్చింది. తల్లితో మాట్లాడి, సింప్టమ్స్ విని, మరేం ఫర్వాలేదని, ఆ మందులే వాడమని, శుభ్రంగా భోజనం చెయ్యమని చెప్పి పెట్టేశాడు.

రామస్వామి కూడా టిఫిన్ తిన్న తర్వాత ఇద్దరూ కాసేపు టీవీ చూశారు. మందు పనిచేసి, సుందరమ్మకి చెమటలు పట్టాయి. నీరసంగా ఉందంది. కిచెన్ లోకి వెళ్లి డాక్టర్ ఆమెకి రాసిన ప్రొటీన్ పౌడర్ కలిపి తెచ్చాడు రామస్వామి.

అది తాగి, "మళ్లీ నిద్రొస్తోందండీ.. "అంది సుందరమ్మ.

"జ్వరం తగ్గి, నీరసపడ్డావు గదూ.. అంచేత నిద్రొస్తుంది. మరేం ఫర్వాలేదు పడుకో" అంటూ ఆమెని పడుకోబెట్టి, పల్చని దుప్పటి కప్పి, ఏసీ వేసి వచ్చాడే గాని రామస్వామి మనసు బితుకు బితుకు మంటూనే ఉంది. ఏమిటింత నిద్ర... సహజమేనా..?!

తన ఆలోచనకి తనే తిట్టుకున్నాడు గాని ఆ రోజంతా రామస్వామి మనసు మనసులో లేదు. క్షణక్షణం ఉలికిపాటుగానే గడిపాడు.

సుందరానికి జ్వరం వస్తే తనకి ఇంత భయంగా బెంగగా ఉంది. రేపు తనకేదైనా వస్తే సుందరం ఎంత బెంబేలెత్తిపోతుందో?! తనకి తలనొప్పిగా ఉందంటేనే "మరో కప్పు కాఫీ ఇవ్వనా" "అమృతాంజనం రాయనా" "తల పట్టనా" అంటూ పదిసార్లు తిరుగుతుంది.

ఆలోచనలతోనే సుందరమ్మ కి ఇష్టమైన వంకాయ కూర, టమాటా పప్పు చేసి, భోజనం పెట్టాడు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో సుందరమ్మ కి టెంపరేచర్ మళ్లీ పెరిగింది. టాబ్లెట్ వేస్తే మళ్లీ తగ్గింది.

ఆ రాత్రంతా రామస్వామికి కలత నిద్రే. మాటిమాటికి మెలకువ వచ్చేసేది. భార్య ఎలా ఉందో అని చూసేవాడు. ఎప్పుడు చూసినా సుందరమ్మ ప్రశాంతంగా నిద్రపోతూనే కనిపించింది. ఒళ్లు కూడా చల్లగానే ఉంది.

ఏ తెల్లవారుజామునకో గాఢనిద్ర పోయిన రామస్వామి లేచేసరికి ఐదున్నర కావస్తోంది. కళ్లు తెరిచి చూస్తే పక్కన భార్య లేదు. ఆమె హాయిగా మళ్లీ తన రొటీన్ లోకి వెళ్లిపోయిందేమో అన్న పాజిటివ్ ఆలోచన కంటే భార్య ఏమైంది.. ఎక్కడికెళ్లింది అన్న భయమే రామస్వామిని ఎక్కువగా బాధించింది. గబుక్కున లేచి వంటింటి వైపు వచ్చాడు.

వంటింట్లో లైటు వెలుగుతోంది గానీ ఆమె అక్కడ లేదు. దేవుడి గది లోంచి అప్పుడే బైటికి వస్తోంది. దేవుడి ముందు దీపాలు...ఆశాదీపాల్లా వెలుగుతున్నాయి.

భర్తని చూడగానే నవ్వుతూ, "లేచారా.. మొహం కడుక్కోండి కాఫీ తెస్తాను" అంది

"అది సరే... నువ్వెందుకు లేచావ్?"

ఆమె చిన్నపిల్లలా సంబరంగా, "మెలకువ వచ్చింది. జ్వరంగా అనిపించలేదు. నీరసం కూడా తగ్గింది. మరెందుకని కాసిని నీళ్లు పోసుకుని, దీపం పెట్టుకున్నాను" అంది.

రామస్వామికి కళ్లు చెమర్చాయి. గొంతు పూడుకుపోయింది. తనది పాచిమొహం.. భార్య స్నానం చేసింది అని కూడా ఆలోచించకుండా ఒక్క అడుగు ముందుకు వేసి ఆమెను రెండు చేతుల్లోకీ తీసుకుని, గుండెల్లో ఇముడ్చుకుంటున్నట్టూ గాఢంగా గుండెలకు హత్తుకున్నాడు.

"ఈ కలికాలంలో నాకు నువ్వూ...నీకు నేనూ!! నువ్వు లేకుండా నేను, నేను లేకుండా నువ్వు ఊపిరి కూడా పీల్చలేం! సమయం వచ్చినప్పుడు ఇద్దర్నీ ఒక్కసారే తీసుకుపొమ్మని ఆ దేవుడికి చెప్పు!" అతని మనసు నిశ్శబ్దంగా ఆమె మనసుకి చెప్పింది.

భర్త మనసు తనకి తెలిసినట్టూ ఆమె అతని చుట్టూ చేతులు వేసి, అతనిలో లీనమైపోయింది!!

# యాత్ర

జి.వి.రమణ

**కుడిచేతి వేళ్ళకో** మూడు ఉంగరాలూ, ఎడమ చేతి వేళ్ళకో రెండు ఉంగరాలూ, భృకుటిమీద కుంకుడు గింజంత కుంకుమ బొట్టూ, నున్నగా గీసిన గడ్డం, తీరుగా దువ్విన జుట్టూ, అందంగా సర్దినట్టున్న మీసకట్టూ, చామనఛాయ, అయిదున్నరడుగుల ఎత్తూ.

తెలియని వాళ్ళకి బలరాం గురించి చెప్పాలంటే ఈ వర్ణనతోపాటు అతడు ఏదో పొందడానికి ఎప్పుడూ ఆత్రపడుతూ ఉంటాడని చెప్పడం కూడా అవసరం.

ఒరిస్సాలోని భువనేశ్వర్ ట్రైనింగ్ కాలేజీలో మా సంస్థవారు నన్ను ఒక ప్రత్యేకమయిన పనిలో శిక్షణ నిమిత్తం పంపినప్పుడు పరిచయమైన వ్యక్తి బలరాం. మాటల సందర్భంలో అతనికి పదోన్నతి పొందాలన్న తీవ్రమయిన కాంక్ష ఉన్నట్లు అర్థమయింది. అతడితో ఒక గంట గడిపితే ఆ విషయం ఎవరికైనా అర్థమయిపోతుంది. అది పొందడానికే అతడు జ్యోతిష్యాన్ని నమ్ముకుని వేళ్ళనిండా ఉంగరాలు పెట్టుకుని, జోస్యులు చెప్పిన నానా పద్ధతుల్లో దేవుణ్ణి ఆరాధిస్తాడనీ, కొండకచో పీడిస్తాడనీ నాకు అనిపించింది.

పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా మర్నాడు మా శిక్షణా తరగతులకు సెలవ.

''రేపు ఉదయాన్నే బయలుదేరి పూరీ వెళ్దాం వస్తారా? ఇక్కడినుండీ ఓ అరవై కిలోమీటర్లుంటుంది. అక్కడ రేపు జరిగే రథయాత్ర చాలా గొప్పగా ఉంటుంది. ఏకంగా మూడు రథాలు - ఒకటి బలభద్ర, రెండు సుభద్ర, మూడు జగన్నాథలను ఒకరి రథం వెంట మరొకరి రథం ఊరేగిస్తారు.

ఆ రథాల తాడులాగుతూ కనీసం తాకుతూనైనా ఏవైనా కోరికలు కోరుకుంటే ఆ కోరికలు తప్పక తీరుతాయి, తద్వారా కైవల్యం కూడా ప్రాప్తిస్తుంది. దానికోసమే నేను ప్రత్యేకంగా ఈ వారం ట్రైనింగ్ బ్యాచ్‌కి హెడ్డాఫీసులో నా ఫ్రెండుతో మాట్లాడి ఈ ట్రైనింగ్ వేయించుకున్నాను. రైలు ఛార్జీలు మిగులుతాయి కదా అని. ప్రత్యేకంగా వచ్చి వెళ్ళాలంటే హైదరాబాద్ నుండీ చాలా ఖర్చు అవుతుంది. అందుకని'' తను చెప్పదలచుకుంది చెప్పాడు బలరాం.

చారిత్రకంగా జగన్నాథ రథయాత్ర ఒక విశేషమయిన ప్రాధాన్యత కలిగిన విషయంం కావడం చేతా, దైవికంగా ఆ సమయానికే అక్కడ ఉండటం తటస్థించడం చేతా, పైగా ఒంటరిగా కాకుండా ఒక తోడుకూడా ఉన్నాడన్న ఉత్సాహంతో ''సరే'' అన్నాను. అయితే నాకు దైవం మీద నమ్మకం ఉన్నా, రథం తాళ్ళు లాగితేనో, ఉంగరాలతోటో, తాయెత్తుల తోటో కోర్కెలు తీరుతాయన్న నమ్మకంగానీ, తీర్చుకోవాలన్న ఆరాటంగానీ లేవు.

మర్నాడు ప్రొద్దున్నే బస్సుకి బయలుదేరాం. బస్‌స్టేషన్ విపరీతమయిన రద్దీగా ఉంది. అందులో మూడొంతులమంది రథయాత్రకోసం బయలుదేరిన వాళ్ళే. ప్రత్యేకమయిన బస్సులు చాలా వేసినా, బస్సుల్లో చాలామంది నిలబడి కూడా ప్రయాణిస్తున్నారు.

మొత్తానికి అతి కష్టమ్మీద బస్సెక్కాం. పూరీకి ఇద్దరికీ నేనే టిక్కెట్లు తీసుకున్నాను. దాదాపు గంటన్నర తర్వాత పూరీ చేరింది బస్సు.

జగన్నాథాలయం ఉన్న వీధి వీధంతా ఇసుక వేస్తే రాలనంత జనం ఉన్నారు. అక్కడక్కడా మైకుల హోరు. రకరకాల సంకీర్ణ ధ్వనులతో మహా కోలాహలంగా ఉంది. ఆ జనాన్ని చూస్తే నాకు క్లాస్ట్రోఫోబియా (ఎక్కువ జన సమూహాల్లో కలిసి ఉన్నప్పుడు కలిగే భయం)లాంటిది కలిగి తెలీని చిన్న వణుకు పుట్టించింది. అదృష్టవశాత్తూ ఆ వీధిలోనే గుడి ఎదురుగా రథాలు నిలిపి ఉంచిన చోటుకి కాస్త దగ్గరలోనే మా బ్రాంచి ఉంది. అక్కడి స్టాఫంతా ఆ రోజు ఆఫీసు తెరిచి, ఎదురుగా ఒక చలివేంద్రం పెట్టి ఆ సంబరం చూడటానికి వచ్చిన వాళ్ళకి మంచినీళ్ళూ, షర్బత్తులూ వితరణ చేస్తున్నారు. కష్టం మీద జనాన్ని తోసుకుంటూ ఇద్దరమూ ఆఫీసు దగ్గరకెళ్ళి మమ్మల్ని పరిచయం చేసుకున్నాం. వాళ్ళుకూడా సాదరంగా మమ్మల్ని లోపలికి తీసుకువెళ్ళి కూర్చోవడానికి కుర్చీలూ, త్రాగడానికి నీళ్ళూ ఇచ్చి ఆదరించారు.

ఒక పదినిమిషాలు వాళ్ళతో పిచ్చాపాటి మాట్లాడాక, ''ఇక రథయాత్ర ప్రారంభం అయ్యేలా ఉంది, మైక్‌లో కామెంటరీ చెబుతున్నారు. అక్కడ జరిగే సాంప్రదాయక క్రతువులన్నీ పూర్తయినట్లున్నాయి. నేను వెళ్ళి వస్తాను, మీరూ వస్తారా?'' అడిగాడు బలరాం.

"జనాన్ని చూస్తే నాకు భయం, ఇందాక వచ్చేటప్పుడే నేను రథాల వైపు చూస్తూ మనసులోనే దేవుడికి నమస్కరించుకున్నాను, మీరు వెళ్ళరండి, వచ్చేవరకూ నేనిక్కడే ఉంటాను" అన్నాను.

"ఈ రథయాత్రలప్పుడు జేబు దొంగతనాలు చాలా ఎక్కువ, నేను వచ్చేదాకా నా పర్సు మీ దగ్గర ఉంచుకోండి" అంటూ జేబులో పర్సు తీసి నాకిచ్చి, తన ఫుల్‌హాండ్ షర్ట్ చేతులు బాగా పైకి మడిచి జనంలోకి దూసుకువెళ్ళాడు బలరాం. వాళ్ళందరినీ దాటుకుని రథపు తాడు దొరకపుచ్చుకోవడమంటే ఆ సమయంలో సామాన్యుల వల్ల అయ్యే పనిలా కనబడలేదు నాకు. కానీ బలరాంకి ప్రమోషన్ రావాలన్న పట్టుదలా ఈ ఆచారం మీద ఉన్న నమ్మకం ఎక్కడలేని బలాన్నీ ఇస్తోందనిపించింది.

ఇంతలో ఆఫీసు ప్యూను వచ్చి, "సార్ మీరిక్కడ కొత్తకదా, ఈ సమయంలో ఇక్కడ మధ్యాహ్నం భోజనం దొరకడం కష్టం. పక్కన మనకి తెలిసిన చిన్న హోటల్ వాడున్నాడు. మీకు కావాలంటే భోజనం పార్సెల్ తెచ్చిపెడతాను" అన్నాడు.

సమయానికి సరిగ్గా గుర్తుచేశాడనుకుంటూ, "ఎంత?" అని కనుక్కుని ఇద్దరికీ రెండు భోజనాలకి సరిపడా డబ్బులిచ్చి పంపాను. ఓ అరగంటలో అతడు మా భోజనాలు తెచ్చి పెట్టాడు. ఇంతలో బయట జయజయధ్వానాలు మిన్నుముట్టుతున్నట్లు వినిపించడంతో అందరం బయటికి వచ్చాం. యాత్ర ప్రారంభమయింది. నేను దూరంనుంచే జగన్నాధుడికి నమస్కరించుకుని, రథాన్ని లాగుతున్నట్లు ఊహించుకుంటూ మనసులోనే ఆ అనుభూతి చెందాను.

ఓ గంటన్నర గడిచాక బలరాం చెమటలు కక్కుతూ మహా సంతోషంగా తిరిగి వచ్చాడు.

"ఈసారి మీ ప్రమోషన్ ఖాయమనుకుంటాను" అన్నాను.

"దాదాపు" అంటూ ఇందాక ఇచ్చిన పర్సు ఇవ్వమని అడిగాడు. నేను జాగ్రత్త చేసిన పర్సు అతని చేతికిచ్చాను. వెంటనే అది తెరిచి అందులో ఉన్న డబ్బులన్నీ ఉన్నయో లేదో అన్నట్లు లెక్క చూసుకుని సంతృప్తిగా జేబులో పెట్టుకున్నాడు.

ఎందుకో అతడి చేష్ట తను నన్నొక జేబుదొంగలా అనుమానిస్తున్నట్టుగా లెక్కపెట్టడం నా మనస్సుని చివుక్కుమనిపించింది. 'రథం లాగుతున్నప్పుడు ప్రమోషన్‌తో పాటు, పర్సుకూడా జేబు దొంగలకి దొరకకుండా ఉండాలని కోరుకోవచ్చుకదా, దేవుడి మహత్యం ఇప్పుడే తెలిసిపోయేది' అనుకున్నాను అతన్ని మనసులో చీదరించుకుంటూ.

మనసు ఏదో తెలియని భారంతో నిండిపోయింది. 'కొంతమంది అంతేలే' అని సర్ది చెప్పుకుని, తెప్పించిన భోజనం పార్సెల్ ఇచ్చాను.

భోజనాలయ్యాక తిరిగి భువనేశ్వర్ బయలుదేరాం. బస్ ఛార్జి మళ్ళీ నేనే భరించాను. ఇటువంటి ఆర్థిక విషయాలేవీ అతణ్ణి స్పందింపజేసినట్లు నాకు తోచలేదు.

ట్రైనింగ్ పూర్తయి ఎవరి ఊళ్ళకి వాళ్ళం వెళ్ళిపోయాం.

ట్రైనింగ్ మాట ఎలా ఉన్నా, ప్రమోషన్ కోసం బలరాం యాత్ర మాత్రం దిగ్విజయంగా పూర్తయింది.

మరో నెలరోజుల్లో ప్రమోషన్ కోస్మ మా సంస్థ పరీక్షలూ, ఇంటర్వ్యూలూ నిర్వహించింది.

ఆ రోజు ఫైనల్ సెలెక్షన్ లిస్టు ఎనౌన్స్ చేశారు.

ఆ లిస్టులో బలరాం పేరు ఉందా లేదా అని ఆతృతగా పైనుండి క్రిందికి జాగ్రత్తగా చూస్తే జగన్నాధ రథం తాడు అతణ్ణి పదోన్నతుణ్ణి చెయ్యలేకపోయిందని అర్థమయ్యింది. అయినా అతడి నోటిద్వారానే ఆ మాట విందామని వెంటనే ఫోన్ తీశాను.

యాదృచ్ఛికమో, ఏమోగానీ సరిగ్గా అదే సమయానికి బలరాం నాకు చేస్తున్నాడు. కాల్ రిసీవ్ చేసి "హల్లో" అన్నాను.

"హలో సార్, ప్రమోషన్ ఫైనల్ లిస్ట్ వచ్చింది చూశారా మీ పేరు కనిపించడంలేదు" అని అడిగాడు.

"ఔను, నాకు సర్వీసు సరిపోక ఈ ఏడాది ఎలిజిబిలిటీ లేదు. ఇంతకీ మీ ప్రమోషన్ ఏమయ్యిందీ?" అడిగాను.

"రాలేదు సార్, చిన్న పొరపాటు చేశాను" అన్నాడు.

"ఏమిటి ప్రమోషన్ పరిక్షకి సరిగ్గా ప్రిపేర్ కాలేదా?"

"కాదు"

"మరి?"

"నేను ఆ రోజు జగన్నాధుడి రథంలాగాను. మా జోస్యుడు నన్ను లాగమన్నది బలభద్రుని రథం తాడట. ప్రమోషన్ రాలేదన్న సంగతి ఆయనతో అంటే చెప్పాడు.."

బలరాం తన జాతకం గురించి చాలాసేపు ఇంకా ఏవేవో మాట్లాడాడు.

'అయినా ప్రమోషన్ ఇచ్చేవాళ్ళకి ఈ విషయాలు ఎలా తెలుస్తాయి పాపం' అనిపించింది నాకు. రథయాత్ర ఎలా ఉన్నా ఏం చేసినా, జీవన యాత్రలో కావలసినవి తీరడానికి ఏం చెయ్యాలో ఈ మనుషులకి ఎలా తెలుస్తాయి. ★★★